# 2012 మార్చితో ముగిసిన సంవత్సరానికి
# సామాన్య - సామాజిక రంగాలపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

2013 లో 4వ నివేదిక

# 2012 మార్చితో ముగిసిన సంవత్సరానికి
# సామాన్య - సామాజిక రంగాలపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
## *2013 లో 4వ నివేదిక*

# విషయ సూచిక


| | పేరా | పేజీ |
|---|---|---|
| *ముందుమాట* | | v |
| **అధ్యాయం 1 - అవలోకనం** | | |
| ఈ నివేదిక గురించి | 1.1 | 1 |
| సామాన్య, సామాజిక రంగాల సంక్షిప్త స్వరూపం | 1.2 | 1 |
| ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (జీఎస్ఎస్ఏ) కార్యాలయం | 1.3 | 3 |
| ఆడిట్‌కు అధికారాలను కల్పించిన నిబంధనలు | 1.4 | 3 |
| ఆడిట్ ప్రణాళిక, నిర్వహణ | 1.5 | 3 |
| ఆడిట్ కనుగొన్న అంశాలపై ప్రభుత్వశాఖల స్పందన | 1.6 | 4 |
| ఆడిట్‌లో కనుగొన్న అంశాల్లో ప్రధానమైనవి | 1.7 | 5 |
| *హోం (జైళ్ళు) శాఖ*<br>**అధ్యాయం 2 - రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పనితీరు** | 2 | 15 |
| *సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖలు*<br>**అధ్యాయం 3 - ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాకవర్గాల విద్యార్థులకు ఉద్దేశించిన స్కాలర్‌షిప్ పథకాలపై ఆడిట్ సమీక్ష** | 3 | 45 |
| *మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ*<br>**అధ్యాయం 4 - జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎమ్) అమలుపై ఆడిట్ సమీక్ష** | 4 | 77 |
| *పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి (గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య) శాఖ*<br>**అధ్యాయం 5 - గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలుపై ఆడిట్ సమీక్ష** | 5 | 115 |

| | పేరా | పేజీ |
|---|---|---|
| **అధ్యాయం 6 - నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు** | | |
| *ఉన్నత విద్యా (సాంకేతిక విద్య) శాఖ*<br>**సాంకేతిక కళాశాలల నిర్వహణ** | 6.1 | 147 |
| *ఉన్నత విద్యా శాఖ*<br>*(జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం)*<br>**బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణంలో జాప్యం** | 6.2 | 156 |
| *యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ*<br>**శిల్పారామం వద్ద ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టు** | 6.3 | 157 |
| **ఋషికొండలో బే పార్క్ రిసార్టులు** | 6.4 | 159 |
| *ఆర్థిక శాఖ*<br>**దంత చికిత్సలకు అధిక చెల్లింపులు** | 6.5 | 161 |
| *కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ*<br>**ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు** | 6.6 | 162 |

## అనుబంధాలు


| | | పేరా | పేజీ |
|---|---|---|---|
| 1.1 | శాఖలవారీగా బకాయి ఉన్న తనిఖీ నివేదికలు, పేరాలు | 1.6 | 167 |
| 1.2 | అపరిష్కృతంగా ఉన్న వివరణాత్మక నివేదికలు | 1.6 | 167 |
| 2.1 | ఫైర్ స్టేషన్లు లేని అసెంబ్లీ నియోజకవర్గాలు | 2.5.1.1 | 168 |
| 3.1 | స్కాలర్‌షిప్ పథకాల బడ్జెట్, వ్యయ వివరాలు | 3.4.2 | 169 |
| 3.2 | స్కాలర్‌షిప్పుల మంజూరుకు అధికారుల ద్వారా దరఖాస్తుల పరిశీలన సరిగా జరగని కేసులు | 3.6.5.1 | 170 |
| 3.3 | వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వేరువేరు కాలేజీలలో ఒకే కోర్సు (బీకాం) కు ఫీజు విధానంలోని భారీ వ్యత్యాసాలు | 3.6.5.10 | 172 |
| 4.1 | ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల స్థితి | 4.2.3 | 174 |
| 4.2 | పట్టణ స్థానిక సంస్థలు/ఇతర సంస్థలు ప్రజా వెల్లడి చట్టం అమలు చేయటంపై విశ్లేషణ | 4.3.2.3 | 179 |
| 5.1 | ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల స్థితిని తెలిపే వివరాలు | 5.2.3 | 180 |
| 5.2 | టెండరు షరతులు పాటించకుండా పనుల అప్పగింత | 5.7.12.3 | 185 |
| 6.1 | ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న సాంకేతిక కళాశాలల జాబితా | 6.1.1 | 187 |
| *పొడి అక్షరాల వివరణ* | | | 189 |

# ముందుమాట

1. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) ద్వారా జరిగే ఆడిట్ ఏర్పాట్లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించి, 2012 ఏప్రిల్ నుండి పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆడిట్ ఏర్పాట్లలో సమగ్రత కోసం ఆడిట్ పరిశీలనలను రంగాలవారీగా నివేదించే ఉద్దేశంతో ఈ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రత్యేక ప్రయోజనాల కోసం ఏర్పాటయిన సంస్థలు, స్థానిక సంస్థలు, స్వయంపాలక సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, మొదలైన వాటి ఆడిట్‌ను 'సామాజిక', 'ఆర్థిక', 'రెవెన్యూ', 'సామాన్య' రంగాలవారీగా సమీకృతం చేయడం జరిగింది.

2. ఈ ఏడాది నుండి రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి రంగాలవారీగా ఆడిట్ నివేదికలను విడివిడిగా రూపొందించి, వాటిని భారత రాజ్యాంగ నిబంధనలను అనుసరించి, గవర్నరుకు సమర్పించడం జరుగుతుంది.

3. రాజ్యాంగంలోని 151వ అధికరణం కింద, రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వ సామాన్య మరియు సామాజిక రంగాల కార్యకలాపాలపై ఈ నివేదికను రూపొందించడం జరిగింది.

4. ఈ నివేదికలో *'రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పనితీరు'* (హోమ్ (జైళ్ళ) శాఖ), *'ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థులకు ఉద్దేశించిన స్కాలర్‌షిప్ పథకాలు'* (సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖలు), *'జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం'* (మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ), *'గ్రామీణ నీటిసరఫరా పథకాల అమలు'* (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ)లపై ఆడిట్ సమీక్షలు, *'సాంకేతిక కళాశాల (పాలిటెక్నిక్)ల నిర్వహణ'* (ఉన్నత విద్యా (సాంకేతిక విద్య) శాఖ)పై థీమేటిక్ (విషయాధారిత) ఆడిట్‌లో కనుగొన్న విషయాలు, నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనల తాలూకు పేరాలు ఉన్నాయి.

5. ఆర్థిక రంగం, రెవెన్యూ రంగం, ప్రభుత్వరంగ సంస్థలపై కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలను వేరు వేరుగా సమర్పించడం జరుగుతుంది.

6. 2011-12 సంవత్సరంలో నిర్వహించిన ఆడిట్‌లో వెల్లడైన అంశాలూ, అంతకుముందు సంవత్సరాల్లోనే ఆడిట్ దృష్టికి వచ్చి, గత నివేదికల్లో పొందుపరచని అంశాలూ ఈ నివేదికలో ఉన్నాయి; 2011-12 తరువాతి కాలానికి సంబంధించిన అంశాలను కూడా అవసరమైన చోట్ల చేర్చటం జరిగింది. ప్రభుత్వ/ప్రభుత్వ శాఖల సమాధానాలు అందిన సందర్భాల్లో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఈ నివేదికలోని అంశాలను ఖరారు చేయడమైంది.

7. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జారీ చేసిన ఆడిటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఆడిట్‌ను నిర్వహించడమైంది.

8. ఈ తెలుగు నివేదికలో ఏవైనా సందేహాలుంటే అనువాదానికి మూలాధారమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోగలరు.

# అధ్యాయం-1

## అవలోకనం

పేజీలు 1 - 14

## 1.1 ఈ నివేదిక గురించి...

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) ద్వారా జరిగే ఆడిట్ ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించి, 2012 ఏప్రిల్‌లో పునర్వ్యవస్థీకరించారు. ఆడిట్ ఏర్పాట్లలో సమగ్రత కోసం, ఆడిట్ పరిశీలనలను రంగాలవారీగా నివేదించే ఉద్దేశంతో ఈ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రత్యేక ప్రయోజనాల కోసం ఏర్పాటయిన సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, మొదలైన వాటి ఆడిట్‌ను తగురీతిన సామాజిక, ఆర్థిక, రెవెన్యూ, సామాన్య రంగాలవారీగా సమీకృతం చేయడం జరిగింది.

ఈ నేపథ్యంలో, ప్రస్తుత సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి రంగాలవారీగా ఆడిట్ నివేదికలను విడివిడిగా రూపొందించి, వాటిని భారత రాజ్యాంగ నిబంధనలను అనుసరించి గవర్నరుకు సమర్పించడం జరుగుతుంది.

రాష్ట్రంలో సామాన్య, సామాజిక రంగాలకు సంబంధించి ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న పథకాలు, ప్రభుత్వశాఖల పనితీరును తనిఖీ చేసినపుడు వెల్లడైన అంశాలతో సహా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రణాళికా పథకాలకు సంబంధించిన లావాదేవీల్లో నియమపాలన తనిఖీలోనూ, రాష్ట్ర స్వయంపాలక సంస్థల తనిఖీలోనూ వెల్లడైన అంశాలు ఈ ఆడిట్ నివేదికలో ఉన్నాయి.

ఆడిట్‌లో వెల్లడైన అంశాల్లో ముఖ్యమైన వాటిని రాష్ట్ర శాసనసభ దృష్టికి తీసుకెళ్లడమే ఈ నివేదిక ప్రధాన ఉద్దేశం. ఆడిట్ ప్రమాణాల ప్రకారం, ఏవైనా ఆడిట్ పరిశీలనలను ఈ నివేదికలో పొందుపర్చాలంటే, అవి సంబంధిత లావాదేవీల స్వభావం, పరిమాణాలకు తగ్గస్థాయిలో ఉండాలి. కార్యనిర్వాహక అధికార్లు దిద్దుబాటు చర్యలు తీసుకునే విధంగానూ, సంస్థల మెరుగైన ఆర్థిక నిర్వహణకు ఉపయోగపడే విధానాలను రూపొందించుకునే విధంగానూ, తగిన మార్గదర్శకాలను జారీచేసే విధంగానూ ఆడిట్ పరిశీలనలుండాలి. ఆవిధంగా, ఆడిట్ పరిశీలనలు సుపరిపాలనకు దోహదపడతాయి.

నియమపాలన తనిఖీలో, ప్రభుత్వశాఖలు, సంస్థలు భారత రాజ్యాంగంలోని నిబంధనలు, సంబంధిత చట్టాలు, నియమనిబంధనలు, సంబంధిత అధికార్లు జారీ చేసిన వివిధ ఉత్తర్వులు, నిర్దేశాలను పాటిస్తున్నాయని నిర్ధారించుకోడానికి వాటి లావాదేవీలను తనిఖీ చేయడం జరుగుతుంది. మరోవైపు, పనితీరు సమీక్షలో నియమ పాలన తనిఖీతో పాటు, ఆయా పథకాల/కార్యక్రమాల/ప్రభుత్వశాఖల లక్ష్యాలను పొదుపుగానూ, సమర్థవంతంగా నూ, ప్రభావశీలంగానూ సాధించారా, లేదా అని పరిశీలించడం కూడా జరుగుతుంది.

ఈ అధ్యాయంలో, ఆడిట్ ప్రణాళిక, పరిధిల గురించి వివరించడం జరిగింది. ఎంపిక చేసిన పథకాల అమలులో ప్రభుత్వ శాఖలు/సంస్థలు సాధించిన విజయాలు, ఆడిట్‌లో గమనించిన ప్రధానలోపాలు, లావాదేవీల తనిఖీలో వెల్లడైన ప్రధానమైన అంశాలు, ఇంకా గత ఆడిట్ నివేదికలపై తీసుకున్న చర్యల వివరాలను కూడా ఈ అధ్యాయంలో క్లుప్తంగా వివరించడం జరిగింది.

## 1.2 సామాన్య, సామాజిక రంగాల సంక్షిప్త స్వరూపం

రాష్ట్రంలో సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే ప్రభుత్వ శాఖలు గత ఐదేళ్ళలో చేసిన ఖర్చుల వివరాలను పట్టిక 1.1లో చూపడమైంది.

**పట్టిక 1.1**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | ప్రభుత్వ శాఖ | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|---|
| ఎ | సామాన్య రంగం | | | | | |
| 1 | ఆర్థిక, ప్రణాళిక | 19936.26 | 19769.25 | 23079.94 | 28572.35 | 30529.86 |
| 2 | సాధారణ పరిపాలన | 353.76 | 594.14 | 717.03 | 444.09 | 705.90 |
| 3 | హోమ్ | 2190.04 | 2536.26 | 3068.72 | 3916.43 | 4412.53 |
| 4 | న్యాయ | 284.47 | 326.71 | 415.47 | 612.53 | 603.63 |
| 5 | రెవెన్యూ | 975.95 | 1098.14 | 2132.93 | 1964.19 | 2412.21 |
| 6 | రాష్ట్ర శాసన సభ | 49.40 | 54.09 | 53.56 | 51.08 | 84.69 |
| | **మొత్తం (ఎ)** | **23789.88** | **24378.59** | **29467.65** | **35560.67** | **38748.82** |
| బి | సామాజిక రంగం | | | | | |
| 1 | వెనుకబడిన తరగతుల సంక్షేమం | 497.24 | 1088.91 | 1181.74 | 1996.34 | 2758.53 |
| 2 | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు | 1001.51 | 2771.67 | 2546.13 | 2415.79 | 2450.69 |
| 3 | వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 2529.28 | 3006.66 | 3323.02 | 4140.35 | 4980.25 |
| 4 | ఉన్నత విద్య | 1423.78 | 1334.60 | 1731.51 | 2551.16 | 2669.73 |
| 5 | గృహనిర్మాణం | 3207.60 | 4083.13 | 1398.34 | 1626.77 | 1743.33 |
| 6 | కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు | 254.63 | 325.36 | 287.43 | 347.29 | 465.67 |
| 7 | అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం | 123.33 | 195.72 | 197.88 | 324.62 | 370.33 |
| 8 | మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 2291.83 | 3527.45 | 3139.85 | 4054.53 | 4108.89 |
| 9 | పంచాయతీరాజ్ | 3022.01 | 3768.10 | 2758.32 | 3533.15 | 2987.51 |
| 10 | గ్రామీణాభివృద్ధి | 1982.83 | 2563.08 | 3159.24 | 3921.78 | 4855.68 |
| 11 | పాఠశాల విద్య | 5207.60 | 5827.19 | 6690.92 | 9906.66 | 12250.18 |
| 12 | సాంఘిక సంక్షేమం | 1451.08 | 1448.93 | 1245.12 | 1776.64 | 1941.74 |
| 13 | గిరిజన సంక్షేమం | 565.86 | 705.10 | 765.45 | 961.50 | 1143.23 |
| 14 | స్త్రీ, శిశు, వికలాంగులు, వయోజనులు | 831.98 | 1146.37 | 995.99 | 981.29 | 1513.03 |
| 15 | యువజనాభ్యుదయం, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలు | 191.98 | 139.27 | 101.29 | 188.18 | 214.38 |
| | **మొత్తం (బి)** | **24582.54** | **31931.54** | **29522.23** | **38726.05** | **44453.17** |
| | **పూర్తి మొత్తం (ఎ+బి)** | **48372.42** | **56310.13** | **58989.88** | **74286.72** | **83201.99** |

*మూలం: సంబంధిత సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*

## 1.3 ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (జీఎస్ఎస్ఏ) కార్యాలయం




ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్స్ జనరల్ కార్యాలయాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని 21 శాఖలు, ఆ శాఖల కింది స్థానిక సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, స్వయంపాలక సంస్థల ఆడిట్‌ను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (సామాన్య, సామాజిక రంగాల తనిఖీ) కార్యాలయం నిర్వహిస్తుంది.

## 1.4 ఆడిట్‌కు అధికారాలను కల్పించిన నిబంధనలు

భారత రాజ్యాంగంలోని 149, 151వ అధికరణలు, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సర్వీసు నిబంధనలు) చట్టం - 1971 (డీపీసీ చట్టం) ఆడిట్ నిర్వహించే అధికారాన్ని సిఏజీ కి కల్పించాయి. రాష్ట్ర ప్రభుత్వంలోని సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే శాఖల ఖర్చుల తనిఖీని డీపీసీ చట్టంలోని 13వ సెక్షను[1] కింద సీఏజీ నిర్వహిస్తారు. స్వయంపాలక సంస్థలు, స్థానిక సంస్థలకు డీపీసీ చట్టంలోని 19(2)[2], 20(1)[3] సెక్షన్ల కింద ఆడిట్‌ను నిర్వహించడం జరుగుతుంది. ఈ సంస్థలకు సీఏజీ ఏకైక (సోల్) ఆడిటరుగా వ్యవహరిస్తారు. ఇవి కాక, పెద్దమొత్తంలో ప్రభుత్వ నిధులను పొందే ఇతర స్వయంపాలక సంస్థలను కూడా చట్టంలోని 14వ సెక్షను[4] కింద సీఏజీ తనిఖీ చేయాలి. వివిధ ఆడిట్‌లకు అనుసరించాల్సిన నియమాలు, విధానాలు సీఏజీ జారీ చేసిన "ఆడిట్ ప్రామాణిక సూత్రాలు" లోనూ, "ఆడిట్ - అకౌంట్ల నిబంధనలు - 2007" లోనూ నిర్దేశించడం జరిగింది.

## 1.5 ఆడిట్ ప్రణాళిక, నిర్వహణ

ఒక ప్రభుత్వశాఖ/సంస్థ/స్వయంపాలక సంస్థ/పథకం మొదలైన వాటిలోని రిస్కును అంచనా వేయడంతో ఆడిట్ ప్రక్రియ మొదలవుతుంది. చేసిన ఖర్చు, కార్యకలాపాల తీవ్రత/సంక్లిష్టత, ఆ కార్యకలాపాలకు ప్రభుత్వమిచ్చిన ప్రాధాన్యత, ఆర్థికపరమైన అధికారాల స్థాయి, అంతర్గత నియంత్రణలు, భాగస్వాముల ప్రయోజనాలవంటి అంశాల ఆధారంగా ఈ అంచనా జరుగుతుంది. గత ఆడిట్‌లో కనుగొన్న విషయాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఎంత కాలానికి ఒకసారి ఆడిట్ చేయాలి, ఎంతమేరకు ఆడిట్ చేయాలనే విషయాలను ఈ అంచనా ఆధారంగా నిర్ణయించడం జరుగుతుంది. ఈ అంచనా ఆధారంగానే 'వార్షిక ఆడిట్ ప్రణాళిక'ను రూపొందించి, దాని ప్రకారమే ఆడిట్‌ను నిర్వహించడం జరుగుతుంది. 2011-12లో సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే యూనిట్ల నుండి మొత్తం 2,042 యూనిట్లను తనిఖీ చేయడమైంది.

---

[1] (i) రాష్ట్ర సంచిత నిధి నుండి జరిగే అన్ని లావాదేవీలు, (ii) రాష్ట్ర అత్యయిక నిధి, ప్రజాపద్దులకు సంబంధించిన అన్ని లావాదేవీలు, (iii) అన్ని వర్తక, ఉత్పత్తి, లాభనష్టాల పద్దులు, ఆస్తి, అప్పుల పట్టీలు, ఇతర ఉప పద్దుల తనిఖీ

[2] రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ద్వారా/కింద ఏర్పాటైన కార్పోరేషన్ల (కంపెనీలు కానివి) పద్దులను సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తనిఖీ చేయడం

[3] రాష్ట్ర గవర్నర్ చేసిన విజ్ఞప్తి మేరకు ఏదైనా సంస్థ పద్దులను తనిఖీ చేయడం. సి.ఎ.జి., ప్రభుత్వం - ఇరు పక్షాలూ అంగీకరించిన షరతులు, నిబంధనల మేరకు ఈ తనిఖీ జరుగుతుంది

[4] రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం పొందిన సంస్థల అన్ని రాబడులూ, ఖర్చులనూ, అలాగే రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల రూపంలో, ఒక ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయలకు తక్కువ కాకుండా పొందిన సంస్థలకు సంబంధించిన అన్ని రాబడులు, ఖర్చులను తనిఖీ చేయడం జరుగుతుంది

ఒక్కొక్క యూనిట్ ఆడిట్ పూర్తయిన మీదట, ఆడిట్‌లో కనుగొన్న విషయాలను తనిఖీ నివేదిక (ఇన్‌స్పెక్షన్ రిపోర్టు - ఐఆర్) ద్వారా ఆ యూనిట్ అధిపతికి తెలియజేస్తారు. రిపోర్టు అందుకున్న ఒక నెలలోపు అందులోని అంశాలకు సమాధానాలు ఇవ్వాలని కూడా కోరడం జరుగుతుంది. సమాధానాలు అందిన సందర్భాల్లో, ఆయా ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించడం లేదా ఆడిట్ సూచనల అమలుకు తదుపరి చర్యలను సూచించడం జరుగుతుంది. ఈ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు (ఐ.ఆర్.)లలోని ఆడిట్ పరిశీలనల్లో కీలకమైనవి, ప్రభుత్వంలోని అత్యున్నతస్థాయి వారి దృష్టికి తీసుకెళ్లాల్సిన వాటిని ఆడిట్ నివేదికల్లో పొందుపరచడానికి అవసరమైన ప్రక్రియను చేపడతారు. భారత రాజ్యాంగంలోని 151 వ అధికరణాన్ని అనుసరించి రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం కోసం ఈ ఆడిట్ నివేదికలను రాష్ట్ర గవర్నరుకు సమర్పిస్తారు.

## 1.6 ఆడిట్ కనుగొన్న అంశాలపై ప్రభుత్వ శాఖల స్పందన

కార్యాలయ అధిపతులు, వారి పై అధికార్లు, ఐఆర్‌లలోని అంశాలపై స్పందించి, తగిన దిద్దుబాటు చర్యలను తీసుకోవాలి. ఐఆర్‌లలో పొందుపరచిన ఆడిట్ పరిశీలనలను ఏజీ కార్యాలయం అధికార్లు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికార్లతో జిల్లాస్థాయిలో జరిగే సమావేశాల్లో కూడా చర్చిస్తారు.

2011-12, అంత కన్నా ముందు సంవత్సరాలకు సంబంధించిన 7,163 ఐఆర్‌లు, అందులోని 43,595 పేరాలు 2012 సెప్టెంబరు 30 నాటికి అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిలో 716 ఐఆర్‌లు (8,711 పేరాలు) విషయంలో తొలి సమాధానాలు కూడా రాలేదు. ప్రభుత్వ శాఖలవారీగా వివరాలను *అనుబంధం - 1.1* లో ఇవ్వడం జరిగింది.

**పట్టిక 1.2**

| సంవత్సరం | 2012 సెప్టెంబరు 30 నాటికి అపరిష్కృతంగా ఉన్న ఐఆర్‌లు, పేరాలు | | తొలి సమాధానాలు కూడా రాని ఐఆర్‌లు, పేరాలు | |
|---|---|---|---|---|
| | ఐఆర్‌లు | పేరాలు | ఐఆర్‌లు | పేరాలు |
| **2008-09, అంతకు ముందు సంవత్సరాలవి** | 4971 | 24932 | 252 | 4234 |
| **2009-10** | 636 | 5586 | - | - |
| **2010-11** | 1044 | 7752 | 121 | 873 |
| **2011-12** | 512 | 5325 | 343 | 3604 |
| మొత్తం | **7163** | **43595** | **716** | **8711** |

ఆడిట్ జారీచేసిన ఐ.ఆర్‌లు, పేరాలపై చర్యలు చేపట్టకపోవడం వలన, ఈ నివేదికల్లో లేవనెత్తిన తీవ్రమైన ఆర్థిక అవకతవకలు కొనసాగుతూనే ఉండడం, పరిపాలనా ప్రక్రియలో అంతర్గత నియంత్రణలు బలహీనమవడం, ప్రజాసౌకర్యాలను సమర్థవంతంగానూ, ప్రభావశీలంగానూ సమకూర్చలేకపోవడం, మోసాలూ, అవినీతీ చోటు చేసుకుని ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడం వంటివాటికి అవకాశం కలుగుతుంది.

ఆర్థిక, ప్రణాళికశాఖ 1993 నవంబరులో జారీచేసిన ఆదేశాల ప్రకారం, ఆడిట్ నివేదికల్లో పొందుపర్చిన పేరాలు, సమీక్షలపై సంబంధిత ప్రభుత్వ (పరిపాలన) శాఖలు, ఆడిట్ నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టిన నాటినుండి మూడు నెలల్లోపు వివరణాత్మక నివేదికలను సమర్పించాలి. ఇందుకోసం ప్రజాపద్దుల సంఘం నుండి వచ్చే నోటీసు లేదా పిలుపు కోసం వేచి చూడకుండా, తీసుకున్న చర్యలను లేదా ప్రతిపాదిత చర్యలను సూచిస్తూ వివరణాత్మక నివేదికలను గడువులోపు సమర్పించాలి. ఐతే, 2005- 06 నుండి 2010 -11 సంవత్సరాల ఆడిట్ నివేదికల్లో పేర్కొన్న 13 పేరాలు/సమీక్షలకు వివరణాత్మక నివేదికలను 2013 జనవరి నాటికి 6 ప్రభుత్వశాఖలు సమర్పించలేదు. ఈ వివరాలు *అనుబంధం - 1.2* లో ఉన్నాయి.

ఆర్థికశాఖ జారీ చేసిన సూచనల కరదీపిక, ఇంకా 1993 నవంబరు 3 వ తేదీ నాటి యు.ఓ. ప్రకారం, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చాలని ప్రతిపాదించిన ముసాయిదా ఆడిట్ పేరాలపై అన్ని ప్రభుత్వశాఖలూ ఆ ముసాయిదా పేరాల నందుకున్న ఆరు వారాల్లోపు తమ సమాధానాలను పంపించాలి. 2012-13 లో ఆడిట్ సమీక్షల తాలూకు 4 ముసాయిదా నివేదికలు , 12 ముసాయిదా పేరాలు/నిర్దిష్ట విషయంపై (థీమేటిక్) పేరాలను సంబంధిత ప్రభుత్వశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు/ కార్యదర్శులకు పంపి, ఆడిట్ కనుగొన్న అంశాలను వారి దృష్టికి తెచ్చి, ఆరు వారాల్లోపు సమాధానం పంపాలని కోరడం జరిగింది. కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో ఈ పేరాలను పొందుపర్చే అవకాశం ఉంది, ఆ నివేదికను రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది కాబట్టి, ఆడిట్ కనుగొన్న అంశాలపై వారి వ్యాఖ్యలు/సమాధానాలను కూడా పొందుపర్చాల్సి ఉన్నందున ఈ పేరాలపై వారు వ్యక్తిగత శ్రద్ధ చూపడంకోసం, వారి ప్రతిస్పందన తెలియచేయటం కోసం వాటిని పంపడం జరిగింది. అయినప్పటికీ, ఒక ప్రభుత్వ శాఖ[5] నియమపాలన తనిఖీలో కనుగొన్న అంశాలతో కూడిన ఒక ముసాయిదా పేరాకు తన సమాధానాన్ని తెలుపలేదు. ప్రభుత్వశాఖల నుండి అందిన సమాధానాలను ఈ ఆడిట్ నివేదికలో తగురీతిని పొందుపర్చడం జరిగింది.

## 1.7 ఆడిట్‌లో కనుగొన్న అంశాల్లో ప్రధానమైనవి

2011-12 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని 13 శాఖల పద్దులు, లావాదేవీలను మచ్చుకు తనిఖీ చేసినపుడు కనుగొన్న అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి. ప్రజలకు మెరుగైన సేవలందిచడానికి తగిన దిద్దుబాటు చర్యలను తీసుకోవడంలో ప్రభుత్వానికి సహాయకారిగా ఉండటం కోసం కొన్ని నిర్దిష్ట ప్రభుత్వ కార్యక్రమాల అమలును, సామాన్య, సామాజిక రంగాలకు సంబంధించిన విధాన నిర్ణయాల అమలును మదింపు చేయడంపై ఈ ఏడాది ప్రధానంగా ఆడిట్ దృష్టి సారించింది. తొలుత, పథకాలు/ప్రభుత్వ శాఖలపై ఆడిట్ సమీక్షల తాలూకు నాలుగు ముసాయిదా నివేదికలు, థీమేటిక్ ఆడిట్ తాలూకు ఒక ముసాయిదా పేరా, 11 ముసాయిదా పేరాలను ప్రభుత్వానికి పంపడం జరిగింది. ప్రభుత్వానికి పంపిన 11 ముసాయిదా పేరాలకు గానూ, 6 కేసులలో ప్రభుత్వం/ప్రభుత్వ శాఖ దిద్దుబాటు చర్యలను తీసుకోవడంతో ఆ పేరాలను ఈ నివేదికలో చేర్చలేదు.

ఈ ఆడిట్ నివేదికలో పొందుపర్చిన ప్రధానమైన అంశాలను క్లుప్తంగా కింద వివరించడం జరిగింది :

### 1.7.1 రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పనితీరు

***వివిధ రకాల ప్రమాదాలకు మొదట స్పందించే శాఖగా రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖను గుర్తించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తుల రక్షణ బాధ్యతను ఈ శాఖకు అప్పగించడమైంది. అగ్నిప్రమాదాల నివారణ, అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తలెత్తే అత్యవసర పరిస్థితులనెదుర్కొనే బాధ్యత, అగ్ని ప్రమాదాల గురించి, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతలను ఈ శాఖకు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ శాఖకు తగిన ప్రాధాన్యతను ఇవ్వకపోవడం, చేసిన అరకొర బడ్జెటు కేటాయింపుల దృష్ట్యా చూస్తే, అగ్నిప్రమాదాలను నియంత్రించడంలో ఈ శాఖ ప్రశంసనీయమైన సేవలు చేస్తోంది. ఐతే, రాష్ట్రంలో ఫైర్‌స్టేషన్లు చాలా తక్కువగా ఉన్నాయి. రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సమర్థవంతంగానూ, ప్రభావవంతంగానూ పనిచేయడానికి తగిన మౌలిక వసతులు, పరికరాలు లేవు.***

***అగ్నిమాపక సేవల శాఖపై 2002-03లో నిర్వహించిన ఆడిట్‌లో కనుగొన్న విషయాలను 2003 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వెలువరించిన కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చడం జరిగింది. ఈ శాఖ పనితీరులో ముఖ్యమైన లోపాలను ఆ నివేదికలో ప్రముఖంగా***

[5] ఉన్నత విద్యా శాఖ ('బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణంలో జాప్యం' కు సంబంధించిన ఆడిట్ పేరా విషయంలో)

చర్చించడమైంది. ఈ శాఖకు సంబంధించిన విధానాలను సరైన మార్గంలోకి తీసుకురావడానికి చేపట్టాల్సిన వివిధ చర్యలను కూడా ఆ నివేదికలో సిఫార్సు చేయడం జరిగింది. గత పదేళ్ళ కాలంలో ఈ శాఖ పనితీరు ఏ మేరకు మెరుగుపడిందో పరిశీలించేందుకు ప్రస్తుత ఆడిట్‌ను నిర్వహించడమైంది. ఈ సమీక్షలో, **2007-12** మధ్య కాలంలో అగ్నిమాపక సేవలకు సంబంధించి, ఈ శాఖ కార్యకలాపాలను పరిశీలించడం జరిగింది. ఇందుకోసం ఏడు[6] జిల్లాలను మచ్చుకు తనిఖీ చేయడమైంది. గత ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన ఐదు జిల్లాల్లోని నాలుగు జిల్లాలు[7] ప్రస్తుత నమూనా ఆడిట్ (శాంపిల్)లో కూడా ఉన్నాయి.

ఆడిట్‌లో కనుగొన్న ప్రధాన అంశాలను ఈ కింద పేర్కొనడమైంది:

- రాష్ట్ర ప్రభుత్వం తాను నియమించిన ఉప సంఘం చేసిన ప్రధాన సిఫార్సులేవీ మూడేళ్ళకు పైగా గడచినప్పటికీ (**2012** నవంబరు) అమలు చేయలేదు. రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ తన బాధ్యతలను నెరవేర్చడానికి అవసరమైన ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటు కేటాయింపుల్లో ఇవ్వలేదు. అంతేకాక, భారత ప్రభుత్వం నిర్దేశించినవిధంగా విపత్తుల ఉపశమన నిధి నుండి నిధుల విడుదల జరగని కారణంగా, ఈ శాఖ ఆధునికీకరణ ప్రక్రియ కుంటుపడింది.

**(పేరాలు 2.3.3, 2.4, 2.4.1)**

- మౌలిక వసతులకు సంబంధించి ఎస్ఎఫ్ఏసీ[8] నిర్దేశించిన ప్రమాణాలను రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పాటించలేదు. రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల విషయంలో తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి ఈ శాఖ వద్ద సరైన ఏర్పాట్లు లేవు. రాష్ట్రంలోని **875** మండలాల్లో (మొత్తం మండలాలుః **1,128**), **89** అసెంబ్లీ నియోజకవర్గాల్లో (మొత్తం నియోజకవర్గాలుః **294**) ఒక్క ఫైర్ స్టేషనూ లేదు. కొత్త ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని గత ఆడిట్ నివేదికలో నిర్దిష్ట సిఫార్సును చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉపసంఘం కూడా ఇదే సిఫార్సును చేసింది. అయినప్పటికీ, **2007-12** మధ్యకాలంలో కొత్తగా ఒక్క ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు కాలేదు. ఫైర్ స్టేషన్ల కొరత **95** శాతం వరకూ ఉంది. ఫైర్‌స్టేషన్ల కొరత ప్రభావం అగ్ని ప్రమాద కాల్స్‌కు స్పందించే సమయంపై పడింది. ఆడిట్‌లో సమీక్షించిన ప్రధాన అగ్ని ప్రమాదాల్లో కాల్స్‌కు స్పందించే సమయం పట్టణ ప్రాంతాల్లో **70** నిముషాలు, గ్రామీణ ప్రాంతాల్లో **152** నిముషాలు పట్టింది. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లో పట్టణ ప్రాంతాల్లోని **20** ప్రధాన, తీవ్ర అగ్ని ప్రమాద సంఘటనల్లో స్పందన సమయం **30** నిముషాలకు పైగానూ, గ్రామీణ ప్రాంతాల్లోని **60** ప్రధాన, తీవ్ర అగ్ని ప్రమాద సంఘటనల్లో స్పందన సమయం **60** నిముషాలకు పైగానూ పట్టిందని ఆడిట్ సమీక్షలో వెల్లడైంది.

**(పేరాలు 2.5.1.1, 2.5.1.2, 2.5.2.1)**

- ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతులు చాలినంతగా లేవు. మచ్చుకు తనిఖీచేసిన **85** ఫైర్‌స్టేషన్లకు గానూ, **6** ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలను నిలిపేందుకు వసతిలేదు; **17** ఫైర్‌స్టేషన్ల భవనాలు శిధిలావస్థలో ఉన్నాయి. అగ్నిమాపక వాహనాలు, రక్షణ వాహనాలు (రెస్క్యూ వ్యాన్స్) వంటి వాటి విషయంలో అవసరాలకు, వాస్తవంగా అందుబాటులో ఉన్న వాటికి మధ్య భారీ అంతరం ఉంది. ఇప్పటికే కొనుగోలుచేసిన అత్యధిక పౌనఃపున్యంగల రేడియోసెట్ల వంటి పరికరాలను అగ్నిమాపక శాఖ వినియోగించటంలేదు. ఫైర్ స్టేషన్ల సమీపంలో నీటి వనరులుండేలా చర్యలు చేపట్టలేదు.

**(పేరా 2.5.1.2)**

[6] చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైయస్ఆర్ (కడప)

[7] చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, విశాఖపట్నం

[8] అగ్నిమాపక సలహాల స్థాయీ సంఘం (స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్)

- మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (వైఎస్ఆర్ (కడప) జిల్లాలోనూ, హైదరాబాద్ జిల్లాలో కొన్ని కేసులు తప్ప) ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ సహాయక సేవల (ఆక్జిలరీ సర్వీసుల) ఏర్పాటు జరగలేదు.

**(పేరా 2.5.2.2)**

- అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు సంబంధించిన భద్రతా చర్యల నియమావళి/ప్రమాణాలను అమలు చేసేందుకు ప్రమాదాలు సంభవించడానికి ఆస్కారం ఉన్న ప్రాంగణాలను పాక్షికంగా మాత్రమే గుర్తించారు. భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన, ముందు జాగ్రత చర్యలు తీసుకోని వారిపై జిల్లా అగ్నిమాపక అధికారులు చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, సినిమా థియేటర్లు వంటి బహిరంగ ప్రదేశాలను అగ్నిమాపక సేవల శాఖ అధికార్లతో కలసి ఆడిట్ లో ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీ చేయగా అగ్ని ప్రమాదాల రక్షణ ప్రమాణాల విషయంలో పలు ఉల్లంఘనలు జరిగినట్లు వెల్లడైంది.

**(పేరా 2.5.2.2)**

- ఫైర్ మేన్, డ్రైవర్ ఆపరేటర్ వంటి కీలక పోస్టుల్లో చాలా ఖాళీలు ఉండటం వల్ల మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోనూ పూర్తి స్థాయి సిబ్బంది లేకుండానే అగ్నిమాపక సేవల నిర్వహణ జరుగుతోంది. మంటలనార్పే విధుల నిర్వహణకు ముగ్గురు ఫైర్‌మ్యాన్‌లు అవసరంకాగా ఆడిట్‌లో సమీక్షించిన **293** భారీ అగ్ని ప్రమాదాలకు సంబంధించిన కేసులకుగానూ, **207** కేసులలో ఒకే ఒక్క ఫైర్‌మ్యాన్ లేదా ఇద్దరు ఫైర్‌మ్యాన్‌లు మాత్రమే విధుల నిర్వహణలో పాల్గొన్నారు.

**(పేరాలు 2.6.1, 2.6.2)**

- శిక్షణ, నైపుణ్యాల పెంపునకు సంబంధించిన కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదు. **2007-12** మధ్యకాలానికి శిక్షణను ఇవ్వడానికి రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ (ఎస్‌టీఐఎస్) ఎలాంటి కార్యాచరణ ప్రణాళికనూ రూపొందించలేదు. డిప్యూటేషన్‌పై తీసుకున్న **811** మంది హోమ్ గార్డులలో ఏ ఒక్కరికీ అగ్నిప్రమాదాలను ఎదుర్కోవడంలో శిక్షణను ఇవ్వలేదు. నిర్దిష్ట కాలవ్యవధుల్లో శాఖాపరమైన తనిఖీలు నిర్వహించలేదు. వ్యయ నియంత్రణలు బలహీనంగా ఉన్నాయి. **2007-12** మధ్య కాలంలో ఒక్క విశాఖపట్నంలో తప్ప మిగిలిన జిల్లా కార్యాలయాల్లో అంతర్గత తనిఖీ నిర్వహించలేదు.

**(పేరాలు 2.6.3.1, 2.6.3.2, 2.7.1, 2.7.3, 2.7.4)**

## 1.7.2 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ పథకాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరంభించిన ఈ స్కాలర్‌షిప్ పథకాలు ఒక ముఖ్యమైన సాంఘిక సంక్షేమ కొలమానానికి ప్రతీక. షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగలు (ఎస్టీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులను విద్యా సంస్థల్లో చదువు కొనసాగించేలా చేయడం, ఆయా విద్యార్థుల భర్తీ సంఖ్యను పెంచడం ఈ పథకాల ఉద్దేశం. సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమయానుసారంగా నిర్దేశించే పరామితుల ఆధారంగా ఈ పథకాల ప్రయోజనాలను అందించడం జరుగుతోంది.

అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందాయా అన్న అంశాన్ని మదింపు చేసేందుకు ఆడిట్ ఈ స్కాలర్‌షిప్ పథకాలను సమీక్షించింది. ఈ ఆడిట్‌లో గమనించిన ముఖ్యమైన విషయాలు ఈ విధంగా ఉన్నాయి :

## ప్రణాళికా రచన

*స్కాలర్‌షిప్‌ను 'సాచ్యురేషన్ బేసిస్'[9] (సంతృప్తత ప్రాతిపదిక) ప్రకారం అందజేస్తున్నారు కనుక స్కాలర్‌షిప్ మొత్తాన్ని మంజూరు చేయడానికి ముందే ప్రభుత్వం అర్హులైన విద్యార్థులను గుర్తించడం అవసరం. తల్లి దండ్రుల ఆదాయ వివరాలను నిర్దేశించిన 'ఫారం'లోనే సమర్పించేలా సంక్షేమశాఖలు చూడడంలేదు. విద్యార్థుల చిరునామా ధృవీకరణ, మొదలైన ఇతర వివరాలను నిర్ధారించుకుని, భరోసానిచ్చే యంత్రాంగమేదీ ప్రభుత్వం వద్ద లేదు. 'ఈపాస్' వ్యవస్థలోని సమాచారాన్ని (స్కాలర్‌షిప్ దరఖాస్తులు), పౌరసరఫరాల శాఖ డేటాబేస్‌తో ఆడిట్ సరిపోల్చి చూడగా, స్కాలర్‌షిప్ డేటాబేస్ లో పేర్కొన్న రేషన్ కార్డు వివరాలు పౌరసరఫరాల డేటాబేస్‌లో లభ్యంకాని సందర్భాలు అనేకం ఉన్నాయని వెల్లడైంది. అవసరమైన వివరాలు లేని కారణంగా కొన్ని సందర్భాల్లో స్కాలర్‌షిప్ మొత్తాలను విద్యార్థుల ఖాతాల్లోకి నోడల్ బ్యాంకులు జమ చేయకపోవడం ఈ అంశాన్ని మరింత బలపరుస్తోంది.*

***(పేరా 3.3.1)***

## నిధుల విడుదలలు, వ్యయం

- *పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ప్రభుత్వం నిధులను స్తంభింపజేయడం వలన **2008-12** మధ్య కాలంలో కేటాయించిన నిధుల్లో సుమారు **24** శాతం నిధులు వినియోగం కాకుండా మిగిలిపోయాయి.*

***(పేరా 3.4.2)***

- *ప్రభుత్వం పరిచయం చేసిన 'నోడల్ బ్యాంకుల ద్వారా స్కాలర్‌షిప్‌ల చెల్లింపు' విధానంలో, ఖాతాలను ఉపయోగించని విద్యార్థుల వివరాలను ఆయా బ్యాంకులు ప్రతి మూడు నెలలకు, కాలేజీ లవారీగా, జిల్లా అధికారికి తెలియజేయాలి. ఐతే, నోడల్ బ్యాంకులు, కార్పోరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్, పీడీ ఖాతాల్లో చెల్లింపులు జరగకుండా భారీ మొత్తంలో **(₹176.83 కోట్లు)** నిధులు ఉండిపోయాయి.*

***(పేరా 3.4.2.4)***

- *సంస్థలకున్న అవసరాలను తెలుసుకోకుండా వాటికి ప్రభుత్వం నిధులను విడుదల చేయడం వలన, **2012** మార్చి నాటికి, వివిధ స్కాలర్‌షిప్ పథకాలకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదలచేసిన మొత్తంలో **₹99.60** కోట్లు ఆయా సంస్థలవద్ద[10] (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ : **₹80.70** కోట్లు, ఏపీఎస్ సీఎమ్ఎఫ్‌సీ: **₹10.44** కోట్లు, యూఏఏపీ : **₹8.46** కోట్లు) పేరుకుపోయాయి.*

***(పేరా 3.4.2.1)***

- *హైదరాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారి పరిధిలోని నాలుగు డివిజన్లలో **2010** నవంబరు-**2011** డిసెంబరు మధ్యకాలంలో **4,156** ఈజీ పే/ఏటీఎమ్ కార్డులు అపహరించబడ్డాయి. వాటిద్వారా **471** బ్యాంకు ఖాతాల నుండి **₹17.25** లక్షలను (ఈ ఖాతాల్లో జమచేసిన మొత్తం **₹19.12** లక్షల్లో **90** శాతం) మోసపూరితంగా డ్రా చేసారు.*

***(పేరా 3.4.2.6)***

- *విడుదల చేసిన నిధుల్లో **70** శాతం **(₹1,122 కోట్లు)** నిధులకు జిల్లా సంక్షేమ అధికారులు/విద్యా సంస్థలు వినియోగధృవపత్రాలను ఇంకా సమర్పించాల్సిఉంది.*

***(పేరా 3.4.2.8)***

---

9 'సంతృప్తత ప్రాతిపదిక' అంటే అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ అందేలాచూడడం. ఒకవేళ ప్రస్తుత సంవత్సరంలో స్కాలర్‌షిప్ మంజూరుకాని విద్యార్థులకు తర్వాతి సంవత్సరంలో ప్రాధాన్యతనిచ్చి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు

10 ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ (మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ (యూఏఏపీ)

## ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు

- *ఈ పథకాలను అమలుచేయటానికి భారత ప్రభుత్వం తన వాటాగా* ***₹16.93*** *కోట్లను* ***2008-10*** *మధ్యకాలంలో విడుదలచేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం 'అంగీకరించిన మొత్తం' (కమిటెడ్ లయబిలిటీ)తో పాటు తన వాటాగా అందించాల్సిన మొత్తాన్ని కూడా విడుదల చేయలేదు. ఆకారణంగా, భారత ప్రభుత్వం* ***2010-12*** *కాలానికి ఎటువంటి నిధులను విడుదల చేయలేదు.*

***(పేరా 3.5.1)***

## పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు

- *ఈపాస్ వ్యవస్థలో పలు లోపాలున్నాయి. మాన్యతానియంత్రణలు (వేలిడేషన్ కంట్రోల్స్) చాలినన్ని లేకపోవడంతో,* ***₹64.71*** *కోట్ల మొత్తంతో ముడిపడిఉన్న పలు నియమవిరుద్ధమైన/అధిక చెల్లింపులు/బూటకపు క్లెయిమ్‌లను ఈపాస్ వ్యవస్థ అనుమతించింది.*

***(పేరాలు 3.6.3.2 నుండి 3.6.3.4 వరకు, 3.6.3.6 నుండి 3.6.3.8 వరకు)***

- *విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడంలో/చెల్లించడంలో అసాధారణమైన జాప్యాలు జరిగాయి.* ***2009-11*** *మధ్యకాలంలో* ***19*** *శాతం వరకు విద్యార్థులకు, అదే విద్యా సంవత్సరంలో నిర్వహణ రుసుం (ఎమ్‌టీఎఫ్), ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్) లను మంజూరు చేయని ఫలితంగా ఆ కాలేజీల యాజమాన్యం విద్యార్థులను ఫీజులు చెల్లించమంటూ నిర్బంధిస్తున్నాయి.*

***(పేరా 3.6.3.5)***

- *మేనేజ్‌మెంట్ కోటా కింద* ***2009-10*** *సంవత్సరంలో ఇంజినీరింగ్/ఎమ్‌బీఏ/ఎమ్‌సీఏ/బీఎడ్ కోర్సుల్లో చేరిన వారికి ఆర్‌టీఎఫ్, ఎమ్‌టీఎఫ్‌లకు గాను నియమవిరుద్ధంగా* ***₹6.18*** *కోట్ల మొత్తాన్ని మంజూరుచేసారు.*

***(పేరా 3.6.5.2)***

- *రాష్ట్ర ప్రభుత్వం,* ***2008-09*** *నుండి, మైనారిటీ వర్గాల విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్ రేట్లను, వెనుకబడిన తరగతులకు వర్తించే రేట్లకు సరిసమానంగా పెంచింది. ఐతే, స్కాలర్‌షిప్ లను మంజూరు చేసేటప్పుడు ఈ పెరిగిన రేట్లను వర్తింపజేయలేదు. ఫలితంగా, మైనారిటీ వర్గ విద్యార్థులు* ***₹2.70*** *కోట్లమేర స్కాలర్‌షిప్ చెల్లింపుకు దూరమయ్యారు.*

***(పేరా 3.6.5.5)***

- *స్కాలర్‌షిప్ దరఖాస్తులను తనిఖీ చేయడంలో పరిశీలనాధికారులు తగిన శ్రద్ధ చూపలేదు. ఫలితంగా, కొన్ని సందర్భాల్లో అధిక రేట్లతో స్కాలర్‌షిప్‌ను మంజూరుచేయడం జరిగింది. విద్యార్థుల హాజరుకు సంబంధించి రికార్డులను నిర్వహించని కారణంగా, నిర్దేశించిన వివరణలను సరిచూసుకోకుండానే స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం జరుగుతోంది.*

***(పేరాలు 3.6.5.1, 3.6.5.6, 3.6.5.7)***

- *వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వేరువేరు కాలేజీ లలో ఒకే రకమైన కోర్సుకు ఫీజు విధానంలో భారీ వ్యత్యాసాలున్నాయని గమనించడం జరిగింది. ఫలితంగా అదే కోర్సుకు వేరువేరు రేట్లను చెల్లించడం జరుగుతోంది.*

***(పేరా 3.6.5.10)***

### లబ్ధిదారుల సర్వే

*ఆడిట్ మచ్చుకు తీసుకున్న జిల్లాల్లో ఎంపిక చేసిన కాలేజీలను సందర్శించి అక్కడ జరిపిన సర్వే, ఆన్‌లైన్ ద్వారా **3,061** విద్యార్థులనుండి పొందిన సమాచారం వెల్లడి చేస్తున్న అంశాలు :*

- ***66** శాతం విద్యార్థులు స్కాలర్‌షిప్‌ను ఒకటి నుండి మూడేళ్ల జాప్యాలతో పొందారు.*
- ***34** శాతం విద్యార్థులు దరఖాస్తులను సమర్పించడంలో ఇబ్బందులనెదుర్కొంటున్నారు.*
- ***21** శాతం విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల మంజూరీలో సమస్యలనెదుర్కొంటున్నారు.*
- ***9** శాతం విద్యార్థులు కాలేజీలకు ఆర్‌టీఎఫ్‌ను ముందస్తుగా చెల్లించేలా వారిపై వత్తిడి తెచ్చారు.*
- ***15** శాతం విద్యార్థులు పూర్తి స్కాలర్‌షిప్‌ను పొందలేదు.*
- ***11** శాతం విద్యార్థులు తమ ఈజీపే కార్డులను కాలేజీయాజమాన్యమే అట్టిపెట్టుకుందని తెలిపారు.*

***(పేరా 3.7.5.1)***

## 1.7.3 జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎం) అమలు

*జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకాన్ని (జేఎన్ఎన్‌యూఆర్ఎం) భారత ప్రభుత్వం **2005** డిసెంబరులో ప్రవేశపెట్టింది. పట్టణ మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరిచే వ్యవస్థ సామర్థ్యంమీద దృష్టి సారించి, పట్టణ స్థానిక సంస్థలకు ప్రజలపట్ల జవాబుదారీతనం, సామాజిక భాగస్వామ్యం పెంపొందే విధంగా ఎంపిక చేసుకున్న నగరాల ఆధునికీకరణకూ, త్వరితగతిన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి దోహదపడటంకోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద గుర్తించిన **65** మిషన్ సిటీలలో నాలుగు - హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి - ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కోసం కేంద్ర ప్రభుత్వం **2012** మార్చి నాటికి మొత్తం **₹11,907** కోట్ల ప్రాజెక్టు వ్యయంతో **251** ప్రాజెక్టులను ఆమోదించింది.*

*సంస్కరణలకు నిర్దేశించిన కార్యాచరణ కట్టుదిట్టంగా అమలు జరిగిందా, నగరాల మౌలిక అభివృద్ధికి అవసరమైన వాటిని సమగ్రంగా అంచనావేశారా, వివిధ ప్రాజెక్టులకు ప్రణాళికా రచన సక్రమంగా జరిగిందా, వాటిని పొదుపుగానూ సమర్థవంతంగానూ అమలుజరిపి ఆశించిన ఫలితాలు సాధించారా వంటి పలు విషయాలను ధృవీకరించుకొనేందుకు జేఎన్ఎన్‌యూఆర్ఎం మీద ఆడిట్ సమీక్ష నిర్వహించటం జరిగింది. మొత్తం నాలుగు మిషన్ సిటీలు, **38** నాన్-మిషన్ సిటీలలో అమలుచేసిన మొత్తం **₹6,352** కోట్ల (**53** శాతం) ప్రాజెక్టు విలువకల **74** ప్రాజెక్టులను సమగ్ర ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేయటం జరిగింది. ఈ ఆడిట్ సమీక్షలో గమనించిన ముఖ్యమైన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి :*

### సంస్కరణల అమలు

*జేఎన్ఎన్‌యూఆర్ఎంను జాతీయ స్థాయిలో సంస్కరణలతో ముడిపడిన పెట్టుబడి ప్రేరణగా నిర్దేశించారు. రాష్ట్ర స్థాయి సంస్కరణలు అమలు జరగగా, పలు పట్టణ స్థానిక సంస్థలలో సంస్కరణల అమలు వాటి లక్షిత మైలురాళ్లతో పోలిస్తే ఆలస్యం జరిగాయి. ఎక్రూవల్ ప్రాతిపదికన జంటపద్దు విధానంలో లెక్కలు రూపొందించే సంస్కరణ విజయవంతంగా అమలు చేసినట్లుగా పట్టణ స్థానిక సంస్థలు, రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ కేంద్ర ప్రభుత్వానికి పంపిన నివేదిక సరికాదు. ఆస్తిపన్ను **90** శాతం వసూలు దక్షత, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణలో నూరు శాతం ఖర్చుల వసూలు ఆశించిన విధంగా ఏ పట్టణ స్థానిక సంస్థలోనూ సాధించలేదు.*

***(పేరా 4.3)***

## కార్యక్రమాల అమలు

- *మురుగునీటి పారుదల, నీటి సరఫరా, వరదనీటి కాలువలు, గృహనిర్మాణం, పట్టణ రవాణాకు సంబంధించి సమగ్ర పరిశీలనకోసం ఆడిట్ ఎంపిక చేసిన 74 ప్రాజెక్టులలో 2012 జూన్ నాటికి కేవలం 28 (38 శాతం) మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకుని, వినియోగంలోకొచ్చాయి. నమూనా తనిఖీలో గమనించిన దానిని బట్టి పనులలో జాప్యానికి ప్రధాన కారణాలు మురుగునీటి పారుదల, నీటి సరఫరా పనుల విషయంలోనైతే పైపులు వేయటంలో ప్రణాళికా లోపం, సాంకేతిక విధానాలలో మార్పులు, స్థల సేకరణ పూర్తి కాకపోవటం, అవసరమైన జల వనరులను ముందుగా గుర్తించకపోవటం, ఇతర శాఖలనుంచి అనుమతులు సంపాదించటంలోని జాప్యం, మొదలైనవి.*

  ***(పేరాలు 4.7.1, 4.7.2)***

- *మొత్తం ₹1,781 కోట్ల ఆమోదిత వ్యయంతో 2005-09 మధ్యన ఆమోదించిన 16 మురుగునీటి పారుదల ప్రాజెక్టులను సమగ్ర పరిశీలన కోసం ఆడిట్ ఎంపిక చేసింది. వీటిమీద ₹1,090 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క ప్రాజెక్టు మాత్రమే పూర్తయింది. అదే విధంగా 2005-09 మధ్యన ₹2,457 కోట్ల వ్యయంతో ఆమోదించిన 35 నీటి సరఫరా పథకాలను ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేయగా, 2012 జూన్ నాటికి 11 ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభమయ్యాయి.*

  ***(పేరాలు 4.7.3, 4.7.5)***

- *గృహ నిర్మాణ పథకాలు 2005-08 లో మంజూరైనవి ఐదింటిని నమూనా ఆడిట్‌లో పరిశీలించగా, 2012 జూన్ నాటికి ₹1,159 కోట్లు ఖర్చు చేసినాగానీ వీటిలో ఒక్కటికూడా పూర్తికాలేదు. ప్రత్యేకించి తిరుపతిలో నిర్మాణ పనులు వెనుకబడ్డాయి. అవసరమైన స్థలం లభించకపోవటం, నిధులకొరత ఆలశ్యానికి కారణాలు.*

  ***(పేరాలు 4.7.7, 4 7.7.2, 4.7.7.3)***

- *టెండరింగ్ ప్రక్రియలో పలు లోపాలున్నాయి. టెండర్లను ఖరారు చేయటంలో వ్యవస్థీకృత విధానాలను అనుసరించలేదు. పనులను సింగిల్ బిడ్డర్లకు అప్పగించారు. పనులను అనేక ప్యాకేజీలుగా విభజించటం, నామినేషన్ ప్రాతిపదికన అప్పగించటం జరిగింది.*

  ***(పేరా 4.6)***

## పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ

*మూడవ పక్షం తనిఖీ, పర్యవేక్షక సంస్థలు/స్వతంత్ర సమీక్ష, పర్యవేక్షక సంస్థలు (టీపీఐఎమ్ఏలు/ఐఆర్ఎమ్ఏ)లను ఈ ప్రాజెక్టుల అమలు తీరు పర్యవేక్షించేందుకు నియమించవలసి ఉండగా, నమూనా తనిఖీ చేసిన వాటిలోని కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించిన తరువాతనే వీటిని నియమించారు. ఫలితంగా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందు దశలలో ఈ పర్యవేక్షక సంస్థల పాత్రలేదు.*

***(పేరా 4.8)***

## ప్రభావ విశ్లేషణ

*ఆయా ప్రాజెక్టుల అమలు ప్రభావం పట్ల ప్రజల అవగాహనను అంచనా వేసే దిశగా 20 ప్రాజెక్టులకు సంబంధించి 1,528 మంది లబ్దిదారులను ఆడిట్ సర్వే చేసింది. మురుగునీటి ప్రాజెక్టుల గురించి సర్వే చేసినవారిలో 85 - 90 శాతం తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు చేపట్టటం వలన తమ ప్రాంతాలలో మురుగునీటి సమస్య తగ్గిందని వారు తెలిపారు. ఐతే, నీటి సరఫరా, వరదనీటి పారుదల కాలువలు, గృహనిర్మాణ ప్రాజెక్టులపై మిశ్రమ స్పందన వచ్చింది. వరదముప్పు తప్పిపోవటం, వసతులు మెరుగుపడటంపట్ల కొందరు సంతోషం వ్యక్తం చేయగా, హైదరాబాద్, తిరుపతి నగరాలలో ఇళ్ల విస్తీర్ణం తగ్గిపోవటం, మంచినీటి/మురుగునీటి వసతుల లేమి, రోడ్ల పరిస్థితి*

సరిగా లేకపోవటం, చెత్త కుప్పలనుంచి దుర్వాసన వంటి సమస్యల వలన తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను త్వరితంగా పూర్తి చేసి, ఆశించిన ప్రయోజనాలను సాధించవలసిన అవసరాన్ని ఆడిట్ నిర్వహించిన సర్వే కూడా బలపరుస్తోంది.

**(పేరా 4.9)**

## 1.7.4 గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలు

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ) భారత ప్రభుత్వ ప్రాథమ్య పథకాల్లో ఒకటి. **1972-73** లో మొదట దీన్ని సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం (ఏఆర్‌డబ్ల్యూఎస్‌పీ)గా ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి **1986**లో జాతీయ తాగునీటి పథకంగానూ, **1991**లో రాజీవ్‌గాంధీ జాతీయ తాగునీటి పథకంగానూ పేరు మార్చారు. దీన్ని **2009** ఏప్రిల్‌లో సవరించి, జాతీయ గ్రామీణ తాగునీటి పథకం **(ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ)** గా అమలు చేస్తున్నారు.

**2002-07** మధ్య కాలంలో రాష్ట్రంలో అమలు చేసిన నీటి సరఫరా పథకాల అమలుకు సంబంధించి సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకంపై **2007** లో ఒక ఆడిట్ సమీక్షను నిర్వహించడమైంది. ఆ సమీక్షలో కనుగొన్న అంశాలను కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి **2008** మార్చి **31**తో ముగిసిన సంవత్సరానికి వెలువరించిన భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చడమైంది. నీటి సరఫరా పథకాల అమలుకు సంబంధించిన ప్రణాళికా రచన, పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, నీటి వనరుల మనుగడ, నిర్వహణ, పర్యవేక్షణ వంటి అంశాల్లో పలు లోపాలను ఆ నివేదికలో వెల్లడిచేయడం జరిగింది. ప్రస్తుతం జాతీయ గ్రామీణ తాగునీటి పథకంగా వ్యవహరిస్తున్న ఈ పథకం అమలులో మెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన దిద్దుబాటు చర్యలను చేపట్టిందా లేదా అని పరిశీలించేందుకు ఐదేళ్ళ తర్వాత ఇప్పుడు మరో ఆడిట్ సమీక్షను నిర్వహించాలని నిర్ణయించడమైంది. ఈ అంశంపై గత ఆడిట్‌లో వెల్లడించిన లోపాలను పూర్తిగా సరిదిద్దలేదనీ, పలు లోపాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయనీ ప్రస్తుత ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. ఆడిట్‌లో కనుగొన్న ప్రధాన అంశాలను ఈ కింద పేర్కొనడమైంది:

- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సమాచార వ్యవస్థ (ఎమ్ఐఎస్)లో ఉన్న ఆవాసాల కవరేజి వివరాల నిర్ధారణకు గత కొంత కాలంగా/ ఆడిట్ సమీక్షా కాలంలో ఎలాంటి సర్వేనూ చేపట్టలేదు. నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా నీటి వనరుల మనుగడపై రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడం వల్ల పలు ఆవాసాలు 'పూర్తి స్థాయి నీటి వసతి ఉన్న ఆవాసాలు' స్థాయి నుండి 'పాక్షికంగా నీటి వసతి ఉన్న ఆవాసాలు' స్థాయికి దిగజారాయి. **2007-12** మధ్యకాలంలో **15,988 (49** శాతం**)** 'పూర్తి స్థాయి నీటి వసతి ఉన్న ఆవాసాలు', 'పాక్షికంగా నీటి వసతి ఉన్న ఆవాసాలు' స్థాయికి దిగజారాయి.

**(పేరా 5.4.1)**

- సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల్లో నిర్దేశించిన ప్రకారం వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. పథకం అమలుకు నిర్దిష్ట మార్గదర్శనాన్ని చూపేలా, భౌతిక, ఆర్థిక పురోగతిని నిర్ణీత కాలవ్యవధుల్లో పర్యవేక్షించేలా ఈ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. ఐతే, ఆడిట్ సమీక్షా కాలంలోని **2007-11** మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించలేదు.

**(పేరా 5.5.1)**

- మార్గదర్శకాల ప్రకారం, పూర్తికాని పథకాలకు, సమస్యాత్మక ఆవాసాలకు ప్రాధాన్యతనివ్వాలి. మచ్చుకు తనిఖీ చేసిన **66** ప్రాజెక్టుల్లో **27** ప్రాజెక్టులు ఇంకా అసంపూర్ణంగా ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడో **2002-10** మధ్యకాలంలో మంజూరైనవి. దీన్ని బట్టి పూర్తికాని పథకాలకు ప్రాధాన్యతనివ్వలేదని తెలుస్తోంది.

**(పేరా 5.5.1)**

- *2012 మార్చి నాటికి ప్రభుత్వం మంజూరీ నిచ్చిన 538 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాల్లో 292 (54 శాతం) పథకాల పనులను మాత్రమే చేపట్టారు. వీటిలో 56 నీటి సరఫరా పథకాలు పూర్తయ్యాయి. మిగిలిన 236 నీటి సరఫరా పథకాల పనులు జరుగుతున్నాయి.*

*(పేరా 5.7)*

- *ఎంపిక చేసుకున్న నీటి సరఫరా పథకాల పనుల నిర్వహణలో పలు లోపాలు ఆడిట్ పరిశీలనలో వెల్లడయ్యాయి. ఆడిట్ గమనించిన వాటిలో పనులు పూర్తికాకపోవడం/పూర్తి చేయడంలో జాప్యం, నిర్మాణ వ్యయం పెరగటం, నిర్మాణ గడువుల పొడిగింపు, పనులను సరైనప్రాథమ్య క్రమంలో చేపట్టకపోవడం, నిష్ఫల వ్యయానికి దారితీసిన కేసులు ఉన్నాయి. పైపులైన్లు వేయడానికి అటవీ అనుమతులు రాకపోవడం, నీటిని తీసుకోడానికి నీటి పారుదల శాఖనుండి అనుమతి రాకపోవడం, భూసేకరణ జరగకపోవడం నీటి సరఫరా పథకాలు పూర్తికాకపోవడానికి ప్రధాన కారణాలు.*

*(పేరా 5.7)*

- *నిరంతరాయమైన నీటి సరఫరా కోసం నీటి వనరుల మనుగడ (సస్టైయినబిలిటీ) కొనసాగేలా చూసేందుకు 2006-11 మధ్యకాలంలో ₹162.56 కోట్ల అంచనా విలువతో ప్రభుత్వం మంజూరీనిచ్చిన 2,975 పనుల్లో ₹2.62 కోట్ల అంచనా విలువ గల 734 (2 శాతం) పనులను మాత్రమే చేపట్టడం జరిగింది.*

*(పేరా 5.8)*

- *జిల్లా స్థాయిలో నాణ్యత పరీక్షల కోసం కావలసిన మౌలిక వసతులు లేకపోవడం, నిర్ణీత వ్యవధుల్లో పరీక్షలు జరపక పోవడాన్ని బట్టి నీటి నాణ్యతకు తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదని స్పష్టమౌతోంది. క్షేత్ర స్థాయిలో నీటి నాణ్యత పరీక్షల కోసం గ్రామ స్థాయిలో పంపిణీ చేసిన పరికరాలు (కిట్లు), వాటిలో వినియోగించాల్సిన రసాయనాలు/ వైయల్స్ లేని కారణంగా వృధాగా పడిఉన్నాయి.*

*(పేరా 5.9)*

## 1.7.5 నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

### *1.7.5.1 సాంకేతిక కళాశాలల పని తీరు*

*మొత్తం 115 ప్రభుత్వ సాంకేతిక కళాశాలల నుంచి 21 కళాశాలలను ఆడిట్‌లో పరిశీలించినప్పుడు కొత్త కళాశాలల ఆవిర్భావానికి తగిన కార్యాచరణ ప్రణాళిక లేదనీ, వాటిలో ప్రవేశపెట్టిన కోర్సులకు వివిధ ఇంజినీరింగ్ కోర్సులలో అందుబాటులో ఉన్న సీట్లతో పొంతన లేదనీ వెల్లడైంది. హాస్టల్ సదుపాయం, సిబ్బంది, మౌలిక వసతులను సమకూర్చకుండానే కళాశాలలలో రెండవ షిఫ్టును ప్రవేశపెట్టారు. "ప్రావీణ్య వికాసానికి సమన్విత కార్యాచరణ కింద సాంకేతిక కళాశాలలపై ఉపసంఘం" అనే పథకానికి 2009-12లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ₹61.69 కోట్ల నిధులలో కేవలం ₹11.44 కోట్లు (18 శాతం) మాత్రమే ఆయా కళాశాలలు వినియోగించుకోగా, మిగతా మొత్తంలో ₹12.80 కోట్లు (21 శాతం) ప్రిన్సిపాళ్ళ దగ్గరా, ₹37.45 కోట్లు (61 శాతం) ప్రభుత్వం దగ్గరా నిరుపయోగంగా ఉండిపోయాయి. ప్రయోగశాలలు, వర్క్‌షాపుల కొరత, లోకల్ఏరియా నెట్‌వర్క్ వెసులుబాటు లేకపోవటం, పనిచేయని పరికరాలు, మరుగుదొడ్లు కూడా లేకపోవటం వంటి పలు మౌలిక లోపాలు నమూనా తనిఖీలో బయటపడ్డాయి. కళాశాలల నిర్వహణకు కీలకమైనవిగా భావించే పలు స్థాయిలలో సిబ్బందికొరత నెలకొంది. విద్యార్థులు 2008-09 నుంచి 2010-11 సంవత్సరాల మధ్య 24,769 మంది ఉత్తీర్ణత సాధించగా అందులో 4,672 మందికి (19 శాతం) శిక్షణ వేతనం లభించింది. కేవలం 3,770 మంది (15 శాతం) నియామకాలు పొందారు. ఈ విషయం మీద వీలైనంత వెంటనే దృష్టి సారించాలి.*

*(పేరా 6.1)*

### 1.7.5.2 బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణంలో జాప్యం

అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ ఇంజినీరింగ్ విశ్వవిద్యాలయ కళాశాల డ్రాయింగులు, డిజైన్లను రూపొందించటం లోని ఆలస్యం, డిజైన్లను మధ్యంతరంగా మార్చటం, మిగతా పనులు ఎవరికీ ఇవ్వకపోవటం వలన బహుళ ప్రయోజనాల ఆటిటోరియం నిర్మాణానికి వెచ్చించిన **₹1.87** కోట్లు ఫలితమివ్వకపోగా ఇది ఆరు సంవత్సరాల జాప్యంతోపాటు **2012** అక్టోబరు నాటికి **₹3.19** కోట్ల అదనపు ఆర్థిక భారానికి దారితీసింది.

**(పేరా 6.2)**

### 1.7.5.3 శిల్పారామం వద్ద ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టు

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపట్టాలనుకున్న ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టు కోసం కేటాయించిన స్థలానికి కౌలు మొత్తాన్ని లెక్కించేందుకు అప్పటి మార్కెట్ విలువను తీసుకొనకపోవటం వలన ప్రభుత్వం **33** సంవత్సరాల కౌలు కాలానికి అద్దె రూపేణా **₹29.36** కోట్లు నష్టపోయి, ఆమేరకు డెవలపర్‌కు అనుచిత లబ్ధిని చేకూర్చింది.

**(పేరా 6.3)**

### 1.7.5.4 ఋషికొండలో బేపార్క్ రిసార్టులు

ఒప్పుకున్న మేరకు మొత్తం భూమిని డెవలపర్‌కు స్వాధీనం చేయకపోవటం, అభివృద్ధి-నిర్వహణ ఒప్పందంమీద మళ్ళీ సంప్రదింపులు జరపటంలో ప్రభుత్వ శాఖ తొందర, చొరవ చూపకపోవటం (**13** ఎకరాల అటవీభూమి డీనోటిఫికేషన్‌కు **2009** ఫిబ్రవరిలో పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తిరస్కరించిన నేపథ్యంలో) ఫలితంగా విశాఖపట్నం-భీమిలి మార్గంలో నిర్మించతలపెట్టిన బేపార్క్ రిసార్ట్స్ ప్రాజెక్టు **11** సంవత్సరాలు గడచినా పూర్తికాక పోవటంతో సాగరతీరంలోని విశాఖపట్నాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యం నెరవేరలేదు.

**(పేరా 6.4)**

### 1.7.5.5 దంత చికిత్సలకు అధిక చెల్లింపులు

దంత చికిత్సలకు సంబంధించిన వైద్య ఖర్చుల చెల్లింపు విషయమై అనుసరించ వలసిన విధివిధానాలను ప్రభుత్వం **2007** ఏప్రిల్‌లో ప్రకటించగా వైద్య ఖర్చులు ఆమోదించే సమయంలో డ్రాయింగ్ అధికారులు ఈ ఆదేశాలను అనుసరించకపోవటం, బిల్లులు చెల్లించే తరుణంలో ఖజానా అధికారులు తగు జాగ్రత్త వహించకపోవటం **₹1.06** కోట్ల మేర అధిక చెల్లింపులకు దారితీశాయి.

**(పేరా 6.5)**

### 1.7.5.6 ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పని తీరు

నిర్మాణ కార్మికులందరినీ గుర్తించి, నమోదు చేసుకొనేందుకూ, కార్మిక యజమానులకు శిస్తు విధించి సక్రమంగా వసూలు చేసుకునేందుకూ అవసరమైన యంత్రాంగం లేకపోవటంతో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును స్థాపించిన లక్ష్యం సరిగా నెరవేరలేదు.

**(పేరా 6.6)**

# అధ్యాయం-2

## రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పనితీరు

### హోం (జైళ్ళ) శాఖ

పేజీలు 15 - 43

## 2.1 రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ గురించి సంక్షిప్తంగా...

ఈ శాఖను 1957లో 'అగ్నిమాపక సేవల శాఖ' అనే పేరుతో ఏర్పాటు చేసారు. తర్వాత 2004లో ఈ శాఖ పేరును 'అగ్నిమాపక మరియు అత్యవసర సేవల శాఖ' గానూ, 2009 జూలైలో ' రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ' గానూ మార్చారు. వివిధ రకాల ప్రమాదాలకు మొదట స్పందించే శాఖగా దీన్ని గుర్తించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తుల రక్షణ బాధ్యతను ఈ శాఖకు అప్పగించడమైంది. రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ప్రధానంగా ఈ కింది విధులను నిర్వర్తిస్తుంది :

- అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడం, సహాయక చర్యలను చేపట్టడం;
- ప్రజలు భారీగా గుమికూడే సభలు-సమావేశాల్లో, వేడుకల్లో, అత్యంత ప్రముఖుల పర్యటనల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడం;
- మంటలను ఆర్పే చర్యలకు సంబంధించిన శిక్షణనివ్వడం;
- అగ్నిప్రమాదాల నివారణకు తప్పనిసరిగా తీసుకోవలసిన రక్షణ చర్యలను నిర్దేశించడం;
- అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన రక్షణ చర్యలు, అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వ్యవహరించాల్సిన విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం;
- బహుళ అంతస్తుల భవనాల నిబంధనలు - 1981లో నిర్దేశించిన అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన రక్షణ చర్యల నిబంధనలను అమలు చేయడం;
- అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవలసిన రక్షణ చర్యలకు సంబంధించిన నిర్దేశాలున్న ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం -1999నూ, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక మరియు అత్యవసర సేవల నిర్వహణ, ఫీజుల విధింపు నియమావళి - 2006నూ అమలు చేయడం.

కేంద్ర అంతర్గత భద్రతా(హోమ్) వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'అగ్నిమాపక సలహాల స్థాయీ సంఘం (స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్)' జాతీయ స్థాయిలో అత్యున్నత సంస్థ. పరిపాలన, శాసనాల రూపకల్పన, శిక్షణ, పరికరాలు వంటి వాటితోపాటు అగ్నిమాపక సేవలకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సంస్థ సలహాలనిస్తుంది.

### 2.1.1 వ్యవస్థాగత నిర్మాణం

హోమ్ (జైళ్ళ) శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఈ శాఖ తన కార్యకలాపాలను నిర్వర్తిస్తుంది. అగ్నిమాపక మరియు అత్యవసర సేవల డైరెక్టర్ జనరల్ (డీజీ ఎఫ్ఎస్) పాలనాపరమైన వ్యవహారాలకు సంబంధించి శాఖాధిపతిగానూ, ముఖ్య నియంత్రణ అధికారిగానూ వ్యవహరిస్తారు. సంచాలకులు (డీఎఫ్ఎస్), అదనపు సంచాలకులు (ఎడీఎఫ్ఎస్), మూడు ప్రాంతాలకు సంబంధించి ముగ్గురు[1] ప్రాంతీయ అగ్నిమాపక అధికార్లు (ఆర్ఎఫ్ఓలు), 23 మంది జిల్లా అగ్నిమాపక అధికార్లు, డీజీ ఎఫ్ఎస్‌కు విధి నిర్వహణలో సహాయపడతారు. రాష్ట్రంలో అగ్నిమాపక, అత్యవసర, సహాయక చర్యలకు సంబంధించిన సేవలందించేందుకు 253 అగ్నిమాపక కేంద్రాలు[2], అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఏర్పాటైన 19 ఫైర్ అవుట్ పోస్టులు ఉన్నాయి. డీఎఫ్ఓ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేసే రాష్ట్ర స్థాయి శిక్షణ సంస్థ (ఎస్‌టీఐఎస్) శాఖాపరమైన కార్యకాలాపాలను నిర్వహించడంలో సిబ్బందికి శిక్షణనిస్తుంది.

---

1 అనంతపురం(రాయలసీమ), హైదరాబాద్ (తెలంగాణ), విశాఖపట్నం (కోస్తాంధ్ర)

2 గచ్చిబౌలి వద్ద ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిర్వహిస్తోన్న ఒక ఫైర్ స్టేషన్‌తో కలిపి

## 2.2 ఆడిట్ విధివిధానాలు

### 2.2.1 ఆడిట్ లక్ష్యాలు

అగ్నిమాపక సేవల శాఖపై 2002-03లో సమగ్రంగా నిర్వహించిన ఆడిట్‌లో కనుగొన్న విషయాలను 2003 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వెలువరించిన కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చడం జరిగింది. ఈ శాఖ పనితీరులో ముఖ్యమైన లోపాలను ఈ నివేదికలో ప్రముఖంగా చర్చించడమైంది. ఈ శాఖకు సంబంధించిన విధానాలను సరైన మార్గంలోకి తీసుకురావడానికి చేపట్టాల్సిన వివిధ చర్యలను కూడా ఈ నివేదికలో సిఫార్సు చేయడం జరిగింది. గత పదేళ్ళ కాలంలో ఈ శాఖ పనితీరు ఏ మేరకు మెరుగుపడిందోనని పరిశీలించేందుకు ప్రస్తుత ఆడిట్‌ను నిర్వహించడమైంది. ప్రస్తుత ఆడిట్‌లో ఈ కింది అంశాలను మదింపు చేయడం జరిగింది:

- అత్యవసర పరిస్థితులనెదుర్కోడానికి రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ సన్నద్ధతను బలోపేతం చేసుకొనేందుకు ప్రణాళికా రచన పటిష్ఠంగానూ, ప్రభావవంతంగానూ ఉందా;
- ఈ శాఖ అవసరాలకు సరిపడినన్ని నిధులను సమకూర్చారా;
- తనకు అప్పగించిన బాధ్యతలను ప్రభావవంతంగా నిర్వహించేందుకు సరైన, తగిన మౌలిక వసతులు ఈ శాఖ వద్ద ఉన్నాయా;
- అగ్నిప్రమాదాల నిరోధానికి, నియంత్రణకు సంబంధించిన ప్రమాణాలు ప్రభావవంతంగా అమలు చేసారా;
- సిబ్బంది నిర్వహణ, సామర్థ్యాలను పెంపొందించుకునే ప్రక్రియలు కట్టుదిట్టంగా ఉన్నాయా, కార్యక్రమాల అమలు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నారా;
- అంతర్గత నియంత్రణలు, పర్యవేక్షణ చాలినంతగా ఉన్నాయా, అవి ప్రభావవంతంగా పనిచేస్తున్నాయా.

### 2.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఈ కింది వాటిని ప్రామాణికంగా తీసుకుని, ఆడిట్‌లో కనుగొన్న అంశాలను బేరీజు వేసుకోవడం జరిగింది:

- ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం - 1999 (2006లోని 21వ చట్టం ద్వారా సవరించిన ప్రకారం) (చట్టం);
- ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవల నిర్వహణ, ఫీజుల విధింపు నియమావళి - 2006 (నియమావళి);
- ఏపీ ఫైర్ సర్వీస్ మాన్యువల్ - 1968;
- ఎస్ఎఫ్ఏసీ నిర్దేశించిన ప్రమాణాలు;
- ఏపీ ట్రెజరీ కోడ్, ఏపీ ఫైనాన్షియల్ కోడ్, ఏపీ బడ్జెట్ మాన్యువల్;
- ప్రభుత్వ ఉత్తర్వులు, మంజూరీలు, డీజీఎఫ్ఎస్ జారీచేసిన ఆదేశాలు/సర్క్యులర్లు.

### 2.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

2011 ఆగస్టు నుండి 2012 ఫిబ్రవరి వరకూ నిర్వహించిన ఆడిట్‌లో 2007-12 మధ్య కాలంలో అగ్నిమాపక సేవలకు సంబంధించి, ఈ శాఖ కార్యకాలాపాలను పరిశీలించడం జరిగింది. డీజీఎఫ్ఎస్ కార్యాలయం, ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లా అగ్నిమాపక కార్యాలయాల వద్ద రికార్డుల పరిశీలన, సమాచార విశ్లేషణలు ఆడిట్ నిర్వహణా పద్ధతుల్లో ఉన్నాయి. 2011 జూలైలో జరిగిన సమీక్షారంభ సమావేశంలో ఆడిట్ లక్ష్యాలు, పరిధి, ప్రామాణికాంశాలు, పద్ధతుల గురించి డీజీఎఫ్ఎస్‌తో చర్చించడం జరిగింది. ఆడిట్ పరిశీలన కోసం సందర్శించిన వివిధ క్షేత్రస్థాయి యూనిట్ల వద్ద సంబంధిత సిబ్బందితో ఆడిట్‌లో కనుగొన్న విషయాలను చర్చించడమైంది.

అగ్నిమాపక సేవల శాఖ సిబ్బందితో కలసి ఫైర్ స్టేషన్లు, కొన్ని ప్రమాదకర ప్రాంగణాల వద్ద ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీ నిర్వహించి అవసరమైన చోట ఆడిట్ కనుగొన్న అంశాలకు మద్దతుగా ఫొటోలను తీసుకోవడం జరిగింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితోనూ, సంబంధిత అధికార్లతోనూ 2012 అక్టోబర్‌లో జరిగిన సమీక్షానంతర సమావేశంలో ఆడిట్ కనుగొన్న విషయాలను చర్చించడమైంది. ప్రభుత్వ సమాధానాలను ఈ నివేదికలో తగిన విధంగా పొందుపర్చడం జరిగింది.

### 2.2.4 ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న నమూనా

డీజీఎఫ్ఎస్ పరిధిలో 2012 మార్చి నాటికి 26 మంది డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు[3] (డీడీఓలు) ఉన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలోని ఏడీఎఫ్ఓ[4] ఆ జిల్లాలోని ఈ శాఖ కార్యాలయాలన్నింటికీ డీడీఓగా వ్యవహరిస్తారు. డీజీ ఎఫ్ఎస్, రాజధాని జిల్లా హైదరాబాద్‌తో పాటు కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలనుండి రెండేసి జిల్లాల చొప్పున మొత్తం ఏడు జిల్లాల[5] డీఎఫ్ఓలను, వీటి పరిధిలోని 85 ఫైర్ స్టేషన్లను, హైదరాబాద్‌లోని రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థను ఆడిట్‌కు ఎంపిక చేసుకుని సంబంధిత రికార్డులను తనిఖీ చేయడమైంది.

***ఆడిట్‌లో కనుగొన్న అంశాలు***

## 2.3 ప్రణాళికా రచన

### 2.3.1 ముందస్తు/వార్షిక ప్రణాళికలు

ఒక సంస్థ తను సాధించాల్సిన లక్ష్యాలకు, లక్షిత కార్యక్రమాల అమలుకు, వనరుల వినియోగానికి తగిన కార్యాచరణ ప్రణాళికలు, వ్యూహాలను వెల్లడించడానికి, లక్ష్యాలకు అనుగుణంగా సాధించిన పురోగతిని పర్యవేక్షించడానికి, పనితీరు సూచికలను నిర్ణయించడానికి మధ్యకాలికం నుండి దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలి.

ఈ శాఖకు సంబంధించిన ప్రణాళికలు/ప్రాథమ్యాలను రాష్ట్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికల్లో చేర్చలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. కావలసిన మౌలిక వసతులు, సంస్థాగత అవసరాలు, వ్యూహాత్మక/ముందస్తు ప్రణాళికల ద్వారా వాటిని సమకూర్చుకోవడానికి గడువులను డీజీ ఎఫ్ఎస్ నిర్ధారించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లో స్థానిక అవసరాలు, వాటిని సమకూర్చుకునేందుకు ప్రతిపాదించిన విధానాలను తెలిపే వార్షిక కార్యాచరణ ప్రణాళికలు ఏ ఒక్క జిల్లాలోనూ లేవు. ముందస్తు/కార్యాచరణ ప్రణాళికలు లేనందున ప్రాథమ్యాలను గుర్తించ లేకపోయారు; డిపార్టుమెంటు లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా, నిర్దేశిత చర్యలేవీ చేపట్టలేదు.

### 2.3.2 నిర్వహణ సమాచారం

ఈ శాఖ తన కార్యకాలాపాలను ప్రభావవంతంగా నిర్వహించడానికి ప్రాంతాలవారీగా జనాభా వివరాలు, సేవలు అందించాల్సిన గ్రామాలు, ఇళ్ళు, ప్రమాదకర/ప్రమాద రహిత ప్రాంగణాల వంటి విభాగాల వారీ వివరాలు, ఫైర్ స్టేషన్లు, అవి వున్న ప్రదేశం, ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోనూ వివిధ ప్రదేశాల మధ్య దూరాలను సూచించే భౌగోళిక మ్యాపింగ్, దగ్గరి దార్లు, ట్రాఫిక్ రద్దీ ఉండని మార్గాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు మొదలైన వివరాలతో కూడిన సమగ్రడేటాబేస్ ఉండటం అత్యంత ఆవశ్యకం.

---

[3] డీజీఎఫ్ఎస్-1, ఆర్ ఎఫ్ ఓ - సెంట్రల్ -1, ఎస్‌టీఐఎస్ -1, డీఎఫ్ఓలు - 23

[4] సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి

[5] చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైయస్ఆర్(కడప) - వీటిలో నాలుగు (చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, విశాఖపట్నం) జిల్లాలకు సంబంధించి గత ఆడిట్ సమీక్షలో కనుగొన్న అంశాలను 2002-03 సంవత్సరపు ఆడిట్ నివేదికలో ప్రస్తావించడమైంది

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని ఏ ఒక్క డీఎఫ్ఓ వద్దా ఇలాంటి డేటాబేస్‌ను నిర్వహించడంలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. అంతేగాక, అత్యంత ఎత్తైన భవనాల్లో అగ్ని ప్రమాదాలనెదుర్కోడానికి, భూకంపాలు ఇతర ప్రకృతి విపత్తుల్లో వ్యవహరించేందుకు ఎలాంటి ప్రామాణిక నిర్వహణ పద్ధతులనూ ఈ శాఖ అభివృద్ధి చేయలేదు.

### 2.3.3 ఉపసంఘం సిఫార్సులు

ఈ శాఖను పటిష్టపర్చాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం దీని పునర్నిర్మాణం కోసం 2008 మేలో హోమ్ మంత్రి అధ్యక్షతన ఒక ఉపసంఘాన్ని నియమించింది. అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో అన్వేషణ, రక్షణ అవసరాలకు సత్వరమే స్పందిచేలా వాహనాలు, పరికరాలను సమకూర్చడం, సిబ్బందికంతటికీ శిక్షణ నివ్వడం ద్వారా అగ్నిమాపక సేవల శాఖను అన్ని స్థాయిల్లోనూ పటిష్టపరచాల్సిన అవసరముందని ఈ ఉపసంఘం అభిప్రాయపడింది. ప్రస్తుతం ఫైర్ స్టేషన్లు అవసరాలకు తగినట్లుగా లేవని, వాటికి సరిపడినన్ని నిధులను బడ్జెట్‌లో పొందుపరచడడం లేదని కూడా ఈ ఉపసంఘం అభిప్రాయపడింది. ఈ ఉపసంఘం పలు ఇతర అంశాలతో పాటుగా ఈ కింది సిఫార్సులను చేసింది (2009 ఫిబ్రవరి) ః

⇒ ఈ శాఖ పేరు మార్చడం;

⇒ కొత్తగా 140 ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయడం; ముఖ్యంగా, కనీసం ఒక్క ఫైర్ స్టేషన్ కూడా లేని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీటిని ఏర్పాటు చేయడం;

⇒ అన్వేషణ - రక్షణ చర్యలను చేపట్టడానికి జిల్లా స్థాయిలో 23 బృందాలను సబ్ డివిజనల్ ముఖ్య కేంద్రాల్లో 93 బృందాలను ఏర్పాటు చేయడం;

⇒ హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలలో అణు, జీవ, రసాయన విపత్తులకు సంబంధించిన అన్వేషణ - రక్షణ బృందాలను ఏర్పాటు చేయడం;

⇒ రాష్ట్ర స్థాయి ఆధునిక సమాచార వ్యవస్థ, మొదలైన వాటిని ఏర్పాటు చేయడం;

⇒ విపత్తుల ఉపశమన నిధి నుండి 20 శాతం నిధులను ప్రత్యేక పరికరాల కొనుగోలుకు కేటాయించడం;

⇒ ఆధునికీకరణ పథకం అమలుకు మున్సిపల్ సంస్థలు వసూలు చేసే ఆస్తి పన్ను నుండి 3 శాతాన్ని కేటాయించడం.

ఉపసంఘం సిఫార్సులను ప్రభుత్వం 2009 జూలైలో అంగీకరించినప్పటికీ, వీటి అమలుకు నిర్ణీత కాలవ్యవధిని నిర్దేశించలేదు. ఈ శాఖ పేరు మార్పు (2009 జూలై), హైదరాబాద్ - సికింద్రాబాద్ జంటనగరాల్లో అన్వేషణ - రక్షణ బృందాల ఏర్పాటు తప్ప (ఇలాంటి బృందాలను మొత్తం 23 ఏర్పాటు చేయాల్సి ఉండగా) , మూడేళ్ళకు పైగా గడచినప్పటికీ 2012 నవంబరు నాటికి ఉపసంఘం సిఫార్సులేవీ అమలు కాలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

డీజీ ఎఫ్ఎస్ దీన్ని అంగీకరిస్తూ, ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు (2012 నవంబరు).

## 2.4 చాలినంతగా లేని బడ్జెట్

2007-12 మధ్య కాలానికి ఈ శాఖ బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి ః

పట్టిక 2.1

(₹ కోట్లలో)

| సంవత్సరం | డీజీఎఫ్ఎస్ కోరిన నిధులు | బడ్జెట్ కేటాయింపులు (శాతం) | ఖర్చు | వినియోగించని నిధులు(-)/ అధిక ఖర్చు (+) |
|---|---|---|---|---|
| 2007-08 | 186 | 69 (37) | 64 | (-) 5.00 |
| 2008-09 | 159 | 79 (50) | 79 | 0.00 |
| 2009-10 | 243 | 89 (37) | 83 | (-) 6.00 |
| 2010-11 | 358 | 121 (34) | 107 | (-) 14.00 |
| 2011-12 | 334 | 145 (43) | 150 | (+) 5.00 |
| మొత్తం | 1280 | 503 | 483* | |

** ప్రణాళిక: ₹25 కోట్లు; ప్రణాళికేతర: ₹458 కోట్లు*

*మూలం: సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వినిమయ పద్దులు, డీజీఎఫ్ఎస్ ఇచ్చిన సమాచారం*

2007-12 మధ్య కాలంలో ప్రతి ఏటా డిపార్టుమెంటు కోరిన మొత్తంలో కేవలం 34 నుండి 50 శాతం వరకు మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు పై పట్టికలోని వివరాలను చూస్తే తెలుస్తోంది. 2002-03 సంవత్సరానికి వెలువరించిన భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చిన అంశాల మేరకు ఫైర్ స్టేషన్లకు శాశ్వత భవనాలు, నీటి ట్యాంకులు, బోరు బావుల నిర్మాణం, మంటలనార్పే యంత్రాలతో కూడిన వాహనాలు పోర్టబుల్ పంపులు, విద్యుత్తు మోటార్ల కొనుగోలు కోసం డీజీ ఎఫ్ఎస్ 2007-08 నుండి 2011-12 మధ్యకాలంలో ప్రతి ఏటా బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తున్నారు. అంతేగాక, 89 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్త ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి తమ అవసరాలను ఈ శాఖ 2008-09 నుంచి బడ్జెట్ ప్రతిపాదనల్లో సమర్పిస్తోంది. కానీ, సమీక్షా కాలంలోని ఏ సంవత్సరపు బడ్జెట్లోనూ అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించ లేదు.

బడ్జెట్ విడుదలను నిలిపివేయడం/బడ్జెట్ విడుదల ఉత్తర్వులను జారీ చేయకపోవడం వలన బడ్జెట్లో కేటాయించిన నిధులు కూడా ఈ శాఖకు లభ్యం కాలేదు. ఇందువలనే 2007-08 నుండి 2010-11 మధ్యకాలంలో బడ్జెట్ కేటాయింపులమేర కూడా నిధులు ఖర్చు కాలేదని డీజీఎఫ్ఎస్ తెలిపారు. ముఖ్యంగా, 2010-11లో ₹13.76 కోట్ల మేర మిగుళ్ళేర్పడినట్లు తెలిపారు. బడ్జెట్లో కేటాయించినమేర పూర్తి నిధులను విడుదల చేయని కారణంగా ఇప్పటికే ఏర్పాటయిన 30 ఫైర్ స్టేషన్లకు శాశ్వత భవనాల నిర్మాణం, మంటలనార్పే యంత్రాల కొనుగోలు, నీటి సదుపాయాల కల్పన, కొత్త ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయడంలో ఈ శాఖ ముందుకెళ్ళలేక పోయింది. 2007-08 నుండి 2011-12 మధ్యకాలంలోని మొత్తం ఖర్చులో ఈ శాఖ తన విధుల నిర్వహణ కోసం చేసిన ఖర్చు[6] 12 నుండి 27 శాతం వరకు ఉండగా, మిగిలినదంతా సిబ్బంది జీత భత్యాలకు, కార్యాలయ నిర్వహణకు ఖర్చయింది.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ, కార్యాలయాలు/ఫైర్ స్టేషన్లకు భవనాల నిర్మాణానికి 2012-13 ఆర్థిక సంవత్సరంలో ₹25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

## 2.4.1 విపత్తుల ఉపశమన నిధి నుండి నిధులను తక్కువగా విడుదల చేయడం

రాష్ట్రంలో అగ్నిమాపక సేవలను పటిష్టపరచేందుకు విపత్తుల ఉపశమన నిధి (సీఆర్ఎఫ్[7])కి కేటాయించిన నిధుల్లో 10 శాతం నిధులను అన్వేషణ - రక్షణ చర్యలకు సమాచార పరికరాలతో సహా ఆధునిక పరికరాలను కొనుగోలు చేయడానికి వినియోగించుకోవచ్చని భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి 2006 సెప్టెంబరులో అనుమతిని

[6] 2007-08: ₹12 కోట్లు (18 *శాతం*), 2008-09 : ₹18 కోట్లు(23 *శాతం*), 2009-10: ₹11 కోట్లు (13 *శాతం*), 2010-11: ₹13 కోట్లు (12 *శాతం*), 2011-12: ₹40 కోట్లు (27 *శాతం*)

[7] ప్రస్తుతం దీన్ని 'రాష్ట్ర విపత్తుల స్పందన నిధి'గా వ్యవహరిస్తున్నారు

ఇచ్చింది. 2007-12 మధ్యకాలానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విపత్తుల ఉపశమన నిధికి ₹559.76 కోట్లను విడుదల చేసింది. ఇదేకాలానికి భారత ప్రభుత్వం తన వాటాగా (75 శాతం) ₹1,579.25 కోట్లను విడుదల చేసింది. ఆ వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

పట్టిక 2.2

(₹ కోట్లలో)

| సంవత్సరం | విపత్తుల ఉపశమన నిధికి జమయిన మొత్తం (కేంద్ర వాటా: 75 శాతం రాష్ట్ర వాటా: 25 శాతం) | 10 శాతం వాటాగా అగ్నిమాపక సేవలకు ఇవ్వాల్సిన నిధులు | రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక సేవలకు వాస్తవంగా విడుదల చేసిన నిధులు |
|---|---|---|---|
| **2007-08** | 379.35 | 37.94 | 0.50 |
| **2008-09** | 398.31 | 39.83 | 1.33 |
| **2009-10** | 418.23 | 41.82 | 0.00 |
| **2010-11** | 508.84 | 50.88 | 0.00 |
| **2011-12** | 434.28 | 43.43 | 0.00 |
| మొత్తం | **2139.01** | **213.90** | **1.83** |

*మూలం : రెవెన్యూ (విపత్తుల నిర్వహణ - III) శాఖ ఇచ్చిన సమాచారం*

2007-12 మధ్యకాలంలో ఆధునిక పరికరాల కొనుగోలు కోసం విపత్తుల ఉపశమన నిధి నుండి 10 శాతం నిధులు (₹213.90 కోట్లు[8]) విడుదల చేసేందుకు భారత ప్రభుత్వం అనుమతించగా, రాష్ట్ర ప్రభుత్వం ఒక శాతం కంటే తక్కువ నిధులను (₹1.83 కోట్లు) విడుదల చేసింది. విపత్తుల ఉపశమన నిధుల నుండి నిధుల విడుదల కోసం డీజీఎఫ్ఎస్ ఎప్పటికప్పుడు కోరుతున్నప్పటికీ, 2012 నవంబరు నాటికి ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు.

ప్రభుత్వం నిధులు విడుదలచేయని కారణంగా ఆధునికీకరణ ప్రక్రియ చేపట్టలేకపోయారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ప్రతిపాదించిన (2006) అన్వేషణ - రక్షణ బృందాలను ఏర్పాటు చేయలేదు.

### 2.4.2 అగ్నిమాపక సేవల పన్ను వసూలు చేయకపోవడం

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం - 1999, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక మరియు అత్యవసర సేవల నిర్వహణ, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని నిబంధనల ప్రకారం, స్థలాలు, భవనాలపై విధించే ఆస్తి పన్నులో ఒక శాతం చొప్పున (సర్‌చార్జి రూపంలో) అగ్నిమాపక సేవల పన్నును విధించాలి. భూమి శిస్తు బకాయిలను వసూలు చేసే విధంగానే దీన్ని రికవరీ చేయాలి.

సంబంధిత చట్టం 2001లోనూ, నియమావళి 2006లోనూ అమల్లోకి వచ్చినప్పటికీ, స్థానిక సంస్థల ద్వారా అగ్నిమాపక సేవల పన్ను వసూలుకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయలేదు. ఫలితంగా, 2007 ఏప్రిల్ నుండి 2012 మార్చి వరకు అగ్నిమాపక సేవల పన్ను రూపంలో రాగల ₹49.11 కోట్ల[9] రాబడిని ప్రభుత్వం రాబట్టు కోలేకపోయింది. అగ్నిమాపక, అత్యవసర సేవలకు ఈ రాబడి ఉపయోగపడి ఉండేది.

[8] (భారత ప్రభుత్వం విడుదల చేసిన 75 శాతం : ₹1,579.25 కోట్లు + రాష్ట్ర వాటా (25 శాతం) : ₹559.76 కోట్లు)లో 10 శాతం

[9] 2007-12 మధ్యకాలంలో స్థానిక సంస్థలు వసూలు చేసిన ₹4,911 కోట్ల ఆస్తి పన్నులో 1 శాతం

## 2.5 మౌలిక వసతులు, అగ్నిమాపక సేవల నిర్వహణ

### 2.5.1 మౌలిక వసతులు

#### *2.5.1.1 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు*

పట్టణాల్లో ప్రతి 10 చదరపు కిలోమీటరుకు ఒకటి చొప్పున, గ్రామీణ/ఆరుబయలు ప్రాంతాల్లో ప్రతి 50 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ స్టేషన్లు ఉండాలని స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్ (ఎస్ఎఫ్ఏసీ) సిఫార్సు చేసింది. ఈ ప్రమాణాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 5,502 ఫైర్ స్టేషన్లు ఉండాలి.

ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

**(i)** రాష్ట్రంలో 2.75 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి[10] మొత్తం 253 ఫైర్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయి (కొరత: 95 శాతం). 2007-12 మధ్యకాలంలో కొత్తగా ఒక్క ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు కాలేదు. ఆంధ్రప్రదేశ్ శాసన సభా ప్రాంగణంలో ఒక కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనతో సహా కొత్తగా ఆరు ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు 2011 మేలో ప్రభుత్వం పరిపాలనా అనుమతినిచ్చింది. కానీ, నిధుల కేటాయింపు/ భూ కేటాయింపు జరగని కారణంగా 2012 నవంబరు వరకూ వీటి ఏర్పాటు జరగలేదు.

**(ii)** నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10 చదరపు కిలో మీటర్లకూ ఒకటి చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 చదరపు కిలో మీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ స్టేషన్లు ఉండాలి. కానీ పట్టణ ప్రాంతాల్లో 16 నుండి 144 చదరపు కిలో మీటర్లకు ఒకటి చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 144 నుండి 1480 చదరపు కిలో మీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.

**(iii)** ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం, ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోనూ 50,000 జనాభా ఉండాలి. కానీ ఒక్కో ఫైర్ స్టేషన్ పరిధిలో 3 లక్షల జనాభా ఉంది.

**(iv)** 2012 నవంబరు నాటికి, రాష్ట్రంలోని 875 మండలాల్లో (మొత్తం మండలాలు:1,128[11]), 89 అసెంబ్లీ నియోజకవర్గాల్లో (మొత్తం నియోజకవర్గాలు: 294) ఒక్క ఫైర్ స్టేషనూ లేదు (వివరాలు *అనుబంధం 2.1*లో ఉన్నాయి).

**(v)** రద్దీ ప్రదేశాలు/అధిక జనాభా గల ప్రాంతాల్లో ఫైర్ స్టేషన్ల నిర్వహణకు ఈ శాఖ ప్రాధాన్యతనివ్వలేదు. ఆ వివరాలను ఈ కింద చర్చించడమైంది :

- వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధులతో చేపట్టేలా మార్కెటు యార్డులకు మాత్రమే ప్రత్యేకించిన 10 ఫైర్ స్టేషన్లను[12] ప్రభుత్వం మంజూరు చేసింది (2009 నవంబరు). ఈ పదింటిలో ఏడు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు ఇందుకోసం (2010 ఫిబ్రవరి - సెప్టెంబరు) ₹2.65 కోట్ల నిధులను డీజీఎఫ్ఎస్ వద్ద డిపాజిట్ చేసాయి. 2012 నవంబరు నాటికి ₹1.01 కోట్ల ఖర్చుతో అగ్నిమాపక యంత్ర వాహనాలకు 'చాసిస్'లను కొనుగోలు చేసారు. వీటి విడిభాగాలను కలిపే పని (ఫ్యాబ్రికేషన్) జరుగుతోంది. మిగతా ₹1.43 కోట్లు ఖర్చుకాకుండా డీజీఎఫ్ఎస్ దగ్గరే ఉన్నది. ఆశించిన లక్ష్యం నెరవేరలేదు.

---

[10] గ్రామీణ : 2.71 లక్షల చదరపు కిలోమీటర్లు, పట్టణ : 4,480 చదరపు కిలో మీటర్లు (2011 జనాభా లెక్కల ప్రకారం)

[11] రాష్ట్రంలోని మొత్తం మండలాల సంఖ్య పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ రికార్డుల ప్రకారం 1108 కాగా, అగ్నిమాపక సేవల శాఖ రికార్డుల ప్రకారం 1128

[12] ఆదిలాబాద్, భైంసా, గుంటూరు, జమ్మికుంట, కరీంనగర్, ఖమ్మం, కర్నూలు, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్

- తిరుపతి పుణ్యక్షేత్రంలో 6 లక్షల జనాభా ఉంది. ఈ క్షేత్రంలో సందర్శకుల జనాభా ప్రతి రోజూ సుమారు లక్ష వరకూ ఉంటుంది. బస్ టెర్మినళ్ళు, రైల్వే స్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో విపరీతంగా ఉండే రద్దీ, పెరుగుతున్న బహుళ అంతస్తుల హోటళ్ళ వలన అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటే తిరుపతి పట్టణ, గ్రామీణ, చుట్టు పక్కల ఉన్న మరో నాలుగు మండలాలకు 12 ఫైర్ స్టేషన్లు కావలసి ఉండగా, తిరుపతి[13] వద్ద ఉన్న ఒకే ఒక్క ఫైర్ స్టేషన్ వీటన్నింటికీ సేవలందిస్తోంది. తిరుపతి, తిరుమలలో కొత్తగా ఐదు ఫైర్ స్టేషన్లు ఏర్పాటుచేయడానికి నిధులను సమకూర్చాల్సిందిగా 2012 సెప్టెంబరులో తిరుమల తిరుపతి దేవస్థానాల(టీటీడీ) సంస్థను కోరామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 నవంబరు).

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ, కనీసం ఒక్క ఫైర్ స్టేషన్ కూడా లేని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2012-13 నుండి దశలవారీగా ఫైర్ స్టేషన్ల స్థాపనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని డీజీ ఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### *2.5.1.2 ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతులు*

చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, విశాఖపట్నం జిల్లాల్లోని ఫైర్ స్టేషన్లలో సరైన మౌలిక వసతులు లేకపోవడాన్ని గత ఆడిట్ నివేదికలో ప్రస్తావించడం జరిగింది. మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని (గతంలో తనిఖీ చేసిన జిల్లాలతో సహా) ఫైర్ స్టేషన్లలో 2007-12 మధ్యకాలంలో మౌలిక వసతుల్లో చెప్పుకోదగినంత అభివృద్ధి లేదు. ఆ వివరాలను ఈ కింద చర్చించడమైంది :

#### భూమి

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి-2006 ప్రకారం, ప్రతి ఫైర్‌స్టేషన్‌కు రెండు ఎకరాల భూమి కావాలి. ఇందులో ఒక భవనంతోపాటు, అగ్నిమాపక వాహనాలు, పరికరాలు సిబ్బందికి తగిన వసతి కల్పించాలి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లో 85 ఫైర్‌స్టేషన్లు ఉంటే, కేవలం 7 ఫైర్‌స్టేషన్లకు మాత్రమే (8 శాతం) ప్రమాణాల మేరకు రెండెకరాల భూమి ఉంది.

పట్టిక 2.3

| జిల్లా | మొత్తం ఫైర్ స్టేషన్లు | ఫైర్ స్టేషన్ల సంఖ్య | | | |
|---|---|---|---|---|---|
| | | రెండు ఎకరాలు ఉన్నవి | ఒకటి నుండి రెండు ఎకరాల మధ్య ఉన్నవి | ఎకరం కంటే తక్కువ ఉన్నవి | భూమి లేనివి |
| చిత్తూరు | 15 | 1 | 2 | 8 | 4 |
| హైదరాబాద్ | 12 | – | – | 6 | 6 |
| కృష్ణా | 21 | 2 | 3 | 15 | 1 |
| మహబూబ్‌నగర్ | 8 | 2 | 2 | 3 | 1 |
| రంగారెడ్డి | 6 | – | 2 | 3 | 1 |
| విశాఖపట్నం | 11 | – | 2 | 8 | 1 |
| వైఎస్ఆర్ (కడప) | 12 | 2 | 3 | 7 | - |
| **మొత్తం** | **85** | **7** | **14** | **50** | **14** |

*మూలం : జిల్లా అగ్నిమాపక అధికారుల రికార్డులు*

తమ విధుల నిర్వహణకు సరిపడేంత భూమిని పొందలేకపోవడమే కాకుండా, అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ తన భూములను ఇతర సంస్థలు ఆక్రమించుకోకుండా రక్షణ కల్పించుకోలేకపోయింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

[13] మరొకటి తిరుమలలో ఉంది

- ప్రహరీగోడను నిర్మించని కారణంగా నారాయణపేటలోని ఫైర్‌స్టేషన్ భూమి ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణకు గురయింది. రెవెన్యూ అధికార్లద్వారా భూమిని మరోసారి సర్వే చేయించమని మహబూబ్‌నగర్ డిఎఫ్ఓ నారాయణపేట ఫైర్‌స్టేషన్ అధికారిని 2011 ఆగస్టులో ఆదేశించినప్పటికీ 2012 జూన్ నాటికి సర్వే జరగలేదు.

- మలక్‌పేట ఫైర్‌స్టేషన్ తాలూకు ఖాళీ స్థలాన్ని జైళ్లశాఖ ఆక్రమించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు (2012 జూన్).

తమ శాఖ భూముల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని డీజీఎఫ్ఎస్ హామీ ఇచ్చారు (2012 నవంబరు).

### భవనాలు

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి-2006 ప్రకారం అగ్నిమాపక వాహనాలు, పరికరాలను సురక్షితంగా భద్రపరచడానికి ప్రతి ఫైర్‌స్టేషన్‌కు శాస్వత భవనం ఉండాలి. ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

రాష్ట్రంలో మొత్తం 253 ఫైర్‌స్టేషన్లు ఉండగా, అందులోని 30 ఫైర్‌స్టేషన్లకు భవనాలు లేవు, మచ్చుకు తనిఖీచేసిన ఏడు జిల్లాల్లోని 85 ఫైర్‌స్టేషన్లకుగానూ 17 ఫైర్‌స్టేషన్ల భవనాలు (20 శాతం) శిధిలావస్థలో ఉన్నాయి. మరో 6 ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలను నిలిపేందుకు వసతిలేదు. ఆ వైనాన్ని కింది ఫోటోలలో చూడవచ్చు.



*తాండూరు ఫైర్‌స్టేషన్‌లో ఆరుబయట నిలిపి ఉంచిన అగ్నిమాపక వాహనాలు **(2011 సెప్టెంబరు 17)***



*శిధిలావస్థలో ఉన్న గద్వాల ఫైర్‌స్టేషన్ భవనం **(2011నవంబరు 10)***

- చిత్తూరు జిల్లాలో 2004 లో నాలుగు ఫైర్‌స్టేషన్లను[14] ఏర్పాటు చేసారు. కానీ, 2012 నవంబరు నాటికి వీటికి శాశ్వత భవనాల సదుపాయం కల్పించలేదు. ఈ ఫైర్‌స్టేషన్లలోని వాహనాలు, పరికరాలను ఉంచేందుకు సరైన వసతిలేక ఇవి వాతావరణ మార్పుల దుష్ప్రభావానికి గురవుతున్నాయి.

ఫైర్ స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం 2012-13 ఆర్థిక సంవత్సరంలో కేటాయించినందున ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### నీటి వనరులు

ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం, ఫైర్‌స్టేషన్ విధుల నిర్వహణకు నిరంతరం నీటి సరఫరా ఉండటం అత్యంత ఆవశ్యకం. ప్రతి ఫైర్‌స్టేషన్‌లోనూ ప్రభావవంతమైన విధి నిర్వహణకు 25,000 లీటర్ల సామర్థ్యంగల నీటి ట్యాంకులు, బోరుబావి, విద్యుత్తు మోటార్లు ఉండటం అత్యవసరం.

[14] నగరి, వాయల్‌పాడు(వాల్మీకిపురం), పాకాల, ములకల చెరువు

మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని 85 ఫైర్‌స్టేషన్లకుగానూ, 9[15] ఫైర్‌స్టేషన్లకు (11 శాతం) మాత్రమే వాటి ప్రాంగణంలో నీటి సదుపాయం ఉంది; 51 ఫైర్‌స్టేషన్లు (60 శాతం) తమ నీటి అవసరాలకు 2 కి.మీ.పైగా దూరంలో ఉన్న సాగునీటి కాల్వలు, ఇతర వనరులనుండి నీటిని తీసుకుంటున్నాయి.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ, మొత్తం 253 ఫైర్‌స్టేషన్లకు నీటి ట్యాంకుల నిర్మాణం, బోరుబావుల తవ్వకం, విద్యుత్తుమోటార్లు మొదలైన వాటికి 2012-13 సంవత్సరానికి ప్రభుత్వం తగిన నిధులను కేటాయించిందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

## పరికరాలు

అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సంబంధిత సామాగ్రి సరిపడినంతగానూ, సిద్ధంగానూ ఉండటమనేది కీలకమైన అంశాల్లో ఒకటి. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం ప్రతి 50,000 జనాభాకు ఒక అగ్ని మాపక వాహనం, 3 లక్షల జనాభాకు ఒక రక్షణ వాహనం (రెస్క్యూ వ్యాన్), 10 లక్షల అదనపు జనాభాకు మరొక రక్షణ వాహనం చొప్పున ఉండాలి.

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని అతిముఖ్యమైన నాలుగు నగరాల్లో జనాభా ప్రాతిపదికన 163 అగ్ని మాపక వాహనాలు అవసరంకాగా, కేవలం 24 అగ్ని మాపక వాహనాలు మాత్రమే ఉన్నాయి (కొరత : 85 శాతం). 10 రక్షణ వాహనాలు అవసరంకాగా, ఒక్కటి మాత్రమే ఉంది. ఆ వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

**పట్టిక 2.4**

| నగరం | జనాభా* (లక్షల్లో) | అగ్నిమాపక వాహనాలు | | | రక్షణ వాహనాలు | | |
|---|---|---|---|---|---|---|---|
| | | R | A | S | R | A | S |
| హైదరాబాద్ | 55.34 | 110 | 12 | 98 | 6 | 1 | 5 |
| విశాఖపట్నం | 13.29 | 26 | 5 | 21 | 2 | - | 2 |
| విజయవాడ | 10.11 | 20 | 5 | 15 | 1 | - | 1 |
| తిరుపతి | 3.50 | 7 | 2 | 5 | 1 | - | 1 |
| **మొత్తం** | | **163** | **24** | **139** | **10** | **1** | **9** |

* 2001 జనాభా లెక్కల ప్రకారం; R: ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం అవసరమైనవి; A: ఉన్నవి; S: కొరత

*మూలం : జిల్లా అగ్నిమాపక అధికారుల రికార్డులు*

ఐతే, ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన ఫైర్‌స్టేషన్లన్నింటిలోనూ శ్వాస ఉపకరణాలు, డ్రాగన్ లైట్లు, రక్షణ చర్యల్లో వాడే తాళ్లు మొదలైనవి అందుబాటులో ఉన్నాయి.

### *(ఎ) అగ్నిమాపక వాహనాలు*

- విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్‌లోని ఫైర్‌స్టేషన్‌లో 2005 నుండి అగ్ని మాపక వాహనం లేదు. నీళ్లు నింపడానికి, వదలడానికి ఒక పోర్టబుల్ పంపుతో కూడిన ఒక నీళ్ల ట్యాంకరు లారీతోనే ఈ ఫైర్‌స్టేషన్ తన విధులను నిర్వర్తిస్తోంది. అధిక జనసాంద్రతగల విజయవాడ వంటి నగరంలో అగ్ని మాపక వాహనం లేకుండా ఫైర్‌స్టేషన్‌ను నిర్వహించడం అత్యంత ప్రమాదకరం.
- చిత్తూరు జిల్లాలోని ములకల చెరువు, కృష్ణాజిల్లాలోని కంచికచర్ల ఫైర్‌స్టేషన్లలో అగ్ని మాపక వాహనాలను నిరర్థకమైనవిగా 2009లో నిర్ధారించారు. కానీ, 2012 జూన్ నాటికీ వీటి స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టలేదు; అత్యవసర పరిస్థితుల్లో 5 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న ఫైర్‌స్టేషన్లనుండి అగ్ని మాపక వాహనాలను పిలుస్తున్నారు.

---
[15] కృష్ణా-4, మహబూబ్‌నగర్-1, రంగారెడ్డి-1, వైఎస్ఆర్ (కడప)-3

- పైన ప్రస్తావించిన ప్రదేశాల్లో 2007-12 మధ్యకాలంలో భారీ అగ్నిప్రమాదాలు సంభవించి ₹7.82 కోట్ల విలువగల ఆస్తికి నష్టం వాటిల్లింది. (అజిత్‌సింగ్‌నగర్ : ₹7.35 కోట్లు, ములకల చెరువు : ₹0.31 కోట్లు, కంచికచర్ల : ₹0.15 కోట్లు). ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలు లేనందువలన నష్టాన్ని తగ్గించడం సాధ్యపడలేదు.

అగ్నిమాపక వాహనాల కొనుగోలుకు 2012-13 లో ప్రభుత్వం నిధులను కేటాయించిందనీ, వాటి కొనుగోలు తాలూకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### (బి) స్కై లిఫ్టులు

అగ్నిమాపక, అత్యవసర సేవలశాఖ 2009 మార్చిలో ₹9.95 కోట్ల ఖర్చుతో మూడు బ్రాంటో స్కైలిఫ్టులను[16] కొనుగోలుచేసి సికింద్రాబాద్, విశాఖపట్నం, రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ (హైదరాబాద్)ల వద్ద వీటిని ఉంచింది. ఈ లిఫ్టులను వాటి పూర్తి సామర్థ్యం మేరకు ఉపయోగించాలంటే 14,000 లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంగల హై ప్రెజర్ పంపుతో కూడిన అగ్నిమాపక యంత్రం(ఫైర్ టెండర్) కావాలి. ఐతే, హై ప్రెజర్ పంపుతో కూడిన ఒక్క ఫైర్ టెండర్‌ను మాత్రమే డిపార్టుమెంటు కొనుగోలు చేసింది (2009 జూలై).

ఈ పరికరాలను కొనుగోలుచేసే బాధ్యతను ఏపీహెచ్ఎమ్‌హెచ్ఐడీసీ[17] కి అప్పగించగా, ఈ సంస్థ 2010 అక్టోబరులో నిధులను డిపార్టుమెంటుకు వాపసు చేసింది. డీజీఎఫ్ఎస్ కొనుగోలు ప్రక్రియను 2011 నవంబరులో ప్రారంభించగా 2012 నవంబరు నాటికీ ఫైర్ టెండర్ల కొనుగోలు పూర్తికాలేదు.

బ్రాంటో స్కైలిఫ్టుల సహాయంతో నిర్వహించే అగ్నిమాపక సేవలకు కొనుగోలు చేయాల్సిన ఫైర్ టెండర్లకు సంబంధించి ఎలాంటి ప్రమాణాలనూ నిర్దేశించలేదని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు). బ్రాంటో స్కైలిఫ్టులకు (54 మీటర్ల ఎత్తుకు) నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యంగల వాటర్ టెండర్ కావాలని ఫైర్ టెండర్ల ఫ్యాబ్రికేషన్‌కు సంబంధించిన టెక్నికల్ బిడ్ స్పెసిఫికేషన్లలో డిపార్టుమెంటు పేర్కొనడం జరిగింది. కాబట్టి డీజీఎఫ్ఎస్ సమాధానం అంగీకారయోగ్యంకాదు.

### (సి) ప్రథమ చికిత్స కిట్లు

మంటలనార్పే ప్రక్రియ ప్రమాదంతో కూడుకున్నది కాబట్టి అగ్ని మాపక వాహనంలో ప్రథమ చికిత్స కిట్ ఉండడమనేదికూడా ఒక ప్రధాన అవసరం. మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాలోని ఏ ఒక్క ఫైర్‌స్టేషన్‌లోనూ అగ్ని మాపక వాహనంతోపాటుగా ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

నిధుల లభ్యతను బట్టి భవిష్యత్‌లో ప్రథమ చికిత్స కిట్లను కొనుగోలు చేస్తామని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### సిబ్బంది నివాస గృహాలు

ఫైర్‌స్టేషన్ల ప్రాంగణంలోనే సిబ్బందికి నివాసగృహాలను కేటాయించి అన్ని సమయాల్లోనూ వారి సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాలు నిర్దేశిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి ప్రకారం, అగ్నిమాపక సేవల సిబ్బందికి అద్దె వసూలు చేయకుండా ఉచిత వసతిని ఏర్పాటు చేయాలి.

[16] వోల్వో ఎఫ్ఎమ్ 340 6X4 చాసిస్‌పై ఉంచిన హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్ కమ్ టర్న్‌టేబుల్ ల్యాడర్ (నిచ్చెన)

[17] ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య, గృహ నిర్మాణ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ. ఈ సంస్థ పేరును 2011 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలికవసతుల అభివృద్ధి సంస్థగా మార్చారు

రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిలో తప్ప మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని మరే ఇతర ఫైర్‌స్టేషన్లలోనూ సిబ్బంది నివాసానికి స్టాఫ్ క్వార్టర్లు లేవు. ఈ రెండు ఫైర్‌స్టేషన్లలోని స్టాఫ్ క్వార్టర్లు శిథిలావస్థలో ఉన్న కారణంగా వీటినికూడా నివాసానికి వినియోగించడంలేదు.

పై ఆడిట్ పరిశీలనలను డీజీ ఎఫ్ఎస్ అంగీకరించారు. నిధుల కొరత వలన స్టాఫ్ క్వార్టర్లను నిర్మించలేక పోయామని, దీనికి సంబంధించి తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు (2012 నవంబరు).

### విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు

ప్రతి ఫైర్‌స్టేషన్‌లోనూ కనీస సౌకర్యాలతో కూడిన ఒక విశ్రాంతి గది ఉండాలని ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాలు, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి నిర్దేశిస్తున్నాయి.

మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని 85 ఫైర్‌స్టేషన్లకుగానూ, 21 ఫైర్‌స్టేషన్లలో (25 శాతం) విశ్రాంతి గదులు లేవు; 22 ఫైర్‌స్టేషన్లలో (25 శాతం) మరుగుదొడ్లు లేవు ; మిగిలిన ఫైర్‌స్టేషన్లలో ఉన్న విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు కింది ఫోటోలలో చూపిన విధంగా ఉపయోగకర పరిస్థితిలో లేవు.



*పరిగి ఫైర్ స్టేషన్‌లోని విశ్రాంతి గది (2011 సెప్టెంబరు 17)*



*నర్సీపట్నం ఫైర్ స్టేషన్‌లోని మరుగుదొడ్డి (2012 జనవరి 4)*

ఫైర్‌స్టేషన్లకు భవనాలతోపాటు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లను నిర్మించడానికి 2012-13 లో ప్రభుత్వం నిధులను కేటాయించినందున త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### సమాచార వ్యవస్థ

అగ్ని ప్రమాదం జరుగుతున్న ప్రదేశానికి వీలైనంత తొందరగా చేరుకోగలగడాన్నిబట్టి అగ్నిమాపక సేవల సమర్థత వెల్లడవుతుంది. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 5 నిముషాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిముషాల్లోనూ చేరుకోగలగాలి.

దీనికి సంబంధించి, ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- అగ్ని ప్రమాదానికి గురైనచోటును ఖచ్చితంగా గుర్తించేందుకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీ పీఎస్) డిపార్టుమెంటు వద్ద లేదు. డీజీఎఫ్ఎస్ ఈ విషయాన్ని అంగీకరిస్తూ నిధులు అందుబాటులో ఉంటే భవిష్యత్‌లో దీన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు.

- విపత్తులనెదుర్కొనే చర్యల నిర్వహణ వ్యూహంలో భాగంగా అత్యధిక పౌనఃపున్యం (వీహెచ్ఎఫ్) గల సమాచార అనుసంధాన వ్యవస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం ₹4.33 కోట్లు మంజూరు చేసింది (జనవరి/ ఫిబ్రవరి 2009). డిపార్టుమెంటు 10,567 వీహెచ్ఎఫ్ సెట్లను 2009 ఫిబ్రవరి/మార్చిలో కొనుగోలు చేసి, రాష్ట్రంలోని జిల్లా అగ్నిమాపక సేవల అధికారులందరికీ 2009 నవంబరు-2010 ఏప్రిల్ మధ్య పంపిణీ చేసింది. అన్ని ఫైర్‌స్టేషన్లలోనూ వీహెచ్ఎఫ్ సెట్లను వినియోగిస్తున్నామని డీజీ ఎఫ్ఎస్ తన సమాధానం

(2012 నవంబరు)లో పేర్కొన్నప్పటికీ, లైసెన్సులు రాని కారణంగా మచ్చుకు తనిఖీ చేసిన ఫైర్‌స్టేషన్లలో విజయవాడ నగరంలో తప్ప మరే ఇతర ఫైర్‌స్టేషన్‌లోనూ వీహెచ్‌ఎఫ్ సెట్లను వినియోగించడంలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

అగ్నిమాపక సేవలు, విపత్తుల స్పందన శాఖ, పరికరాలను కొనుగోలు చేయడానికి ముందే లైసెన్సులను పొందే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టకపోవడం వలన రాష్ట్రమంతా సమాచార అనుసంధాన వ్యవస్థను నెలకొల్పాలన్న లక్ష్యం నెరవేరకపోగా దీనిపై పెట్టిన పెట్టుబడి నిష్ఫలమయింది.

## 2.5.2 అగ్ని మాపక సేవల నిర్వహణ

### *2.5.2.1 ఫైర్ కాల్స్‌కు స్పందన*

ఫైర్ కాల్స్‌కు గరిష్ఠ స్పందన సమయాన్ని అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల్లో 5 నిముషాలుగానూ, అభివృద్ధి చెందని గ్రామీణ ప్రాంతాల్లో 20 నిముషాలుగానూ ఎస్ఎఫ్ఏసీ సిఫార్సు చేసింది.

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఫైర్‌స్టేషన్లలోని అగ్నిమాపక సేవల నివేదికలను తనిఖీ చేయగా కిలోమీటరుకు రెండు నిముషాల చొప్పున లెక్కించి స్పందన సమయాన్ని తెలిపేచోట రాసారని వెల్లడైంది. రోడ్డు పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ వంటి వివిధ అంశాల ఆధారంగా ఒక్కొక్క కేసులోనూ వాస్తవంగా పట్టిన సమయాన్ని నమోదు చేయలేదు. పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదాలు[18], పెద్ద అగ్ని ప్రమాదాలలో 362 సంఘటనలను ఆడిట్‌లో సమీక్షించగా 66 (18 శాతం) కేసులలో నిర్దేశిత 5 నిముషాలలోపే స్పందన సమయం నమోదయ్యింది. మిగిలిన 296 కేసులలో స్పందన సమయం 6 నుండి 70 నిముషాలు (బహదూర్‌గూడ, హైదరాబాద్) వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన 492 అగ్ని ప్రమాదాలకుగానూ 137 (28 శాతం) కేసులలో నిర్దేశిత 20 నిముషాల లోపు, మిగిలిన 355 కేసులలో 28 నిముషాలనుండి 152 నిముషాలు (పెబ్బేరు మండలం, తాటిపాముల) వరకు స్పందన సమయం నమోదయ్యింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరాలవారీగా కేసుల వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

పట్టిక 2.5

పట్టణ ప్రాంతాలు

| సంవత్సరం | మచ్చుకు తనిఖీ చేసిన కేసులు | స్పందన సమయం నిర్దేశిత 5 నిముషాలలోపు ఉన్నవి (శాతం) | స్పందన సమయంలో జాప్యం ఉన్నవి | | | |
|---|---|---|---|---|---|---|
| | | | 6-10 నిముషాలు (శాతం) | 11-20 నిముషాలు (శాతం) | 21-30 నిముషాలు (శాతం) | 30 నిముషాలకు పైగా (శాతం) |
| **2006** | 67 | 8 (12) | 27 (40) | 24 (36) | 5 (7) | 3 (4) |
| **2007** | 75 | 12 (16) | 28 (37) | 25 (33) | 7 (9) | 3 (4) |
| **2008** | 90 | 12 (13) | 29 (32) | 37 (41) | 10 (11) | 2 (2) |
| **2009** | 66 | 18 (27) | 19 (29) | 18 (27) | 4 (6) | 7 (11) |
| **2010** | 48 | 14 (29) | 10 (21) | 20 (42) | - | 4 (8) |
| **2011** | 16 | 2 (13) | 5 (31) | 4 (25) | 4 (25) | 1 (6) |
| మొత్తం | **362** | **66 (18)** | **118 (33)** | **128 (35)** | **30 (8)** | **20 (6)** |

[18] ఘోర అగ్ని ప్రమాదాలు: ₹10 లక్షల నుండి ₹25 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు లేదా ఆస్తి నష్టం తీవ్రతతో సంబంధం లేకుండా, ప్రాణ నష్టం జరిగిన సంఘటనలు పెద్ద అగ్ని ప్రమాదాలు: ₹ 25 లక్షలు, అంతకంటే ఎక్కువ ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు

గ్రామీణ ప్రాంతాలు

| సంవత్సరం | మచ్చుకు తనిఖీ చేసిన కేసులు | స్పందన సమయం నిర్దేశిత 20 నిముషాలలోపు ఉన్నవి (శాతం) | స్పందన సమయంలో జాప్యం ఉన్నవి | | |
|---|---|---|---|---|---|
| | | | 21-30 నిముషాలు (శాతం) | 31-60 నిముషాలు (శాతం) | 60 నిముషాలకు పైగా (శాతం) |
| 2006 | 66 | 20 (30) | 14 (21) | 23 (35) | 9 (14) |
| 2007 | 90 | 16 (18) | 26 (29) | 28 (31) | 20 (22) |
| 2008 | 90 | 18 (20) | 21 (23) | 36 (40) | 15 (17) |
| 2009 | 90 | 27 (30) | 32 (36) | 24 (27) | 7 (8) |
| 2010 | 84 | 24 (29) | 22 (26) | 32 (38) | 6 (7) |
| 2011 | 72 | 32 (44) | 18 (25) | 19 (26) | 3 (4) |
| మొత్తం | 492 | 137 (28) | 133 (27) | 162 (33) | 60 (12) |

*మూలం : జిల్లా అగ్ని మాపక సేవల అధికారులు*

(i) పనిభారం అధికంగా ఉండటం, (ii) అత్యంత ప్రముఖుల పర్యటనలు, జాతరలు, ప్రదర్శనల సమయంలో ముందు జాగ్రత్త చర్యల విధులకు హాజరు కావడం, (iii) ఫైర్ స్టేషన్లు సరిపడినన్ని లేకపోవడంవలన స్పందన సమయం ఎక్కువగా ఉందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### *2.5.2.2 భద్రతా ప్రమాణాల అమలు*

భద్రతా ప్రమాణాలను అమలు చేయడం, అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, ముఖ్యంగా ప్రమాదకర పరిస్థితులున్న ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలను బాగా తగ్గించడం అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ విధుల్లో ఒక కీలకమైన అంశం.

#### అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన భద్రతా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం

అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రమాదకర ప్రాంగణాలను గుర్తించి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించే విషయంలో డీఎఫ్ఓలు, ఏడీఎఫ్ఓలు, ఎస్ఎఫ్ఓలకు డీజీఎఫ్ఎస్ నెలవారీ లక్ష్యాలను నిర్ణయిస్తారు. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (వైఎస్ఆర్ (కడప) జిల్లాలోనూ, హైదరాబాద్ జిల్లాలో కొన్ని కేసులూ తప్ప) ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతల గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టినట్లు చూపే ఆధారాలను అగ్నిమాపక సేవల శాఖ సమర్పించలేదు.

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టంలోని 8వ సెక్షను ప్రకారం, ప్రజలనుండి వాలంటీర్లను చేర్చుకోవడం ద్వారా సహాయక సేవలను(ఆక్జిలరీ సర్వీసులు) పెంపొందించుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో, అంటే, ప్రమాదం సంభవించిన వెనువెంటనే అగ్నిమాపక సేవల శాఖ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకోకముందే ఈ వాలంటీర్లు మంటలనార్పే పని చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నియంత్రించాలి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ 2012 నవంబరు నాటికి సహాయక సేవల ఏర్పాటు జరగలేదని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

అగ్ని ప్రమాదాల గురించి సకాలంలో సమాచారమందించిన వారికీ, మంటలను ఆర్పే చర్యలోనూ రక్షణ కార్య కలాపాల్లోనూ అగ్నిమాపక సేవల శాఖ సిబ్బందికి సహాయపడిన వారికీ బహుమతులివ్వాలని కూడా ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం నిర్దేశిస్తోంది. ఐతే, ఆడిట్ నిర్వహించిన జిల్లాల్లోని ఏ ఒక్క డీఎఫ్ఓఅలాంటి వారిని గుర్తించడంకానీ, అగ్ని ప్రమాదాల నివారణ, భద్రత చర్యల్లో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించడానికి వారికి బహుమతులనివ్వడంగానీ చేయలేదు.

## ప్రమాదకర ప్రాంగణాల తనిఖీ, లైసెన్సుల జారీ

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని నియమం18 (2), ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం - 1999 లోని 15వ సెక్షను ప్రకారం, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారమున్న ప్రాంగణాల యజమాని/అందులో నివసించే వ్యక్తి నిర్దేశిత రుసుము చెల్లించి సంబంధిత అధికారి నుండి లైసెన్సును పొందాలి. అంతేకాక, అగ్నిమాపక సేవల శాఖ ప్రమాదకర ప్రాంగణాలన్నింటినీ తనిఖీచేసి భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారనే విషయాన్ని రూఢీ చేసుకోవాలి.

ఎంపిక చేసుకున్న ఏడు జిల్లాల్లో, ప్రమాదకర ప్రాంగణాల తనిఖీలు, లైసెన్సుల జారీలకు సంబంధించి ఆడిట్ పరిశీలనలో ఈ కింది విషయాలను గమనించడమైంది :

- ఏదైనా సర్వే చేపట్టడం ద్వారాకానీ, వైద్య, విద్య, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, రెవెన్యూ, పౌర సరఫరాలు మొదలైన ప్రభుత్వ శాఖల సమన్వయంతోకానీ డీఎఫ్ఓలు తమ పరిధిలోని ప్రమాదకర ప్రాంగణాలను గుర్తించడంకానీ వాటి వివరాలను పొందడంకానీ చేయలేదు. కొన్ని జిల్లాల్లో ప్రమాదకర ప్రాంగణాలను పాక్షికంగా గుర్తించినప్పటికీ మరికొన్ని జిల్లాల్లో వీటిని గుర్తించే ప్రయత్నమేదీ చేయలేదు. వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| | |
|---|---|
| హైదరాబాద్ జిల్లా | 363 విద్యా సంస్థలు, 91 ఆసుపత్రులు, 69 థియేటర్లను గుర్తించారు. |
| విశాఖపట్నం జిల్లా | షాపింగ్ మాళ్లు, డిపార్టుమెంటల్ స్టోర్లను గుర్తించలేదు. |
| వైఎస్ఆర్ (కడప) జిల్లా | 464 విద్యా సంస్థలు, 40 ఆసుపత్రులు, 69 థియేటర్లను గుర్తించారు. |
| చిత్తూరు, కృష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు | ప్రమాదకర ప్రాంగణాల గుర్తింపు జరగలేదు. |

- రాష్ట్రంలో 50,007 ప్రాంగణాలను ప్రమాదకరమైనవిగా గుర్తించగా, డీఎఫ్ఓలు 19,129 (38 శాతం) ప్రాంగణాలను మాత్రమే తనిఖీచేశారు. ప్రమాదకర ప్రాంగణాలుగా గుర్తించిన కళాశాలలు, పాఠశాలలు, హోటళ్ళు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, షోరూమ్‌లు మొదలైన వాటిలో తనిఖీలు జరిగింది 9 నుండి 48 శాతం. వివరాలను ఈ కింద ఇవ్వడమైంది.

పట్టిక 2.6

| క్యాటగిరి | ప్రమాదకర ప్రాంగణాల సంఖ్య | |
|---|---|---|
| | గుర్తించినవి | డీఎఫ్ఓలు తనిఖీ చేసినవి (శాతం) |
| కళాశాలలు | 11875 | 2377 (20) |
| పాఠశాలలు | 9716 | 4629 (48) |
| హోటళ్ళు | 1674 | 772 (46) |
| ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు (15 మీటర్లకంటే తక్కువ) | 2712 | 1006 (37) |
| చిన్న తరహా పరిశ్రమలు | 5048 | 1408 (28) |
| భారీ, మధ్యతరహా పరిశ్రమలు | 1887 | 335 (18) |
| ఔషధ పరిశ్రమలు | 130 | 22 (17) |
| జ్యూట్ మిల్లులు | 69 | 25 (36) |
| కమర్షియల్ షోరూమ్‌లు | 689 | 124 (18) |
| టింబరు డిపోలు/సా మిల్లులు | 2093 | 784 (37) |
| టోకు వర్తక దుకాణాలు | 2286 | 215 (9) |
| ఫంక్షన్ హాళ్ళు | 1486 | 606 (41) |

*మూలం: డీజీఎఫ్ఎస్ రికార్డులు*

- ప్రమాదకర ప్రాంగణాలకు లైసెన్సుల మంజూరుకోసం తమంతట తాముగా ముందుకువచ్చిన యజమానులు/ నివాసితుల నుండి మాత్రమే లైసెన్సు ఫీజును వసూలు చేసారు. లైసెన్సు ఫీజుల వసూలు, నవీకరణలకు సంబంధించి డిమాండు, వసూలైన, బకాయి ఉన్న మొత్తాల వివరాలను నమోదు చేయాల్సిన డీసీబీ రిజిస్టర్లను డీఎఫ్ఓలు నిర్వహించలేదు.

ప్రమాదకర ప్రాంగణాలను తనిఖీచేయడం, అగ్నిప్రమాదాల నివారణకు భద్రతాపరంగా చేపట్టాల్సిన చర్యల్లో లోపాలుంటే వాటిని సరిదిద్దేందుకు నోటీసులను జారీచేయడం, భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించేవారిని ప్రాసిక్యూట్ చేసేందుకు చర్యలు చేపట్టడంలో నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు). ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదకర పరిస్థితులున్న భవనాలను గుర్తించాలని, డీసీబీ రిజిస్టర్లను నిర్వహించాలని సంబంధిత డీఎఫ్ఓలకు ఆదేశాలు జారీ చేశామనికూడా డీజీఎఫ్ఎస్ తెలిపారు.

### ఎత్తైన భవనాలకు నిరభ్యంతర పత్రాల జారీ

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లో నిర్దేశించిన ప్రకారం, వాణిజ్య ప్రయోజనాలకు 15 మీటర్లకంటే ఎత్తైన భవనాలు, నివాసం కోసం 18 మీటర్లు, అంతకుమించి ఎత్తైన భవనాలు, 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం, 6 మీటర్లు కంటే ఎక్కువ ఎత్తున్న సినిమాహాళ్ళవంటి జన సమ్మర్దం అధికంగా ఉండే భవనాలు నిర్మించతలపెట్టిన వ్యక్తులు అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖనుండి నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) పొందాలి. దరఖాస్తు అందిన 60 రోజులలోపు అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ నిర్మాణ స్థలాన్ని తనిఖీచేసి ఏడాదిపాటు చెల్లుబాటులో ఉండే తాత్కాలిక నిరభ్యంతర పత్రాన్ని (ప్రొవిజనల్ ఎన్ఓసీ) జారీ చేయాలి. అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ సూచించిన విధంగా నిర్మాణంలో మార్పులు, భద్రతా పరికరాల ఏర్పాటు జరిగిన తర్వాత ఆ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌ను జారీ చేయాలి. చట్ట నిబంధనలను పాటించారని నిర్ధారించుకోవడానికి చేసే పర్యవేక్షణకు వీలుకల్పించేలా వాచ్ రిజిస్టర్లను నిర్వహించాలి.

ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- జారీ చేసిన ఎన్ఓసీలు, వాటి నవీకరణ, బ్యాంకు గ్యారంటీలు, డీసీబీలగురించి మహబూబ్‌నగర్ జిల్లాలో తప్ప మరెక్కడా డిపార్టుమెంటు వాచ్ రిజిస్టర్లను నిర్వహించలేదు. దీనివల్ల జారీ చేసిన ఎన్ఓసీలు, నవీకరించినవి, ఇంకా నవీకరించాల్సినవి ఎన్నన్న విషయాన్ని ఆడిట్‌లో నిర్ధారించుకోవడం వీలుకాలేదు.
- బహుళ అంతస్తుల భవనాలకు ఎన్ఓసీలను డీజీఎఫ్ఎస్ నేరుగా జారీ చేసినందువల్ల మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని డీఎఫ్ఓలకు తమ పరిధిలో ఎన్ఓసీలు జారీ అయిన బహుళ అంతస్తుల భవనాల గురించి తెలియదు.
- ఎత్తైన భవనాలు నిర్మించాలని ప్రతిపాదించిన వ్యక్తులు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతలకోసం ఏర్పాట్లు చేయడాన్ని రూఢీ చేసుకునేందుకు వారివద్దనుండి బ్యాంకు గ్యారంటీలను తీసుకోవడం జరుగుతుంది. కానీ, ఈ బ్యాంకు గ్యారంటీల (బీజీలు) చెల్లుబాటు గడువును గమనించేందుకు డీజీఎఫ్ఎస్ ఎలాంటి వాచ్ రిజిస్టర్లను నిర్వహించడం లేదు. 2007-12 మధ్యకాలంలో ₹4.28 కోట్ల విలువగల 14 బీజీలకు చెల్లుబాటు గడువు ముగిసిపోయింది. సంబంధిత భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు ఇంకా జారీ చేయలేదు. కానీ, 2012 జూన్ నాటికి ఈ బీజీల చెల్లుబాటును నవీకరించలేదు.
- విశాఖపట్నం ప్రాంతీయ విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, నివేదిక ఆధారంగా 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న 145 బహుళ అంతస్తుల భవనాలను (నివాసాలకోసం నిర్మించినవి) తనిఖీ చేయమని విశాఖపట్నం డీఎఫ్ఓను 2007 నవంబరులో డీజీఎఫ్ఎస్ ఆదేశించారు. 125 బహుళ అంతస్తుల భవనాలు ఎన్ఓసీలను పొందలేదనీ, నేషనల్ బిల్డింగ్ కోడ్‌లో నిర్దేశించిన విధంగా అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతా ప్రమాణాలను ఇవి పాటించలేదనీ డీఎఫ్ఓ తన నివేదికలో పేర్కొన్నారు (2007 డిసెంబరు). అగ్ని మాపక

సేవల జాగ్రత్తలకు సంబంధించిన ఫీజు ₹44.58 లక్షలు[19] వసూలు చేయలేదని కూడా తెలిపారు. ఐతే, డీఎఫ్ఓ నివేదికపై 2012 నవంబరు నాటికి డీజీఎఫ్ఎస్ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

ఎన్ఓసీలు జారీ చేసిన ప్రాంగణాలన్నింటినీ ప్రస్తుత సంవత్సరం (2012-13) లో తనిఖీ చేస్తామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

హైదరాబాద్ నగరంలోని రెండు బహుళ అంతస్తుల భవన సముదాయాల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ఆడిట్ పరిశీలనలో ఈ కింది లోపాలను గమనించడమైంది :

**(i)** మల్టీప్లెక్స్ థియేటర్లు, దుకాణాల సముదాయంతో కూడిన బహుళ అంతస్తుల భవనానికి డీజీ ఎఫ్ఎస్ 2005 నవంబరులో ప్రొవిజనల్ ఎన్ఓసీ జారీ చేసారు. బిల్డరు నిర్దేశిత నిబంధనలను పాటించని కారణంగా, 2006 మేలో దీన్ని రద్దు చేసారు. ఐతే, అగ్నిమాపక సేవల శాఖ ఎన్ఓసీని రద్దు చేసిందన్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా 2007 జూన్‌లో జీ హెచ్ఎమ్‌సీ[20] బిల్డరుకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. యాడ్ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు ఈ భవనంలోని నాలుగో అంతస్తులో మూడు తెరలకు (రెండవ, మూడవ, నాలుగవ తెరలకు) సినిమా ప్రదర్శనకు హోమ్ శాఖ 2008 మార్చిలో అనుమతిస్తూ మరోసారి సమీక్షించిన తర్వాత ఒకటవ తెరకు లైసెన్సు మంజూరు చేస్తామని షరతు విధించింది. దీని ఆధారంగా లైసెన్సు జారీచేసే అధికారి అయిన పోలీసు కమీషనరు మూడు తెరలకు 2008 మేలో లైసెన్సు జారీ చేసారు. ఐతే, అగ్ని ప్రమాదాల నివారణ, భద్రత ఏర్పాట్లు లోపభూయిష్టంగా ఉన్నాయని గమనించిన డీజీఎఫ్ఎస్ ఈ భవనానికి ఇచ్చిన ఓసీని తాత్కాలికంగా ఉపసంహరించే అంశాన్ని పరిగణించాలని 2011 జూన్‌లో ప్రభుత్వానికి సూచించారు. ఐతే, 2012 జూన్ నాటికి ఓసీని రద్దు చేయలేదు. ఈ బహుళ అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదాల నివారణ కోసం భద్రతా ఏర్పాట్లు అమలయ్యేలా చూసేందుకు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఫైర్ ప్రికాషన్ ఫీజు, నిర్మాణం జరిగిన రోజునుండి అగ్ని మాపక సేవల శాఖ నుండి ఎన్ఓసీ పొందేనాటి వరకు/సాలుకు 24 శాతం చొప్పున అపరాధ వడ్డీని వసూలు చేసేందుకు కూడా చర్యలు చేపట్టలేదు. ఈ అంశాలను ఆడిట్‌లో లేవనెత్తినపుడు వీటిని పరిష్కరిస్తామని డీజీ ఎఫ్ఎస్ హామీ ఇచ్చారు.

**(ii)** నాలుగు తెరల మల్టీప్లెక్స్ థియేటరు ఉన్న 'హైదరాబాద్ సెంట్రల్' అనే బహుళ అంతస్తుల షాపింగ్ మాల్‌కు నిర్దిష్ట నిబంధనలను బిల్డరు పాటిస్తే, ఎన్ఓసీ జారీ చేయని హోమ్ శాఖ 2005 నవంబరులో డీజీఎఫ్ఎస్‌ను ఆదేశించింది[21]. ప్రభుత్వం నిర్దేశించిన షరతులను పేర్కొనకుండానే అగ్ని మాపక సేవల శాఖ ఎన్ఓసీని జారీచేసింది. మూడు తెరలపై (ఒకటవ, రెండవ, ఐదవ తెరలపై) సినిమా ప్రదర్శనలకు మాత్రమే ఎన్ఓసీని జారీ చేయడమైందని, మూడవ, నాలుగవ తెరలపై సినిమా ప్రదర్శనలు జరగటం లేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఇది ప్రత్యేకంగా సినిమా థియేటరుగా మాత్రమే ఉన్న భవనంకాదు; పై అంతస్తులో ఐదు థియేటర్లు ఉన్న ఎనిమిది అంతస్తుల భవనం. జాతీయ భవన నిర్మాణాల స్మృతి (నేషనల్ బిల్డింగ్ కోడ్) 1990లో నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా మాత్రమే ఇలాంటి భారీ నిర్మాణానికి ఎన్ఓసీని జారీచేయాలి. ఈ కేసులో, నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా, ఆంధ్రప్రదేశ్ సినిమాల (నియంత్రణ) నియమావళి-1970 కింద ఎన్ఓసీని జారీ చేసారు. కానీ ఇది ఈ కేసుకు వర్తించదు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు సంబంధించిన భద్రతా ప్రమాణాలను పాటించే విషయంలో నియమాలను వర్తింపచేయకపోవడం, సడలించడం హైదరాబాద్‌లోని పంజాగుట్ట వంటి అధిక జన సమ్మర్దం ఉండే ప్రాంతంలో ప్రజా భద్రతకు ప్రమాదకరం.

---

[19] ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి-2006 లోని 15(సి) నియమం ప్రకారం నిర్మాణం జరిగిన విస్తీర్ణానికి (బిల్టప్ ఏరియా) చదరపు మీటరుకు ₹10 చొప్పున

[20] గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషను

[21] ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హోమ్(జనరల్ ఎ) శాఖ 2005 నవంబరు 9 వతేదీనాడు జారీచేసిన జీవో ఎంఎస్ నెం.239

### ఉన్నత అధికారాల సంఘం సిఫార్సుల అమలు

ఉన్నత అధికారాల సంఘం (హైపవర్ కమిటీ[22]) 2006 డిసెంబరులో చేసిన సిఫార్సులను అనుసరించి అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన భద్రతా ప్రమాణాలను పాటించని బహుళ అంతస్తుల భవనాలు/ సముదాయాల (ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టంలోని 13వ సెక్షను కిందకు వచ్చేవి కాకుండా) యజమానులకు/వాటిలో ఉంటున్న వారికి నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది (2007 మార్చి). దీనికి అనుగుణంగా, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, వరంగల్ నగరపాలక సంస్థల్లో అగ్ని ప్రమాదాల నిరోధక విభాగాలను (ఫైర్ ప్రివెన్షన్ వింగ్‌లను) ఏర్పాటు చేసింది[23] (2009 ఫిబ్రవరి).

ఐతే, ఇతర నగరపాలక సంస్థల్లో అగ్ని ప్రమాదాల నిరోధక విభాగాలు ఏర్పాటు చేయడానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఇతర నగరపాలక సంస్థల పరిధిలోని ఎత్తైన భవనాల క్యాటగిరీ కిందకు రాని ఇతర భవనాలలో అగ్ని ప్రమాదాల నివారణకు భద్రతా ప్రమాణాలను అమలు చేయలేదు.

పన్నెండు నగరపాలక సంస్థల్లో[24] అగ్ని ప్రమాదాల నిరోధక విభాగాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి 2012 సెప్టెంబరులో ప్రతిపాదనలు పంపామనీ, ఇతర సిఫార్సులకు సంబంధించి కూడా ఆమోదం ఇంకా రావలసి ఉందనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### *అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు భద్రతా ఏర్పాట్లు*

సినిమాహాళ్ళు, ఆసుపత్రులు, ఫంక్షన్‌హాళ్ళు, హోటళ్ళు, విద్యాసంస్థలవంటి బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేయమని డీఎఫ్ఓలందరికీ 2007-12 మధ్య కాలంలో డీజీఎఫ్ఎస్ ఆదేశాలిచ్చారు.

2006-11 మధ్యకాలంలో చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైఎస్ఆర్ (కడప) జిల్లాల్లో డీఎఫ్ఓలు చేసిన తనిఖీల్లో గమనించిన లోపాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

**పట్టిక 2.7**

| అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు భద్రతా ప్రమాణాలు/ముందు జాగ్రత్త చర్యల ఏర్పాట్లలో ఉల్లంఘనలు | ఆసుపత్రులు | థియేటర్లు | విద్యా సంస్థలు | హోటళ్ళు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోడౌన్‌లు, ఫ్యాక్టరీలు, ఫంక్షన్ హాళ్ళు |
|---|---|---|---|---|
| | ప్రమాణాలను ఉల్లంఘించిన యూనిట్ల సంఖ్య (శాతం) | | | |
| డీఎఫ్ఓలు తనిఖీ చేసినవి | **911** | **651** | **932** | **681** |
| అగ్నిమాపక వాహనం భవనానికి కనీసం మూడు వైపులు సులభంగా వెళ్ళగలిగేట్లు, విధులు నిర్వహించేట్లు అనుకూలంగా లేనివి | 857 (94) | 464 (71) | 928 (100) | 681 (100) |
| ఎన్‌బీసీ ప్రమాణాలమేరకు నీటి నిల్వ ఏర్పాట్లు లేనివి | 820 (90) | 651 (100) | 932 (100) | 681 (100) |
| ఎన్‌బీసీ ప్రమాణాలమేరకు తప్పించుకునే మార్గాల ఏర్పాటు లేనివి | 830 (91) | 383 (59) | 923 (99) | 681 (100) |
| పొగ బయటకు పోవడానికి ఏర్పాట్లు, వెంటిలేటర్లు లేనివి | 911 (100) | 404 (62) | 918 (99) | 681 (100) |
| మంటలనార్పే పరికరాలు, బకెట్లు, పైపులు, నీటిని జల్లేవి మొదలైన అగ్నిమాపక ఏర్పాట్లు ఎన్‌బీసీ ప్రమాణాల మేరకు లేనివి | 873 (96) | 407 (63) | 913 (98) | 681 (100) |

22 మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి అధ్యక్షతన, డీజీ ఎఫ్ఎస్, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ కమీషనరు, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రతినిధి మొదలైనవారు సభ్యులుగా ఏర్పాటైంది.

23 మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ 2009 ఫిబ్రవరిలో జారీ చేసిన జీఓ నెం.174

24 గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, కడప, ఏలూరు, కరీంనగర్, నిజామాబాద్, అనంతపురం, రామగుండం

| | | | | |
|---|---|---|---|---|
| బయటకు వెళ్ళేమార్గాలు, కారిడార్లు, మెట్లమార్గాల్లో అత్యవసర పరిస్థితుల్లో వెలుతురుకోసం బ్యాటరీబ్యాక్అప్, ఆటో గ్లో ఏర్పాట్లు లేనివి | 898 (99) | 488 (75) | 932 (100) | 681 (100) |
| శిక్షణ పొందిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయనివి | 899 (99) | 651 (100) | 932 (100) | 669 (98) |
| ల్యాండింగ్‌లలో తెరుచుకునే కిటికీలు లేనివి | 843 (93) | 651 (100) | 932 (100) | 681 (100) |
| పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనివి | 911 (100) | 651 (100) | 932 (100) | 681 (100) |
| ఎన్ఓసీ వివరాలు అందుబాటులో లేనివి | 909 (100) | 646 (99) | 489 (52) | 681 (100) |

*మూలం : డీజీఎఫ్ఎస్, డీఎఫ్ఓల రికార్డులు*

డీఎఫ్ఓలు తనిఖీ చేసిన 911 ఆసుపత్రుల్లో 93 నుండి 100 శాతం, 651 థియేటర్లలో 59 నుండి 100 శాతం, 932 విద్యా సంస్థల్లో 52 నుండి 100 శాతం, హోటళ్ళు, పెట్రోలు బంకులు, గ్యాస్‌గోడౌన్‌లు, ఫ్యాక్టరీలు, ఫంక్షన్‌హాళ్ళలో దాదాపు 100 శాతం అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు నిర్దేశించిన ప్రమాణాలను ఉల్లంఘించాయని, ముందు జాగ్రత్త చర్యలను తీసుకోలేదని పై పట్టికలోని వివరాలనుండి తెలుస్తోంది.

జన సమ్మర్దం ఉండే చోట్ల అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు ఏర్పాట్లుచేసే విషయంలో ప్రమాణాలను ఉల్లంఘించే వారికి శిక్షలు విధించడానికి చర్యలు తీసుకోవలసిందిగా డీజీఎఫ్ఎస్ లేదా వారి ద్వారా అధికారాలు సంక్రమించిన వ్యక్తి సంబంధిత డీఎఫ్ఓలకు ఆదేశాలు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళిలోని 15వ నియమంలో నిర్దేశించడం జరిగింది.

డీజీ ఎఫ్ఎస్ నుండి నిర్దిష్టమైన ఆదేశాలు రాని కారణంగా పైన పేర్కొన్న సంస్థల యాజమాన్యాలపై డీఎఫ్ఓలు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. దీనికి సంబంధించి డీజీ ఎఫ్ఎస్ నిర్దిష్టమైన సమాధానం ఇవ్వలేదు (2012 నవంబరు). తక్షణ కఠినచర్యలు తీసుకోకపోవడం, శిక్షలు విధించకపోవడంవల్ల తనిఖీలు చేసినా ప్రయోజనం లేదు; ప్రజా భద్రత విషయంలో రాజీపడినట్లైంది.

2006-11 మధ్యకాలంలో నిర్వహించిన తనిఖీల పర్యవసానంగా సంబంధిత శాఖలు దిద్దుబాటు చర్యలను తీసుకున్నాయా లేదా అని తెలుసుకునేందుకు కొన్ని ముఖ్యమైన ప్రభుత్వ భవనాలను ఆడిట్ అగ్నిమాపక సేవల శాఖ అధికారులతో కలిసి 2012 నవంబరులో ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీలను నిర్వహించడం జరిగింది. ఏడాదిన్నర తర్వాత కూడా అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లకు చర్యలు చేపట్టలేదనీ, అత్యంత సున్నితమైన ప్రదేశాలైన రాష్ట్ర సచివాలయం, శాసన సభ వంటిచోట్ల కూడా పరిస్థితిలో మార్పులేదనీ గమనించడమైంది. ఆ వివరాలను కింద పేర్కొనడం జరిగింది :

### ప్రభుత్వ భవనాలు

***ఆంధ్రప్రదేశ్ సచివాలయం, హైదరాబాద్*** - ఆంధ్రప్రదేశ్ సచివాలయం, డీ బ్లాకులో 2009 మేలో భారీ అగ్ని ప్రమాదం జరిగినప్పటికీ, ప్రభుత్వం 2012 నవంబరు నాటికీ అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు తగిన భద్రతా ఏర్పాట్లు అమలయ్యేలా చూడలేదు. ఆడిట్ గమనించిన అంశాలు :

- డీ బ్లాకులో హైడ్రేంట్ సిస్టమ్‌లు, పొగను కనిపెట్టి హెచ్చరించే యంత్రాలు (స్మోక్ డిటెక్టర్లు) పనిచేసే స్థితిలో లేవు. మంటలనార్పే సాధనాలు (ఫైర్ ఎక్స్టింగిషర్లు) పని చేసే గడువు 2011 ఫిబ్రవరిలోనే ముగిసింది. వీటిని 2012 నవంబరునాటికి తిరిగి భర్తీ చేయలేదు.
- బీ, సీ, ఎల్ బ్లాకుల్లో మంటలనార్పే పరికరాలు, హైడ్రేంట్ సిస్టమ్‌లు లేవు. ఈ బ్లాకుల్లోని కారిడార్లలో అల్మారాలు అడ్డుగా ఉండి అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు సంభవించినపుడు ప్రజా భద్రతకు ప్రమాదకరంగా ఉన్నాయి.



ఆంధ్రప్రదేశ్ సచివాలయం, డీ బ్లాకులో అగ్ని ప్రమాద దృశ్యం

బహుళ అంతస్తుల భవనాల తనిఖీ సంఘం[25] సచివాలయంలోని ప్రతీబ్లాకులోనూ అగ్ని ప్రమాదాల నిరోధానికి ముందు జాగ్రత్త కోసం ఏర్పాట్లకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసిందనీ, అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు, ప్రాణ రక్షణకు భరోసా కోసం సంబంధితులకు ఆదేశాలు జారీ చేసామని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

***రవీంద్ర భారతి :*** ఇది సాంస్కృతిక కార్యక్రమాలకోసం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మించిన జాతీయ స్థాయి కళాకేంద్రం. ఇది ఎత్తైన భవనం క్యాటగిరిలోనిది కాదు. ఇందులో 1100 సీట్లున్న ఒక ప్రధాన థియేటరు, 120 సీట్లు ఉన్న ఒక చిన్న థియేటరు, 200 మందికి సరిపడా ఒక సమావేశ మందిరం ఉన్నాయి. ఆడిట్‌లో ఈ కింది అంశాలను గమనించడమైంది :

- ఈ భవనానికి అగ్నిమాపక సేవల శాఖనుండి ఎన్ఓసీని పొందలేదు
- 2012 జూన్ నాటికి హైడ్రేంట్ సిస్టమ్, స్మోక్ డిటెక్టర్లు, అలారమ్ సిస్టమ్‌లు లేవు.
- ప్రధాన థియేటరులో మాత్రమే ఫైర్ ఎక్స్టింగిషర్లు ఉన్నాయి. చిన్న థియేటరులో, సమావేశ మందిరంలో అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణ పరికరాలు లేవు.
- రెండవ, మూడవ అంతస్తుల్లో అగ్నిప్రమాదం జరిగినపుడు బయటపడటానికి సరైన నిష్క్రమణ మార్గాలు లేవు.

జీ హెచ్ఎమ్‌సీ పరిధిలో ఉన్న ఎత్తైన భవనాల క్యాటగిరీ కిందకురాని భవనాలన్నింటిలోనూ అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణకు, ప్రాణ రక్షణకు భరోసా కోసం తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా జీహెచ్ఎమ్‌సీ కమీషనరును కోరామని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

***ఆంధ్రప్రదేశ్ శాసనసభవద్దనున్న జూబ్లీహాల్ :*** ఇది ఒక రాజ భవనం. దీనిని హైదరాబాద్ వాస్తుకళా నైపుణ్యానికి ఒక మచ్చుతునకగా పరిగణిస్తారు.

ఆడిట్‌లో ఈ కింది అంశాలను గమనించడమైంది :

- ఈ భవనానికి అగ్నిమాపక సేవల శాఖనుండి ఎన్ఓసీని పొందలేదు
- నీటిని నిల్వ ఉంచే ట్యాంకు పాడయినందువల్ల అత్యవసర పరిస్థితుల్లో దరిదాపుల్లో నీటి సాకర్యం అందుబాటులో ఉండదు.
- ఫైర్ ఎక్స్టింగిషర్లు, హైడ్రేంట్ సిస్టమ్‌లు లేవు




*జూబ్లీహాల్‌లో అగ్నిప్రమాద దృశ్యం*
*(అంతర్ చిత్రంలో: తగలబడిపోయిన ఏసీ ప్లాంటు)*

2012 జూలై 1న కీలక వ్యక్తులు హాజరైన ఒక సమావేశం ముగిసిన 15 నిముషాల తర్వాత జూబ్లీహాల్‌లో అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం సందర్భోచితం.

బహుళ అంతస్తుల భవనాల తనిఖీ సంఘం 2012 జూలైలో జూబ్లీహాల్‌ను తనిఖీచేసి, ఎన్‌బీసీ-2005లో నిర్దేశించిన ప్రకారం అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణకు, చేయాల్సిన ఏర్పాట్లపై కొన్ని సిఫార్సులు చేసిందనీ, ఈ ఏర్పాట్లు అమలయ్యేలా చూడమని రాష్ట్ర శాసనసభా కార్యదర్శిని కోరామనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

[25] ఆంధ్రప్రదేశ్ సచివాలయం ప్రాంగణంలో అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణ ఏర్పాట్ల తనిఖీ కోసం ఏర్పాటైంది

*గగన్ విహార్* : ఇది హైదరాబాద్‌లో రెండు వేలమంది ఉద్యోగులున్న ప్రభుత్వ కార్యాలయాలకు వసతి కల్పిస్తున్న 14 అంతస్తుల భవనం. ఈ కింది అంశాలను ఆడిట్‌లో గమనించడమైంది :

- అగ్నిమాపక సేవల శాఖనుండి ఎన్ఓసీని పొందలేదు.
- హైడ్రేంట్ సిస్టమ్, నీటిసంపు, మోటార్‌లు గత ఇరవై ఏళ్ళనుండి పనిచేయడంలేదు.
- అగ్నిమాపక సాధనాలు పనిచేసే గడువు తేదీ దాటిపోయింది; వాటిని రీఫిల్ చేయలేదు.




*గగన్ విహార్‌లో పనిచేయని డీ హైడ్రెంట్ సిస్టమ్ (2012 జూలై 12)*

బహుళ అంతస్తుల భవనమైన గగన్ విహార్‌ను అగ్నిమాపక సేవల శాఖ 2012 సెప్టెంబరులో తనిఖీ చేసిందనీ అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు, నియంత్రణ ఏర్పాట్ల అమలుకోసం ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ మండలిని కోరామనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### ఆసుపత్రులు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఏడు జిల్లాల్లో తొమ్మిది ఆసుపత్రులను[26] తనిఖీ చేయగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఐదు ఆసుపత్రుల్లో, భవనానికి మూడు వైపులా అగ్నిమాపక వాహనం నిరాటంకంగా వెళ్ళే వీలులేదు
- ఆరు ఆసుపత్రుల్లో, అగ్నిమాపక సాధనాలు లేవు
- రంగారెడ్డి జిల్లాలో ఐదు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించడానికి నీటి సదుపాయం లేదు
- ఏడు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల హెచ్చరిక వ్యవస్థ, హైడ్రేంట్, స్ప్రింకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ వంటి అధునాతన పరికరాలు లేవు.
- సికింద్రాబాద్ యశోదా హాస్పిటల్‌లో అత్యవసర మార్గం మూసేసి, తాళం వేసి ఉంది.
- హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో, అగ్నిమాపక సాధనాలు పనిచేసే గడువు 2011 ఏప్రిల్‌లో ముగియగా, వాటిని ఇంకా రీఫిల్ చేయలేదు.
- సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో, అత్యవసర పరిస్థితుల్లో రోగులను బయటకు పంపేందుకు అనువుగా ఉండే ర్యాంపును నిర్మించలేదు
- ఇమేజ్ హాస్పిటల్స్‌లో, అగ్నిమాపక సాధనాలు తగినన్ని లేవు; మెట్ల మార్గం చాలా ఇరుకుగా ఉంది.

అగ్నిమాపక సేవల శాఖ, జీహెచ్ఎమ్‌సీ 296 ఆసుపత్రుల్లో లోపాలున్నట్లు కనుగొన్నామనీ, 60 రోజుల్లోగా ఈ లోపాలను సరిదిద్దాలని వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయమని, ఆసుపత్రులకు లైసెన్సులు జారీ/ నవీకరణ చేసేముందు అగ్నిమాపక సేవల శాఖ అనుమతులు తప్పనిసరి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులను కోరామనీ డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

---

[26] చిత్తూరు జిల్లా : ఎలైట్ హాస్పిటల్ (తిరుపతి), రవి న్యూరో హాస్పిటల్ (తిరుపతి); హైదరాబాద్ జిల్లా : నిమ్స్, కిమ్స్, ఇమేజ్ హాస్పిటల్స్ (హైదరాబాద్), యశోదా హాస్పిటల్ (సికింద్రాబాద్); కృష్ణా జిల్లా : నాగార్జున హాస్పిటల్ (విజయవాడ); రంగారెడ్డి జిల్లా : బాలాజీహాస్పిటల్ (కొంపల్లి), ఎస్‌హెచ్‌కే హాస్పిటల్ (ఉప్పల్)

### విద్యా సంస్థలు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో ఏడు విద్యా సంస్థలను[27] పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఆరు విద్యా సంస్థల్లో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలు లేవు
- హైదరాబాద్ షాదన్ కాలేజి భవనానికి ఒక బ్లాకులో 10 అంతస్తులు, రెండవ బ్లాకులో 11 అంతస్తులు ఉన్నాయి. ఇందులో నిర్వహిస్తున్న ఫార్మసీ, ఇంజినీరింగ్, జూనియర్ కాలేజీల్లో సుమారు 5,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ భవనానికి మూడువైపులా అగ్నిమాపక వాహనం తిరిగే వీలులేదు. 11 అంతస్తులున్న జూనియర్ కాలేజి భవనంలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలను ఏర్పాటు చేయలేదు. మెట్లమార్గం కూడా చిన్నగా ఉంది.
- వైఎస్ఆర్ జిల్లా, రాజంపేటలోని అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఏడు ప్రయోగశాలలున్నాయి. కానీ, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలను ఎన్ బీ సీ ప్రమాణాల మేరకు ఏర్పాటు చేయలేదు.
- హైదరాబాద్‌లోని సిటీ కాలేజి మూడంతస్తుల భవనం, ఇందులో సుమారు 3,000 విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిపాలనా సిబ్బంది ఉన్నారు. దీని గ్రంథాలయంలో విలువైన పుస్తకాలున్నాయి. కానీ, మొత్తం భవనానికి 10 పోర్టబుల్ ఫైర్ ఎక్స్టింగిషర్లు మాత్రమే ఏర్పాటు చేసారు. హైడ్రేంట్ సిస్టమ్, ఫైర్ అలారమ్‌లు, స్మోక్ డిటెక్టర్లు లేవు.

పై అంతస్తుల్లో ఏర్పాటు చేసిన 3,544 విద్యా సంస్థల్లో లోపాలున్నట్లు అగ్నిమాపక సేవల శాఖ కనుగొందనీ, అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలకు, ప్రాణ రక్షణకు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఈ సంస్థలకు నోటీసులు జారీ చేయాల్సిందిగా కళాశాలలకు సంబంధించి ఉన్నతవిద్యా శాఖ ముఖ్య కార్యదర్శిని, పాఠశాలలకు సంబంధించి పాఠశాల విద్యా శాఖ కమీషనరు మరియు సంచాలకులను కోరామనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు). ఈ సంస్థలకు అనుమతులు జారీ చేయడానికి/నవీకరించడానికి ముందు అగ్నిమాపక సేవల అధికారులనుండి పొందాల్సిన ఎన్ఓసీని తప్పనిసరి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామనికూడా తెలిపారు.

### ఫంక్షన్ హాళ్ళు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో 12 ఫంక్షన్‌హాళ్ళను[28] తనిఖీ చేయగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఎనిమిది ఫంక్షన్‌హాళ్ళలో, భవనానికి మూడువైపులా అగ్నిమాపక వాహనం తిరిగే వీలులేదు. ఫలితంగా, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ చర్యలు, మంటలనార్పే కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుంది.
- పదకొండు ఫంక్షన్‌హాళ్ళలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలు లేవు.
- ఎనిమిది ఫంక్షన్‌హాళ్ళలో మెట్లమార్గం పైకీ, కిందకూ ఇబ్బందిలేకుండా తిరగడానికి సరిపడేంతగా లేదు. వైఎస్ఆర్ (కడప) జిల్లా, రాయచోటిలోని ప్రీతమ్ రెసిడెన్సీ వద్ద ఉన్న ఫంక్షన్ హాలుకు మొదటి, రెండవ అంతస్తులతో సంబంధం లేకుండా మెట్లమార్గంఉంది. కాబట్టి అగ్ని ప్రమాదాలు జరిగినా, అత్యవసర పరిస్థితులు తలెత్తినా మూడో అంతస్తునుండి తప్పించుకునే ఆస్కారంలేదు.

---

[27] శ్రీ చైతన్య స్కూల్ (చిత్తూరు), సిటీ కాలేజి (హైదరాబాద్), గీతాంజలి స్కూల్ (హైదరాబాద్), షాదన్ జూనియర్ మరియు డిగ్రీ కాలేజి (హైదరాబాద్), షాదన్ ఇంజినీరింగ్ మరియు ఫార్మసీ కాలేజి (హైదరాబాద్), అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (రాజంపేట), చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ప్రొద్దుటూరు)

[28] చిత్తూరు : (3), హైదరాబాద్ : (4), క్రిష్ణా : (1), రంగారెడ్డి : (2), వైఎస్ఆర్(కడప) : (2)

ప్రమాదకర ప్రాంగణాలన్నింటిలో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ, ప్రాణ రక్షణకు ఏర్పాట్లు అమలయ్యేలా చూసేందుకు అగ్నిమాపక సేవల శాఖ, కార్మిక-పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీల నిర్వహణకు 2012 అక్టోబరులో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### సినిమా థియేటర్లు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో 19 సినిమా థియేటర్లను[29] పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి:

- ఏడు థియేటర్లలో , థియేటరుకు మూడువైపులా అగ్నిమాపక వాహనం తిరిగే వీలులేదు
- పదకొండు థియేటర్లలో అగ్నిప్రమాదాలనెదుర్కోడానికి హైడ్రెంట్‌లు, ఫైర్ అలారమ్, స్ప్రింక్లర్లువంటి పరికరాలను ఏర్పాటు చేయలేదు
- ఆరు థియేటర్లలో అగ్నిమాపక సాధనాలు/బకెట్లు (నీరు/ఇసుక) లేవు.

హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్సు థియేటర్లో హైడ్రెంట్ సిస్టమ్ వంటి అగ్నిప్రమాదాలనెదుర్కొనే పరికరాలు ఉన్నప్పటికీ, హోజు పైపు ఉంచే బాక్సులో హోజు పైపు/నాజిల్‌లు లేవు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్ళాల్సిన మార్గాలు మూసి, తాళాలు వేసారు. ఇవి అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు వెంటనే వినియోగించు కొనేట్లు లేవు.

రాష్ట్రంలో 2,158 సినిమా థియేటర్లలో లోపాలున్నట్లు అగ్నిమాపక సేవల శాఖ కనుగొందనీ, వీటిని ప్రమాదకరమైనవిగా పరిగణించడమైందనీ డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు). ప్రస్తుతం ఉన్న థియేటర్లలో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ, ప్రాణ రక్షణ ఏర్పాట్ల విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావలసి ఉందని, లైసెన్సులను నవీకరించేముందు సినిమా థియేటర్లలో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణల ఏర్పాట్లు ఉన్నాయని నిర్ధారించుకోవాలని, అగ్నిమాపక సేవల శాఖ అధికారుల నుండి నిరభ్యంతర పత్రాన్ని పొందడం తప్పనిసరి చేయాలని వీటికి లైసెన్సులను జారీ చేసే అధికారాలున్న పోలీసు కమీషనర్లు/జాయింట్ కలెక్టర్లను కోరామనికూడా డీజీఎఫ్ఎస్ తెలిపారు.

## 2.5.3 అగ్నిమాపక అవుట్ పోస్టులు

అత్యవసర పరిస్థితుల్లో అగ్నిప్రమాదాల నెదుర్కొనడానికి కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 19 అవుట్ పోస్టులు[30] పనిచేస్తున్నాయి. ఇందులో ఐదు అవుట్ పోస్టులు మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో[31] ఉన్నాయి. విశాఖపట్నం జిల్లాలోని రెండు అవుట్ పోస్టులు సక్రమంగా పనిచేస్తున్నాయి. కృష్ణాజిల్లాలోని అవుట్ పోస్టుకు సంబంధించిన రికార్డులను ఆడిట్‌కు సమర్పించలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు ఫైర్ అవుట్‌పోస్టుల పనితీరును పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ[32] వద్ద 2005 మార్చి-సెప్టెంబరులోనే నిధులను జమచేసినప్పటికీ, మూడు ఫైర్ అవుట్‌పోస్టులు[33] పూర్తికావడానికి[34] నాలుగునుండి ఐదేళ్ళ వరకూ జాప్యం జరిగింది.

---

[29] చిత్తూరు : (9), హైదరాబాద్ : (4), మహబూబ్‌నగర్ : (1), రంగారెడ్డి : (3), వైఎస్ఆర్(కడప) : (2)

[30] గుంటూరు : (1), కరీంనగర్ : (3), ఖమ్మం : (1), కృష్ణా : (1), మహబూబ్‌నగర్ : (2), మెదక్ : (3), నల్గొండ : (1), నిజామాబాద్ : (2), శ్రీకాకుళం : (2), విశాఖపట్నం : (2), వరంగల్ : (1)

[31] మహబూబ్‌నగర్ : (2), కృష్ణా : (1), విశాఖపట్నం : (2)

[32] ఏపీఎస్‌పీహెచ్‌సీ

[33] కల్వకుర్తి, అమ్రాబాద్, షాద్‌నగర్

[34] కల్వకుర్తి : 2008 జూన్, అమ్రాబాద్ : 2009 ఏప్రిల్, షంషాబాద్ : 2009 జూన్


- ఒప్పందపు షరతుల్లో నిర్దేశించిన ప్రకారం, ఒప్పందం కుదుర్చుకున్న తేదీ (2009 జనవరి) నుండి 100 రోజులలోపు (2009 మే) సర్వీసు ప్రొవైడరు కార్యకలాపాలను ప్రారంభించాలి. ఐతే, సర్వీసు ప్రొవైడరు సకాలంలో సేవలు మొదలుపెట్టేలా డీఎఫ్ఓ/ఆర్ఎఫ్ఓ చర్యలు తీసుకోలేదు. సెక్యూరిటీ డిపాజిటు ₹1 లక్షను ప్రభుత్వ ఖాతాకు జమ చేయనూ లేదు. షాద్‌నగర్ ఫైర్ అవుట్‌పోస్టు సేవలు ఒక ఏడాదిపై ఏడు నెలల జాప్యంతో 2010 ఫిబ్రవరిలో, అమ్రాబాద్ ఫైర్ అవుట్‌పోస్టు సేవలు రెండేళ్ళ జాప్యంతో 2010 అగస్టులో ప్రారంభమయ్యాయి. కల్వకుర్తి ఫైర్ అవుట్‌పోస్టు సేవలు 2012 జూన్ నాటికి ఇంకా మొదలుకాలేదు.
- షాద్‌నగర్, అమ్రాబాద్‌ల వద్ద ఫైర్ అవుట్‌పోస్టులు శిక్షణ పొందని సిబ్బందితో పనిచేస్తున్నాయి. రెండు ఫైర్ అవుట్‌పోస్టుల్లో ఉన్న 32 మంది అగ్నిమాపక సేవల సిబ్బందిలో 18 మంది మాత్రమే శిక్షణ పొందారు. ఒప్పందం ప్రకారం, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే విధుల్లో 6 నెలలు శిక్షణ ఇవ్వడానికి ప్రతి ఫైర్ అవుట్ పోస్టుకు ఒక లీడింగ్ ఫైర్‌మ్యాన్‌ను పంపలేదు.
- షాద్‌నగర్, అమ్రాబాద్ ఫైర్ అవుట్‌పోస్టులు తాము ఎన్ని ఫైర్ కాల్స్/రెస్క్యూ కాల్స్‌కు హాజరయ్యామనే వివరాలను, ఇతర వివరాలను డీజీఎఫ్ఎస్‌కు సమర్పించిన నెలవారీ నివేదికలో పేర్కొనలేదు.

ఫైర్ అవుట్‌పోస్టులు ప్రభావవంతంగా పనిచేసేలా చూసేందుకు వీటిని సమగ్రంగా సమీక్షిస్తామని డీజీ ఎఫ్ఎస్ హామీనిచ్చారు (2012 నవంబరు).

## 2.6 మానవ వనరుల నిర్వహణ

### 2.6.1 సిబ్బంది కొరత

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని 5వ నియమం ప్రకారం, ఒక సింగిల్ యూనిట్‌తో ఉన్న ఫైర్ స్టేషన్‌లో కనీసం ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ఎఫ్ఓ), ఇద్దరు లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు (ఎల్ఎఫ్ఎమ్), ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు (డీఓ), పదిమంది ఫైర్‌మ్యాన్‌లు (ఎఫ్ఎమ్) ఉండాలి. అదే విధంగా, డబుల్ యూనిట్లు ఉన్న ఫైర్ స్టేషన్‌లో ఒక ఎస్ఎఫ్ఓ, నలుగురు ఎల్ఎఫ్ఎమ్‌లు, ఐదుగురు డీఓలు, ఇరవైమంది ఎఫ్ఎమ్‌లు ఉండాలి. ఇక బహుళ యూనిట్ల స్టేషన్లలో ఒక ఎస్ఎఫ్ఓ, ఆరుగురు ఎల్ఎఫ్ఎమ్‌లు, పదిమంది డీఓలు, ఇరవైమంది ఎఫ్ఎమ్‌లు ఉండాలి. రాష్ట్రంలో 220 సింగిల్ యూనిట్‌లు, 31 డబుల్ యూనిట్లు, 2 బహుళ యూనిట్‌లు ఉన్న ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.




*మూలం : డీజీఎఫ్ఎస్ రికార్డులు*

చార్టు-2.1లో చూపిన వివరాల ప్రకారం కీలకమైన పోస్టుల్లో ఖాళీలు ఉండటం వల్ల అగ్నిమాపక సేవల శాఖ ఇబ్బందుల నెదుర్కొంటోంది. ఫైర్ మ్యాన్ పోస్టుల్లో 20 శాతం డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల్లో 15 శాతం ఖాళీలు ఉన్నాయి. దీనివల్ల ఈ శాఖ కార్య సామర్థ్యంపై దుష్ప్రభావం పడింది. విజయనగరం డీఎఫ్ఓ పోస్టు 2011 మే నుండి, నల్గొండ డీఎఫ్ఓ పోస్టు 2012 జూన్ నుండి ఖాళీగా ఉన్నాయి.

లీడింగ్ ఫైర్‌మ్యాన్ క్యాడరులో 5 శాతం ఖాళీలు, ఫైర్‌మ్యాన్ క్యాడరులో 20 శాతం ఖాళీలు ఉన్నాయి.

ఆడిట్ పరిశీలనలను డీజీఎఫ్ఎస్ అంగీకరించారు (2012 నవంబరు).

### 2.6.2 అగ్నిమాపక వాహనాలపై విధులకు హాజరయ్యే సిబ్బంది సంఖ్య

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల మాన్యువల్‌లోని పేరా 536(1) ప్రకారం, అగ్నిమాపక వాహనంపై విధులకు హాజరయ్యే సిబ్బందిలో ఒక లీడింగ్ ఫైర్‌మ్యాన్, ఒక డ్రైవర్ ఆపరేటర్, ముగ్గురు ఫైర్‌మ్యాన్‌లు, ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తప్పనిసరిగా ఉండాలి.

మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని, 293 భారీ/అతి భారీ అగ్ని ప్రమాదాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించగా, మంటలను ఆర్పడానికి అవసరమైన పూర్తి స్థాయి సిబ్బంది లేకుండానే అగ్నిమాపక సేవలను నిర్వహించినట్లు వెల్లడైంది. మంటలనార్పే విధుల నిర్వహణకు ముగ్గురు ఫైర్‌మ్యాన్‌లు అవసరంకాగా మచ్చుకు తనిఖీ చేసిన 293 కేసులకుగానూ 70 కేసులలో ఒకే ఒక్క ఫైర్‌మ్యాన్, 133 కేసులలో ఇద్దరు ఫైర్‌మ్యాన్‌లు మాత్రమే విధుల నిర్వహణలో పాల్గొన్నారు. మరో నాలుగు కేసులలో ఒక్క ఫైర్‌మ్యాన్ కూడా బృందంలో లేనందువల్ల మంటలనార్పే విధులను డ్రైవర్ ఆపరేటర్, లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు మాత్రమే నిర్వహించాల్సివచ్చింది.

ఆడిట్ పరిశీలనలను డీజీఎఫ్ఎస్ అంగీకరించారు (2012 నవంబరు).

### 2.6.3 అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ

#### *2.6.3.1 కార్యాచరణ ప్రణాళికలు లేకపోవడం*

డీఎఫ్ఓ, ఎస్ఎఫ్ఓ, ఎఫ్ఎమ్, డీఓల క్యాడర్లలో సర్వీసులో ఉన్న సిబ్బందికి, నేరుగా నియుక్తులైన కొత్త సిబ్బందికి డీజీఎఫ్ఎస్ ఆమోదించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ (ఎస్‌టీఐఎస్) శిక్షణను ఇస్తుంది. కిందిస్థాయి అగ్నిమాపక సిబ్బంది ఎలాంటి సంఘటనలైనా ఎదుర్కోడానికి, నిత్యం సన్నద్ధతతో ఉండటానికి వారికి నిరంతరం శిక్షణను ఇవ్వాలని ఎస్ఎఫ్ఏసీ సిఫార్సుల్లో నిర్దేశించడమైంది.

2007-12 మధ్యకాలానికి శిక్షణను ఇవ్వడానికి ఎస్‌టీఐఎస్ ఎలాంటి కార్యాచరణ ప్రణాళికనూ రూపొందించలేదు. 2007-12 మధ్యకాలంలో (2012 డిసెంబరు వరకు) శిక్షణ పొందిన సిబ్బంది వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక 2.8**

| సంవత్సరం | కోర్సుల సంఖ్య | డీఎఫ్ఓ | | ఎస్ఎఫ్ఓ | | ఎల్ఎఫ్ఎమ్ | | డీఓ | | ఎఫ్ఎమ్ | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | D | O | D | O | D | O | D | O | D | O | D | O |
| 2007-08 | 11 | 0 | - | 56 | 8 | 106 | - | 135 | 5 | 121 | 61 | 418 | 74 |
| 2008-09 | 11 | 0 | - | 18 | - | 0 | - | 256 | 5 | 77 | 109 | 351 | 114 |
| 2009-10 | 9 | 0 | - | 0 | - | 0 | - | - | 140 | 212 | 101 | 212 | 241 |
| 2010-11 | 8 | 9 | - | 235 | - | 0 | - | - | - | 74 | 7 | 318 | 7 |
| 2011-12 | 5 | 0 | - | 145 | - | 0 | - | 13 | - | 349 | 9 | 507 | 9 |
| మొత్తం | 44 | 9 | - | 454 | 8 | 106 | - | 404 | 150 | 833 | 287 | 1806 | 445 |

*D : అగ్నిమాపక సిబ్బంది; O : ఇతర సంస్థల సిబ్బంది*

*మూలం : రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ రికార్డులు*

రాష్ట్రంలో 2007-12 మధ్య కాలంలో, మొత్తంమీద 9 డీఎఫ్ఓలు (15 మందికి), 454 మంది ఎస్ఎఫ్ఓలు, 106 మంది ఎల్ఎఫ్ఎమ్‌లు (548 మందికి), 404 మంది డీఓలు (714 మందికి), 833 మంది ఎఫ్ఎమ్‌లు (2,312 మందికి) 44 కోర్సులలో శిక్షణ పొందారు.

నేరుగా నియుక్తులైన కొత్త సిబ్బందికి, సర్వీసులో ఉన్న వారికి శిక్షణను ఇవ్వడానికి సంబంధించిన వార్షిక ప్రణాళిక గురించి డీజీఎఫ్ఎస్ నిర్దిష్ట సమాధానం ఇవ్వలేదు.

### 2.6.3.2 హోమ్ గార్డులకు అగ్నిమాపక శిక్షణను కల్పించకపోవడం

ఫైర్ కాల్‌కు స్పందించి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అగ్నిమాపక సేవల విధులను నిర్వహించడానికి ఫైర్ స్టేషన్ సిబ్బందికి తగిన శిక్షణను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని 33వ నియమములో నిర్దేశించడం జరిగింది. ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- 2007-12 మధ్య కాలంలో, హోమ్ శాఖనుండి 811 మంది హోమ్ గార్డులను డిప్యుటేషన్‌పై తీసుకుని ఫైర్‌మెన్, డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల్లోని ఖాళీల్లో నియమించారు. కానీ ఇందులో ఏ ఒక్కరికీ అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడంలో ఎస్‌టీఎస్ శిక్షణ ఇవ్వలేదు. కేటాయించిన ఫైర్‌స్టేషన్లలో విధుల్లో చేరిన సమయంలో హోమ్ గార్డులకు ప్రాక్టికల్ శిక్షణను ఇవ్వడం జరిగిందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 మార్చి). అగ్నిప్రమాదాలను ఎదుర్కొనడానికి సంబంధించి హోమ్ గార్డులకు ఎలాంటి శిక్షణా ఇవ్వలేదని మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో డీఎఫ్ఓలు నిర్ధారించారు.
- రంగారెడ్డి జిల్లా, గచ్చిబౌలిలోని మోడల్ ఫైర్ స్టేషన్‌లో 2010-11 లో ఫైర్ మెన్ పోస్టుల్లో 77 మందిని, డ్రైవర్ ఆపరేటర్ పోస్టులో 20 మందిని చొప్పున మొత్తం 97 మంది హోమ్ గార్డులను నియమించారు. వీరికి కూడా అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే విషయమై శిక్షణ కల్పించలేదు.

హోమ్ గార్డులకు నిర్దిష్టమైన శిక్షణ ఇవ్వలేదని డీజీఎఫ్ఎస్ అంగీకరించారు (నవంబరు 2012).

### 2.6.4 వాణిజ్య సముదాయం, ఈతకొలనులను వినియోగించకుండా వృధాగా వదిలేయడం

రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ వద్ద 2009 జూన్‌లో ₹1.19 కోట్ల ఖర్చుతో ఒక వాణిజ్య సముదాయాన్ని, ఒక ఈత కొలనును నిర్మించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అద్దెకు ఇవ్వడం ద్వారా వీటిని శిక్షణ పొందుతున్న వారి సౌకర్యానికి వినియోగించాలని తలచారు. కానీ 2012 జూన్ నాటికి వాణిజ్య సముదాయాన్ని కానీ, ఈత కొలనును కానీ వినియోగించలేదనీ, ఫలితంగా వీటిని నిర్మించిన లక్ష్యం నెరవేరలేదనీ ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

## 2.7 అంతర్గత నియంత్రణలు , పర్యవేక్షణ

### 2.7.1 వ్యయ నియంత్రణ యంత్రాంగం లేకపోవడం

అప్రోప్రియేషన్ తాలూకు ప్రతి యూనిట్ కిందా చేసే ఖర్చు ఆ అప్రోప్రియేషన్ కేటాయింపునకు మించకుండానూ, ఖర్చులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేలా సీసీఓ చూడాలని ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లో నిర్దేశించడం జరిగింది.

ఐతే, సీసీఓ వద్ద వ్యయ నియంత్రణ రిజిస్టరును నిర్వహించడంలేదు. డీఎఫ్ఓలనుండి నెలవారీ ఖర్చుల వివరాలు సకాలంలో అందుతున్నాయో లేదో గమనించేందుకు ఎలాంటి యంత్రాంగమూ లేదు.

### 2.7.2 రాబడులు, ఖర్చులను రికన్సీలియేషన్ చేయకపోవడం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లోని నిబంధనల ప్రకారం, ప్రతీ ప్రభుత్వశాఖకు సంబంధించి నెలవారీ రాబడులు, ఖర్చుల లెక్కలను సంబంధిత డీడీఓలు ట్రెజరీల్లో నమోదైన అంకెలతోనూ, సీసీఓలు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (పీఏజీ) (ఏ&ఈ) కార్యాలయంలో నమోదైన అంకెలతోనూ సరిపోల్చి చూసుకోవాలి.

వాపసు చేయడానికి వీలులేని ఫైర్ ప్రికాషన్ ఫీజు, లైసెన్సుల జారీ/నవీకరణ ఫీజు, యూజర్ చార్జీలు మొదలైన రాబడులు అగ్నిమాపక సేవల శాఖకు వస్తాయి. 2007-12 మధ్య కాలంలో ఈ విధంగా ₹53.83 కోట్ల రాబడులు వచ్చాయి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన డీడీఓలలో ఏ ఒక్కరూ తమ రికార్డుల్లోని రాబడుల అంకెలను ట్రెజరీల్లో

నమోదైన అంకెలతో సరిపోల్చి చూడలేదు. సంబంధిత వ్యక్తులు రుసుములను నేరుగా ట్రెజరీలో జమచేస్తారు కాబట్టి, ఈ మొత్తాలను ఎప్పటికప్పుడు రికన్సీలియేషన్ చేయకపోతే రెవెన్యూ లీకేజీలు జరిగే అవకాశాలను తోసిపుచ్చలేము.

అదే విధంగా, 2007-12 మధ్య కాలంలో డీడీఓల ఖర్చులను సీసీఓ కన్సాలిడేట్ చేయనూలేదు, (పీఏజీ) (ఏ&ఈ)కార్యాలయంలో నమోదైన ఖర్చులతో తమ రికార్డుల్లోని అంకెలను సరిపోల్చి చూసుకోనూలేదు. 2007-12 మధ్య కాలంలోని ప్రతి సంవత్సరంలోనూ డీజీ ఎఫ్ఎస్ నివేదించిన ఖర్చులకూ, పీఏజీ (ఏ&ఈ) కార్యాలయంలో నమోదైన అంకెలకూ మధ్య వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసం ఒక కోటి రూపాయల నుండి 14 కోట్ల రూపాయల వరకూ ఉంది.

రాబడుల మొత్తాలను ఎప్పటికప్పుడు రికన్సీలియేషన్ చేయాలని డీడీఓలకు ఆదేశాలు జారీ చేసామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

## 2.7.3 శాఖాపరమైన తనిఖీలు

అగ్నిమాపక సేవల శాఖ పనితీరును మదింపు చేయడంలోనూ, ఏవైనా లోపాలుంటే గుర్తించడానికి, దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి, సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించడానికి, అగ్నిప్రమాదాలను ఎదుర్కొనడంలో సంసిద్ధతను మెరుగుపర్చడానికి నిర్ణీత కాలవ్యవధిలో శాఖాపరమైన తనిఖీలు నిర్వహించడం చాలా ముఖ్యం.

ప్రభుత్వ ఆదేశాల[35] ప్రకారం, జిల్లా కార్యాలయాలను, కింది కార్యాలయాలను నిర్ణీత కాలవ్యవధుల్లో సంబంధిత శాఖాధిపతి తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలి. అంతేగాక, ఆర్ఎఫ్ఓలు రెండేళ్లకొకసారి ప్రతి ఫైర్ స్టేషన్ను నిర్ణీత వ్యవధిలో తనిఖీ చేసి రాష్ట్రంలోని ఫైర్ స్టేషన్లన్నింటి తనిఖీ నిర్దిష్ట కాలంలోపున పూర్తయ్యేలా చూడాలని డీజీఎఫ్ఎస్ ఆదేశాలు జారీ చేసారు (2003 మార్చి). మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో 2007-12 మధ్య కాలంలో శాఖాపరమైన తనిఖీలుగానీ ఆర్ఎఫ్ఓ తనిఖీలుగానీ జరగలేదని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

ప్రాంతీయ/జిల్లా అగ్నిమాపక సేవల అధికారులకు వారి పరిధిలోని ఫైర్ స్టేషన్లను తనిఖీ చేయాలని 2012 ఆగస్టులో ఆదేశాలిచ్చామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

## 2.7.4 అంతర్గత తనిఖీ

శాఖాపరమైన నియమాలు, విధానాలను ఏమేరకు పాటిస్తున్నారనే విషయాన్ని అంతర్గత తనిఖీలో పరిశీలించి మదింపు చేయడం జరుగుతుంది. అంతేగాక, అంతర్గత నియంత్రణలు తగినన్ని ఉన్నాయా, అవి పని చేస్తున్నాయా అనే విషయంలో యాజమాన్యానికి తగిన భరోసాను ఇస్తాయి. ప్రభుత్వ ఉత్తర్వుల[36] ప్రకారం, ఏదైనా ప్రభుత్వ శాఖలోని అకౌంట్ల విభాగం అధిపతి ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, యూనిట్ కార్యాలయాలు మొదలైన వాటికి కనీసం ఏడాదికి ఒకసారయినా అంతర్గత తనిఖీ నిర్వహించి నివేదికను సమర్పించాలి.

విశాఖపట్నం జిల్లాలో తప్ప, మచ్చుకు తనిఖీ చేసిన మిగతా జిల్లాల్లో 2007-12 మధ్య కాలంలో జిల్లా కార్యాలయాల (డీఎఫ్ఓల) అంతర్గత తనిఖీ నిర్వహించలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

జిల్లా కార్యాలయాల అంతర్గత తనిఖీ నిర్వహణకు చర్యలు తీసుకుంటామని డీజీఎఫ్ఎస్ హామీనిచ్చారు (2012 నవంబరు).

[35] సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) జారీ చేసిన 1962 ఫిబ్రవరి 8వ తేదీ నాటి జీఓఎమ్ఎస్ నెం.247, 1997 జూలై 26వ తేదీ నాటి మెమో సర్క్యులర్ నెం.42050/ఏఆర్.111/97-7

[36] ఆర్థిక మరియు ప్రణాళిక శాఖ జారీ చేసిన 1989 జనవరి 23వ తేదీ నాటి జీఓఎమ్ఎస్ నెం.34, 1997 జులై 1 వ తేదీ నాటి జీ ఓఆర్టీ నెం.1416

## 2.8 సారాంశం

*పై పేరాలలో పేర్కొన్న విధంగా, మౌలిక వసతులకు సంబంధించి ఎస్ఎఫ్ఏసీ నిర్దేశించిన ప్రమాణాలను విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ పాటించలేదు. రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల విషయంలో తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి ఈ శాఖ వద్ద సరైన ఏర్పాట్లు లేవు. నిర్వహణకు సంబంధించి సమగ్ర సమాచారం ఈ శాఖ వద్ద లేని కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాల గుర్తింపు/విశ్లేషణను చేసి, భద్రతా చర్యలను చేపట్టలేకపోయింది.*

*కొత్త ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని గత ఆడిట్ నివేదికలో నిర్దిష్ట సిఫార్సును చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉపసంఘం కూడా ఇదే సిఫార్సును చేసింది. అయినప్పటికీ **2007-12** మధ్య కాలంలో ఫైర్ స్టేషన్ల కొరత **95** శాతం వరకూ ఉంది. ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతులు చాలినంతగా లేవు. మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో **20** శాతం ఫైర్ స్టేషన్లు శిధిలావస్థలో ఉన్నాయి. సిబ్బందికి నివాసాలను ఏర్పాటు చేయలేదు. కాలం చెల్లిన సమాచార వ్యవస్థ వలన అత్యవసర పరిస్థితులనెదుర్కొనే సన్నద్ధతపై దుష్ప్రభావం పడింది. అగ్నిమాపక వాహనాలు, రక్షణ వాహనాలు (రెస్క్యూవ్యాన్స్) వంటి వాటి విషయంలో అవసరాలకు, వాస్తవంగా అందుబాటులో ఉన్న వాటికి మధ్య భారీ అంతరం ఉంది. అత్యధిక పౌనఃపున్యం గల రేడియో సెట్ల వంటి ఇప్పటికే కొనుగోలుచేసిన పరికరాలను అగ్నిమాపక సేవలు, విపత్తుల స్పందన శాఖ వినియోగించటంలేదు.*

*మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (వైఎస్ఆర్ (కడప) జిల్లాలోనూ, హైదరాబాద్ జిల్లాలో కొన్ని కేసులు తప్ప) ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ సహాయక సేవల (ఆక్జిలరీ సర్వీసుల) ఏర్పాటు జరగలేదు. అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు సంబంధించిన భద్రతా చర్యల నియమావళి/ప్రమాణాలను అమలు చేసేందుకు ప్రమాదాలు సంభవించడానికి ఆస్కారం ఉన్న ప్రాంగణాలను పాక్షికంగా మాత్రమే గుర్తించారు. భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన, ముందు జాగ్రత చర్యలు తీసుకోని వారిపై చర్యలు చేపట్టలేదు. ఫైర్ మేన్, డ్రైవర్ ఆపరేటర్ వంటి కీలక పోస్టుల్లో చాలాఖాళీలు ఉండటంవల్ల అగ్ని ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కొనే కార్యక్రమాలు ప్రభావితమయ్యాయి. శిక్షణ, నైపుణ్యాల పెంపునకు సంబంధించిన కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదు. బడ్జెటు కేటాయింపులు ఈ శాఖ అవసరాలకు తగినట్లులేవు. అంతేకాక, భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విపత్తుల ఉపశమన నిధి నుండి నిధులు విడుదల చేయకపోవడంవల్ల ఈ శాఖ ఆధునికీకరణ ప్రక్రియ కుంటుపడింది. వ్యయ నియంత్రణలు బలహీనంగా ఉన్నాయి. నిర్దిష్ట కాలవ్యవధుల్లో శాఖాపరమైన తనిఖీలు నిర్వహించలేదు. ఆడిట్ సమీక్షా కాలం **(2007-12)**లో ఒక్క విశాఖపట్నంలో తప్ప మిగిలిన జిల్లా కార్యాలయాలకు అంతర్గత తనిఖీని నిర్వహించలేదు.*

## 2.9 సిఫార్సులు

- నిర్దేశిత సేవలను ప్రజలకు అందించేలా అగ్ని మాపక సేవలు, విపత్తుల స్పందన శాఖ కార్యకలాపాలు రూపొందించుకునేలా, ఆధునికీకరణ చెందేలా చూడటానికి ముందస్తు ప్రణాళికలు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలను తయారు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి.

- అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలకు భద్రతా చర్యలు తీసుకోవలసిన అవసరమున్న ప్రమాదకర ప్రాంగణాల సర్వేకు ఒక వ్యూహాన్ని, ఇతర ప్రాంతాలకు సంబంధించి ఒక కార్యాచరణ ప్రణాళికను ఈ శాఖ సిద్ధం చేసుకోవాలి. అగ్ని ప్రమాదాల నివారణకు తనిఖీలను నిర్ణీత కాల వ్యవధుల్లో నిర్వహించాలి. ఉల్లంఘనలపై సత్వర చర్యలు చేపట్టాలి.

- ఫైర్ స్టేషన్ల స్థాపన, స్పందన సమయం, మౌలిక వసతులు, పరికరాలు, మొదలైనవాటి విషయంలో ఎస్ఎఫ్ఏసీ నిర్దేశించిన ప్రమాణాలు, చేసిన సిఫార్సులను ఖచ్చితంగా పాటించాలి.

- కీలక పోస్టులన్నింటిలోనూ ఖళీలు భర్తీ చేయాలి. అగ్ని మాపక సేవల సిబ్బందికి నిర్దేశిత కాల వ్యవధుల్లో సరైన శిక్షణ కల్పించి వారి నైపుణ్యాలను పెంపొందించాలి.

- అగ్ని మాపక సేవల శాఖ అవసరాలకు సరిపడేట్లుగా ప్రభుత్వం తగిన నిధులను కేటాయించాలి. ఈ శాఖ చేపట్టే అన్వేషణ, రక్షణ చర్యలు మెరుగుపడేలా, అగ్ని మాపక సేవలను ప్రభావవంతంగా చేపట్టడానికి కావలసిన ఆధునిక పరికరాలను కొనుగోలు చేసుకోడానికి భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విపత్తుల ఉపశమన నిధి నుండి నిధులను విడుదల చేయాలి.

ఆడిట్ కనుగొన్న విషయాలను, చేసిన సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించి, చాలాకాలం నుండి పెండింగులో ఉన్న అగ్ని మాపక సేవల శాఖ అవసరాలకు సరిపడేలా ఆ శాఖకు బడ్జెటు కేటాయింపులు పెంచడానికి అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చింది (2012 నవంబరు).

# అధ్యాయం-3

## ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాకవర్గాల విద్యార్థులకు ఉద్దేశించిన స్కాలర్‌షిప్ పథకాలపై ఆడిట్ సమీక్ష

సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖలు


పేజీలు 45 - 76

## 3.1 పరిచయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరంభించిన ఈ స్కాలర్‌షిప్ పథకాలు ఒక ముఖ్యమైన సాంఘిక సంక్షేమ కొలమానానికి ప్రతీక. షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగలు (ఎస్టీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులను విద్యా సంస్థల్లో చదువు కొనసాగించేలా చేయడం, ఆయా విద్యార్థుల భర్తీ సంఖ్యను పెంచడం ఈ పథకాల ఉద్దేశం. సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమయానుసారంగా నిర్దేశించే పరామితుల ఆధారంగా ఈ పథకాల ప్రయోజనాలను అందించడం జరుగుతోంది. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాల కింద ప్రతి ఏటా సుమారుగా 25 లక్షల లబ్ధిదారులు ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ పథకాలపై 2008-12 మధ్యగల నాలుగేళ్ల కాలంలో ₹9,369 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసారు.

### 3.1.1 సంస్థాగత నిర్మాణం

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సంబంధించి విద్యా, ఇతర సంక్షేమ పథకాల అమలుపై పూర్తి నియంత్రణను ఆయా సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు కలిగి ఉంటారు. వివిధ స్కాలర్‌షిప్ పథకాల అమలుకు సంబంధించి ఆయా శాఖలలోని సంస్థాగత నిర్మాణం ఈ కింది విధంగా ఉంది:



## 3.2 ఆడిట్ విధివిధానాలు

### 3.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ కింది అంశాలను పరిశీలించడం కోసం స్కాలర్‌షిప్ పథకాలను ఆడిట్ సమీక్షించింది:

- ప్రణాళికా ప్రక్రియ సమగ్రంగానూ, పటిష్టంగానూ ఉందా;
- నిధుల విడుదల, వాటి వినియోగంతోపాటుగా మొత్తం ఆర్థిక నిర్వహణ సమర్థవంతంగానూ, లక్ష్యాలకు అనుగుణంగానూ ఉందా;
- పథకాలను కట్టుదిట్టంగా అమలు చేసారా, దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా ఉందా, అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను సమయానికి విడుదల చేసారా;
- వివిధ స్థాయిల్లో పర్యవేక్షణ వ్యవస్థ, అంతర్గత నియంత్రణలు చాలినంతగా ఉన్నాయా, వాటి పనితీరు ఆశించిన విధంగా ఉందా.

### 3.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఈ దిగువ పేర్కొన్న వాటినుండి ప్రామాణికంగా తీసుకున్న అంశాలకు ప్రతిగా ఆడిట్ పరిశీలన చేయడమైంది.

- పథకం మార్గదర్శకాలు, ప్రభుత్వం ఆయా సమయాల్లో జారీ చేసిన ఆదేశాలు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి;
- శాఖాపరమైన, కార్య నిర్వాహక నిబంధనావళులు (మాన్యువల్స్);
- బడ్జెట్ కేటాయింపులు.


### 3.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

లిఖిత రూపంలో (మాన్యువల్‌గా) జరుగుతున్న ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరీ, చెల్లింపు ప్రక్రియను ప్రస్తుతం కంప్యూటరీకరిస్తున్నారు. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయంలో వాటి మంజూరీ, చెల్లింపులు 2007-08 సంవత్సరం వరకూ లిఖిత రూపంలోనే జరిగాయి. ఆ తరువాత ఈ మొత్తం ప్రక్రియను కంప్యూటరీకరించారు. ఆ విధంగా, 2008-09 నుండి 2011-12 మధ్య కాలంలో స్కాలర్‌షిప్ పథకాల అమలుకు సంబంధించి ప్రీ-మెట్రిక్ విషయంలో లిఖితరూప లావాదేవీలను, పోస్ట్-మెట్రిక్ విషయంలో కంప్యూటరీకరించిన లావాదేవీలను ఆడిట్ సమీక్షించడం జరిగింది.

2011 ఆగస్టు, 2012 మే మధ్యకాలంలో నిర్వహించిన క్షేత్ర స్థాయి తనిఖీలో, సచివాలయంలోని సంబంధిత పరిపాలనా శాఖలు, కమీషనర్ కార్యాలయాల రికార్డులను మచ్చుకు తనిఖీ చేయడంతో పాటు 'సామాజిక హితార్థ నిర్వహణ వ్యవస్థ' (2008-09 సంవత్సరం కోసం), 'ఈపాస్' వ్యవస్థ (2009-12 సంవత్సరాలకు) ల్లోని సమాచారాన్ని విశ్లేషించడం, ఎంపిక చేసిన 60 కళాశాలలను పరిశీలించడం జరిగింది. రాష్ట్రంలోని మూడు (కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ) ప్రాంతాల నుండి జనాభా, అక్షరాస్యత స్థాయిల ప్రాతిపదికన ఆరు జిల్లాలను[1] ఎంపిక చేయడమైంది. ప్రతి జిల్లాలోను సమగ్ర పరిశీలన కోసం పది కళాశాలలను తీసుకోవడం జరిగింది. నిర్దిష్ట ప్రశ్నావళి రూపంలో ఆన్‌లైన్ ద్వారానూ, ఎంపిక చేసిన జిల్లాల్లోనూ లబ్ధిదారుల సర్వే నిర్వహించడమైంది. మచ్చుకు తనిఖీ కోసం తీసుకున్న జిల్లాల్లో ఎంపిక చేసిన కాలేజీ సంఖ్యల వివరాలను పటం 3.1 లో చూపడమైంది.

[1] చిత్తూరు, హైదరాబాదు, ఖమ్మం, రంగారెడ్డి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, విశాఖపట్నం

ఆడిట్ లక్ష్యాలు, పద్ధతులను సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులతో 2011 సెప్టెంబరులో జరిగిన సమీక్షారంభ సమావేశంలో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడమైంది. ఆడిట్ పరిశీలనలను సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమీషనర్లతో 2013 ఫిబ్రవరిలో జరిగిన సమీక్షానంతర సమావేశంలో చర్చించడం జరిగింది. వారి స్పందనలు, లిఖితపూర్వక సమాధానాలను నివేదికలో అవసరమైన చోట్ల చేర్చడమైంది.



గమనిక: బ్రాకెట్లలోని సంఖ్యలు సాంఘిక/గిరిజన/వెనుకబడిన తరగతులు (బీసీ)/ అల్ప సంఖ్యాక వర్గాల (మైనారిటీల) సంక్షేమ శాఖల పరిధిలోని కళాశాలల సంఖ్య

***ఆడిట్‌లో కనుగొన్న అంశాలు***

## 3.3 ప్రణాళికా రచన

### 3.3.1 లబ్ధిదారుల గుర్తింపు

పలు దశాబ్దాలుగా స్కాలర్‌షిప్ పథకాలు అమలౌతున్నప్పటికీ, 2008 జూలైలో, ఈ పథకాలను 'సంతృప్తత ప్రాతిపదికన'[2] అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విధానంలోని ఈ మార్పు మూలంగా స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడానికి ముందే అర్హులైన విద్యార్థులను గుర్తించాల్సిన అవసరం ఏర్పడింది.

స్కాలర్‌షిప్‌ను పొందే అర్హతను పరిగణించడానికి, ప్రయోజనం పొందగోరే విద్యార్థుల నుండి వారి తల్లిదండ్రుల ఆదాయ స్థాయికి సంబంధించి ధృవపత్రాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. ఈ సమాచారాన్ని వెల్లడించేందుకు అనువుగా ఒక ప్రామాణిక నమూనాను ప్రభుత్వం నిర్దేశించింది. ఐతే, నిర్దేశిత నమూనాకు కట్టుబడి ఉండేలా సంబంధిత శాఖలు చూడడంలేదని ఆడిట్ గమనించింది. అంతేకాక, చిరునామాకు రుజువు మొదలైన ఇతర వివరాలపై భరోసా కలిగించేందుకు ప్రభుత్వం వద్ద ఎలాంటి యంత్రాంగం లేదు. ఈపాస్ వ్యవస్థలో రేషన్ కార్డు సంఖ్యను నింపేందుకు ఒక కాలమ్ ఉన్నప్పటికీ, ఈ సంఖ్యను తప్పనిసరి చేయనందువలన అనేకమంది విద్యార్థులు రేషన్ కార్డు సంఖ్యలను ఆ కాలమ్‌లో నమోదు చేయడం లేదు. ఈపాస్ వ్యవస్థలోని రేషన్ కార్డు సంఖ్యలను పౌరసరఫరాల డేటాబేస్‌లోని సమాచారంతో ఆడిట్ పోల్చిచూడగా, స్కాలర్‌షిప్ డేటాబేస్‌లో పేర్కొన్న రేషన్ కార్డు వివరాలు పౌరసరఫరాల డేటాబేస్‌లో లభ్యంకాని సందర్భాలు అనేకంఉన్నాయని వెల్లడైంది. వివరాలు ఈకింద ఇవ్వడమైంది.

పట్టిక 3.1

| సంవత్సరం | దరఖాస్తు చేసిన విద్యార్థుల సంఖ్య | రేషన్ కార్డు వివరాలను తెలిపిన విద్యార్థుల సంఖ్య | పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌లో లభ్యంకాని రేషన్ కార్డుల సంఖ్య |
|---|---|---|---|
| **2008-09** | 1540550 | శూన్యం | శూన్యం |
| **2009-10** | 2456261 | 3 | శూన్యం |
| **2010-11** | 2446265 | 1618782 | 86918 |
| **2011-12** | 2528563 | 2147685 | 128970 |

[2] 'సంతృప్తత ప్రాతిపదిక' అంటే అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ అందేలాచూడడం. ఒకవేళ ప్రస్తుత సంవత్సరంలో స్కాలర్‌షిప్ మంజూరుకాని విద్యార్థులకు తర్వాతి సంవత్సరంలో ప్రాధాన్యతనిచ్చి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు

ఆ కారణంగా, స్కాలర్‌షిప్‌ల మంజూరీ, చెల్లింపులు అర్హులైన విద్యార్థులందరికీ (మాత్రమే) జరిగాయన్న నిశ్చయానికి ఆడిట్ రాలేకపోయింది.

స్కాలర్‌షిప్ నమోదు ప్రక్రియను రేషన్ కార్డులతో ముడిపెట్టే విషయానికి సంబంధించి, మొదట్లో ఈ అంశాన్ని తప్పనిసరి చేసామని, ఐతే పలు విద్యార్థి సంఘాలు రేషన్ కార్డులు తమ వద్ద లభ్యంకావడం లేదంటూ విజ్ఞప్తి చేయడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం జరిగిందనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 ఫిబ్రవరి). రేషన్ కార్డులు కుటుంబ ఆదాయ వివరాలను సరిగా సూచించలేవు కాబట్టి రేషన్ కార్డు సంఖ్యకు బదులు 'మీసేవ' నుండి పొందే ఆదాయ ధృవపత్రంపై ఆధారపడడం సబబని, భవిష్యత్తులో 'ఆధార్ కార్డు' ఒక్కటే అన్ని పథకాలకు గుర్తింపుగా పనిచేస్తుందని కూడా సమీక్షానంతర సమావేశంలో పేర్కొంది.

ప్రభుత్వ వాదన సరికాదు, ఎందుకంటే పౌరసరఫరాల డేటాబేస్‌లో కులం, చిరునామా, కుటుంబ సభ్యులు, కుటుంబం ఫోటో, వార్షిక ఆదాయం, పిల్లల చదువులు, కుటుంబం కలిగి ఉన్న భూమి, ఐరిస్ మొదలైన వివరాలు ఉంటాయి. కాబట్టి, చిరునామాతోపాటుగా కులం, ఆదాయ స్థాయిలను నిర్ధారిస్తూ విద్యార్థుల అర్హతను గుర్తించడానికి ఇది దోహదకారి కాగలదు. 2010-11, 2011-12 సంవత్సరాల్లో విద్యార్థులు సమర్పించిన రేషన్ కార్డు వివరాల్లో వరుసగా ఐదు, ఆరు శాతం వివరాలు పౌరసరఫరాల డేటాబేస్‌లో లభ్యంకాని నేపథ్యంలో, లక్షిత లబ్ధిదారులను గుర్తించడానికి సరైన విధానాన్ని ప్రభుత్వం రూపొందించాల్సిన అవసరం ఉంది. దాంతోపాటుగా ఆ విధానాన్ని విధిగా అనుసరించేలా చూడాలి. ఈ అంశాన్ని, పేరా 3.4.2.4 లో వివరించినట్టుగా, అవసరమైన వివరాలు లేని కారణంగా కొన్ని సందర్భాల్లో స్కాలర్‌షిప్ మొత్తాలను విద్యార్థుల ఖాతాల్లోకి నోడల్ బ్యాంకులు జమ చేయలేకపోవడం, పేరా 3.6.5.1 లో చర్చించినట్టుగా, స్కాలర్‌షిప్‌ల కోసం వచ్చిన విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించడంలో పరిశీలనాధికారులు తగిన శ్రద్ధను చూపకపోవడం అనే వాస్తవం మరింత బలపరుస్తోంది.

## 3.4 ఆర్థిక నిర్వహణ

### 3.4.1 నిధులు సమకూరే విధానం

వివిధ స్కాలర్‌షిప్ పథకాల అమలుకు నిధులు సమకూరే క్రమాన్ని ఈ కింద చూపడమైంది :

| పథకం పేరు | సాంఘిక సంక్షేమం | గిరిజన సంక్షేమం | బీసీ సంక్షేమం | మైనారిటీల సంక్షేమం |
|---|---|---|---|---|
| ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ | | | | |
| (i) మెరిట్ అప్‌గ్రెడేషన్ కోసం | 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది | 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది | వర్తించదు | వర్తించదు |
| (ii) అపరిశుభ్ర వృత్తులలో ఉన్న వారి పిల్లలకు స్కాలర్‌షిప్ | అంగీకరించిన మొత్తం ఖర్చును[3] 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. | వర్తించదు | వర్తించదు | వర్తించదు |
| (iii) అత్యుత్తమ పాఠశాలలు (గిరిజన సంక్షేమం)/ఉజ్వల బాలుర పథకం (సాంఘిక సంక్షేమం) | రాష్ట్ర ప్రణాళికా పథకాలు కావడం వలన, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. | రాష్ట్ర ప్రణాళికా పథకాలు కావడం వలన, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. | వర్తించదు | వర్తించదు |

[3] 'అంగీకరించిన ఖర్చు' (కమిటెడ్ లయబిలిటీ) అంటే కేంద్ర ప్రాయోజిత పథకం కింద పదవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరం (2006-07) లో రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన మొత్తం ఖర్చు

| పథకం పేరు | సాంఘిక సంక్షేమం | గిరిజన సంక్షేమం | బీసీ సంక్షేమం | మైనారిటీల సంక్షేమం |
|---|---|---|---|---|
| (iv) ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ (కేంద్ర ప్రాయోజిత పథకం) | వర్తించదు | వర్తించదు | అంగీకరించిన ఖర్చును రాష్ట్రమే పూర్తిగా భరించాలి. అంతకు మించి అయ్యే ఖర్చును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తాయి. | కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో నిధులను అందిస్తాయి. |
| (v) ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ (రాష్ట్ర పథకం) | వర్తించదు | వర్తించదు | వర్తించదు | రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం నిధులను అందిస్తుంది. |
| **పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్** | | | | |
| పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్) | అంగీకరించిన ఖర్చును 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి. | అంగీకరించిన ఖర్చును 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి. | అంగీకరించిన ఖర్చును 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి. | ఎ) కేంద్ర ప్రాయోజిత పథకానికి 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది. బి) రాష్ట్ర పథకానికి 100 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. |

*మూలం : భారత ప్రభుత్వపు స్కాలర్‌షిప్ మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత ఉత్తర్వులు*

స్కాలర్‌షిప్ మొత్తాల మంజూరీ, వాటి విడుదలకు సంబంధించిన ప్రక్రియలు, అందుకు బాధ్యతను వహించే అధికారుల స్థాయీ వివరాలను ఈ కింద ఇవ్వడమైంది :

| ప్రక్రియ | బాధ్యత |
|---|---|
| అంచనాల తయారీ | సంబంధిత సంక్షేమ శాఖలు |
| బడ్జెట్‌కు ఆమోదం దాని విడుదల | ఆర్థిక మంత్రిత్వ శాఖ (కేంద్రం), ఆర్థిక శాఖ (రాష్ట్ర ప్రభుత్వం) |
| త్రైమాసిక బడ్జెట్‌ను ట్రెజరీలకు విడుదల చేయడం | సంబంధిత శాఖాధిపతులు |
| స్కాలర్‌షిప్ మొత్తాన్ని నోడల్ బ్యాంకులు/సీఐఎస్‌బీ అకౌంట్లకు విడుదల | ట్రెజరీలు |
| ఆర్‌టీఎఫ్ - ప్రైవేట్/ప్రభుత్వ కళాశాల అకౌంట్లకు; ఎమ్‌టీఎఫ్ - విద్యార్థుల అకౌంట్లకు/వార్డెన్ అకౌంట్లకు/కళాశాల అకౌంట్లకు మొత్తాలను జమచేయడం | బ్యాంకులు |
| వినియోగ ధృవపత్రాలను సమర్పించడం, వినియోగించని మొత్తాలను ప్రభుత్వ పద్దుకు వాపసు చేయడం | కళాశాలల అధిపతులు |
| జమా మొత్తాలను ట్రెజరీ మొత్తాలతో సరిపోల్చి చూడడం | జిల్లా సంక్షేమ అధికారి |
| ఫలించని లావాదేవీల రీకన్సిలియేషన్, దిద్దుబాటు, వాటిని రీ-ఆథరైజ్ చేయడం | ట్రెజరీలు |


## 3.4.2 బడ్జెట్, వ్యయం

స్కాలర్‌షిప్‌లపై, 2008-12 మధ్యగల నాలుగేళ్ల కాలంలో, రాష్ట్రంలో అయిన మొత్తం ఖర్చు ₹9,508 కోట్లు (ప్రీ-మెట్రిక్ : ₹139 కోట్లు, పోస్ట్-మెట్రిక్ : ₹9,369 కోట్లు). ప్రీ, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు,

ఆర్‌టీఎఫ్ లకు సంబంధించి 2008-09 నుండి 2011-12 సంవత్సరాల్లో మొత్తం బడ్జెట్ కేటాయింపులు, అయిన ఖర్చు వివరాలను (చార్టులు 3.1, 3.2), నాలుగు శాఖలకు సంబంధించిన వివరాలను (చార్టులు 3.3, 3.4) ఈ కింద ఇవ్వడం జరిగింది.


**చార్టు 3.1**

*ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి సంవత్సరాలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




**చార్టు 3.2**

*పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి సంవత్సరాలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




*మూలం : సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*


*గమనిక: ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన బడ్జెట్, ఖర్చులలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన నిధులు మాత్రమే ఉన్నాయి. మైనారిటీలకు సంబంధించి కేటాయించిన నిధులు, అయిన ఖర్చు వివరాలను పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లో కలపడమైంది. బీసీలకు సంబంధించి సంవత్సరాల వారీగా వివరాలు లభ్యం కాలేదు*

గడచిన నాలుగేళ్లలోనూ ప్రతీ సంవత్సరాంతానికి ఈ నాలుగు సంక్షేమ శాఖలవద్ద పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి భారీ మొత్తంలో నిధులు నిరుపయోగంగా పడి ఉన్నట్లు పై చార్టుల నుండి తెలుస్తోంది. సంవత్సర వారీగా వివరాలు *అనుబంధం-3.1* లో ఉన్నాయి. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయానికొస్తే, 2008-10 మధ్య కాలంలో అయిన ఖర్చు బడ్జెట్ కేటాయింపుకు ఇంచుమించుగా సరిపోయినప్పటికీ, 2011–12 సంవత్సరంలో మాత్రం వాటి మధ్య అంతరం బాగా పెరిగింది.

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి గడిచిన నాలుగేళ్లలో కేటాయించిన నిధుల్లో 24 శాతం మేర నిరుపయోగంగా మిగిలిపోయాయి. ప్రీ, పోస్ట్-మెట్రిక్ రెండు స్కాలర్‌షిప్ పథకాలకు సంబంధించి శాఖలవారీగా నిధుల వినియోగ స్థితిగతులను ఈకింద చూపడమైంది.


**చార్టు 3.3**

*ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




**చార్టు 3.4**

*పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




*మూలం : సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*

పథకాలను సమీక్షించడానికి ఆడిట్ పరిగణనలోకి తీసుకున్న నాలుగేళ్ల కాలంలో ప్రీ, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు కేటాయించిన నిధులను ఏ సంవత్సరమూ పూర్తిగా వినియోగించలేదని పై చార్టుల నుండి తెలుస్తోంది. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లలో నిధుల కేటాయింపు, వినియోగం మధ్య 24 శాతందాకా అంతరం ఉంది. మైనారిటీ సంక్షేమ శాఖ అధికంగా మొత్తాలను వినియోగించినట్లుగా చూపడానికి, మునుపెన్నడో కేటాయించి ఆయా

సంవత్సరాల్లో ఖర్చు చేయని మొత్తాలను వినియోగించడమే కారణం. నిజానికి, ఏపీ మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ స్కాలర్‌షిప్ పథకాలకు ఉద్దేశించిన నిధులను భారీగా స్తంభింప చేసింది. ఆ వివరాలను తర్వాత పేరాలో పేర్కొనడం జరిగింది.

ఇందుకు సంబంధించి, బడ్జెట్ విడుదల ఉత్తర్వులను జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం విధించిన ఆర్థిక నిర్బంధనల కారణంగా కొన్ని కేసులలో బిల్లులు ట్రెజరీలో స్వీకృతం కాలేదని శాఖలు సమాధానమిచ్చాయి (2013 ఫిబ్రవరి).

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయంలో ఆర్థిక నిర్వహణకు సంబంధించి ఆడిట్ పరిశీలనలను ఈ కింద చర్చించడమైంది :

### *3.4.2.1 ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ, ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ, యూఏఏపీ ల వద్ద నిరుపయోగంగా పడిఉన్న నిధులు*

ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ (మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ (యూఏఏపీ) లకు నిధులను విడుదల చేస్తుంటుంది. ఈ మూడు సంస్థలు అటుపై మైనారిటీ వర్గాల (ముస్లింలు, క్రిస్టియన్లు) విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరు, చెల్లింపుల నిర్వహణ కోసం ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ నిర్వహణ వ్యవస్థ (ఓఎస్ఎమ్ఎస్) ద్వారా స్కాలర్‌షిప్‌లను చెల్లించడానికి, జిల్లా స్థాయిలోని ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ కార్య నిర్వాహక సంచాలకులకు నిధులను విడుదల చేస్తాయి.

ఐతే, ఈ సంస్థల్లోని ఏ ఒక్కటీ కూడా బడ్జెట్ అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడంలేదు. ఫలితంగా, నిధుల అవసరం, ఆయా సంస్థలకు వాటిని వినియోగించే సామర్థ్యాలపై అవగాహన లేకుండానే ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించడం, నిధులను విడుదల చేయడం చేస్తోంది. ఆ కారణంగా, 2012 మార్చి నాటికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ స్కాలర్‌షిప్ పథకాల కోసం ఇచ్చిన నిధుల్లో **₹99.60 కోట్ల** మొత్తం ఈ సంస్థలవద్ద పేరుకుపోయాయి (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ: ₹80.70 కోట్లు, ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ: ₹10.44 కోట్లు, యూఏఏపీ: ₹8.46 కోట్లు). అంతేకాకుండా, ఈ ₹99.60 కోట్లలో, ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ ₹45.51 కోట్లను ఖర్చు చేయకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉంచింది.

ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం ధృవీకరిస్తూనే, లబ్ధిదారులు చేసిన క్లెయిమ్‌ల యదార్థతను పరిశీలించిన తర్వాత మాత్రమే ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ వారికి చెల్లింపులను చేస్తుందని, పరిశీలన ప్రక్రియకు సమయం పడుతుంది కాబట్టి నిధులు బ్యాంకుల్లో ఉండిపోయాయని సమాధానమిచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లలోని స్కాలర్‌షిప్ నిధుల దుర్వినియోగ అంశం సీబీసీఐడీ వద్ద పెండింగ్‌లో ఉందని ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ పేర్కొంది (2013 జనవరి).

***ఈ సంస్థల వద్ద, ముఖ్యంగా ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ వద్ద, భారీ మొత్తంలో నిధులు స్తంభించి పోవటంవలన, మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు నిర్ణీత సమయానికి స్కాలర్‌షిప్‌లను అందించాలన్న లక్ష్యం నెరవేరక పోవడంతో పాటూ, ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ వద్దులు బకాయిలో ఉన్నాయన్న వాస్తవం దృష్ట్యా నిధుల దుర్వినియోగం, మోసాలు జరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేము. తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవడం కోసం ప్రభుత్వం ఈ అంశాన్ని నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరముంది.***

### *3.4.2.2 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధుల మళ్లింపు*

మైనారిటీల సంక్షేమ శాఖలో, ప్రీ, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజుల భర్తీ చెల్లింపులన్నీ జిల్లా స్థాయి కార్య నిర్వాహక సంచాలకులు ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ ద్వారా నిధులను పొంది చెల్లిస్తారు. ఇందుకోసమై ప్రభుత్వం ప్రత్యేకించి ఇచ్చే నిర్వహణ సబ్సిడీ మొత్తం నుండి పాలనాపరమైన ఖర్చులను భరించాలి.

ఐతే, 2008-12 మధ్యకాలంలో మార్గదర్శకాలకు విరుద్ధంగా ₹17.47 కోట్ల పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ప్రకటనలు, పాలనాపరమైన, ఇతర అవసరాలకు మళ్లించారని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. వాస్తవంలో,

ప్రభుత్వం 2008-09 నుండి 2011-12 మధ్యకాలంలో ₹3.90 కోట్లను నిర్వహణ సబ్సిడీ కింద విడుదల చేయడం జరిగింది. కాబట్టి, స్కాలర్‌షిప్ మొత్తాలను ఈ అవసరాలకు వినియోగించడం సరికాదు.

స్కాలర్‌షిప్ నిధులను ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ పాలనాపరమైన ఖర్చులకు (ప్రీ-మెట్రిక్ కోసం 1 శాతం, పోస్ట్-మెట్రిక్ కోసం 2 శాతం, ఫీజుల భర్తీ నుండి 2 శాతం చొప్పున) వినియోగిస్తోందని ప్రభుత్వం అంగీకరించింది.

### *3.4.2.3 కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను రాష్ట్రం విడుదల చేయకపోవడం*

కేంద్ర ప్రభుత్వం ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థులకు సంబంధించి మెట్రిక్యులేషన్ స్థాయి తర్వాత విద్యాభివృద్ధి కోసం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని 1998-99 నుండి అమలుపరుస్తోంది. ఈ పథకం కింద, 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రానికి సమకూరుస్తుంది. పదవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరమైన 2006-07 లో ఈ పథకం కింద రాష్ట్రం ఎంత మొత్తాన్ని ఖర్చు చేసిందో, ఆ మొత్తం పదకొండవ పంచవర్ష ప్రణాళిక కాలంలోని ప్రతి సంవత్సరం రాష్ట్రం తన సొంత వార్షిక బడ్జెట్ నుండి సమకూర్చి, వినియోగించడానికి అంగీకరించిన మొత్తం (కమిటెడ్ లయబిలిటీ) అవుతుంది. 2012 మార్చి నాటికి పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు సంబంధించి ఈ కేంద్ర ప్రాయోజిత పథకం పరిస్థితి ఈ కింది విధంగా ఉంది :

పట్టిక 3.2

(₹ కోట్లలో)

| సంవత్సరం | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం | ఆర్థిక శాఖ జారీ చేసిన బడ్జెట్ విడుదల ఆదేశాలలోని మొత్తం | అయిన ఖర్చు | రాష్ట్ర ప్రభుత్వం వద్ద మిగిలిపోయిన మొత్తం |
|---|---|---|---|---|
| **2008-09** | 16.77 | 9.00 | 8.34 | 7.77(46%) |
| **2009-10** | 20.35 | 16.49 | 3.35 | 3.86(19%) |
| **2010-11** | 16.93 | 13.89 | 13.12 | 3.04(18%) |
| **2011-12** | 35.45 | 0.00 | 0.00 | 35.45(100%) |
| మొత్తం | **89.50** | **39.38** | **24.81** | **50.12** |

*మూలం : బీసీ సంక్షేమ సంచాలకుల కార్యాలయం రికార్డులు*

సమీక్షా కాలంలోని ఏ సంవత్సరంలోనూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను పూర్తిగా విడుదల చేయలేదని పై పట్టిక నుండి తెలుస్తోంది. వాస్తవానికి, 2011-12 సంవత్సరంలో, కేంద్ర నిధులు ₹35.45 కోట్ల నుండి ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు.

బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తాన్ని కూడా వినియోగించలేదు. మొత్తం ₹39.38 కోట్లలో 64 శాతం మాత్రమే వినియోగించింది. అంతేకాకుండా, ఏదైనా రాష్ట్ర ప్రణాళికా పథకం అమలు జరుగు తున్నట్లైతే వాటి నిధులను ప్రత్యేకించి విడిగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వ నిధులలో కలిపేశారు. ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద 2008-12 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ₹89.50 కోట్ల మొత్తానికిగాను, ₹50.12 కోట్లకు సంబంధించి బడ్జెట్ విడుదల ఆదేశాలు, పాలనాపరమైన మంజూరీలను జారీ చేయలేదు. ఐతే, ***బీసీ సంక్షేమ సంచాలకులు/ప్రభుత్వం మొత్తం ₹89.50 కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులనూ పూర్తిగా వినియోగించినట్లు చూపుతూ ధృవపత్రాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కానీ, వాస్తవానికి వినియోగించిన నిధులు కేవలం ₹24.81 కోట్లు మాత్రమే.***

ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన వివరణనీయలేదు. పరిస్థితిలోని తీవ్రత దృష్ట్యా, ప్రభుత్వం ఈ అంశాన్ని సమీక్ష/దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది.

### *3.4.2.4 నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ ఖాతాల్లో నిధులు భారీ మొత్తంలో స్తంభించిపోవడం*

ప్రభుత్వం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ మొత్తాలను విద్యార్థులకు ఐదు నోడల్ బ్యాంకులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్), ఆంధ్రా బ్యాంక్ (ఏబీ), సిండికేట్ బ్యాంక్ (ఎస్‌బీ), ఇండియన్ బ్యాంక్ (ఐబీ) ల ద్వారా చెల్లించే విధానాన్ని 2008 జూలైలో పరిచయం చేసింది. అప్పటి ప్రభుత్వ ఉత్తర్వుల (2008 జూలై) ప్రకారం, డ్రా వివరాలు, ఆపరేట్ చేయని విద్యార్థుల ఖాతాల వివరాలను కాలేజీల వారీగా ప్రతి మూడు నెలలకూ నోడల్ బ్యాంకులు జిల్లా సంక్షేమ అధికారికి సమర్పించాలి. సంబంధిత కాలేజీల్లో, విద్యార్థులు వాస్తవంగా చదువును కొనసాగిస్తున్నప్పుడు మాత్రమే నిర్వహణ చార్జీలను వారికి విడుదల చేయమంటూ బ్యాంకులకు సంక్షేమ అధికారి సూచించాలి.

ఐతే, నోడల్ బ్యాంకులు ఈ విధానం పాటించలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. నిర్దేశించిన విధంగా నోడల్ బ్యాంకులు కాలేజీ లవారీగా, విద్యార్థులవారీగా ఆపరేట్ చేస్తున్న, చేయని ఖాతాల వివరాలను ప్రతి మూడు నెలలకు జిల్లా సంక్షేమాధికారికి సమర్పించకపోవడం పర్యవేక్షణ వ్యవస్థ ఆశించిన విధంగా పనిచేయకపోవటాన్ని సూచిస్తోంది. అంతేకాకుండా, సమీక్షా కాలంలో, విద్యార్థులు/ప్రిన్సిపాల్‌ల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన మొత్తాలకు సంబంధించి నోడల్ బ్యాంకుల నుండి ఎలాంటి సమాచారం లేదు. 2012 ఏప్రిల్ నాటికి 2008-12 మధ్యగల నాలుగేళ్ల కాలానికి సంబంధించి ***₹176.83 కోట్ల*** మొత్తం నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ[4] ఖాతాల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయని తనిఖీలో వెల్లడైంది. ఫలితంగా ఈ కింద చర్చించిన విధంగా పథకం అమలు దెబ్బతింది :

- బీసీ సంక్షేమ శాఖ[5] మాత్రమే అందించిన సమాచారాన్ని విశ్లేషించగా, 2008-09, 2009-10 సంవత్సరాలకు సంబంధించి **₹20.32 కోట్ల**[6] మొత్తం విద్యార్థుల/కాలేజీల బ్యాంకు ఖాతాలకు జమకాకుండా **2012 ఏప్రిల్ నాటికి కూడా నోడల్ బ్యాంకుల్లోనే** పడి ఉన్నాయి. ఆపరేట్ చేస్తున్న, చేయని బ్యాంకు ఖాతాలకు సంబంధించి సరైన సమాచారం లేకపోవడమే ఇందుకు కారణం.

  చెల్లించకుండా ఉండిపోయిన స్కాలర్‌షిప్ మొత్తాలను తిరిగి పొందేలా నోడల్ బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామనీ, 2013 జనవరి నాటికి ₹6.46 కోట్ల మొత్తం ఇంకా బ్యాంకుల వద్దనే ఉందని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2013 ఫిబ్రవరి).

- ప్రభుత్వం 2010-11 నుండి స్కాలర్‌షిప్‌లను నోడల్ బ్యాంకుల ద్వారా కాకుండా కార్పొరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ (సీఐఎన్‌బీ) వ్యవస్థ ద్వారా చెల్లించే విధానాన్ని పరిచయం చేసింది. ఈ విధానంలో, జిల్లా/రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయంలోని ట్రెజరీలు, అకౌంట్ల సంచాలకులు (డీటీఏ) పేరున ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్ లలో సీఐఎన్‌బీ ఖాతాలను తెరుస్తారు. జిల్లా ట్రెజరీ, మూడు (సాంఘిక, గిరిజన, బీసీ) సంక్షేమ శాఖల జిల్లా అధికారులు సమర్పించిన బిల్లులను సమ్మతించిన తరువాత నిధులను సీఐఎన్‌బీ పద్దులకు బదలాయిస్తుంది. అక్కడ నుండి ఈ మొత్తాలు నేరుగా కాలేజీలు, విద్యార్థుల ఖాతాలకు జమ అయిపోతాయి.

  ఐతే, ఖాతా సంఖ్యలు, ఐఎఫ్ఎస్‌సీ[7] కోడ్‌ల మధ్య పొంతనలేక పోవడం, డూప్లికేట్ ఖాతాలు, బ్యాంకులలో సాఫ్ట్‌వేర్/సర్వర్‌లకు సంబంధించిన సమస్యలు వంటి వివిధ కారణాల వలన పలు లావాదేవీలు విఫలం కావడంతో 2012 మార్చి నాటికి **₹156.51 కోట్లు**[8] సీఐఎన్‌బీ ఖాతాల్లో నిరుపయోగంగా ఉండిపోయాయని గమనించడం జరిగింది.

---

[4] కార్పొరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్

[5] అలాంటి సమాచారాన్ని సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖలు అందజేయలేదు

[6] సాంఘిక సంక్షేమం : ₹4.59 కోట్లు; గిరిజన సంక్షేమం : ₹2.80 కోట్లు; బీసీ సంక్షేమం : ₹12.89 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు : ₹0.04 కోటి

[7] ఇండియన్ ఫైనాన్షియల్ సిస్టం కోడ్

[8] పీడీ ఖాతాల్లో ₹56.71 కోట్లు, సీఐఎన్‌బీ ఖాతాల్లో ₹99.80 కోట్లు

అటువంటి విఫలమైన లావాదేవీలను విశ్లేషించి, సరిపోల్చి, సరైన ఆథరైజేషన్ ద్వారా ఆ మొత్తాలు తిరిగి సంబంధిత ఖాతాలకు జమ అయ్యేలా చూసేందుకున్న నియంత్రణ విధానం పనిచేయడం లేదని స్పష్టమౌతోంది. మొత్తమ్మీద, ***ఈ బ్యాంకుల వద్ద ₹176.83 కోట్ల స్కాలర్‌షిప్ నిధులు నిలిచిపోయాయి.*** అంతేకాక, మైనారిటీల సంక్షేమ శాఖకు సంబంధించి 3.4.2.1 పేరాలో చర్చించిన విధంగా, ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ ₹45.51 కోట్ల మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉంచింది.

ఈజీ పే (eZ) చెల్లింపు కార్డుల్లోని లోపాలు, బ్యాంకుల నుండి సహకారం కొరవడిన కారణంగా నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ ఖాతాల్లో భారీగా నిధులు నిరుపయోగంగా ఉండిపోయాయని ప్రభుత్వం తెలిపింది. మిగిలిపోయిన మొత్తాలను ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కూడా తెలిపింది.

### *3.4.2.5 అవసరం లేనప్పటికీ ప్రభుత్వ కాలేజీలకు ట్యూషన్ ఫీజును మంజూరు చేయడం*

ప్రభుత్వ విద్యా సంస్థలు ట్యూషన్ ఫీజు భాగాన్ని ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేసి, స్పెషల్ ఫీజు, పరీక్ష ఫీజు, ఇతర ఫీజులను ప్రభుత్వేతర పద్దులో అట్టి పెట్టుకొని వీటి నుండి విద్యార్థులకు సంబంధించి వివిధ ఖర్చులను చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు సూచిస్తున్నాయి. ఆవిధంగా, ప్రభుత్వ కాలేజీల పద్దుల్లో ట్యూషన్ ఫీజు జమ అయిన వెంటనే దానిని చలాన్ ద్వారా ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేయాలి. ***ఐతే, ప్రభుత్వ కాలేజీలు ఈ ఆదేశాలను పాటించక పోవడం వలన ఆ మొత్తాలు ప్రిన్సిపాల్‌ల పద్దులోనే ఉండిపోతున్నాయి.*** ప్రభుత్వ విద్యా సంస్థలకు మొత్తాలను జమచేయడం, ఈ సంస్థలు వాటిని ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేసే ఈ విధానంలో అనవసరంగా ప్రజా నిధులు చిక్కుకుపోతున్నాయి.

ప్రభుత్వం 2008 నుండి 2012 వరకు ప్రభుత్వ విద్యా సంస్థలకు రీయింబర్స్ చేసిన ట్యూషన్ ఫీజు మొత్తం ₹88.30 కోట్లు. ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజులను ప్రభుత్వ పద్దుకు జమచేసే అంశంకు సంబంధించి ప్రభుత్వ కాలేజీలకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేయమని ఉన్నత విద్యా శాఖను కోరామని ప్రభుత్వ శాఖలు తమ సమాధానంలో పేర్కొన్నాయి.

### *3.4.2.6 స్కాలర్‌షిప్ నిధుల దుర్వినియోగం*

ఏటీఎమ్ సదుపాయంలేని బ్యాంకు ఖాతాలను కలిగిఉన్న విద్యార్థులందరికీ భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) వారి ఈజీపే (eZ) కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం 2010 డిసెంబరులో నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అందజేయడం కోసం హైదరాబాదు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారికి ఎస్‌బీఐ మొత్తం 30,059 ఈజీపే/ఏటీఎమ్ కార్డులను జారీ చేసింది (2010-11).

హైదరాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారికి చెందిన నాలుగు డివిజన్ల నుండి 2010 నవంబరు - 2011 డిసెంబరు మధ్యకాలంలో 4,156 కార్డులను (వాటిల్లో 2010 నవంబరుకు ముందు జారీ చేసిన ఏటీఎమ్ కార్డులు కూడా ఉన్నాయి) అపహరించారని ఆడిట్ తనిఖీలో వెల్లడైంది. 471 బ్యాంకు ఖాతాలనుండి మొత్తం ₹17.25 లక్షలు (ఈ ఖాతాల్లో జమచేసిన మొత్తం ₹19.12 లక్షల్లో[9] 90 శాతం మేర) మోసపూరితంగా డ్రాచేయడం జరిగింది. నిధుల దుర్వినియోగానికి ఈ కింది కారణాలు దోహదపడ్డాయి :

- బ్యాంకు ఈజీపే/ఏటీఎమ్ కార్డులను, వాటి రహస్య సంకేత పదాలను (పాస్‌వర్డ్) ఒకే కవర్‌లో పంపించడం;
- కార్డులను పంపించకపోవడం, వాటి భద్రతను పట్టించుకోకపోవడం;
- సంబంధిత అధికారి (ఏబీసీడబ్ల్యూఓ) సంఘటనను నివేదించడంలో జాప్యం (సుమారుగా 13 నెలలు), ఆ తర్వాత ఈ కార్డులకు విడుదలచేసిన నిధులను బ్యాంకు అధికారులు స్తంభింపజేసేలా బీసీ సంక్షేమ అధికారి తగిన చర్యలు తీసుకోవడంలో జాప్యం (ఒక నెల).

[9] ఏబీసీడబ్ల్యూఓ - చార్మినార్ (90 ఖాతాలు/₹2.91 లక్షలు), ఏబీసీడబ్ల్యూఓ - గోల్కొండ (209 ఖాతాలు/₹8.31 లక్షలు), ఏబీసీడబ్ల్యూఓ - ముషీరాబాద్ (86 ఖాతాలు/₹2.44 లక్షలు), ఏబీసీడబ్ల్యూఓ - సికింద్రాబాద్ (86 ఖాతాలు/₹3.59 లక్షలు)

ఒకే విద్యార్థికి రెండు, మూడు ఈజీపే కార్డులు జారీ కావడం, జారీ అయిన కార్డులకు సంబంధించిన విద్యార్థులు అందుబాటులో లేకపోవడం వలన ఈ కార్డులను అందజేయలేకపోయామని సాంఘిక సంక్షేమ కమీషనర్ తెలిపారు (2012 జూలై). నిధుల దుర్వినియోగ అంశం ప్రస్తుతం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, నేర పరిశోధన శాఖల దర్యాప్తులో ఉందని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి).

### *3.4.2.7 'రెమిటెన్స్‌ల/చలాన్‌ల రిజిస్టర్'ను నిర్వహించకపోవడం, వచ్చిన మొత్తాలను ట్రెజరీ అంకెలతో రీకన్సిలియేషన్ చేయకపోవడం*

అమలులో ఉన్న ఉత్తర్వుల ప్రకారం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి చెల్లింపు/సర్దుబాటు చేయని ఎమ్‌టీఎఫ్/ఆర్‌టీఎఫ్ మొత్తాలను విద్యా సంస్థలు పది రోజుల్లోగా ప్రభుత్వ పద్దుకు జమచేసి, సంబంధిత సంక్షేమ శాఖల జిల్లా అధికారులకు చలాన్ కాపీని పంపించాలి. అటువంటి చలాన్‌లన్నింటినీ 'రెమిటెన్సులు/చలాన్‌ల రిజిస్టర్' లో నమోదుచేసి, ట్రెజరీ అంకెలతో ప్రతి నెలా సరిపోల్చి చూడాలి.

***ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన వాటిల్లో, ఏ ఒక్క విద్యా సంస్థ/జిల్లా సంక్షేమ అధికారి కూడా ప్రభుత్వ ఉత్తర్వులను పాటించడం లేదు.***

నమూనాకు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో రికార్డులను మచ్చుకు చేసిన తనిఖీలో ఆడిట్ ఈ కింది అంశాలను గమనించింది :

- విద్యార్థులకు చెల్లించని ₹2.54 కోట్ల స్కాలర్‌షిప్ మొత్తాలను కాలేజీల ప్రిన్సిపాల్‌లు 2 నుండి 26 నెలల జాప్యంతో తిప్పి పంపారు.
- జిల్లా సంక్షేమ అధికారులు లిఖిత రూపంలోగానీ, ఎలక్ట్రానిక్ రూపంలోగాని కాలేజీల వారీగా ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌లు తిప్పిపంపిన మొత్తాలకు సంబంధించిన సమాచారాన్ని నిర్వహించని కారణంగా స్కాలర్‌షిప్‌కు సంబంధించి ఆయా సంవత్సరాల్లో వాస్తవంగా జరిగిన ఖర్చు వివరాలను వారు తెలుసుకొనే వీలులేదు.
- ప్రిన్సిపాల్‌లు సమర్పించిన రెమిటెన్సులు/చలాన్‌ల మొత్తాలను జిల్లా సంక్షేమ అధికారులు ట్రెజరీ మొత్తాలతో సరిపోల్చి చూడడం లేదు.

ఈపాస్ వెబ్‌సైట్‌లో రెమిటెన్స్ (చలాన్‌ల) వివరాలను నమోదుచేసే ఏర్పాటుకూడా లేదు.

జేడీలు/డీడీలందరినీ ఈ రిజిస్టర్‌లను నిర్వహించవలసిందిగా, ప్రతి నెలా ట్రెజరీ రీకన్సిలియేషన్ వివరాలను సమర్పించవలసిందిగా ఉత్తర్వులను జారీచేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఈపాస్ వెబ్‌సైట్‌లో రెమిటెన్స్ వివరాలను నమోదుచేసే ఏర్పాటు చేస్తామని హామీని కూడా ఇచ్చింది.

### *3.4.2.8 వినియోగ ధృవపత్రాలు*

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, నిధులను అందుకున్న నాటి నుండి 15 రోజుల్లోగా ప్రిన్సిపాల్‌లు వినియోగ ధృవపత్రాలను జిల్లా అధికారులకు సమర్పించాలి. విద్యా సంస్థలు, జిల్లా అధికారులు (సంబంధిత కమీషనరేట్లకు సమర్పించడంలో) ఈ నిబంధనను అనుసరించడం లేదు.

నమూనాకు ఎంపిక చేసిన జిల్లాల్లో, ₹1,606 కోట్ల మొత్తాన్ని విడుదల చేయగా అందుకు ప్రతిగా ₹1,122 కోట్ల[10] మొత్తానికి (70 శాతం) సంబంధించి సంబంధిత అధికారులు అంటే విద్యా సంస్థలు, జిల్లా సంక్షేమ అధికారులు వంటి వారి నుండి వినియోగ ధృవపత్రాలు ఇంకా రావలసిఉంది. వివరాలు ఈ కింద ఇవ్వడమైంది. అంతేకాకుండా, వినియోగ ధృవపత్రాలు వచ్చాయో లేదో తెలుసుకొనేందుకు వీలుగా ఎటువంటి రికార్డును నిర్వహించడం లేదు. ఈపాస్ అప్లికేషన్‌లో కూడా వినియోగ ధృవపత్రాల వివరాలను నమోదు చేసే ఏర్పాటు లేదు.

[10] 2008-09: ₹ 54 కోట్లు; 2009-10: ₹ 154 కోట్లు; 2010-11: ₹ 270 కోట్లు, 2011-12: ₹644 కోట్లు

పట్టిక 3.3

(₹ కోట్లలో)

| శాఖ | విడుదల చేసిన మొత్తం | వచ్చిన వినియోగ ధృవపత్రాలలోని మొత్తం | పెండింగులో ఉన్న వినియోగ ధృవపత్రాలు |
|---|---|---|---|
| బీసీ సంక్షేమం | 948 | 50 | 898 |
| గిరిజన సంక్షేమం | 167 | 11 | 156 |
| మైనారిటీ వర్గాల సంక్షేమం | 491 | 423 | 68 |
| **మొత్తం** | **1606** | **484** | **1122** |

*మూలం : జిల్లా సంక్షేమ అధికారుల రికార్డులు*

అంతేకాకుండా, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద అత్యుత్తమమైన పాఠశాలల (బీఏఎస్) కు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ నుండి ₹29.97 కోట్ల మొత్తానికి వినియోగ ధృవపత్రాలు రావలసి ఉంది. ఇంకా ఈ పథకానికి సంబంధించే గిరిజన సంక్షేమ విభాగం వద్ద ₹25.81 కోట్ల మొత్తంలో ₹15.80 కోట్ల మొత్తానికి వినియోగ ధృవపత్రాలు పెండింగులో ఉన్నాయి.

2013-14 సంవత్సరంకు సంబంధించి, కాలేజీలు, విద్యా సంస్థలు వినియోగ ధృవపత్రాలను సమర్పించేందుకు వీలుగా ఈపాస్ లోనే ఏర్పాటును కల్పించడం జరిగిందనీ, అంతకు ముందు సంవత్సరాలకు సంబంధించి ఆయా కాలేజీలు, విద్యా సంస్థల నుండి వినియోగ ధృవపత్రాలను అడగవలసిందిగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులనివ్వడమైందనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 ఫిబ్రవరి).

## 3.5 పథకాల అమలు

### 3.5.1 ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు

భారత ప్రభుత్వం ప్రీ-మెట్రిక్యులేషన్ దశలో ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన (ఓబీసీ) విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని 1998-99 నుండి అమలు చేస్తోంది. ఈ పథకం కింద, వసతి గృహాల్లో (హాస్టల్స్) ఉంటున్న విద్యార్థులకు III నుండి VIII తరగతుల్లోని వారికి నెలకు ₹ 200, IX, X తరగుతుల్లోని వారికి నెలకు ₹ 250 ను సంవత్సరంలో పది నెలలపాటు చెల్లిస్తారు. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'అంగీకరించిన మొత్తం[11]' (కమిటెడ్ లియబిలిటీ) కు మించి అయ్యే ఖర్చులో 50 శాతం భారత ప్రభుత్వం కేంద్ర సాయంగా రాష్ట్రానికి అందజేస్తుంది.

హాస్టల్‌లో లేకుండా చదువుకునే (డేస్కాలర్) ఓబీసీ విద్యార్థులకు కూడా 2009-10 నుండి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. మార్గదర్శకాల ప్రకారం, తల్లిదండ్రులు అన్ని మార్గాలద్వారా పొందే వార్షిక ఆదాయం ₹44,500 కు మించని, గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చదువుకుంటున్న విద్యార్థులు - I నుండి V తరగతుల విద్యార్థులు నెలకు ₹25, VI నుండి VIII తరగతుల విద్యార్థులు నెలకు ₹40, IX , X తరగతుల విద్యార్థులు నెలకు ₹50 చొప్పున పొందేందుకు అర్హులు. ఏటా ఒక్కో విద్యార్థికి ₹500 చొప్పున అడ్‌హాక్ గ్రాంటు కూడా ఇవ్వాల్సిఉంటుంది.

[11] 'అంగీకరించిన మొత్తం' అంటే పంచవర్ష ప్రణాళికలోని చివరి సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొత్తం ఖర్చు. ఉదాహరణకు 2006-07 లో అంటే, 10వ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకమైన ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం చేసిన మొత్తం ఖర్చు 2011-12 లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద అంగీకరించిన మొత్తం అవుతుంది

ఈ పథకాన్ని అమలు చేయడం కోసం భారత ప్రభుత్వం 2008-10 మధ్యకాలంలో ₹16.93 కోట్ల మొత్తాన్ని తన వాటాగా విడుదలచేసింది. అందులో 2013 ఫిబ్రవరి నాటికి, ₹4.79 కోట్ల మొత్తాన్ని ఇంకా క్రమబద్ధీకరణ/ఖర్చు చేయాల్సి ఉంది. ఐతే, రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలానికి సంబంధించి అంగీకరించిన మొత్తంతోపాటు తన వాటా మొత్తాన్ని ఇంకా కేటాయించలేదు. ఫలితంగా, భారత ప్రభుత్వం 2010-12 లో నిధులను విడుదలచేయలేదు.

### 3.5.2 మెరిట్ అప్‌గ్రేడేషన్ పథకం

IX నుండి XII తరగతులలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరిట్ అప్‌గ్రేడేషన్ పథకం ద్వారా ప్రత్యుపాయ (రెమిడియల్), ప్రత్యేక (స్పెషల్) శిక్షణలను అందించడం కోసం రాష్ట్రానికి 100 శాతం కేంద్ర సాయాన్ని అందించడం జరుగుతుంది. ప్రాత్యాంశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడం 'ప్రత్యుపాయ శిక్షణ' లక్ష్యం కాగా, ఇంజినీరింగ్, మెడికల్ వంటి వృత్తి విద్యా కోర్సులలో ప్రవేశం కోసం పోటీ పరీక్షలకు విద్యార్థులను తయారు చేయడం 'ప్రత్యేక శిక్షణ' ఉద్దేశం.

ప్రతి సంవత్సరం, రాష్ట్రం మొత్తంమీద 296 ఎస్సీ విద్యార్థులను (నాలుగు క్లాసుల్లో ప్రతి క్లాసు నుండి 74 మందిని) ఈ పథకం కిందకు తీసుకురావాలి. మునుపటి పరీక్షల్లో అత్యుత్తమంగా రాణించిన వారిని ఈ శిక్షణకు ఎంపిక చేయాలి. శిక్షణకు తగినంత సమయం ఉండేలా, వీరికి ఇతర పిల్లలకు మధ్య అర్థవంతమైన సహచర్యం అలవడేలా చేయడానికై విద్యార్థి IX వ తరగతి స్థాయిలో మొదలయ్యే ఈ శిక్షణ XIIవ తరగతి పూర్తి అయ్యేంత వరకూ నాలుగేళ్లపాటు కొనసాగుతుంది. ఒక విద్యార్థికి సంవత్సరానికి భోజనం, వసతి, పుస్తకాలు, రాత సామగ్రులకుగాను ₹8,000, అధ్యాపకులకు గౌరవ వేతనం, ఇతర అనుబంధ ఖర్చులకు గాను ₹7,000, మొత్తం ₹15,000 లను ప్యాకేజీ గ్రాంటుగా ఇవ్వడం జరుగుతుంది. ఇందుకు సంబంధించి ఆడిట్ పరిశీలనలను ఈ కింది పట్టికలో పేర్కొనడమైంది :

పట్టిక 3.4

(₹ లక్షల్లో)

| సంవత్సరం | గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు | వీటిలో నుండి రాష్ట్రం విడుదల చేసిన నిధులు | వీటిలో నుండి సాంఘిక సంక్షేమ కమీషనర్ విడుదల చేసిన మొత్తం | ఖర్చు | వ్యాఖ్యలు |
|---|---|---|---|---|---|---|
| **2008-09** | 296 | 44.40 | 44.40 | 44.40 | 44.40 | - |
| **2009-10** | - | - | - | - | - | నిధుల విడుదల జరగని కారణంగా పథకాన్ని అమలు చేయలేదు |
| **2010-11** | 592 | 88.80 | 88.80 | 88.80 | - | విడుదల చేసిన నిధులను ఇతర పథకానికి (బీఏఎస్) మళ్లించారు |
| మొత్తం | **888** | **133.20** | **133.20** | **133.20** | **44.40** | |

*మూలం : సాంఘిక సంక్షేమ కమీషనరేట్ రికార్డులు*

కేంద్ర సాయంగా పొందిన ₹1.33 కోట్ల గ్రాంట్లకుగాను, రాష్ట్ర ప్రభుత్వం ₹44.40 లక్షలకు సంబంధించి మాత్రమే వినియోగ ధృవపత్రాలను భారత ప్రభుత్వానికి సమర్పించింది. మిగిలిన ₹88.80 లక్షల మొత్తానికి వినియోగ ధృవపత్రాలను 2012 మార్చి నాటికి ఇంకా సమర్పించాల్సి ఉంది.

అవసరమైన నిధులను అందించకపోవడం, కేంద్ర పథకం నిధులను రాష్ట్ర పథకానికి అనధికారికంగా మళ్లించడంకు సమాధానంగా, ఈ పథకాల లక్ష్యాలు ఒకటేనంటూ ప్రభుత్వం సమర్థించుకునే ప్రయత్నం చేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులను కేంద్ర పథకాలకు వినియోగించుకునే అధికారాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారు గానీ, రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుండి అమలు చేయాల్సిన రాష్ట్ర పథకాలకు కేంద్ర నిధులను వినియోగించే అధికారం లేదు. కనుక ప్రభుత్వ వాదన అంగీకారయోగ్యం కాదు.

### 3.5.3 అపరిశుభ్ర వృత్తుల్లోని వారి పిల్లలకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు (సాంఘిక సంక్షేమం)

పారిశుద్ధ్యం, చెత్తను ఊడ్వడం, చర్మం ఒలవడం, తోళ్ళ పరిశ్రమ వంటి సంప్రదాయరీత్యా అపరిశుభ్ర వృత్తుల్లో పనిచేస్తున్న వారి పిల్లలను మెట్రిక్యులేషన్ స్థాయి వరకు విద్యనభ్యసించేలా చేసేందుకు ఆ పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందించడం ఈ కేంద్ర ప్రాయోజిత పథకం ఉద్దేశం. విద్యార్థులకు ప్రతి నెలా స్కాలర్‌షిప్‌ను, వార్షిక అడ్‌హాక్ గ్రాంటును ఆర్థిక సాయంగా అందిస్తారు. ఈ పథకం కింద స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసేందుకు ఆదాయ పరిమితి ఏమీ లేదు. తరగతులు III నుండి X వరకు హాస్టల్స్‌లో ఉండి చదువుకునే విద్యార్థులకు నెలకు ₹700, హాస్టల్స్‌లో లేకుండా చదువుకునే విద్యార్థులకు (డే-స్కాలర్స్) తరగతులు I నుండి X వరకు నెలకు ₹110 స్కాలర్‌షిప్‌గా మంజూరు చేస్తారు. అంతేకాకుండా, అన్ని తరగతులకు సంబంధించి సంవత్సరానికి ఒక విద్యార్థికిగాను డే-స్కాలర్లకు ₹750, హాస్టల్ విద్యార్థులకు ₹1,000 చొప్పున అడ్‌హాక్ గ్రాంటును ఇవ్వడం జరుగుతుంది. స్కాలర్‌షిప్ లను పొందేందుకు అర్హులైన పిల్లల సంఖ్య, ఆదాయ పరిమితులపై నిర్బంధనలను తొలగించి తద్వారా భారత ప్రభుత్వం ఈ పథకాన్ని సరళీకృతం చేసింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వివరాలు ఈ కింద ఇవ్వడమైంది.

పట్టిక 3.5

(₹ కోట్లలో)

| సంవత్సరం | గుర్తించిన లబ్దిదారుల సంఖ్య | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం | కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినది | సాంఘిక సంక్షేమ కమీషనర్ వద్ద మిగిలిపోయిన మొత్తం | అయిన ఖర్చు |
|---|---|---|---|---|---|
| 2008-09 | 8000 | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం |
| 2009-10 | 14438 | 21.72 | 11.13 | శూన్యం | 0.71 |
| 2010-11 | 13183 | 8.80 | 10.59 | 7.58 | 0.10 |
| 2011-12 | 16603 | శూన్యం | 8.80 | 0.00 | 1.65 |
| మొత్తం | | 30.52 | 30.52 | 7.58 | 2.46 |

*మూలం : సాంఘిక సంక్షేమ కమీషనరేట్ రికార్డులు*

ఈ పథకం అమలును ఆడిట్ తనిఖీ చేయగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- విడుదల చేసిన ₹22.94 కోట్లలో, కమీషనర్ ఆదేశాల మేరకు ₹9.67 కోట్లను సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాల అద్దె చెల్లింపులకు, అత్యుత్తమైన పాఠశాలల (బీఏఎస్) పథకానికి మళ్లించారు. ఈ పథకం అమలుపై కేవలం ₹2.46 కోట్లను మాత్రమే వినియోగించారు.

- మిగిలిన ₹10.80 కోట్ల నుండి చేసిన ఖర్చుకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారులు ఆడిట్‌కు అందజేయలేదు.

ఆ విధంగా, కేంద్రప్రభుత్వం అందించిన నిధులను విడుదల చేయకపోవడం, పథకం నిధులను హాస్టల్ భవనాల అద్దె చెల్లింపులకు, బీఏఎస్ పథకానికి అనధికారికంగా మళ్లించడం అపరిశుభ్ర వృత్తులలోని వారి పిల్లలకోసం ఉద్దేశించిన ఈ ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం అమలుపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

ప్రతీ సంవత్సరం ఆర్థిక సాయాన్ని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనల్లో అద్దె అంశాన్ని చూపుతున్నామని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి). ఐతే, అటువంటి మళ్లింపుకు కేంద్ర ప్రభుత్వ అనుమతికి సంబంధించి నిర్దిష్ట ఆదేశాలేవీ ఆడిట్‌కు సమర్పించలేదు. పథకంపై అయిన ఖర్చుకు వినియోగ ధృవపత్రాలను జిల్లా అధికారుల నుండి పొందుతున్నామని కూడా తెలియజేయడమైంది. ఇక్కడ గమనించ వలసినది ఏమిటంటే, పారిశుద్ధ్యం, చెత్తనూడ్చేపని, చర్మం ఒలిచే పని, తోళ్ల పరిశ్రమ వంటి సంప్రదాయరీత్యా

అపరిశుభ్రమైన వృత్తుల్లోని వారి పిల్లలను మెట్రిక్యులేషన్ స్థాయి దాకా చదువుకునేలా చేయడానికి ఆ పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందించడం కోసమే ప్రత్యేకించి ఈ పథకాన్ని ఉద్దేశించారుగాని, సాధారణవర్గ విద్యార్థుల కోసం కాదు. కాబట్టి ప్రభుత్వ వాదన సరికాదు.

### 3.5.4 కేంద్ర ప్రాయోజిత పథకం - ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధుల మళ్లింపు (వెనుకబడిన తరగతుల సంక్షేమం)

ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కోసం విడుదల చేసే నిధులను మరే ఇతర ప్రయోజనాలకు మళ్లించరాదని కేంద్రప్రభుత్వం జారీ చేసిన ఈ పథకం మార్గదర్శకాలు స్పష్టీకరిస్తున్నాయి. కేంద్ర సాయంగా అందుకునే ఈ నిధులను రాష్ట్ర పథకాలలోని కొరతను తీర్చడం కోసం వినియోగించరాదనీ, ఆమోదించిన ప్రమాణాల మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలనీ, రాష్ట్ర పథకాలను విడిగానే కొనసాగించాలని కూడా స్పష్టం చేయడం జరిగింది.

అయితే, ఈ మార్గదర్శకాలకు విరుద్ధంగా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ 2008-09 లో (2008 జూలై, 2009 ఫిబ్రవరి) 18 జిల్లాల వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులను హాస్టల్ లోని వారికి అలంకరణ సామగ్రి (కాస్మెటిక్) చార్జీల చెల్లింపు నిమిత్తం ఈ పథకం నిధుల నుండి ₹1.69 కోట్ల మొత్తాన్ని వినియోగించు కొనేందుకు అనుమతించింది. ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం తన సాధారణ బడ్జెట్ నుండి భరించాల్సి ఉండగా, పథకం నిధులను ఇందుకోసం మళ్లించడం వలన అర్హులైన విద్యార్థులు ఆ మేరకు స్కాలర్‌షిప్ ప్రయోజనానికి దూరమయ్యారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థుల ప్రయోజనార్థం వినియోగించడం జరిగిందని పేర్కొంటూ ప్రభుత్వం నిధుల మళ్లింపు చర్యను సమర్థించుకోజూసింది. ఐతే, స్కాలర్‌షిప్ కోసం విడుదల చేసే నిధులను మరే ఇతర ప్రయోజనాలకు మళ్లించరాదంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు ఇది విరుద్ధం.

## 3.6 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

### 3.6.1 పథకం అమలు జరిగే విధానం

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పుల పథకం కింద రెండు రకాల చెల్లింపులను అనుమతిస్తారు. అవి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్), నిర్వహణ రుసుం (మెయింటెనెన్స్ ఫీజు - ఎమ్‌టీఎఫ్). ఆర్‌టీఎఫ్ ను కళాశాల/ ప్రిన్సిపాల్ బ్యాంకు ఖాతాలకు నేరుగా చెల్లించడం జరుగుతుంది. ఎమ్‌టీఎఫ్ ను మాత్రం విద్యార్థి ఒకవేళ కళాశాల/శాఖ ఆధీనంలోని వసతి గృహంలో ఉంటున్నట్లైతే ఆయా వార్డెన్ల బ్యాంకు ఖాతాలకు, అలా కాకుండా తాము ఉండేందుకు విడిగా సొంతంగా ఏర్పాటు చేసుకున్నట్లైతే ఆయా విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు చెల్లిస్తారు. ఎమ్‌టీఎఫ్ రేట్లను ప్రామాణీకరించారు. ఆర్‌టీఎఫ్ రేట్లు మాత్రం సంబంధిత కాలేజీ ఫీజులపై ఆధారపడి మారుతూ ఉంటాయి.

సుమారుగా, ప్రతి ఏటా 25 లక్షల విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ ప్రయోజనాన్ని పొందుతుంటారు. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం నిర్దేశించిన స్లాబు రేట్ల ప్రకారం లిఖిత రూపంలో (మాన్యువల్‌గా) వాటి మంజూరీ, చెల్లింపులను చేస్తున్నారు. పేరా 3.2.3 లో పేర్కొన్న విధంగా, ఈ ప్రక్రియను ప్రస్తుతం కంప్యూటరీకరిస్తున్నారు. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను కూడా 2007-08 సంవత్సరం వరకూ 2002 జూలైలో ప్రభుత్వం జారీ చేసిన[12] మార్గదర్శకాలకు అనుగుణంగా లిఖిత రూపంలోనే మంజూరీ, చెల్లింపులు జరిగాయి. స్కాలర్‌షిప్ మొత్తాల

[12] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ, జీ.ఓ.ఎమ్ఎస్ నెం.90 తేది 2002 జూలై 30

మంజూరీ, చెల్లింపులలో జరుగుతున్న జాప్యాల దృష్ట్యా, ప్రభుత్వం కంప్యూటరీకరించిన వ్యవస్థద్వారా పథకాన్ని అమలుచేసే ప్రక్రియను 2008 జూలైలో పరిచయం చేసింది. 2008-12 మధ్యకాలంలో లబ్ధిదారుల ఎంపిక, స్కాలర్‌షిప్ చెల్లింపుల విధానంలో 2008-12 మధ్య కాలక్రమంలో చోటుచేసుకున్న మార్పులను ఈ కింద చూపడమైంది:

| విధానం | కాలం | ఆశించిన ప్రయోజనాలు | సమస్యలు |
|---|---|---|---|
| సామాజిక హితార్థ నిర్వహణ వ్యవస్థ (ఎస్‌బీఎమ్ఎస్) (జీ.ఓ.ఎమ్ఎస్ నెం.143 సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ, తేది 2008 జూలై 15) | 2008-09 | • మంజూరీ ప్రక్రియ సులభతరం చేయడం<br>• ప్రతి నెల ఒకటో తేదీన విద్యార్థులు నగదును డ్రాచేసుకొనేలా మంజూరీ, నిధుల వితరణలు సమయానికి జరిగేలా చూడడం<br>• మంజూరీ, నిధుల వితరణ మొత్తం సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచి తద్వారా జవాబుదారీతనం, పారదర్శకతలను మెరుగుపరచడం | • చాలీచాలని అంతర్గత నియంత్రణలు<br>• అసంపూర్తిగా ఉన్న సమాచార సేకరణ<br>• నివేదికలను రూపొందించడంలో పరిమితులు<br>• మాస్టర్ టేబుల్ లేకపోవడం<br>• డమ్మీ బ్యాంకు ఖాతాలు జనరేట్ కావడం<br>• అసంబద్ధమైన బడ్జెట్ మొత్తాలు జనరేట్ కావడం |
| ఈపాస్ (ఆన్‌లైన్) (జీ.ఓ.ఎమ్ఎస్ నెం.66 సాంఘిక సంక్షేమ (ఎస్‌డబ్ల్యూ.విద్య 2) శాఖ, తేది 2010 సెప్టెంబరు 8) | 2009-10 నుండి | • ఎస్‌బీఎమ్ఎస్ విధానంలోని సమస్యలను అధిగమించడం | • చాలీచాలని ధృవీకరణ (వేలిడేషన్) నియంత్రణలు<br>• అసంపూర్తిగా ఉన్న సమాచార సేకరణ |

ఎస్‌బీఎమ్ఎస్, ఈపాస్ - ఈ రెండు విధానాల్లోనూ 2008-12 మధ్యకాలంలో లావాదేవీల ప్రక్రియ, విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తాల చెల్లింపులకు సంబంధించి ఆడిట్ కనుగొన్న అంశాలను ఈకింద వివరించడమైంది.

### 3.6.2 ఎస్‌బీఎమ్ఎస్ కింద అంగీకారయోగ్యంకాని చెల్లింపులు

పైన పేర్కొన్న వ్యవస్థాగతమైన లోటుపాట్లతో పాటూ, ఎస్‌బీఎమ్ఎస్ లో లావాదేవీలను ఆడిట్ నమూనా తనిఖీ చేయగా ఈ కింద వివరించిన విధంగా అంగీకారయోగ్యంకాని చెల్లింపులు జరిగాయని తేలింది :

- 2007-08 బ్యాచ్ బి.ఎడ్. విద్యార్థులకు (1,484 మందికి) 2008-09 ఫీజు రేట్లను వర్తింపజేసి విద్యార్థికి ₹13,200 చొప్పున రీయింబర్స్‌మెంట్ చేసారు. వాస్తవానికి, 2007-08 రేట్ల ప్రకారం విద్యార్థికి ₹3,675 చొప్పున ఇవ్వాలి. ఫలితంగా, **₹33.49** లక్షల అధిక చెల్లింపు జరిగింది.
- అదేవిధంగా, 2008-09 సంవత్సరంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారులు వివిధ కోర్సులకు సంబంధించి అర్హతకు మించి అధికంగా ఫీజులను విడుదల చేయడం వలన **₹85.51** లక్షల అధిక చెల్లింపు జరిగింది.

అధిక చెల్లింపులను ప్రభుత్వం ధృవీకరిస్తూనే (2013 ఫిబ్రవరి) ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని పేర్కొంటూ, అధికంగా చెల్లించిన మొత్తాలను రికవరీ చేసేందుకు చర్యలను తీసుకున్నామనీ 2013 ఫిబ్రవరి నాటికి ₹92.38 లక్షలు రికవరీ చేసామని తెలిపింది.

### 3.6.3 ఈపాస్ వ్యవస్థ ఆవిర్భావం

ఈ వ్యవస్థకు సంబంధించి సాధ్యాసాధ్యాల అధ్యయనం, సాంకేతికపరంగా అవసరమయ్యే సిస్టమ్ స్పెసిఫికేషన్లు, వాడకందారుపరంగా అవసరమయ్యే స్పెసిఫికేషన్లు, సేవలనందజేసే వారితో కుదుర్చుకున్న ఒప్పందాలను సాంఘిక సంక్షేమ శాఖ ఆడిట్‌కు అందుబాటులో ఉంచలేదు. అంతేకాక, ఎస్‌బీఎమ్ఎస్ లో ఎదుర్కొన్న కొన్ని ఇబ్బందులను ప్రస్తుత వ్యవస్థ అధిగమించినప్పటికీ, పలు సమస్యాత్మక అంశాలను తరువాతి పేరాలలో చర్చించిన విధంగా ఇంకా పరిష్కరించాల్సి ఉంది.

### *3.6.3.1 ఈపాస్ సమాచార నిర్వహణకు 'సుపరిపాలనా కేంద్రం' వద్ద తగినంతగా సదుపాయాలు లేకపోవడం*

సుపరిపాలనా కేంద్రాన్ని పరిశోధన కోసం, వృత్తిపరమైన సలహాలనందించేందుకు, నిర్వహణ మార్పులకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహించేందుకుగాను ఏర్పాటు చేసారు. ఈ కేంద్రాన్ని స్థాపించే క్రమంలో దానికి కల్పించిన మౌలిక సదుపాయాలపరంగా ప్రభుత్వ శాఖలు/సంస్థలకు సమాచార కేంద్ర సేవలు (డేటా సెంటర్ సర్వీసెస్) ను ఈ కేంద్రం అందించలేదు. ఈ సేవల కింద కేంద్రీకృత మౌలిక సదుపాయాల అభివృద్ధి, భౌతికపరమైన భద్రత/రక్షణ వ్యవస్థలు, పరిసరాల నియంత్రణ, భారీ స్థాయిలో సమాచారాన్ని భద్రపరచడం, పంపిణీకి ఉపయుక్తమైన సమాచారాన్ని ఉత్పాదించడం, అవసరమైన సమాచారాన్ని శోధించి పొందడం, సమాచార నిర్వహణ, దాన్ని కోల్పోకుండా బేక్ అప్ తీసుకోవడం మొదలైన అంశాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కేంద్రం వద్ద చాలినంత మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ, ఈపాస్ వ్యవస్థలోని సమాచార భద్రత, అవసరమైన సమాచార శోధన, బేక్ అప్, నిర్వహణ బాధ్యతలను సుపరిపాలన కేంద్రానికి సాంఘిక సంక్షేమ శాఖ అప్పగించింది (2009 నవంబరు). ఐతే, ఈ కేంద్రం ఈపాస్ అప్లికేషన్‌లో పెరుగుతున్న సమాచార భారాన్ని నిర్వహించడంలో తన అశక్తతను వ్యక్తం చేసింది (2011 మార్చి).

సుపరిపాలనా కేంద్రం అన్ని సదుపాయాలను కలిగిఉన్న పూర్తి స్థాయి సమాచార కేంద్రం అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈపాస్ అప్లికేషన్‌లో పెరుగుతున్న సమాచార భారాన్ని నిర్వహించడానికి సుపరిపాలనా కేంద్రమే స్వయంగా అశక్తతను వ్యక్తం చేయడం గమనార్హం.

### *3.6.3.2 ఈపాస్ లో చాలీచాలని అప్లికేషన్ నియంత్రణలు*

విద్యార్థుల/కాలేజీల దరఖాస్తుల పరిశీలన, స్కాలర్‌షిప్ మంజూరీ, చెల్లింపులకు సంబంధించి ఈపాస్ వ్యవస్థలోని సమాచారాన్ని ఆడిట్ విశ్లేషించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

*మాన్యత లేని/నకిలీ నమోదులు*

- 2010-11, 2011-12 సంవత్సరాల్లో, వరుసగా 24.46 లక్షల విద్యార్థుల్లో 56,582 మంది, అలాగే 24.89 లక్షల విద్యార్థుల్లో 53,818 మంది ఒకే ఈ-మెయిల్ చిరునామాను ఉపయోగించారు.
- వేరువేరు 25 సంస్థలకు చెందిన 1,961 విద్యార్థులకు ఒకే చరవాణి (మొబైల్) సంఖ్య నమోదయింది.

2011-12 సంవత్సరం ద్వితీయార్ధం నుండి ఒకే ఈమెయిల్/మొబైల్ సంఖ్యలను పలుమార్లు నమోదు చేయడాన్ని ఈపాస్ వ్యవస్థ అనుమతించదని ప్రభుత్వం తెలిపింది. ఐతే, 2011-12 సంవత్సరంలోని సమాచార విశ్లేషణలో కూడా మాన్యత లేని/నకిలీ నమోదులు వెలుగు చూడడంవలన ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సరైనదికాదు.

*అడ్మిషన్ క్యాటగిరీ నమోదు చేయకపోవడం (కన్వీనర్/ మేనేజ్‌మెంట్/స్పాట్ అడ్మిషన్ కోటా)*

ఉమ్మిడి ప్రవేశ పరీక్షకు (సెట్) సంబంధించి 2009-10 సంవత్సరంలోని అన్ని కేసుల్లోనూ (4.70 లక్షల విద్యార్థులు), 2010-11 సంవత్సరంలో 5.04 లక్షల విద్యార్థుల్లో 5,570 మంది, 2011-12 సంవత్సరంలో 4.09 లక్షల విద్యార్థుల్లో 365 మంది విషయంలో అడ్మిషన్ క్యాటగిరీని నమోదు చేయలేదు.

ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరిస్తూనే, మాన్యతా నియంత్రణ లేకపోవడానికి సాంకేతికపరమైన తప్పిదం కారణమని తెలిపింది.

*అర్హమైన పరిమితికి మించి కుటుంబ ఆదాయం ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం*

ఈపాస్ అప్లికేషన్‌లో కుటుంబ ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను తిరస్కరించవలసిన వ్యవస్థ విఫలమైన ఫలితంగా 2008-11 మధ్యకాలంలో 576 అనర్హులైన విద్యార్థులకు **₹90** లక్షల మేర స్కాలర్‌షిప్‌ను చెల్లించడం జరిగింది.

ఆదాయ వివరాలను సరిచేసేందుకు సంబంధించి ఆప్షన్లను మార్చే బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించినా ఆ బాధ్యతను నిర్వర్తించడంలో వారి వైఫల్యమే ఈ పొరపాటుకు కారణమని ప్రభుత్వం తెలిపింది.

*కోర్సు కాలావధికి మించి స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం*

స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసేప్పుడు పరిగణించాల్సిన ముఖ్యమైన అంశాల్లో కోర్సు కాలావధి ఒకటి. ఐతే, కోర్సు కాలావధులను పరిగణించకుండానే స్కాలర్‌షిప్ చెల్లింపులకు మంజూరీనిచ్చారు. ఫలితంగా, నమూనాకు ఎంపిక చేసిన జిల్లాల్లో 73 మంది ఎమ్‌బీబీఎస్/బీడీఎస్ విద్యార్థులకు కోర్సు కాలావధికి మించి (4 1/2 ఏళ్లకు గాను 5 ఏళ్లదాకా) చెల్లింపులు చేసిన కారణంగా **₹11.98** లక్షల మేర అధిక చెల్లింపు జరిగింది.

ఎన్‌టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వారు తెలియజేసిన విధంగా వైద్య సహాయకులుగా పనిచేసే కాలానికి సంబంధించిన ఫీజును కూడా ఈపాస్ వ్యవస్థలో తీసుకోవడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. ఐతే, కోర్సు కాలావధికి మాత్రమే ఫీజును వసూలు చేయాలని స్పష్టంగా నిర్దేశిస్తున్న ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులకు[13] ఇది విరుద్ధం.

*ఈపాస్ అప్లికేషన్ పట్టికలో విద్యార్థుల వివరాలు లభ్యం కానప్పటికీ వారికి పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం*

అప్లికేషన్ పట్టికలో విద్యార్థుల దరఖాస్తు గుర్తింపు సంఖ్య (ఐడీ)తో పాటు వారి పూర్తి వివరాలుంటాయి. ఈ పట్టికలో విద్యార్థులకు సంబంధించి ఏమైనా కొన్ని వివరాలు లేనట్లైతే వారి వివరాలను పరిశీలించటం కుదరదు. ఐతే, 2008-12 మధ్యకాలంలో 649 మంది విద్యార్థులకు వారి సమాచారం, దరఖాస్తు ఐడీ లభ్యం కాకపోయినప్పటికీ పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసారని గమనించడమైంది.

ఈ దరఖాస్తులు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు, అత్యుత్తమ పాఠశాలల (బీఏఎస్) విద్యార్థులకు సంబంధించినవి కావడం వలన ఇది సాంకేతికపరంగా వీలుకాదని ప్రభుత్వం పేర్కొంది. స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థులందరి వివరాలు అప్లికేషన్ సమాచారంలో లభ్యంకావాలి కనుక ప్రభుత్వం సమాధానం ఆమోదయోగ్యం కాదు.

*కాలేజి బ్యాంకు ఖాతాలకు ఎమ్‌టీఎఫ్‌ను జమచేయడం*

కాలేజీ లకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లింపులకు సంబంధించిన మార్గనిర్దేశకాల ప్రకారం, కాలేజీలకు ఆర్‌టీఎఫ్, విద్యార్థులకు నిర్వహణ చార్జీల (ఎమ్‌టీఎఫ్) చెల్లింపులు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారానే చేయాలి. అన్ని కాలేజీలు, లబ్ధిని పొందగోరే విద్యార్థులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలను కలిగిఉండి, దాని వివరాలను బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలుతో పాటుగా రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించాలి. సంబంధిత కాలేజీ లకు ఆర్‌టీఎఫ్‌ను రెండు వాయిదాలలోనూ, విద్యార్థులకు/వార్డెన్ల బ్యాంకు ఖాతాలకు ఎమ్‌టీఎఫ్ ను నాలుగు వాయిదాలలోనూ చెల్లిస్తారు. బ్యాంకు ఖాతా సంఖ్యలలో ఎలాంటి మార్పుని చేయాలన్నా ఇందుకు అధికారాన్ని కలిగిఉన్న కాలేజీ ప్రతినిధి లేదా విద్యార్థి మాత్రమే, సందర్భానుసారం, చేయాల్సి ఉంటుంది.

[13] మెమో నెం.14528/ఈ1/2002-2, తేదీ 2002 అక్టోబరు 3

ఈ మార్గ నిర్దేశాలకు విరుద్ధంగా, 2009-12 మధ్యకాలంలో 1,21,806 సందర్భాల్లో విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాల స్థానంలో విద్యా సంస్థల బ్యాంకు ఖాతా వివరాలతో నింపేసినట్టు గమనించడం జరిగింది.

అంతేకాకుండా, కాలేజి అనుబంధ హాస్టల్, ఆయా శాఖల అనుబంధ హాస్టల్‌లలో ఉండని విద్యార్థులకు మంజూరు చేసిన ₹4.30 కోట్ల మేర ఎమ్‌టీఎఫ్ మొత్తాన్ని కాలేజి బ్యాంకు ఖాతాలకు జమచేసారని కూడా గమనించడమైంది.

ఈ సమాచారాన్ని ఈపాస్ సమాచారంతో పరిశీలించామనీ, ఎస్ఎమ్‌హెచ్/డేస్కాలర్ విద్యార్థులెవరికీ సీఏహెచ్/డీఏహెచ్ కింద ఎమ్‌టీఎఫ్‌ను మంజూరు చేయలేదని ఆ పరిశీలనలో వెల్లడైందని ప్రభుత్వం తెలిపింది. ఐతే, తొమ్మిది కేసుల్లో ఎమ్‌టీఎఫ్‌ను కాలేజీ/హాస్టల్ ఖాతాలకు మంజూరు చేసారనీ, రెండు సందర్భాలలో మొత్తాలను కాలేజీ /హాస్టల్ ఖాతాలకు విడుదల చేసారని కూడా ఆడిట్ గమనించింది.

### *3.6.3.3 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను నియమ విరుద్ధంగా రీయింబర్స్‌మెంట్ చేయడం*

నమూనాకు ఎంపిక చేసిన జిల్లాల ఆడిట్ తనిఖీలో స్కాలర్‌షిప్‌లను ఈ కింద వివరించిన విధంగా నియమ విరుద్ధంగా రీయింబర్స్‌మెంట్ చేసిన అనేక సందర్భాలు వెల్లడయ్యాయి :

#### *అర్హతలేని గేట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరీ*

గేట్[14] లో ర్యాంకును పొందిన విద్యార్థులు, సాయాన్ని ఒకే రూపంలో పొందేందుకు మాత్రమే అర్హులనీ, ఇతర సాయంతో దీన్ని కలపరాదనీ ప్రభుత్వ ఉత్తర్వులు[15] నిర్దేశిస్తున్నాయి. ఇందుకు విరుద్ధంగా, 2010-11 లో పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను 137 గేట్ విద్యార్థులకు చెల్లించ డం వలన **₹76.82 లక్షల**[16] మేర సరికాని చెల్లింపులు జరిగాయి.

అనర్హులైన విద్యార్థుల నుండి ఈ మొత్తాలను రికవరీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేసామని, ఆ ప్రక్రియ పురోగతిలో ఉందని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

#### *అర్హతలేని స్పాట్ అడ్మిషన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు*

ప్రభుత్వ ఉత్తర్వుల[17] (2011 ఫిబ్రవరి) ప్రకారం,కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిన తరవాత కన్వీనర్ కోటాకింద భర్తీకాని సీట్లను స్పాట్ అడ్మిషన్లుగా పరిగణించాలి; వీటికి ఆర్‌టీఎఫ్/ఎమ్‌టీఎఫ్ చెల్లించడం జరగదు. ఐతే, ఈ నిబంధనలకు విరుద్ధంగా, 2010-11 మధ్యకాలంలో 152 విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌గా **₹56.49** లక్షలను[18] చెల్లించారు.

తమ ఉత్తర్వులకు విరుద్ధంగా మంజూరీలు జరగలేదని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఐతే, ఆడిట్ కనుగొన్న కేసులు 2010-11 లోని సరికొత్త కేసులే తప్ప ఆ సంవత్సరంలో రెన్యూవల్‌కు సంబంధించినవి కావు. అంతేకాక, ఉన్నత విద్య ఏపీ రాష్ట్ర కౌన్సిల్ నుండి పొందిన సమాచారాన్ని ఈపాస్‌లోని మంజూరీలతో విశ్లేషించి కనుగొన్నవి కనుక ప్రభుత్వ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

---

14 గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్

15 సాంఘిక సంక్షేమ (విద్య-2) శాఖ 2011 ఆగస్టు 16 తేదీన జారీ చేసిన మెమో నెం.1611 /ఎస్‌డబ్ల్యూ.విద్య2/2011-7

16 చిత్తూరు - ₹3.11 లక్షలు; హైదరాబాద్ - ₹5.57 లక్షలు; ఖమ్మం - ₹3.99 లక్షలు; రంగారెడ్డి - ₹39.53 లక్షలు; శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు - ₹1.30 లక్షలు, విశాఖపట్నం - ₹23.32 లక్షలు

17 సాంఘిక సంక్షేమం (విద్య 2) శాఖ 2011 ఫిబ్రవరి 3 తేదీ నాటి మెమో నెం.1611/ఎస్‌డబ్ల్యూ.విద్య2/2011-2

18 చిత్తూరు: ₹10.97 లక్షలు (30); ఖమ్మం: ₹3.86 లక్షలు (10); రంగారెడ్డి : ₹16.10 లక్షలు (43); శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు: ₹1.45 లక్షలు (4), విశాఖపట్నం: ₹24.11 లక్షలు (65)

*సవరించిన ఫీజు విధానాన్ని అప్‌డేట్ చేయకపోవడం*

ఈపాస్ డేటాబేస్‌లో 1,806 విద్యార్థులకు సంబంధించి సవరించిన ఫీజు వివరాలను అప్‌డేట్ చేయకపోవడంవలన ఆర్‌టీఎఫ్ ను అర్హతకు మించి **₹82.82 లక్షలను**[19] అధికంగా చెల్లించారు (2009-11).

ఈ కేసులను పరిశీలించి దిద్దుబాటు చర్యలను తీసుకుంటామని ప్రభుత్వం హామీనిచ్చింది.

*నియమ విరుద్ధంగా స్పెషల్ ఫీ మంజూరీ*

ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ లో ఆర్ట్స్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు, వారు స్పెషల్ ఫీ కి అర్హులుకానప్పటికీ, నియమ విరుద్ధంగా **₹43.95 లక్షల** మేర స్పెషల్ ఫీ ని మంజూరు చేసారు.

ఇందుకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ నిర్దిష్టమైన సమాధానాన్ని ఇవ్వలేదు.

2009-10 సంవత్సరంకు సంబంధించి ఎమ్.ఫార్మసీ కోర్సుకు ఎలాంటి స్పెషల్ ఫీని ప్రభుత్వం ప్రకటించలేదు. ఐతే, ఆ సంవత్సరంలో 541 మంది ఎమ్.పార్మసీ విద్యార్థులకు స్పెషల్ ఫీ రూపంలో **₹15.57 లక్షలను** మంజూరు చేసారు.

సంబంధిత కాలేజీల నుండి ఆయా మొత్తాలను రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

*వర్గీకరణ దోషాల వలన అధిక రేట్లతో ఎమ్‌టీఎఫ్ మంజూరీ*

మహిళా కళాశాల (ఉస్మానియా విశ్వవిద్యాలయం) కు చెందిన డేస్కాలర్లకు, వారికి వర్తించే స్కాలర్‌షిప్ రేట్లకు బదులు విద్యార్థులు నిర్వహించే హాస్టల్స్ (ఎస్ఎమ్‌హెచ్) లో ఉండేవారికి ఇచ్చే రేట్లను వర్తింపజేయడం వలన 2008-11 మధ్యకాలంలో 2,946 విద్యార్థుల విషయంలో **₹27.15** లక్షల మేర అధికంగా స్కాలర్‌షిప్ చెల్లింపుకు దారితీసింది.

2011-12 సంవత్సరం నుండి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించి ఎస్ఎమ్‌హెచ్ క్యాటగిరీని ఆపేసామనీ, ఆ విద్యార్థులకు రెండు రకాలైన అంటే కాలేజి అనుబంధ హాస్టల్, డేస్కాలర్ క్యాటగిరీలు మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి). ఐతే, 2011-12 సంవత్సరంలో కూడా ఎస్ఎమ్‌హెచ్ లకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసినట్లు ఆడిట్ కనుగొంది కాబట్టి ప్రభుత్వ వాదన ఆమోదయోగ్యం కాదు.

ఆమోదించిన క్లెయిమ్‌లన్నింటినీ పరిశీలించి, అధిక మొత్తాలకు మంజూరీలను ఇచ్చిన చోట్ల వాటిని రికవరీ చేయాలనీ, సరైన క్లెయిమ్‌ల విషయంలో వాటిలోని ఇబ్బందులను తగురీతిన తొలగించి క్లెయిమ్‌లను పరిష్కరించాలనీ కమీషనర్లు/జిల్లా కలెక్టర్లు/సంక్షేమ అధికారులందరికీ ప్రభుత్వం ఆదేశాలను జారీచేసింది (2010 ఆగస్టు). ఐతే, రికవరీలు చేయడం కోసం ఈపాస్ సమాచారాన్ని విశ్లేషించే దిశగా సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలను ఆరంభించక పోవడం వలన 2012 మార్చి నాటికి ఏవిధమైన రికవరీలు జరగలేదు.

### 3.6.3.4 బూటకపు క్లెయిమ్‌లు

ఈపాస్ వ్యవస్థలోని దరఖాస్తు ఫారంలో కొన్ని ఫీల్డ్‌లకు (పాస్ రకం/స్టేట్/బోర్డు) అభ్యర్థులు వేరువేరు ఆప్షన్లను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉన్న కారణంగా ఒకే అభ్యర్థి దాఖలు చేసిన పలు దరఖాస్తులను ఈపాస్ అనుమతిస్తోంది. ఫలితంగా అదే అభ్యర్థికి పలుమార్లు మంజూరీలు/స్కాలర్‌షిప్ విడుదలలు జరిగాయి. అలాంటి డూప్లికేట్ దరఖాస్తుల సంఖ్య (ఎస్ఎస్‌సీ గుర్తింపు సంఖ్య, ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సంవత్సరం, జనన తేదీలతో

---

[19] చిత్తూరు - ₹22.27 లక్షలు; హైదరాబాద్ - ₹22.88 లక్షలు; ఖమ్మం - ₹2.95 లక్షలు; రంగారెడ్డి - ₹28.22 లక్షలు; శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు - ₹0.17 లక్ష; విశాఖపట్నం - ₹6.33 లక్షలు

సరిపోలిన దరఖాస్తులు) ఒక్కో కాలేజీలో 2 నుండి 66 దాకా ఉన్నాయి. ఈ విధమైన వెసులుబాటు ఫలితంగా 2008-12 నాలుగేళ్ల కాలంలో మొత్తం 19,375 బూటకపు స్కాలర్‌షిప్ క్లెయిమ్‌లకు సంబంధించి **₹20.60 కోట్ల** చెల్లింపులు జరిగాయి. దరఖాస్తులోని లొసుగే ఈ లోపానికి కారణం. ఇది ప్రిన్సిపాల్, పరిశీలనాధికారి, జిల్లా సంక్షేమ అధికారుల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోంది.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ (2013 ఫిబ్రవరి), సంబంధిత విద్యార్థులు, కాలేజీల నుండి మొత్తాలను రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది.

### *3.6.3.5 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరీలలో జాప్యం*

ప్రభుత్వ విధానం ప్రకారం, స్కాలర్‌షిప్‌లను 'సంతృప్తత ప్రాతిపదికన' (సాట్యురేషన్ బేసిస్) మంజూరు చేయాలి. ఐతే, 2009-11 మధ్యకాలంలో 3 నుండి 19 శాతం విద్యార్థులకు అదే విద్యా సంవత్సరంలో ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్ లను మంజూరు చేయలేదు. 2008-09 సంవత్సరంలో ఇందుకు సంబంధించిన వివరాలు ఈపాస్ వ్యవస్థలో లభ్యం కాలేదు. అంతేకాకుండా, 2011-12 లో వచ్చిన దరఖాస్తుల సంఖ్య, స్కాలర్‌షిప్‌ను పొందిన విద్యార్థుల సంఖ్య వివరాలు కూడా ఈపాస్‌లో లభ్యంకాలేదు.

**పట్టిక 3.6**

| సంవత్సరం | విద్యార్థుల సంఖ్య | | | మంజూరు చేసిన మొత్తం (₹ కోట్లలో) | చెల్లించాల్సి ఉన్న మొత్తం (₹ కోట్లలో) | అదే సంవత్సరంలో ఎమ్‌టీఎఫ్/ఆర్‌టీఎఫ్ మంజూరుకాని విద్యార్థుల శాతం |
|---|---|---|---|---|---|---|
| | ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్ కోసం దరఖాస్తు చేసినవారు | ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్‌లకు మంజూరీ పొందినవారు | మంజూరీ పొందాల్సిన వారు | | | |
| **2009-10** | 2267874 | 1626569 | 641305 | 2839.93 | 88.01 | 3% |
| **2010-11** | 2204616 | 764978 | 1439638 | 2905.98 | 542.09 | 19% |

*మూలం : ఈపాస్ సమాచారం*

ప్రభుత్వం ఆర్‌టీఎఫ్ ను విడుదల చేయకపోవడంతో, కాలేజీ యాజమాన్యం విద్యార్థుల నుండి బలవంతంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఈ విషయం కాలేజీ ల ప్రత్యక్ష తనిఖీలోనూ, లబ్ధిదారుల సర్వేలోనూ నిర్ధారితమయింది. సుమారు 9 శాతం విద్యార్థులను సర్వే చేయగా, కాలేజీ/సంస్థలకు ముందస్తుగా చెల్లించిన ట్యూషన్ ఫీజులు వారు ఇంకా పొందాల్సి ఉందని తెలిపారు.

కొన్ని కాలేజీ లు విద్యార్థుల నుండి బలవంతంగా ఫీజులను వసూలు చేస్తున్నాయన్న దానితో ప్రభుత్వం ఏకీభవిస్తూనే, స్కాలర్‌షిప్‌కు డిమాండ్ అసాధారణ రీతిలో పెరిగిపోవడం వలన వాటి మంజూరులో జాప్యం జరిగిందనీ, ఫలితంగా అదే సంవత్సరంలో అవసరాలను తీర్చలేకపోయామనీ, దానివల్ల బకాయిలను తరువాతి ఆర్థిక సంవత్సరంలో తీర్చాల్సి వచ్చిందని పేర్కొంది.

### *3.6.3.6 ఈపాస్ వ్యవస్థలో ఫీజు విధానాన్ని సరిగా ప్రోగ్రామ్ చేయకపోవడం*

ప్రభుత్వ ఉత్తర్వుల (2010 సెప్టెంబరు) ప్రకారం, పథకాన్ని పర్యవేక్షించే విభాగం (పీఎమ్‌యూ) ఫీజు, కోర్సుల వివరాలను అప్‌డేట్ చేయడం, ఫీజు విధానాన్ని పర్యవేక్షించడం, ఈపాస్ వ్యవస్థలో అన్ని సంక్షేమ శాఖలకు సంబంధించిన సాంకేతికపరమైన ఇబ్బందులను పరిష్కరించడం విధిగా చేయాలి.

ఐతే, పలుకేసుల్లో ఈపాస్‌లో ప్రోగ్రామ్ చేసిన దానికి, ఆమోదించిన ఫీజు విధానానికి మధ్య వ్యత్యాసాలుండడంతో పీఎమ్‌యూ తన విధులను నిర్వర్తించడం లేదని స్పష్టమౌతోంది. మూడు విశ్వవిద్యాలయాల అధికారిక ఫీజు వివరాలను ఈపాస్ అప్లికేషన్‌లోని ఫీజు వివరాలతోనూ, వాస్తవంగా జమ చేసిన స్కాలర్‌షిప్ రేట్లతోనూ ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసింది. ఇలా సరిపోల్చినపుడు, 624 కుగాను 107 కోర్సుల్లో వ్యత్యాసాలున్నట్లు వెల్లడైంది. ఫలితంగా ఈకింద వివరించినట్లుగా **₹67 లక్షల** అధిక చెల్లింపు జరిగింది.

పట్టిక 3.7

(₹ లక్షల్లో)

| విశ్వవిద్యాలయం పేరు | సంవత్సరం | ట్యూషన్ ఫీజు (విద్యార్థుల సంఖ్య) | స్పెషల్ ఫీజు (విద్యార్థుల సంఖ్య) | మొత్తం |
|---|---|---|---|---|
| శ్రీ వేంకటేశ్వర | 2009-10 | 1.40 (185) | 0.79 (93) | 2.19 |
| కాకతీయ | 2010-11 | 0.84 (64) | 0.18 (50) | 1.02 |
| ఉస్మానియా | 2011-12 | 45.58 (3408) | 18.40 (920) | 63.98 |
| మొత్తం | | **47.82 (3657)** | **19.37 (1063)** | **67.19** |

*మూలం : విశ్వవిద్యాలయాలు, ఈపాస్‌ల నుండి సేకరించిన సమాచారం*

ఫీజు విధానాన్ని పీఎమ్‌యూ సరిగా పర్యవేక్షించక పోవడం వల్లనే ట్యూషన్, స్పెషల్ ఫీజుల అధిక చెల్లింపు జరిగిందనీ, ఆమేరకు విద్యా సంస్థలు ఆయాచితంగా లాభపడ్డాయనీ స్పష్టమౌతోంది. ఇతర విశ్వవిద్యాలయాల విషయంలో కూడా ఈవిధంగా ట్యూషన్, స్పెషల్ ఫీజుల అధిక చెల్లింపులు జరిగాయన్న అంశాన్ని తోసిపుచ్చలేము.

ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన సమాధానివ్వలేదు.

### *3.6.3.7 అర్హతలేని వయసువారికి స్కాలర్‌షిప్‌ల మంజూరీ*

సాంఘిక సంక్షేమ శాఖ ఆదేశాల (2011 నవంబరు) ప్రకారం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందడానికి నిర్ణయించిన గరిష్ఠ వయోపరిమితి వివరాలు ఇలా ఉన్నాయి :

పట్టిక 3.8

| విద్యా స్థాయి | ఈబీసీ/మైనారిటీలు/వికలాంగులు | ఎస్సీ/ఎస్టీ, బీసీ |
|---|---|---|
| ఇంటర్మీడియేట్ | 20 సంవత్సరాలు | 24 సంవత్సరాలు |
| గ్రాడ్యుయేట్ | 25 సంవత్సరాలు | 29 సంవత్సరాలు |
| పోస్ట్-గ్రాడ్యుయేట్, ఆపైన | 30 సంవత్సరాలు | 34 సంవత్సరాలు |

*మూలం : ఈపాస్ సమాచారం*

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం '0' నుండి 14 సంవత్సరాల వయసు వారికీ, 34 సంవత్సరాలు దాటిన వారికీ స్కాలర్‌షిప్ నిరాకరించాలి. ఐతే, ఈపాస్ సమాచార విశ్లేషణలో, ఈకింద వివరించిన విధంగా వయో పరిమితి కంటే తక్కువ వయసున్నవారికీ, పరిమితి దాటినవారికీ 2011-12 లో ₹1.44 కోట్ల మేర స్కాలర్‌షిప్‌లను మంజూరుచేసి, విడుదల చేసారని వెల్లడైంది.

పట్టిక 3.9

(₹ లక్షల్లో)

| వయస్సు (సంవత్సరాల్లో) | విద్యార్థుల సంఖ్య | ఆర్‌టీఎఫ్ | | ఎమ్‌టీఎఫ్ | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|
| | | మంజూరైనవి | విడుదల చేసినవి | మంజూరైనవి | విడుదల చేసినవి | మంజూరైనవి | విడుదల చేసినవి |
| **0 to 14** | 1165 | 62.01 | 27.34 | 18.58 | 12.52 | 80.59 | 39.86 |
| **35 to 112** | 1458 | 173.83 | 72.59 | 42.38 | 31.93 | 216.21 | 104.52 |
| మొత్తం | **2623** | **235.84** | **99.93** | **60.96** | **44.45** | **296.80** | **144.38** |

*మూలం : ఈపాస్ సమాచారం*

స్కాలర్‌షిప్‌లకు వయో పరిమితిని 2011-12 సంవత్సరం నుండి కొత్త విద్యార్థులకు మాత్రమే వర్తింపజేస్తున్నామనీ, ఈ పథకంలో ముందునుంచే నమోదు అయిఉండి, స్కాలర్‌షిప్ కోసం రెన్యూవల్ చేయించుకోదలిచే విద్యార్థులకు ఈ పరిమితి వర్తించదనీ ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). అలా రెన్యూవల్ చేయించుకున్న వయో పరిమితి దాటిన విద్యార్థులకు మాత్రమే 2011-12 లో స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం జరిగిందని తెలిపింది. ఐతే, పైన చెప్పిన ప్రభుత్వ మెమొరాండంలో కొత్త, రెన్యూవల్ కేసుల మధ్య తారతమ్యాన్ని చూపకుండా, 2011 జూలై 01 నాటికి అర్హతను పొందేందుకు ఉండాల్సిన గరిష్ఠ వయసును మాత్రమే అందులో నిర్దేశించడం జరిగింది, కాబట్టి ప్రభుత్వ వాదన సరికాదు. అంతేకాకుండా, ఈపాస్ సమాచార విశ్లేషణలో కొత్త విద్యార్థుల విషయంలో కూడా వయో పరిమితిని వర్తింప చేయలేదని వెల్లడైంది.

### *3.6.3.8 ఫీజును అధికంగా జమ చేయడం*

ఈపాస్ వ్యవస్థ, ప్రతి విద్యార్థి ఆర్‌టీఎఫ్‌ను సంబంధిత కోర్సు/కాలేజీ లకు సంబంధించిన ఆయా విశ్వ విద్యాలయాలు నిర్దేశించిన ఫీజు విధానం ఆధారంగా లెక్కిస్తుంది. ఐతే, 2008-12 మధ్యకాలంలో మంజూరైన ఆర్‌టీఎఫ్ ఫీజు వివరాల విశ్లేషణలో, ఈపాస్ అప్లికేషన్ ఫీజును సరిగా లెక్కించక పోవడంతో ప్రభుత్వం కాలేజీలకు ₹33.65 కోట్ల మేర (2.23 లక్షల కేసుల్లో) అధికంగా ట్యూషన్ ఫీజును మంజూరు చేసిందని వెల్లడైంది.

కాలేజీలు అందజేసిన సమాచారం ఆధారంగా ఈపాస్ వ్యవస్థలో వాటి వర్గీకరణను మార్పు చేయడం జరిగిందనీ, అధికంగా మంజూరీలనిచ్చిన చోట్ల రికవరీలు చేస్తామనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది. కాలేజీ వర్గీకరణను మార్చినప్పటికీ, మొదట్లో ఇచ్చిన మంజూరీలను సవరించలేదనీ, ఫలితంగానే అధిక విడుదల జరిగిందనీ ఆడిట్ తన పరిశీలనలో గమనించింది.

ఈపాస్ వ్యవస్థలో కాలేజీల వర్గీకరణను సరిజేయడం వాస్తవమైనప్పటికీ, అందుకనుగుణంగా డేటాబేస్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకపోవడం వలన మంజూరీ వివరాల్లో సవరణలు జరగలేదు. ఈ కారణంగా, ప్రభుత్వ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

## 3.6.4 మంజూరీకి మించి ఆర్‌టీఎఫ్, ఎమ్‌టీఎఫ్‌లను విడుదల చేయడం

ఆర్‌టీఎఫ్, ఎమ్‌టీఎఫ్ మొత్తాలను అనేక సందర్భాల్లో మంజూరు చేసిన దానికంటే అధికంగా విడుదల చేసారని గమనించడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.


పట్టిక 3.10

| సంవత్సరం | స్కాలర్‌షిప్ | విద్యార్థుల సంఖ్య | మంజూరైన మొత్తం | విడుదల చేసిన మొత్తం | మంజూరీకి మించి అధికంగా విడుదల చేసిన మొత్తం |
|---|---|---|---|---|---|
| | | | (₹ లక్షల్లో) | | |
| **2008-09** | ఆర్‌టీఎఫ్ | 35572 | 423.08 | 584.53 | 161.45 |
| | ఎమ్‌టీఎఫ్ | 48 | 0.72 | 1.33 | 0.61 |
| **2009-10** | ఆర్‌టీఎఫ్ | 33964 | 2229.08 | 3067.62 | 838.54 |
| | ఎమ్‌టీఎఫ్ | 4133 | 119.92 | 175.39 | 55.47 |
| **2010-11** | ఆర్‌టీఎఫ్ | 79 | 5.77 | 8.68 | 2.91 |
| | ఎమ్‌టీఎఫ్ | 41 | (-) 0.42 | 0.00 | 0.00 |
| **2011-12** | ఆర్‌టీఎఫ్ | ——— అధికంగా చెల్లించలేదు ——— | | | |
| | ఎమ్‌టీఎఫ్ | 82 | (-) 0.91 | 1.32 | 2.23 |
| మొత్తం | | | | | **1061.21** |

మంజూరీకి మించి అధికంగా విడుదల చేసిన సందర్భాలు లేవని ప్రభుత్వం తన లిఖితపూర్వక సమాధానంలో తెలిపింది. ఐతే, ఆడిట్ లేవనెత్తిన అంశాలను పరిశీలించి, దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది.

## 3.6.5 అర్హత పరిశీలన, స్కాలర్‌షిప్ మంజూరీ

ప్రభుత్వం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల చెల్లింపుకు విద్యార్థుల అర్హతను నిర్ధారించడానికి నిర్దేశించిన విధానం, అర్హత పరిశీలన బాధ్యతను నిర్వహించే అధికారులను ఈ కింద చూపడమైంది.




### *3.6.5.1 పరిశీలనాధికారులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను పరిశీలించడంలో తగిన శ్రద్ధను చూపకపోవడం*

ప్రభుత్వం సమయానుసారంగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ప్రత్యక్షంగా స్కాలర్‌షిప్ దరఖాస్తులను, ప్రమాణ పత్రాలనూ పరిశీలించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు గుర్తించిన పరిశీలనాధికారులు నిర్వహించాలి. తద్వారా అతి తక్కువ జాప్యంతో స్కాలర్‌షిప్‌లను అసలైన విద్యార్థులకు అందేలా చూడాలి.

ఐతే, స్కాలర్‌షిప్ దరఖాస్తులను పరిశీలించడంలో, *అనుబంధం-3.2* లో వివరించిన విధంగా తగిన శ్రద్ధను చూపలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

దరఖాస్తుల పరిశీలనకు నిర్దేశించిన నియమాలను నిష్కర్షగా పాటించేలా పరిశీలనాధికారులకు విపులమైన సూచనలను జారీచేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

### *3.6.5.2 మేనేజ్‌మెంట్ కోటా కింద చేరిన విద్యార్థులకు నియమ విరుద్ధంగా చెల్లింపులు*

2010 సెప్టెంబరు నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన, స్పాట్ అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులుకారు. ఇదివరకే వారికి ఒకవేళ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసి ఉంటే, ఆ మొత్తాలను రికవరీ చేసేలా చర్యలను తీసుకోవాలి. ఐతే, సంక్షేమ శాఖలు ఈ ఉత్తర్వులను పాటించలేదు.

**పట్టిక 3.11 (₹ లక్షల్లో)**

| శాఖ | విద్యార్థుల సంఖ్య | 2009-10 | | మొత్తం |
|---|---|---|---|---|
| | | ఆర్‌టీఎఫ్ | ఎమ్‌టీఎఫ్ | |
| సాంఘిక సంక్షేమం | 102 | 50.88 | 11.00 | 61.88 |
| గిరిజన సంక్షేమం | 126 | 71.66 | 14.94 | 86.60 |
| బీసీ సంక్షేమం | 523 | 231.55 | 35.38 | 266.93 |
| ఈబీసీ | 472 | 201.38 | 0.78 | 202.16 |
| మొత్తం | **1223** | **555.47** | **62.10** | **617.57** |

*మూలం : ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఇచ్చిన సమాచారాన్ని ఆడిట్ ఈపాస్ దరఖాస్తులతో పోల్చిచూసింది*

మచ్చుకు ఎంపిక చేసుకున్న జిల్లాల్లోని ఆయా శాఖల జిల్లా సంక్షేమ అధికారుల రికార్డులను ఆడిట్ పరిశీలించగా, 2009-10 సంవత్సరానికి ఇంజినీరింగ్/ఎమ్‌బీఏ/ఎమ్‌సీఏ/బీఎడ్ కోర్సులలో మేనేజ్‌మెంట్ కోటా కింద చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసారని వెల్లడైంది. మేనేజ్‌మెంట్ కోటా కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారికిచ్చిన స్కాలర్‌షిప్ మొత్తాల వివరాలు పట్టిక 3.11 లో ఉన్నాయి. ఐతే, నియమ విరుద్ధంగా చెల్లించిన ఆ మొత్తాలను 2012 సెప్టెంబరు నాటికి కూడా ఇంకా రికవరీ చేయలేదు.


మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థులకు నియమ విరుద్ధంగా స్కాలర్‌షిప్ మంజూరు చేయడాన్ని అంగీకరిస్తూనే, 2011-12 వరకూ ఈపాస్ వ్యవస్థలో సాధారణ ప్రవేశపరీక్ష (సెట్) క్రమబద్ధీకరణ స్వయంచాలితంగా (ఆటోమేటిక్) జరగకపోవడమే ఇందుకు కారణమని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). సంబంధిత కాలేజీలు, విద్యార్థుల నుండి ఆ మొత్తాలను రికవరీ చేయడానికి జిల్లా అధికారులకు సూచనలిచ్చామని కూడా పేర్కొంది.

### *3.6.5.3 ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా నిర్వహణ చార్జీలను పూర్తిగా మంజూరు చేయడం*

ఉచిత భోజన, వసతి సదుపాయాలను పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థుల విషయంలో నిర్వహణ చార్జీల రేట్లలో 1/3 వంతు మాత్రమే చెల్లించాలని పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి భారత ప్రభుత్వ మార్గదర్శకాలు (2003) నిర్దేశిస్తున్నాయి. ఐతే, ఈ నిర్దేశనలను రాష్ట్ర ప్రభుత్వం పాటించలేదు. ఈపాస్‌లోని సమాచార విశ్లేషణలో, 2008-10 మధ్యకాలంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ లకు సంబంధించి సంక్షేమ శాఖలు అర్హతకు మించి అధికంగా **₹ 13.99 కోట్లను** చెల్లించాయని వెల్లడైంది.


**చార్టు - 3.5**

*అధికంగా చెల్లించిన నిర్వహణ చార్జీలు (స్థూల రూపం)*




**చార్టు - 3.6**

*ఎంపిక చేసుకున్న జిల్లాల్లో అధికంగా చెల్లించిన నిర్వహణ చార్జీలు*




ఆడిట్ ఈ విధమైన అధిక చెల్లింపును వెల్లడించిన మీదట, గిరిజన, సాంఘిక సంక్షేమ కమీషనర్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ లకు చెందినవారి విషయంలో 2010-11 సంవత్సరం నుండి చెల్లింపులను నిలిపివేయాలని జిల్లా సంక్షేమ అధికారులకు సూచనలనివ్వడం జరిగింది (2011 ఫిబ్రవరి).

ఈపాస్‌లో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ లకు చెందినవారి దరఖాస్తుల దాఖలును నిలిపివేసామని ప్రభుత్వం తెలిపింది.

### *3.6.5.4 తిరుమల తిరుపతి దేవస్థాన కాలేజీలకు నియమ విరుద్ధంగా స్కాలర్‌షిప్‌ల విడుదల*

చిత్తూరు జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థాన పాలనాధీనంలో అనుబంధ హాస్టళ్లను కలిగిఉన్న ఎనిమిది కాలేజీలకు (ఈ హాస్టళ్లలో ఉచిత భోజన సదుపాయాన్ని దేవస్థానమే కల్పిస్తుంది) చెందిన 21,665 మంది విద్యార్థులకు సంబంధించి ₹2.93 కోట్లు మాత్రమే విడుదల చేయాల్సి ఉండగా, ₹8.78 కోట్లను విడుదల చేసారు. **2012 ఫిబ్రవరి నాటికి కూడా ఈ మొత్తం వార్డెన్ల ఖాతాల్లోనే పడిఉంది.**

ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థాన పరిధిలోని కాలేజీ హాస్టల్ విద్యార్థుల విషయంలో మార్గనిర్దేశనలను వర్తింపజేసేలా ఈపాస్ వ్యవస్థలో తగిన మార్పులు చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

### 3.6.5.5 మైనారిటీ వర్గాల విద్యార్థులకు తక్కువ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం

రాష్ట్ర ప్రభుత్వం 2008-09 సంవత్సరం నుండి, మైనారిటీ వర్గాల విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్ రేట్లను వెనుకబడిన తరగతుల విద్యార్థులకు వర్తించే రేట్లకు సమానంగా పెంచింది (2006 డిసెంబర్). ఐతే, మైనారిటీల సంక్షేమ శాఖ ఈ పెంచిన రేట్లను వర్తింపజేయలేదు. ఫలితంగా, 2008-11 మధ్యకాలంలో మైనారిటీ వర్గానికి చెందిన 3,37,689 విద్యార్థులు ₹2.70 కోట్ల మేర (2008-09: ₹98.08 లక్షలు/1,22,604 విద్యార్థులు, 2009-10: ₹84.36 లక్షలు/1,05,454 విద్యార్థులు, 2010-11: ₹87.71 లక్షలు/1,09,631 విద్యార్థులు) స్కాలర్‌షిప్ నష్టపోయారు.

ప్రభుత్వం 2006 డిసెంబరులోని తన ఆదేశాలను అమలు చేయకపోవడానికి సంబంధించి నిర్దిష్టమైన వివరణను ఇవ్వలేదు.

### 3.6.5.6 ప్రత్యక్ష తనిఖీని నిర్వహించకపోవడం

- అర్హులైన అభ్యర్థుల నందరినీ సంవత్సరంలో రెండుసార్లు (అంటే కాలేజీలు తెరిచిన నాటినుండి నెలలోపు మొదటిసారి, అడ్మిషన్లు పూర్తయిన తేదీనుండి నెలలోగా రెండవసారి) ప్రత్యక్షంగా పరిశీలించాలని ప్రభుత్వ ఉత్తర్వులు[20] పేర్కొంటున్నాయి. ఐతే, ఈ ఆదేశాలకు విరుద్ధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు సంవత్సరంలో ఒకేసారి అంటే కాలేజీలు తెరిచిన తరవాత మాత్రమే ప్రత్యక్ష పరిశీలనను చేస్తున్నారు. రెండవ విడత పరిశీలనను 2008-09 నుండి 2010-11 మధ్యకాలంలోని ఏ సంవత్సరమూ నిర్వహించలేదు. ప్రభుత్వం మాత్రం ఆదేశాల కనుగుణంగానే ప్రత్యక్ష పరిశీలనను నిర్వహిస్తున్నామని వాదించింది (2013 ఫిబ్రవరి). ఐతే, దీనిని ఎంపిక చేసిన జిల్లాల్లో మచ్చుకు చేసిన తనిఖీ ధృవీకరించడంలేదు.

- గిరిజన సంక్షేమ శాఖ 2009-10, 2010-11 సంవత్సరాలకు గాను రాష్ట్రం వెలుపల చదువుకుంటున్న ఖమ్మం, రంగారెడ్డి, విశాఖపట్నం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ₹9.10 లక్షల మొత్తాన్ని మంజూరు చేసింది. ఐతే, ఈ విద్యార్థులను ప్రత్యక్షంగా లేదా మరే ఇతర విధంగానైనా పరిశీలించకుండానే మంజూరీలనివ్వడం జరిగింది. ఆడిట్ కనుగొన్న అంశాలను ప్రభుత్వం ఆమోదించి, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తామని వాగ్దానం చేసింది.

- ఇంటర్మీడియేట్ విద్యా బోర్డు తగిన పరిశీలనలను నిర్వహించి ఇంటర్మీడియేట్ విద్యార్థుల జాబితాను కంప్యూటరీకరిస్తున్న దృష్ట్యా, సాంఘిక సంక్షేమ కమీషనర్ సూచనల మేరకు, ఇంటర్మీడియేట్ కాలేజీ విద్యార్థులను శాఖాపరమైన పరిశీలనాధికారులు ప్రత్యక్షంగా నిర్ధారించుకొనే ప్రక్రియను ప్రభుత్వం 2011 డిసెంబరు నుండి ఆపేసింది. ఐతే, కులం, ఆదాయ ధృవీకరణల పరిశీలనలతోపాటుగా పరిశీలనాధికారులు నిర్వర్తించాల్సిన వివిధ విధులను ఇంటర్మీడియేట్ విద్యా బోర్డు నిర్వహించదు కనుక అర్హతలేని, బోగస్, కాలేజీని విడిచిపెట్టేసిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తాలు జమ అయ్యే ఆస్కారం లేకపోలేదు. అలాంటి ఒక సందర్భాన్ని ఆడిట్ గుర్తించింది. రంగారెడ్డి జిల్లా, కూకట్‌పల్లిలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల (కోడ్ సంఖ్య 15231) లో 100 మంది ఇంటర్మీడియేట్ (మొదటి, రెండవ సంవత్సరం) విద్యార్థులకు, వారు ఆ

[20] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ జీఓ ఎమ్ఎస్ నెం.143, తేది 2008 జూలై 15

కళాశాలలో చేరనప్పటికీ/చదువుతూ ఉండనప్పటికీ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసారు. కాబట్టి, శాఖాపరమైన అధికారులు విద్యార్థులను ప్రత్యక్షంగా నిర్ధారించే విధానాన్ని తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం సరికాదు.

అలాంటి కేసులేవీ లేవని ప్రభుత్వం సమాధానమిచ్చినా, వారి తనిఖీలో అలాంటి కేసులను కనుగొన్న సందర్భాలున్నాయని సమీక్షానంతర సమావేశంలో అంగీకరించింది.

### 3.6.5.7 విద్యార్థుల హాజరును నిర్ధారించుకోకుండానే స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం

ప్రభుత్వ ఉత్తర్వుల[21] ప్రకారం (2008 జూలై), ప్రతి త్రైమాసం చివరకు హాజరు 75 శాతం కంటే తక్కువ ఉన్న విద్యార్థుల జాబితాను ఆయా విద్యా సంస్థల అధిపతులు సంబంధిత సంక్షేమ శాఖల జిల్లా అధికారులకు పంపించాలి. అటువంటి విద్యార్థులకు తరువాత త్రైమాసంలో స్కాలర్‌షిప్ అందకుండా జిల్లా అధికారులు చూసుకోవాలి. ఇందుకోసం, కాలేజీలలో విద్యార్థుల హాజరును తరచూ సంబంధిత జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు (పరిశీలనాధికారులు) తనిఖీ చేస్తుండాలి.

ఐతే, పై విధానాన్ని పాటించడం లేదు. ఎంపిక చేసుకున్న జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లా సంక్షేమాధికారీ హాజరు తక్కువ ఉన్న విద్యార్థుల రికార్డును గానీ, చదువు ఆపేసిన విద్యార్థుల నెలవారీ జాబితానుగానీ నిర్వహించడం లేదు. కాబట్టి, చదువు ఆపేసిన వారికీ, కాలేజీ కి సక్రమంగా హాజరుకాని వారికీ జిల్లా సంక్షేమాధికారులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను, ఆర్‌టీఎఫ్‌ను మంజూరు చేసి ఉండేందుకు అన్ని విధాలా అవకాశముంది.

విద్యార్థుల హాజరు నిర్ధారణ, ధృవీకరణల బాధ్యత సంబంధిత విద్యా సంస్థల అధిపతులదేనని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఐతే, నియత రీతిన జిల్లా అధికారులు, పరిశీలనాధికారులు విద్యార్థుల హాజరును తనిఖీ చేయాలని నిర్దేశిస్తూ జారీ చేసిన 2008 ఫిబ్రవరి నాటి ప్రభుత్వ సూచనలను ఈ సమాధానం పరిగణనలోకి తీసుకోలేదు.

### 3.6.5.8 పెండింగులో ఉన్న దరఖాస్తుల పరిశీలన

ఈపాస్ వ్యవస్థలో వచ్చిన దరఖాస్తులను ఆడిట్ విశ్లేషించగా, 2012 ఏప్రిల్ నాటికి, పరిశీలనకు నోచుకోకుండా భారీగా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని వెల్లడైంది. వివరాలు ఇలా ఉన్నాయి :

పట్టిక 3.12

| సంవత్సరం | మొత్తం దరఖాస్తులు | కళాశాల వద్దపరిశీలనకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు | కళాశాల నుండి పరిశీలనాధికారికి ఇంకా పంపాల్సిన దరఖాస్తులు | పరిశీలనాధికారి స్థాయిలో పరిశీలనకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు | జిల్లా సంక్షేమ అధికారి వద్ద మంజూరీకి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు |
|---|---|---|---|---|---|
| 2008-09 | 1540550 | శూన్యం | శూన్యం | 261331 | 34971 |
| 2009-10 | 2456261 | 17 | 4688 | 3960 | 5611 |
| 2010-11 | 2446265 | 77802 | 3580 | 32723 | 9208 |
| 2011-12 | 2528563 | 188364 | 37483 | 65301 | 408574 |

ఆ విధంగా వివిధ స్థాయిల్లో దరఖాస్తులు భారీగా పెండింగులో ఉండిపోవడంతో, అర్హులైన విద్యార్థులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందలేకపోయారు.

దరఖాస్తులు పరిశీలనకు నోచుకోకుండా మిగిలిపోవడాన్ని ప్రభుత్వం అంగీకరిస్తూనే, అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసామనీ, ఎవరికీ స్కాలర్‌షిప్‌ను నిరాకరించడం జరగలేదనీ ప్రభుత్వం పేర్కొంది. 'సంతృప్తత ప్రాదిపదికన' (సాట్యురేషన్ బేసిస్) స్కాలర్‌షిప్‌ల నివ్వడం వాస్తవమే అయినా, దరఖాస్తుల పరిశీలన

[21] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ జీఓ ఎమ్ఎస్ నెం.143 లోని పాయింట్ 9.17 ప్రకారం, తేది 2008 జూలై 15

పెండింగులో ఉన్న కారణంగా విద్యార్థులు స్కాలర్‌షిప్ సమయానికి పొందలేక పోయారన్నదే ఆడిట్ వాదన. ఇందుకు సంబంధించి ఉప సంచాలకులు (గిరిజన సంక్షేమం), జిల్లా గిరిజన సంక్షేమ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ హామీనిచ్చింది.

### *3.6.5.9 విద్యార్థులకు ఎమ్‌టీఎఫ్‌ను నిరాకరించడం*

- విద్యార్థుల బ్యాంకు ఖాతాల పరిస్థితిపై 2008-2011 మధ్యగల మూడేళ్లకు సంబంధించిన ఈపాస్ సమాచారాన్ని విశ్లేషించగా 37,57,514 బ్యాంకు ఖాతాల్లో 2,79,790 (7 శాతం) ఖాతాలకు బ్యాంకు ఖాతా నెంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌ల మధ్య పొంతన లేకపోవడం (32,580 కేసులు), చెల్లని బ్యాంకు ఖాతాలు (1,74,890 కేసులు), ఖాతాలు రూఢీకాకపోవడం (72,320 కేసులు) మూలంగా నిర్వహణ ఫీజును (ఎమ్‌టీఎఫ్) జమచేయలేదని వెల్లడైంది.

- ప్రభుత్వ ఉత్తర్వుల (2011 ఫిబ్రవరి) ప్రకారం, ఈజీపే కార్డులను కలిగిఉన్న విషయాన్ని ఈపాస్ వ్యవస్థలో విద్యార్థులు ధృవీకరించిన మీదటే ఎమ్‌టీఎఫ్ మొత్తాన్ని జమ చేయడానికి ఆ కార్డులు వినియోగంలోకి రాగలవు. అయితే, ఈ అంశాన్ని పట్టించుకోలేదు. 2012 అక్టోబరు నాటికి, మొత్తం 5,71,482 మంది విద్యార్థుల్లో 1,56,374 మంది (27 శాతం) తమ ఈజీపే కార్డులను ధృవీకరించకపోవడంతో వారి ఖాతాలకు నిర్వహణ ఫీజును జమ చేయలేకపోయారు.

- సంక్షేమ శాఖలు అందుకున్న మొత్తం 3,79,894 కొత్త ఏటీఎమ్ కార్డుల్లో 16,843[22] (4.43 శాతం) కార్డులను ఆ శాఖలు పంపిణీ చేయలేదని ఆడిట్ గమనించింది. ఏటీఎమ్ కార్డులను పంపకపోవడం వలన అర్హులైన ఈ 16,843 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ నిరాకరణకు గురవ్వడమే కాకుండా, ఆ కార్డులు దుర్వినియోగమయ్యే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేము.

ఎమ్‌టీఎఫ్‌ను ఎలాంటి జాప్యం జరగకుండా విడుదల చేయడానికి సంబంధించి ఉప సంచాలకులు (గిరిజన సంక్షేమం), జిల్లా గిరిజన సంక్షేమ అధికారులకు ఖచ్చితమైన సూచనలనిస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ తెలిపింది. సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖలు మాత్రం ఇందుకు సంబంధించి నిర్దిష్టమైన వివరణ ఇవ్వలేదు.

### *3.6.5.10 ఫీజుల విషయంలో వివిధ విశ్వవిద్యాలయాల మధ్య భారీ వ్యత్యాసాలు*

వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వేరు వేరు కాలేజీలు అందిస్తున్న కోర్సులలో ఒకే రకమైన వాటికి ఫీజుల్లో భారీగా వ్యత్యాసాలున్నాయని ట్యూషన్ ఫీజులకు సంబంధించిన ఆడిట్ విశ్లేషణలో వెల్లడైంది. ఆయా విశ్వవిద్యాలయాలు ఆమోదించిన మొత్తాలను ఈపాస్‌లోకి తీసుకొని, ఆ మొత్తాలను విద్యార్థులకు మంజూరు చేస్తున్నారు. ఫలితంగా ఒకే కోర్సుకు వేరు వేరు రేట్లతో చెల్లింపులు జరుగుతున్నాయి. ఉదాహరణకు, ఎమ్ఎస్‌సీ (జువాలజీ) కోర్సుకు రాయలసీమ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం (₹20,000), అదే కోర్సుకు కాకతీయ విశ్వవిద్యాలయంలో మంజూరు చేసిన మొత్తం (₹600) కంటే 33 రెట్లు కన్నా ఎక్కువ. బీ.కాం డిగ్రీని ఉదాహరణగా తీసుకొని కోర్సు ఫీజుల్లో వ్యత్యాసాల వివరాలను *అనుబంధం-3.3* లో ఇవ్వడమైంది.

ప్రభుత్వం, ఆడిట్ పరిశీలనను అంగీకరిస్తూ, విశ్వవిద్యాలయాలతో సంబంధం లేకుండా అన్ని కోర్సులకు ఒకే విధమైన ఫీజు విధానాన్ని అమలులోకి తెచ్చే అంశాన్ని ఏపీఎస్‌సీహెచ్ఈ[23] క్యాబినెట్ సబ్-కమిటీ మరియు ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామనీ, త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామనీ తెలిపింది.

---

[22] 2013 జనవరి 15 నాటికి 16,406 కార్డులు

[23] ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్

## 3.7 పర్యవేక్షణ, మూల్యాంకనం

### 3.7.1 టాస్క్ ఫోర్సు (ప్రత్యేక దళం) ద్వారా పర్యవేక్షణ

మార్గ నిర్దేశకాల[24] ప్రకారం, 2008-09 ఆర్థిక సంవత్సరం నుండి పథకాల అమలును, కొత్త విధానాన్ని పర్యవేక్షించడానికి 14 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేయాలి. ఐతే, ఈ దళానికి సంబంధించి నిర్దేశనలు, నిబంధనలు, ఎప్పుడెప్పుడు సమావేశం కావాలనే అంశాలను ప్రభుత్వం విశదీకరించ లేదు. ప్రత్యేక దళం, 2012 మార్చి నాటికి, జిల్లాల్లో సమీక్షా సమావేశాలను నిర్వహించిందనీ, జిల్లా అధికారులు/ కాలేజీ యాజమాన్యంతో పథకం అమలుకు సంబంధించి భేటీ అయిందనీ తెలిపే దాఖలాలు లేవు.

ప్రత్యేక దళం సమావేశాలను నిర్వహించడం లేదన్న ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం ధృవీకరిస్తూనే, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆ దళం సభ్యులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నారని తెలిపింది.

### 3.7.2 అంతర్గత తనిఖీ లేకపోవడం

ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, విభాగీయ కార్యాలయాలు, మొదలైన వాటిని క్రమం తప్పకుండా (సంవత్సరానికి కనీసం ఒక సారైనా) సంబంధిత శాఖల అకౌంట్సు విభాగం అంతర్గత తనిఖీ చేసి నివేదిక నివ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు చెబుతున్నాయి. ఐతే, గిరిజన సంక్షేమ శాఖ మినహా, మచ్చుకు ఎంపిక చేసుకున్న జిల్లాలు/విద్యా సంస్థలు వేటిల్లోనూ అంతర్గత తనిఖీని నిర్వహించలేదు. సాంఘిక సంక్షేమ శాఖ 2010-12 లో 13 జిల్లాల్లో అంతర్గత తనిఖీ నిర్వహించామని పేర్కొన్నప్పటికీ, ఆ జిల్లాల్లోని సంక్షేమ కార్యాలయాలలో సంక్షేమ అధికారులు అంతర్గత తనిఖీ జరిగిందనడానికి రుజువుగా ఎటువంటి రికార్డులనూ ఆడిట్ ముందుంచలేదు.

### 3.7.3 సామాజిక తనిఖీ నిర్వహించకపోవడం (వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ)

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని రూఢీ చేసుకోవడం కోసం సుపరిపాలనా కేంద్రం సహకారంతో సామాజిక తనిఖీని చేపట్టాలని ముఖ్యమంత్రి అభిలషించారు (2008 జనవరి). ఐతే, 2012 మార్చి నాటికి కూడా అటువంటి తనిఖీలేవీ నిర్వహించలేదు. ఈ అంశాన్ని అమలుచేస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది.

### 3.7.4 నిషేధానికీ, తొలగింపుకీ గురైన విద్యార్థుల రికార్డును నిర్వహించకపోవడం

మచ్చుకు ఎంపిక చేసిన జిల్లాల్లో, జిల్లా సంక్షేమ అధికారులు నిషేధానికీ, తొలగింపుకీ గురైన విద్యార్థుల రిజిస్టర్‌ను నిర్వహించడంలేదు. ఈ కారణంగా అనర్హులైన విద్యార్థులకు చెల్లింపులు జరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేము. ఈ రిజిస్టర్లను నిర్వహించేలా చూస్తామని ప్రభుత్వం భరోసానిచ్చింది.

### 3.7.5 పథకాల ప్రభావం/సార్థకత

పథకానికి సంబంధించిన అన్ని అంశాలనూ అధ్యయనం చేసి పథకాన్ని మూల్యాంకనం చేసే పనిని హైదరాబాదు లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్‌కు అప్పగించామని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఆ విధంగా మూల్యాంకనం చేసి నివేదికను సమర్పించారని (2012 ఏప్రిల్) కూడా చెప్పారు. ఐతే, నివేదికను ఆడిట్ పరిశీలనకు అందజేయలేదు.

[24] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ జీఓ ఎమ్ఎస్ నెం.143, తేదీ 2008 జులై 15

మచ్చుకు ఎంపిక చేసిన జిల్లాల్లోని సంక్షేమ అధికారులకూ, రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిని పొందిన విద్యార్థులకూ నిర్దిష్టమైన ప్రశ్నావళిని ఇచ్చి తద్వారా స్కాలర్‌షిప్ పథకాల ప్రభావాన్ని ఆడిట్ మదింపుచేసింది. ఆడిట్ కనుగొన్న అంశాలను కింది పట్టికలో ఇవ్వడమైంది:

| | |
|---|---|
| కోర్సులను పూర్తి చేయడం | స్కాలర్‌షిప్ పొందిన వారందరూ కోర్సులను పూర్తి చేసారని ప్రభుత్వ శాఖ తెలిపింది. ఐతే, స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు వారి వారి కోర్సులను పూర్తి చేసారన్న దానికి సంబంధించిన సమాచారాన్ని/డేటాను ఆడిట్ ముందుంచలేదు. |
| ఉత్తీర్ణత రేటు | లబ్ధిని పొందిన విద్యార్థుల ఉత్తీర్ణత రేటును సాధారణ విద్యార్థుల రేటుతో సరిపోల్చి చూడడం ద్వారా ఏయే అంశాల్లో విఫలమయ్యారో నిర్ధారించుకొని తగిన దిద్దుబాటు చర్యలు తీసుకొనే అవకాశం ఉంది. ఐతే, సంక్షేమ శాఖలు అటువంటి మదింపు చేయలేదు. |
| విద్యార్థుల భర్తీలో పెరుగుదల | 2008-12 మధ్యకాలంలో నిర్దిష్ట కోర్సుల్లో చేరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల సమాచారం సంక్షేమ శాఖల వద్ద లేదు. ఫలితంగా కోర్సుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య పెరిగిందో/తగ్గిందో నిర్ణయించే వీలులేదు. |
| చదువు కొనసాగించే విద్యార్థులు | చదువును మధ్యలోనే ఆపేసిన విద్యార్థుల సమాచారంగానీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులపై ఈ పథకాలు అనుకూల ప్రభావాన్ని చూపాయని తెలిపే సమాచారంగానీ సంక్షేమ శాఖల వద్ద లేదు. |

### *3.7.5.1 లబ్ధిదారుల సర్వే*

నమూనాకు తీసుకున్న జిల్లాల్లో ఎంపిక చేసిన కాలేజీలను ఆడిట్ బృందాలు సందర్శించి లబ్ధిదారుల సర్వేను నిర్వహించాయి. నిర్దిష్టమైన ప్రశ్నావళిని ఆన్‌లైన్ ద్వారా పంపించి కూడా లబ్ధిదారుల సర్వే చేయడం జరిగింది. ప్రయోజనం పొందిన 3,061 మంది విద్యార్థుల (ఆన్‌లైన్, మచ్చుకు ఎంపిక చేసిన కాలేజీల) నుండి వచ్చిన సమాధానాలు ఈ కింది అంశాలను వెల్లడిస్తున్నాయి:

- స్కాలర్‌షిప్‌ను ఒకటి నుండి మూడేళ్ల జాప్యాలతో పొందామని 2,009 మంది (66 శాతం) విద్యార్థులు తెలిపారు.
- దరఖాస్తులను అందజేయడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని 1,053 మంది (34 శాతం) విద్యార్థులు తెలిపారు.
- ప్రస్తుతం ఇస్తున్న స్కాలర్‌షిప్ మొత్తం వారి విద్యాపరమైన అవసరాలకు సరిపోవడం లేదని 1,884 మంది (62 శాతం) విద్యార్థులు తెలిపారు.
- ఇతర ఖర్చులు అంటే స్టడీ మెటీరియల్, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లను కూడా ప్రభుత్వం ఇచ్చే సహాయక గ్రాంటులో చేర్చాలని 834 మంది (27 శాతం) విద్యార్థులు తెలిపారు.
- స్కాలర్‌షిప్ మంజూరీలో సమస్యలను ఎదుర్కొంటున్నామని 651 మంది (21 శాతం) విద్యార్థులు తెలిపారు.
- ఆర్‌టీఎఫ్‌ను కాలేజీలకు ముందస్తుగా చెల్లించేలా వత్తిడి చేసారని 280 మంది (9 శాతం) విద్యార్థులు తెలిపారు.
- 460 మంది (15 శాతం) విద్యార్థులు పూర్తి స్కాలర్‌షిప్‌ను పొందలేదు.
- స్కాలర్‌షిప్ సంబంధిత సమస్యలను జిల్లా సంక్షేమ అధికారులు పరిష్కరించలేదని 171 మంది (6 శాతం) విద్యార్థులు తెలిపారు.
- కాలేజీ యాజమాన్యం ఈజీపే కార్డులను తమ వద్దే అట్టిపెట్టుకుందని 325 మంది (11 శాతం) విద్యార్థులు తెలిపారు.

లబ్ధిదారుల సర్వేలో వెల్లడైన పై ఫలితాలు, మునుపటి పేరాలలో చర్చించిన ఆడిట్ పరిశీలనలకు అనుగుణంగా ఉన్నాయి.

## 3.8 సారాంశం

*ప్రభుత్వం గత నాలుగేళ్లలో పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలపై **₹9,369** కోట్లను ఖర్చు చేసింది. ఈ పథకాల ద్వారా ప్రతి ఏటా **25** లక్షలకు పైగా విద్యార్థులు ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఐతే, స్కాలర్‌షిప్ మొత్తాన్ని చెల్లించడంలో జరుగుతున్న విపరీతమైన జాప్యాలు కాలేజీలు/విద్యా సంస్థలు విద్యార్థులను ముందస్తుగా ఫీజును చెల్లించాలని వత్తిడి చేయడానికి కారణమౌతున్నాయి. ఈ నేపథ్యంలో సుపరిపాలనా కేంద్రం అభివృద్ధిపరచి నిర్వహిస్తున్న ఈపాస్ వ్యవస్థ ద్వారా స్కాలర్‌షిప్ మంజూరీ, చెల్లింపుల లావాదేవీలను నిర్వహించే విధానంతో ఈ పథకాల అమలులో అనుకూలమైన పలు మార్పులు వచ్చాయి. ఐతే, అర్హులైన విద్యార్థులు స్కాలర్‌షిప్ మొత్తాలను పొందడానికి మూలాధారమైన ఈమెయిల్ ఐడీలు, బ్యాంకు ఖాతా సంఖ్యలు, మొబైల్ నెంబర్లు, దరఖాస్తుల ఐడీలు మొదలైన వాటికి సంబంధించి ఈపాస్ వ్యవస్థలో పలు లోపాలు కూడా ఉన్నాయి. స్కాలర్‌షిప్ మొత్తాల మంజూరు, చెల్లింపుల సమాచారం మొత్తం ఈపాస్ వ్యవస్థపైనే ఆధారపడి ఉన్న కారణంగా, అధీకృతమైన, సముచితమైన సమాచారం మాత్రమే ఈ వ్యవస్థలో పొందుపరచేలా ఈపాస్ అప్లికేషన్ తగు నియంత్రణలు కలిగి ఉండడం ఎంతో ముఖ్యం. ఈపాస్‌లో తాజా, పారదర్శక సమాచారం ఉండేలా చూసేందుకు నోడల్ డిపార్టుమెంట్ (సాంఘిక సంక్షేమ శాఖ) చొరవ చూపినప్పటికీ, మునుపటి పేరాలలో పేర్కొన్న విధంగా, ఈపాస్‌లోని అప్లికేషన్ నియంత్రణలు, ముఖ్యంగా సమాచారం సరైనదేనని నిర్ధారించే (వేలిడేషన్) నియంత్రణలు, చాలినంతగా లేకపోవడంతో వేల కొలదీ దరఖాస్తుల్లో అసందర్భమైన, అవాస్తవికమైన సమాచారాన్ని పొందుపరచే వెసులుబాటు కల్పించింది. స్కాలర్‌షిప్‌ను మోసపూరితంగా డ్రా చేసేందుకు ఇది దోహదపడొచ్చు. అంతేకాక, దరఖాస్తులను పరిశీలించడంలో అలసత్వం కారణంగా కొన్ని సందర్భాలలో స్కాలర్‌షిప్‌లను అధికరేట్లతో మంజూరు చేయడం, అర్హతలేని విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లను క్లెయిమ్ చేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలు పెరిగాయి. దీంతోపాటు దరఖాస్తుల పరిశీలన భారీగా పెండింగులో ఉండిపోవడంతో అర్హులైన విద్యార్థులు స్కాలర్‌షిప్ నిరాకరణకు గురికావడం వంటివి జరిగాయి.*

*స్కాలర్‌షిప్ ప్రయోజనాన్ని పొందే విద్యార్థులు, ప్రభుత్వం మధ్య ముఖాముఖీ సంబంధం లేకుండా కాలేజీలు/విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థల ద్వారానే స్కాలర్‌షిప్‌ను చెల్లిస్తున్నారు. చెల్లింపుల వివరాలను నోడల్ బ్యాంకు కూడా నివేదించడం లేదు. ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యల ప్రభావాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వం వద్ద ఎలాంటి యంత్రాంగం లేదు. ప్రతి విశ్వవిద్యాలయం/విద్యా సంస్థ తమకు తోచిన విధంగా ఎలాంటి ప్రాతిపదిక లేకుండా ఫీజులను నిర్ణయిస్తున్నాయి. ఈ ఫీజుల్లోని అసమానతలను తొలగించి ఫీజుల రీయింబర్స్‌మెంట్ విధానాన్ని గాడిలో పెట్టడానికి బదులు ప్రభుత్వం ఆ ఫీజులకు అనుగుణంగానే స్కాలర్‌షిప్ మొత్తాలను విడుదల చేస్తోంది. ఫలితంగా ప్రభుత్వంపై ఆర్థిక భారం బహు విధాల పెరగవచ్చు. నిధులు వృథాగా ఉండిపోవడం, పథకాలను అమలుచేసే సంస్థలు నిధులను దుర్వినియోగం చేయడం, కేటాయించిన నిధులను వినియోగించకపోవడం, వాస్తవంగా నిధుల వినియోగం జరగకుండానే వినియోగ ధృవపత్రాలను జారీ చేయడం వంటి వాటితో పాటు పథకాలకు సంబంధించి ఆర్థిక నిర్వహణలో పలు లోపాలున్నాయి.*

## 3.9 సిఫార్సులు

- ప్రభుత్వం అర్హులైన విద్యార్థులందరినీ/కాలేజీలన్నింటినీ సర్వే చేసి మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతాలతోపాటు సరైన వివరాలతో డేటాబేస్‌ని అప్‌డేట్ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన రూపంలోనే లబ్ధిదారులు ఆదాయ ధృవపత్రాలు సమర్పించేలా చూడాలి.

- సంబంధిత విద్యా సంవత్సరంలోనే ప్రభుత్వం సమయానుగుణంగా చాలినంత నిధుల కేటాయింపు, విడుదల జరిగేలా చూడాలి. దీనివల్ల స్కాలర్‌షిప్‌ల ప్రయోజనాన్ని విద్యార్థులు సకాలంలో పొందగలరు.

- వివిధ సంస్థల (బ్యాంకులు, కార్పోరేషన్లు, జిల్లా అధికారులు) వద్ద మిగిలిపోయిన స్కాలర్‌షిప్ మొత్తాలు ఆయా సంస్థలు వాపసు చేసేలా చూడడం కోసం తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

- అర్హులైన విద్యార్థులు మాత్రమే నిర్ణయించిన రేట్లకు స్కాలర్‌షిప్ పొందేలా చూసేందుకు ఈపాస్ వ్యవస్థలోని వాలిడేషన్ నియంత్రణలను బలోపేతం చేయాలి. మేనేజ్‌మెంట్/స్పాట్ అడ్మిషన్ కోటాల్లో చేరిన విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను నియమ విరుద్ధంగా మంజూరు చేయడాన్ని నివారించడానికి వీలుగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్) సమాచారాన్ని ఈపాస్/ఎస్ఎస్‌సీ బోర్డు సమాచారంతో ముడిపెట్టాలి.

- మైనారిటీ సంక్షేమంకు సంబంధించి, 'ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఓఎస్ఎమ్ఎస్)లో ప్రభావశీలమైన నియంత్రణ ఉండేలా చూడడానికి దీనిని ఈపాస్ పరిధిలోకి తీసుకురావాలి. అంతేకాకుండా, మైనారిటీ వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లింపుల్లో జాప్యాలు, వాటి మళ్లింపులను నివారించడం కోసం వీటిని ట్రెజరీ అధీనంలోకి తీసుకురావాలి.

- వైద్య సంస్థలు అందిస్తున్న విద్యలో, కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో నాణ్యతను ప్రభుత్వం అంచనా వేయడంతో పాటు, ఫీజు విధానాన్ని హేతుబద్ధంగా వ్యవస్థీకరించడం/ప్రమాణీకరించడం అత్యంత ఆవశ్యకం. అది జరిగే వరకూ, యూనివర్సిటీలు పేర్కొన్న వ్యయం భర్తీ చేయడానికి బదులు, వివిధ కోర్సులకుగాను నిర్దిష్టమైన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా యూనివర్సిటీలు/సంస్థలకు రీయింబర్స్ చేయాలి.

- ప్రభుత్వ విద్యా సంస్థలకు ఇచ్చే ఆర్‌టీఎఫ్ మొత్తం ఎటు తిరిగీ ప్రభుత్వానికే జమ కాబడుతుంది కాబట్టి ప్రభుత్వం ఆ సంస్థలకు ఆర్‌టీఎఫ్ విడుదలచేసే విధానానికి స్వస్తి చెప్పాలి.

- స్కాలర్‌షిప్ మొత్తాల విడుదలలో ఖచ్చితత్వాన్ని నిర్ధారించుకోవడానికి వీలుగా ఈపాస్ వ్యవస్థలో పొందుపరిచిన ఫీజు వివరాలను సంబంధిత శాఖలలో తగు అధికారిచే పరిశీలన చేయించాలి.

ఈ నివేదికలో వెల్లడిచేసిన దాదాపు అన్ని ఆడిట్ పరిశీలనలనూ ప్రభుత్వం అంగీకరించింది. ఐతే, దరఖాస్తుల పరిశీలన, స్కాలర్‌షిప్‌ల మంజూరీ, వాటి విడుదల ప్రక్రియ మొత్తం లిఖిత రూపంలో (మాన్యువల్) జరిగిన నాటి నుండి ఎంతో పురోగమించి ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా 2010-11 తరవాత, ఆ మొత్తం విధానంలో ఎంతో సౌలభ్యం చోటు చేసుకుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఆడిట్ చేసిన సిఫార్సులను కూడా సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం అంగీకరించి, స్కాలర్‌షిప్ విధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చింది.

# అధ్యాయం-4

## జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎమ్) అమలుపై ఆడిట్ సమీక్ష

### మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ

పేజీలు 77 - 114

## 4.1 ఉపోద్ఘాతం

### 4.1.1 జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ లక్ష్యాలు

జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకాన్ని (జేఎన్ఎన్‌యూఆర్ఎమ్) భారత ప్రభుత్వం ఏడు సంవత్సరాల కార్యాచరణ (2005-12) తో 2005 డిసెంబరులో ప్రవేశపెట్టింది. పట్టణ మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరిచే వ్యవస్థ సామర్థ్యం మీద దృష్టి సారించి, పట్టణ స్థానిక సంస్థలు/ఇతర సంస్థలకు ప్రజలపట్ల జవాబుదారీతనం, సామాజిక భాగస్వామ్యం పెంపొందే విధంగా ఎంపిక చేసుకున్న నగరాల ఆధునికీకరణకూ, త్వరితగతిన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికీ దోహదపడటం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు.

### 4.1.2 ఉప-కార్యాచరణలు, అంశాలు

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ లోని రెండు ప్రధాన ఉప-కార్యాచరణలు ఈ విధంగా ఉన్నాయి :

- పట్టణ మౌలిక వసతులు, పాలన (యూఐజీ )ని పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (కేంద్ర ప్రభుత్వం) నిర్వహిస్తుంది. మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, ఘన వ్యర్థాల నిర్వహణ, రహదారులు, పట్టణ రవాణా, పాతబస్తీ పునరాభివృద్ధి ఇందులో ఉంటాయి ;

- గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ నిర్వహణలో పట్టణ పేదలకు ప్రాథమిక సౌకర్యాల పేరిట (బీఎస్‌యూపీ) మరొక ఉప-కార్యాచరణ పని చేస్తున్నది. పట్టణ పేదలకు గృహవసతి, ప్రాథమిక సౌకర్యాలు, ఇతర సామాజిక సదుపాయాలు కల్పించేదిశగా మురికివాడల సమీకృత అభివృద్ధిని ఈ ఉప-కార్యాచరణలో చేపడతారు.

ఈ పథకం కిందికిరాని చిన్న, మధ్యతరహా పట్టణాల (నాన్ మిషన్ సిటీలు) కోసం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ఈ దిగువ పేర్కొన్న రెండు అంశాలను చేపట్టింది :

- చిన్న, మధ్యతరహా పట్టణాలలో మౌలిక వసతుల అభివృద్ధి పథకాన్ని (యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ) పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్వహిస్తుంది. మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, ఘనవ్యర్థాల నిర్వహణ, రహదారులు మొదలైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ఇది కృషి చేస్తుంది.

- గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వశాఖ నిర్వహణలో సమీకృత గృహనిర్మాణం, మురికివాడల అభివృద్ధి పథకం (ఐహెచ్ఎస్‌డీపీ) అనే అంశం కింద మురికి వాడల ప్రజలకు అవసరమైన గృహవసతి, ప్రాథమిక సౌకర్యాలు సమకూర్చి ఆరోగ్యకర, సమర్థక వాతావరణంతో పట్టణాభివృద్ధికి ఇది పాటుపడుతుంది.

2001 జనాభా లెక్కలననుసరించి, 65 నగరాలు/శివారులను జేఎన్ఎన్‌యూఆర్ఎమ్‌లోని మూడు వర్గాల కింద 'మిషన్ సిటీలు'గా గుర్తించారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హైదరాబాద్ (ఎ-వర్గం), విశాఖపట్నం, విజయవాడ (బి-వర్గం), తిరుపతి[1] (సి-వర్గం) ఉన్నాయి. మిగతా నాన్‌మిషన్ సిటీలకు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ప్రధాన ఉప కార్యాచరణలైన యూఐజీ , బీఎస్‌యూపీ ప్రయోజనాలు వర్తించవు. ఐతే, జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకంలోని చిన్న ఉప ప్రణాళికలైన యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ, ఐహెచ్ఎస్‌డీపీ కింద ఆర్థిక సాయం పొంద వచ్చును.

[1] జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద మిషన్-సిటీగా 2009లో గుర్తించారు

## 4.1.3 జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ వ్యూహం

తన లక్ష్యాలను సాధించటంకోసం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ఈ దిగువ పేర్కొన్న వ్యూహాలను రూపొందించుకుంది :

- వివిధ కార్యక్రమాలను, విధానాలను, వ్యూహాలను, ఆర్థిక ప్రణాళికలను సూచిస్తూ, అలాగే అవసరమైన ప్రాజెక్టుల నిర్ధారణకు వీలుకల్పిస్తూ *నగరాభివృద్ధి ప్రణాళికనొకదాన్ని (సీడీపీ)* రూపొందించటం;
- ప్రాజెక్టుల ప్రణాళికాబద్ధ దిక్చక్రం మీద జీవన వర్తుల వ్యయాలు అభిలషణీయ స్థాయిలో ఉండేలా భరోసా నివ్వగల వివిధ ప్రాజెక్టులను వాటి నిర్ధరిత పరిధిలోనే చేపట్టే విధంగా *సమగ్ర ప్రణాళికా నివేదికలను (డీపీఆర్)* రూపొందించటం;
- పట్టణ స్థానిక సంస్థలకు/పాక్షిక ప్రభుత్వ రంగ సంస్థలకు మృదుల ఋణాలుగానో, గ్రాంట్ల రూపంలోనో నిధులు పంపిణీ చేసేందుకు వీలుగా రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ (ఎస్ఎల్ఎన్ఏ)కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు *నిధులు విడుదల చేయటం*; ఈ నోడల్ ఏజన్సీ/పట్టణ స్థానిక సంస్థలు ఇతర వనరులనుంచి కూడా *అదనపు నిధులు సమీకరించుకుంటాయి*;
- అభివృద్ధి, నిర్వహణ, ప్రాజెక్టుల నిర్వహణ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిన *ప్రైవేటు రంగంలోని నిపుణతను అందిపుచ్చుకోవటం*.

## 4.1.4 సంస్కరణల ప్రణాళిక

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ జాతీయ స్థాయిలో సంస్కరణలతో ముడిపడిన పెట్టుబడి ప్రేరణ కావటంతో ఈ పథకం కింద కేంద్ర సాయంపొందాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు (పాక్షిక ప్రభుత్వరంగ సంస్థలు కూడా) కేంద్ర ప్రభుత్వంతో ఒక త్రైపాక్షిక ఒప్పంద పత్రం రాసుకోవలసి ఉంటుంది. వివిధ సంస్కరణలకు సంబంధించి నిర్దిష్ట మైలు రాళ్ళను సూచిస్తూ సంస్కరణల ప్రణాళికను ఈ ఒప్పందంలో పొందుపరచాలి. ప్రతి నగరానికీ ఎన్నికకాబడిన పాలక వర్గం ఉండటం కూడా కేంద్ర ప్రభుత్వ సాయం పొందటానికి మరొక ముఖ్య నిబంధన.

## 4.1.5 నిధుల సమీకరణ

భిన్న వర్గాలలోని ప్రాజెక్టులకు నిధుల సమీకరణ ఈ విధంగా ఉంటుంది :

పట్టిక 4.1

(శాతంలో)

| వర్గం | యూఐజీ | | | బీఎస్‌యూపీ | | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | | | ఐహెచ్ఎస్‌డీపీ | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రాంటు | | యూఎల్‌బీ లేదా ఇతర సంస్థల వాటా/ఆర్థిక సంస్థల నుంచి ఋణాలు | గ్రాంటులో కేంద్రం వాటా | రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర సంస్థల వాటా (లబ్ధిదారుల వాటా కలుపుకుని) | గ్రాంటు | | నోడల్/అమలు సంస్థలు, ఆర్థిక సంస్థల నుంచి ఋణాలు | గ్రాంటులో కేంద్రం వాటా | రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర సంస్థల వాటా (లబ్ధిదారుల వాటా కలుపుకుని) |
| | కేంద్రం | రాష్ట్రం | | | | కేంద్రం | రాష్ట్రం | | | |
| వర్గం-ఎ మిషన్ సిటీలు | 35 | 15 | 50 | 50 | 50 | 80 | 10 | 10 | 80 | 20 |
| వర్గం-బి మిషన్ సిటీలు | 50 | 20 | 30 | | | | | | | |
| వర్గం-సి, ఇంకా ఇతర నగరాలు | 80 | 10 | 10 | 80 | 20 | | | | | |

మూలం : జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మార్గదర్శకాలు

### 4.1.6 సంస్థాగత నిర్మాణం

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కేంద్ర స్థాయిలో ఒక జాతీయ స్టీరింగ్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ) సమగ్ర పర్యవేక్షణలో పనిచేస్తుంది. ఇది ఆచరణ విధానాలను రూపొందించి పర్యవేక్షించటం, పురోగతిని సమీక్షించటంతోపాటు, అవసరమైనప్పుడు దిద్దుబాటు చర్యలను కూడా సూచిస్తుంది. ఎన్ఎస్‌జీ కి ఊతంగా ఒక సాంకేతిక సలహా సంఘం (టీఏజీ ) అవసరమైన ప్రతిపాదనలను రూపొదిస్తుంది. అదేవిధంగా, కేంద్రీయ అనుమతి, పర్యవేక్షణ సమితి (సీఎస్ఎమ్‌సీ) ఈ ప్రతిపాదనలను మరోమారు పరిశీలించి అనుమతి జారీ చేస్తుంది. ప్రతిపాదనలను సీఎస్ఎమ్‌సీ ఆమోదం కోసం సమర్పించే ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలలోని సాంకేతిక విభాగాలు, ప్రత్యేక సాంకేతిక సంస్థలు పరిశీలిస్తాయి.

రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) సమన్వయిస్తుంది. దీనికి ముఖ్య మంత్రి/పట్టణాభివృద్ధి మంత్రి, గృహనిర్మాణ మంత్రి నేతృత్వం వహిస్తారు. ప్రతిపాదనలన్నీ సమీక్షించి, వాటికి ప్రాధాన్యతలను నిర్ధరించి, వాటిని జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కిందికి తెచ్చేందుకూ, కేంద్రం నుంచి సాయం పొందేదుకూ ఇది కృషి చేస్తుంది. ఎస్ఎల్ఎస్‌సీ ఈ దిగువ వివరించిన విధంగా వివిధ ఏజన్సీల సాయంతో పనిచేస్తుంది :

| ఏజన్సీ | కార్యకలాపాలు | రిమార్కులు |
|---|---|---|
| రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ (ఎస్ఎల్ఎన్ఏ) | పట్టణ స్థానిక సంస్థలు/పాక్షిక ప్రభుత్వరంగ సంస్థలు సమర్పించిన ప్రాజెక్టులను పరిశీలించి ఎస్ఎల్ఎస్‌సీ ఆమోదం పొందటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన గ్రాంటుల నిర్వహణ, పట్టణ స్థానిక సంస్థలకు/పాక్షిక ప్రభుత్వరంగ సంస్థలకు నిధులివ్వటం, నిర్వహణ పనులకు రివాల్వింగ్ ఫండ్ వినియోగించటం, ఒప్పందంలో పేర్కొన్నట్లు సంస్కరణ పనులను పర్యవేక్షించటం, ప్రాజెక్టుల పురోగతిని గమనించటం. | ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీయూఎఫ్ఐడీసీ)ను ప్రభుత్వం 2006 ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీగా నియమించింది. |
| కార్యక్రమ నిర్వహణ విభాగం (పీఎమ్‌యూ) | కార్యక్రమ నిర్వహణ, పర్యవేక్షణలపై దృష్టిసారించి, అవసరమైన సాంకేతిక, నిర్వాహక సహాయమందిస్తూ, తన బాధ్యతలు నెరవేర్చటంలో రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీకి సాయపడుతుంది. | ఆంధ్రప్రదేశ్‌కు పీఎమ్‌యూ 2008 జూన్‌లో మంజూరైంది. |
| ప్రాజెక్టు నిర్వహణ విభాగం (పీఐయూ) | జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ అమలులోని నాణ్యతా ప్రమాణాలను ఇతోధికం చేయటంపై దృష్టి పెడుతూ, పట్టణ స్థానిక సంస్థలకున్న ప్రావీణ్యతనూ పెంపొందించగల నిర్వాహక విభాగం. | మూడు మిషన్ సిటీలకు,[2] ఏడు నాన్-మిషన్ సిటీలకూ[3] కలిపి 10 పీఐయూలు 2008 జూన్‌లో మంజూరయ్యాయి. |

*మూలం: జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మార్గదర్శకాలు*

## 4.2 ఆడిట్ విధివిధానాలు

### 4.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ దిగువ అంశాలను ధృవీకరించుకోవటం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మీది ఆడిట్ సమీక్ష ముఖ్యలక్ష్యాలు :

- సంస్కరణలకు నిర్దేశించిన కార్యాచరణ కట్టుదిట్టంగా అమలు జరిగిందా;
- వివిధ ప్రాజెక్టులకు ప్రణాళికారచన సక్రమంగా జరిగిందా; వాటిని పొదుపుగానూ, సమర్ధవంతంగానూ అమలు జరిపి, ఆశించిన ఫలితాలు సాధించారా;

[2] హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడ

[3] విజయనగరం, రాజమండ్రి, గుంటూరు, అనంతపురం, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్

- నగరాల మౌలిక అభివృద్ధికి అవసరమైన వాటిని సమగ్రంగానూ, సముచితంగానూ అంచనావేసి గుర్తించారా;
- ఆర్థిక నియంత్రణ తగువిధంగా ఉన్నదా;
- పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ యంత్రాంగం సముచితంగానూ, కార్యసాధకంగానూ ఉన్నదా.

### 4.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ కనుగొన్న విషయాలను ఈ దిగువ పేర్కొన్న వాటిలోని ప్రామాణికాలకు ప్రతిగా నిశ్చయించుకోవటం జరిగింది :

- పథకం మార్గనిర్దేశకాలు, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు, ఉత్తరువులు, టూల్‌కిట్లు;
- కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థలు సంతకాలు చేసిన త్రైపాక్షిక ఒప్పంద పత్రం;
- ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల సమగ్ర నివేదికలు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి, అప్పుడప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు.

### 4.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

ఆడిట్ 2011 ఏప్రిల్ నుంచి 2012 జూన్ వరకు నిర్వహించి జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పూర్తి కాలవ్యవధి (2005-12) రికార్డులను పరిశీలించటం జరిగింది. జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద రాష్ట్రానికి మంజూరైన ₹11,907 కోట్ల విలువైన 251 ప్రాజెక్టుల నుంచి ₹6,352 కోట్ల (53 శాతం) విలువైన 74 ప్రాజెక్టులను (*అనుబంధం - 4.1*) విస్తృత ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేసుకోవటం జరిగింది. ఈ ప్రాజెక్టులు 4 మిషన్ సిటీలు,[4] 38 నాన్ - మిషన్ సిటీలకు[5] సంబంధించినవి. అంశాలవారీ వివరాలు ఈ దిగువ ఉన్నాయి.

పట్టిక 4.2

| అంశాలు | మురుగునీటి పారుదల | వరదనీటి కాలవలు | నీటి సరఫరా | మౌలిక వసతులు/ గృహ నిర్మాణం | ఇతరములు | మొత్తం | ఆమోదిత వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| యూఐజీ | 8 | 8 | 10 | 0 | 1 | 27 | 3759.77 |
| బీఎస్‌యూపీ | 0 | 0 | 0 | 4 | 0 | 4 | 1063.67 |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 8 | 9 | 25 | 0 | 0 | 42 | 1473.39 |
| ఐహెచ్ఎస్‌డీపీ | 0 | 0 | 0 | 1 | 0 | 1 | 55.36 |
| మొత్తం | **16** | **17** | **35** | **5** | **1** | **74** | **6352.19** |

ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ అయిన ఏపీయూఎఫ్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌తో 2011 ఏప్రిల్ నెలలో నిర్వహించిన సమీక్షారంభ సమావేశంతో ఈ ఆడిట్ సమీక్ష ప్రారంభమయింది. ఏపీయూఎఫ్ఐడీసీ, సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలు, ఇంకా ప్రాజెక్టు నిర్వాహక సంస్థల[6] రికార్డులను క్షేత్రస్థాయి ఆడిట్‌లో భాగంగా పరిశీలించటం జరిగింది. ఆడిట్ పరిశీలనలకు రూఢిగా అవసరమైన చోట్ల ఛాయాచిత్రాలను సాక్ష్యంగా తీసుకోవటం, ఆడిట్‌లో భాగంగా 20 ప్రాజెక్టులకు సంబంధించిన 1528 మంది లబ్ధిదారులను విచారించటం

---

[4] హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి

[5] అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, భువనగిరి, చీరాల, ధర్మవరం, ధోన్, ఏలూరు, కడప, కదిరి, కామారెడ్డి, కందుకూరు, కరీంనగర్, కర్నూలు, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మార్కాపురం, మెదక్, మిర్యాలగూడ, నగరి, నల్గొండ, నంద్యాల, నరసరావుపేట, నారాయణపేట, నిజామాబాద్, ఒంగోలు, పిఠాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయదుర్గం, రామచంద్రాపురం, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, తణుకు, వనపర్తి, వరంగల్, ఎమ్మిగనూరు

[6] హైదరాబాద్ మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి, మునిసిపల్ పాలన మరియు పట్టణాభివృద్ధి శాఖలోని ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం

జరిగింది. ఆడిట్ ఫలితాలను 2013 జనవరిలో నిర్వహించిన సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వంతో చర్చించి, ప్రభుత్వం/ప్రభుత్వ శాఖ వెలిబుచ్చిన అభిప్రాయాలను, రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానాలను తగు విధంగా ఈ నివేదికలో పొందుపరచడం జరిగింది.

### ఆడిట్‌లో కనుగొన్న అంశాలు

## 4.3 సంస్కరణల అమలు

### 4.3.1 త్రైపాక్షిక ఒప్పంద పత్రాలు

మూడు మిషన్ సిటీలతో (హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ) త్రైపాక్షిక ఒప్పంద పత్రాలు 2006 మార్చి నెలలో రాసుకోగా, నాలుగవ నగరమైన తిరుపతి[7] విషయంలో 2009లో ఒప్పందం చేసుకున్నారు.

### 4.3.2 రాష్ట్రస్థాయి ఆదేశక సంస్కరణలు

#### *4.3.2.1 నేపథ్యం*

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద రాష్ట్ర స్థాయిలో ఈ దిగువ పేర్కొన్న ఆదేశక సంస్కరణలు ఉంటాయి :

- 74వ రాజ్యాంగ సవరణ చట్టంలో సూచించిన విధంగా వికేంద్రీకరణ విధానాలను అమలు చేయటం;
- పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని రద్దు చేయటం;
- అద్దె నియంత్రణ చట్టాలను రద్దు చేసి, స్థల యజమానులు, కిరాయిదార్ల ప్రయోజనాలను సమదృష్టితో చూడటం ;
- స్టాంపు సుంకాన్ని హేతు బద్ధీకరించి, దీనిని 5 శాతానికి మించకుండా చూడటం;
- ప్రజా వెల్లడి చట్టాన్నొకదాన్ని తీసుకురావటం ద్వారా పట్టణ స్థానిక సంస్థలు, అనుబంధ ప్రభుత్వ సంస్థలకు మధ్యకాలిక ద్రవ్య ప్రణాళికలు రూపొందేలా చూడటం, త్రైమాసిక పురోగతి సమాచారం భాగస్వాములు అందరికి అందే విధంగా చర్యలు తీసుకోవటం;
- ఎన్నికైన పట్టణ స్థానిక పాలక వర్గాలు ఏడు సంవత్సరాల పాటు నగర ప్రణాళికా నిర్వహణలో పాలుపంచుకొనేలా చేసి, పట్టణాలలో పౌరసేవలందిస్తున్న ప్రత్యేక ఏజన్సీలను ఈ స్థానిక సంస్థలకు అనుసంధానం చేసి వారిని జవాబుదారులను చేయటం.
- పౌరుల భూమికను వ్యవస్థీకరించేందుకు సామాజిక భాగస్వామ్య చట్టాన్ని తీసుకొచ్చి పట్టణాలలో ప్రాంతీయ సభల విధానం ప్రవేశపెట్టటం.

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయి ఆదేశక సంస్కరణలను వాస్తవంగా అమలు చేసే విషయంలో ఆడిట్ ఈ దిగువ అంశాలను గమనించింది :

#### *4.3.2.2 వికేంద్రీకరణ విధానాలు*

రాజ్యాంగంలోని పన్నెండవ షెడ్యూలులో పేర్కొన్న 18 విధులను ఈ విధానంలో భాగంగా పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేయవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 17 విధులను పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసింది కానీ పట్టణ, గ్రామీణ అవసరాలను కూడా తీరుస్తున్నందున అగ్నిమాపక సేవలను మాత్రం అలా బదిలీ చేయలేదు. ఐతే, బాధ్యతలను వాస్తవంగా అప్పగించే విషయంలోపలు విధుల మధ్య వ్యత్యాసాలున్నాయి. విశేషించి, పట్టణ ప్రణాళిక విషయంలో ఈ తేడాలున్నాయి :

---

[7] తిరుపతిని 2009లో మిషన్ సిటీగా గుర్తించారు

- పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు ఏర్పడిన నాలుగు మిషన్ సిటీలలో (హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి) పట్టణ ప్రణాళిక కింద బృహత్ ప్రణాళికలు (లేఔట్‌లు, అభివృద్ధి ప్రణాళికలు) ప్రాధికార సంస్థల పరిధిలో ఉన్నాయిగానీ పట్టణ స్థానిక సంస్థల అధీనంలో లేవు.
- ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టం, ఇంకా హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా - మురుగునీటి పారుదల చట్టాలకు 2007 ఆగస్టులో సవరణలు తెచ్చి ఎన్నికైన పట్టణ స్థానిక సంస్థలను పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు, జలమండలితో అనుసంధానం చేశారు. ఐతే, హైదరాబాద్ జలమండలిలో మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదలకు సంబంధించి మచ్చుకు తనిఖీ చేసిన ఆరు[8] ప్రాజెక్టులలోనూ బృహత్ ప్రణాళికను రూపొందించి అమలు చేసే విషయంలో పట్టణ స్థానిక సంస్థ చురుగ్గా పాల్గొన్న జాడలు లేవు.

పన్నెండవ షెడ్యూలు విధులలో పట్టణ స్థానిక సంస్థలకు లాంఛనంగా బదిలీ అయిన మిగతా అంశాల విషయమై ఆడిట్ గమనించినవి ఈ విధంగా ఉన్నాయి :

| విధులు | పరిస్థితి |
|---|---|
| ఆర్థిక సామాజిక అభివృద్ధి ప్రణాళిక | దీని ప్రకారం అన్ని జిల్లాలలో జిల్లా ప్రణాళికా సంఘాలనూ, హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘాన్నీ ఏర్పాటు చేయాల్సి ఉంది.<br>హైదరాబాద్ తప్ప అన్ని జిల్లాలలోనూ జిల్లా ప్రణాళికా సంఘాలను ఏర్పరచారు. హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘం ఏర్పాటుకు తగిన నియమాలను 2009 జనవరిలో రూపొందించారు (ఈ సంఘం ఏర్పాటు కోసం 2007 డిసెంబరులో చేసిన చట్టం ప్రకారం). హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘం 2012 జూన్ నాటికి ఆవిర్భవించలేదు. |
| రహదార్లు, వంతెనలు | పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు ఉన్న నగరాలలో ఈ బాధ్యతలను స్థానిక సంస్థలతోపాటు ప్రాధికార సంస్థలు కూడా నెరవేరుస్తున్నాయి. |
| గృహ, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు నీటి సరఫరా | హైదరాబాద్‌లో ఈ బాధ్యతలను నగరపాలక సంస్థకాకుండా జలమండలి వహిస్తోంది. |
| నగర అటవీకరణ | పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు ఉన్న నగరాలలో ఈ బాధ్యతలను ప్రాధికార సంస్థలు, స్థానిక సంస్థలూ కలిసి నిర్వహిస్తున్నాయి. |

### *4.3.2.3 రాష్ట్ర స్థాయి ఇతర సంస్కరణలు*

పట్టణ భూ గరిష్ఠ పరిమితి రద్దు చట్టం, 1999 అమలును 2008 మార్చి 27న చేపట్టారు. అద్దె నియంత్రణ నిబంధనల్లో సంస్కరణలకు సంబంధించి త్రైపాక్షిక ఒప్పందంలో[9], 2007-08 వరకూ కాలక్రమరేఖ నిర్దేశించుకోగా ఆంధ్రప్రదేశ్ అద్దె నియంత్రణ బిల్లు - 2011ని రాష్ట్ర శాసనసభ 2011 డిసెంబరులో ఆమోదించింది. ఐతే, 2012 డిసెంబరు నాటికి రాష్ట్రపతి ఆమోదం రాలేదు. స్టాంపు సుంకం హేతుబద్ధీకరణ విషయానికొస్తే, 2010 ఆగస్టు 1 నుండి సుంకాన్ని 7 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది (2010 జూలై).

---

[8] 1. మూసీనది దక్షిణాన (జోన్-I) పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 2. మూసీనది దక్షిణాన (జోన్-II) పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 3. శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు, 4. జీహెచ్ఎమ్‌సీ రాజేంద్ర నగర్ మునిసిపల్ సర్కిల్‌లో గుర్తించిన కొన్ని జోన్లకు సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ, మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు 5. కృష్ణా తాగునీటి సరఫరా ప్రాజెక్టు రెండవదశ, 6. పాత ఎమ్‌సీహెచ్‌లోని 10 జోన్లలో ఫీడర్ వ్యవస్థ, పంపిణీవ్యవస్థ పునరుద్ధరణ

[9] సంస్కరణల కార్యాచరణ గురించి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం

### ప్రజావెల్లడి చట్టం అమలు

అవసరమైన సమాచారాన్ని తరచుగా ప్రజలకు వెల్లడిచేసేందుకు వీలుకల్పిస్తూ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టానికి 2008 ఏప్రిల్ నెలలో ఒక సవరణ చేశారు. ఈ సవరణ వలన రూపొందిన నియమాలను అనుసరించి 24 కీలక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు వెబ్‌సైట్లు, నోటీసు బోర్డులు, వార్తాపత్రికలు, బహిరంగ ప్రకటనల ద్వారా వెల్లడి చేయాలి. ఐతే, ఇలా సవరించిన చట్టాన్ని అమలు చేసేందుకు తగిన ఆదేశాలను 20 నెలలు గడిచాక 2009 డిసెంబరులో మాత్రమే జారీ చేశారు.

మిషన్ సిటీలు నాలుగింటికి సంబంధించిన వెబ్‌సైట్లను ఆడిట్ పరిశీలించగా కౌన్సిల్ తీర్మానాలు, పన్నుల వసూళ్ళు, బకాయిదారుల జాబితా, ఆర్థిక నివేదికలు, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, మొదలైన విషయాలకు సంబంధించిన సమాచారం ఈ వెబ్‌సైట్లలో లభ్యమవుతున్నది. కానీ, వివిధ సబ్సిడీ పథకాలు, సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల గుర్తింపు, ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రణాళిక-ప్రణాళికేతర గ్రాంట్ల వివరాలుగానీ, 2008 ఏప్రిల్ సవరణలో స్పష్టంగా నిర్దేశించినట్లు వార్షిక పద్దులు గానీ ఈ వెబ్‌సైట్లలో పొందుపరచ లేదు. ఇలా వెబ్‌సైట్లలో చోటుచేసుకోని అంశాల వివరాలు స్థానికసంస్థలవారీగా *అనుబంధం-4.2*లో సూచించడం జరిగింది. ప్రజావెల్లడి చట్టం అనుసరించి పూర్తి సమాచారం వెల్లడించవలసిందిగా అన్ని పట్టణ స్థానిక సంస్థలకూ ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

### సమాజ భాగస్వామ్య చట్టం అమలు

హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టానికి 2008 ఏప్రిల్ నెలలో ఒక సవరణ చేశారు. దీని ప్రకారం మునిసిపాలిటీలలో లక్షలోపు జనాభా గల వార్డులకు వార్డు కమిటీలు (వీటిలో వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తూ కౌన్సిల్ సభ్యులు, పౌరసమాజానికి ప్రాతినిధ్యం వహించే నియమిత సభ్యులు, ప్రాంతీయ సభల ప్రతినిధులు (ఉన్నట్లైతే), వార్డు సభ (వార్డులోని ఎలక్టర్లు అందరూ) ఏర్పాటు చేయాలి. అలాగే జనాభా 1000 నుంచి 2000 వరకు ఉన్నచోట్ల ప్రాంతీయ సభలను ఏర్పాటు చేయాలి (ఇందులో ప్రతి ప్రాంతం నుంచి కౌన్సిల్ నామినేట్ చేసిన సభ్యులు పౌరసమాజం ప్రతినిధులుగా ఉంటారు).

చట్ట సంబంధ సవరణలు 2008 ఏప్రిల్ నెలలోనే ఆమోదించినా, వార్డు కమిటీలకు నియమాలను మాత్రం 2010 ఫిబ్రవరిలో జారీ చేశారు.

- జీహెచ్‌ఎమ్‌సీ (హైదరాబాద్)లో వార్డు కమిటీలు, ప్రాంతీయ సభలు రూపొందించారు.
- విశాఖపట్నం (జీవీఎమ్‌సీ)లో వార్డు కమిటీలను ఏర్పరచారుగానీ ప్రాంతీయ సభలను ఇంకా నియోగించ లేదు[10].
- రాష్ట్రంలోని మిగతా పట్టణ స్థానిక సంస్థలలో 2012 జూన్ నాటికి ఈ కమిటీలను/సభలను రూపొందించ లేదు.

ఎన్నికలు నిర్వహించనందున, ఎన్నికైన పాలక మండలి లేనందున ఇతర స్థానిక సంస్థలలో వార్డు కమిటీలను, ప్రాంతీయ సభలను ఏర్పాటు చేయలేకపోయినట్లు ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది. (2012 డిసెంబరు). నియమాలను రూపొందించేందుకు 22 నెలల జాప్యం జరగటం, నియామాలను జారీ చేసే సమయానికే (2010 ఫిబ్రవరి) ఎన్నికైన పాలకమండళ్ళు పనిచేస్తూండటంతో ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు.

[10] ప్రాంతీయ సభలకు ప్రతి నిధులను నామినేట్ చేసినట్లు 2012 జనవరి 20 తీర్మానంలో పేర్కొన్నారు. ఐతే, ప్రాంతీయ సభలను రూపొందించిన వైనం దస్త్రాలలో కనిపించలేదు

### 4.3.3 పట్టణ స్థానిక సంస్థల స్థాయి ఆదేశక సంస్కరణలు

పట్టణ స్థానిక సంస్థల స్థాయిలో చేపట్టవలసిన ఆదేశక సంస్కరణలు, మిషన్ సిటీలలో వాటి ఆచరణ స్థితి ఈ కింది విధంగా ఉన్నది :

| సంస్కరణ | ఆచరణ స్థితి |
|---|---|
| ఈ - గవర్నెన్స్ వ్యవస్థ | జనన-మరణ నమోదు, ఆస్తిపన్ను మొదలైన వాటి చెల్లింపుల వంటి ప్రధాన సేవల కల్పనకు అవసరమైన వ్యవస్థలను రూపొందించారు. వీటి వలన ప్రజలు ఈ-సేవలాంటి పౌరుగు సేవల ద్వారా పనులు చక్కబెట్టుకోవచ్చును. |
| ఎక్రూవల్ ప్రాతిపదికన జంటపద్దు విధానంలో లెక్కలు రూపొందించటం | నాలుగు మిషన్ సిటీలలోని స్థానిక సంస్థలు తమ పద్దులను ఎక్రూవల్ ప్రాతిపదికన, జంటపద్దు విధానంలో రూపొందిస్తున్నట్లు ఆడిట్‌కు తెలిపాయి. ఈ విధానం విజయవంతంగా అమలు చేస్తున్నట్లు రాష్ట్రస్థాయి నోడల్ ఏజన్సీతోపాటు యూనిట్లు కూడా కేంద్ర ప్రభుత్వానికి నివేదించాయి. ఐతే, ఒక్క జీ హెచ్ఎమ్‌సీ మాత్రమే తమ పద్దులను వాస్తవంగా ఎక్రూవల్ ప్రాతిపదికన, జంటపద్దు విధానంలో రూపొందించినట్లు ఆడిట్ పరిశీలనలో తేలింది. మచ్చుకు తనిఖీ చేసిన మిగతా స్థానిక సంస్థల (జీ వీఎమ్‌సీ, వీఎమ్‌సీ, టీఎమ్‌సీ) ఇటీవలి పద్దులు పరిశీలించగా అవి ఎక్రూవల్ ప్రాతిపదికన, జంటపద్దు విధానంలో రూపొందలేదు. ఈ సంస్కరణను విజయవంతంగా అమలు చేసినట్లుగా పట్టణ స్థానిక సంస్థలు, రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీ కేంద్ర ప్రభుత్వానికి నివేదించినది ఆవిధంగా సరికాదు.<br>రోజువారీ లావాదేవీలను కొత్త విధానంలో కంప్యూటరీకరిస్తున్నారని ప్రభుత్వం బదులిచ్చింది. |
| పట్టణ స్థానిక సంస్థలలో జీఐఎస్ డేటాబేస్ రూపకల్పన | పథకం ప్రారంభమైన తొలి నాలుగు సంవత్సరాలలోనే ఈ సంస్కరణ చేపడతామని పట్టణ స్థానిక సంస్థలు చెప్పాయి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన సంస్థలలో ఎక్కడా ఈ విధానం అమలు కాలేదు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలలో జీఐఎస్ సర్వే/డేటాబేస్ పని ఇంకా కొనసాగుతున్నది. తిరుపతిలో అసలు మొదలుకాలేదు.<br>జీవీఎమ్‌సీలో జీఐఎస్ రూపొందించారని చెబుతూ, జీహెచ్ఎమ్‌సీ, వీఎమ్‌సీ, టీఎమ్‌సీలలో ఇంకా పూర్తవలేదని ప్రభుత్వం అంగీకరించింది (2012 డిసెంబరు). |
| ఆస్తి పన్ను (85 శాతం విస్తృతి, 90 శాతం వసూలు దక్షత) | ఆస్తి పన్ను విస్తరణ 80 శాతానికి పైగా సాధించినట్లు అన్ని పట్టణ స్థానిక సంస్థలు నివేదించాయి (*జీహెచ్ఎమ్‌సీ - 85 శాతం; జీవీఎమ్‌సీ - 90 శాతం; వీఎమ్‌సీ - 89 శాతం; టీఎమ్‌సీ - 100 శాతం*). ఐతే, జీ ఐఎస్ డేటాబేస్ లేని నేపథ్యంలో ఈ నివేదికలలోని విశ్వశనీయత నిర్ధారించుకోలేము.<br>డీసీబీ రిజిస్టరు (వసూలు కావలసినవి, వసూలైనవి, బకాయిలు) చూడగా ఒక్క వీఎమ్‌సీ (97 *శాతం*) మినహా మిగతా మూడు స్థానిక సంస్థలలో 90 శాతంపైన ఆస్తిపన్ను వసూలు చేయలేదని తెలిసింది. |
| నూరు శాతం ఖర్చుల వసూలు (నీటి సరఫరా, ఘనవ్యర్థాల నిర్వహణ) | జీవీఎమ్‌సీ మాత్రమే నీటి సరఫరా విషయంలో నూరు శాతం ఖర్చులు రాబడుతున్నది.<br>ఈ స్థానిక సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ వ్యయం నూరు శాతం వసూలు చేయలేకపోయాయి. |
| పట్టణ పేదలకు ప్రాథమిక వసతుల కోసం నిధుల అంతర్గత కేటాయింపు | మిషన్ సిటీలు అన్నీ తమ బడ్జెట్‌లలో నిర్దేశిత 40 శాతం నిధులను పట్టణ పేదలకు వసతులు కల్పించటంకోసం ప్రత్యేకిస్తున్నట్లు ఆడిట్ గమనించింది. |

### 4.3.4 ఐచ్ఛిక సంస్కరణలు

నిర్మాణ నిబంధనలను సవరించటం, గృహనిర్మాణ ప్రాజెక్టులన్నింటిలోనూ అభివృద్ధి పరచిన స్థలంలో 20-25 శాతం ఆర్థికంగా బలహీన వర్గాలకు, స్వల్పాదాయ వర్గాలకు ప్రత్యేకించటం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్పిడి చేసేందుకు న్యాయసంబంధ, విధానసంబంధ కార్యరీతులను సరళీకరించటం, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య విధానాలను ప్రోత్సహించటం వంటి ఐచ్ఛిక సంస్కరణలలో రాష్ట్ర ప్రభుత్వం సముచితమైన చర్యలను ఆరంభించినట్లు ఆడిట్ గమనించింది.

## 4.4 ప్రణాళిక, సన్నాహక చర్యలు

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద ప్రణాళికలో ఈ దిగువ అంశాలు ఇమిడి ఉన్నాయి :

**(i)** విధాన విషయాలు, కార్యాచరణ, వ్యూహరచన, ఆర్థిక వెసులుబాటులను స్పష్టం చేస్తూ ***నగరాభివృద్ధి ప్రణాళికలను*** రూపొందించి, వీటికి సమయానుకూలంగా మెరుగులు దిద్దుతూ సదా సజీవంగా ఉండేలా చూడటం.

రాష్ట్రంలోని నాలుగు మిషన్ సిటీలలోనూ స్థానిక సంస్థలు ఈ ప్రణాళికలను రూపొందించి కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందినట్లు ఆడిట్ పరిశీలనలో తెలిసింది.

**(ii)** ఎంపిక చేసిన వర్గాలలలోని ప్రాజెక్టులకు వాటి జీవన వర్తుల వ్యయం అభిలషణీయ స్థాయిలో ఉండే విధంగా ***సమగ్ర ప్రాజెక్టు నివేదికలు రూపొందించటం***.

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద చేపట్టిన అన్ని ప్రాజెక్టులకు సమగ్ర నివేదికలు రూపొందించారు. ఐతే, సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పనకోసం పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉపకరణ పత్రాలను (టూల్ కిట్స్) రూపొందించగా వివాదరహిత స్థల సేకరణ, అవరోధాల తరలింపు, వివిధ సంస్థల నుంచి పొందవలసిన అనుమతులు, చేపట్టవలసిన సర్వే-పరిశోధనలు, టెండర్లు పిలవటం, నీటి వనరులను గుర్తించటంతోపాటు ఈ ప్రక్రియలన్నిటికీ కాలపరిమితులను నిర్ణయించటంలో ఈ టూల్ కిట్లను అనుసరించలేదని ఆడిట్ గమనించింది.

**(iii)** రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీకి తగు సాంకేతిక, నిర్వాహక ఆలంబనం ఒనగూర్చేందుకోసం ***కార్యక్రమ నిర్వహణ విభాగం*** ఏర్పాటు చేయటం.

ఈ విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం 2008 జూన్‌లో మంజూరు చేయగా, నవంబరులో ఇది ఏర్పడింది. అప్పటికే నాలుగు మిషన్ సిటీలకూ నగరాభివృద్ధి ప్రణాళికలు కేంద్ర ప్రభుత్వ ఆమోదంపొందాయని ఆడిట్ గమనించింది. జేఎన్ఎన్‌యూఆర్ఎమ్‌లో చేర్చిన పలు ప్రాజెక్టులు చాలా కాలం క్రితం అనుకున్నవేనని, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు ఎంతో ముందే రూపొందించటంచేత కార్యక్రమ నిర్వహణ విభాగం ఏర్పడేవరకూ వేచిచూడకుండా వీటిని కేంద్రానికి పంపామని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో (2013 జనవరి) పేర్కొంది. కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ ఈ విభాగం దృష్టి సారించవలసిన అంశాలలో ముఖ్యమైనవి. ఐతే, ఈ విభాగంలోని కార్యక్రమ పర్యవేక్షణ, మూల్యాంకన వ్యవస్థ 2012 జూన్ నాటికి పూర్తి స్థాయిలో క్రియాశీలం కాలేదని నోడల్ ఏజన్సీ కూడా అంగీకరించింది. ప్రాజెక్టులవారీగా సమగ్ర సమాచారం ఈ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా నోడల్ ఏజన్సీ వెబ్‌సైట్‌లో లభ్యం కాలేదు.

**(iv)** పట్టణ స్థానిక సంస్థల నైపుణ్యం పెంపొందించేందుకు, ఇతోధికం చేసేందుకుగాను నిర్వహణ విభాగాలుగా ***ప్రాజెక్టు అమలు యూనిట్లను*** నెలకొల్పాలి.

మూడు మిషన్ సిటీలు,[11] ఏడు నాన్‌మిషన్ సిటీల[12] కోసం 10 యూనిట్లను 2008 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ వెబ్‌సైట్‌లో పొందుపరచగా, విజయవాడలో ప్రాజెక్టు అమలు యూనిట్‌ను నెలకొల్పలేదని ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసినప్పుడు వెల్లడైంది. ప్రాజెక్టు అమలు యూనిట్ల విధులను ఆయా పట్టణ స్థానిక సంస్థల ఇంజినీర్లు, ఇతర సిబ్బంది నిర్వహిస్తున్నారని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, స్థలసేకరణ చేపట్టకపోవటం, రైల్వే అధికారులనుంచి అనుమతులు సాధించకపోవటం వంటి కారణాల వలన పలు ప్రాజెక్టులు ఆలశ్యమయ్యాయి. ప్రాజెక్టు అమలు యూనిట్లు కట్టుదిట్టంగా రంగంలోకి దిగి ఉంటే ఈ సమస్యలను పరిష్కరించగలిగేవి. ఈ యూనిట్లకు నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరక పోవటం వలన ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

## 4.5 ఆర్థిక నిర్వహణ

### 4.5.1 నిధుల విడుదల, వ్యయం

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద ఆమోదించిన 251 ప్రాజెక్టులకు 2012 మార్చి చివరి నాటికి విడుదలైన నిధులు, చేసిన వ్యయం రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ లెక్కల ప్రకారం ఈ కింది విధంగా ఉన్నాయి.

పట్టిక 4.3

(₹ కోట్లలో)

| అంశం | ప్రాజెక్టుల సంఖ్య | ఆమోదిత ప్రాజెక్టు వ్యయం | విడుదల చేసినది | వ్యయం |
|---|---|---|---|---|
| యూఐజీ | 54 | 5238 | 1971* | 3451 |
| బీఎస్‌యూపీ | 36 | 3012 | 1422* | 2273 |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 84 | 2460 | 2272 | 2194 |
| ఐహెచ్ఎస్‌డీపి | 77 | 1197 | 613 | 678 |
| **మొత్తం** | **251** | **11907** | **6278** | **8596** |

*ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు ఉన్నాయి. పట్టణ స్థానిక సంస్థల వాటా ఇందులోలేదు

ప్రాజెక్టు ఖర్చులకు వేరుగా పద్దులు లేకపోవటంతో పైన పేర్కొన్న వ్యయంలోని విశ్వసనీయతను ఆడిట్ ధృవపరచుకొనలేక పోయింది.

### 4.5.2 నిధుల మళ్ళింపు

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నిధులను ఇతర అవసరాలకు మరలించటం, ఈ పథకంలోలేని అంశాలమీద ఖర్చులు చేయటం వంటి పలు విషయాలు ఆడిట్ గమనించింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మురునీటి పారుదల మండలి (జలమండలి) 2008 డిసెంబరు, 2009 జూన్ నెలల మధ్య ₹78.38 కోట్ల మేర గోదావరి నీటి సరఫరా పథకం తొలి దశ బిల్లులు చెల్లించటంకోసం మళ్ళించింది. ఇది జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకంలో భాగం కాదు. అదే విధంగా, ₹2.86 కోట్ల జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నిధులు కోదండపూర్, నసర్లపల్లి, గొడకొండ్ల మొదటి దశ నిర్వహణ పనులకోసం చెల్లించారు. ఇలా మళ్ళించిన నిధులను తిరిగి భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 డిసెంబరు).

[11] హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ

[12] విజయనగరం, రాజమండ్రి, గుంటూరు, అనంతపురం, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్

- అదే విధంగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ₹4.63 కోట్లను పట్టణ పేదల గృహ నిర్మాణాలు/ఇందిరమ్మ ఇళ్ళకు మళ్ళించి ఇనుము, సిమెంటు ధరల పెరుగుదల గురించి ₹7.72 కోట్లు చెల్లించారు. ఇలా మరలించిన సొమ్ము తిరిగి భర్తీ చేసేందుకు అదనపు నిధులకోసం రాష్ట్ర ప్రభుత్వానికి మనవి చేస్తామని కమిషనర్ తెలిపారు (2012 డిసెంబరు).

### 4.5.3 ఇతర ఆర్థిక అతిక్రమణలు

- నాలుగు ప్రాజెక్టులలో[13] సెంట్రల్ ఎక్సైజ్ (కేంద్ర సుంకం) రాయితీ మొత్తం ₹10.17 కోట్లు గుత్తేదారులకు అనవసరంగా చెల్లించారు. విశాఖపట్నం మహానగరపాలక సంస్థ రెండు ప్రాజెక్టులలో[14] ఇలా అధికంగా చెల్లించిన మొత్తాలను తిరిగి వసూలు చేస్తామని చెప్పింది (2012 డిసెంబరు). గాజువాకకు నీటి సరఫరా ప్రాజెక్టు విషయంలోనైతే వాడుకలో ఉన్న నియమాల మేరకే చెల్లింపులు చేశామని చెప్పారు (2012 డిసెంబరు). ఐతే, జిల్లా కలెక్టర్ సుంకం చెల్లింపు రాయితీ ధృవపత్రాన్ని ఇచ్చిన నేపథ్యంలో ఈ సమాధానం సమ్మతంకాదు. *వరంగల్ నీటి సరఫరా పథకానికి* సంబంధించి, ఎమ్ఎస్ పైపుల రేట్లలో కేంద్ర సుంకం కలపకుండానే ఐబీఎమ్ రూపొందించారని సమాధానమిచ్చారు (2012 డిసెంబరు). ఐతే, ఐబీఎమ్ ప్రకారం ఎమ్ఎస్ పైపుల ధరలలో అన్ని పన్నులు, సుంకాలు కలిసి ఉంటాయి కాబట్టి ఈ సమాధానం సరికాదు.

- ఎక్సైజ్ సుంకాన్ని 16.48 శాతం నుంచి 14.42 శాతానికి తగ్గించటం వలన *'కర్నూలు నీటి సరఫరా పథకంలో'* కేంద్ర సుంకం ₹21 లక్షలు అదనంగా చెల్లించినట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని తరువాతి బిల్లుల నుంచి రాబడతామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- రెండు ప్రాజెక్టులకు[15] సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ₹1.42 కోట్లమేర సేవాపన్ను, విలువ ఆధారితపన్ను అసలు వసూలు చేయకపోవటం జరిగింది. ఈ మొత్తాలను వసూలు చేస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

- రెండు మురుగునీటి ప్రాజెక్టులు, ఒక మంచినీటి సరఫరా ప్రాజెక్టుకు సంబంధించిన బిల్లులనుంచి వసూలు చేసిన (2006 నవంబరు - 2012 మార్చి) సీనరేజీ ఛార్జీలు ₹1.27 కోట్లు, ఎన్ఏసీ ఛార్జీలు ₹35.54 లక్షలను విజయవాడ నగరపాలక సంస్థ ఇంకా ప్రభుత్వానికి/ఎన్ఏసీకి జమ చేయవలసి ఉంది. ప్రణాళికేతర గ్రాంటు వచ్చిన తర్వాత వీటిని చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, చార్జీలు ఇదివరకే వసూలు చేశారు కాబట్టి వాటిని ప్రభుత్వానికి జమచేయటాన్ని ప్రభుత్వం నుంచి రావలసిన గ్రాంట్లతో ముడిపెట్టటం సరికాదు.

- *గాజువాక ప్రాంతానికి నీటి సరఫరా* ప్రాజెక్టులో 2,68,690.60 ఘ.మీ. మట్టి తవ్వకానికిగానూ సీనరేజి ఛార్జీల రూపేణా అంచనాలలో పొందుపరచిన ₹53.79 లక్షలను బిల్లుల నుంచి వసూలు చేయకపోవటంతో గుత్తేదారుకు అదనపు చెల్లింపు చేసినట్లైంది. వీటిని కూడా త్వరలో వసూలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 డిసెంబరు).

---

[13] వరంగల్ నీటి సరఫరా (₹5.51కోట్లు), జీవీఎమ్‌సీ పరిసర 32 ప్రాంతాలకు తాగునీటి సరఫా (₹3.38 కోట్లు), తాటిపూడి జలాశయం నుంచి నగర జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకు గల తాటిపూడి పైపులైను మార్చడం (₹1.04 కోట్లు), గాజువాక నీటి సరఫరా (₹24.24 లక్షలు)

[14] జీవీఎమ్‌సీ పరిసర 32 ప్రాంతాలకు తాగునీటి సరఫరా, తాటిపూడి జలాశయం నుంచి నగర జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకు గల తాటిపూడి పైపులైను మార్చడం

[15] విశాఖపట్నం మహానగరం జోన్ VIIIలో వరదనీటి కాలువల మెరుగుదల పనులకు ₹1.29 కోట్లు, తాటిపూడి జలాశయంనుంచి నగరంలోని జలాశానికి పైపులైను మార్పిడి పనులు, పంపింగ్ యూనిట్లకు ₹12.79 లక్షలు

- నీటి సరఫరా ప్రాజెక్టులు రెండింటిలో[16] పనులను తొలుత అప్పగించిన గుత్తేదారులు పనుల్లోని మైలు రాళ్ళను అందుకొనలేకపోవటంతో ఒప్పందాలను రద్దు చేసి మిగతా పనులను వేరే వారికి అప్పగించారు. దీనివలన కలిగిన అదనపు వ్యయం (₹1.78 కోట్లు) తొలి విడత గుత్తేదారుల నుంచి వసూలు చేయవలసి ఉంది. బ్యాంకు పూచీని సొమ్ముచేసుకొనటం ద్వారా ₹76.53 లక్షలు వసూలు చేశామనీ, మిగతా మొత్తం రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేస్తామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు).

- *కృష్ణా తాగునీటి సరఫరా ప్రాజెక్టు (రెండవదశ)* పనులకు సంబంధించి రవాణారేటు/తవ్వకం రేట్లలో లోడింగ్ ఛార్జీలను చేర్చటం వలన గుత్తేదారులకు ₹1.37 కోట్లమేర అధిక చెల్లింపులు జరిగాయి. ఈ మొత్తాలను కూడా వసూలు చేస్తామని ప్రభుత్వం తెలియచేసింది (2012 డిసెంబరు).

- *విశాఖపట్నం మహానగరం జోన్ VIIIలో వరదనీటి కాలువల విస్తరణ పనులకు (గంగుల హెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలకు)* ప్యాకేజీ - IIలో రబ్బిస సరఫరాకు అధిక రేట్లలో చేసిన అదనపు చెల్లింపు ₹4.81 లక్షలు, సీనరేజీ ఛార్జీలను సవరించిన రేటున వసూలు చేయకపోవటం వలన ₹4.08 లక్షలు, మట్టి కుప్పల తరలింపుకు ₹41.08 లక్షల మేర అధిక చెల్లింపులు జరిగాయి. వీటిని వసూలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- *కదిరి నీటి సరఫరా విస్తరణ పథకంలో* ధరల సర్దుబాటును లెక్కగడుతున్నప్పుడు ప్రభుత్వ శాఖ పోత ఇనుముకు రేటును ఎస్ఎస్ఆర్ 2007-08 అనుసరించి టన్నుకు ₹20,000 బదులు ₹15,250 (2008 నవంబరులో తెలియచేసినది) వేయటం వలన గుత్తేదారుకు ₹3.09 కోట్ల అధిక చెల్లింపు జరిగింది. నీటి సరఫరా పథకాలకు ఉపయోగించే పైపులు, అమరికలను మెత్తని ఇనుముతో ఐ.ఎస్. నెం. 8329 ప్రకారమూ, పోత ఇనుముతో 1536 ప్రకారమూ ఉత్పత్తి చేస్తారని ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొంది (2012 డిసెంబరు). ఈ గొట్టాలకు వాడే ముడిసరుకు ధరను ఎస్ఎస్ఆర్ 2007-08లో పొందుపరచక పోవటం వలన, భారత ప్రభుత్వ యాజమాన్య సంస్థ అయిన కుద్రేముఖ్ ఐరన్ ఓర్ లిమిటెడ్ (బెంగళూరు) చెప్పిన ₹15,250 ధరనే తీసుకున్నామనీ, ఈ విషయమే ఇంజినీర్-ఇన్-చీఫ్ (ప్రజారోగ్యం) 2008 నవంబరులో తెలియపరచారనీ తెలిపింది. ఐతే, మెత్తని ఇనుము, పోత ఇనుముతో తయారైన గొట్టాలకు ఎస్ఎస్ఆర్ 2008-09 ప్రకారం ఒకేధర వర్తించటం, ఇంకా కుద్రేముఖ్ ఐరన్ ఓర్ లిమిటెడ్ నుంచి వచ్చిన లేఖలో రేట్లు ఏ తరహా ఇనుముకి వర్తించేదీ పేర్కొనకపోవటం వలన పై సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 4.5.4 వసూలు కాని/సర్దుబాటుకాని అడ్వాన్సులు

ఉద్యోగులకు వివిధ అవసరాలకు ఇచ్చిన అడ్వాన్సులు నెలలోపు తిరిగి వసూలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కోడ్ (మొదటి సంపుటి) నిర్దేశిస్తోంది.

విజయవాడలో అమలవుతున్న బీఎస్‌యూపీ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రికార్డులు పరిశీలించగా, వివిధ పనుల నిర్వహణకోసం ఉద్యోగులకు, ఏజన్సీలకు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ 2009 జనవరి నుంచి 2011 మే నెల వరకూ మొత్తం ₹3.83 కోట్లను అడ్వాన్సుగా చెల్లించింది. వీటిలో ₹3.09 కోట్లు మాత్రమే సర్దుబాటు అవగా ఇంకా ₹74 లక్షలు వసూలు/సర్దుబాటు కావలసి ఉంది. ప్రభుత్వం 2012 డిసెంబరులో తన సమాధానంలో పేర్కొన్న వసూళ్ళ వివరాలు ఆడిట్ ప్రస్తావించిన అంశాలకు సంబంధించినవి కావు.

[16] కందుకూరు, మార్కాపురం నీటి సరఫరా పథకాలు

### 4.5.5 రివాల్వింగ్ ఫండ్ నిర్వహణ

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నిబంధనల ప్రకారం ఒక రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలి. ఈ పథకం ముగిసే నాటికి అది రాష్ట్ర పట్టణ మౌలిక వసతుల నిధి అవుతుంది.

- యూఐజీ/యుఐడీఎస్ఎస్ఎమ్‌టీ కోసం రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ పట్టణ స్థానిక సంస్థలకు ఇతర సంస్థలకు గ్రాంట్లు, ఋణాలు ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర గ్రాంట్లలో 25 శాతం మొత్తాన్ని పక్కనపెట్టి ఒక రివాల్వింగ్ ఫండ్‌కు జమ చేయాలి. మౌలిక ప్రాజెక్టుల కోసం మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఇది ఉండాలి;

- రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ బీఎస్‌యూపీ అమలు సంస్థలకు మృదుల ఋణాలు, గ్రాంట్లు ఇచ్చే సమయంలో కేంద్ర, రాష్ట్ర నిధుల నుంచి కనీసం 10 శాతం వసూలు చేసి ఒక రివాల్వింగ్ ఫండ్‌కు జమచేసి బీఎస్‌యూపీ కింద సమకూర్చుకున్న ఆస్తుల నిర్వహణకు వినియోగించేలా చూడాలి.

ప్రభుత్వం 2006 జూలై నెలలో యూఐజీ/యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ కోసం ఒక రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పరచింది. పట్టణ స్థానిక సంస్థలకు ఇచ్చిన ఋణాలమీద వడ్డీరూపేణా ₹6.37 కోట్లు (₹64.90 కోట్లకుగాను) వసూలు చేసి ఫండుకు జమ చేసింది. మిగతా ₹58.53 కోట్లను 2012 మార్చి నాటికి ఇంకా వసూలు చేయవలసి ఉంది. వడ్డీ చెల్లించమని సంబంధిత పట్టణ స్థానిక సంస్థలకు నోటీసులు ఇచ్చామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

ఋణాలను గ్రాంట్లుగా మార్చి ప్రభుత్వం 2009 సెప్టెంబరులో పట్టణ స్థానిక సంస్థలను ఋణ విముక్తులను చేయటం వలన బీఎస్‌యూపీ/ఐహెచ్ఎస్‌డీపీ ప్రాజెక్టుల కోసం రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయనేలేదు. ఈ ప్రాజెక్టులకు రివాల్వింగ్ ఫండ్ లేకపోవటంతో నోడల్ ఏజన్సీగానీ పట్టణ స్థానిక సంస్థలుగానీ తామ సమకూర్చిన సంపదల పటిష్ట నిర్వహణ కోసం దీర్ఘకాలిక యోచనలేవీ చేయలేదు. సామాజిక నిర్మాణాలను ఆయా పట్టణ స్థానిక సంస్థలు తమ సొంత వనరులతోనే పదిలపరచుకుంటాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

## 4.6 టెండర్ ప్రక్రియ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కోడ్ (డీకోడ్) ప్రకారం ₹20,000 పైబడిన పనులకు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మార్గదర్శకాలలోనూ, 2003లో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలలోనూ టెండర్ ప్రక్రియ మీద పలు సూచనలు చేశారు. టెండర్లను పిలవటం, పనులను అప్పగించటంలోనే కాక ₹2 కోట్లు, ఆపైన టెండర్లను ఖరారు చేసేందుకు సాంకేతిక, ధరల బిడ్లతో పాటుగా టెండర్ల కమీషనర్‌కు నివేదించటం, సంప్రతింపులను ఏస్థాయిలోనూ అనుమతించకపోవటం, టెండరు ప్రీమియంపై 5 శాతం పరిమితి, రెండవ పిలుపుకు కూడా ప్రీమియం 5 శాతం మించినప్పుడు ప్రభుత్వానికి నివేదించి తాజాగా టెండర్లు పిలవటంకానీ, గుత్తేదారుల పనితీరు ఆధారంగా ప్రభుత్వ శాఖ రూపొందించుకున్న జాబితానుంచి పేరొందిన ఒక గుత్తేదారుకు నామినేషన్‌పై పని అప్పగించేందుకు ఒక కమిటీని నియమించటం మొదలైన విధివిధానాలను వీటిలో పొందు పరిచారు.

ముఖ్యమైన టెండర్లనూ, ఒప్పందాలనూ ఆడిట్ పరిశీలించగా ఈ దిగువ విషయాలు తెలిశాయి :

### 4.6.1 కృష్ణా తాగునీటి సరఫరా పథకం (రెండవ దశ)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో నీటి సరఫరాను మెరుగు పరచేందుకు కృష్ణా నది నుంచి 16.5 టీఎమ్‌సీల[17] నీటిని (270 ఎమ్‌జీ డీ[18] తో సమానం) గ్రహించటం కోసం కృష్ణా తాగునీటి సరఫరా పథకం తలపెట్టారు. ఒక్కొక్క దశలోనూ 90 ఎమ్‌జీ డీ చొప్పున మూడు దశలలో ఈ ప్రాజెక్టును నిర్మించతలచారు. తొలి దశ 2002-2005 సంవత్సరాలలో పూర్తి చేసుకుని 2005 ఏప్రిల్ నెలలో వినియోగలోకి వచ్చింది.

టెండర్ దస్త్రాల కోసం ఆడిట్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా, 2013 జనవరిలో జరిగిన సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం ఆదేశించినాగానీ హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ దస్త్రాలను పరిశీలన కోసం ఆడిట్ ముందుంచనే లేదు. టెండర్ కమిటీ నిర్ణయ వివరాలు (మినిట్స్), ప్రతిపాదనల నిర్ధారణ (ఎస్సెస్‌మెంట్ ఆఫ్ ఆఫర్స్), ఆమోదపత్రాలు (లెటర్ ఆఫ్ యక్సెప్టెన్స్), ఒప్పందాలు జతపరచిన కాగితాలవంటి పరిమిత దస్త్రాలను పరిశీలించగా, విజయవంతమైన మూడు శ్రేణుల మధ్య ఒక అవగాహన కుదిరే అవకాశం కాదనలేమని ఆడిట్ భావించింది. ఒక వేలందారు (ఎస్సార్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్), వేలం ప్రక్రియలో పోటీని బహుశ తీవ్రతరం చేశారేమో, సాంకేతికంగా అనర్హులయ్యారు. ఆ విధంగా మొత్తం నాలుగు పనులకూ వారి ఫినాన్షియల్ బిడ్లను తెరవలేదు.

### 4.6.2 పనులను విభజించటం

ప్రాజెక్టు సమగ్ర నివేదికకు సంబంధించిన టూల్‌కిట్ల ప్రకారం ప్రాజెక్టులలోని ప్యాకేజీల సంఖ్య పరిమితంగానే ఉండాలి. ఐతే, మొత్తం ₹939.61 కోట్ల ఆమోదిత విలువకల ఆరు ప్రాజెక్టులను[19] (2 మురుగునీటి పారుదల, 1 నీటి సరఫరా, 3 గృహనిర్మాణ) 15 నుంచి 200 వరకు వివిధ ప్యాకేజీలు, పనులుగా విడగొట్టారు. ఇందుకు తగిన కారణాలను పేర్కొనలేదు. ప్రభుత్వ అనుమతి సైతం పొందలేదు. ఇదిసరికాదు. ఇందులో ఒకే తరహా పనికి వేరువేరు ధరలను వర్తింపచేసే ప్రమాదముంది. తొలి టెండర్లకు స్పందన కొరవడటంతో పనులను ఇలా విడగొట్టవలసి వచ్చిందని ప్రభుత్వం సమర్థించుకుంది(2012 డిసెంబరు). నిధుల కొరత, స్థల సేకరణ లోపం వంటి సమస్యలతో ఈ ప్రాజెక్టు సతమతమవుతున్నందున ఇలా పనులను విభజించి అప్పగించటంవలన లక్షిత ప్రయోజనం నెరవేరదు. ఆ విధంగా ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 4.6.3 పనులప్పగించటం

#### *4.6.3.1 సింగిల్ టెండర్లను ఆమోదించటం*

మంచినీటి సరఫరా వరదనీటి కాలువలు, మురుగునీటి కాలువలకు సంబంధించిన ఐదు ప్రాజెక్టుల[20] కింద 13 పనులను ఆయా ప్రాజెక్టుల అమలు సంస్థలు సింగిల్ టెండరర్లకు అప్పగించారు. ఈ పనుల మొత్తం విలువ ₹18.44 కోట్లు. మొదటి పిలుపులోనే ఈ విధంగా అప్పగించారు. వీటిలో '*కనకదుర్గా కాలనీలో మురుగు సేకరణ*

[17] టీఎమ్‌సీ : శతకోటి ఘనపుటడుగులు;

[18] ఎమ్‌జీడీ : రోజుకి పదిలక్షల గాలన్లు

[19] విజయవాడలో భూగర్భ డ్రైనేజీ లేని చోట్ల ఏర్పాటు చేసేందుకు ₹56.56 కోట్లు; విజయవాడ ఉత్తర భాగంలో మురుగునీటి పారుదల వసతుల కోసం ₹178.15 కోట్లు; విజయవాడలో నీటి సరఫరా లేని చోట్ల ఏర్పాటు కోసం ₹35.48 కోట్లు; హైదరాబాద్ సమీకృత గృహనిర్మాణ, మౌలిక వసతుల అభివృద్ధి పథకం (49,000 ఇళ్ళకు) ₹490 కోట్లు; హైదరాబాద్‌లో 4550 ఇళ్ళు నిర్మించి, వసతులు కల్పించేందుకు ₹124.06 కోట్లు; తిరుపతిలో 4087 ఇళ్ళు నిర్మించి వసతులు కల్పించేందుకు (ఐహెచ్ఎస్‌డీపీ) ₹55.36 కోట్లు

[20] విజయవాడలో భూగర్భ డ్రైనేజీ లేనిచోట్ల ఆ సదుపాయం ఏర్పాటు చేసేందుకు, 5 పనులకు ₹11.24 కోట్లు; విజయవాడ ఉత్తర భాగంలో మురుగునీటి పారుదల కోసం, 1 పనికి ₹4.10 కోట్లు; బల్కాపూర్ నాలా (₹17.98 లక్షలు), కూకట్‌పల్లి, బేగంపేట నాలా, పనికి ₹14.69 లక్షలు; విజయవాడలో నీటి సరఫరా వసతులులేని చోట్ల అవి కల్పించటానికి, 5 పనులను ₹2.77 కోట్లు

వ్యవస్థ' కూడా ఉన్నది. దీని అంచనా విలువ ₹4.02 కోట్లు కాగా, ఇందులో ప్రీమియం (9.97 శాతం) కూడా 5 శాతం పరిమితిని మించింది. ***జక్కంపూడి దగ్గర 20 ఎమ్ఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణ పనులను*** ₹12.95 కోట్ల అంచనా వ్యయంతో నాలుగవ పిలుపులో సింగిల్ టెండరర్‌కు అప్పగించారు. ఇక్కడ కూడా ప్రీమియం 5 శాతం పరిమితిని దాటింది (6.10 శాతం). అదేవిధంగా హైదరాబాద్‌లో వరదనీటి కాలువలకు సంబంధించి మొత్తం ₹1.48 కోట్ల విలువైన 8 పనులను[21] రెండవ పిలుపులో సింగిల్ టెండరర్‌కు అప్పగించారు.

విజయవాడలో రెండు మురుగునీటి పారుదల ప్రాజెక్టులకు ఈపీసీ విధానంలో తొలుత ఇచ్చిన టెండరు ప్రకటనకు స్పందన లేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). హైదరాబాదులో వరదనీటి కాలువ పనులు ఎనిమిదింటికీ తొలి పిలుపుకు స్పందన లేనందున, నిర్మాణ వ్యవధిని సవరించి, సింగిల్ టెండరర్‌కు అప్పగించినట్లు తెలిపారు. విజయవాడలో నీటి సరఫరా ప్రాజెక్టు టెండరు 5 శాతం కన్నా తక్కువగా ఉండటాన్ని పరిగణించి, పథకం గడువులోగా పూర్తి చేసేందుకు వీలుగా సింగిల్ టెండరర్‌కు అప్పగించినట్లు చెప్పారు. ఈ కింది కారణాల వలన ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

**(i)** పైనపేర్కొన్న పనులను అప్పగించేముందు ప్రభుత్వ ఆమోదం పొందలేదు. పరిమితిని మించిన ప్రీమియంతో పనులను అప్పగించిన రెండు ప్రాజెక్టులలోను నియమాల ప్రకారం ప్రభుత్వానికి నివేదించి ఉండాల్సింది.

**(ii)** తొలి పిలుపులో, ప్రీమియం 5 శాతానికి లోబడి, సింగిల్ టెండరర్‌కు అప్పగించేందుకు ప్రత్యేక ఆదేశాలు, వెసులుబాటు లేవు. పనులను ఈ విధంగా అప్పగించటంవలన పోటీధరలోని ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదముంది.

### *4.6.3.2 పనులను నామినేషన్‌పై అప్పగించటం*

పనులను టెండరు విధానంలోనే అప్పగించాలని స్పష్టమైన నిబంధనలున్నాగానీ, 23,239 ఇళ్ళ నిర్మాణానికి[22] సంబంధించి మొత్తం ₹72.58 కోట్ల విలువైన 45 పనులను వేరువేరు సంస్థలకు **నామినేషన్‌పై** అప్పగించారు (2006 మార్చి నుంచి 2008 డిసెంబరు వరకు). టెండర్ పిలుపులకు స్పందన లేనందున ఇలా చేశామని చెప్పారు. పనుల అప్పగింతకు సంబంధించిన దస్త్రాలను ఆడిట్ పరిశీలనకు అందచేయకపోవటంతో పనులు అప్పగించే ప్రక్రియలో పటిష్టత, పారదర్శకతకు ఆడిట్ హామీ ఇవ్వలేకపోతున్నది. అర్హులైన గుత్తేదారులనే నియోగించారన్న ధీమా కూడా లేదు. వాస్తవానికి, ఆరు ప్యాకేజీలలో మొత్తం ₹96 లక్షల విలువకల 96 ఇళ్ళ నిర్మాణ పనులను బ్లాక్ ప్రెసిడెంట్లకు అప్పగించారు (2006-07). వారు ఈ పనులకు అర్హత పొందినవారుకాదు.

### *4.6.3.3 ధరలు మార్చి పనులను అప్పగించటం*

తిరుపతి మునిసిపల్ కమిషనరు ₹72.83 కోట్ల విలువైన 4056 ఇళ్ళ నిర్మాణ పనులను 2008-09లో స్థానికంగా టెండర్లు పిలిచి సింగిల్ బిడ్ ప్రాతిపదికన 14 మంది గుత్తేదారులకు అప్పగించారు. తొలుత 2007 సెప్టెంబరు, అక్టోబరు, డిసెంబరులలో ఇచ్చిన టెండరు నోటీసులకు బదులు రాకపోవటంతో ఇలా చేసినట్లు తెలిపారు. తిరుపతి ఎమ్ఎల్ఏ, మునిసిపల్ కమిషనరుల సమక్షంలో జరిగిన మూడు సమావేశాలలో (2007 అక్టోబరు 16, 2007 అక్టోబరు 23, 2007 డిసెంబరు 10) గుత్తేదార్లు వెలిబుచ్చిన అభిప్రాయాల మేరకు ఆర్థిక, సాంకేతిక నిర్దిష్టతలను (స్పెసిఫికేషన్లు) సడలించి ఇంటి నిర్మాణ వ్యయాన్ని ₹1 లక్ష నుంచి ₹1.58 లక్షలకు, ఆతర్వాత

---

[21] ఎల్లారెడ్డిగూడ నాలా₹13.13 లక్షలు; బంజారాహిల్స్ నాలా ₹11.03 లక్షలు; పంజగుట్ట నాలా ₹21.63 లక్షలు; యూసుఫ్‌గూడ నాలా ₹18.62 లక్షలు; కళాసిగూడ నాలా ₹ 13.65 లక్షలు; నాగమయ్యగుంట నాలా ₹10.82 లక్షలు; మురికి నాలా (పి8, పి9,పి10) ₹32.04 లక్షలు; మురికి నాలా (పి11, పి12) ₹27.52 లక్షలు

[22] 13,793 ఇళ్ళ నిర్మాణం 45 ప్యాకేజీలుగా చేసి 31 గుత్తేదారులకు అప్పగించారు. మిగతా 9446 ఇళ్ళ నిర్మాణ సమాచారం ఇవ్వలేదు

₹2.04 లక్షలకు పెంచారు. జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నియమాల ప్రకారం దీని ఖరీదు ₹80,000 ఉండాలి. అంతేకాక నిబంధనల మేరకు ఇంటి లోపలి విస్తీర్ణం 25 చ.మీటర్లు ఉండవలసి రాగా, సవరించిన అంచనాల లోనూ, వాస్తవ నిర్మాణంలోనూ లోపలి వైశాల్యం 14.74 చ.మీటర్లు, నిర్మాణ వైశాల్యం 20.96 చ.మీటర్లు ఉన్నాయి. ఈ విధంగా నిర్దిష్టతలను మార్చటం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నియమాలకు విరుద్ధం. అలాగే, సంప్రదింపులలో ధరలను మార్చటం కూడా ప్రభుత్వ నిబంధనలను (2003) అతిక్రమించటమే. కనుక కమీషనర్ చర్య సరికాదు.

## 4.7 ప్రాజెక్టుల నిర్మాణం

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2012 మార్చి నాటికి 251[23] ప్రాజెక్టులను ఆమోదించింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

పట్టిక 4.4


(₹ కోట్లలో)

| అంశం | ప్రాజెక్టుల సంఖ్య | మురుగు నీటి పారుదల | వరదనీటి కాలువలు | నీటి సరఫరా | మౌలిక వసతులు/ గృహ నిర్మాణం | ఇతరం | ప్రాజెక్టు వ్యయం | కేంద్రం వాటా | రాష్ట్రం వాటా | పట్టణ స్థానిక సంస్థలు/ లబ్ధిదారుల వాటా |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| యూఐజీ | 54 | 11 | 12 | 16 | 0 | 15 | 5238 | 2200 | 817 | 2221 |
| బీఎస్‌యూపీ | 36 | 0 | 0 | 0 | 36 | 0 | 3012 | 1496 | 601 | 914 |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 84 | 8 | 9 | 62 | 0 | 5 | 2460 | 1968 | 246 | 246 |
| ఐహెచ్ఎస్‌డీపీ | 77 | 0 | 0 | 0 | 77 | 0 | 1197 | 764 | 155 | 278 |
| **మొత్తం** | **251** | **19** | **21** | **78** | **113** | **20** | **11907** | **6428** | **1819** | **3659** |

*మూలం : రాష్ట్రస్థాయి నోడల్ ఏజన్సీ*

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం (2012 డిసెంబరు) ప్రకారం సంవత్సరాలవారీగా ఆమోదించిన ప్రాజెక్టులు, పూర్తయినవీ ఈ దిగువ రేఖాచిత్రాలలో వివరించటం జరిగింది.

చార్టు 4.1





23 రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబరులో ఇచ్చిన సమాచారం ప్రకారం మొత్తం ప్రాజెక్టులు 253. ఐతే, అంశాలవారీగా ప్రాజెక్టుల సంఖ్య, ప్రాజెక్టు వ్యయం విషయంలో స్వల్ప వ్యత్యాసాలున్నాయి. నోడల్ ఏజన్సీ వీటిని విశదీకరించవలసి ఉంది

ఆమోదించిన 251 ప్రాజెక్టులలో 101 ప్రాజెక్టులు (40 శాతం) పూర్తయ్యాయనీ, వీటిలోకూడా 9 మాత్రమే నిర్దేశించిన గడువులోగా పూర్తయ్యాయనీ పై రేఖా చిత్రం చూస్తే తెలుస్తుంది. ఆయా ప్రాజెక్టులు పూర్తికావలసిన తేదీలను నోడల్ ఏజన్సీ తెలుపలేదు. అందువలన మిగతా 92 ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయినట్లు ఆడిట్ నిర్ధారణకు రాలేదు.

### 4.7.1 మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల స్థితి

ఆడిట్ సవిస్తరంగా పరిశీలించేందుకు ఎంపిక చేసుకున్న 74 ప్రాజెక్టులకు సంబంధించి సెక్టారువారీ పరిస్థితి 2012 జూన్ నాటికి ఈ దిగువ రేఖా చిత్రంలో చూడవచ్చును.

**చార్టు 4.2**





పై రేఖా చిత్రం చూడగా, విస్తృత పరిశీలన కోసం ఆడిట్ ఎంపిక చేసిన 74 ప్రాజెక్టులలో 28 ప్రాజెక్టులు (38 శాతం) పూర్తవగా, 2012 జూన్ నాటికి ఇంకా 46 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. ఐతే, మరో ఐదు[24] ప్రాజెక్టులు పూర్తయినట్లు ప్రభుత్వం 2012 డిసెంబరులో తెలిపింది.

### 4.7.2 ప్రాజెక్టు నిర్మాణాలలో జాప్యం

అసంపూర్ణ ప్రాజెక్టులను ఆడిట్ విశ్లేషించగా అందుకు కారణాలు ఈ దిగువ విధంగా ఉన్నాయి.

**చార్టు 4.3**




** ఇతర కారణాలలో కోర్టు వివాదాలు, నీటి వనరులు గుర్తించకపోవటం, నిధుల కొరత మొదలైనవి ఉన్నాయి*

---

[24] మరో ఐదు ప్రాజెక్టులు (నీటి సరఫరావి 4, వరద నీటి కాలువ 1) పూర్తయినట్లు ప్రభుత్వం 2012 డిసెంబరులో తెలిపింది

ప్రభుత్వం ఈ వాస్తవాలను అంగీకరిస్తూనే, నిర్మాణక్రమంలో ఎదురయ్యే ప్రతిబంధకాలు, విధానపరమైన, సాంకేతికపరమైన సమస్యల వలన పనుల్లో జాప్యం జరిగిందనీ, 2012 ఫిబ్రవరిలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఈ అడ్డంకులకు పరిష్కారం కనుకొన్నామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

### 4.7.3 మురుగునీటి పారుదల

రాష్ట్రంలో మొత్తం ₹1,825 కోట్ల ఆమోదిత వ్యయంతో చేపట్టిన 19 మురుగునీటి పారుదల ప్రాజెక్టుల నుంచి 16 ప్రాజెక్టులను (84 శాతం) నమూనా పరిశీలన కోసం ఆడిట్ ఎంపిక చేసింది. వీటిని మొత్తం ₹1,781 కోట్ల వ్యయంతో 2005-09 సంవత్సరాలలో మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుల మీద 2012 మార్చి నాటికి ₹1,090 కోట్లు ఖర్చు చేశారు. ఐతే, 2012 జూన్ నాటికి ఈ 16 ప్రాజెక్టులలో ఒక్కటి మాత్రమే వాడుకలోకి వచ్చింది.

మిషన్ సిటీలలో నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసిన 3 ప్రధాన ప్రాజెక్టులలో ఆడిట్ గమనించిన ముఖ్యమైన అంశాలను, అలాగే మిషన్, నాన్-మిషన్ సిటీలలో ఎంపిక చేసిన మిగతా 12 ప్రాజెక్టులలో ఆడిట్ గమనించిన విషయాలను కలగలుపుగానూ ఈ కింద ఇవ్వటం జరిగింది :

*మిషన్ సిటీలు*

#### *4.7.3.1 ఒకటవ మండలంలో[25] మూసీనదికి దక్షిణాన పాతబస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ*

హైదరాబాద్ మహానగర నీటిసరఫరా మురుగునీటి పారుదల మండలి (జల మండలి) చేపట్టిన ఈ ప్రాజెక్టును మూడు ప్యాకేజీలుగా విభజించి, ₹161.73 కోట్ల ఒప్పందపు విలువకు పనులప్పగించారు (2007 డిసెంబరు నుంచి 2010 ఫిబ్రవరి మధ్యన). ఒప్పందపు తేదీ నుంచి 24 నెలలలో (ప్యాకేజీ I : 2009 డిసెంబరు, ప్యాకేజీ II : 2012 ఫిబ్రవరి, ప్యాకేజీ III : 2010 జనవరి) పనులను పూర్తి చేయాలి. ఐతే, 2012 జూన్ నాటికి ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉన్నది[26].

రెండవ ప్యాకేజీ కోసం 2007 జూన్ నుంచి 2009 ఫిబ్రవరి వరకు ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా బదులు రాలేదు. రెండుసార్లు టెండర్లు పిలిచినపుడు స్పందన రాకపోవడానికి కారణాలను విచారించి, జలమండలి తన భాగస్వామ్య సంస్థల సలహాపై సమగ్ర నివేదికలను, డిజైన్లను తగువిధంగా సవరించి ఉండాల్సింది కానీ, పదేపదే టెండర్లు ఆహ్వానిస్తూ తుదకు తొమ్మిదవ పిలుపులో (2009 మే) ఏపీఆర్ - రాంకీ అనే సింగిల్ ఫినాన్షియల్ బిడ్డర్‌కు 2010 ఫిబ్రవరిలో పనులప్పగించింది. టెండర్లు పిలిచిన దాదాపు సంవత్సరానికి ఇలా పనులప్పగించింది. ఆ తరువాత 2010 నవంబరులో పనులాపేసి ప్రధాన కాలువ మార్గాన్ని మార్చవలసి వచ్చింది.

ఈ కాలువ వెళ్ళవలసిన మార్గం సమగ్ర ప్రాజెక్టు నివేదికలో ప్రతిపాదించిన విధంగానైతే అది వారసత్వ సంపదకోణంలో తీవ్రమైన చిక్కులతో కూడుకొని ఉంది. చార్మినార్ ప్రాంతంలోని పలు పురాతన కట్టడాలకు ఇది సమీపంలో ఉంది. ఐతే, సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించే దశలో దీనిని అంతగా ఆలోచించలేదు. బహుశా, జీ హెచ్ఎమ్‌సీ[27], హెచ్ఎమ్‌డీఏ[28], హెరిటేజ్ కమిటీ, పోలీసు శాఖ వంటి భాగస్వామ్య సంస్థలతో కలిసి సరైన క్షేత్రస్థాయి అధ్యయనం చేసి ఉండకపోవచ్చును. పనులప్పగించిన తరువాతనే ఈ సమస్యలను గుర్తించారు.

---

[25] ఎస్ 1 నుంచి ఎస్ 6, ఎస్ 12, ఎస్ 14 ఆయకట్టు ప్రాంతాలు

[26] భౌతికంగా, ఆర్థికంగా పూర్తయిన పనుల స్థితి శాతంలో : ప్యాకేజీ-I : 123 శాతం, 85 శాతం; ప్యాకేజీ-II : 65 శాతం, 47 శాతం; ప్యాకేజీ - III : 111 శాతం, 83 శాతం

[27] హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

[28] హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ

ఆడిట్ గమనించిన వాటిని ప్రభుత్వం అంగీకరించి, ఆచరణపరమైన అవరోధాలను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది (2012 డిసెంబరు).

### *4.7.3.2 శేరిలింగంపల్లి మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక*

ఈ ప్రాజెక్టులో విలక్షణమైన రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి :

- మురుగునీటి పారుదల వ్యవస్థను ₹106.93 కోట్ల వ్యయంతో 2011 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలి; ఐతే, 2012 జూన్ నాటికీ ఇది పూర్తి కాలేదు.
- మురుగునీటిని శుద్ధిచేసేందుకు ఆరు కేంద్రాలను నెలకొల్పి, అలా శుద్ధి చేసిన నీటిని సమీప జలాశయాలకు తరలించటం.

ఈ రెండు అంశాలకూ పనులను వేరువేరుగా అప్పగించారు. ఫలితంగా, మురుగునీటి పారుదల పనులు పురోగతిలో ఉన్నాగానీ, మురుగు శుద్ధి కేంద్రాల కోసం స్థల సేకరణ పూర్తి కానందున శేరిలింగంపల్లి వాసులకు 2012 జూన్ నాటికీ ప్రయోజనమేదీ కలుగలేదు. అంతేకాకుండా, శుద్ధి కేంద్రాలు నెలకొల్పవలసిన స్థల నిర్ణయం కాకపోవటంతో, మురుగునీటి ప్రధానకాలువల కొసభాగాల విషయంలో స్పష్టతలేదు.

సమీక్ష ముగింపు సమావేశంలో (2013 జనవరి) ప్రభుత్వం ఆడిట్ వ్యాఖ్యలను అంగీకరిస్తూ, ఇకమీదట ప్రాజెక్టులలోని అన్ని అంశాలూ ఏకకాలంలో చేపట్టేలా చూస్తామని తెలిపింది.

### *4.7.3.3 విజయవాడలో భూగర్భ డ్రైనేజీ లేని చోట్ల సమకూర్చటం*

ఈ ప్రాజెక్టును ₹56.56 కోట్ల వ్యయంతో 2006 ఆగస్టులో ఆమోదించారు. మురుగు సేకరణ వ్యవస్థను రూపొందించటం, సంపు-పంపు హౌస్ నిర్మించి పంపు సెట్లను అమర్చటం, గొట్టాలనువేసి, మురుగు శుద్ధి కేంద్రాలను నిర్మించటం ఈ ప్రాజెక్టులోని భాగాలు. విజయవాడ నగరపాలక సంస్థ ఈ మొత్తం ప్రాజెక్టును 132 పనులుగా విభజించి వాటిని 2006-2010 సంవత్సరాల మధ్యన 52 మంది గుత్తేదారులకు అప్పగించింది. మొదలుపెట్టిన 132 పనులలో 2012 జూన్ నాటికి 128 పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న నాలుగు పనులలో రెండు ప్రధానమైనవి. జక్కంపూడిలో 20 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో, అప్‌ఫ్లో ఎనరోబిక్ స్లడ్జ్ బ్లాంకెట్ పరిజ్ఞానంతో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించతలచారు. ఈ పనిని ₹13.75 కోట్ల వ్యయంతో 15 నెలలలో పూర్తి చేసే షరతుమీద 2009 జూన్ నెలలో అప్పగించారు. ఐతే, ₹9.86 కోట్లు ఖర్చు చేసిన తర్వాత 2011 ఏప్రిల్ నుంచి పనులు నిలిచిపోయాయి. కారణాలు దస్త్రాలలో లభ్యం కాలేదు. ఇక మరో ప్రధానాంశమైన గొట్టాల అమరిక 2010 డిసెంబరు నుంచి సాగటంలేదు. జక్కంపూడి దగ్గర రైలు మార్గాన్ని దాటించేందుకు రైల్వే అధికారుల అనుమతి రాకపోవటంతో ఈ పనులాగిపోయాయి. ఇప్పటికే వీటి మీద ₹5.42 కోట్లు ఖర్చయింది. ఇలా పనులు పూర్తికాకపోవటంతో సంబంధిత పనుల మీద 2012 జూన్ వరకు చేసిన ₹66.22 కోట్ల ఖర్చు నిష్ఫలమైంది.

ఈ విషయమై ప్రభుత్వం నిర్దిష్ట సమాధానమివ్వలేదు.

### *4.7.3.4 ఇతర ప్రాజెక్టులు*

వివిధ మిషన్ సిటీలు, నాన్-మిషన్ సిటీలలో అసంపూర్తిగా ఉన్న 12 మురుగునీటి ప్రాజెక్టులలో ఆడిట్ గమనించిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి.

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | మూసీనదికి దక్షిణాన రెండవ మండలం పాత బస్తీలో మురుగునీటి పారుదల వ్యవస్థ పునుద్ధరణ, విస్తరణ (ఆయకట్టు ఎస్7 నుంచి ఎస్11, ఎస్13, ఎస్15) | ఈ ప్రాజెక్టును 2007-08లో ₹251.25 కోట్లకు ఆమోదించారు. ఇరుకుగా, జనసమ్మర్దంగా ఉండే పాతబస్తీలో పనులు చేపట్టాల్సి రావటంతో పాటు తరచుగా చోటు చేసుకునే బంద్‌లు, పండుగల వంటివి నిర్మాణ పనులను ఆటంకపరచాయి. గడువు 15 నెలలు పొడిగించినా ప్రాజెక్టు పూర్తవలేదు. ఆడిట్ పేర్కొన్న కారణాలను ప్రభుత్వం రూఢి చేసింది (2012 డిసెంబరు). | 138.70 |
| 2 | విశాఖపట్నం నగర కేంద్ర భాగంలో మురుగునీటి వ్యవస్థను ఏర్పరచటం | ఈ ప్రాజెక్టును 2006-07లో 244.44 కోట్లకు మంజూరు చేశారు. స్థల సేకరణ జరగకపోవటం, జాతీయ రహదారి ప్రాధికార సంస్థ నుంచి, రైల్వేల నుంచి అనుమతులు అవసరం కావటం, మురుగు నీటి శుద్ధి కేంద్రాల స్థల మార్పిడి వలన పనులు పూర్తికాలేదు. నాలుగు ప్యాకేజీలలో ఒక్కటి మాత్రమే పూర్తయింది. నగరపాలక సంస్థ ₹264.01 కోట్ల అంచనావ్యయంతో ప్రాజెక్టు నివేదికను సవరించింది. (అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ భరించి, 2013 మార్చిలోగా పూర్తి చేయాలి). ఈ నిర్మాణాలలో జాప్యం వలన మురుగునీరు బహిరంగ కాలువలలో ప్రవహించి పర్యావరణానికి ప్రమాదకారణ మవుతున్నాయి. ఆడిట్ వ్యాఖ్యలను ప్రభుత్వం అంగీకరించింది (2012 డిసెంబరు). సవరించిన ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపామనీ, అదనపు వ్యయాన్ని నగరపాలక సంస్థ భరిస్తుందనికూడా తెలిపింది. | 189.11 |
| 3 | విశాఖపట్నం పాత బస్తీ ప్రాంతంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ ఏర్పరచటం | ఈ ప్రాజెక్టు 2009 అక్టోబరులో పూర్తయింది. ఐతే, ఉద్దేశించిన 13000 ఇళ్ళకు బదులు 10339 ఇళ్ళకే భూగర్భ డ్రైనేజీ కల్పించారు. ఎలైన్‌మెంట్ల వ్యయం అధికంగా ఉండటం, స్థల సేకరణ సమస్యల వలన పనుల్లో జాప్యం జరిగినట్లు చెప్పారు. ఈ పథకం కింద నిర్మించిన శుద్ధి కేంద్రాల నుంచి 12 ఎమ్ఎల్‌డీ బదులు 3.6 ఎమ్ఎల్‌డీ శుద్ధ జలాలను మాత్రమే విక్రయించారు.<br>వినియోగ రుసుమును 2012 ఏప్రిల్ నుంచి వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, ఈ ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదించినప్పటి నుంచీ (2008 జూలై, 2011 ఆగస్టు) ఈ రుసుము వసూలు చేయకపోవటానికి కారణాలు తెలుపలేదు. మిగతా శుద్ధ జలాలను అమ్మేందుకు టెండరు ప్రక్రియ సాగుతున్నదని కూడా ప్రభుత్వం తెలిపింది. | 35.95 |
| 4 | విజయవాడ నగరం ఉత్తర భాగంలో మురుగు నీటి పారుదల వసతి కల్పించటం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹178.15 కోట్లకు మంజూరు చేశారు. పనులప్పగించటంలో జాప్యంతోపాటు ఇసుక కొరత వంటి ఇతర ఇబ్బందుల వలన పనులు పూర్తికాలేదు. తొలి టెండర్లకు స్పందన రాలేదని చెప్పిన ప్రభుత్వం ఈ పనులను 2013 జూన్ నాటికి పూర్తి చేస్తామని పేర్కొంది (2012 డిసెంబరు). | 60.55 |

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 5 | మిర్యాలగూడ మురుగు నీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹34.93 కోట్లకు మంజూరు చేశారు. స్థలసేకరణ చేయకపోవటం, డిజైన్లను ఖరారు చేయకపోవటం వలన మురికినీటి శుద్ధి కేంద్రాలు రెండింటి నిర్మాణం పూర్తవలేదు. ఇప్పటికి 80 శాతం పని పూర్తయిందని చెబుతూ, రెవెన్యూ అధికారులను నిరంతరం కోరుతున్నా స్థల సేకరణ జరగలేదని ప్రభుత్వం తెలిపింది. | 29.70 |
| 6 | నరసరావు పేట మురుగు నీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹26.41 కోట్లకు మంజూరు చేశారు. స్థల సేకరణలోని జాప్యం, మురుగునీటి శుద్ధి పరిజ్ఞానం ఖరారు చేయకపోవటం వలన పనులు పూర్తవలేదు. వాస్తవాలను ప్రభుత్వం ధృవీకరించింది. | 23.36 |
| 7 | నగరి మురుగు నీటి పారుదల (ఈటీపీ) పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹9.83 కోట్లకు మంజూరు చేశారు. ఐతే, మురికినీటి శుద్ధి కేంద్రానికి (ఈటీపీ) స్థల నిర్ణయం కాకపోవటంతో నిర్మాణం పూర్తవలేదు. గ్రామస్తులు వ్యతిరేకించటం వలన వేరే స్థలాన్ని ఎంపిక చేశామనీ, ఇందువలన గుత్తేదారుకు గడువు పొడిగించాల్సి వచ్చిందనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). | 11.18 |
| 8 | కడప మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹49.15 కోట్లకు ఆమోదించారు. దీనిలో 20 ఎమ్ఎల్‌డీ సామర్ధ్యంతో రెండు శుద్ధి కేంద్రాలు తలపెట్టగా స్థల సేకరణ జరగకపోవటంవలన ఒకదాని నిర్మాణం ఇంకా చేపట్టలేదు. ప్రభుత్వం ఈ విషయం ధృవీకరించింది (2012 డిసెంబరు). | 63.32 |
| 9 | నిజామాబాద్ మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹81.06 కోట్లకు ఆమోదించారు. అనుకున్న మూడు శుద్ధి కేంద్రాలు అసంపూర్ణంగానే ఉన్నాయి. నిధుల కొరత, స్థలసేకరణలో జాప్యం వలన అంచనాలను సవరించవలసి వచ్చింది. వాస్తవాలను ప్రభుత్వం అంగీకరించింది (2012 డిసెంబరు). నష్టపరిహారం పూర్తిగా చెల్లించకపోవటంతో స్థల యజమానులు సర్వేను అడ్డుకుంటున్నారనీ రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేసేందుకు ఇది ప్రతిబంధకమయిందనీ ప్రభుత్వం తెలిపింది. | 55.53 |
| 10 | నల్గొండ మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹46.88 కోట్లకు ఆమోదించారు. స్థలసేకరణ చేపట్టకపోవటం, తగు సాంకేతిక విధానం ఖరారు చేయకపోవటంవలన మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణం పూర్తి కాలేదు. స్థలసేకరణ, సాంకేతిక విధానాలు నిశ్చయించటంలోని జాప్యంవలన అంచనాలు సవరించవలసివచ్చిందనీ, ఆకారణంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టలేక పోయామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). | 41.16 |
| 11 | ఎమ్మిగనూరు మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹39.83 కోట్లకు ఆమోదించారు. స్థల సేకరణలోని జాప్యం కారణంగా మురుగునీటి శుద్ధి కేంద్రం, మురుగునీటి గుంటల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. | 27.89 |

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 12 | కరీంనగర్ మురుగునీటి పారుదల పథకం | ఈ పథకం 2006-07లో ₹62.37 కోట్లకు ఆమోదంపొందింది. గొట్టాలు వేయటానికి రహదార్లు భవనాల శాఖ నుంచి అనుమతి రాకపోవటం, డిజైన్లలో మార్పులు, ఇంకా గుత్తేదారు వెలిబుచ్చిన మరికొన్ని అవరోధాల కారణంగా, గడువు పొడిగించినాగానీ పనులు పూర్తి కాలేదు. | 44.91 |

### 4.7.4 వరదనీటి కాలువలు

మొత్తం ₹676 కోట్ల ఆమోదిత వ్యయంతో చేపట్టిన 21 వరదనీటి కాలువ ప్రాజెక్టులలో విస్తృత పరిశీలన కోసం మొత్తం ₹542 కోట్ల ఆమోదిత విలువకల 17 ప్రాజెక్టులను (81 శాతం) ఆడిట్ ఎంపిక చేసుకుంది. వీటిలో 2012 జూన్ నాటికి ఏడు మాత్రమే పూర్తయ్యాయి. మిషన్ సిటీలలో ఎనిమిది ప్రాజెక్టులను ఎంపిక చేసుకోగా వాటిలో రెండు ప్రాజెక్టులు, అలాగే నాన్-మిషన్ సిటీలలో ఎంపిక చేసుకున్న తొమ్మిదింట ఐదు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఆరు ప్రాజెక్టులలో గమనించిన ముఖ్యాంశాలను ఈ దిగువ విశదీకరించి, తదుపరి నాలుగు ప్రాజెక్టులలో గమనించిన అంశాలను క్లుప్తంగా ఇవ్వటం జరిగింది.

#### *4.7.4.1 జీ హెచ్ఎమ్సీలో ఐదు వరదనీటి కాలువల నవీకరణ, విస్తరణ-మురికినాలా (పి8,పి9,పి10), మురికినాలా (పి11,పి12), కూకట్పల్లి, బేగంపేట నాలా; బల్కాపూర్ కాలువ, ఒకప్పటి హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (ఎమ్సీహెచ్) జోన్ I,IIలలో వరదనీటి కాలువల విస్తరణ*

తొలుత సాగునీటి పారుదల శాఖ నాలుగు ప్రాజెక్టులను[29] చిన్న చిన్న ప్యాకేజీ లుగా విభజించి చేపట్టింది (2005-2010). తదుపరి జీ హెచ్ఎమ్సీ మిగిలిన నాలుగు పనులను, ఒకప్పటి ఎమ్సీహెచ్లోని జోన్ - I, జోన్ - IIకు సంబంధించిన వరదనీటి కాలువల విస్తరణ పనులతోపాటు (18 పనులు) చేపట్టింది. ఈ పనులేవీ 2012 జూన్ నాటికి పూర్తికాలేదు. స్థలసేకరణలో జాప్యమే దీనికి కారణంగా పేర్కొన్నారు. ఐతే, స్థలసేకరణ కోసం అభ్యర్థన పంపిన విషయం ఈ పనులకు సంబంధించిన దస్త్రాలలో ఎక్కడా ప్రస్తావించకపోవటం ఆడిట్ గమనించింది. ఈ పనులమీద 2012 జూన్ నాటికి మొత్తం ₹40.89 కోట్లు ఖర్చు చేసినాగానీ పనులు పూర్తికాలేదు.

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామనీ, ఆక్రమణలులేని స్థలాలలో పనులు కొనసాగుతున్నాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఆచరణలో ఎదురవుతున్న అడ్డంకులు, నిర్మాణంలో జాప్యానికి తావిస్తూ తలెత్తే విధానపరమైన, సాంకేతికపరమైన సమస్యలను ఇటీవల 2012 ఫిబ్రవరిలో తాజాగా రూపొందించిన సమగ్ర మార్గదర్శకాలలో అధిగమించామని కూడా ప్రభుత్వం తెలిపింది.

#### *4.7.4.2 విశాఖపట్నం జోన్ VIIIలో వరదనీటి కాలువల విస్తరణ (గంగులపెద్ద, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు)*

కాలువలను విస్తరించి, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తొలగించటం, ట్రాఫిక్ చిక్కులను అధిగమించటం కోసం ₹72.27 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 16.39 కి.మీ. పొడవైన కాలువలను విస్తరించే ఈ ప్రాజెక్టును చేపట్టారు. మొత్తంపనిని మూడు ప్యాకేజీలుగా విభజించి 2011 జూన్లోగా పూర్తిచేసే విధంగా అప్పగించారు

[29] మురికినాలా (పి8,పి9,పి10), మురికినాలా (పి11,పి12), కూకట్పల్లి మరియు బేగంపేట నాలా, బల్కాపూర్ వరదనీటి కాలువల నవీకరణ

(2009 అక్టోబరు - డిసెంబరు). ఐతే, నిర్మాణాలప్పుడు ఉత్పన్నమయ్యే ఆటంకాలైన ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలను, తీగలను తరలించటం వంటి విషయాలను సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించే సమయంలో పరిగణించలేదని ఆడిట్ పరిశీలనలో తెలిసింది. దీంతో, 2012 జూన్ నాటికి పనులేవీ పూర్తవలేదు. చైనేజీ 750 నుంచి 770 దగ్గర జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ అపార్టుమెంటు కూడా ఒక అవరోధమయింది. ఈ విషయాలను ఇర్మా నివేదిక సైతం ధృవీకరించింది. పట్టణ ప్రణాళిక విభాగంతోపాటు ప్రత్యేక దళాలను కూడా ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగిస్తున్నామనీ, డిసెంబరు 2012 నాటికి పనులు పూర్తవుతాయనీ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు). ఐతే, పనులు పూర్తి చేసిన సమాచారమేదీ 2013 జనవరినాటికి అందలేదు.

### *4.7.4.3 ఇతర ప్రాజెక్టులు*

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | సూర్యాపేట వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹24.64 కోట్లకు మంజూరు చేశారు. మురికినీటిని శుద్ధిచేసే కేంద్రానికి అవసరమైన స్థల సేకరణ చేయక పోవటంతో ఇది పూర్తికాలేదు. రెవెన్యూ అధికారులు స్థలసేకరణ పనిలో ఉన్నారనీ, స్థలం ఇంకా స్వాధీనం చేయలేదనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). | 9.73 |
| 2 | అనకాపల్లి వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹22.22 కోట్లకు మంజూరు చేశారు. రైల్వేలు, రహదార్లు-భవనాలు, నీటిపారుదల శాఖల నుంచి అనుమతులు రాకపోవటంతో ఇది పూర్తికాలేదు. జాప్యాన్ని అంగీకరిస్తూనే, అనుమతులు సంపాదించేందుకు చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు). | 13.80 |
| 3 | మిర్యాలగూడ వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టు 2008-09లో ₹34.35 కోట్లకు మంజూరైంది. కానీ ఆగస్టు, మార్చి నెలల మధ్య ఎన్ఎస్ కాలువ నుంచి నీరు పారటం, భారీ వర్షాల వంటి చిక్కుల వలన పనులలో జాప్యం జరిగింది. ఐతే, ఎన్ఎస్ కాలువ నుంచి నీరుప్రవహించే విషయం ముందు తెలిసినదే కాబట్టి ఇది ఒప్పుకొన తగిన కారణం కాదు.<br>రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ ఇచ్చిన సమాచారం (2012 డిసెంబరు) ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తయింది. | 10.99 |
| 4 | నల్గొండ వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹35.86 కోట్లకు ఆమోదించారు. ఇది అసంపూర్తిగానే మిగిలింది. మరికొన్ని క్రాస్ సెక్షన్లను ప్రాజెక్టు పరిధిలో చేర్చటంతోపాటు స్థల సేకరణలోని జాప్యం, భారీ వర్షాల వంటి ప్రతిబంధకాలు నిర్మాణంలోని ఆలస్యానికి కారణాలుగా తెలిపారు. | 23.03 |

### 4.7.5 నీటి సరఫరా

రాష్ట్రంలో మొత్తం ₹3,642 కోట్ల ఆమోదిత వ్యయంతో చేపట్టిన 78 నీటి సరఫరా ప్రాజెక్టుల నుంచి 2005-09 సంవత్సరాల మధ్య మొత్తం ₹2,457 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన 35 ప్రాజెక్టులను ఆడిట్ విస్తృత పరిశీలన కోసం ఎంపిక చేసుకుంది. ఈ 35 ప్రాజెక్టులలో 2012 జూన్ నాటికి 11 ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో ఆడిట్ గమనించిన విశేషాంశాలను ఈ దిగువ వివరించటం జరిగింది.

### 4.7.5.1 కృష్ణా తాగునీటి సరఫరా పథకం (రెండవ దశ)

కృష్ణా తాగునీటి సరఫరా పథకం (రెండవ దశ) కోసం ప్రభుత్వం 2006 ఫిబ్రవరిలో ₹830 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పిస్తూ దీనిని ₹223.50 కోట్ల వ్యయంతో ఆరంభించనున్నట్లు సూచించింది. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం 2007 నవంబరులో ₹606.50 కోట్లకు ఆమోదిస్తూ దీనిని ***2007 నవంబరు*** నాటికే పూర్తి చేయాలని తెలిపింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర పభుత్వం ఆమోదించటానికి చాలా ముందే ప్రాజెక్టులోని ప్రధానాంశాలను పూర్తి చేసుకుని 2007 ఏప్రిల్‌లోనే పథకం పాక్షికంగా పనిచేయటం ప్రారంభించింది. మిగతా చిల్లరమల్లర అంశాలు, రింగ్ మెయిన్స్‌కు అనుబంధమైనవి కూడా పూర్తి చేసుకుని ఈ పథకం 2008 నవంబరులో పని ఆరంభించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపకముందే ప్రాజెక్టు పాక్షికంగా పూర్తి కావటం, తగిన పత్రాలు కూడా లేకపోవటంతో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన ఖర్చులలోని యదార్థతని ఆడిట్ పరిశీలించలేకపోయింది.

అప్పట్లో (2005-06) నెలకొన్న నీటి ఎద్దడి దృష్ట్యా నగరానికి నీటి సరఫరా తక్షణమే మెరుగు పరచాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును 2005 మే, 2006 జనవరి మధ్యన ఆరంభించామని ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది (2012 డిసెంబరు). వీటికి సంబంధించిన వివరాలుగానీ, పత్రాలను గానీ ఆడిట్ ముందుంచలేదు.

### 4.7.5.2 పాత ఎమ్‌సీహెచ్‌లోని 10 జోన్ల పంపిణీ వ్యవస్థతోపాటు ఫీడర్ వ్యవస్థల పునరుద్ధరణ

మూసీనదికి ఉత్తర, దక్షిణ భాగాలలోని 10 మండలాలలో నీటి సరఫరా కోసం తలపెట్టిన 14 కొత్త రిజర్వాయర్లకు ప్రవేశ మార్గం, బయటకు మార్గం నిర్మించేందుకు ₹232.22 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు 2008 జూలై నెలలో మంజూరైంది. రిజర్వాయర్ల నిర్మాణం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద రెండు వేరువేరు ప్రాజెక్టులుగా అనుమతించారు.

ఈ 14 రిజర్వాయర్లకుగాను, 12 నిర్మాణాలు 2011 డిసెంబరు నాటికి పూర్తయినా, ప్రవేశ మార్గాలు, నీరు బయటికి వెళ్ళే మార్గాలకు సంబంధించిన పనులు (మచ్చుకు ఎంపిక చేసిన ప్రాజెక్టు) 2012 జూన్ నాటికి అసంపూర్తిగానే ఉన్నాయి[30]. ఈ పనులను 2009 ఫిబ్రవరి, 2011 మార్చి నెలల మధ్యలో అప్పగించి ఆరు/తొమ్మిది నెలలో పూర్తి చేయాలని షరతు పెట్టారు. ఆయా ప్రాంతాలలో రోడ్లను తవ్వేందుకు సంబంధిత అధికారులు విడివిడిగా అనుమతించటంతో ఇది ప్రతి మండలంలోనూ పనుల పురోగతిపై ప్రభావం చూపిందని జలమండలి పేర్కొంది. సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకపోవటం, ఎన్నికలు, పండుగలు, బంద్‌ల వంటి వాటిని జాప్యానికి కారణాలుగా చూపుతూ ప్రభుత్వం అన్ని భాగస్వామ్య సంస్థలను సంప్రతించి ఈ తరహా జాప్యాలు పునరావృతం కాకుండా తగు విధానం కనుగొంటామనీ, కొనసాగుతున్న పథకాలను పూర్తి చేయటంలోనూ, కొత్త పథకాలు చేపట్టినప్పుడూ ఇలాంటి జాప్యాలను నివారిస్తామనీ పేర్కొంది (2012 డిసెంబరు).

### 4.7.5.3 జీవీఎమ్‌సీ పరిసరాల్లోని 32 ప్రాంతాలలో తాగునీటి సరఫరా

ఈ ప్రాజెక్టును ₹240.74 కోట్లకు 2008 ఫిబ్రవరిలో మంజూరు చేశారు. దీనిని రెండు ప్యాకేజీలుగా విభజించి 2008 అక్టోబరు/2009 జనవరిలో వేరువేరు గుత్తేదారులకు అప్పగించారు. నీటి శుద్ధి కేంద్రం, పంపు హౌసులు, నీటి ట్యాంకులు/జలాశయాలు, అనుబంధ మౌలిక వసతులు ఒక ప్యాకేజీ కాగా నీటి పంపిణీకి గొట్టాలు వేయటం రెండవది. ఈ పనులు 24 నెలలలో పూర్తి కావలసి ఉంది. ఆడిట్ గమనించిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి ః

[30] మొత్తం 15 ప్యాకేజీలకు గాను మూడు మాత్రమే పూర్తయ్యాయి

- మొత్తం 53 నీళ్ళ ట్యాంకులు/జలాశయాలకుగాను (ఈఎల్ఎస్ఆర్/జీ ఎల్ఎస్ఆర్[31]) 43 పూర్తయ్యాయి; మరో 9 జలాశయాల పనులు జరుగుతుండగా ఒక జలాశయం పని 2012 జూన్ నాటికి ఇంకా మొదలు కాలేదు. రైల్వేలు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, విశాఖపట్నం ఉక్కు కర్మాగారం, రెవెన్యూ శాఖల నుంచి స్థలం సేకరించకపోవటమే పనులు పూర్తికాకపోవటానికి ప్రధానకారణం.

- అవసరమైన స్థలాన్ని విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ఇవ్వకపోవటంతో అత్తవారిపాలెంలో నిర్మించ తలపెట్టిన 85 ఎమ్ఎల్డీ[32] నీటి శుద్ధి కేంద్రం అగనంపూడికి మార్చవలసి వచ్చింది. ఫలితంగా నీటి శుద్ధి కేంద్రం ఆరంభ దశలోనే ఉన్నది.

- నీటి సరఫరా గొట్టాలు వేసేపని 90 శాతం పూర్తయినాగానీ, ట్యాంకులు, జలాశయాలు, నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం మాత్రం వెనుకబడి ఉన్నాయి (2010 అక్టోబరు). పర్యవసానంగా, విశాఖపట్నం పరిసర ప్రాంతాల వారు బోరు బావులమీద, ట్యాంకర్ల ద్వారా చేసే అరకొర సరఫరామీదా ఆధారపడుతున్నారు.

పనుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూ, స్థలసేకరణ పూర్తయిందనీ, పనులు పురోగతిలో ఉన్నాయనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

### *4.7.5.4 విశాఖపట్నం మహానగర పాలక సంస్థ పరిధిలోని పాతనగరంలో సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ*

పాతనగరంలోని 6 బ్లాకులలో ఉన్న 1.25 లక్షల జనాభాకు ప్రతిరోజూ అన్నివేళలా నీటి సరఫరా కల్పించే దిశగా ఈ ప్రాజెక్టును 2009 మార్చి నెలలో ₹47.93 కోట్ల వ్యయంతో మంజూరు చేశారు. జీఎల్ఎస్ఆర్, ఈఎల్ఎస్ఆర్, సంప్-కం-పంప్‌హౌస్ వంటి అన్ని అవసరాలకు స్థలాల లభ్యత గురించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలో స్పష్టంగా ఉన్నది. ఐతే, ఆయా అవసరాలకు తగిన స్థలాలు జీవీఎమ్‌సీ స్వాధీనంలో లేవు. అలా, అవాస్తవాల ఆధారంగా సమగ్ర ప్రాజెక్టు నివేదికపై కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందారు. దేవాదాయ శాఖ, వీపీటీ వంటివి స్థలాలు స్వాధీనం చేయటంలో ఆలస్యం చేయటంవలన 575 కేఎల్, 1050 కేఎల్ ఈఎల్ఎస్ఆర్, 6000 కేఎల్ జీ ఎస్‌బీఆర్, సంప్-కం-పంప్‌హౌస్ నిర్మాణం 2011 డిసెంబరులో పూర్తి కావలసినది 2012 జూన్ నాటికి అసంపూర్తిగానే ఉన్నాయి. గుత్తేదారులకు చెల్లింపులు చేయటంలోని ఆలస్యం, ₹8.19 కోట్లు ఇతర ప్రాజెక్టులకు మళ్ళించటం వలన కూడా పురోగతి కుంటువడింది. జీ ఎల్ఎస్ఆర్, ఈఎల్ఎస్ఆర్ నిర్మాణాలు, పైపులైన్లు వేయటం వంటివి పూర్తి కాకపోయినా, 12000 నీటి మీటర్ల కొనుగోలు కోసం జీవీఎమ్‌సీ చెల్లింపులు చేసింది. అవి 2010 ఏప్రిల్ నుంచీ నిరుపయోగంగా పడి ఉన్నాయి.

పనుల్లోని జాప్యాన్ని ప్రభుత్వం అంగీకరించి, అన్ని సమస్యలూ పరిష్కరించామనీ, పనులు కొనసాగుతున్నాయనీ తెలిపింది (2012 డిసెంబరు).

### *4.7.5.5 జీవీఎమ్‌సీ మధ్య ప్రాంతంలోని ఈశాన్య మండలంలో సమీకృత నీటి సరఫరా పునరుద్ధరణ*

ఈ ప్రాజెక్టును 2009 మార్చి నెలలో ₹190.18 కోట్లకు మంజూరు చేశారు. ప్రస్తుత జనాభా 4.60 లక్షలకే కాక 2023 సంవత్సరానికి అంచనా వేసిన 5.38 లక్షల మందికి కూడా తలసరి నీటి సరఫరా 150 ఎల్‌పీసీడీ వరకూ నమ్మకంగా అందించే దిశగా ఈ ప్రాజెక్టును తలపెట్టారు. రాయివాడ, వైఎల్ఎమ్‌సీ, నార్వ, తాటిపూడి వంటి వివిధ జల వనరుల నుంచి పట్టణ పంపిణీ జలాశయానికి తరలించే 118.84 ఎమ్ఎల్డీ నీరు మొత్తాన్ని ఇందుకు వినియోగించుకోవాలి. ఈ పనులను 2009 డిసెంబరులో అప్పగించి 2012 డిసెంబరులోగా పూర్తిచేయాలని నిర్దేశించారు. ఆడిట్ గమనించిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి :

---

31 ఈఎల్ఎస్ఆర్ : ఎత్తుగా నిర్మించిన నీళ్ళ టాంకు; జీఎల్ఎస్ఆర్ : నేలపై నిర్మించిన జలాశయం

32 ఎమ్ఎల్డీ : రోజుకి పది లక్షల లీటర్లు

- మధ్య ప్రాంతంలో సమీకృత నీటి సరఫరా వ్యవస్థ పునరుద్ధరణ పనులకు ₹425.89 కోట్ల అంచనా వ్యయంతో ఒక సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించారు. ఐతే, కేంద్ర ప్రభుత్వం ఈశాన్య విభాగానికి మాత్రం ₹190.18 కోట్ల వ్యయంతో ఆమోదం తెలిపింది. ఈశాన్య విభాగానికి రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఆడిట్‌కు గానీ ఇర్మాకు గానీ అందచేయలేదు. ఈ నివేదిక అందుబాటులో లేని కారణంగా, ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన పనులలోని ప్రామాణికతను ఆడిట్ పరిశీలించలేకపోయింది.

- రిజర్వాయరును ఎమ్‌వీపీ కాలనీ నుంచి రేసవానిపాలెంకు మార్చటం వలన, మట్టి పరీక్షలు మళ్ళీ చేయవలసి రావటం వలనా నిర్మాణపు పనులు ఆలశ్యమయ్యాయి. స్థల మార్పు వలన డిజైన్లను మరోసారి రూపొందించి ఆమోదం పొందవలసి ఉంది. ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు రిజర్వాయరు స్థల మార్పిడి చేయవలసి వచ్చిందని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు). ఐతే, ప్రాజెక్టు మొదలు పెట్టే ముందు స్థల నిర్ణయం సరిగా చేయనందున పనులు ఆలస్యమయ్యాయన్నది వాస్తవం.

- ఒప్పందంలో జీవీఎమ్‌సీ నిర్ణయించిన మైలురాళ్ళ మేరకు పనులు నిర్వహించటంలో గుత్తేదారు విఫలమైనట్లు ఇర్మా తన నివేదికలో పేర్కొంది (2012 ఫిబ్రవరి). ఆర్థిక పురోగతి 2012 జనవరి చివరకు 80 శాతం ఉండాలని నిర్దేశించగా 49 శాతం మాత్రమే సాధించింది. అదేవిధంగా గొట్టాల కొనుగోలులో 55 శాతం, నిర్మాణ పనులలో 45 శాతం లోటు ఉంది. స్థలం సమస్యలు, శ్రామిక సమస్యలు, పని నిర్వహణలోని సంకట స్థితులు, చెల్లింపులలోని జాప్యం వంటి పలు కారణాలు పనుల్లోని పురోగతిని ప్రభావితం చేశాయని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు).

- ఈ ప్రాజెక్టు కోసం విడుదల చేసిన ₹33 కోట్లు జేఎన్‌ఎన్‌యూఆర్ఎమ్ పరిధిలోనే మరొక ప్రాజెక్టుకు మళ్ళించటం వలన కూడా పనులలోని పురోగతి మందగించింది.

### *4.7.5.6 జీవీఎమ్‌సీ గాజువాక ప్రాంతానికి తాగునీటి సరఫరా వృద్ధి*

గాజువాక మునిసిపాలిటీలో తాగునీటి అవసరాలకూ, సరఫరాకూ మధ్య వ్యత్యాసం తొలగించే దిశగా ఈ ప్రాజెక్టును 2007 ఏప్రిల్‌లో ₹39.76 కోట్లకు ఆమోదించారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం 2 ఎమ్‌జీడీ[33] (7.57 ఎమ్ఎల్‌డీ) స్థాపక సామర్థ్యంతో 1995లో నెలకొల్పిన పథకం ఒక్కటే ఇక్కడ రక్షిత తాగునీటి వనరు. గాజువాక మున్సిపాలిటీతో చేసుకున్న ఒప్పందం మేరకు ఉక్కు కర్మాగారం 0.80 ఎమ్‌జీడీ (3ఎమ్ఎల్‌డీ) నీటిని సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో 2007 జూన్, 2009 నవంబరు మధ్యన ఈ ప్రాజెక్టు పనులప్పగించారు. దీనిని 2012 డిసెంబరులో పూర్తి చేసినట్లు తెలిపారు. స్థల సేకరణలోని జాప్యం వలనా, రైల్వే అధికారుల నుంచి అనుమతి పొందటంలో జాప్యం వలనా ప్రాజెక్టు సకాలంలో పూర్తికాలేదు.

గాజువాక ప్రాంతంలో 2038 సంవత్సరానికి ఊహించిన 120 ఎమ్ఎల్‌డీ గిరాకీని తట్టుకునేలా ఈ ప్రాజెక్టును రూపొందించాలని సమగ్ర నివేదికలో తలచారు. ఐతే, ఇది కేవలం 57.50 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో రూపొందింది. ఆవిధంగా ఈ ప్రాజెక్టు ప్రస్తుత అవసరాలకు మాత్రమే సరిపోతుంది. ఇది జేఎన్‌ఎన్‌యూఆర్ఎమ్ విధానాలకు అనువుగాలేదు. సీపీహెచ్ఈఈఓ మార్గదర్శకాల మేరకు డబ్ల్యూటీపీలను 15 సంవత్సరాల భావి అవసరాలకు తగినట్లు రూపొందించామని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం రాగల 15 సంవత్సరాల గిరాకీ 79.42 ఎమ్ఎల్‌డీ కాగా 57.50 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. ఆవిధంగా ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు.

[33] ఒక యూఎస్ గాలను 3.785 లీటర్లకు సమానం

### 4.7.5.7 జీవీఎమ్‌సీలోని గాజువాక ప్రాంతానికి నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు (రెండవ దశ)

ప్రస్తుతం వినియోగంలో ఉన్న సరఫరా వ్యవస్థ ఈ ప్రాజెక్టు పరిధిలోని 50 శాతం ప్రాంతానికే ఉపయోగ పడుతున్నందున గాజువాకలో నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకోసం ఈ పథకాన్ని ₹46 కోట్ల అంచనా వ్యయంతో 2008 జనవరిలో ఆమోదించారు. ఈ ప్రాజెక్టు 2009 డిసెంబరులోనే పూర్తి కావలసి ఉండగా, 2012 మార్చి నాటికీ పూర్తికాలేదు. రహదారులు - భవనాల శాఖ, విద్యుత్ సంస్థ, ఆం.ప్ర. పారిశ్రామిక వసతుల సంస్థ, విశాఖపట్నం ఉక్కు కార్మాగారం, గంగవరం పోర్టు వంటి సంస్థలు పైపులైన్ల నిర్మాణాలకు అనుమతులివ్వక పోవటాన్ని ఈ జాప్యానికి కారణంగా చెప్పారు. నోడల్ ఏజన్సీ ఈ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు తెలిపింది (2012 డిసెంబరు.

ఇంతే కాకుండా, ఇళ్ళకు నీటి కనెక్షన్లు ఇచ్చి మీటర్లు అమర్చవలసిన బాధ్యత గుత్తేదారుదికాగా, ఎర్రిగడ్డ కాలనీలోని కొన్ని ప్రాంతాలలో ఇళ్ళకు జీవీఎమ్‌సీ కనెక్షన్లు ఇచ్చి, మీటర్లు అమర్చి (300) వాటి ఖరీదును ఇంటి యజమానుల నుంచి వసూలు చేసింది. వీటికి సంబంధించిన తుది చెల్లింపులు చేసే సమయంలో ఈ విషయం దృష్టిలో ఉంచుకోవాలి. ఇందుకు ప్రభుత్వం సమాధానమిస్తూ (2012 డిసెంబరు), ఇందులో నష్టమేదైనా జరిగి ఉంటే గుర్తించి తమకు నివేదించవలసిందిగా జీవీఎమ్‌సీ, నోడల్ సంస్థలను అడిగినట్లు పేర్కొంది.

### 4.7.5.8 ఇతర ప్రాజెక్టులు

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ పరిశీలనలు | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | ధోన్ నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹44.76 కోట్లకు మంజూరు చేశారు. కానీ, స్థల సేకరణలోని జాప్యం వలన పనులు పూర్తి కాలేదు. అటవీ శాఖ నుంచి అనుమతి పొందడంలోని జాప్యాన్ని ప్రభుత్వం అంగీకరించి, ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకోవలసి ఉన్నందున అక్కడి రైతులు, నీటి వినియోగ సంఘాలు వ్యతిరేకించటంతో పనులకు అవరోధం ఏర్పడిందని కూడా పేర్కొంది (2012 డిసెంబరు). | 36.01 |
| 2 | పిఠాపురం నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టులను 2008-09లో ₹126.65 కోట్లకు మంజూరు చేశారు. పిఠాపురం, రామచంద్రాపురం ప్రాజెక్టులు స్థల సేకరణలోని జాప్యం వలన అసంపూర్తిగా ఉన్నాయి. డిజైన్లు ఖరారు చేయటంలోని ఆలస్యానికి ఇది కారణమయ్యింది. అంతేకాకుండా, ఈ నాలుగు ప్రాజెక్టులనూ శాశ్వతమైన నీటి వనరు చూసుకోకుండానే మొదలు పెట్టారు. రామచంద్రాపురం నీటి సరఫరా పథకానికి నీటిని గ్రహించేందుకు అనుమతి లభించిందనీ (2012 ఏప్రిల్), మిగతా పథకాలకూ ప్రయత్నాలు చేస్తున్నామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). | 8.81 |
| 3 | రామచంద్రాపురం నీటి సరఫరా పథకం | | 9.66 |
| 4 | ధర్మవరం నీటి సరఫరా పథకం | | 53.43 |
| 5 | నిజామాబాద్ నీటి సరఫరా పథకం | | 41.61 |
| 6 | కామరెడ్డి నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹22.35 కోట్లకు మంజూరు చేశారు. ఐతే, జల వనరుల్లో నీటి కొరత కారణంగా, ఆశించిన 15.97 ఎమ్ఎల్‌డీ స్వచ్ఛమైన నీటి సరఫరాకు భరోసాలేదు. గ్రామీణ నీటి సరఫరా శాఖ 10 ఎమ్ఎల్‌డీ నీటిని ఇవ్వటానికి మాత్రమే అంగీకరించిందనీ, దీనివలన నీటిని శుద్ధి చేసేందుకు ₹8.21 కోట్ల అంచనా వ్యయంతో అదనపు ఏర్పాట్లు అవసరమవుతాయనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). | 15.33 |

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ పరిశీలనలు | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 7 | వరంగల్ నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹164.46 కోట్లకు మంజూరు చేశారు. సంప్, పంప్‌హౌస్‌ల నిర్మాణానికి అవసరమయ్యే స్థల సేకరణలో జాప్యం, కేయూసీ సమీపంలోనూ, దేశాయిపేటలోనూ, కాకతీయ కాలువ నుంచి అదనపు నీటిని గ్రహించేందుకు నీటి పారుదలశాఖ అనుమతించటంలోని జాప్యం, విద్యుత్ కనెక్షన్లు తీసుకోవటంలో జాప్యం వలన ఈ ప్రాజెక్టు ఆలస్యమయింది. నోడల్ ఏజన్సీ 2012 డిసెంబరులో ఇచ్చిన సమాచారం మేరకు ప్రాజెక్టు పూర్తయింది.<br>ఈ ప్రాజెక్టు 2036 సంవత్సరపు జనాభా అవసరాలను కూడా తీర్చే విధంగా రూపకల్పన చేశారు. కానీ, దేశాయిపేట డివిజన్‌కు నీటి కేటాయింపు భావి అవసరాలకు సరిపడినంతగా లేదు. ఇప్పటికే అందుబాటులో ఉన్న వడపోత కేంద్రం, ఈ పథకం కింద నెలకొల్పిన ప్లాంటు కలిసి 78.19 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం కలిగి ఉన్నాయనీ, ఇవి దేశాయిపేట జోన్ అవసరాలకు 2021 వరకూ సరిపోతాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, వరంగల్ డబ్ల్యూఎస్ఐఎస్ ఫీడర్ మెయిన్స్‌కు సంబంధించిన డిజైన్లకు జతచేసిన నివేదికలో సూచించినదాని ప్రకారం దేశాయిపేట డివిజనుకు భావి అవసరాలకు 94.54 ఎమ్ఎల్‌డీ నీరు అవసరమవుతుంది. ఆవిధంగా ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యంకాదు. | 164.00 |
| 8 | తణుకు నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹14.14 కోట్లకు ఆమోదించారు. కానీ, వేసవి నీటి నిల్వ చెరువుకు స్థలం లభించక పనులు పూర్తవలేదు. | 11.53 |
| 9 | మంచిర్యాల నీటి సరఫరా పథకం | ఈ పథకాన్ని 2006-07లో ₹22.87 కోట్లకు ఆమోదించారు. ఐతే, నీటి పంపింగ్ మెయిన్ నిర్మాణానికి స్థలం గుర్తించనందువలనా/ మార్చినందువలనా, పనుల్లో చోటు చేసుకున్న మార్పుల వలనా ప్రాజెక్టు పూర్తికాలేదు. | 22.23 |
| 10 | నారాయణపేట నీటి సరఫరా పథకం | శ్రీ సత్యసాయి నీటి సరఫరా ప్రాజెక్టు నుంచి 6 ఎమ్ఎల్‌డీ నీటిని సరఫరా చేయవలసి ఉండగా, కేవలం 1.5 ఎమ్ఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేశారు (2009 జూలై). పంపుసెట్ల మీద అదనపు వ్యయం, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపుదల ఖర్చు ₹2.05 కోట్లు చెల్లించనందువల్ల మిగతా 4.5 ఎమ్ఎల్‌డీ నీటి సరఫరాను సత్యసాయి నీటి సరఫరా బోర్డు ఆపేసింది. తొలి అంచనాలలో ఈ ₹2.05 కోట్లను పేర్కొనలేదనీ, ట్రాన్స్‌ఫార్మర్ల ప్రస్తుత ధర తెలుపమని బోర్డు అధికారులను అడుగుతున్నామనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). | 6.74 |

## 4.7.6 పట్టణ రవాణా

### *4.7.6.1 విశాఖపట్నంలో బస్సు శీఘ్ర రవాణా వ్యవస్థ*

ఈ ప్రాజెక్టును ₹452.93 కోట్ల అంచనా వ్యయంతో 2007 నవంబరులో ఆమోదించారు. జీవీఎమ్‌సీ అమలు చేసే ఈ ప్రాజెక్టులో 43.36 కి.మీ. అవిచ్ఛిన్న మార్గాలతో బస్ శీఘ్ర రవాణా విస్తృతి అభివృద్ధి చేస్తారు. ఇందులో అంతర్భాగాలుగా పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ (21.62 కిమీ), సింహాచలం ట్రాన్సిట్ కారిడార్ (20.12 కిమీ),

ఆసిల్‌మెట్టలో ఒక పైదారి (1.62 కిమీ) ఉంటాయి. ఈ ప్రాజెక్టు 2010 అక్టోబరుకల్లా పూర్తికావలసి ఉంది. ఐతే, రక్షణ శాఖ, రైల్వేలు, సింహాచలం దేవస్థానంనుంచి అనుమతులు రాకపోవటం, ప్రైవేటు వ్యక్తుల నుంచి స్థల సేకరణలో జాప్యం, ఆలయాలను తరలించవలసి రావటం వంటి కారణాలవలన ఈ ప్రాజెక్టు అసంపూర్తిగానే మిగిలింది. అంతే కాకుండా, స్థల వివాదాలు పరిష్కరించటంలోని ఆలస్యం వలన నిర్మాణ వ్యయం ₹3.64 కోట్లు పెరిగింది.

ప్రభుత్వం ఈ జాప్యాన్ని అంగీకరిస్తూ, దేవాదాయ శాఖతో సంప్రతింపులు జరుగుతున్నామని తెలిపింది (2012 డిసెంబరు).

### 4.7.7 గృహనిర్మాణం, మౌలిక వసతులు

గృహ నిర్మాణం, మౌలిక వసతులకు సంబంధించి 2005-09 సంవత్సరాలలో ₹4209 కోట్ల ఆమోదిత వ్యయంతో మంజూరైన 113 ప్రాజెక్టులలో 22 ప్రాజెక్టులు మాత్రమే పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). వీటినుంచి 2005-08లో మంజూరైన ఐదు ప్రాజెక్టులను (వీటి ఆమోదిత వ్యయం ₹1119 కోట్లు) ఆడిట్ సమగ్ర పరిశీలన కోస ఎంపిక చేసింది. వీటిమీద ₹1159 కోట్లు ఖర్చు చేసినాగానీ 2012 జూన్ నాటికి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాలేదు. ఈ ఐదు ప్రాజెక్టుల పరిశీలనలో ఆడిట్ గమనించిన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

#### *4.7.7.1 సమీకృత గృహ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పథకం, హైదరాబాద్ (49,000 ఇళ్ళు), హైదరాబాద్‌లో 4550 ఇళ్ళ నిర్మాణం, మౌలిక వసతులకల్పన*

హైదరాబాద్‌లో మచ్చుకు తనిఖీ చేసిన బీఎస్‌యూపీ ప్రాజెక్టులు రెండింటి సంక్షిప్త సమాచారం ఈ దిగువ ఇవ్వబడింది.

పట్టిక 4.5

| వివరాలు | సమీకృత గృహ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పథకం, హైదరాబాదు (49000 ఇళ్ళు) | హైదరాబాదులో 4550 ఇళ్ళ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన |
|---|---|---|
| పాలనాపరమైన అనుమతి | 2006 మార్చి | 2008 ఫిబ్రవరి |
| అంచనా వ్యయం | ₹490 కోట్లు | ₹120.33 కోట్లు |
| నిర్మాణ సంస్థలు | జీహెచ్ఎమ్‌సీ (23239 ఇళ్ళు), ఏపీహెచ్‌బీ (25761 ఇళ్ళు) | జీహెచ్ఎమ్‌సీ (4550 ఇళ్ళు) |
| బిడ్ విధానం | నామినేషన్ విధానం | వేలం విధానం |
| పనులప్పగించిన తేదీ | 2006 మార్చి నుంచి 2008 డిసెంబరు వరకు | 2008 మే నుంచి 2010 ఆగస్టు వరకు |
| పనులు దక్కించుకున్న సంస్థలు | 45 ప్యాకేజీలుగా విభజించి, 31 మంది గుత్తేదారులకి ఇచ్చారు (13793 ఇళ్ళ నిర్మాణానికి) (మిగతా ఇళ్ళ సమాచారం ఇవ్వలేదు) | 15 ప్యాకేజీలుగా విభజించి 9 మంది గుత్తేదారులకు ఇచ్చారు |
| పూర్తిచేయ వలసిన తేదీ | ఒక్కొక్క ప్యాకేజీకి వేరువేరుగా ఉంది | 2008 నవంబరు నుంచి 2010 నవంబరు వరకు |
| ప్రస్తుత పరిస్థితి | 25761 ఇళ్ళ ప్రాజెక్టు పూర్తి చేసింది (ఏపీహెచ్‌బీ) 23239 ఇళ్ళ ప్రాజెక్టు పూర్తికావలసి ఉంది (జీహెచ్ఎమ్‌సీ) | పూర్తికాలేదు |

*మూలం : ప్రాజెక్టు దస్త్రాలు*

*గమనిక : తొలుత 23239 ఇళ్ళ ప్రాజెక్టును 2005లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్)కు అప్పగించి, తరువాత 2007 జూలై నెలలో జీహెచ్ఎమ్‌సీకి బదిలీచేసి, ఆపై 2009 ఆగస్టులో పాక్షికంగా ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ బోర్డు (ఏపీహెచ్‌బీ)కి ఇచ్చారు. ఈ మార్పులకు కారణాలు రికార్డులలో కనిపించలేదు*

సమగ్ర నివేదికలలో సూచించినట్లు ఈ ప్రాజెక్టులు 2008 మార్చి, 2009 జూన్‌లలో పూర్తి కావలసి ఉండగా, ఇవి రెండూ 2012 జూన్ నాటికి అసంపూర్తిగానే ఉన్నాయి. ఆ వివరాలు ఈ దిగువ పట్టికలో చూడవచ్చును

పట్టిక 4.6

| పథకం పేరు | పూర్తయిన ఇళ్ళు | కేటాయించిన ఇళ్ళు | స్వాధీనం చేసుకున్న ఇళ్ళు | కేటాయించినా స్వాధీనం చేసుకోని ఇళ్ళు |
|---|---|---|---|---|
| **49000 ఇళ్ళు** | 45027 | 36462 | 25971 | 10491 |
| **4550 ఇళ్ళు** | 2534 | 75 | 35 | 40 |

*మూలం : జీహెచ్ఎమ్‌సీ ఇచ్చిన సమాచారం*

### *ప్రత్యక్ష పరిశీలన, లబ్ధిదారుల అధ్యయనం*

- బన్సీలాల్‌పేటలో 48, గొల్లకొమరయ్య కాలనీలో 40 ఇళ్ళు నిర్మించాలని అనుకోగా, జీహెచ్ఎమ్‌సీ వీటిలో 42 (2010 ఏప్రిల్), 32 (2010 మే) ఇళ్ళు మాత్రమే నిర్మించింది. లబ్ధిదారులను గుర్తించటంలోని ఇబ్బందుల వలన ఈ ఇళ్ళను ఎవరికీ కేటాయించలేదు. ఐతే, ఆడిట్ బృందం ఇళ్ళను ప్రత్యక్షంగా పరిశీలించినప్పుడు (2011 మే 9) ఇలాపూర్తయిన ఇళ్ళలో కొందరు కేటాయింపులు జరగకుండానే, తమ వంతు చెల్లింపులు చేయకుండానే అనధికారికంగా నివసిస్తున్నారని తెలిసింది. లబ్ధిదారుల వాటాను వసూలు చేసుకొని, వారికి యాజమాన్యపు హక్కులు అధికారికంగా కల్పిస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

- ఏపీహెచ్‌బీ ఇదివరకే స్వాధీనం చేసిన ఇళ్ళను లబ్ధిదారులు పూర్తిగా ఆక్రమించుకొనకపోవటానికి ప్రధాన కారణం ప్రాథమిక వసతుల లోపమేనని కలెక్టర్ కార్యాలయంలోని దస్త్రాలవలన తెలిసింది. ఇక్కడ వేయవలసిన 570 ఆర్ఎమ్‌టీ తాగునీటి పైపులైను పని స్థలసేకరణలోని అడ్డంకులవలన సాగటంలేదు. ఇక్కడ నివసిస్తున్నవారు ట్యాంకర్ల ద్వారా అందే నీటిపైనే ఆధారపడుతున్నారు. ఆడిట్ అధికారులు 2011 ఆగస్టు 9న నిర్వహించిన లబ్ధిదారుల అధ్యయనంలో కూడా ఈ విషయం ధృవపడింది. ప్రభుత్వం ఈ వాస్తవాలను అంగీకరిస్తూ (2012 డిసెంబరు), తాగునీటి సరఫరాకు తగినన్ని ట్యాంకర్లు సమకూర్చామని తెలిపింది.

- అహమ్మద్‌గూడ కాలనీలో 3809 ఇళ్ళకుగాను 1255 ఇళ్ళలో మాత్రమే లబ్ధిదారులు ఉంటున్నారు. ఈ కాలనీకి 3/4 కి.మి. దూరంలోని చెత్తకుప్పనుంచి వచ్చే పొగ, దుర్వాసనల వలన ఈ పరిస్థితి నెలకొంది. (పక్కన ఉన్న ఛాయాచిత్రం) ఆడిట్ బృందం 2011 ఆగస్టు 13న చేపట్టిన ప్రత్యక్ష పరిశీలన, లబ్ధిదారుల అధ్యయనంలో ఈ విషయం ధృవపడింది. ఇప్పుడు 1700 మంది ఇళ్ళను ఆక్రమించుకున్నారని చెబుతూ, చెత్త నిర్మూలన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు ఆరంభించామని తెలిపింది (2012 డిసెంబరు).



*అహమ్మద్‌గూడ కాలనీ సమీపంలోని చెత్తకుప్ప*

### *4.7.7.2 కృష్ణానది, బుడమేరు వరద బాధితులకు వీఎమ్‌సీ పరిధిలో పునరావాస గృహాలు, వీయమ్‌సీ సర్కిల్ - Iలోని మురికివాడలలో జీ+3 సామూహిక గృహనిర్మాణం*

మచ్చుకు తనిఖీ చేసిన బీఎస్‌యూపీ ప్రాజెక్టు రెండింటి సంక్షిప్త సమాచారం ఈ కింది విధంగా ఉన్నది.

**పట్టిక 4.7**

| వివరాలు | కృష్ణానది వరద బాధితులకు **15000** గృహాలు | బుడమేరువాగు వరద బాధితులకు **6752** గృహాలు |
|---|---|---|
| పాలనాపరమైన అనుమతి | 2006 సెప్టెంబరు | 2007 అక్టోబరు |
| అంచనా వ్యయం | ₹258.74 కోట్లు | ₹190.88 కోట్లు |
| నిర్మాణ సంస్థ | వీఎమ్‌సీ | వీఎమ్‌సీ |
| బిడ్ విధానం | వేలం ద్వారా | వేలం ద్వారా |
| పనులు అప్పగించిన తేదీ | 2007 ఏప్రిల్, 2010 సెప్టెంబరు మధ్యన | 2008 ఆగస్టు, 2011 మార్చి మధ్యన |
| పనులను దక్కించుకున్న సంస్థలు | 127 ప్యాకేజీలుగా విభజించి, అన్నింటినీ అప్పగించారు | 120 ప్యాకేజీలుగా విభజించి, 2011 జూన్ నాటికి 90 ప్యాకేజీలు అప్పగించారు |
| పూర్తికావలసిన తేదీ | 2007 సెప్టెంబరు నుంచి 2011 ఫిబ్రవరి వరకు | 2008 నవంబరు నుంచి 2011 జూన్ వరకు |
| ప్రస్తుత పరిస్థితి | పూర్తికాలేదు | పూర్తికాలేదు |

*మూలంః ప్రాజెక్టు దస్త్రాలు*

*గమనికః హైదరాబాద్‌లో మచ్చుకు తనిఖీ చేసిన బీఎస్‌యూపీ ప్రాజెక్టుల మాదిరిగానే విజయవాడ బీఎస్‌యూపీ ప్రాజెక్టులు రెంటిలోనూ పనులను రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏపీఎస్‌హెచ్‌సీఎల్‌కు అప్పగించి (2006), తర్వాత 2007 జూలైలో వీఎమ్‌సీకి బదిలీ చేసింది (కొద్ది భాగాన్ని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ అట్టిపెట్టుకున్నాక). ఈ పనులను 2007 జూలైలో చేసిన నిర్ణయాల ప్రకారం పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, ఈ మార్పులకు గల కారణాలు దస్త్రాలలో లభించలేదు*

అవసరమైనంత స్థలాన్ని పూర్తిస్థాయిలో సేకరించలేకపోవటంతో ఈ రెండు ప్రాజెక్టులూ అసంపూర్తిగానే ఉన్నాయి.

- "కృష్ణానది, బుడమేరువాగు వరదబాధితులకు వీఎమ్‌సీలో 15000 ఇళ్ళ నిర్మాణం" ప్రాజెక్టుకు 108.38 ఎకరాల స్థలం అవసరంకాగా, వీఎమ్‌సీ తన పరిధిలో 17.15 ఎకరాలను, జక్కంపూడిలో 87.55 ఎకరాలను మాత్రమే సేకరించింది.
- "వీఎమ్‌సీ సర్కిల్ - Iలోని మురికివాడలలో జీ+3 సామూహిక గృహ నిర్మాణ" పథకంలో 68.20 ఎకరాల స్థలం అవసరంకాగా కేవలం 9 ఎకరాలు అందుబాటులో ఉంది. ఫలితంగా, వీఎమ్‌సీ తలపెట్టిన 6752 ఇళ్ళకుగాను 832 ఇళ్ళనే నిర్మించింది. వీఎమ్‌సీ ఇచ్చిన స్టేటస్ నివేదికను బట్టి చూస్తే మిగతా స్థలాన్ని జక్కంపూడి దగ్గరి గొల్లపూడిలో సేకరించే అవకాశాలు చాలా తక్కువ.

నిర్మాణ సంస్థలను మార్చటం, స్థల సేకరణలోని జాప్యం మూలంగా ఖర్చు ₹172.62 కోట్లు పెరిగింది. ఈ భారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థ వహించవలసి ఉంటుంది. వ్యయంలో పెరుగుదల 15,000 ఇళ్ళ ప్రాజెక్టుకు ₹258.74 కోట్ల నుంచి ₹373.55 కోట్లకు; 6,752 ఇళ్ళ ప్రాజెక్టుకు ₹190.88 కోట్ల నుంచి ₹248.69 కోట్లకు ఉంటుంది.

ఇళ్ళ నిర్మాణంలో 2012 జూన్ నాటి పరిస్థితి ఈ దిగువ విధంగా ఉంది.

**పట్టిక 4.8**

| పథకం పేరు | పూర్తయిన ఇళ్ళు | కేటాయించిన ఇళ్ళు | స్వాధీనం చేసుకున్న ఇళ్ళు | కేటాయించినా స్వాధీనం చేసుకోని ఇళ్ళు |
|---|---|---|---|---|
| **15000 ఇళ్ళు** | 12480 | 8013 | 6760 | 1253 |
| **6752 ఇళ్ళు** | 832 | 0 | 0 | 0 |

*మూలం : వీఎమ్‌సీ రికార్డులు*

ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చేపట్టిన 1056 ఇళ్ళ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించినా ఒకే ఏజన్సీకి అప్పగించారు (2007 మే/జూన్). ఈ పనులు ₹18.51 కోట్ల వ్యయంతో 2008 నవంబరు/డిసెంబరులో పూర్తి చేయాల్సిఉంది. ఐతే, పనులు నాసిరకంగా ఉండటంతో 2008 డిసెంబరులో గుత్తేదారుని తప్పించి (అప్పటికే ₹1.77 కోట్ల విలువైన 10 శాతం పనులు పూర్తయ్యాయి), ఆ తదుపరి ఏపీఎస్‌హెచ్‌సీఎల్ స్వయంగా నిర్మాణం చేపట్టింది.

ప్రాజెక్టును ఏపీహెచ్ఎస్‌సీఎల్ నుంచి టీఎమ్‌సీకి బదిలీ చేయటంతో పనుల్లో జాప్యం చోటు చేసుకుందనీ, తొలి విడత టెండర్లకు స్పందన రాకపోవటమే ఖర్చుల్లో పెరుగుదలకు కారణమనీ ప్రభుత్వం ఆపాదించింది (2012 డిసెంబరు).

### *4.7.7.3 తిరుపతిలో 4087 ఇళ్ళ నిర్మాణం, వసతుల కల్పన (ఐహెచ్ఎస్‌డీపీ)*

ఈ ప్రాజెక్టును 2007 మే నెలలో ఆమోదించారు. దీని అంచనా వ్యయం ₹55.36 కోట్లు (గృహ నిర్మాణానికి ₹40.87 కోట్లు; వసతులకు ₹14.49 కోట్లు)కాగా దీనిని అవిలాల, దామినీడు అనే రెండు ప్రాంతాలలో చేపట్టవలసి ఉంది. ఈ ప్రాజెక్టును 89 పనులుగా విభజించి 14 మంది గుత్తేదారులకు 2008మే, 2009 మార్చి నెలల మధ్యన అప్పగించారు. పనులు 2008 నవంబరు, 2011 మార్చి మధ్యన పూర్తి చేయాలని చెప్పారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ఆడిట్ గమనించినవి ఈ విధంగా ఉన్నాయి.

- నిర్మించవలసిన 4087[34] ఇళ్ళకుగాను, 2012 జూన్ నాటికి అవిలాలలో ఒక్క యూనిట్ కూడా పూర్తి కాలేదు. దామినీడులో 528 ఇళ్ళు పూర్తవగా, ఇందులో 456 ఇళ్ళు కేటాయించారు. వాటిలో 124 ఇళ్ళు మాత్రమే లబ్ధిదారులు ఆక్రమించుకున్నారు. మిగతా 332 ఇళ్ళకు సంబంధించి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 2012 సెప్టెంబరులో ఇళ్ళకు తీగలు వేశామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, వీటిలో ఎన్ని ఇళ్ళను లబ్ధిదారులు స్వాధీనం చేసుకున్నదీ తెలుపలేదు.
- బ్యాంకు ఋణాలకు వెసులుబాటు కల్పించటం టీఎమ్‌సీకి సాధ్యపడకపోవటంతో నిర్మాణం పూర్తి చేసుకున్న అనేక ఇళ్ళను లబ్ధిదారులు స్వాధీన పరుచుకొనలేదు. నిధుల సర్దుబాటుకు సంబంధించి, నిర్మాణ సంస్థ సరికొత్త ప్రతిపాదనలతో ముందుకు రావాలని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు).

## 4.7.8 అతిక్రమణలు

సమగ్ర ప్రాజెక్టు నివేదికల ఆధారంగా ఆమోదించిన అంచనాల మేరకు ప్రాజెక్టు పనులు నిర్వహించాలి. పనులు ప్రారంభించేముందు విస్తృతమైన సర్వే, పరిశోధన జరగాలి. ఈ కింద ప్రాజెక్టుల రికార్డులు పరిశీలించగా సమగ్ర నివేదికలలో సూచించిన పరిధి నుంచి అతిక్రమణలు, లీడ్ చార్జీలను తప్పుగా లెక్కించటం, బిల్ ఆఫ్ క్వాంటిటీస్‌లో మట్టి కోసం కేటాయింపులు చేయటం, డిజైన్లలో మార్పులు వంటివి బయటపడ్డాయి.

### *4.7.8.1 ఒకటవ మండలంలో మూసీ నదికి దక్షిణాన పాతబస్తీలో మురుగు నీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ (ఎస్1 నుంచి ఎస్6, ఎస్12, ఎస్14) ఆయకట్టు ప్రాంతాలు*

అనుబంధ, అధికృత అదనపు పనులను ₹32 కోట్ల వ్యయంతో జలమండలి చేపట్టింది (నేలస్వభావం, మట్టి స్వభావంలో తేడాలవలన అని చెప్పారు). మొత్తం పనుల అంచనా వ్యయం ₹60.38 కోట్లలో[35] ఇది 53 శాతంపైగా ఉన్నది. ఇది 10 శాతం పరిమితికన్నా చాలా ఎక్కువ. ప్రణాళికాలోపం, స్థల పరిశీలనలోని లోపాలను ఇది సూచిస్తుంది. పనులకు అంచనాలు రూపొందించి, ఒప్పందంకుదుర్చుకొనేముందే వీటిని సరిచూసుకుని ఉండాల్సింది. పనుల్లో ఏర్పడిన అవరోధాలను పరిశీలించి తదుపరి చర్య తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు).

[34] టీఎమ్‌సీ 4056 ఇళ్ళ నిర్మాణానికి మాత్రమే బిడ్లు ఆహ్వానించింది

[35] అంచనా వ్యయంమీద చెప్పిన టెండరు ప్రీమియంకాకుండా

### *4.7.8.2 శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటి బృహత్ ప్రణాళిక*

- రెండవ ప్యాకేజీలో ఎస్‌డబ్ల్యూజీ పైపులను సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అనుకున్న వాటికన్నా బాగా హెచ్చు వ్యాసంగలవి వేయాల్సివచ్చింది. ఈ విధంగా 200 ఎమ్ఎమ్, 250 ఎమ్ఎమ్, 300 ఎమ్ఎమ్ వ్యాసంగల గొట్టాల పరిమాణాలలో 462 శాతం, 257 శాతం, 56 శాతం పెరుగుదల ఉన్నది. స్థల స్వభావాన్ని అనుసరించి, శేరిలింగంపల్లి మునిసిపాలిటీలోని జన సమ్మర్ద ప్రాంతాల అవసరాలను తట్టుకునే విధంగా 150 ఎమ్ఎమ్ బదులుగా 200 ఎమ్ఎమ్ వ్యాసంగల గొట్టాలు వాడినట్లు ప్రభుత్వ శాఖ తెలిపింది. ఐతే, తొలి నివేదికలలో 2041 సంవత్సరపు అవసరాలను ప్రామాణికంగా తీసుకుని అంచనాలు రూపొందించిన నేపథ్యంలో ఇది సముచితంగా లేదు. విషయం పరిశీలించి తదుపరి చర్య గైకొనగలమని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- బివర్లీహిల్స్, మాదాపూర్‌లలోని రెండు ప్రధాన ఆయకట్టు ప్రాంతాలకు మురుగునీటి లైన్లు ₹73.90 కోట్ల అంచనా వ్యయంతో వేయాలని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పొందుపరిచినా, ఈ పనులను ప్యాకేజీ లుగా విభజించి పనులప్పగించే సమయంలో జలమండలి వీటిని పనిపరిధి నుంచి తప్పించింది. ఈ ఆయకట్టు ప్రాంతాలలో పనులు ఇదివరకే 2007 నవంబరులో హెచ్ఎమ్‌డీఏ నుంచి పాక్షిక సాయంతో మొదలు పెట్టారనీ, సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించేసరికి పనులు పూర్తి స్థాయిలో సాగుతున్నాయనీ ఆడిట్ గమనించింది. ఐతే, ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు ఈ ప్రాంతంలో వెంటనే సౌకర్యాలు కల్పించేందుకు పనులు మొదలు పెట్టారని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఆమోదానికి ముందే పనులారంభించారు కనుక ఇది జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ విధానాలకు విరుద్ధమైనది. కాబట్టి ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు.

- ఎస్ఎస్ఆర్‌కు చేసిన రెండు వార్షిక సవరణల (2007-08, 2008-09) కారణంగా ప్యాకేజీ - III అంచనా విలువను (₹34 కోట్లు) జలమండలి అంచనా వ్యయానికి (₹11 కోట్లు) మూడు రెట్లు పెంచింది. పనులను మరికొన్ని ప్రాంతాలకు విస్తరించటం కూడా సవరణలకు కారణమయ్యిందని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, ఆ వివరాలు మాత్రం తెలుపలేదు.

### *4.7.8.3 రెండవ మండలంలో మూసీనదికి దక్షిణాన పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ (ఎస్7 నుంచి ఎస్11, ఎస్13, ఎస్15)*

అసలు ప్రాజెక్టు నివేదికలో చెప్పిన వాటికంటే భారీ వ్యాసంగల పైపులను వాడారు. వీటిలో 150 ఎమ్ఎమ్, 250 ఎమ్ఎమ్ బదులు 200 ఎమ్ఎమ్, 300 ఎమ్ఎమ్ వ్యాసంగల గొట్టాలను వాడటం వలన 80 శాతం నుంచి 187 శాతం వరకూ పెరిగింది. స్థానికప్రజాప్రతి నిధుల విజ్ఞప్తి మేరకూ, స్థల స్వభావాన్ననుసరించీ పెద్ద పైపులను వాడినట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఇది ప్రణాళికాలోపాన్ని సూచిస్తుంది.

### *4.7.8.4 పాత ఎమ్‌సీహెచ్‌లోని 10 జోన్లలో పంపిణీ వ్యవస్థతోపాటు ఫీడర్ వ్యవస్థ పునరుద్ధరణ*

- 600 ఎమ్ఎమ్ వ్యాసంగల ఎమ్ఎస్ పైపు 1000 ఆర్ఎమ్‌టీ బదులు 1630 ఆర్ఎమ్‌టీ వేయటం వలన మట్టి తవ్వకం, రాతి తవ్వకం, కంకర, బెండ్ల వాడకం పెరిగి ₹90.86 లక్షల అదనపు వ్యయానికి దారితీసింది.

  ఫీల్డ్ రిపోర్టు ప్రకారం పనులు జరగలేదనీ, జలమండలి నుంచి వివరణ తెప్పించుకుని తదుపరి చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- తవ్విన మట్టి తరలింపునకు 5 కి.మీ.కుగాను 10 కి.మీ. రేట్లను వేసి అంచనాలు తప్పుగా రూపొందించారు. పనులు మొత్తం పూర్తయ్యేసరికి దీని వలన ₹29.96 లక్షల అదనపు భారం పడుతుంది.

ఇప్పటికే ₹11.23 లక్షలు మినహాయించామనీ, మిగతా మొత్తాన్నీ వసూలు చేస్తామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- తవ్వి తీసిన మట్టిని గుంటలు పూడ్చేందుకు వినియోగించటం సాధారణంగా అనుసరించే విధానం. ఐతే, ఇక్కడ అందుబాటులో ఉన్నమట్టి పనికిరాదని చెబుతూ జలమండలి ఇందుకోసం విడిగా ₹2.23 కోట్లు కేటాయించింది.

  సిమెంట్ కాంక్రీటు రోడ్లు, తారు రోడ్ల శిధిలాలు మట్టితో కలిశాయని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, ఈ శిధిలాలను విడిగా కుప్పవేసి మట్టిని మాత్రం వాడుకొని ఉండవచ్చును కనుక ఈ సమాధానం సరికాదు.

- మైశారం, ఆస్మాన్‌గఢ్, రెండు జోన్లలో ఇన్‌లెట్, ఔట్‌లెట్ పంపిణీ వ్యవస్థకు సంబంధించిన పనులకు సమగ్ర నివేదికలో పేర్కొన్న వ్యయానికీ (₹23.88 కోట్లు, ₹48.36 కోట్లు), గుత్తేదారుకి అప్పగించిన పనుల విలువకూ (₹51.99 కోట్లు, ₹16.78 కోట్లు) మధ్య భారీ వ్యత్యాసమున్నది.

  అదనపు రిజర్వాయర్లు, ఇతర అంశాల వలన ఈ వ్యత్యాసం ఏర్పడిందని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అంచనాలను అవాస్తవికంగా రూపొందించటాన్ని ఇది స్పష్టం చేస్తుంది.

### *4.7.8.5 తాటిపూడి జలాశయం నుంచి పట్టణ పంపిణీ జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకూ తాటిపూడి పైప్‌లైన్‌ను మార్చడం*

ప్యాకేజీ-3 కింద క్రిష్ణాపురం హెడ్‌వర్క్స్‌కు 1000 కేఎల్ సంప్-కం-పంప్‌హౌస్ నిర్మాణానికి ₹85 లక్షల తొలి అంచనాను జీవీఎమ్‌సీ ₹134 లక్షలకు సవరించింది. స్థలం స్వభావాన్ని కారణంగా చూపుతూ ఈ సవరణకు ఆమోదం కూడా తెలిపింది (2009 మే). ప్రభుత్వం ఈ విషయాన్ని ధృవీకరించింది (2012 డిసెంబరు). తొలి అంచనాలు వాస్తవికంగా లేకపోవటాన్ని ఇది సూచిస్తుంది.

### *4.7.8.6 విజయవాడ నగరం ఉత్తర భాగంలో మురుగునీటి పారుదల వసతులు కల్పించటం*

మురుగునీటి పారుదల లైన్ల విస్తరణకు సంబంధించిన 25 పనులను (వీటి విలువ ₹23.79 కోట్లు) వీఎమ్‌సీ 2009-10లో చేపట్టింది. ఇవి సమగ్ర ప్రాజెక్టు నివేదిక పరిధిలోలేవు. అంతేకాకుండా, ప్రస్తుత సమగ్ర ప్రాజెక్టు నివేదికకు సంబంధించి సేకరణ వ్యవస్థలోని పనులు కొన్ని ₹33 కోట్ల అంచనా వ్యయంతో మరొక బీఎస్‌యూపీ ప్రాజెక్టు కింద చేపట్టారు. ఈ వ్యాఖ్యను ప్రభుత్వం అంగీకరించి (2012 డిసెంబరు), పైన పేర్కొన్న అతిక్రమణలను పొందుపరుస్తూ సమగ్ర నివేదికను సవరించామని చెప్పింది.

### *4.7.8.7 విజయవాడ నగరంలో నీటి సరఫరా లేని చోట సమకూర్చటం*

ఇన్‌టేక్ బావి డిజైన్లు మార్చటం, 50 ఎమ్‌ఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం నిర్మాణపు అంచనాలను సవరించటం వలన వ్యయం ₹2.34 కోట్లు పెరిగింది. ఈ వ్యాఖ్యను ప్రభుత్వం ఒప్పుకుంది (2012 డిసెంబరు).

### *4.7.8.8 వరంగల్ నీటి సరఫరా పథకం*

నాణ్యతా నియంత్రణ పరికరాలు పెట్టుకోవటానికీ, నాణ్యత పరీక్షలు నిర్వహించటానికీ వీలుగా ప్రయోగశాలకోసం ఒక భవనం నిర్మించేందుకు ఐబీఎమ్‌లో ₹75 లక్షలు కేటాయించారు. ఆమేరకు ప్రభుత్వ శాఖ ₹82.42 లక్షలు వెచ్చించి, 10,000 చ. అడుగుల విస్తీర్ణంతో భవనం నిర్మించింది. ఐతే, ఈ భవనాన్ని సర్కిల్ కార్యాలయం, డివిజన్ (పీహెచ్) కార్యాలయాలకు వాడుకుంటున్నారు. ఇది సరికాదు.

ప్రయోగశాలకూ, దాని సిబ్బందికీ చోటు చూపించిన తరువాతే మిగిలిన స్థలంలో సూపరింటెండింగ్ ఇంజినీరు (పీహెచ్) సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, సర్కిల్ కార్యాలయం ఉపయోగించుకుంటున్న స్థలవైశాల్యం మాత్రం వివరించలేదు.

### *4.7.8.9 రాయదుర్గం నీటి సరఫరా పథకం*

పునాదుల ట్రీట్‌మెంట్ కోసం అయ్యే ఖర్చుని ₹5.11 కోట్లుగా లెక్కకడుతూ (2009 మార్చి), మరింత లోతైన తవ్వకాలకోసం ప్రభుత్వ శాఖ ₹3.18 కోట్ల మొత్తాన్ని చేర్చి, అంచనాలను సవరించింది.

భారతీయ భూగర్భ పరిశోధనా సంస్థ (జీ ఎస్ఐ) సూచనపై పునాదుల ట్రీట్‌మెంట్ కోసం ఐబీఎమ్‌లో కూడా అదనపు చెల్లింపులకు కేటాయించారనీ, ఆ ప్రకారమే మరింత లోతైన తవ్వకానికి అయ్యే ఖర్చును లెక్కకట్టారనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). పునాదుల ట్రీట్‌మెంట్ వ్యయాన్ని ఐబీఎమ్‌లో అంచనా వేసే ముందు అవసరమైన మట్టి పరీక్షలు నిర్వహించలేదని దీన్నిబట్టి తెలుస్తోంది.

## 4.7.9 గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం

తొమ్మిది ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్లోని బిల్లులను పరిశీలించగా గుత్తేదారులకు అధిక చెల్లింపులు, అనుచిత ప్రయోజనాలు కల్పించిన పలు దృష్టాంతాలు వెలుగుచూశాయి. అవి ఈ కింది విధంగా ఉన్నాయి :

- ఈపీసీ విధానంలో పనులప్పగించినప్పుడు ప్రధాన పనిని నిర్వహిస్తుండగా దానికి అనుబంధంగానూ, అనివార్యంగానూ అనిపించే పనులన్నీ గుత్తేదారుడే చేయాలి. ఐతే, ప్రధాన పనికి అనుబంధంగానూ, అవసరంగానూ ఉన్న పనులకోసం నిర్మాణ సంస్థలు అదే గుత్తేదారులతో అనుబంధ ఒప్పందాలు చేసుకొని వారికి అనుచిత ప్రయోజనం కల్పించాయి. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

| ప్రాజెక్టులు | ఆడిట్ గమనించినది |
|---|---|
| కడప మురుగునీటి పారుదల ప్రాజెక్టు | ఎక్కువగా నీరు ఊరుతున్న ప్రాంతాలలో ఎస్‌డబ్ల్యూజీ పైపులకు బదులుగా ఎన్‌పీ పీవీసీ-యూ పైపులు వేసేందుకు అదే గుత్తేదారుతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నారు (2009 మే).<br>ఎస్‌డబ్ల్యూజీ పైపులు వేయని భాగాలకు చెల్లింపులు చేయలేదుకాబట్టి గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం ఇవ్వలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, అంతర్గత అంచనాలలో (ఐబీఎమ్) సూచించిన ఎస్‌డబ్ల్యూజీ పైపుల ధరను పరిగణనలోకి తీసుకున్న తరువాతే పైన పేర్కొన్న అదనపు భారం లెక్క కట్టిన దృష్ట్యా ఈ సమాధానం సరికాదు. |
| కరీంనగర్ మురుగునీటి పారుదల పథకం | నిర్మాణ సమయంలో పాడయిన ప్రజాసౌకర్యాలను, సంపదలను తిరిగి బాగు చేయటం, వివిధ శాఖల నుంచి అన్ని అనుమతులూ సంపాదించుకోవటం గుత్తేదారు పనిపరిధిలోకే వస్తున్నాగానీ, రోడ్డు తవ్వకాలకూ, పైపులైనులు వేసేందుకూ అనుమతుల కోసం నిర్మాణ సంస్థ రహదారులు, భవనాల శాఖకు ₹43.00 లక్షలు ధరావతుగా చెల్లించింది. ఒప్పందం ప్రకారం దీనిని గుత్తేదారు (రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్) నుంచి వసూలు చేయవలసి ఉంది. |
| ఏలూరు, ధర్మవరం, పిఠాపురం, మంచిర్యాల, ఒంగోలు నీటి సరఫరా పథకాలు | విద్యుత్ కనెక్షన్ పనులకోసం ఐబీఎమ్‌లో కేటాయింపు చేయటంతో ఈపీసీ నిబంధనలకు విరుద్ధంగా గుత్తేదారుకు ₹1.19 కోట్ల అనుచిత ప్రయోజనం కలిగింది. పథకం అమలు చేయటానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్ ఖర్చును డిపార్టుమెంటు భరించాలని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, ఏపీట్రాన్స్‌కో నుంచి అనుమతి తీసుకుని విద్యుత్తు కనెక్షన్ కోసం గుత్తేదారుడు తన సొంత ఏర్పాట్లు చేసుకోవాలని ఒప్పందంలోని 60వ క్లాజు స్పష్టం చేస్తున్నందున ఈ సమాధానం సరికాదు. |

| ప్రాజెక్టులు | ఆడిట్ గమనించినది |
|---|---|
| మంచిర్యాల నీటి సరఫరా పథకం | ఈపీసీ విధానంలో ₹24.72 కోట్లకు అప్పగించిన (2007 డిసెంబరు) ఈ పనుల్లో కాలినడక వంతెన నిర్మాణం కూడా ఒక భాగం. ఐతే, నిర్మాణక్రమంలో ఇన్‌టేక్ బావి స్థలమార్పిడి వలన అవసరమైన కాలినడక వంతెన నిర్మాణాన్ని అదనపు అంశంగా ₹2.92 కోట్లకు అదేగుత్తేదారుతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నారు.<br>మంచిర్యాల, మరో రెండు పట్టణ స్థానిక సంస్థలకు ఒక ఉమ్మడి ఇన్‌టేక్ బావి కావాలని నీటిపారుదల శాఖ తలచింది. మూడు పైపులైనులకు అనువుగా వంతెనను వెడల్పు చేయవలసి వచ్చింది. దీనిని 2011 ఫిబ్రవరిలో కమిటీ సమావేశంలో కూడా ఆమోదించిందని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, అదే సమావేశం తీర్మానం ప్రకారం కాలినడక వంతెన నిర్మాణం ప్రధాన పనికి సంబంధించినదే (కంటింజెంట్) కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు. |
| వరంగల్ నీటి సరఫరా పథకం | బీమా ప్రీమియం చెల్లింపులకోసం అంతర్గత అంచనాలలో (ఐబీఎమ్) ₹1.18 కోట్లు చేర్చగా, గుత్తేదారు బీమా ప్రీమియం ₹47 లక్షలు మాత్రమే చెల్లించారు.<br>మిగతా ₹71 లక్షలను గుత్తేదారు నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చింది (2012 డిసెంబరు). |

## 4.8 పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ

రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ, పీఎమ్‌యూ తమ బాధ్యతలు నిర్వహించటంలో ఈ దిగువ లోపాలు బయటపడ్డాయి :

- ప్రాజెక్టులు ప్రారంభించిన తరువాతనే వాటి అమలును పర్యవేక్షించేందుకు టీపీఐఎమ్ఏలు/ఐఆర్ఎమ్ఏలను నియమించినట్లు మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల విషయంలో ఆడిట్ గమనించింది. ఫలితంగా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందు దశలలో ఈ పర్యవేక్షక సంస్థల పాత్రలేదు.
- టీపీఐఎమ్ఏలు గమనించిన విషయాల మీద చర్యలు తీసుకున్న నివేదికల గురించి ఆడిట్ అడిగిన ప్రశ్నకు రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ బదులివ్వలేదు. ప్రత్యేకించి, తిరుపతిలో గృహనిర్మాణం విషయమై టీపీఐఎమ్ఏ తీవ్ర అభ్యంతరాలు కొన్ని లేవనెత్తింది. పనులను పెద్దసంఖ్యలో విభజించటం, ఈపీసీ విధానం అనుసరించక పోవటం, సవరించిన వ్యయానికి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండానే చెల్లింపులు చేయటం వంటివి ఇందులో ఉన్నాయి. టీపీఐఎమ్ఏ నివేదికలలో లేవనెత్తిన వాదాంశాలను వాస్తవంగా చక్కదిద్ది పరిష్కరించినట్లు మేము నిశ్చయంగా తెలుసుకొనలేకపోయాము. తిరుపతి ప్రాజెక్టులో పనులను విభజించటానికి కారణాలను వివరించినప్పుడు ప్రభుత్వం టీపీఐఎమ్ఏ నివేదికల మీద తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించలేదు.
- పీఎమ్‌యూ దృష్టిసారించవలసిన అంశాలలో కార్యక్రమ నిర్వహణ, ప్రాజెక్ట్ మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ (పీఎమ్ఈఎస్) అనే వెబ్ ఆధారిత వ్యవస్థ ద్వారా కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు నివేదించటం ఒకటి. నిధులను కార్యసాధకంగా వినియోగించటం, ప్రాజెక్టుల పురోగతి, సంస్కరణల అమలు వంటి వాటిని ఈ మానిటరింగ్ వ్యవస్థ విశ్లేషించాలి. ఐతే, పీఎమ్ఈఎస్ పూర్తి స్థాయిలో పనిచేయటంలేదని నోడల్ ఏజన్సీ కూడా అంగీకరించింది. ప్రాజెక్టులవారీగా సమగ్ర సమాచారం పీఎమ్ఈఎస్ ద్వారా నోడల్ ఏజన్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో లేదు. నోడల్ ఏజన్సీ స్థాయిలో ప్రాజెక్టు పర్యవేక్షణ చూసుకోవటానికి 2008 అక్టోబరులో కేంద్రీయ పర్యవేక్షక విభాగాన్ని (సీఎమ్‌యూ) నెలకొల్పినట్లు ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఈ విభాగం పనితీరును తర్వాత విశ్లేషించి, అవసరమైన సేవలను ఇది అందించలేదని తేల్చి, 2009 అక్టోబరులో దీన్ని మూసేశారు. ఐతే, ఒక వర్గం పట్టణ స్థానిక సంస్థలలో జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద అమలవుతున్న ప్రాజెక్టులను పర్యవేక్షించటంకోసం నోడల్ ఏజన్సీ స్థాయిలో కొందరు నోడల్ అధికారులను నియమించారు.

## 4.9 ప్రభావ విశ్లేషణ

ఆయా ప్రాజెక్టుల అమలు ప్రభావంపట్ల ప్రజల అవగాహనను అంచనా వేసే దిశగా 20 ప్రాజెక్టులకు సంబంధించి 1528 మంది లబ్ధిదారులను యాధృచ్ఛిక నమూనా విధానంలో ఆడిట్ అధికారులు 2011 మే, 2012 మార్చి నెలల మధ్యన సర్వే చేశారు. ఈ ప్రాజెక్టులలో మురుగునీటి పారుదలవి 5, నీటిసరఫరా ప్రాజెక్టులు 7, వరదనీటి కాలువలు 3, గృహనిర్మాణ పథకాలు 5 ఉన్నాయి.

### 4.9.1 మురుగునీటి పారుదల

మురుగునీటి పారుదల ప్రాజెక్టుల[36] గురించి సర్వే చేసిన వారిలో 85-90 శాతం తమ సంతృప్తిని వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టులు చేపట్టటం వలన తమ ప్రాంతాలలో మురుగునీటి సమస్య తగ్గిందని వారు తెలిపారు. అదే సమయంలో, వీరిలో చాలామంది (55 శాతం) మిగతా ప్రాజెక్టులు పూర్తికాకపోవటంతో వాటి గురించి తమకు తెలియదన్నారు. ఫలితంగా వారింకా సెప్టిక్ టాంక్‌ల మీదనే ఆధారపడుతున్నారు (*శేరిలింగంపల్లిలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక - హైదరాబాద్‌కు చెందిన ప్రాజెక్టు*).

### 4.9.2 నీటి సరఫరా

నీటి సరఫరా ప్రాజెక్టులు మూడింటికి[37] సంబంధించిన లబ్ధిదారులు తమకు నీటి సరఫరా మెరుగుపడిందని సంతోషం వ్యక్తం చేయగా, మిగతా నాలుగు[38] ప్రాజెక్టులు తమ అవసరాలు తీర్చలేకపోతున్నాయని ఆ ప్రాంత ప్రజలు తమ అసంతృప్తి వెలిబుచ్చారు. నీటిని రోజుకు గంటకూడా సరఫరా చేయకపోవటం, ప్రతిరోజూ సరఫరా చేయకపోవటం, తగిన ఒత్తిడి లేకపోవటంతో మోటర్ల ద్వారా అందించటం వంటి ఇబ్బందుల నెదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. ప్రాజెక్టులు పూర్తికాక, నీటి సరఫరాలో ఆశించిన లక్ష్యాలు సాధించక పోవటంవలన ఈ సమస్యలు తలెత్తుతున్నాయి.

### 4.9.3 వరదనీటి కాలువలు

వరదనీటి కాలువలకు[39] సంబంధించిన లబ్ధిదారులు మొత్తంమీద తమ సంతృప్తి వ్యక్తం చేశారు. తమ ప్రాంతాలలో వరద ముంపు చాలావరకు తగ్గిపోయిందని వారు హర్షం వెలిబుచ్చారు. ఒక్క ప్రాజెక్టుకి[40] సంబంధించి మాత్రం 8-12 శాతం లబ్ధిదారులు తమ ప్రాంతంలో నీరు నిలుస్తోందనీ, అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నదనీ తెలిపారు. *ఎస్ఎల్ కాలువ క్రమబద్ధీకరణ, ఎర్రిగడ్డ వరదనీటి కాలువ, బ్రాంచి కాలువల విస్తరణ* ప్రాజెక్టులను స్వయంగా పరిశీలించినప్పుడు ఈ ప్రాంత ప్రజలు పెద్ద మొత్తంలో చెత్తను కాలువలలో వేస్తున్నట్లు తెలిసింది. ఈ సమస్యను జీవీఎమ్‌సీ పరిష్కరించవలసి ఉంది.

---

[36] 1. పాతబస్తీలో మూసీనది దక్షిణాన (జోన్-I) మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 2. పాతబస్తీలో మూసీనది దక్షిణాన (జోన్-II) మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 3. శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు, 4. విశాఖపట్నం మధ్యభాగానికి మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు 5. విశాఖపట్నం పాతబస్తీ ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు

[37] 1. జీవీఎమ్‌సీ పరిసరాల్లోని 32 ప్రాంతాలలో తాగునీటి సరఫరా, 2.జీవీఎమ్‌సీ పాతబస్తీలో సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ 3. తాటిపూడి జలాశయం నుంచి పట్టణ సరఫరా జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకు తాటిపూడి పైపులైను మార్చడం

[38] 1. జీవీఎమ్‌సీ మధ్య ప్రాంతంలోని ఈశాన్య మండలంలో సమగ్రనీటి సరఫరా పునరుద్ధరణ, 2. పట్టణ సరఫరా జలాశయం నుంచి ఎండాడ, కొమ్మడి కూడలి వరకు నీటి సరఫరా లైన్లు వేయటం, 3. గాజువాక ప్రాంతానికి నీటి సరఫరా మెరుగు పరచటం 4. గాజువాక ప్రాంతంలో నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు (రెండవదశ)

[39] 1. విశాఖపట్నం మహానగర జోన్ VIII వరదనీటి కాలువల విస్తరణ (గంగులహెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు) 2. ఎస్ఎల్ కాలువ క్రమబద్ధీకరణ, 3. ఎర్రిగడ్డ వరదనీటి కాలువ, బ్రాంచికాలువల మరమ్మతులు

[40] విశాఖపట్నం మహానగరం జోన్ VIII వరదనీటి కాలువల విస్తరణ (గంగులహెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు)

### 4.9.4 గృహ నిర్మాణం

గృహనిర్మాణానికి సంబంధించిన సర్వేలో విజయవాడ లబ్ధిదారులు తమ సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాణ్యతతోపాటు ఆప్రాంతంలో వసతులు కూడా బాగున్నాయని చెప్పారు. ఇందుకు భిన్నంగా హైదరాబాదు, తిరుపతి పట్టణాలలో లబ్ధిదారులు ఇళ్ళ పరిమాణం తక్కువగా ఉండటం, మంచినీటి/మురుగునీటి వసతులు లేకపోవటం, రోడ్ల పరిస్థితి సరిగా లేకపోవటం, చెత్తకుప్పలనుంచి దుర్వాసన వెలువడటం వంటి విషయాలలో తమ అసంతృప్తి వెలిబుచ్చారు. తిరుపతిలోని లబ్ధిదారులు తమ ప్రాంతానికి సమీపంలో ఆసుపత్రి, బస్టాపులు లేవని కూడా నివేదించారు.

ప్రాజెక్టులు పూర్తయిన తరువాత వాటి ప్రభావాన్ని అక్కడి ప్రజలు గుర్తిస్తారనీ, అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

## 4.10 సారాంశం

*పై పేరాలలో వెలిబుచ్చినట్లు ఆదేశక, ఐచ్ఛిక సంస్కరణలను ప్రభుత్వం ఎంతో సంతృప్తికరంగా అమలు చేయగా, మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో అధిక భాగం తగినంత స్థలం అందుబాటులో లేకపోవటం, లోపభూయిష్టమైన డిజైన్ల వలన నిర్మాణాల మీద ఇది ప్రతికూల ప్రభావం చూపింది. సంబంధిత శాఖలతో సమన్వయం కొరవడటం, పనులను అనేక భాగాలుగా విభజించటం, సాంకేతిక విధానాలు మార్చటం వంటివి పలు చోట్ల పనులు పూర్తి కాకపోవటానికీ ఆశించిన లక్ష్యాలు, ప్రయోజనాలు సాధించలేకపోవటానికీ దారితీశాయి. టెండర్, కాంట్రాక్టు నిర్వహణ ప్రక్రియలలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయి. పనులను సింగిల్ టెండర్/నామినేషన్ ప్రాతిపదికన అప్పగించటం వలన గుత్తేదారులకు అనుచిత ప్రయోజనం కలగటం ఇందులో ఒకటి. పనులను సకాలంలో నిర్ణీత నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చూసేందుకు పర్యవేక్షణ యంత్రాంగం చాలినంతగా లేదు.*

## 4.11 సిఫార్సులు

- సర్వే నివేదికలనుంచి వాస్తవిక సాధకాలను గ్రహించి నిర్మాణం మొదలు పెట్టేముందే సమగ్ర ప్రాజెక్టు నివేదికలను పటిష్టంగా రూపొందించేలా ప్రభుత్వం చూడాలి. అవసరమైన ముందస్తు ఏర్పాట్లు అన్నీ ఒనగూరేలా సరిచూసుకోవాలి (ముఖ్యంగా స్థలసేకరణ, వివిధ శాఖల నుంచి అనుమతులు).
- అనుమతులు ఇవ్వవలసిన ఇతర శాఖలతో కార్యసాధకమైన సమన్వయం సాధించాలి.
- రెండంచెల టెండర్ ప్రక్రియకు (సర్వే, పరిశోధన, నిర్మాణం) సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలి.
- ప్రాజెక్టులు సకాలంలో, నిర్ణీత వ్యయంలో పూర్తయ్యేలా మార్గదర్శకాలలో నిర్దేశించినట్లు పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి.

# అధ్యాయం-5

# గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలుపై ఆడిట్ సమీక్ష

## పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి (గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య) శాఖ

పేజీలు 115 - 146

## 5.1 పరిచయం

### 5.1.1 నేపథ్యం

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్ఆర్డీడబ్ల్యూపీ) భారత ప్రభుత్వ ప్రాథమ్య పథకాల్లో ఒకటి. 1972-73 లో మొదట దీన్ని సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం (ఏఆర్డబ్ల్యూఎస్పీ)గా ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి 1986లో జాతీయ తాగునీటి పథకంగానూ, 1991లో రాజీవ్‌గాంధీ జాతీయ తాగునీటి పథకంగానూ పేరు మార్చారు. దీన్ని 2009 ఏప్రిల్‌లో సవరించి, జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్ఆర్డీడబ్ల్యూపీ) గా అమలు చేస్తున్నారు.

### 5.1.2 పథకం అమలుకు ప్రమాణాలు, ఆవాసాల స్థితి

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కింది ప్రమాణాలను అనుసరిస్తోంది ః

- మనుషుల కోసం రోజుకు తలసరి 40 లీటర్లు (ఎల్పీసీడీ) చొప్పున;
- ఎడారుల అభివృద్ధి కార్యక్రమం కిందకు వచ్చే ప్రాంతాల్లో జంతువుల కోసం అదనంగా 30 ఎల్పీసీడీ చొప్పున;
- ప్రతి 250 మంది వ్యక్తులకు ఒక చేతి పంపు లేదా స్టాండ్ పోస్ట్.

కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం గ్రామీణ ఆవాసాలను ఈ కింది విధంగా వర్గీకరించడమైంది ః

**తాగునీటి వసతి లేనివి (ఎన్సీ)/రక్షిత తాగునీటి వనరులు లేనివి (ఎన్ఎస్ఎస్) ః** మైదాన ప్రాంతాల్లో 1.6 కి.మీ.ల లోపు, కొండ ప్రాంతాల్లో 100 మీటర్ల దూరంలోనూ తాగునీటి వనరు/వసతి లేని ఆవాసాలు; లేదా నీటి వనరులున్నప్పటికీ నాణ్యతాపరంగా సమస్యలున్న ఆవాసాలు.

**తాగునీటి వసతి పాక్షికంగా ఉన్నవి (పీసీ) ః** ఇవి రక్షిత తాగునీటి వసతి ఉన్న ఆవాసాలే కానీ, వీటిలో నీటి వనరుల సామర్థ్యం ఒక్కొక్కరికి రోజుకు 10 లీటర్ల నుండి 40 లీటర్ల మధ్య మాత్రమే నీటిని సరఫరా చేసేలా ఉంటుంది.

**తాగునీటి వసతి పూర్తిస్థాయిలో ఉన్నవి (ఎఫ్సీ) ః** పై రెండు వర్గాల కిందకు రాని మిగిలిన అన్ని ఆవాసాలు.

'ఎఫ్సీ' ఆవాసాల కిందకు రాని మిగిలిన అన్ని ఆవాసాలను **'సమస్యాత్మక ఆవాసాలు'** గా కూడా పిలుస్తారు. 'పీసీ' ఆవాసాలను నీటి వనరుల సామర్థ్యం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రకాలుగా వర్గీకరించింది. ఒక్కొక్కరికి రోజుకు 9 లీటర్ల వరకు నీటిని సరఫరా చేయగలిగితే పీసీ-1 గానూ, 10 నుండి 19 లీటర్ల వరకు సరఫరా చేయగలిగితే పీసీ-2 గానూ, 20 నుండి 29 లీటర్ల వరకు సరఫరా చేయగలిగితే పీసీ-3 గానూ, 30 నుండి 39 లీటర్ల వరకు సరఫరా చేయగలిగితే పీసీ-4 గానూ వర్గీకరించారు.

రాష్ట్రంలో గ్రామీణ నీటి సరఫరా ఆస్తులు ప్రధానంగా ఈ కింది మూడు వర్గాలుగా ఉన్నాయి ః

**(i)** శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకాలు;
**(ii)** శుద్ధి చేయని నీటిని సరఫరా చేసే పైపు లైను నీటి సరఫరా (పీడబ్ల్యూఎస్) పథకాలు;
**(iii)** బోరుబావులు.

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గ దర్శకాల ప్రకారం, పథకం అమలుకు ప్రణాళికలు రచించేటప్పుడు, ఆవాసాలను ఎంపిక చేసేటప్పుడు 0 నుండి 25 శాతం జనాభాకు మాత్రమే నీటి వసతి ఉన్నవి, నాణ్యమైన నీరు సరఫరా కాని ఆవాసాలు, ఎస్సీ, ఎస్టీ, అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్న ఆవాసాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి.

### 5.1.3 వ్యవస్థాగత నిర్మాణం

గ్రామీణ నీటి సరఫరా పథకాల ప్రణాళికల రచన, అమలు బాధ్యత ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం (ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్) శాఖపై ఉంది. ఈ పథకాల ప్రణాళికల రచన, అమలు, నిర్వహణకు సంబంధించి అనుబంధ బాధ్యతలను వివిధ స్థాయిల్లోని పంచాయతీరాజ్ సంస్థలు నిర్వహిస్తాయి. 2007 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం ఈ పథకాలకు సంబంధించి పంచాయతీరాజ్ సంస్థల పాత్ర సంక్షిప్తంగా ఈ కింద వివరించడమైంది:

| స్థాయి | ప్రధాన బాధ్యతలు |
|---|---|
| జిల్లా పరిషత్ (జడ్‌పీ) | • సీపీడబ్ల్యూఎస్ పథకాల ప్రణాళికారచన, నిర్వహణలో పాల్గొనడం<br>• నీటి నాణ్యతా పరీక్షల నివేదికల సమీక్ష, పర్యవేక్షణ<br>• తాగునీటికి సంబంధించి శిక్షణ కార్యక్రమాలు, సెమినార్లు, సమాచార విద్య - ప్రసార (ఐఈసీ) కార్యకలాపాలను ఏర్పాటు చేయడం<br>• జిల్లా నీటి-పారిశుధ్య మిషన్ కార్యకలాపాలను సమీక్షించడం |
| మండల ప్రజా పరిషత్(ఎమ్‌పీపీ) | • ఒకటి కంటే ఎక్కువ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నీటి సరఫరా పథకాల ప్రణాళికా రచనలో పాల్గొనడం<br>• చేతి పంపులు, పీడబ్ల్యూఎస్ పథకాలు, గ్రాంటు పంపిణీల నిర్వహణ, సమీక్ష, పర్యవేక్షణ<br>• తాగునీటి కోసం బావుల ఏర్పాటు, రవాణా, కిరాయి ఏర్పాట్లు |
| గ్రామ పంచాయతీ (జీపీ) | • గ్రామ పంచాయతీలు, గ్రామసభల తోడ్పాటుతో పథకాలను, నీటి వసతి ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను గుర్తించడం<br>• గ్రామంలో పైపు లైను పనుల నిర్వహణ<br>• ఒక్క గ్రామానికే ప్రత్యేకంగా ఏర్పాటయిన తాగునీటి పథకాల ఆపరేషను, నిర్వహణ<br>• తాగునీటి వనరుల్లో నిర్ణీత కాల వ్యవధుల్లో క్లోరిన్‌ను కలపడం; గ్రామంలోని అన్ని ప్రాంతాలకూ సక్రమంగా నీరు పంపిణీ అయ్యేలా చూడటం<br>• నీటి నాణ్యతపై నిఘా ఉంచడం, పర్యవేక్షించడం |

*మూలం : 2007 డిసెంబరు 22వ తేదీ నాటి జీఓ ఎమ్‌ఎస్ నెం. 569*

రక్షిత నీటి పథకాలు, చేతిపంపుల నిర్వహణను సంబంధిత బడ్జెటుతో పాటు గ్రామ పంచాయతీలకు బదిలీ చేసినప్పటికీ, ఈ పథకాల సక్రమ నిర్వహణకు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ సాంకేతిక సహకారాన్ని అందించాలి. ఐతే, సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలను గ్రామీణ నీటి సరఫరా శాఖయే నిర్వహిస్తోంది.

## 5.2 ఆడిట్ అనుసరించిన విధానం

### 5.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ కింది అంశాలను నిర్ధారించుకోవడం ఈ ఆడిట్ సమీక్ష లక్ష్యాలు :

- గ్రామీణ నీటి సరఫరా పథకాలకు పటిష్టమైన ప్రణాళికా రచన ప్రక్రియ ఉందా;
- పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నిధులు సంబంధిత ప్రయోజనాల కోసమే ఖర్చు చేసారా; వాటికి జమా లెక్కలను సక్రమంగా నమోదు చేసారా;
- వివిధ నీటి సరఫరా పథకాలకు సరైనరీతిలో ప్రణాళికా రచన చేసారా; వీటిని పొదుపుగానూ, సమర్థవంతంగానూ, ప్రభావవంతంగానూ నిర్వహిస్తున్నారా;

- సమస్యాత్మక ఆవాసాల్లో తాగునీటి వసతి కోసం తగిన ఏర్పాట్లు చేసారా; నీటి సరఫరా నిరంతరాయంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టారా;
- నీటి నాణ్యతపై పర్యవేక్షణ, నిఘా కోసం తగిన ఏర్పాట్లు ఉన్నాయా, అవి ప్రభావశీలంగా ఉన్నాయా;
- పథకాల పర్యవేక్షణ, మూల్యాంకనం తగు విధంగా ఉన్నాయా.

### 5.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్‌లో కనుగొన్న విషయాలను ఈ కింది ప్రామాణికాంశాలతో బేరీజు వేసుకొని నిర్ధారించుకోవడమైంది :

- సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం మార్గదర్శకాలు;
- జాతీయ గ్రామీణ తాగునీటి పథకం, జాతీయ గ్రామీణ తాగునీటి నాణ్యత పర్యవేక్షణ, నిఘా పథకం (ఎన్ఆర్‌డీడబ్ల్యూక్యూఎమ్ఎస్‌పీ);
- జాతీయ నీటి విధానం (2002 ఏప్రిల్).

### 5.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

2007-12 మధ్యగల ఐదేళ్ల కాలంలో గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలుపై 2011 జూలై - 2012 జూన్ మధ్య ఆడిట్ సమీక్షను నిర్వహించడమైంది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ), ఎంపిక చేసుకున్న డివిజన్ల కార్యాలయాల్లో రికార్డులను మచ్చుకు తనిఖీ చేయడమైంది. మచ్చుకు తనిఖీ చేసిన సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలను (సీపీడబ్ల్యూఎస్) ప్రత్యక్షంగా తనిఖీ చేసి ఆడిట్‌లో కనుగొన్న అంశాలకు మద్దతుగా అవసరమైన చోట్ల ఫోటోలను కూడా తీసుకోవడం జరిగింది. ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న పథకాల జాబితాను, వాటి ప్రస్తుతస్థితిని *అనుబంధం-5.1* లో పేర్కొనడమైంది.

2011 జూన్ 20వ తేదీన గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో జరిపిన సమీక్షారంభ సమావేశంలో ఆడిట్ లక్ష్యాలు, పరిధి, పద్ధతి, ప్రామాణికాంశాలు చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. 2013 జనవరి 18వ తేదీన జరిగిన సమీక్షానంతర సమావేశంలో ఆడిట్‌లో కనుగొన్న విషయాలను ప్రభుత్వంతో చర్చించడమైంది. ఈ సమావేశంలో ప్రభుత్వం/ప్రభుత్వ శాఖ ఇచ్చిన సమాధానాలను, వారు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానాలను ఈ నివేదికలో పొందుపర్చడం జరిగింది.

#### *5.2.3.1 ఆడిట్ నమూనా పరిమాణం*

చేపట్టిన 292 గ్రామీణ నీటి సరఫరా పథకాలకుగానూ, 10 జిల్లాల్లోని[1] 21 డివిజన్ల పరిధిలోని 60 పథకాల పనులను (పూర్తయినవి : 39, కొనసాగుతున్నవి : 21) ఆడిట్‌కు ఎంపిక చేసుకోవడం జరిగింది. ఎంపిక చేసుకున్న పథకాల్లో అన్ని రకాల ఆవాసాలు (నీటివసతి లేనివి, పాక్షికంగా ఉన్నవి, నీటివసతి పూర్తిస్థాయిలో ఉన్నవి) ఉన్నాయి. రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ - మూడు ప్రాంతాల్లోని పథకాలనూ ఆడిట్‌కు ఎంపిక చేసుకోవడం జరిగింది. అంతేకాక, ఈ సమీక్షలో భాగంగా కాకుండా రెగ్యులర్ ఆడిట్‌లో భాగంగా అనంతపురం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఇంజినీరింగ్ డివిజన్ల తనిఖీలో భాగంగా చేసిన ఆరు సీపీడబ్ల్యూఎస్ పనుల[2]

---

1 నెల్లూరు : నెల్లూరు, గూడూరు; అనంతపురం : పెనుకొండ, కళ్యాణదుర్గం, అనంతపురం; కర్నూలు : నంద్యాల, కర్నూలు, ఆదోని; మెదక్ : మెదక్, సిద్దిపేట; వరంగల్ : వరంగల్; కరీంనగర్ : కరీంనగర్, మంథని; నిజామాబాద్ : బాన్సువాడ, నిజామాబాద్; ఖమ్మం : ఖమ్మం; రంగారెడ్డి : హైదరాబాద్ (ఒక పథకం); ప్రకాశం : ఒంగోలు, కనిగిరి, దర్శి, పొదిలి

2 దామరంచ, ఇతర ఆవాసాల్లో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం, నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం లోని చందూరు, ఇతర ఆవాసాల్లో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం, జేసీఎన్ఆర్ తాగునీటి సరఫరా - సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం, అనంతపురం జిల్లాలో నీలకంఠాపురం శ్రీ రామిరెడ్డి తాగునీటి సరఫరా - సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం, కరీంనగర్ జిల్లా గంగాధర, కొత్తపల్లిలో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలు

సమీక్షలో కనుగొన్న విషయాలను కూడా ఈ నివేదికలో పొందుపర్చడమైంది. ఐతే, ఈఎన్సీ ఇచ్చిన 292 పనుల జాబితాలో ఈ 6 సీపీడబ్ల్యూఎస్ పనులు లేవు. కాబట్టి, సీపీడబ్ల్యూఎస్ పథకాల సమాచారం అసంపూర్తిగా ఉందని లేదా ఈ సమాచారంలో తప్పులున్నాయని తెలుస్తోంది.

## 5.3 నిధులను సమకూర్చే పద్ధతి

2007-12 మధ్యగల ఐదేళ్ల సమీక్షా కాలంలో అమలు చేసిన సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం, జాతీయ గ్రామీణ తాగునీటి పథకాలకు నిధులు సమకూర్చే విధానాన్ని ఈ కింద పేర్కొనడమైంది :

### 5.3.1 సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకానికి నిధులు

ఈ పథకానికి 1998 ఏప్రిల్ 1 నుండి 1999 మార్చి 31 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో నిధులను సమకూర్చాయి. తర్వాత, నీటి నాణ్యత, నిరంతరాయమైన నీటి సరఫరా (సస్టెయినబిలిటీ) కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో నిధులను ఇస్తున్నాయి. ఎడారుల అభివృద్ధి పథకానికి (డీడీపీ) కేంద్ర ప్రభుత్వం నిధులందిస్తోంది.

- ఈ కింది అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులను ఖర్చు చేయవచ్చు :
  - **(i)** ఈ పథకంలోని ఉప పథకాల కార్యక్రమాల కింద ఫ్లోరోసిస్, ఆర్సెనిక్, ఉప్పునీరు, ఇనుము, నత్రజని అధికంగా ఉండటం వంటి నీటి నాణ్యత సమస్యల పరిష్కారానికి ప్రాజెక్టులను చేపట్టడానికి 15 శాతం నిధులు,
  - **(ii)** నీటి సంరక్షణ విధానాలను అనుసరించడం, నీటి చెలమల్లో భూగర్భ జలాలు పెరిగేలా చేయడం వంటి వాటి ద్వారా నీటి వనరులు నిరంతరాయంగా నీటిని అందించేలా చేసేందుకు 5 శాతం నిధులు.
- ఏర్పాటు చేసిన ఆస్తుల నిర్వహణ కోసం 15 శాతం నిధులు ఖర్చు చేయవచ్చు.
- ఎస్సీ/ఎస్టీలున్న ఆవాసాల్లో తాగునీటి సరఫరా కోసం కనీసం 35 శాతం నిధులను ఖర్చు చేయాలి.

### 5.3.2 జాతీయ గ్రామీణ తాగునీటి పథకానికి నిధులు

ఈ పథకంలో, కవరేజి (30 శాతం), నాణ్యత (20 శాతం), సస్టెయినబిలిటీ (20 శాతం), ఎడారి అభివృద్ధి పథకం (10 శాతం), ఓ అండ్ ఎమ్ (10 శాతం), మద్దతు (5 శాతం), ప్రకృతి విపత్తులు (5 శాతం) అనే ఏడు అంశాలున్నాయి. కవరేజి, నాణ్యత, ఓ అండ్ ఎమ్‌లపై అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తాయి. మనుగడ, ఎడారి అభివృద్ధి పథకం, ప్రకృతి విపత్తు, మద్దతులకు 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఒక ఏడాదిలో రెండవ విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం డ్రా చేసుకుంటే తదుపరి ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలేమీ లేకుండానే మొదటి విడత గ్రాంటును కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. రెండో విడత నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిత నమూనాలో నిర్దిష్ట ప్రతిపాదనలను సమర్పించాలి.

## 5.4 పథకాల అమలులో పురోగతి, నిధుల విడుదల - వినియోగం

### 5.4.1 పథకాల అమలులో పురోగతి

వివిధ ఆవాసాల స్థితికి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం 'వాటర్ సాఫ్ట్' అనే డేటా బేస్‌లో ఎప్పటికప్పుడు నవీకరిస్తోంది. ఐతే, ఎప్పటికప్పుడు నవీకరిస్తున్న సమాచారానికి మూలమైన మౌలిక సమాచారాన్ని ఏదైనా సర్వే చేపట్టడం ద్వారా దాన్ని తప్పులు లేకుండా పక్కాగా ఎప్పుడూ రూపొందించుకోలేదు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం, 2007 ఏప్రిల్ - 2012 ఏప్రిల్ మధ్య రాష్ట్రంలోని ఆవాసాల స్థితిలో మార్పు ఈ కింది విధంగా ఉంది.

పట్టిక 5.1

| | 2007 ఏప్రిల్ నాటి స్థితి (శాతం) | 2012 ఏప్రిల్ నాటి స్థితి (శాతం) | మార్పు |
|---|---|---|---|
| ఎఫ్‌సీ | 29114 (43) | 39275 (54) | 10161 |
| పీసీ | 36301 (53) | 32441 (45) | (-) 3860 |
| ఎన్‌సీ | 626 (1) | 113 (–) | 513 |
| ఎన్ఎస్ఎస్ | 2388 (3) | 561 (1) | 1827 |
| **మొత్తం** | **68429** | **72390** | **3931** |

ఎఫ్‌సీ : తాగునీటి వసతి పూర్తిస్థాయిలో ఉన్నవి; పీసీ : తాగునీటి వసతి పాక్షికంగా ఉన్నవి

ఎన్‌సీ : తాగునీటి వసతి లేనివి; ఎన్ఎస్ఎస్ : రక్షిత తాగునీటి వనరులు లేనివి

*మూలం : రాష్ట్ర ప్రభుత్వ సమాచార నిర్వహణ వ్యవస్థ 'వాటర్ సాఫ్ట్'*

ఐదేళ్ల కాలంలో పీసీ, ఎన్‌సీ/ఎన్ఎస్ఎస్ ఆవాసాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసనీయమైన ప్రయత్నాలు చేసిందని పై వివరాలను చూస్తే తెలుస్తోంది. ఐతే, 2012 ఏప్రిల్ నాటికి పీసీ ఆవాసాలుగా ఉన్న 32,441 ఆవాసాలలో 15,988 ఆవాసాలు (49 శాతం) "స్థాయి తగ్గిన" ఆవాసాలు. అంటే, ఎఫ్‌సీ స్థాయినుండి పీసీ స్థాయికి పడిపోయిన ఆవాసాలు. భూగర్భజలాలు తగ్గిపోవడం, దీనివల్ల వనరులు నిర్జలంగా మారడం, నాణ్యత సమస్యల వల్ల "స్థాయి తగ్గిన" స్థితి ఉత్పన్నమైందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). ఆవాసాల స్థాయి ఎఫ్‌సీ స్థాయినుండి పీసీకి పడిపోవడానికి భూగర్భనిల్వలు తగ్గడమూ ఒక కారణమని ఆడిట్ అంగీకరిస్తోంది. కానీ, నీటి వనరుల మనుగడ కొనసాగేలా చూడటంలో ప్రభుత్వం సరిగా దృష్టి సారించక పోవడమే ఇందుకు ప్రధాన కారణం.

'వాటర్ సాఫ్ట్' డేటాబేస్‌లో తెలిపిన ఆవాసాల కవరేజి వివరాల ఖచ్చితత్వాన్ని నిర్ధారించుకునేందుకు గత కొద్దికాలంగా/ఆడిట్ సమీక్షాకాలంలో ఎలాంటి సర్వేను చేపట్టలేదని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం అంగీకరించింది. ఈ పథకం ప్రారంభించే సమయంలో ఇలాంటి సర్వే జరిగి ఉండవచ్చని కూడా ప్రభుత్వం తెలిపింది.

## 5.4.2 నిధుల విడుదల - వినిమయం

2007-12 మధ్య కాలంలో నీటి సరఫరా పథకాల అమలు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలు, ఖర్చుల వివరాలు ఈ కింది పట్టికలో తెలపడమైంది.

పట్టిక 5.2

(₹ కోట్లలో)

| సంవత్సరం | ప్రారంభ నిల్వ | బడ్జెటు విడుదల | | | | ఖర్చు | | | | ముగింపు నిల్వ | కేంద్ర ప్రభుత్వ నిధుల్లో ఖర్చుకాని నిధుల శాతం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | రాష్ట్ర ప్రభుత్వం | కేంద్ర ప్రభుత్వం | రుణం | మొత్తం | రాష్ట్ర ప్రభుత్వం | కేంద్ర ప్రభుత్వం | రుణం | మొత్తం | | |
| **2007-08** | 137 | 50 | 354 | 272 | 676 | 50 | 452 | 272 | 774 | 39 | (+) 28 |
| **2008-09** | 39 | 106 | 397 | 397 | 900 | 106 | 420 | 397 | 923 | 16 | (+) 6 |
| **2009-10** | 16 | 453 | 534 | 98 | 1085 | 453 | 334 | 98 | 885 | 216 | (-) 37 |
| **2010-11** | 216 | 342 | 559 | 87 | 988 | 272 | 355 | 87 | 714 | 490 | (-) 36 |
| **2011-12** | 490 | 150 | 462 | 96 | 708 | 220 | 446 | 96 | 762 | 436 | (-) 3 |
| మొత్తం | | **1101** | **2306** | **950** | **4357** | **1101** | **2007** | **950** | **4058** | | |

*మూలం : గ్రామీణ నీటి సరఫరా,పారిశుధ్య శాఖ రికార్డులు*

రుణాలుగా పొందిన నిధులు పూర్తిగా ఖర్చుయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు (2010-12), కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు (2007-12) పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. 2009-12 మధ్య కాలంలో పేరుకుపోయిన నిల్వలు ఎన్ఆర్‌డీడబ్ల్యూపీకి సంబంధించినవి (2009 ఏప్రిల్ 1 నుండి ఈ పథకం మొదలవ్వడం వలన). ఆవిధంగా, 2009-10, 2010-11 సంవత్సరాల్లో వచ్చిన నిధుల్లో సుమారు 37 శాతం నిధులు ఖర్చుకాకుండా మిగిలిపోయాయి.

మిగిలిపోయిన నిధులను ఖర్చు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 అక్టోబరు).

***ఆడిట్‌లో కనుగొన్న అంశాలు***

## 5.5 ప్రణాళికా రచన

### 5.5.1 వార్షిక కార్యాచరణ ప్రణాళికలు

సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల్లో నిర్దేశించిన ప్రకారం, పంచాయతీరాజ్ సంస్థలనుండి సమాచారాన్ని తీసుకుని రాష్ట్రస్థాయిలో వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. పథకం అమలుకు నిర్దిష్ట మార్గ దర్శనాన్ని చూపేలా, భౌతిక, ఆర్థిక పురోగతిని నిర్ణీత కాల వ్యవధుల్లో పర్యవేక్షించేలా ఈ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. వీటి తయారీని ప్రతి ఏటా ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలి. వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేటప్పుడు కొత్తపనులకన్నా అసంపూర్తిగా మిగిలిపోయిన పనులకు ప్రాధాన్యతనివ్వాలి. నీటి వనరుల మనుగడకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చేలా పటిష్టమైన, ఖర్చుకు తగిన ఫలితాన్నిచ్చే గ్రామీణ నీటి సరఫరా పథకాలకు ప్రణాళికలను, డిజైన్లను రూపొందించడంలో రాష్ట్రస్థాయి సాంకేతిక సంస్థ (స్టేట్ టెక్నికల్ ఏజెన్సీ-ఎస్‌టీఏ) సహాయపడుతుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రెండింటికీ సంబంధించిన కార్యకలాపాల కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడంలో ఈ సంస్థ సహాయపడుతుంది. ఎస్‌టీఏలుగా వ్యవహరించేందుకు ప్రముఖ సాంకేతిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయాలి.

ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

**(i)** ఆడిట్ సమీక్షాకాలం (2007-12) లో ఎస్‌టీఏను ఏర్పాటు చేయలేదు. 2011-12 నుండి మాత్రం వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. ప్రధానంగా, ప్రజాప్రతినిధుల అభ్యర్థనల ఆధారంగానే నీటి సరఫరా పథకాలకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ప్రణాళికా రచన ప్రక్రియలో పంచాయతీరాజ్ సంస్థల ప్రమేయం ఉందని తెలిపే రుజువులేవీ ఆడిట్‌కు సమర్పించిన రికార్డుల్లో లేవు. ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయంతో ఆరు జిల్లాల్లో[3] అమలుచేస్తున్న మూడు పథకాలకు నీరు-పారిశుధ్యంపై ఏర్పాటైన గ్రామ సంఘాలు (వీడబ్ల్యూఎస్‌సీ), పంచాయతీరాజ్ సంస్థల నుండే ప్రతిపాదనలు వచ్చాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 అక్టోబరు).

**(ii)** ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన 66 పథకాల్లోని 27 పథకాలు 2002-2010 మధ్యకాలంలో మంజూరైనవి. కొత్త ప్రాజెక్టులను చేపట్టడానికి ముందు పూర్తికాకుండా మిగిలిపోయిన ప్రాజెక్టులకు ప్రాధమ్యం ఇవ్వడం లేదని దీన్నిబట్టి తెలుస్తోంది.

**(iii)** అంతేకాక, మచ్చుకు తనిఖీ చేసిన 66 పథకాల కింద మొత్తం 4881 ఆవాసాలకు నీటి వసతి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1328 (27 శాతం) ఆవాసాలకు మాత్రమే నీటి వసతిని కల్పించడం జరిగిందని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. వీటిలో నీటి వసతి లేని (ఎన్‌సీ) ఆవాసాలు, రక్షిత నీటి వనరు లేని (ఎన్ఎస్ఎస్) ఆవాసాలు ఉన్నాయి.

[3] ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ప్రకాశం, విశాఖపట్నం, వైఎస్ఆర్ (కడప)

**(iv)** మొత్తం ఆవాసాల సంఖ్యకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ రికార్డులకూ, ఆవాసాల కవరేజికి ప్రణాళికలను రూపొందించే వ్యవసాయ శాఖ వంటి ఇతర ప్రభుత్వశాఖల రికార్డులకూ మధ్య వ్యత్యాసాలున్నాయి. సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం ఈ విషయాన్ని ధృవీకరించి, ఈ మధ్య కాలంలో ఎలాంటి సర్వేనూ చేపట్టకపోవడమే వివిధ శాఖల రికార్డుల మధ్య వ్యత్యాసాలకు కారణమని తెలిపింది.

## 5.5.2 స్థానిక సమాజపు ప్రమేయం లేకపోవడం

సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల ప్రకారం, గ్రామీణ నీటి సరఫరా పథకాల్లో సమాజ భాగస్వామ్యం ఉండేలా చేయడానికి, సరైన, సులభంగా నిర్వహించగలిగే సాంకేతికత/వ్యవస్థను ఎంచుకునేలా చూసేందుకు స్థానిక ప్రజలను సంప్రదించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను రూపొందించాలి. నీటి సరఫరా పథకాలన్నింటికీ సమగ్ర ప్రాజెక్టు నివేదికలను రూపొందించామనీ తెలిపారు. కానీ, మచ్చుకు తనిఖీ చేసిన నీటి సరఫరా పథకాల్లోని ఏ ఒక్క పథకానికీ సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఆడిట్‌కు సమర్పించని కారణంగా వీటి రూపకల్పనలో సమాజపు ప్రమేయం ఉందా లేదా అనే అంశాన్ని పరిశీలించడం సాధ్యంకాలేదు. ప్రణాళికలను రూపొందించడంలో స్థానిక ప్రజల ప్రమేయాన్ని తీసుకోలేదని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం ధృవీకరించింది. ప్రాజెక్టుకు అనుమతి/మంజూరీ కోసం పూర్తి వివరాలతో సమర్పించే ప్రతిపాదనలు కాకుండా ఏ పథకానికీ విడిగా సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించలేదని కూడా ప్రభుత్వం తెలిపింది.

## 5.5.3 ఆమోదిత విధానాన్ని పాటించకపోవడం

రాష్ట్ర ప్రభుత్వం 2003 జూలైలో ఇచ్చిన ఉత్తర్వుల[4] ప్రకారం, పరిపాలనాపరమైన మంజూరీని రెండు దశల్లో ఇవ్వాలి.

- సన్నాహక పనులకోసం మొదటి దశ అనుమతి : సమగ్ర ఇన్వెస్టిగేషన్, పర్యావరణంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడం (ఈఐఏ), పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎమ్‌పీ), అటవీ అనుమతులు, ఇతర అనుమతులు, పునర్నిర్మాణ-పునరావాస ప్రణాళిక, పూర్తిస్థాయి డిజైన్లు, డ్రాయింగ్‌లు, కనీసస్థాయిలో భూసేకరణ, మొదలైన సన్నాహక పనుల కోసం మొదటి దశ అనుమతినివ్వాలి.

- రెండవ దశ అనుమతి : డిజైన్ల ఖరారు, సమగ్ర ఇన్వెస్టిగేషన్, మొదటి రెండేళ్ల కాలంలో ఎలాంటి ఆటంకం లేకుండా పనులు చేయడానికి చాలినంత భూసేకరణ చేసిన తర్వాత రెండవ దశ అనుమతినివ్వాలి. ఈ అంశాలన్నీ పరిష్కారమైనట్లు ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ)/చీఫ్ ఇంజినీర్ (సీఈ) ధృవీకరిస్తే ఈ మంజూరీని నేరుగా ఇవ్వవచ్చు.

ఆడిట్ ఎంపిక చేసుకున్న సమగ్ర రక్షిత నీటి పథకాలను పరిశీలిస్తే, రెండు దశల విధానాన్ని అనుసరించకుండానే ప్రభుత్వం వీటికి పరిపాలనాపరమైన మంజూరీనిచ్చిందని వెల్లడైంది. ఐదు కోట్ల రూపాయలకన్నా అధిక విలువగల పనులకు సాంకేతిక మంజూరీని ఇచ్చేముందు సంబంధిత ఈఎన్‌సీ/సీఈ పనులు జరిగే స్థలాన్ని తనిఖీ చేయాల్సి ఉండగా[5] మచ్చుకు తనిఖీ చేసిన కేసులలో ఇలాంటి తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

ఈఎన్‌సీ/సీఈ పైన పేర్కొన్న నిబంధనలను పాటించని కారణంగా రైల్వేలు, అటవీశాఖ, నీటిపారుదలశాఖ, హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల సంస్థలనుండి అనుమతులు, పూర్తయిన పథకాలకు విద్యుత్తు సరఫరాలో సమన్వయలేమి వంటి అవరోధాలను గుర్తించలేకపోయారు. ఫలితంగా,

[4] 2003 జూలై 1వ తేదీ నాటి జీఓఎమ్ఎస్ నెం.94

[5] ఏపీడబ్ల్యూడీ కోడ్‌లో 154 వ పేరా తోపాటు, నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి (పీడబ్ల్యూ-సీఓడీ) శాఖ 2003 జూలై 1వ తేదీన జారీ చేసిన జీఓ నెంబరు 94 లోని 2(సి) పేరా ప్రకారం

పలు పథకాలు భూసేకరణ, అటవీశాఖ, నీటిపారుదలశాఖ, రైల్వేలు, భారతీయ జాతీయ రహదారుల సంస్థ మొదలైన వాటినుండి అనుమతులకు సంబంధించిన సమస్యల్లో చిక్కుకున్నాయి. దీనివల్ల వాటిపై అంచనా వేసిన ఖర్చు, పూర్తవడానికి పట్టే సమయం పెరిగిపోయాయి.

ఆడిట్ కనుగొన్న అంశాలను ప్రభుత్వం అంగీకరించింది. 2012-13 నుండి సంబంధిత నియమాలను పాటించడం జరుగుతోందని కూడా ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

## 5.6 ఆర్థిక నిర్వహణ

### 5.6.1 రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను తక్కువగా విడుదల చేయడం

సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గ దర్శకాల ప్రకారం, మొత్తం ఏడు అంశాల్లో మూడింటికి[6] కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తానికి సమాన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా విడుదల చేయాలి. 2007-08, 2008-09 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కంటే ఎక్కువగానే విడుదల చేసినప్పటికీ, 2009-10 నుండి 2011-12 వరకు తన వాటాగా విడుదల చేయాల్సిన నిధుల్లో భారీగా కోత విధించినట్లు గమనించడమైంది. వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

పట్టిక 5.3

(₹ కోట్లలో)

| సంవత్సరం | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు | రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విడుదల చేయాల్సిన నిధులు | రాష్ట్ర ప్రభుత్వం వాస్తవంగా విడుదల చేసిన నిధులు | నిధుల విడుదలలో కోత |
|---|---|---|---|---|
| 2007-08 | 4.02 | 1.15 | 24.20 | శూన్యం |
| 2008-09 | 4.02 | 1.15 | 40.00 | శూన్యం |
| 2009-10 | 339.79 | 339.79 | 0.00 | 339.79 |
| 2010-11 | 389.74 | 389.74 | 87. 95 | 301.79 |
| 2011-12 | 363.32 | 363.32 | 0.00 | 363.32 |
| మొత్తం | 1100.89 | 1095.15 | 152.15 | 1004.90 |

*మూలం : గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఈఎన్సీ, కార్యదర్శి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు*

తాగునీటి సరఫరా కోసం రాష్ట్ర ప్రణాళిక కింద విడుదలైన కేంద్ర నిధులు, నాబార్డు నిధులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేస్తోంది కాబట్టి, తమ వాటా నిధులను తక్కువగా విడుదల చేసిన కారణంగా పనుల నిలుపుదల/పురోగతిలో మందగమనం జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). భవిష్యత్తులో మిగతా మొత్తాన్ని కూడా విడుదల చేస్తామని తమ సమాధానంలో పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ సంవత్సరాల వారీగా మంజూరైన, పూర్తయిన పథకాలు, ప్రతి పథకానికి మంజూరైన మొత్తం, ఖర్చు చేసిన నిధుల వివరాలను సమర్పించని కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తెలిపిన అంశాన్ని ఆడిట్‌లో పరిశీలించడం సాధ్యం పడలేదు.

### 5.6.2 కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల విడుదలలో జాప్యం

రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయకపోవడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా పథకాలను అమలు చేస్తున్న సంస్థలకు సకాలంలో విడుదల చేయలేదు. 2008-10 మధ్య కాలంలో ₹529.98 కోట్ల నిధుల విడుదలలో 31 రోజుల నుండి 261 రోజుల వరకు జరిగిన జాప్యం, పనులు సకాలంలో

[6] కవరేజి, ఓ అండ్ ఎమ్, నాణ్యత

పూర్తి కాకపోవడానికి కారణమైంది. అవసరాల ఆధారంగా నిధులను విడుదల చేయడమైందని, నిధుల విడుదలలోని జాప్యం వల్ల పథకం అమలు, పనుల పురోగతి ప్రభావితం కాలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 అక్టోబరు).

### 5.6.3 నివారించదగ్గ వడ్డీ చెల్లింపు

నీటి సరఫరా పథకాల అమలుకు, ముఖ్యంగా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో ఈ పథకాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2006 ఫిబ్రవరి - 2008 డిసెంబరు మధ్య హడ్కో నుండి ₹393.27 కోట్ల రుణాన్ని తీసుకొంది. ఈ రుణంపై వడ్డీని చెల్లించడంలోని జాప్యంవల్ల అపరాధవడ్డీ, చక్రవడ్డీల రూపేణా ₹2.93 కోట్లు హడ్కోకు చెల్లించాల్సి వచ్చింది. ఇది నివారించదగ్గ చెల్లింపు. లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) విడుదల చేయడంలోనూ, ఆ తర్వాత, సంబంధిత మొత్తాన్ని హడ్కోకు జమ చేయడంలోని జాప్యం వల్లనే ఇలా జరిగిందని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది. ప్రభుత్వం బడ్జెటు విడుదల ఉత్తర్వు జారీ చేయడంలోనూ జాప్యం జరిగింది. ప్రభుత్వం ఆడిట్ పరిశీలనను అంగీకరించింది. బడ్జెటు విడుదల ఉత్తర్వు జారీ చేయడంలో అనుసరించాల్సిన పద్ధతి, హడ్కో ఇన్వాయిస్‌ను ఆలస్యంగా పంపడం వలన జాప్యం జరిగిందని తెలిపింది (2012 అక్టోబరు).

### 5.6.4 ప్రకృతి విపత్తుల ఉపశమన నిధిని వినియోగించకపోవడం

2009 లో వచ్చిన వరదల వల్ల ప్రభావితమైన గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల పునరుద్ధరణ కోసం ప్రకృతి విపత్తుల ఉపశమన సహాయం కింద 2009-10లో భారత ప్రభుత్వం 2009 నవంబరు - 2010 ఫిబ్రవరి మధ్య కాలంలో ₹69.77 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టాల్సిన ఐదు పనుల్లో[7] మూడింటిని మాత్రమే చేపట్టి, వీటిపై ₹11.59 కోట్లు ఖర్చు చేసారు. మిగిలిన రెండు పనులనూ చేపట్టలేదు (మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించినవి). బురద పేరుకుపోయి ఉండటం ఇందుకు కారణంగా పేర్కొన్నారు. ఆ విధంగా, పునరుద్ధరణ పనులకు విడుదలైన మొత్తంలో 2012 జూన్ నాటికి రాష్ట్ర ప్రభుత్వం ₹58.20 కోట్లను ఉద్దేశించిన ఈ ప్రయోజనానికి ఖర్చు చేయలేదు.

పనులన్నీ జరుగుతున్నాయని, 2013లో పూర్తవుతాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 అక్టోబరు).

### 5.6.5 మార్గ దర్శకాల పాటింపులో అతిక్రమణలు

ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన 21 డివిజన్లలో పథకం మార్గ దర్శకాలను పాటించని పలు ఉదంతాలను గమనించడమైంది. దీనికి సంబంధించి ఆడిట్ కనుగొన్న అంశాల్లో ముఖ్యమైన వాటిని ఈ కింద పేర్కొనడమైంది:


| అతిక్రమణ | క్లుప్తంగా వివరాలు |
|---|---|
| కార్మిక సెస్సును తక్కువగా రికవరీ చేయడం | భారత ప్రభుత్వం కార్మిక సెస్సు చట్టం-1996, 2008 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధంగా, పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులనుండి రికవరీ చేయాల్సిన కార్మిక సెస్సును ₹1.96 కోట్ల మేర తక్కువగా రికవరీ చేసారు (2010 మార్చి నుండి 2012 మార్చి వరకు).<br>నియమాల ప్రకారం రికవరీలను చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 అక్టోబరు). |

[7] మహబూబ్‌నగర్ జిల్లాలో వరదలవల్ల ప్రభావితమైన ఆలంపూర్ పుణ్య క్షేత్రంలో నీటి సరఫరా, పారిశుద్ధ్యంల ఇంటిగ్రేషన్ ప్రాజెక్టు: ₹10 కోట్లు, ఖర్చు : శూన్యం; కర్నూలు జిల్లాలో వరదలవల్ల ప్రభావితమైన మంత్రాలయం పుణ్య క్షేత్రంలో నీటి సరఫరా, పారిశుద్ధ్యంల ఇంటిగ్రేషన్ ప్రాజెక్టు : ₹10 కోట్లు, ఖర్చు : ₹6.40 కోట్లు; మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆవాసాల్లో 2009లో వచ్చిన వరదల వల్ల పాడయిన మౌలిక వసతుల పునరుద్ధరణ పనులు : ₹ 18 కోట్లు, ఖర్చు : ₹2.61 కోట్లు; మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలంలోని 19 ఆవాసాల్లో 2009లో వచ్చిన వరదల వల్ల పాడయిన మౌలిక వసతుల పునరుద్ధరణ పనులు : ₹ 8.77 కోట్లు; ఖర్చు : శూన్యం; కర్నూలు జిల్లాలోని 29 ఆవాసాల్లో 2009లో వచ్చిన వరదల వల్ల పాడయిన మౌలిక వసతుల పునరుద్ధరణ పనులు : ₹ 23 కోట్లు, ఖర్చు : ₹2.58 కోట్లు

| అతిక్రమణ | క్లుప్తంగా వివరాలు |
| --- | --- |
| సెంట్రల్ ఎక్సైజు సుంకం మినహాయింపు ప్రయోజనాన్ని వినియోగించు కోకపోవడం | జిల్లా కలెక్టరు నుండి ధృవీకరణ పత్రంలేని కారణంగా సెంట్రల్ ఎక్సైజు సుంకం మినహాయింపు[8] (సీఈడీ)ని పొందలేక పోయినందువల్ల తొమ్మిది పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లకు గ్రామీణ నీటి సరఫరా శాఖ 2009 మే - 2012 జూన్ మధ్య ₹93.49 లక్షలు రీ ఇంబర్స్ చేసింది. "మెదక్ జిల్లాలోని గజ్వేలు, నర్సాపూర్, రామాయంపేట, దొమ్మాట నియోజకవర్గాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం - మొదటిదశ" పనుల కాంట్రాక్టుకు సంబంధించి, సెంట్రల్ ఎక్సైజు శాఖకు ఎక్సైజు సుంకాన్ని చెల్లించిన రుజువులేమీ పొందకుండానే 2007 అక్టోబరు - 2011 మార్చి మధ్య ₹1.05 కోట్లు చెల్లించారు. ₹1.05 కోట్ల చెల్లింపునకు సంబంధించి, ఇన్వాయిస్, సెంట్రల్ ఎక్సైజు శాఖ ఇచ్చిన ధృవీకరణ పత్రం ఆధారంగా సీఈడీలో ముడి సరుకునకు సంబంధించిన మొత్తాన్ని మాత్రమే గ్రామీణ నీటిపారుదల శాఖ రీయింబర్స్ చేస్తున్నదని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). |
| బ్యాంకు గ్యారంటీల చెల్లుబాటును పునరుద్ధరించక పోవడం | ధరావతు, పనితీరు ధృవీకరణ పత్రాల కోసం కాంట్రాక్టర్లనుండి తీసుకున్న బ్యాంకు గ్యారంటీలు (బీజీలు) పనుల్లో లోపాలకు కాంట్రాక్టరే బాధ్యత వహించే కాలం (డిఫెక్ట్స్ లయబిలిటీ పీరియడ్) వరకు చెల్లుబాటులో ఉండాలి. ఒప్పందపు గడువును పొడిగించినపుడు బీజీ ల చెల్లుబాటు గడువుకూడా పొడిగించాలి. కాంట్రాక్టరు పనులను మధ్యంతరంగా నిలిపేస్తే బీజీ లను నగదుగా మార్చి సంబంధిత ప్రభుత్వ ఖాతాకు ఆ మొత్తాన్ని జమ చేయాలి.<br>ఆరు కేసులలో, ₹1.84 కోట్ల విలువగల బీజీలను పునరుద్ధరించ లేదు/నగదుగా మార్చి ప్రభుత్వ ఖాతాకు జమ చేయలేదు (2007 జూన్ - 2012 జూన్ మధ్యకాలంలో). |

## 5.7 పథకం అమలు/పనుల నిర్వహణ

2012 మార్చి నాటికి మొత్తం 538 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలను ప్రభుత్వం మంజూరు చేయగా వాటిలో 292 (54 శాతం) పథకాలను మాత్రమే చేపట్టారు. వీటిలో 56 పథకాలు పూర్తవగా, 236 పథకాల పనులు జరుగుతున్నాయి. నీటి పథకాల స్థితిని పక్కపటంలో చూపడం జరిగింది. మంజూరైన, పూర్తయిన పథకాల వివరాలు సంవత్సరాల వారీగా, ఆవాసాల వివరాలను గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇవ్వలేదు.




మచ్చుకు తనిఖీ చేసిన 66 పథకాలను మొత్తం ₹2120.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. వీటిలో పూర్తయి, నీటి సరఫరా చేస్తున్న 39 పథకాలపై ₹741.54 కోట్లు ఖర్చయ్యింది. మరో 7 పథకాలు ₹86.82 కోట్ల ఖర్చుతో పూర్తయినప్పటికీ వీటి కోసమే ప్రత్యేకించిన విద్యుత్ సరఫరా ఫీడర్ లైన్లు లేనందువల్ల, నీటిని తీసుకునే అనుమతి లేనందువల్ల, ఇతరత్రా కారణాలవల్ల ఈ పథకాల ద్వారా నీటి సరఫరా జరగడంలేదు. మరో 20 పథకాలు ₹655.33 కోట్లు ఖర్చయినప్పటికీ 2012 జూన్ నాటికి ఇంకా పూర్తి కాలేదు.

ఈ కింది ప్రధాన కారణాల వల్ల నీటి సరఫరా పథకాలు అసంపూర్ణంగా మిగిలిపోయాయని ఆడిట్‌లో గమనించడమైంది :

**(i)** పైపులను వేయడానికి అటవీ అనుమతులు లేకపోవడం

**(ii)** నీటిని తీసుకోడానికి నీటిపారుదల శాఖ నుండి అనుమతి పొందడంలో జాప్యం

**(iii)** భూసేకరణ జరగకపోవటం

[8] శుద్ధి చేయని నీటిని నిల్వ ఉంచే చోటుకు అంటే, ఫిల్టర్ బెడ్స్ వరకు తరలించడానికి అవసరమైన పైపులకు భారత ప్రభుత్వ సెంట్రల్ ఎక్సైజు శాఖ మంజూరు చేసిన మినహాయింపు

10 పథకాల అమలుకు సంబంధించి ఆడిట్‌లో కనుగొన్న ప్రధాన అంశాలను, ఇతర పథకాలకు సంబంధించి అన్నింట్లోనూ సాధారణంగా గమనించిన ఉమ్మడి అంశాలనూ ఈ కింద పేర్కొనడమైంది :

### 5.7.1 చందూరు, వర్ని, మరో 19 ఆవాసాల్లో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం

నాబార్డు-ఆర్ఐడీఎఫ్ (X) కింద 2005 మార్చిలో ప్రభుత్వం ఈ పథకాన్ని మంజూరు చేసింది. 2006 సెప్టెంబరులో ఈ పథకం కాంట్రాక్టును ₹8.64 కోట్లకు అప్పగించారు. పనులు పూర్తి చేయటానికి గడువు 12 నెలలుకాగా, దీనిని 2008 డిసెంబరు వరకు పొడిగించారు.

చందూరు రక్షిత నీటి సరఫరా పథకం కింద ₹2.23 కోట్ల విలువైన పనులను పూర్తి చేసిన తర్వాత భౌగోళిక పరిస్థితుల కారణంగా గ్రామీణ నీటి సరఫరా శాఖ 2007 మే లో పంపింగ్ మెయిన్ పైపుల స్పెసిఫికేషన్‌ను గ్లాస్ రీఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్ (జీఆర్‌పీ) నుండి డక్టైల్ ఐరన్ (డీఐ) కు మార్చగా, మార్కెట్‌లో డీఐ పైపులకు కొరత ఉందనే కారణంతో కాంట్రాక్టరు 2008 ఫిబ్రవరి నుండి పనులను నిలిపేసారు. దీనివల్ల గడువుకు ముందే ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ఈఎన్‌సీ నిర్ణయించారు (2008 ఏప్రిల్). మిగిలిన పనులను పూర్తి చేయడానికి ₹6 కోట్లకు ప్రత్యేక అంచనాను తయారుచేసి (2008 మే) ఆమోదం కోసం సూపరింటెండింగ్ ఇంజినీరు (ఎస్ఈ) కు పంపించారు. పని పూర్తి చేయడానికి 2012 జూన్ నాటికి తదుపరి చర్యలేవీ తీసుకోలేదు.

2009 డిసెంబరులో కాంట్రాక్టు రద్దు అయినప్పటికీ, కాంట్రాక్టును రద్దు చేయాలని నిర్ణయించిన రెండేళ్ల తర్వాత కొత్త పనులకు సంబంధించి అదే కాంట్రాక్టరుతో 2010 జూన్‌లో ₹29 లక్షలకు అనుబంధ ఒప్పందం కుదుర్చుకుని 2010 జూన్‌లోనే చెల్లింపులు కూడా చేసారు. ఈ అనుబంధ ఒప్పందం తాలుకు పనులు పంపిణీ లైన్లకు సంబంధించినవి. పంపింగ్ మెయిన్ పూర్తికాకపోతే పథకం ప్రారంభంకాదు. పంపింగ్ మెయిన్ పనులను ఇంకా చేపట్టనే లేదు. కాబట్టి అనుబంధ ఒప్పందం తాలుకు పనులు అత్యవసర క్యాటగిరీ కిందకు రావు. 2012 జూన్ నాటికి పనుల స్థితిని ఫోటోలు తెలియజేస్తున్నాయి.



రూడూరులో పంపులులేని పంపింగ్ కేంద్రం



నీటి రాకపోకలకు మార్గం లేకుండా ఉన్న సంపు

ఆడిట్‌లో కనుగొన్న అంశాలను ప్రభుత్వం అంగీకరించింది (2012 అక్టోబరు). మిగిలిన పనులను వివిధ గ్రాంట్ల కింది నిధులతో చేపడతామని, మౌలిక వసతులను వినియోగంలోనికి తీసుకువస్తామని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది.

### 5.7.2 న్యాల్కల్, మరో 52 ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం

ఈ పనిని పార్ట్-I, పార్ట్-II, పార్ట్-IబీI అనే భాగాలుగా 2004 సెప్టెంబరు, 2005 మార్చి, 2006 నవంబరులో మూడు వేరు-వేరు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా మంజూరు చేసారు. మంజూరీ ఉత్తర్వులు జారీ అయ్యాక ఏడాదినుండి రెండేళ్ల జాప్యంతో నాబార్డు, ఏఆర్‌డబ్ల్యూఎస్‌పీ మొదలైన వివిధ గ్రాంట్ల కింద, ₹19.53 కోట్ల మొత్తం కాంట్రాక్టు విలువకు ఈ పనులను వివిధ గుత్తేదారులకు అప్పగించారు. 2012 జూన్ నాటికి ఏ కాంట్రాక్టరూ పనులను పూర్తి చేయలేదు. ఈ పనులపై ₹16.28 కోట్లు ఖర్చయిన తర్వాత 2011 నవంబరు

నుండి పనులను నిలిపివేయడం జరిగింది. పనులను నిలిపివేయడానికి గల కారణాలు ఎక్కడా నమోదు చేయలేదు. గ్రావిటీ మెయిన్‌లో మిస్సింగ్ గ్యాప్‌లు, కాస్ట్ ఐరన్, గాల్వనైజ్డ్ ఐరన్ స్పెషల్స్‌తో పైపులైను కనెక్షన్లు, మైల్డ్ స్టీల్ పైపుల గ్యాప్‌లు - మిగిలిపోయిన పనుల్లో ఉన్నాయి. ఇంకా, ఓవర్ హెడ్ స్టోరేజి రిజర్వాయర్లు, సమ్మర్ స్టోరేజి ట్యాంకులు మొదలైన స్ట్రక్చర్ల చివరి దశ పనులు, పైపు లైన్ల టెస్టింగ్‌కూడా చేయకుండా మిగిలిపోయిన పనుల్లో ఉన్నాయి. ఈ పథకాన్ని పూర్తి చేయడానికి, నీటి సరఫరాను ప్రారంభించడానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. దీనివల్ల ఈ పనులపై చేసిన ₹16.28 కోట్ల ఖర్చు నిష్ఫలమయ్యింది. అంతేకాక, లక్షిత గ్రామాలకు రక్షిత తాగునీరు కల్పించాలని ఎప్పుడో 2004 లో తలపెట్టిన లక్ష్యం నెరవేరలేదు. 2012 జూన్ నాటికి పనుల స్థితిని కింది ఫోటోలు తెలియజేస్తున్నాయి.



*న్యాల్కల్ నీటి పథకం కింద నిర్మించిన సమ్మర్ స్టోరేజి ట్యాంకుకు నీరుగానీ, పంపులుగానీ లేని దృశ్యం*



*పార్ట్-IB పనులకు సంబంధించి నిర్మాణ స్థలంవద్ద కాలిపోయిన జీఆర్‌పీ పైపులు*

అంతేకాక, ఈ పనికోసం నిర్మాణ స్థలంలో పేర్చి ఉంచిన 2493 జీఆర్‌పీ పంపులలో ₹19.85 లక్షల విలువైన 40 పంపులు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఆ దృశ్యాన్ని పై ఫోటోలో చూడవచ్చు. 2007 మార్చిలో కొనుగోలు చేసిన ₹8.52 లక్షల విలువగల పంపుసెట్లు కూడా 2012 జూన్ నాటికి వృధాగా పడి ఉన్నాయి.

ఒప్పందపు షరతుల ప్రకారం, గడువులోపు పూర్తయిన పనులకు మాత్రమే ధరల్లో వ్యత్యాసాలను సర్దుబాటు చేయాలి. కానీ, పార్ట్-II పనులు ఒప్పందపు గడువులోపు పూర్తవకపోయినా, ఒప్పందపు షరతులకు విరుద్ధంగా జీఆర్‌పీ పైపుల ధరల్లో వ్యత్యాసం రూపేణా ₹28.27 లక్షలు చెల్లించడం ద్వారా కాంట్రాక్టరుకు అనుచిత లబ్ధి చేకూరింది.

ఆడిట్ లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం అంగీకరించింది (2012 అక్టోబరు). కాలిపోయిన పైపుల విలువను కాంట్రాక్టరు నుండి రికవరీ చేస్తామని హామీనిచ్చింది. కానీ, కాంట్రాక్టరుకు చేకూరిన అనుచిత లబ్ధి విషయాన్ని ప్రభుత్వం తన సమాధానంలో ప్రస్తావించలేదు.

### 5.7.3 క్రిష్ణగిరి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం-మొదటి, రెండవ, మూడవ దశలు

క్రిష్ణగిరి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాన్ని రాష్ట్ర స్థాయి సలహాసంఘం (ఎస్ఎల్ఏసీ) 2006 మార్చిలో ఆమోదించింది. ఈ పథకం కింద మొదటి, రెండో దశల్లో ₹18.50 కోట్ల అంచనా వ్యయంతో 25 ఆవాసాలకు, మూడో దశ కింద ₹13.50 కోట్ల ఖర్చుతో 31 ఆవాసాలకు మొత్తం మీద 56 ఆవాసాలకు నీటి సరఫరా కల్పించాలని మొదట అనుకున్నారు. ఆతర్వాత, నిధులు సరిపోని కారణంగా[9], మూడో దశ కింది 31 ఆవాసాల్లోని 15 ఆవాసాలను (ఇందులో 11 ఆవాసాలు రక్షిత నీటి వనరుల్లేనివి) తొలగించారు.

క్రిష్ణగిరి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం మొదటి, రెండో దశలు ₹14.68 కోట్ల ఖర్చుతో 2009 మే లో పూర్తయ్యాయి. ఈ పథకానికి గాజులదిన్నె ప్రాజెక్టునుండి నీటిని అందించాలని ప్రతిపాదించడం జరిగింది.

[9] స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ మారినందువల్ల, అధిక టెండరు ప్రీమియం, ముందుగా ఊహించని అంశాల చేరిక వల్ల

ఈ వనరునుండి రక్షిత నీటి సరఫరా పథకానికి నీటిని అందిస్తే 2900 ఎకరాల ఆయకట్టు నష్టపోతుందని పేర్కొంటూ నీటి పారుదల శాఖ ఈ ప్రతిపాదనను నిరాకరించింది (2009 మార్చి). ఫలితంగా ఈ నీటి సరఫరా పథకపు మొదటి, రెండో దశలు పూర్తయినప్పటికీ, వీటి నుండి నీటి సరఫరా ప్రారంభం కాలేదు.

క్రిష్ణగిరి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం మొదటి, రెండో దశలకు ప్రతిపాదిత నీటి వనరునుండి నీటిని తీసుకునే సౌలభ్యం లేదన్న అంశాన్ని విస్మరించి గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ 2008 జూలైలో ₹13.50 కోట్ల అంచనా వ్యయంతో మూడో దశను మంజూరుచేసి, 2010 ఫిబ్రవరిలో ఈ పనుల కాంట్రాక్టును అప్పగించింది. 2012 జూన్ నాటికి ఈ పనులపై ₹6.40 కోట్లు ఖర్చయ్యింది.

నీటిని తీసుకోడానికి అనుమతి వస్తుందన్న అంచనాతో పనులను చేపట్టామనీ, సవరించిన అంచనాను రూపొందించామనీ, సవరించిన అంచనావ్యయానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి పరిపాలనా అనుమతి రావలసి ఉందనీ గ్రామీణ నీటి సరఫరా డివిజను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తెలిపారు (2012 జూన్).

ఈ పథకాన్ని ప్రారంభించడానికి, దీనిపై పెట్టిన ఖర్చుకు తగిన ప్రతిఫలాన్ని పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

### 5.7.4 పాలేరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం మూడో దశ

పాలేరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం మొదటి దశ, రెండవ దశలను, పాలేరు రిజర్వాయరు నుండి నీటిని తీసుకుని ₹21.50 కోట్ల అంచనా వ్యయంతో 85 ఆవాసాలకు నీటిని సరఫరా చేయడానికి చేపట్టారు. వీటి పనులు పూర్తయి, 2008 ఆగస్టులోనూ, 2010 అక్టోబరులోనూ నీటి సరఫరా ప్రారంభమైంది. ఈ పథకం కింద మూడో దశను ₹7.50 కోట్ల అంచనా వ్యయంతో 15 ఆవాసాలకు నీటిని సరఫరా చేయడానికి డిజైనుచేసి 2007 అక్టోబరులో ఆమోదించారు. ఖమ్మం మున్సిపాలిటికి ఆనుకుని ఉన్న ఒక పెద్ద సాగునీటి చెరువు (లాకారం చెరువు) లో సమ్మర్ స్టోరేజి ట్యాంకును ఏర్పాటుచేసి దాన్ని ఈ మూడో దశకు అదనపు నీటి వనరుగా ప్రతిపాదించడం జరిగింది.

ఈ పథకం ₹5.47 కోట్ల ఖర్చుతో పూర్తయింది. 2011 మార్చిలో ప్రారంభమై, ఎనిమిది ఆవాసాలకు నీటి సరఫరా చేస్తోంది . ఐతే, చుట్టు పక్కల గ్రామాలనుండి, ఖమ్మం మునిసిపాలిటీ నుండి వచ్చే మురుగు నీరు లాకారం సమ్మర్ స్టోరేజి ట్యాంకు చుట్టూ ఉండటంవల్ల అందులోని నీరు తాగటానికి అనుకూలంగాలేదు కాబట్టి దీనిపై చేసిన ఖర్చంతా వృధా అయ్యింది. ఈ కింది ఫోటోలు ఆ దుస్థితిని తెలియజేస్తున్నాయి.



లాకారం సమ్మర్ స్టోరేజి ట్యాంకు లోపలి దృశ్యం



లాకారం సమ్మర్ స్టోరేజి ట్యాంకు చుట్టు పక్కల ఉన్న కలుషిత నీరు

డిజైన్లలోని ఈ ప్రధాన లోపాన్ని విజిలెన్సు మరియు నాణ్యత నియంత్రణ విభాగం చీఫ్ ఇంజనీరు 2010 అక్టోబరులో లేవనెత్తారు. మురుగునీటి కోసం భూగర్భంలో నిర్మించిన ట్యాంకు (లీచింగ్ సెస్‌పూల్), అంతర్గత గోతులు (ప్రైవీ పిట్స్) వల్ల కింది పొరలో నీరు కలుషితమవ్వడం, భూగర్భజలాల్లోకి కాలుష్యం చేరడం, బాక్టీరియాతోనూ, రసాయనాలతోనూ కలుషితమవ్వడం వల్ల లాకారం సమ్మర్ స్టోరేజి ట్యాంకు తాగునీటిని నిల్వ

ఉంచేందుకు పనికి రాదని పేర్కొన్నారు. అంతేకాక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూగర్భజలశాఖ 2008 డిసెంబరులో ఈ ప్రాంతంలో పరిశోధన జరిపి అక్కడి బోరుబావులు, పైకప్పులేని బావుల్లోని నీరు 'గృహావసరాలకు' మాత్రమే పనికి వస్తుంది తప్ప తాగటానికి పనికి రాదని తేల్చి చెప్పింది. ఆతర్వాత (2010 లో), రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ అంశానికి సంబంధించి అత్యున్నతస్థాయికల ప్రివెంటివ్ మెడిసిన్ సంస్థకూడా ఈ నీటిలో 'ఈ-కోలి' బాక్టీరియా ఉందనీ, ఈ-కోలి ఎమ్‌పీఎన్[10] సూచిక పరిమితికి మించి ఉందనీ ధృవీకరించింది. విజిలెన్సు-నాణ్యత నియంత్రణ విభాగం సీఈ 2010 డిసెంబరులో మరొకసారి ఈ స్థలాన్ని సందర్శించి ₹25 కోట్ల అంచనా విలువతో, మురుగునీటి పారుదలను మళ్లించడం, బహిరంగ మానవ విసర్జితాలను నిరోధించడం వంటి కొన్ని అదనపు చర్యలు చేపట్టాలని సిఫార్సు చేసారు.

అడ్డంగాగట్టు (క్రాస్ బండ్), కీ ట్రంచ్‌లను నిర్మించడం, ట్యాంకు అడుగు భాగాన బీసీ బ్లాంకెట్‌ను పరచడం, బార్బ్‌డ్ వైర్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, సమ్మర్ స్టోరేజి ట్యాంకు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టి, తాగేందుకు అనువుగా ఉందని నిర్ధారించుకోడానికి నీటిని రసాయనిక విశ్లేషణతో పరిశీలించి ఎనిమిది ఆవాసాలకు నీటిని సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). ఐతే, ఇప్పటికీ మొత్తం 15 ఆవాసాలకూ నీటి సరఫరా జరగడం లేదనేది వాస్తవం. అంతేకాక, రసాయనిక విశ్లేషణానివేదికలేని కారణంగా ఎనిమిది ఆవాసాలకు సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను ఆడిట్‌లో నిర్ధారించు కోవడం సాధ్యం కాలేదు.

### 5.7.5 జేసీ నాగిరెడ్డి తాగునీటి సరఫరా పథకం

హడ్కో, రాష్ట్ర ప్రణాళికా నిధులతో అనంతపురం జిల్లాలోని 3 పురపాలక సంఘాలు, 514 ఆవాసాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి దశల వారీగా (మొదటి దశ : కాంట్రాక్టు అంచనా విలువ ₹148 కోట్లు, 2006 మే; రెండు, మూడవ దశలు : ₹170 కోట్లు, 2007 జూన్; నాలుగవ దశ : ₹190 కోట్లు, 2009 ఫిబ్రవరి) మంజూరీనిచ్చింది.

ఈ పథకానికి గండికోట రిజర్వాయరునుండి నీటిని తీసుకోవాలి. గండికోట రిజర్వాయరుకు అవుకు రిజర్వాయరు నుండి సొరంగం ద్వారా నీటిని తీసుకుంటారు. సొరంగం పనిని నీటిపారుదల శాఖ నిర్వహిస్తోంది. 2009 అక్టోబరు నాటికి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, 2012 జూన్ నాటికి కూడా దీని నిర్మాణం పూర్తి కాలేదు.

పక్క ఫోటోలో 2012 జూన్ నాటికి గండికోట రిజర్వాయరు వద్ద జరుగుతున్న పనుల స్థితిని చూస్తే పనులు పూర్తవడానికి చాలా సమయం పడుతుందని స్పష్టమవుతోంది.

నీటి పారుదల శాఖ చేస్తున్న సొరంగపు పనుల పురోగతిని నిర్ధారించుకోకుండానే నాలుగో దశ పంపిణీ లైన్ల పనులను అప్పగించారు (2010 జనవరి).



*గండికోట రిజర్వాయరు వద్ద సొరంగం పని కొనసాగుతున్న దృశ్యం*

రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల లక్షిత 514 ఆవాసాల్లో ఏ ఒక్కదానికీ 2012 జూన్ నాటికి తాగునీటి సరఫరా జరగలేదు. అంతేకాక, నాలుగు దశల్లోని ఈ పనులపై చేసిన ₹287.82 కోట్ల ఖర్చు ఇప్పటి వరకూ నిష్ఫలంగా ఉంది.

[10] మోస్ట్ ప్రాబబుల్ నంబర్ : (అధిక సంభావ్యతా సంఖ్య)

నీటిపారుదల శాఖ చేపట్టిన సొరంగం పనుల షెడ్యూల్ ఆధారంగా మొత్తం 514 ఆవాసాలకు నీటిని విడుదల చేయాలనే ఉద్దేశంతో ఈ పథకపు నాలుగో దశ పనులను చేపట్టామని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). సొరంగం పనుల వాస్తవ పురోగతిని ఈ పథకపు పనుల కాంట్రాక్టును అప్పగించడానికి ముందే నిర్ధారించుకొని ఉండాలి కాబట్టి, ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

2003 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల[11] ప్రకారం, సముచితమైన సమర్ధనలేనిదే అంచనాల్లో గంపగుత్త కేటాయింపులను చేయకూడదు. కానీ, మొదటి దశ పనుల అంచనా (2007 ఫిబ్రవరి)లో రోజుకు 37 మిలియన్ లీటర్ల (ఎమ్ఎల్‌డీ) సామర్థ్యంతో పనిచేసే ర్యాపిడ్ స్యాండ్ ఫిల్టర్ (ఆర్ఎస్ఎఫ్) నిర్మాణానికి ₹5 కోట్లను గంపగుత్తగా కేటాయించారు. ఎస్ఎస్ఆర్‌లలో మార్పు వల్ల, అధిక రేట్లకు 2009 మార్చిలో ఈ పనుల కాంట్రాక్టును అప్పగించారు. దీనివల్ల పని విలువ ₹2.47 కోట్లమేర పెరిగింది. స్థలం లభ్యం కాకపోవడం, ఆర్ఎస్ఎఫ్ డిజైన్లను రూపొందించక పోవడం వల్ల, పనుల్లోని ఇతర అంశాలను పూర్తి చేయడంలో జాప్యాన్ని నివారించడం కోసం గంపగుత్త కేటాయింపులు చేయడమైందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). పని ప్రారంభించే ముందే స్థల లభ్యతను నిర్ధారించు కోవడం, డిజైన్లను రూపొందించుకోవటం జరగాలి. పైన పేర్కొన్న ప్రకారం, ఈ పథకం కింది ఇతర అంశాల పనులు కూడా పూర్తవలేదు. కాబట్టి, ప్రభుత్వ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

### 5.7.6 వట్టినాగులపల్లి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ప్రారంభం కాకపోవడం

నీటి సరఫరా పాక్షికంగా మాత్రమే ఉన్న నాలుగు ఆవాసాల కోసం 2009 జనవరి నాటికి పూర్తవ్వాలని నిర్దేశిస్తూ ₹2.50 కోట్ల అంచనా విలువతో 2007 జనవరిలో ఈ పథకాన్ని మంజూరు చేసారు. 2010 ఆగస్టు నాటికి ₹1.33 కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2012 జూన్ నాటికి ఈ పథకం ప్రారంభం కాలేదు.



వట్టినాగులపల్లి నీటి సరఫరా పథకం నుండి ఉస్మాన్‌సాగర్ జలాశయం ప్రహరీగోడ వరకు వేసిన పైపులైను ఆ జలాశయంతో అనుసంధానం పూర్తికాని దృశ్యం

ఉస్మాన్‌సాగర్ జలాశయం ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదిత నీటి వనరు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఈ జలాశయం నుండే నీటిని సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల సంస్థ[12] ద్వారా 2004 నవంబరులో సాధ్యాసాధ్యాల అధ్యయనం చేసిన తర్వాత ఉస్మాన్‌సాగర్ జలాశయం నుండి నీటిని తీసుకోడానికి 2007 జూన్‌లో ఆ సంస్థను అనుమతి కోరడమైంది. ఇందుకోసం జమచేయాల్సిన మొత్తంలో కొంతభాగాన్ని (₹32 లక్షలు) 2009 నవంబరులో జమచేసారు.

ఐతే, హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ నుండి అనుమతి రాకముందే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ టెండర్ల ప్రక్రియను చేపట్టి 2008 జూన్-జూలైలో పైపులైన్లను వేసే పనులకు కాంట్రాక్టును అప్పగించింది. స్వచ్ఛమైన తాగునీటిని విడుదల చేయడానికి ₹2.36 కోట్ల అదనపు మొత్తాన్ని చెల్లించమని హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ 2011 ఆగస్టులో డిమాండు నోటీసు పంపింది. ఈ మొత్తాన్ని 2012 జూన్ నాటికి జమచేయలేదు. ఫలితంగా, ఈ పథకంపై చేసిన ₹1.33 కోట్ల ఖర్చు ఇంకా నిష్ఫలంగానే ఉంది. ఆడిట్ లేవనెత్తిన అంశాన్ని అంగీకరించి, అవసరమైన నిధులను సమకూర్చడం ద్వారా లక్షిత ఆవాసాలకు తాగునీటిని సరఫరా చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

[11] నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి (ఐడబ్ల్యూసీడీ) శాఖ జారీ చేసిన 2003 జూలై 1 వ తేదీ నాటి జీఓ ఎమ్ఎస్ నంబరు 94

[12] హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ

### 5.7.7 పుల్లల చెరువు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకానికి విద్యుత్తు సరఫరా చేయకపోవటం

2009 జూన్ నాటికి 44 ఆవాసాలకు నీటి సరఫరా జరిగేలా నిర్దేశిస్తూ ₹16.90 కోట్ల అంచనా విలువతో పుల్లల చెరువు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 2007 జనవరిలో మంజూరీనిచ్చింది. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద 12 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలకు 2006 నవంబరులో నాబార్డు ఇచ్చిన అనుమతి ఆధారంగా ఈ మంజూరీనివ్వడమైంది.

ఈ పనులకు మొత్తం మూడుసార్లు 2007 నవంబరు, 2007 డిసెంబరు, మళ్ళీ 2008 ఏప్రిల్‌లో టెండర్లు పిలిచారు. టెండర్లను మొదటిసారి పిలిచినప్పుడు ఒక్క బిడ్డరుకూడా రాలేదు. రెండవసారి పిలిచిన టెండర్లలో అతి తక్కువ మొత్తానికి ఈ బిడ్ దాఖలు చేసిన గుత్తేదారు తాను చేస్తున్న "తనక్కల్ సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం" పనుల పరిస్థితిని బిడ్ దాఖలు చేసినప్పుడు తెలపని కారణంగా ఆ బిడ్‌ను తిరస్కరించారు. ఈ పథకాన్ని కూడా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం శాఖయే అమలు చేస్తుంది కాబట్టి, ఆ శాఖ తనంతట తాను సులభంగా ఈ విషయాన్ని నిర్ధారించుకోవచ్చు. కనుక, ఈ కారణంతో బిడ్‌ను తిరస్కరించడం సరికాదు. రెండోసారి పిలిచిన టెండర్లలో బిడ్‌ను తిరస్కరించి, మూడోసారి పిలిచిన టెండర్లలో మళ్ళీ అదే గుత్తేదారు (శ్రీ ఏవీ రామ్‌బాబు)కు కాంట్రాక్టును అప్పగించడం (2008 జూన్) వల్ల ₹1.26 కోట్ల[13] అదనపు భారం పడింది.

₹11.77 కోట్ల ఖర్చుతో 2010 మే లో ఈ పథకం పూర్తయ్యింది. కానీ, విద్యుత్తు సరఫరాలేని కారణంగా 2012 జూన్ నాటికి ఈ పథకం ద్వారా నీటి సరఫరా ప్రారంభం కాలేదు. విద్యుత్తు సరఫరా గురించి మొదటి అంచనా లోనే కేటాయింపు ఉన్నప్పటికీ నిధుల కొరతవల్ల 2010 సెప్టెంబరులో మాత్రమే కనెక్షన్ కోసం డిపాజిట్‌ను చెల్లించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సివిల్ పనులకే పూర్తిగా ఖర్చయ్యాయి. దీనివల్ల ముఖ్యమైన ఇతర ఆవశ్యక అంశాలు/చెల్లింపులకు (విద్యుత్తు సరఫరా, పంపుసెట్లు, బీమా కవరేజి, నిర్వహణ పనులు, పన్నులు మొదలైన వాటికి) నిధుల కొరత ఏర్పడింది.

పంపుసెట్ల కొనుగోలుకు సంబంధించిన ఉప-అంచనాను 2010 జనవరిలో సూపరింటెండింగ్ ఇంజినీరుకు సమర్పించగా 2011మే లో (సుమారు 17 నెలల తర్వాత) మాత్రమే టెండర్లను ఖరారు చేసారు. ఈ జాప్యానికి గల కారణాలేవీ రికార్డుల్లో లేవు. స్థల పరిస్థితుల ఆధారంగా కొన్ని రిజర్వాయర్ల నిర్మాణ స్థలాన్ని మార్చడం, దీనివల్ల పంపుసెట్ల డిజైన్లు ఆలస్యం కావడం, ఫలితంగా, పంపుసెట్ల కొనుగోలుకు టెండర్ల ప్రక్రియలో జాప్యం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). పనులను అప్పగించడానికి ముందు సరైన సర్వే/ఇన్వెస్టిగేషన్ జరగలేదని దీనివలన స్పష్టమవుతోంది.

### 5.7.8 వెంకటాపురం, మరో ఎనిమిది ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం

లక్షిత ఆవాసాల్లో ఫ్లోరోసిస్‌ను నియంత్రించడానికి, నీటిలో ఉప్పదనాన్ని తగ్గించేందుకు 2004 జూన్‌లో ఈ పథకాన్ని చేపట్టారు. ఇందు కోసం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోని కాకతీయ కాలువ 253 కి.మీ. వద్ద నీటిని తీసుకోవాలని తలపెట్టారు. దీని కోసం నీటి పారుదల-ఆయకట్టు అభివృద్ధి శాఖ స్లూయిస్‌ను నిర్మించడానికి ఆ శాఖ వద్ద ₹70 లక్షలు జమ చేయాలి.

తగిన మొత్తాన్ని జమ చేయకుండానూ, నీటిని తీసుకోడానికి అనుమతి పొందకుండానూ సమ్మర్ స్టోరేజి ట్యాంకు, స్లో స్యాండ్ ఫిల్టరు బెడ్స్, స్వచ్ఛమైన నీటి కోసం సంపు, పంపింగ్ కేంద్రం, 60 కి.లీ. ఓహెచ్‌బీఆర్, పంపింగ్, గ్రావిటీ మెయిన్‌లు వంటి అనుబంధ పనులకు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ కాంట్రాక్టులను

[13] ₹14.82 కోట్లు (రెండవ దశ కాంట్రాక్టు అంచనా విలువ) x 8.5 శాతం ( మూడో పిలుపులో ఈసీవీ కన్నా అధికంగా కోట్ చేసిన 13.39 శాతం - రెండో పిలుపులో ఈసీవీ కన్నా అధికంగా కోట్ చేసిన 4.89 శాతం)

అప్పగించింది. ఈ పనులు 2007 ఫిబ్రవరి నాటికి పూర్తయ్యాయి. కానీ, నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ నుండి అనుమతి రాని కారణంగా ఇవి వినియోగంలోకి రాలేదు. ఫలితంగా, వీటిపై 2012 జూన్ నాటికి చేసిన ₹4.33 కోట్ల ఖర్చు ఇంకా నిష్ఫలంగానే ఉంది.

నీటిని తీసుకునే విషయంలో సమస్య పరిష్కారం కోసం'ఆఫ్ టేక్' ను నిర్మించాలని ప్రతిపాదించడం జరిగిందనీ, దీనికి సంబంధించిన అంచనాలు నీటి పారుదల-ఆయకట్టు అభివృద్ధి శాఖ నుండి రావలసి ఉందనీ, ఈ పని కోసం ₹2 కోట్లు మంజూరయ్యాయనీ, నీటి పారుదల-ఆయకట్టు అభివృద్ధి శాఖ నుండి అంచనాలు వచ్చిన తర్వాత అవసరమైన మొత్తాన్ని ఆ శాఖ వద్ద జమ చేయడం జరుగుతుందనీ ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

### 5.7.9 కురిచేడు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ప్రారంభం కాకపోవడం

ప్రకాశం జిల్లా, పొదిలి డివిజనులోని కురిచేడు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ₹10 కోట్ల అంచనా వ్యయంతో 24 ఆవాసాలకు నీటి వసతి కల్పించాలి. ఇది 2010 జనవరి నాటికి పూర్తవ్వాలి. ఐతే, ₹6.79 కోట్ల ఖర్చుతో ఈ పథకం పూర్తయినప్పటికీ విద్యుత్తు సరఫరా లేకపోవడం, అటవీ శాఖ, రైల్వేల నుండి పైపులైన్లు వేసేందుకు అనుమతి రాకపోవడం వల్ల 2012 జూన్ నాటికి నీటి సరఫరా ప్రారంభం కాలేదు.

ఈ పథకం ప్రారంభమైందని, 12 ఆవాసాలకు నీటి సరఫరా జరుగుతోందని, మిగిలిన ఆవాసాలకు నీటి సరఫరా చేయడానికి పైపులైన్లు వేసేందుకు 2011 అక్టోబరులో అటవీ శాఖ అనుమతినిచ్చిందని, రైల్వేల నుండి అనుమతి రావలసి ఉందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

### 5.7.10 కొత్తపల్లి పట్టణానికి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం

కరీంనగర్ జిల్లాలో రక్షిత తాగునీటి వనరుల్లేని కొత్తపల్లి పట్టణానికి ఆ సౌకర్యాన్ని కల్పించాలనే లక్ష్యంతో 2004 జూన్‌లో ఈ పథకం పనులను చేపట్టారు. 2003 జూలైలో సర్వే నిర్వహించి, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కాలువను ప్రధాన నీటి వనరుగా తీసుకొని, ఆ నీటిని సాగునీటి ట్యాంకుగా ఉన్న ఊరచెరువులో నింపడం ద్వారా దాన్ని సమ్మర్ స్టోరేజి ట్యాంకుగా మార్చాలని నిర్ణయించారు. ఐతే, కెనాల్ నిర్వహణ కోసం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు అధికారులు నీటి సరఫరాను నిలిపివేసే సమయాన్ని 120 నుండి 180 రోజులకు పెంచడంవల్ల గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు ఆ చెరువులో ఒక మూతలేని బావిని తవ్వి పాత పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసారు.

ఐతే, అప్పటికే (2007 డిసెంబరు) కాంట్రాక్టరు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు చైనేజి 139/400 వద్ద ₹61.41 లక్షల విలువైన హెడ్ వర్క్స్ పనులు (కెనాల్ వద్ద 'ఆఫ్‌టేక్ స్లూయిస్' పంపింగ్ మెయిన్స్, కాపలాదారు నివాసం, పంపింగ్ కేంద్రం మొదలైనవాటి నిర్మాణం) పూర్తి చేసారు. మూతలేని బావిని ప్రత్యామ్నాయ నీటి వనరుగా వినియోగిస్తున్నామని ప్రభుత్వం అంగీకరించింది (2012 అక్టోబరు). నీటిపారుదల శాఖ వరుసగా 240 రోజుల పాటు నీటిని విడుదల చేయకపోవడమే ఇందుకు కారణమని తెలిపింది.

ఆ విధంగా, నిరాటంకంగా నీటిని అందించే వనరును గుర్తించడానికి గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు సర్వేను సరిగా చేయకపోవడంవల్ల 2012 జూన్ నాటికీ ఈ నీటి పథకం వినియోగంలోకి రాలేదు. కనుక, వీటిపై చేసిన ₹61.41 లక్షల ఖర్చు వృధా అయ్యింది. పూర్తయిన అంశాలు నిరుపయోగంగా ఉన్న వైనం ఈ కింది ఫోటోలలో చూపడమైంది.



శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కాలువ (ప్రధాన వనరు) వద్ద నిరుపయోగంగా ఉన్న స్లూయిస్, పంపింగ్ కేంద్రం




ప్రధాన వనరు అయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కాలువను కాకుండా నీటి సరఫరా కోసం మూతలేని బావిని వినియోగించుకుంటున్న దృశ్యం

## 5.7.11 ఇతర పనుల నిర్వహణలో జాప్యం

ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన 66 నీటి పథకాలకుగానూ 2012 జూన్ నాటికి పూర్తయ్యి, నీటిని సరఫరా చేస్తున్నవి 39. మరో 7 పథకాలు పూర్తయినప్పటికీ, నీటి సరఫరా ప్రారంభం కాలేదు. ఇందులో, నీటిపారుదల శాఖ నుండి అనుమతి రాని కారణంగా ప్రారంభం కానివి 4, విద్యుత్తు సరఫరా లేని కారణంగా మొదలుకానివి 3 ఉన్నాయి. ఈ పథకాల అంచనా విలువ ₹103.5 కోట్లు కాగా వీటిపై వాస్తవంగా ₹86.82 కోట్లు ఖర్చు అయ్యింది. ఈ పథకాల కింద లక్షిత ఆవాసాలన్నింటికీ నీటి సరఫరా జరగనందువల్ల అంచనా విలువ కన్నా అధిక ఖర్చు జరగలేదు. ఆ వైనాన్ని ఈ కింది చార్టులో చూపడమైంది.

ప్రారంభమైన 39 పథకాల ద్వారా నీటి సరఫరా జరగాల్సిన ఆవాసాల సంఖ్య 2975 కాగా, కేవలం 1280 (43 శాతం) ఆవాసాలకు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. అంటే, లక్షిత ఆవాసాలలో 1695 ఆవాసాలకు నీటి సరఫరా జరగటం లేదు. మొత్తం 39 పథకాల్లోనూ పనులు పూర్తవటానికి జాప్యం జరిగింది. ఈ జాప్యం ఒక నెల (సూళ్ళూరు పేట సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం) నుండి 36 నెలలు (ఇందుకూరుపేట సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం) వరకూ ఉంది.




పనులు ఇంకా జరుగుతున్న 20 పథకాల[14] వివరాలు, అవి పూర్తికాకపోవడానికి గల కారణాలను ఈ కింది పట్టికలో తెలపడమైంది :

పట్టిక 5.4

| క్రమ సంఖ్య | పని పేరు | ఆమోదించిన విలువ (₹ కోట్లలో) | పూర్తవడానికి గడువు | జాప్యానికి కారణాలు | ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|
| 1 | సీఎస్ పురం, ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 12.00 | 2010 జూన్ | ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని క్లియర్ చేయక పోవడం, రహదార్లు - భవనాల శాఖ నుండి అనుమతి రాకపోవడం | 73.47 |
| 2 | వెలిగండ్ల, పామూరు మండలాల్లో రక్షిత నీటి వనరులు లేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 30.00 | | | |

14 నాలుగు నీటి పథకాల గురించి ముందు పేరాలలో (పేరాల నంబర్లు 5.7.1, 5.7.2, 5.7.5, 5.7.8) చర్చించడమైంది

| క్రమ సంఖ్య | పని పేరు | ఆమోదించిన విలువ (₹ కోట్లలో) | పూర్తవడానికి గడువు | జాప్యానికి కారణాలు | ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|
| 3 | పామూరు, వెలిగండ్ల, పీసీ పల్లి, సీఎస్ పురం మండలాల్లో నాణ్యమైన నీటి సరఫరా లేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 49.00 | | | |
| 4 | హుస్నాబాద్, చిగురు మామిడి (రక్షిత నీటి వనరులు లేనివి) | 15.00 | 2009 నవంబరు | అంచనాల తయారీలోనూ, పనుల అప్పగింతలోనూ జాప్యం, భూసేకరణ జరగకపోవడం, ఓహెచ్‌బీఆర్ నిర్మాణానికి రాజీ వ్ స్వగృహ అధికారుల నుండి అభ్యంతరాలు, రోడ్లు - భవనాల శాఖ నుండి అనుమతి పొందడంలో జాప్యం, గుత్తేదారు పని మొదలుపెట్టడంలో జాప్యం | 13.14 |
| 5 | గంభీరావుపేట, ముస్తాబాద్ (రక్షిత నీటి వనరులు లేనివి) | 15.00 | 2010 మే | పైపులైన్లు వేయడానికి అటవీ అనుమతులు రాకపోవడం | 27.12 |
| 6 | రామడుగు, అంబరిపేట, కొడిమ్యాల్, లింగాపూర్, బోయినపల్లి (రక్షిత నీటి వనరులు లేనివి) | 32.6 | | | |
| 7 | పరకాల, ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 9.00 | 2010 అక్టోబరు | నీటిని తీసుకోడానికి నీటిపారుదల శాఖ నుండి అనుమతి రాకపోవడం, కొన్ని హెడ్‌వర్క్స్ నిర్మాణానికి భూసేకరణ సమస్యలు | 4.83 |
| 8 | వరంగల్ జిల్లాలో ఎత్తిపోతల పథకం (దేవాదుల) తో తాగునీటి సరఫరా పథకం అనుసంధానత | 125.00 | 2011 సెప్టెంబరు | ప్రాజెక్టు డిజైన్లను మరోసారి సర్వే చేయడం వల్ల జాప్యం, నీటిని తీసుకోడానికి అనుమతి పొందడంలో జాప్యం, పైపులైన్లు వేయడానికి స్థానికులు, స్థానిక సంస్థల నుండి అభ్యంతరం, పంపింగ్ మెయిన్స్ పూర్తి కాకపోవడం | 87.55 |
| 9 | వెలుగోడు బ్యాలన్సింగ్ రిజర్వాయరు నుండి ఎర్రగూడూరు, ఇతర ఆవాసాలకు పైపులైను వేయడం | 8.00 | 2012 ఆగస్టు, 2012 అక్టోబరు | పైపులు వేయడానికి అటవీ అనుమతులు రాకపోవడం, నీటిని తీసుకోడానికి నీటి పారుదల శాఖ అనుమతి రాకపోవడం | 0.00 |
| 10 | కామారెడ్డి, మరో 281 గ్రామాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 140.00 | 2010 జనవరి | పైపులైన్లు వేసేందుకు జాతీయ రహదార్ల అధికారులు, అటవీశాఖ అధికారుల నుండి అనుమతులు రాకపోవడం, గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడం | 114.50 |
| 11 | మెదక్ జిల్లా నర్సాపూర్, కొడిపల్లి, కుల్చారం, హత్నూరు మండలాల్లోని నీటి వసతి లేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 18.00 | 2012 ఏప్రిల్ | పైపులైన్లు వేయడానికి, ఓహెచ్‌బీఆర్‌లు నిర్మించడానికి అటవీ శాఖ అనుమతులు రాకపోవడం, పైపులైన్లు వేయడానికి కొంతమంది రైతులు అభ్యంతరాలు లేవనెత్తడం మొదలైనవి | 2.98 |
| 12 | మెదక్ జిల్లా గజ్వేల్, ములుగు, వర్గల్, తూప్రాన్ మండలాల్లోని నీటి వసతి లేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 9.00 | 2012 ఏప్రిల్ | పంటల సమయంలో పైపులైన్లు వేసేందుకు రైతుల అభ్యంతరాలు, తెలంగాణ ఉద్యమం వల్ల అవసరమైన మేరకు కూలీలు దొరక్క పోవడం | 1.24 |

| క్రమ సంఖ్య | పని పేరు | ఆమోదించిన విలువ (₹ కోట్లలో) | పూర్తవడానికి గడువు | జాప్యానికి కారణాలు | ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|
| 13 | మెదక్ జిల్లా చేగుంట, దౌలతాబాద్ మండలాల్లో నీటి వసతి లేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 15.00 | 2012 ఏప్రిల్ | పైపులైన్లు వేసేందుకు జాతీయ రహదార్ల అధికారులు, అటవీశాఖ అధికారుల నుండి అనుమతులు రాకపోవడం, ఒకే గుత్తేదారుకు ఏడు పనులను అప్పగించడం, ఇతర ఆవాసాలకు నిధుల మళ్ళింపు, తెలంగాణ ఉద్యమాలను జాప్యానికి కారణాలుగా డిపార్టుమెంటు పేర్కొంది | 3.82 |
| 14 | రాపూరు, ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 10.00 | 2009 సెప్టెంబరు | పైపులైన్లు వేయడానికి అటవీ అనుమతులు రాకపోవడం | 8.26 |
| 15 | జలదంకి, మరో 28 ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 6.00 | 2009 జూన్ | డిజైన్ల మార్పు కారణంగా సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి 75 శాతానికి మించి నిధులు ఖర్చుయిపోవడం వల్ల నిధుల లేమి | 6.72 |
| 16 | అల్లూరు, ఇసకపల్లి, మరో 47 ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | 5.00 | 2008 మార్చి | సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణాన్ని మొదలుపెట్టడంలోని జాప్యం కారణంగా కాంట్రాక్టరు పనిని మధ్యంతరంగా నిలిపివేయడం; ఫలితంగా, అంచనాలను సవరించాల్సి రావడం | 1.05 |
| | మొత్తం | 498.60 | | | 344.68 |

*మూలం: మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్ల రికార్డులు*

క్రమసంఖ్యలు 1,2,3,7,9 లలో పేర్కొన్న నీటి సరఫరా పథకాలు ప్రారంభమయ్యాయని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). ఐతే, ఎన్ని ఆవాసాలకు నీటి వసతి కల్పించారనే వివరాలను తెలపలేదు. క్రమసంఖ్యలు 4,5,6,8,10,11,12,13,14,15,16 లలో పేర్కొన్న పథకాలకు కావలసిన అనుమతులు పొంది, నిధులను కల్పించి వాటిని 2013 జనవరి/మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీనిచ్చారు. క్రమసంఖ్య 14 లో పేర్కొన్న పథకం ద్వారా లక్షిత 47 ఆవాసాలకుగానూ 15 ఆవాసాలకు నీటిని విడుదల చేయడమైందని, అటవీ శాఖ అనుమతులు వచ్చాక మిగిలిన ఆవాసాలకు నీటి సరఫరా చేయడానికి పనులు చేపడతామని కూడా ప్రభుత్వం తెలిపింది.

వివిధ అధికారిక సంస్థల నుండి అనుమతులు రాకపోవడంవల్ల, భూసేకరణ జరగకపోవడం, విద్యుత్తు సరఫరా లేకపోవడం వంటి కారణాల వల్ల పై పట్టికలో పేర్కొన్న 16 పథకాలు పూర్తవటం/ప్రారంభమవడంలో విపరీతమైన జాప్యం జరిగింది. ఫలితంగా, 1983 ఆవాసాలకు తాగునీటి సౌకర్యం కలగకుండా, వీటిపై చేసిన ₹344.68 కోట్లు నిష్ఫలంగా మిగిలింది.

## 5.7.12 టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణ

### *5.7.12.1 తొలిపిలుపులోనే సింగిల్ బిడ్ ఆమోదం*

ప్రభుత్వం 2003 లో జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం, మొదటిసారి టెండర్లను పిలిచినప్పుడు అధిక ధరకు కోట్ చేసిన ఒకే ఒక్క బిడ్ వస్తే సంబంధిత ప్రభుత్వ శాఖ దాన్ని ఆమోదించకుండా, రెండోసారి టెండర్లు పిలవాలి. రెండో పిలుపులోనూ స్పందన సరిగా లేకపోతే, సంబంధిత ప్రభుత్వ శాఖ ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, ప్రభుత్వం నామినేట్ చేసిన సంస్థలకు అంచనా ధరలకు పనులప్పగించాలి.

ఏడు జిల్లాల్లో సంబంధిత డివిజన్లు నిర్వహించిన 22 పనుల తాలూకు రికార్డుల తనిఖీలో ఈ కేసులన్నింటిలోనూ మొదటి పిలుపులోనే, అధిక ధరలను కోట్ చేసిన ఏకైక బిడ్‌లను ఆమోదించి మొత్తం ₹620.60 కోట్ల అంచనా విలువగల కాంట్రాక్టులను అప్పగించినట్లు వెల్లడైంది.

ఆచరణలో ఉన్న విధానాల మేరకు (ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా, 5 శాతం ప్రీమియం పరిమితికి లోబడి) టెండర్లను ఖరారు చేయడమైందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). ఐతే, పైన పేర్కొన్న కేసులు అన్నింటిలోనూ టెండరు ప్రీమియం 5 శాతం కంటే ఎక్కువగా ఉన్నందున, రెండోసారి టెండర్లను పిలవాల్సింది. కనుక, ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

### *5.7.12.2 బిడ్ చెల్లుబాటు గడువులోపు గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకోకపోవడం*

'కోట, ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం' పనులకు 2007 ఫిబ్రవరి 9న టెండర్లు పిలిచారు. బిడ్లు చెల్లుబాటయ్యే గడువు 90 రోజులు (2007 జూన్ 7). నెల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రికార్డులను తనిఖీ చేయగా, శ్రీ కెఎల్ శ్రీధర్‌రెడ్డి అనే గుత్తేదారు దాఖలు చేసిన బిడ్‌ను మూల్యాంకన కమిటీ 2007 మే 24 (79వ రోజు) నాడు ఆమోదించగా, నెల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ ఒప్పందం కుదుర్చుకోడానికి 2007 జూన్ 27వ తేదీన అంటే 110 వ రోజున గుత్తేదారును పిలిచారు. కానీ అప్పటికే బిడ్ చెల్లుబాటు గడువు ముగియడంతో ఒప్పందం కుదుర్చుకోడానికి గుత్తేదారు అంగీకరించకపోవడంతో (2007 ఆగస్టు 21) గ్రామీణ నీటి సరఫరా శాఖ 2008 మార్చిలో మళ్లీ తాజాగా టెండర్లను పిలిచింది. శ్రీ కెఎల్ శ్రీధర్‌రెడ్డి అనే గుత్తేదారు రెండోసారి పిలిచిన టెండర్లలో కూడా బిడ్ దాఖలు చేయగా 2008 సెప్టెంబరులో ₹5.55 కోట్ల కాంట్రాక్టు విలువకు ఆ గుత్తేదారుకు పనులను అప్పగించారు. పనుల అంచనా విలువ ₹4.88 కోట్ల కంటే ఇది 13.70 శాతం (మొత్తంమీద) అధికం. మొదటిసారి పిలిచిన టెండర్లకు ఈ గుత్తేదారు వేసిన బిడ్ విలువ ₹3.10 కోట్లు మాత్రమే.

బిడ్ చెల్లుబాటు గడువులోపు ఒప్పందాన్ని ఖరారు చేయడంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ వైఫల్యం వల్ల ప్రభుత్వ ఖజానాపై ₹2.45 కోట్ల అదనపు భారం పడింది.

ఆడిట్ వ్యాఖ్యను ప్రభుత్వం అంగీకరించి (2012 అక్టోబరు), బాధ్యులను గుర్తించి చర్యలు చేపడతామని హామీనిచ్చింది.

### *5.7.12.3 గుత్తేదార్లకు అధిక చెల్లింపులు/అనుచిత లబ్ధి*

మచ్చుకు తనిఖీ చేసిన నీటి సరఫరా పథకాల పనుల బిల్లులను పరిశీలించగా పలు కేసులలో గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య శాఖ గుత్తేదార్లకు అనుచిత లబ్ధిని చేకూర్చిందని వెల్లడైంది. వివరాలను ఈ కింద తెలపడమైంది :

- ప్రభుత్వం 2006 జూలైలో జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం, స్టీలు, సిమెంటు, బిటుమెన్, పెట్రోలు, ఆయిల్, లూబ్రికెంట్లకు మాత్రమే ధరల్లో వ్యత్యాసాన్ని సర్దుబాటు చేయాలి. ఈఎన్‌సీ చేసిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం 2008 నవంబరులో పిగ్ ఐరన్‌కు కూడా ధరల వ్యత్యాసపు సర్దుబాటును వర్తింప జేసింది. ఐతే, ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత సరఫరా అయిన సరకునకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఆ తర్వాత 2010 జూన్‌లో, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (గ్రామీణ నీటి సరఫరా), పారిశుధ్య శాఖ నిర్వహిస్తున్న, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ ధరల వ్యత్యాసపు సర్దుబాటు నిబంధన వర్తించేలా సవరణ ఉత్తర్వులు జారీ చేయడమైంది. కానీ, 2008 నవంబరు కన్నా ముందు సరఫరా చేసిన సరుకునకు కూడా ధరల వ్యత్యాసపు సర్దుబాటును వర్తింపచేయడం వల్ల నాలుగు పథకాల్లో పనులు చేపట్టిన గుత్తేదార్లకు[15] ₹7.06 కోట్లమేర అనుచిత లబ్ధి చేకూరిందని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

---

[15] జేసీ నాగిరెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం: ఇండియన్ హ్యూమ్‌పైప్స్‌తో 2007 మార్చి 30న ఒప్పందం కుదిరింది. 2007మే - 2007 సెప్టెంబరు మధ్యకాలంలో సరుకును సరఫరా చేయడమైంది; వైటీ చెరువుకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం: ఏవీ రామ్ బాబు అనే గుత్తేదారుతో 2007 జనవరి 27న ఒప్పందం కుదిరింది. 2007 అక్టోబరు - 2008 ఆగస్టు మధ్య సరుకును సరఫరా చేయడమైంది(₹26 లక్షలు); కేకే మిట్ట, హెచ్‌ఎమ్ పాడులకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం (మొదటి, రెండవ దశలు): ఏవీ రామ్ బాబు అనే గుత్తేదారుతో 2006 ఫిబ్రవరి 11న ఒప్పందం కుదిరింది. 2007 ఏప్రిల్ - 2008 ఫిబ్రవరి మధ్య సరుకును సరఫరా చేయడమైంది. (₹83 లక్షలు); చుండిచెర్లోపాలెం, మరో 25 ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం: ఏవీ రామ్ బాబు అనే గుత్తేదారుతో 2007 జూన్ 7వ తేదీన ఒప్పందం కుదిరింది. 2008 జనవరిలో సరుకును సరఫరా చేయడం జరిగింది (₹3 లక్షలు)

ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసిన ఆదేశాలను గ్రామీణ నీటి సరఫరా శాఖ ఖచ్చితంగా అమలు చేస్తోందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). 2010 జూన్‌లో జారీ చేసిన ఉత్తర్వు 2008 లో ఇచ్చిన ఆదేశాలకు సవరణగా ఇచ్చింది మాత్రమే. ఉత్తర్వు జారీ చేసిన తేదీ తర్వాత సరఫరా చేసిన సరకునకు మాత్రమే ధరల వ్యత్యాసపు సర్దుబాటును వర్తింప జేయాలని ఆ ఉత్తర్వులో నిర్దేశించడం జరిగింది కాబట్టి, 2008 నవంబరు కన్నా ముందు సరఫరా చేసిన సరుకునకు ధరల వ్యత్యాసపు సర్దుబాటును వర్తింప చేయకూడదు. కనుక, ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

- ధరల వ్యత్యాసపు సర్దుబాటు నిబంధన - స్టీలు, సిమెంట్, బిటుమెన్, పెట్రోల్, ఆయిల్, లూబ్రికేంట్ల అంచనా రేట్లకు, చీఫ్ ఇంజినీర్ల బోర్డు ఆమోదించిన రేట్లకు మధ్య వ్యత్యాసం (5 శాతానికి మించి పెరుగుదల లేదా తగ్గుదల)ను సర్దుబాటు చేయడానికి సంబంధించింది. తర్వాత, ఇన్వాయిస్‌లోని రేటు లేదా ధరల వ్యత్యాసపు సర్దుబాటు నిబంధన ప్రకారం నిర్ణయించిన రేటు - రెండింటిలో ఏది తక్కువైతే అది వర్తించేటట్లుగా ఈ నిబంధనను 2008 సెప్టెంబరులో సవరించారు.

  ఐతే, భారతీయ బిల్డర్ల సంఘం అభ్యర్థన, చీఫ్ ఇంజినీర్ల బోర్డు సిఫార్సుల ఆధారంగా 2009 ఫిబ్రవరిలో జారీ చేసిన తదుపరి ఉత్తర్వులో ఈ నిబంధనను తొలగించారు. పైన పేర్కొన్న నిబంధనను తొలగించిన కారణంగా, గుత్తేదారు పైపులను తక్కువ రేటుకే కొన్నప్పటికీ డిపార్టుమెంటు గుత్తేదార్లకు చేసే చెల్లింపుల్లో పైపులకు తగ్గింపు రేట్లను వర్తింపచేయలేదు. ఫలితంగా, డిపార్టుమెంటు ఎస్ఎస్ఆర్ రేట్లనే తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తోంది. ***"జేసీ నాగిరెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం", "నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం",*** పనుల్లో పైపులకు చేసిన చెల్లింపుల రికార్డులను తనిఖీ చేసినపుడు ఈ విషయం రుజువయ్యింది. ఈ పథకాల్లో, ఇన్వాయిస్ రేట్ల కన్నా ₹58.67 కోట్లను[16] గుత్తేదార్లకు అధికంగా చెల్లించారు.

  ఎప్పటికప్పుడు జారీ అయిన ప్రభుత్వ ఆదేశాలను గ్రామీణ నీటి సరఫరా శాఖ పాటిస్తోందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 అక్టోబరు). ఐతే, ఇన్వాయిస్‌లోని రేటు లేదా ఎస్ఎస్ఆర్ రేటు - రెండింటిలో ఏది తక్కువైతే దాన్ని చెల్లించే నిబంధనను తొలగించడం ఏవిధంగా సమర్థనీయమనే సంగతిని ఈ సమాధానంలో ప్రస్తావించలేదు.

  ఐతే, తొలగించిన ఈ నిబంధనను ప్రభుత్వం 2012 ఫిబ్రవరిలో మళ్ళీ ప్రవేశపెట్టింది.

- పైపుల తయారీకి సంబంధించి, ధరల వ్యత్యాసపు సర్దుబాటు నిబంధనను స్టీలు, సిమెంట్, బిటుమెన్, రెజిన్, పిగ్ ఐరన్‌లకు వర్తింపజేసారు. కానీ, హూప్ గ్లాస్, చాప్ గ్లాస్‌లకు వర్తింపజేయలేదు. ఐతే, ***"నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం", "మెదక్ జిల్లా గజ్వేల్, నర్సాపూర్, రామాయంపేట్, దొమ్మాట నియోజకవర్గాల్లో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం - మొదటి, రెండవ దశ "*** పనుల్లో హూప్ గ్లాస్, చాప్ గ్లాస్, రెజిన్‌లతో తయారైన జీ ఆర్‌పీ పైపుల (2007 జూన్-2009 జూన్ మధ్యకాలంలో వినియోగించినవి) ముడి సరుకుల ధరలో పెరుగుదలకు సంబంధించి 2009 జనవరి-2012 డిసెంబరు మధ్యకాలంలో గుత్తేదారుకు ₹32.94 కోట్లు చెల్లించినట్లు ఆడిట్‌లో గమనించడమైంది.

  సంబంధిత ఎస్ఎస్ఆర్‌లలో ఇచ్చిన లెక్కింపు సూత్రంను అనుసరించి, ఒప్పందం మేరకు, జీఆర్‌పీ పైపుల తయారీదార్లు ఇచ్చిన ముడిసరుకుల ధరల ఆధారంగా ధరల్లో వ్యత్యాసాన్ని చెల్లించామని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ సమాధానమిచ్చింది.

[16] జేసీ నాగిరెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం: ₹6.64 కోట్లు, నీలకంఠాపురం శ్రీరామరెడ్డి సమగ్ర రక్షికత నీటి సరఫరా పథకం: ₹52.03 కోట్లు

ధరల వ్యత్యాసపు చెల్లింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు చాలామటుకు ప్రభుత్వం ప్రకటించిన ముడిసరుకుల ధరల్లోని పెరుగుదల లేదా తగ్గుదలపై ఆధారపడి జారీ చేసినవే. అంటే, స్టీలు విషయంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, సిమెంటుకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన ధరల ఆధారంగా జారీ చేసినవి. కానీ, జీ ఆర్‌పీ పైపుల విషయంలో ఇలాంటి నియంత్రణా సంస్థ ఏదీ లేదు. కనుక, మార్కెట్ ధరలను నిర్ధారించుకోకుండా తయారుదారు నుండి మాత్రమే పొందిన ధరలను పరిగణనలోకి తీసుకోకూడదు. కాబట్టి ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

అంతేకాక, పన్నుల రీఇంబర్స్‌మెంటు కోసం గుత్తేదారు సమర్పించిన (2008 ఆగస్టు నుండి 2008 సెప్టెంబరు వరకు) ఇన్వాయిస్‌లను పరిశీలిస్తే, చీఫ్ ఇంజినీర్ల బోర్డు నిర్ణయించిన ఎస్ఎస్ఆర్ రేట్ల కంటే తక్కువ రేట్లకే ఉత్పత్తిదార్లు పైపులను అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ముడిసరుకుల ధరలు పెరిగాయని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ చెబుతున్న వాదనకు ఇది విరుద్ధంగా ఉంది. ఈ వాస్తవాల దృష్ట్యా, ధరల వ్యత్యాసపు సర్దుబాటు కింద అధికంగా చెల్లించిన మొత్తాన్ని గుత్తేదారు నుంచి రికవరీ చేయాలి. ఇలాంటి అధిక చెల్లింపులకు సంబంధించి మిగిలిన కేసులను కూడా సమీక్షించాలి.

ఈ అంశాన్ని సమీక్షించి, తగిన చర్యలు చేపడతామని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

- పనుల్లోని అంశాలను పార్ట్ 'ఎ' (పైపు పనులు), పార్ట్ 'బి' (సివిల్ పనులు) గా విడదీసి, టెండరు ప్రీమియంకు పరిమితిని పార్ట్ 'ఎ' పై 5 శాతం వరకు, పార్ట్ 'బి' పై 20 శాతం వరకు అనుమతించవచ్చని 2008 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

  ఎనిమిది పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించగా సంబంధిత సర్కిళ్ల అధికారులు పైన పేర్కొన్న నిబంధనను చేర్చకుండానే టెండర్లను పిలిచారని (2008 జూన్-2009 ఫిబ్రవరి) వెల్లడైంది. పార్ట్ 'ఎ' కు 5 శాతం, పార్ట్'బి' కు 20 శాతం చొప్పున పరిమితి విధించకుండా 20 శాతం ప్రీమియంకు మించి (పార్ట్ 'ఎ' మరియు పార్ట్ 'బి' లకు) కోట్‌చేసిన టెండర్లు తిరస్కరిస్తామని టెండరు నిబంధనలో పేర్కొన్నారు. టెండరు ప్రీమియంను మొత్తంగా కోట్ చేయడానికి ఉంచిన బాక్సులో 20 శాతం అని రాసారు. పార్ట్ 'ఎ', పార్ట్ 'బి' లకు కలిపి గుత్తేదార్లు తమ టెండరు ప్రీమియంను కోట్ చేసారు. టెండర్లను మూల్యాంకనం చేసే కమిటీ/సీఈ టెండరు శాతాన్ని పార్ట్ 'ఎ' కు 5 శాతానికన్నా తక్కువగా పార్ట్ 'బి' కి 20 శాతం కన్నా ఎక్కువగా ఉండేలా విడగొట్టారు. ఈ విధంగా, అసంబద్ధమైన టెండరు నిబంధన వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం అధికంగా పడటమేకాక కాంట్రాక్టు సంస్థలు/గుత్తేదార్లకు ₹15.43 కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూరింది. ఈ వివరాలను *అనుబంధం 5.2 లో తెలపడమైంది.*

  గ్రామీణ నీటి సరఫరా శాఖ పార్ట్ 'ఎ', పార్ట్ 'బి' రెండింటికీ కలిపి టెండరు ప్రీమియంను 20 శాతానికి పరిమితం చేసిందనీ, గుత్తేదార్లకు అసాధారణ పరిమాణంలో టెండరు ప్రీమియం ఇవ్వకూడదనే ఉద్దేశంతో విస్తృత చర్చల తర్వాతనే టెండరు కమిటీ టెండర్లను ఆమోదించిందనీ ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). పార్ట్ 'ఎ', పార్ట్ 'బి' లకు రెండింటికీ కలిపి 20 శాతం టెండరు ప్రీమియంను అనుమతించకుండా, 2008 ఫిబ్రవరిలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పార్ట్ 'ఎ' పై 5 శాతానికి, పార్ట్ 'బి' పై 20 శాతానికి పరిమితి విధించాలి కాబట్టి, ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

- *"నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం"* పనుల ఒప్పందంలోని నిబంధన 8.1 ప్రకారం, గుత్తేదార్లు వాస్తవంగా చెల్లించిన పన్నులను మాత్రమే రీయింబర్స్ చేయాలి. ఆడిట్‌కు సమర్పించిన ఇన్వాయిస్‌లు, కొలతల పుస్తకాలు (మెజర్‌మెంట్ బుక్స్) పరిశీలించగా, ఇన్వాయిస్ ప్రకారం, గుత్తేదారు 3 శాతం చొప్పున కేంద్ర అమ్మకపు పన్ను చెల్లించినట్లు, మెజర్‌మెంట్ బుక్ ప్రకారం కాంట్రాక్టరుకు 4 శాతం చొప్పున రీఇంబర్స్ చేసినట్లు (2008 జూలై/2008 సెప్టెంబరు) గమనించడమైంది. దీనివల్ల గుత్తేదారుకు ₹46.32 లక్షలు (మొదటి దశ : ₹25.66 లక్షలు; రెండో దశ : ₹20.65 లక్షలు) అధికంగా రీయింబర్స్ చేసారు.

ఆడిట్ అభ్యంతరం తెలిపిన అధిక చెల్లింపును రికవరీ చేయడమైందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). కానీ, రికవరీ వివరాలను సమర్పించలేదు.

- *"నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం"* పనుల రికార్డులను పరిశీలించగా, ఒప్పందపు నిబంధనలకు విరుద్ధంగా, సాంకేతిక సిబ్బంది నియామకం, బీమా, బ్యాంకరు చార్జీలు, ధరల వ్యత్యాసపు సర్దుబాటు మొత్తం, ఓ&ఎమ్ వంటి గంపగుత్త కేటాయింపులపై కూడా టెండరు శాతాన్ని వర్తింపజేయటం ద్వారా గుత్తేదారుకు ₹45.67 లక్షలు అధికంగా చెల్లించినట్లు (2011 మార్చి) వెల్లడైంది.

  ఆడిట్‌లో లేవనెత్తిన అధిక చెల్లింపును రికవరీ చేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). కానీ, రికవరీ వివరాలను సమర్పించలేదు.

## 5.8 నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగటం

తాగునీటి వనరులను మెరుగుపర్చడం, భూగర్భజలాలు, ఉపరితల జలాలను సంయుక్తంగా వినియోగించటం, వాననీటిని సంరక్షించటం ద్వారా తాగునీరు నిరంతరాయంగా లభ్యమయ్యేలా చూడటానికి జాతీయ గ్రామీణ తాగునీటి పథకం/సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకాల కింద 'నిలకడగా నీటిసరఫరా' (సస్టెయినబిలిటీ) అనే ప్రత్యేక అంశానికి 20 శాతం నిధులను కేటాయించడం జరుగుతుంది (ఈ నిధులను 100 శాతం కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది). చెరువులు, పాత బావులలో పూడికతీయటం, వాననీటి సంరక్షణకు నిర్మాణాలు, సబ్ సర్ఫేస్ డైక్‌లు, వాటర్‌షెడ్లు, చెక్‌డ్యామ్‌లు, సంప్రదాయక తాగునీటి ఊట చెరువులు, రివర్స్ అక్స్నా ఆక్సిడేషన్, భూగర్భ జలాలను మితిమీరి వినియోగిస్తున్న ప్రాంతాల్లో బోరుబావుల తవ్వకాల క్రమబద్ధీకరణ మొదలైన పనులు ఈ అంశం కిందికి వస్తాయి.

సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం కింద 2008 ఏప్రిల్ 1వ తేదీ నాటి కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా విడుదల చేసిన ₹46.96 కోట్లకుగానూ ₹2.34 కోట్లను సస్టెయినబిలిటీ అంశాలకు కేటాయించారు. ఐతే, 2008-09 లో ఈ అంశాలపై ₹0.95 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టారు. ఆ తర్వాత, నిధుల విడుదలకు జారీ చేసిన ఉత్తర్వుల్లో సస్టెయినబిలిటీకి నిర్దిష్ట కేటాయింపులను చేయలేదు. సస్టెయినబిలిటీపై తగిన శ్రద్ధ చూపకపోవడాన్ని ఇది సూచిస్తుంది. 2008-12 మధ్య కాలంలో ఖర్చుకు ఆమోదించిన విలువ ₹228.32 కోట్లు కాగా, సస్టెయినబిలిటీ అంశానికి సంబంధించిన 4263 పనులపై ₹6.87 కోట్లు ఖర్చయ్యిందని ఈఎన్‌సీ తెలిపారు. ఈ అదనపు నిధులను ఎక్కడినుండి పొందారో తెలిపే వివరాలు రికార్డుల్లోలేవు. పైగా, ఈ అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా నిధులు సమకూర్చాలనే నిర్దేశమేదీలేదు.

సస్టెయినబిలిటీ సంబంధిత పనులకు సంబంధించి 16 జిల్లాల సమాచారాన్ని ఈఎన్‌సీ సమర్పించారు (మిగిలిన 5 జిల్లాల[17] సమాచారం 2013 జనవరి నాటికి సమర్పించలేదు). ఈ సమాచారం ప్రకారం, 2011 ముగిసే నాటికి ₹162.56 కోట్ల అంచనా విలువగల 2975 పనులకు ఈ అంశం కింద ప్రభుత్వం మంజూరీనివ్వగా, ₹2.62 కోట్ల (2 శాతం) విలువగల 734 పనులు మాత్రమే చేపట్టారు.

మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్లలో, ఈ అంశం కింద 2007-10 మధ్యకాలంలో చాలా తక్కువ పనులను మంజూరు చేసారు. చాలామటుకు పనులను 2010 తర్వాత మాత్రమే మంజూరు చేసారు. 2010 తర్వాత మంజూరు చేసిన పనులు కూడా పూర్తిగా మొదలు కాలేదు. ఈ దిగువ పట్టికలో ఇచ్చిన వివరాలను చూస్తే ఈ విషయం అవగతం అవుతుంది. మంజూరైన 1983 పనుల్లో, 2012 నవంబరు నాటికి 1422 (72 శాతం) పనులు మొదలు కాలేదు.

[17] ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, శ్రీకాకుళం, వరంగల్

పట్టిక **5.5**

| జిల్లా | డివిజను పేరు | మంజూరైన సంవత్సరం | మంజూరైన పనులు | అంచనా విలువ (₹కోట్లలో) | ప్రారంభమైన పనులు | ఖర్చు (₹కోట్లలో) | ఇంకా మొదలుకాని పనులు |
|---|---|---|---|---|---|---|---|
| అనంతపురం | పెనుకొండ | 2009-10 & 2010-11 | 310 | 5.74 | 16 | 0.06 | 294 |
| | కళ్యాణదుర్గం | 2010-11 | 51 | 6.47 | 0 | 0.00 | 51 |
| | అనంతపురం | 2009-10 & 2010-11 | 164 | 8.22 | 3 | 0.01 | 161 |
| శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు | గూడూరు | 2010-11 | 37 | 2.09 | 0 | 0.00 | 37 |
| | నెల్లూరు | 2007-08 నుండి 2011-12 | 706 | 67.04 | 266 | 23.01 | 375 |
| కర్నూలు | నంద్యాల | 2010-11 | 18 | 0.72 | 0 | 0.00 | 18 |
| | కర్నూలు | 2008-09 & 2010-11 | 23 | 6.83 | 15 | 0.05 | 8 |
| | ఆదోని | 2008-09 & 2010-11 | 26 | 1.90 | 10 | 0.04 | 16 |
| ప్రకాశం | ఒంగోలు | 2010-11 | 4 | 3.30 | 0 | 0.00 | 4 |
| | పొదిలి | 2010-11 | 120 | 15.99 | 0 | 0.00 | 120 |
| నిజామాబాద్ | బాన్సువాడ | 2009-10 | 4 | 1.32 | 0 | 0.00 | 4 |
| | నిజామాబాద్ | 2010-11 | 87 | 5.32 | 4 | 0.02 | 83 |
| మెదక్ | మెదక్ | 2008-09 & 2010-11 | 103 | 1.79 | 62 | 0.24 | 41 |
| | సిద్దిపేట | 2008-09 & 2010-11 | 184 | 10.16 | 89 | 0.35 | 95 |
| కరీంనగర్ | కరీంనగర్ | 2007-08 | 23 | 0.09 | 23 | 0.08 | 0 |
| వరంగల్ | వరంగల్ | 2008-09 తప్ప, 2006-07 నుండి 2011-12 వరకు | 9 | 174.49 | 8 | 122.36 | 1 |
| రంగారెడ్డి | హైదరాబాద్ | 2010-11 | 94 | 3.76 | 0 | 0.00 | 94 |
| ఖమ్మం | ఖమ్మం | 2008-09 & 2010-11 | 20 | 394.59 | 0 | 0.00 | 20 |
| మొత్తం | | | **1983** | **709.82** | **496** | **146.22** | **1422** |

*మూలం : మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్ల రికార్డులు*

మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్లలో చాలామంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మంజూరైన పనులను చేపట్టకపోవడానికి నిర్దిష్ట కారణాలను తెలపలేదు. ఆరు డివిజన్ల ఈఈలు[18] నిధులు విడుదల కాకపోవడం; మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (లేబర్ అంశం) తో సరిగా అనుసంధానం లేకపోవడం, భౌగోళిక నివేదికల ప్రకారం పనులు చేపట్టే అవకాశం లేకపోవడంలను ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. ఈ ఆవాసాలలో తాగునీటి సమస్య లేకపోవడం, నిర్మించ తలపెట్టిన ఊట చెరువుల చుట్టూ వరిపొలాలు ఉండటంవల్ల అవి ఎరువులు, పురుగుమందులతో కలుషితం కావడంతో నిర్మాణం చేపట్టడం సాధ్యం కాలేదని కూడా వారు పేర్కొన్నారు. సాధ్యాసాధ్యాలను ముందుగా అంచనా వేయకుండానే పనులను మంజూరు చేయడంవల్ల కేంద్ర ప్రభుత్వ నిధులను వినియోగించుకోలేకపోవటం జరిగింది. అంశాలవారీగా వివరాలు లేని కారణంగా, నిధులు విడుదల కాలేదని గ్రామీణ నీటి సరఫరా శాఖ పేర్కొన్న కారణాన్ని ఆడిట్‌లో నిర్ధారించుకోలేకపోవటమైంది.

ఆడిట్ సమీక్షా కాలానికి సంబంధించి, సస్టెయినబిలిటీ అంశాలు పరిష్కారం కాలేదని సమీక్షానంతర సమావేశం (2013 జనవరి)లో ప్రభుత్వం అంగీకరించింది. మొదట్లో ఈ అంశాలను జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాలతో అనుసంధానం చేద్దామని తలచినప్పటికీ, ఆవిధంగా అనుసంధానం చేయలేకపోవడమే ఇందుకు కారణంగా పేర్కొన్నారు.

[18] అనంతపురం, నిజామాబాద్, జిల్లాల్లోని ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ల ఈఈలు, నెల్లూరు జిల్లా గూడూరు డివిజన్ ఈఈ

## 5.9 నీటి నాణ్యతపై పర్యవేక్షణ, నిఘా

### 5.9.1 భూగర్భ జలాల మెరుగుదల స్థితి

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలే ప్రధాన నీటి వనరు. గ్రామీణ నీటి సరఫరాలో దాదాపు 85 శాతం భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ భూగర్భ జల వనరుల నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని 1108 మండలాలను ఈ కింది విధంగా వర్గీకరించారు :

- 111 (10 శాతం) మండలాలలో భూగర్భ జలాలను పరిమితికి మించి విపరీతంగా వినియోగిస్తున్నారు. ఇవి 'ఓవర్ ఎక్స్ప్లాయిటెడ్' వర్గంలోకి వస్తాయి (అంటే భూగర్భ జలాలను 100 శాతం లేదా అంతకు మించి మెరుగుపర్చాలి);
- 60 (6 శాతం) మండలాలలో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇవి 'క్రిటికల్' వర్గంలోకి వస్తాయి (భూగర్భ జలాలను 90 నుండి 100 శాతం వృద్ధి చేయాలి);
- 160 (14 శాతం) మండలాలు 'సెమీ-క్రిటికల్' వర్గంలో ఉన్నాయి (భూగర్భ జలాలవృద్ధి 70 నుండి 90 శాతం అవసరమవుతుంది);
- 777 (70 శాతం) మండలాల్లో పరిస్థితి పరవాలేదు. ఇవి 'సేఫ్' వర్గంలో ఉన్నాయి (భూగర్భ జలాలవృద్ధి 70 శాతంకంటే తక్కువ అవసరమవుతుంది).

ఆతర్వాత వెలువరించిన భూగర్భ జల వనరుల అంచనా సంఘం నివేదిక 2009 లో ఈ వర్గీకరణను మార్చారు. దీని ప్రకారం రాష్ట్రంలోని 6 మండలాలను 'ఓవర్ ఎక్స్ప్లాయిటెడ్' వర్గంకింద చూపారు. వీటిలో భూగర్భ జలాల వినియోగం ఏడాదిలోపు తిరిగి భర్తీ చేయగల పరిమితి మించిపోయింది. 24 మండలాలను 'చీకటి' వర్గంకింద చూపారు. వీటిలో భూగర్భ జలాల వృద్ధి 85 శాతానికి మించి చేయాలి.

### 5.9.2 నీటి నాణ్యత నిర్వహణావసరాలు

జాతీయ గ్రామీణ తాగునీటి పథకంలో 'నీటి నాణ్యత' కీలకమైన అంశం. దీనికి 20 శాతం నిధులను కేటాయించారు. ఈ అంశం కింద


- నీటి నాణ్యత పరిశోధన శాలలను ముడు స్థాయిల్లో ఏర్పాటు చేయాలి. పై స్థాయిలో ఒక నోడల్ యూనిట్ను, జిల్లా స్థాయి పరిశోధన శాలలు మధ్యస్థాయిలోనూ, కిందిస్థాయి యూనిట్లను నెలకొల్పాలి.
- తాగునీటిని అందించే ప్రతి వనరునూ రెండేళ్ళకొకసారి బాక్టీరియా సంబంధిత కలుషితాల గురించి పరీక్షించాలి. రసాయనిక కలుషితాల గురించి ఏడాదికి ఒకసారి పరీక్షించాలి. గ్రామస్థాయిలో పరీక్షించిన నీటి నమూనాలలో కనీసం 30 శాతాన్ని జిల్లాస్థాయి ల్యాబరేటరీలు పరీక్షించాలి. కలుషితమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఫిర్యాదు చేసిన కేసులన్నింటినీ జిల్లా స్థాయి ల్యాబరేటరీలు పరీక్షించాలి. జిల్లాస్థాయి నీటి నాణ్యత ల్యాబరేటరీలు పరీక్షించిన అన్ని నమూనాలనుండి (పాజిటివ్ వచ్చిన నమూనాలతో సహా) 10 శాతం నమూనాలను రాష్ట్ర స్థాయిలో పరీక్షించాలి;
- గ్రామ పంచాయతీలు సొంతంగా క్షేత్రస్థాయిలో పరీక్షలు జరిపే పరికరాలు (ఎఫ్టీకేస్) కలిగి ఉండేలా, వాటి పరిధిలోని తాగునీటి వనరుల ద్వారా సరఫరా చేస్తున్న నీటి నాణ్యతకు పూర్తిస్థాయిలో నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించేలా పంచాయతీలకు సామర్థ్యాన్ని కల్పించాలి.

ఈ అంశాలపై ఆడిట్లో గమనించిన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

### *5.9.2.1 నీటి నాణ్యత పరిశోధనశాలలు*

కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సమాచార నిర్వహణ వ్యవస్థ (ఎమ్ఐఎస్) ప్రకారం, 2012 జూన్ నాటికి రాష్ట్రంలో 51 ల్యాబరేటరీలను జిల్లా స్థాయిలోనూ, 119 ల్యాబరేటరీలను సబ్ డివిజను స్థాయిలోనూ నెలకొల్పారు. ఐతే, నిర్ణయించిన లక్ష్యాలు, నీటి నాణ్యతా పరీక్షల నిర్వహణ కోసం గుర్తించిన నీటి వనరులు, సేకరించిన నమూనాల వివరాలు ఆడిట్‌కు సమర్పించిన రికార్డుల్లో లేవు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎమ్ఐఎస్ డేటాబేస్ ప్రకారం 2007-12 మధ్య కాలంలో పరీక్షించిన నమూనాల వివరాలు కింది చార్టులో చూపడమైంది.

చార్టు 5.3




సబ్ డివిజను స్థాయిలోని 119 ల్యాబరేటరీల్లో 92 ల్యాబరేటరీలను 2011-12 సంవత్సరపు ఆఖరి త్రైమాసికంలో స్థాపించడమైందనీ, ఇవి 2012 ఆగస్టు నుండి పని చేస్తున్నాయనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 అక్టోబరు). ప్రతి ల్యాబరేటరీ ఏడాదికి 3000 చొప్పున రసాయనిక, బాక్టీరియా సంబంధిత పరీక్షలు జరపాలని ఒకేవిధమైన లక్ష్యాన్ని నిర్ణయించామని, ఈ లక్ష్యాన్ని నెరవేరిస్తే కొంత కాలానికి నీటి వనరులన్నింటికీ పరీక్షలు పూర్తవుతాయని కూడా తెలిపారు. నీటి వనరులన్నింటినీ ఏడాదికి కనీసం ఒకసారైనా పరీక్షించాలన్న జాతీయ గ్రామీణ తాగునీటి పథకం నిర్దేశాల దృష్ట్యా ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

### *5.9.2.2 నీటి నాణ్యత పరీక్షలు*

మచ్చుకు తనిఖీ చేసిన 20 డివిజన్ల రికార్డుల పరిశీలనలో నెలకు 100 రసాయనిక పరీక్షలు, 200 బాక్టీరియా సంబంధిత పరీక్షలు జరపాలని లక్ష్యంగా నిర్ణయించారని, పరీక్షించాల్సిన నీటి వనరుల సంఖ్యకు లక్ష్యాన్ని నిర్ణయించలేదని వెల్లడైంది. మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్లలో 2007-12 మధ్య కాలంలో అనుచితంగా నిర్ణయించిన లక్ష్యాలను కూడా వాస్తవంగా నెరవేర్చలేదు (ముఖ్యంగా, బాక్టీరియా సంబంధిత పరీక్షలకు సంబంధించి). ఆ వివరాలను సంక్షిప్తంగా ఈ కింద తెలపడమైంది.

పట్టిక 5.6

| జిల్లా | డివిజను పేరు | బాక్టీరియా సంబంధిత పరీక్షలు | | | రసాయనిక పరీక్షలు | | |
|---|---|---|---|---|---|---|---|
| | | లక్ష్యం | చేసినవి | తక్కువ (-)/ ఎక్కువ (+) | లక్ష్యం | చేసినవి | తక్కువ (-)/ ఎక్కువ (+) |
| అనంతపురం | పెనుకొండ | 7200 | 5486 | 1714 | 22800 | 33095 | (+)10295 |
| | కళ్యాణదుర్గం | 4500 | 2800 | 1700 | 11400 | 7036 | 4634 |
| | అనంతపురం | 100[19] | 52 | 48 | 18000 | 19487 | (+)1487 |
| శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు | గూడూరు[20] | 960 | 3820 | (+)2860 | 6240 | 36718 | (+)30478 |
| | నెల్లూరు | 6400 | 6400 | — | 20800 | 20800 | — |
| కర్నూలు | నంద్యాల | వివరాలు ఇవ్వలేదు | | | | | |
| | కర్నూలు | 1300 | 581 | 719 | 5700 | 6355 | (+)655 |
| | ఆదోని | వివరాలు ఇవ్వలేదు | | | | | |
| ప్రకాశం | ఒంగోలు | 7200 | 3529 | 3671 | 14400 | 14031 | 369 |
| | కనిగిరి[21] | 1200 | 75 | 1125 | 2400 | 767 | (-)1633 |
| | దర్శి | 7200 | 6464 | 736 | 14400 | 17550 | (+)3150 |
| నిజామాబాద్ | బాన్సువాడ | 2160 | 4031 | (+)1871 | 21600 | 21137 | (-)463 |
| | నిజామాబాద్[22] | 21600 | 26873 | (+)5273 | — | — | — |
| మెదక్ | మెదక్ | 4800 | 3308 | 1492 | 19200 | 18667 | (-)533 |
| | సిద్దిపేట | 14100 | 14100 | — | 4250 | 2550 | (-)1700 |
| కరీంనగర్ | కరీంనగర్ | 7200 | 6740 | 460 | 14400 | 13957 | (-)443 |
| | మంథని | 7200 | 6666 | 534 | 14400 | 13318 | (-)1082 |
| వరంగల్ | వరంగల్ | 6000 | 2379 | 3621 | 18000 | 10018 | (-)7982 |
| ఖమ్మం | ఖమ్మం | 6000 | 4591 | 1409 | 24000 | 25669 | (+)1669 |
| రంగారెడ్డి | హైదరాబాద్ | 6000 | 3357 | 2643 | 12000 | 13308 | (+)1308 |

*మూలం : మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్ల రికార్డులు*

ముడి సరుకుల (రసాయనాల) కొనుగోలుకు, రవాణా ఛార్జీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల లక్ష్యాలకంటే తక్కువ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఖమ్మం, హైదరాబాద్ డివిజన్ల ఈఈలు తెలిపారు. మిగిలిన డివిజన్ల ఈఈల నుండి దీనికి సమాధానం రాలేదు. రాష్ట్రస్థాయిలో, అంశాలవారీగా కేటాయించిన నిధుల వివరాలు లేనందువల్ల నిధుల అందుబాటును నిర్ధారించలేకపోవడమైంది.

### *5.9.2.3 క్షేత్రస్థాయిలో నాణ్యతా పరీక్షకు పరికరాలు (కిట్లు)*

రసాయనిక, బాక్టీరియా సంబంధిత కలుషితాల విషయంలో కనీస ప్రమాణాల ప్రకారం నీటి నాణ్యతపై ప్రాథమిక నివేదికను పొందడమే క్షేత్రస్థాయి నాణ్యత పరీక్ష పరికరాల (కిట్ల) అందజేత ప్రధాన ఉద్దేశం. ఆతర్వాత ఈ నివేదికలోని అంశాలను పూర్తిస్థాయిలో నెలకొల్పిన ల్యాబరేటరీల్లో పరీక్షించి నిర్ధారించుకోవాలి. సంబంధిత సూచనలను అనుసరించి లేదా స్వల్ప శిక్షణతో ఎవరైనా, ఎక్కడైనా వీటిని ఉపయోగించవచ్చు. ఈ కిట్ల నిర్వహణ, వాటిలో తిరిగి భర్తీ చేయాల్సిన సరుకుల ఖర్చు, క్రిమిరహితంగా చేయడానికయ్యే ఖర్చు, చిన్న-చిన్న నివారణా

[19] 2011-12 వివరాలను మాత్రమే ఇచ్చారు

[20] బాక్టీరియా సంబంధిత పరీక్షలకు లక్ష్యాలను రెండు సంవత్సరాలకు (2010-11, 2011-12) మాత్రమే ఇచ్చారు

[21] ల్యాబరేటరీ 2011 జూన్ నుండి పని చేస్తోంది

[22] రసాయనిక, బాక్టీరియా సంబంధిత పరీక్షల వివరాలను విడివిడిగా ఇవ్వలేదు

ఖర్చులు, గ్రామ పంచాయతీ స్థాయి సమన్వయ కర్తల గౌరవవేతన ఖర్చులను ప్రతి కుటుంబం నెలకు ఒక రూపాయి చొప్పున ఇచ్చే ఏర్పాటుతో పౌర సమాజ భాగస్వామ్యం ద్వారా వచ్చే నిధుల నుండి భరించాలి. ఇలా సేకరించిన మొత్తాన్ని గ్రామస్థాయి నీటి, పారిశుధ్య సంఘం నిర్వహించే ప్రత్యేక అకౌంటుకు జమచేసి సంబంధిత లెక్కలను ఒక ప్రత్యేక లెడ్జరులో రాయాలి.

జాతీయ గ్రామీణ తాగునీటి నాణ్యత పర్యవేక్షణ, నిఘా పథకం[23] కింద 2005-08 మధ్య కాలంలో భారత ప్రభుత్వం ₹17.90 కోట్లు విడుదల చేసింది. ఇందులో నుంచి రాష్ట్ర ప్రభుత్వం, క్షేత్రస్థాయి నాణ్యతా పరీక్ష పరికరాలకు సంబంధించిన 25312 కిట్ల కొనుగోలుకు ₹5.36 కోట్లు; 18,74,800 బాక్టీరియా లాజికల్ వైయల్స్ (HS2S) కొనుగోలుకు ₹2.95 కోట్లు ఖర్చు పెట్టింది. అంతేకాక, మానవవనరుల అభివృద్ధి (హెచ్ఆర్డీ) కార్యకలాపాల కింద శిక్షణ కోసం ₹7.77 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. వైయల్స్ ఉన్నంతకాలం గ్రామ పంచాయతీలు ఈ కిట్లను ఉపయోగించాయి, ఆ తర్వాత వీటిని రసాయనాలతో తిరిగి భర్తీ చేయనందువల్ల అవి వృధాగా ఉన్నాయి. దీనికి సంబంధించి, ఆడిట్‌లో పరిశీలించిన అంశాన్ని ఈఎన్సీ అంగీకరించారు. మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్ల పరిధిలోని ఏ ఒక్క గ్రామ పంచాయతీలోనూ నీటి, పారిశుధ్య కమిటీలు ఏర్పాటు కాలేదు. కాబట్టి, ప్రజల నుండి చందాలు వసూలు చేయడం, ఆ కమిటీ అకౌంటుకి ఆ నిధులను జమ చేయడం జరిగే అవకాశమే లేదు. ఈ కిట్ల అందజేత లక్ష్యం నెరవేరకపోవటమే కాక, వీటిపై చేసిన ఖర్చు నిష్ఫలమయ్యింది.

గ్రామీణ నీటి సరఫరాను జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకంలో కలపడం వల్ల క్షేత్రస్థాయి నీటి నాణ్యత పరీక్ష కిట్ల నిర్వహణ బాధ్యతను 2011-12 నుండి అనుబంధ సామాజిక ఆరోగ్య కార్యకర్త (ఆషా)ల ద్వారా వైద్య ఆరోగ్య శాఖ నిర్వర్తిస్తోందని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). గ్రామస్థాయి నీటి, పారిశుధ్య కమిటీలు ఇంకా ఏర్పాటు కాని విషయాన్ని సమీక్షానంతర సమావేశం (2013 జనవరి)లో ప్రభుత్వం ధృవీకరించింది. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా కిట్ల నిర్వహణ వల్ల ఆశించిన ఫలితాలు రానందువల్ల ఈ అంశాన్ని సమీక్షిస్తున్నామని కూడా తెలిపింది.

### *5.9.2.4 నాణ్యతా పరీక్షల ఫలితాలు*

మచ్చుకు తనిఖీ చేసిన డివిజన్లలో, ఒక్క పొదిలి డివిజను తప్ప మిగిలిన డివిజన్లు నాణ్యతా పరీక్షల ఫలితాల వివరాలను ఆడిట్‌కు సమర్పించలేదు. అంటే, 19 డివిజన్లు అవసరమైన పరీక్షలు నిర్వహించలేదని మరియు/లేదా సంబంధిత నీటి వనరు సురక్షితం కాదని నిర్ధారించేలా రసాయనిక, బాక్టీరియా సంబంధిత కలుషితాలు నిర్దేశితప్రమాణాలకు మించి ఉన్నట్లు ఈ ఫలితాలు సూచించి ఉండవచ్చని దీన్నిబట్టి తెలుస్తోంది. ప్రమాణాల ప్రకారం, ప్రతీ నీటి వనరునూ ఏడాదికి కనీసం ఒక్కసారైనా తనిఖీ చేయాల్సిఉండగా, పొదిలి డివిజనులో 2006-11 మధ్యగల ఐదేళ్ళ కాలంలో మొత్తం 13516 బోరుబావులకుగాను 9327 (69 శాతం) బోరుబావులను తనిఖీ చేసారు. ఇందులో, 5408 (58 శాతం) బోరుబావుల నీటిలో ఫ్లోరైడ్‌లు, కరిగిఉన్న మొత్తం ఘనపదార్థాలు (టీడీఎస్) అధిక పరిమాణంలో ఉన్న కారణంగా అవి సురక్షితం కాదని పరీక్షా ఫలితాలు తెలియజేసాయి. పరీక్షలను తక్కువగా చేయడానికి నిర్వహణాకార్యకలాపాలకు చాలినంత నిధులను విడుదల చేయకపోవడం కారణమని పొదిలి డివిజను ఈఈ పేర్కొన్నారు.

చాలామటుకు ఆవాసాల్లో సురక్షితమైన, సురక్షితంకాని నీటి వనరులు ఉన్నాయనీ, ఈ రెండింటిలో, రక్షిత నీటిని మనుషులు తాగేందుకూ నాణ్యతలేని నీటిని ఇతర గృహావసరాలకూ వినియోగిస్తున్నారని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు). రక్షిత నీటిని సరఫరా చేస్తున్న నీటి వనరుల వివరాలు ఆడిట్ పరిశీలనకు సమర్పించక పోవడంవల్ల ఈ విషయంలో ప్రభుత్వ వాదన ఎంతవరకు సరైనదో ఆడిట్‌లో నిర్ధారించుకోడానికి వీలు కాలేదు.

[23] ఎన్ఆర్డీడబ్ల్యూక్యూఎమ్ & ఎస్పీ

### 5.9.3 నిర్వహణ ఛార్జీలు

సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద కేటాయించిన నిధుల్లో 10 శాతం నిధులు తాగునీటి సరఫరాపై నిర్వహణ (ఓ&ఎమ్) ఖర్చులకు సంబంధించినవి. అంతేకాక, ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా పంచాయతీరాజ్ సంస్థలకు ఇచ్చిన నిధుల నుండి కూడా తాగునీటి సరఫరా పథకాల నిర్వహణకు నిధులు సమకూర్చాలి. ఈ నిధులను సంబంధిత పంచాయతీరాజ్ సంస్థ నిర్వహిస్తున్న ప్రాజెక్టుకు అనుసంధానం చేసిన కార్పస్ నిధికే జమచేయాలి. గ్రామ పంచాయతీ పరిధిలోని నీటి సరఫరా పథకాలన్నింటినీ గ్రామ పంచాయతీయే నిర్వహించాలి. పలు గ్రామాలకు సంబంధించినలేదా బల్క్‌గా నీటి సరఫరాచేసే పథకాల్లో నీటివనరు, శుద్ధి యంత్రాలు, రైజింగ్ మెయిన్స్ మొదలైన వాటిని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డివిజను లేదా సంబంధిత సంస్థ నిర్వహించాలి; గ్రామ పరిధిలోని నీటి పంపిణీ, ఇతర అంశాలను గ్రామ పంచాయతీ నిర్వహించాలి.

2009-12 మధ్యకాలంలో, జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద భారత ప్రభుత్వ గ్రాంటుకు (₹135.57 కోట్లు) ఈ అంశం కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయలేదు. భారత ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు వినియోగించామని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ తెలిపినప్పటికీ, రాష్ట్ర ప్రణాళికా పద్దు కింద విడుదల చేసిన నిధులు, వాటి వినియోగంకు సంబంధించిన వివరాలు ఆడిట్‌కు సమర్పించిన రికార్డుల్లో లేవు.

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఓ&ఎమ్) కింద నీటి సరఫరా పథకాల మరమ్మతు పనులను చేపట్టడానికి నిధులను ఈ ఏడాది విడుదల చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 అక్టోబరు).

## 5.10 పర్యవేక్షణ, మూల్యాంకనం

### 5.10.1 పర్యవేక్షణ

రాష్ట్ర నీటి, పారిశుధ్యమిషన్/జిల్లా నీటి, పారిశుధ్యమిషన్ నిర్దేశించిన ప్రకారం రాష్ట్రస్థాయి/జిల్లాస్థాయి అధికారులు నిర్వహించిన తనిఖీ/పర్యవేక్షణ నివేదికలను ఆడిట్ పరిశీలనకు సమర్పించలేదు. వీటి వివరాలు లేనందువల్ల నీటి సరఫరా పథకాల అమలులో పర్యవేక్షణ యంత్రాంగం ఏమేరకు ప్రభావవంతంగా ఉన్నదీ పరిశీలించడం వీలు కాలేదు. ఐతే, 2009 అక్టోబరులో ఏర్పాటయిన 'పథకాల మంజూరీకి సంబంధించిన రాష్ట్ర స్థాయి సంఘం' సమావేశాల్లో చర్చించిన అంశాల వివరాలు(మినిట్స్) పరిశీలించగా, నీటి సరఫరా పథకాలను ప్రభావవంతంగా అమలు చేయడానికి ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యంత్రాంగంలోని పలు లోపాలు వెల్లడయ్యాయి. ఆ వివరాలు కింది విధంగా ఉన్నాయి ః

- 2009-12లో, పథకం మంజూరీకి సంబంధించిన 'రాష్ట్ర స్థాయి సంఘం' (కమిటీ) నాలుగుసార్లు సమావేశమయ్యింది. ఐతే, ఈ సమావేశాల్లో జరుగుతున్న పనుల పురోగతిపై కాకుండా, కొత్త పథకాల మంజూరీ గురించి, కమిటీ ఆమోదం లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిన నీటి పథకాలు/పనుల క్రమబద్ధీకంణల పైననే చాలామటుకు చర్చించారు.

- 2008-12 మధ్యకాలంలో, నిఘా, నాణ్యత నియంత్రణ విభాగాలు 4561 పనుల్లో (2012 సెప్టెంబరు వరకు) నాణ్యతకు సంబంధించిన అంశాలను సమీక్షించి, 761 పనుల్లో లోపాలున్నట్లు వెల్లడించాయి. ఈ లోపాలు ప్రధానంగా, ఎంపిక చేసిన నీటి వనరు సరైనది కాకపోవటం, సివిల్ నిర్మాణాల్లోని లోపాలు, పనులపై పర్యవేక్షణ కొరవడటం మొదలైన వాటికి సంబంధించినవి. ఇందులోని 6 పనులపై మాత్రమే గ్రామీణ నీటి సరఫరా శాఖ చర్యలు తీసుకుంది; మిగిలిన 755 పనులకు సంబంధించిన లోపాలపై ఇంకా చర్యలు చేపట్టలేదు.

- పూర్తయిన పథకాల నిర్వహణ బాధ్యతను గ్రామస్థాయి నీటి, పారిశుధ్య కమిటీలు చేపట్టాలని సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల్లో నిర్దేశించినప్పటికీ, పేరా 5.9.2.3 లో తెలిపిన విధంగా ఈ కమిటీలు ఇంకా ఏర్పాటుకాకపోవడంవల్ల తాగునీటి పథకాలను తామే స్వయంగా నిర్వహిస్తున్నామని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ తెలిపింది.

ప్రభావవంతమైన పర్యవేక్షణ ఉండేలా తగిన చర్యలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 అక్టోబరు).

### 5.10.2 పథకం మూల్యాంకనం

సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/ జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల ప్రకారం గ్రామీణ నీటి సరఫరా పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రసిద్ధ సంస్థల ద్వారా ఎప్పటికప్పుడు మూల్యాంకనాన్ని చేయించాలి. ఈ అధ్యయనాల కోసం, జాతీయ గ్రామీణ తాగునీటి పథకంలోని 'మద్దతు కార్యకలాపాలు' అనే అంశంకింద 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తుంది. ఈ అధ్యయనాల నివేదికలను గ్రామీణ నీటి సరఫరా శాఖకు సమర్పించాలి. వీటి ఆధారంగా, పథకం అమలులో నాణ్యతను పెంపొందించుకునే విధంగా తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

ఐతే, 2012 జూన్ నాటికి, ఏ ఒక్క నీటి సరఫరా పథకంపైనా రాష్ట్ర ప్రభుత్వం మూల్యాంకనాన్ని చేయించలేదు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో మంత్రిత్వశాఖల పనితీరు లెక్కగట్టేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రిజల్ట్స్ ఫ్రేమ్ వర్క్స్ డాక్యుమెంట్ ' (ఆర్ఎఫ్డీ) కింద కేంద్ర తాగునీటి, పారిశుధ్య మంత్రిత్వశాఖ గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి 19వ ర్యాంకునిచ్చింది (2012 మే). పూర్తిస్థాయి నీటి వసతి ఉన్న ఆవాసాల స్థాయినుంచి పాక్షిక నీటి వసతి ఉన్న ఆవాసాల స్థాయికి పడిపోయిన (స్లిప్డ్ బ్యాక్) ఆవాసాల స్థాయి పెంచడం; నాణ్యత లేని నీరు సరఫరా అవుతున్న ఆవాసాలు; నాణ్యత పరీక్ష పరికరాల కిట్లనుపయోగించి క్షేత్ర స్థాయిలో నీటి నాణ్యతను పర్యవేక్షించడానికి శిక్షణ పొందిన వ్యక్తుల సంఖ్య, చేసిన నీటి నాణ్యత పరీక్షల సంఖ్య; ఉప-జిల్లాస్థాయి ల్యాబరేటరీల స్థాపన; పంచాయతీలకు అప్పగించిన పైపునీటి సరఫరా పథకాల సంఖ్య; శిక్షణ పొందిన గ్రామస్థాయి నీటి, పారిశుధ్య కమిటీ సభ్యుల సంఖ్య మొదలైన అంశాల్లోని పనితీరు ఆధారంగా ఈ ర్యాంకులనివ్వడం జరిగింది.

ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మూల్యాంకనంకు సంబంధించి సమాధానమివ్వకుండా, ఆర్ఎఫ్డీ ఆధారంగా ఈఈలు, ఎస్ఈల పనితీరును గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షిస్తుందని తెలిపింది (2012 అక్టోబరు).

## 5.11 సారాంశం

*కేటాయించిన నిధులను వినియోగించకపోవటం , రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయకపోవటం, అంశాలవారీ కేటాయింపులు లేకుండా నిధులు విడుదల చేయటం, నివారించదగ్గ వడ్డీ చెల్లింపు వంటి వాటితో పేలవంగా ఉన్న ఆర్థిక నిర్వహణ వల్ల గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలుపై ప్రతికూల ప్రభావం పడింది. వార్షిక కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలో పౌరసమాజం భాగస్వామ్యం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటం వల్ల ప్రణాళికా రచన సరిగాలేదు. చేస్తున్న పనులను పూర్తిచేయకుండానే కొత్త ప్రాజెక్టులను చేపట్టడం, భారత ప్రభుత్వ ప్రమాణాలకు విరుద్ధంగా పరిపాలనాపరమైన మంజూరీలనివ్వడం జరిగింది. సరైన ఇన్వెస్టిగేషన్ లేకుండా పనులను ప్రారంభించటం, డిజైన్లలో లోపాలు, సంబంధితశాఖలతో సమన్వయం లేకపోవడం, భూసేకరణ జరపక పోవటం మొదలైనవాటి వల్ల పలు ప్రాజెక్టులు పూర్తికాకుండా మిగిలిపోవటం, పలుకేసులలో వనరులు వృధాగా ఉండటం జరిగింది. పలు సందర్భాలలో నీటి సరఫరా పథకాలు పూర్తయినప్పటికీ వాటికి విద్యుత్తు సరఫరా లేకపోవడం వల్ల లక్షిత ఆవాసాలు తాగునీటి సౌకర్యానికి దూరమయ్యాయి. గుత్తేదారులకు అధిక చెల్లింపులు*

*చేయటం, అనుచిత లబ్ధి చేకూర్చటంతో సహా టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. నీటి వసతి అస్సలులేని ఆవాసాల సంఖ్యను తగ్గించటంలో పురోగతి ప్రశంసనీయంగానే ఉన్నప్పటికీ, నీటి వనరులనుండి నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా వాటి మనుగడపై రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడం వల్ల పలు ఆవాసాల్లో నీటి సరఫరా స్థితి దిగజారింది. నీటి నాణ్యతా పరీక్షలు సరిపడినంతగా జరగటంలేదు. క్షేత్ర స్థాయి నీటి నాణ్యత పరీక్ష కిట్ల కొనుగోలుపై చేసిన ఖర్చు నిష్ఫలమయ్యింది.*

## 5.12 సిఫార్సులు

- తలపెట్టిన నీటి పథకాలు సరిగ్గా అమలుకావటానికి, పథకం మూల్యాంకనానికి అనుకూలంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం తనవాటా నిధులను పథకంలోని అంశాలవారీగా విడుదల చేయాలి.

- వార్షిక కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలో స్థానికుల భాగస్వామ్యం ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. నీటి పథకాల అంచనా విలువ, అవి పూర్తవడానికి పట్టేకాలం పెరగకుండా ఉండాలంటే ముందస్తుగా పరిష్కరించాల్సిన అన్ని అంశాలనూ పరిపాలనాపరమైన మంజూరీలనివ్వడానికి ముందే ఖచ్చితంగా పరిష్కరించాలి.

- నీటి సరఫరా విషయంలో ఆవాసాల స్థితి మునుపటి కన్నా తక్కువస్థాయికి పడిపోకుండా ఉండాలంటే నీటి వనరులు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా వాటి మనుగడకు తగిన ప్రాధాన్యతనివ్వాలి.

- నీటి నాణ్యతను పరీక్షించే ల్యాబరేటరీల పరిధిలో ఉన్న నీటి వనరుల సంఖ్య ఆధారంగా ప్రతి ల్యాబరేటరీ నిర్వహించాల్సిన రసాయనిక, బాక్టీరియా సంబంధిత పరీక్షలకు లక్ష్యాలను నిర్ణయించాలి. అంతేకాక, నీటి వనరులన్నింటినీ కనీసం ఏడాదికి ఒక్కసారైనా పరీక్షించేందుకు వీలుగా నిర్ణీత సమయానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

- బడ్జెటులో కేటాయించిన నిధులతోనే నీటి సరఫరా పథకాలు సకాలంలో పూర్తయ్యేలా చూడటానికీ, నిర్దేశించిన విధంగా ఆవాసాలన్నింటికీ రక్షిత తాగునీరు అందడానికీ జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల్లో నిర్దేశించిన విధంగా పర్యవేక్షణ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి.

# అధ్యాయం-6

# నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

పేజీలు 147 - 166

## ఉన్నత విద్యా (సాంకేతిక విద్య) శాఖ

## 6.1 సాంకేతిక కళాశాలల నిర్వహణ

### 6.1.1 పరిచయం

మాధ్యమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులకు సాంకేతిక కళాశాలలు డిప్లొమా కోర్సులనందించి, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వారికి తగిన నైపుణ్యం అలవరచి, అనువైన నియామకాలకు దోహదపడతాయి. ఈ కళాశాలల్లో ప్రవేశం రాష్ట్ర స్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా జరుగుతుంది. రాష్ట్రంలో 2012 సెప్టెంబరు నాటికి 298 సాంకేతిక కళాశాలలు ఉన్నాయి. ఇందులో 115 ప్రభుత్వ సంస్థలు కాగా, మరో 183 ప్రైవేటువి. వీటి వార్షిక విద్యార్థి సామర్థ్యం 72,010.

ఆయా కళాశాలలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యా ప్రణాళికలు, బోధన సామర్థ్యం వంటివి అధ్యయనం చేసి అదనపు కళాశాలల అవసరాన్ని అంచనా వేయటంతోపాటు విద్యార్థుల ప్రావీణ్యత, ఉద్యోగావకాశాలపరంగా ఈ సంస్థల కార్యసాధకతని నిగ్గుతేల్చే లక్ష్యంతో 2011 సెప్టెంబరు నుంచి 2012 ఫిబ్రవరి వరకూ, తిరిగి 2012 అక్టోబరులోనూ మొత్తం 115 ప్రభుత్వ సాంకేతిక కళాశాలల నుంచి 21 సంస్థల (*అనుబంధం 6.1*) ఆడిట్ నిర్వహించి 2008-12 సంవత్సరాల రికార్డులను పరిశీలించటం జరిగింది. ఆడిట్ కనుగొన్న విషయాలు ఈ దిగువన విశ్లేషించటం జరిగింది.

### 6.1.2 కొత్త సంస్థల ఏర్పాటు

సాంకేతిక కళాశాలలను కొత్తగా అనుమతించేందుకూ, నెలకొల్పేందుకూ తగు విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం 2008 జనవరిలో రూపొందించింది. ఐతే, ఒక కొత్త కళాశాలను ఆమోదించేందుకు తగిన ప్రాతిపదికనుగానీ, ఆ సంస్థలో బోధించవలసిన పాఠ్యక్రమాలుగానీ ప్రభుత్వం విశదీకరించలేదు. రాష్ట్రంలో 2008-12 మధ్యన కొత్తగా 52 సాంకేతిక కళాశాలలను ఆరంభించారు. కొత్త కళాశాలల ఆవశ్యకత, గిరాకీలను అధ్యయనం చేయకుండానే, ఆయాప్రాంతాలలో నెలకొల్పే విద్యా సంస్థలలో ప్రవేశపెట్టాల్సిన పాఠ్యప్రణాళికలు (కోర్సులు), కోర్సులవారీగా చేర్చుకొన తగిన విద్యార్థుల సంఖ్య వంటివి ఖరారు చేయకుండానే విద్యా సంస్థలను ప్రారంభించారు. సాంకేతిక నైపుణ్యానికి ఉన్న గిరాకీ, అందుకు తగినట్లు వివిధ కోర్సులలో తీసుకొనదగిన విద్యార్థుల సంఖ్యను అంచనా వేసే దిశగా పారిశ్రామిక వర్గాలతో సమాలోచనలు జరిపిన వైనం ఆడిట్ ముందుంచిన రికార్డులలో ఎక్కడా కనిపించలేదు.

(i) పట్టభద్రులు, డిప్లొమాదార్ల మధ్య నెలకొన్న అసాధారణ నిష్పత్తి, (ii) సీఈఈపీ[1] పరీక్షకు ఉన్న గిరాకీ, (iii) వివిధ కోర్సులకు ఉన్న ఆదరణ, (iv) డిప్లొమాదార్లకు ఉన్న నియామక అవకాశాలు, (v) గ్రామీణ ప్రజలకు సాంకేతిక విద్యా సౌలభ్యం వంటివి పరిగణించి కొత్తగా ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు ప్రారంభించామని ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఫిబ్రవరి).

పారిశ్రామిక అవసరాలకూ, మార్కెట్ డిమాండ్‌కూ తగినట్లు కోర్సులవారీగా ఎన్ని సీట్లు కల్పించవలసినదీ లెక్కించిన జాడ లేనందున ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ఆమోదయోగ్యం కాదు. సీఈఈపీ పరీక్షకువచ్చే దరఖాస్తులలో ట్రేడ్‌ను పేర్కొనరు. అభ్యర్థులు తమ అర్హతాక్రమంలో అవకాశంమేరకు తాము ఎంచుకున్న కళాశాల/కోర్సులో ప్రవేశం పొందుతారు. ఇంతేకాకుండా, ఆడిట్ ఈ దిగువ విషయాలను కూడా గమనించింది :

- కొత్త కళాశాలల ఆవిర్భావానికి తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదు.

---

[1] సాంకేతిక కళాశాలలలో ప్రవేశం కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష

- ఇంజినీర్లు, డిప్లొమాదార్ల మధ్యగల అసాధారణ నిష్పత్తి దృష్ట్యా కొత్త కళాశాలలను నెలకొల్పినట్లు ప్రభుత్వం చెబుతున్నా, కొత్త కళాశాలలలో ప్రవేశపెట్టిన కోర్సులకు వివిధ ఇంజినీరింగ్ కోర్సులలో అందుబాటులో ఉన్న సీట్లతో పొంతనలేదు. కంప్యూటర్ విజ్ఞానం, సమాచార సాంకేతిక కోర్సులలో లక్షకు పైగా సీట్లు అందుబాటులో ఉండగా, కొత్తగా నెలకొల్పిన సాంకేతిక కళాశాలలకు సంబంధిత డిప్లమా కోర్సులలో అనుమతించిన సీట్ల సంఖ్య 600 మాత్రమే. సాంప్రదాయ కోర్సులకు మాత్రం ఒక్కొక్క దానికీ 1600 కుపైగా సీట్లు మంజూరు చేశారు.

- ప్రభుత్వం 2008 ఏప్రిల్‌లో అనుమతించిన సాంకేతిక కళాశాలలలో మొట్టమొదటిదైన ఒబులవారిపల్లె కళాశాలలో (వైఎస్సార్ జిల్లా) జౌళి విజ్ఞానంలో ఒక డిప్లొమాకోర్సును 2008-09 విద్యాసంవత్సరంలో ప్రవేశపెట్టారు. ఈ కోర్సులో 60 సీట్లుండగా, ఆ సంవత్సరం ఏడుగురు విద్యార్థులే చేరారు. వీరిలో ఒక విద్యార్థి తరువాత విరమించుకున్నారు కూడా. దీనితోపాటుగానే నగరి కళాశాలలో (చిత్తూరు జిల్లా పిల్లరిపట్టు) కూడా ఇదే కోర్సును ప్రవేశపెట్టారు. ఇక్కడా 60 సీట్లు కేటాయించారు. ఈ ప్రాంతంలో ఈ కోర్సుకు మంచి గిరాకీ ఉన్నదనీ, స్థానిక పరిశ్రమలలో నిపుణుల కొరత తీవ్రంగా ఉన్నదనీ చెప్పారు. ఐతే, 2008-09 సంవత్సరానికి ఈ కోర్సులో కేవలం 39 మంది విద్యార్థులే చేరారు. వీరిలో 27 మంది తర్వాత చదువు మానేశారు. తదుపరి 2009-10 సంవత్సరంలో చేరిన 18 మంది విద్యార్థులలో 12 మంది మానుకున్నారు. ఆవశ్యకతను అంచనా వేయకుండానే కోర్సులు ప్రవేశపెట్టిన వాస్తవం దీనివలన విశదమవుతోంది.

- కంప్యూటింగ్, కమర్షియల్ ప్రాక్టీసెస్‌లో డిప్లొమా కోర్సు కోసం మాత్రం విశాఖపట్నం జిల్లా పారిశ్రామిక వర్గాల నుంచి స్పష్టమైన అభ్యర్థనలు అందాయని తెలిసింది.

### 6.1.3 సాంకేతిక కళాశాలల్లో రెండవ షిఫ్టు అమలు

ప్రభుత్వం 2008-12 సంవత్సరాలలో కొత్తగా 52 సాంకేతిక కళాశాలలను ప్రారంభించటంతోపాటు, ఇదివరకే పని చేస్తున్న 27 సంస్థలలో రెండవ షిఫ్టు ప్రవేశ పెట్టి సీట్ల సంఖ్యను పెంచ తలచింది. ఈ విధంగా 2008 జూన్‌లో 11 కళాశాలలకూ, 2009 జూలై నెలలో 16 కళాశాలలకు రెండవ షిఫ్టు అమలు చేసింది.

ప్రభుత్వ సాంకేతిక కళాశాలలలో రెండవ షిఫ్టు అమలు ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఏర్పాటైన కమిటీ కేవలం ఏడు[2] కళాశాలలకే ఈ విధానాన్ని సమర్థించింది (2008 నవంబరు). ఐతే, 16 కళాశాలలో రెండవ షిఫ్టును ప్రవేశ పెట్టారు. వీటిలో హాస్టల్ సౌకర్యాలు, సిబ్బంది, మౌలిక వసతులకు కొరత ఉన్నది. వీటిలో తొమ్మిది[3] సంస్థలలోనైతే రెండవ షిఫ్టు వద్దని కమిటీ స్పష్టంగా సూచించింది.

అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఐదు[4] కళాశాలలలో రెండవ షిఫ్టుకు అనుమతించనప్పుడు కమిషనర్ వీటిలో ప్రవేశాలు ఆపిఉండాల్సింది. అంతేకాక, అవసరమైన మౌలిక వసతులనూ, సిబ్బందినీ సమకూర్చ కుండానే రెండవ షిఫ్టును ప్రవేశపెట్టటం వలన ఈ మొత్తం ప్రక్రియ నిరర్థకమయింది.

---

2 గుంటూరు, కొత్తగూడెం, నల్గొండ, నంద్యాల, శ్రీకాకుళం, విజయనగరంలలోని ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు, సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ కళాశాల

3 ఆదిలాబాద్, గూడూరు, హైదరాబాద్, నర్సీపట్నం, నెల్లూరు, ఒంగోలు, సిరిసిల్ల, వనపర్తి, జహీరాబాద్‌లలోని ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు

4 శ్రీకాకుళం, నర్సీపట్నం, గూడూరు ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు, ఇంకా ఆదిలాబాద్ సెలక్షన్‌గ్రేడ్ సాంకేతిక కళాశాల, వనపర్తిలోని కేడీఆర్ ప్రభుత్వ సాంకేతిక కళాశాల

గడువు తేదీ తరువాత దరఖాస్తు చేయటం వలన ఐదు కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతి లభించలేదని ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఫిబ్రవరి). ఐతే, ఏఐసీటీఈ ప్రత్యేకించి తిరస్కరించిన తొమ్మిది కళాశాలలో రెండవ షిఫ్టు ప్రవేశపెట్టేందుకుగల కారణాలను మాత్రం వెల్లడించలేదు.

### 6.1.4 డిప్లొమా, ఇంజినీరింగ్ పట్టభద్రుల మధ్య అసాధారణ నిష్పత్తి

డిప్లొమా, ఇంజినీరింగ్ సీట్లు 4:1 నిష్పత్తిలో ఉండాలని ఏఐసీటీఈ ప్రామాణికాలలో నిర్దేశించింది. అంటే, డిప్లొమా కోర్సులలోని ప్రతి నాలుగు సీట్లకూ ప్రతిగా ఒక ఇంజినీరింగ్ సీటు అందుబాటులో ఉండాలి. ఈ ప్రామాణికాలకు విరుద్ధంగా, డిప్లొమా, ఇంజినీరింగ్ సీట్ల మధ్య 1:4 నిష్పత్తి నెలకొంది. పర్యవసానంగా అర్హులైన నిపుణులకు కొరత ఏర్పడింది. ప్రభుత్వం కొత్తగా 52[5] సాంకేతిక విద్యా సంస్థలను మంజూరు చేసినప్పటికీ, ఇంజినీరింగ్ కళాశాలల సంఖ్య కూడా పెరుగుతుండడంతో ఈ దిగువ వివరించిన విధంగా నిష్పత్తి మాత్రం స్థిరంగానే ఉంది.

పట్టిక 6.1

| వివరం | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|
| సాంకేతిక కళాశాలల సంఖ్య | 207 | 213 | 280 | 298 |
| ఇంజినీరింగ్ కళాశాలల సంఖ్య | 535 | 656 | 707 | 705 |
| సాంకేతిక కళాశాలలలో సీట్లు | 49405 | 63075 | 65530 | 72010 |
| ఇంజినీరింగ్ కళాశాలలలో సీట్లు | 176512 | 226870 | 275750 | 304200 |
| డిప్లొమాదారులు, పట్టభద్రుల సీట్ల నిష్పత్తి | 1: 4 | 1: 4 | 1: 4 | 1: 4 |

*మూలం : రాష్ట్ర శాసన సభకు సమర్పించిన డిమాండ్ XIV ఫలితాల బడ్జెట్*

ప్రైవేటు అన్‌ఎయిడెడ్ ఇంజినీరింగ్ కళాశాలలో (అనధికృత) సీట్ల సంఖ్యను 420కి, అధికృత కళాశాలల సీట్లను 540కి పరిమితం చేయాలనీ, 2013-14 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలలను అనుమతించరాదనీ ఏఐసీటీఈకి లేఖ రాసినట్లు ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

### 6.1.5 ప్రావీణ్య వికాసానికి సమన్వితకార్యాచరణ కింద సాంకేతిక కళాశాలల పై ఉపసంఘం

"ప్రావీణ్య వికాసానికి సమన్విత కార్యాచరణ కింద సాంకేతిక కళాశాలలపై ఉపసంఘం" పేరుతో భారత ప్రభుత్వం 2008 డిసెంబరులో కేంద్రప్రాయోజిత పథకాన్నొకదానిని ప్రవేశపెట్టింది. దీనికి నూరు శాతం నిధులను కేంద్రమే ఇస్తుంది. ఈ పథకంలో అమలు చేయాల్సిన నాలుగు భాగాలు (i) ఇప్పటికే కొనసాగుతున్న సాంకేతిక కళాశాలలను బలోపేతం చేయటం (వాటి స్థాయి పెంచటం), (ii) మహిళా హాస్టళ్లను నిర్మించటం, (iii) సాంకేతిక కళాశాలల ద్వారా సమాజ వికాసం, (iv) వెనకబడ్డ జిల్లాలలో ప్రభుత్వ సాంకేతిక కళాశాలలను స్థాపించటం. రాష్ట్రంలో ఈ అంశాలను 2009-12లో అమలు చేయటంకోసం కేంద్ర ప్రభుత్వం సాంకేతిక కళాశాలలకు ₹61.69 కోట్లు విడుదల చేసింది. ఇందులో ప్రిన్సిపాళ్లకు నేరుగా ₹22.24 కోట్లు, రాష్ట్ర సంచిత నిధి ద్వారా ₹39.45 కోట్లు ఇచ్చింది. ఇందుకుగాను, ఆయా కళాశాలలు కేవలం ₹11.44 కోట్లు (18 శాతం) మాత్రమే ఖర్చు చేశాయి. మిగిలిన ₹50.25 కోట్లలో ₹12.80 కోట్లు సంబంధిత ప్రిన్సిపాళ్ల దగ్గర, ₹37.45 కోట్లు ప్రభుత్వం దగ్గర ఉండి పోయాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం ధృవీకరించింది (2013 ఫిబ్రవరి).

పథకంలోని వివిధ అంశాల అమలుతీరు ఈ కింది విధంగా ఉంది.

---

[5] 2008-09లో 33; 2009-10లో 16; 2010-11లో 1; 2011-12లో 3; చినమేరంగి సాంకేతిక కళాశాల 2011 డిసెంబరులో మంజూరైనా, అది ఆ సంవత్సరం ప్రారంభమవలేదు. 2008-12 సంవత్సరాలలో నికరంగా 52 కళాశాలలను మాత్రమే ఆరంభించారు

పట్టిక 6.2

(₹ కోట్లలో)

| అంశం పేరు | సంక్షిప్త వివరణ | కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు | వ్యయం | ఖర్చుకాని మిగులు |
|---|---|---|---|---|
| సాంకేతిక కళాశాలల స్థాయి పెంచటం | కేంద్ర ప్రభుత్వం 57 ప్రభుత్వ కళాశాలలకు మొత్తం ₹24.40 కోట్లు విడుదల చేసింది. | 2009-10: 2.80<br>2010-11: 3.00<br>2011-12: 18.60* | 2.45 | 21.95 |
| మహిళా హాస్టల్ భవనాల నిర్మాణం | కేంద్ర ప్రభుత్వం మొత్తం 46 ప్రభుత్వ/ఎయిడెడ్ కళాశాలలకు ఒక్కొక్క దానికీ కోటి రూపాయల చొప్పున పనిలో పురోగతిని బట్టి మంజూరు చేసింది. | 2009-10: 5.40<br>2010-11: 4.50<br>2011-12: 9.20# | 6.28 | 12.82 |
| సాంకేతిక కళాశాలల ద్వారా సమాజ వికాసం | సర్వే, నైపుణ్య వికాసం, ఉత్పాదన వృద్ధిలతో పాటు గ్రామీణులకు, మురికివాడల వాసులకు సాంకేతిక సాయమందించేందుకు కేంద్రం 48 ప్రభుత్వ సాంకేతిక కళాశాలలను ఎంపిక చేసింది. | 2009-10: 4.82<br>2010-11: 1.72<br>2011-12: 3.65* | 2.27 | 7.92 |
| వెనుకబడిన జిల్లాలలో ప్రభుత్వ సాంకేతిక కళాశాలల ఏర్పాటు | రంగారెడ్డి జిల్లా వికారాబాద్ ప్రభుత్వ సాంకేతిక కళాశాలకు కేంద్ర ప్రభుత్వం ₹12.30 కోట్లు మంజూరు చేసింది. (ఇందులో నిర్మాణ పనులకు ₹8 కోట్లు, పరికరాలకు ₹4.30 కోట్లు) | 2009-10: 2.00<br>2011-12: 6.00 | 0.44 | 7.56 |

** బడ్జెట్ విడుదల ఆదేశాలు 2012 సెప్టెంబరులో జారీ చేశారుగానీ నిధులు విడుదల చేయలేదు*
*# రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు*

పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించగా ఈ దిగువ విషయాలు తెలిశాయి :

### *6.1.5.1 సాంకేతిక కళాశాలల స్థాయిని పెంచటం*

పథకం అమలు చేయటం కోసం 2009-11 సంవత్సరాలలో నిధులందుకున్న 42[6] సంస్థలకుగాను కేవలం 11 సంస్థలు మాత్రమే పరికరాల కొనుగోలు కోసం నిధులు వెచ్చించాయి (ఇవి తమకు విడుదల చేసిన మొత్తం ₹1.20 కోట్ల నుంచి ₹1.17 కోట్లు ఖర్చు చేసుకున్నాయి). మిగిలిన 31 సంస్థలలో 15 సంస్థలు తమకు వచ్చిన ₹2.30 కోట్ల నుంచి ₹1.28 కోట్లు ఖర్చు చేశాయి. మరో 16 కళాశాలలు తమకందిన నిధులను అసలే వినియోగించుకోలేదు. ఆవిధంగా, వివిధ కళాశాలకు 2009-11 సంవత్సరాలలో ఇచ్చిన నిధులు టెండరు ప్రక్రియలోని జాప్యం కారణంగా 58 శాతం (మొత్తం ₹5.80 కోట్లకుగాను ₹3.35 కోట్లు) ఖర్చుకాకుండా ప్రిన్సిపాళ్ళ దగ్గరే ఉండిపోయాయి. ఈ కళాశాలలు కాలంచెల్లిన పాత పరికరాలతోనే నెట్టుకొస్తున్నాయి.

ఖర్చుకాని నిధులను 2013 మార్చిలోగా ఖర్చు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి).

[6] మంజూరు చేసిన 44 కళాశాలలలో రెంటికి నిధులు విడుదల చేయలేదు

### 6.1.5.2 మహిళా హాస్టళ్ళ నిర్మాణం

ఇప్పటివరకూ అనుమతించిన[7], 46 మహిళా హాస్టళ్ళలో 36 హాస్టళ్ళ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం వివిధ సంస్థలకు[8] పనులప్పగించింది. మిగతా 10 హాస్టళ్ళకు[9] సంబంధించి పాలనాపరమైన అనుమతులు 2012 నవంబరు నాటికి అందవలసి ఉంది.

- ఈ 36 హాస్టళ్ళలో గృహనిర్మాణ సంస్థకు 2010 జూన్ కన్నాముందే అప్పగించిన 6 హాస్టళ్ళు, మహానగర పాలక సంస్థకు అప్పగించిన 2 హాస్టళ్ళ పనులు ఆయా సంస్థలు తమ అశక్తత వ్యక్తం చేయటంతో 2012 సెప్టెంబరు నాటికి మొదలుకాలేదు.

- ప్రొద్దుటూరు ప్రభుత్వ సాంకేతిక కళాశాలలోని మహిళా హాస్టల్‌కు 2012 నవంబరు వరకూ టెండర్లు ఖరారు కాలేదు.

- మిగతా 27 హాస్టళ్ళలో పనులు కొనసాగుతున్నాయి (2012 డిసెంబరు). 2012 మార్చిలోగా పూర్తి కావలసిన పనులు కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినాగానీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి.

- హిందూపూర్ ప్రభుత్వ మహిళా సాంకేతిక కళాశాల కోసం కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల ఖర్చుతో హాస్టల్ నిర్మాణానికి 2009 ఆగస్టులో ఆమోదించి, అదేనెలలో ₹20 లక్షలు విడుదల చేసింది. సంవత్సరం పైగా గడిచాక, ప్లానులు రూపొందించాల్సిందిగా కమిషనర్ సంబంధిత ప్రిన్సిపాల్‌కు 2010 నవంబరులో ఆదేశాలు జారీ చేశారు. ఐతే, ఇప్పటికే అందుబాటులో ఉన్న మూడంతస్తుల హాస్టల్ భవనంలో 14 గదులు (ఒక్కొక్క దాంట్లో ఆరు నుంచి ఎనిమిదిమంది ఉండవచ్చు) ఖాళీగా ఉన్నందున కళాశాలకు కొత్తగా హాస్టల్ భవనం అవసరం లేదని ప్రిన్సిపాల్ ఐదు నెలల తర్వాతే తెలియ చేశారు (2011 ఏప్రిల్). ఐనాగానీ, ప్రభుత్వ శాఖ నిర్మాణపనులు మొదలు పెట్టి 2012 సెప్టెంబరు నాటికి ₹14 లక్షలు ఖర్చు చేసింది.

  పాత భవనానికి మరమ్మతులు అవసరం కావటంతో కొత్త భవన నిర్మాణం చేపట్టామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 ఫిబ్రవరి). తమ కళాశాలకు కొత్తగా హాస్టల్ భవనం అవసరం లేదని ప్రిన్సిపాల్ 2011 ఏప్రిల్‌లో వెలిబుచ్చిన అభిప్రాయంతో ఈ సమాధానానికి పొంతనలేదు.

ప్లానులను ఖరారు చేయటం, లేఔట్‌లను ఆమోదించటంలో జాప్యం, ప్లానులకు మార్పులు చేయటం, స్థలాలను స్వాధీనం చేయమంటూ ప్రిన్సిపాళ్ళకు కమిషనర్ ఆదేశాలివ్వటంలో జాప్యం, నిర్మాణ సంస్థలకు డబ్బులు చెల్లించటంలోని ఆలస్యం, అలాగే హైదరాబాద్ మహానగరపాలక సంస్థ, గృహ నిర్మాణ సంస్థలు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవటం మొదలైన సమస్యలు నిర్మాణపు పనులను ఆటంకపరచినట్లు ఆడిట్ గమనించింది. ఫలితంగా, నిధులు అందుబాటులో ఉన్నాగానీ, మహిళా హాస్టళ్ళు ఏవీ పూర్తి కాలేదు. దీనివలన, బాలికలకు హాస్టల్ వసతి లభించకపోగా, కేంద్ర సాయంగా రావలసిన మిగతా ₹27 కోట్లను భారత ప్రభుత్వం విడుదల చేయలేదు.

ఆడిట్ గమనించిన విషయాలను ప్రభుత్వం అంగీకరిస్తూ, 27 హాస్టల్ భవనాలు 2013 మార్చి నాటికి పూర్తి అవుతాయనీ మిగతా 19 భవనాలను 2013 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామనీ చెప్పింది (2013 ఫిబ్రవరి).

---

[7] 2008-09 లో13; 2009-10 లో 9; 2010-11 లో 14; 2011-12 లో 10

[8] ఏపీఈడబ్ల్యూఐడీసీ (13), ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీ (14), ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ (6), హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (2), పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం (1)

[9] ఆదిలాబాద్ (1), తూర్పుగోదావరి (1), కరీంనగర్ (2), నల్గొండ (1), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (1), ప్రకాశం (2), విశాఖపట్నం (1), వరంగల్ (1)

### *6.1.5.3 సాంకేతిక కళాశాలల ద్వారా సమాజ వికాసం*

లక్షిత వర్గాల వారి అవసరాలను ఆకళింపు చేసుకుని, వారికి నైపుణ్య వికాస శిక్షణనిచ్చేందుకూ, గ్రామీణులకూ, మురికి వాడల వాసులకూ సాంకేతిక, సహాయక సేవలందించేందుకూ 'సాంకేతిక కళాశాలల ద్వారా సమాజ వికాసం' అనే పథకం అమలు చేయమని భారత ప్రభుత్వం సాంకేతిక కళాశాలలకు నిధులిస్తోంది. ఈ పథకం కింద భారత ప్రభుత్వం 2009-11 సంవత్సరాల మధ్య ₹6.54 కోట్లు సాంకేతిక కళాశాలలకు నేరుగా విడుదల చేసింది. ఐతే, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ళు ₹2.27 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, 2012 సెప్టెంబరు నాటికి ఇంకా ₹4.27 కోట్లు తమ బ్యాంకు ఖాతాలలోనే ఉంచారు. భారత ప్రభుత్వం మరో ₹3.65 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చి (2012 మార్చి) కళాశాలలకు అందచేయమని చెప్పినా, 2012 సెప్టెంబరు నాటికి ఇంకా ఈ మొత్తం కళాశాలలకు విడుదల కాలేదు.

ఈ విషయమై ఆడిట్ పరిశీలనలు ఈ విధంగా ఉన్నాయి :

- నమూనా ఆడిట్‌కు ఎంచుకున్న 21 కళాశాలలో తొమ్మిదింట[10] ₹1.16 కోట్లకుగాను ₹71.44 లక్షలు (62 శాతం) ఖర్చుకాకుండా బ్యాంకు ఖాతాలలోనే ఉన్నాయి.

- కళాశాలలు రికరింగ్ గ్రాంట్లను వినియోగించుకున్నాయి కానీ, కమిషనర్ నుంచి ప్రత్యేక అనుమతి అవసరం కావటంతో నాన్‌రికరింగ్ గ్రాంట్లను వినియోగించుకొనలేకపోయాయి.

టెండర్ ప్రక్రియకు సంబంధించి ప్రిన్సిపాళ్ళ స్థాయిలో జాప్యం జరగగా, అనుమతులిచ్చే విషయంలో కమిషనర్ పరంగా ఆలస్యం జరుగుతోందని ఆడిట్ గమనించింది. ఆడిట్ వ్యాఖ్యలను ప్రభుత్వం అంగీకరిస్తూ, అవసరమైన పరికరాల కొనుగోలుకు నాన్‌రికరింగ్ గ్రాంటును వెచ్చిస్తామని బదులిచ్చింది (2013 ఫిబ్రవరి).

### *6.1.5.4 వెనుకబడిన జిల్లాలలో ప్రభుత్వ సాంకేతిక కళాశాలల ఏర్పాటు*

దేశంలో సాంకేతిక విద్యా సంస్థల పురోభివృద్ధిని ప్రేరేపించే దిశగా భారత ప్రభుత్వం రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు లేని జిల్లాలలోనూ, ప్రభుత్వ - ప్రైవేటు రంగాలలో కొత్తగా సాంకేతిక కళాశాలలు నెలకొల్పటం సులువుకాని జిల్లాలలోనూ కళాశాలల ఆవిర్భావానికి అవసరమయ్యే క్యాపిటల్ వ్యయాన్ని భరించేందుకు వీలుగా భారత ప్రభుత్వం ఈ సాయమందించింది. ఈ పథకం కింద రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో ఒక సాంకేతిక కళాశాలను ₹12.30 కోట్ల వ్యయంతో మంజూరు చేసింది (2009 జూలై). దీనికి అవసరమయే నాన్ రికరింగ్ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

ఈ విషయంలో ఆడిట్ గమనించిన అంశాలు ఇలా ఉన్నాయి :

- భారత ప్రభుత్వం నుంచి ₹ఎనిమిది కోట్లు అందగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో ₹రెండు కోట్ల మొత్తాన్ని నిర్మాణ బాధ్యతలు చేపట్టిన ఏపీహెచ్‌ఎమ్‌హెచ్‌ఐడీసీ సంస్థకు చెల్లించింది (2011 జూన్). పనిని గుత్తేదారుకి 2011 ఆగస్టులో అప్పగించారు.

---

[10] ఎస్‌జీఎం జీపీటీ, అబ్దుల్లాపూర్‌మెట్ : ₹7.24 లక్షలు/₹13.25 లక్షలు; జేఎన్ జీపీటీ, రామంతాపూర్ : ₹6 లక్షలు/₹10.25 లక్షలు; ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీ, సికింద్రాబాద్ : ₹6.77 లక్షలు/₹13.75 లక్షలు; జీపీటీ ఫర్ ఉమెన్, మెదక్ : ₹6.32 లక్షలు/₹10.25 లక్షలు; ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడ: ₹10.21 లక్షలు/₹14.75 లక్షలు; జీపీటీ ఫర్ ఉమెన్, కాకినాడ: ₹11.21 లక్షలు/₹17.85 లక్షలు; బీఆర్ అంబేద్కర్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్, రాజమండ్రి: ₹4.43 లక్షలు/₹10.25 లక్షలు; జీపీటీ ఫర్ మైనారిటీస్, కర్నూలు : ₹15.25 లక్షలు/₹15.25 లక్షలు; గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, సికింద్రాబాద్ : ₹4.00 లక్షలు/₹10.25 లక్షలు

- తొలుత హద్దులను తప్పుగా గుర్తించటం వలన స్థలాన్ని మరోమారు సర్వే చేసి (2011 అక్టోబరు), లేఔట్‌ను సవరించాల్సి రావటంతో నిర్మాణం పనులు మొదలు పెట్టటానికి ఆలస్యం జరిగింది. సవరించిన డ్రాయింగులు, నిర్మాణ సంబంధిత డిజైన్లను గుత్తేదారుకు 2012 ఏప్రిల్‌లో మాత్రమే అందచేశారు. నిర్మాణం 2012 ఆగస్టులో పూర్తి కావలసి ఉన్నాగానీ 2012 డిసెంబరు నాటికి ₹1.99 కోట్లు ఖర్చయింది. పనులు వివిధ దశల్లో[11] ఉన్నాయి.

నిర్మాణం పనులు 2013 మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేసి ఆతర్వాత పరికరాలు సమకూరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2013 ఫిబ్రవరి).

### 6.1.6 మౌలిక వసతుల కొరత

నమూనా తనిఖీ చేసిన 21 సాంకేతిక కళాశాలల రికార్డులు పరిశీలించగా మౌలిక వసతులకు సంబంధించి ఈ దిగువ వివరించిన లోటుపాట్లు బయట పడ్డాయి :

- ఏఐసీటీఈ ప్రామాణికాల ప్రకారం కేటగిరీ (X) కోర్సులకు (మెకానికల్, ప్రొడక్షన్, సివిల్, ఎలక్ట్రికల్, కెమికల్, టెక్స్‌టైల్, మెరైన్, ఏరోనాటికల్ కోర్సులు, వాటి అనుబంధ కోర్సులు) ఆరు ప్రయోగశాలలు, ఒక వర్క్‌షాపు ఉండాలి. ప్రగతిశీల అవసరాలు, ద్వితీయ సంవత్సరం, ఇంకా ఆ తదుపరి అవసరాలను ఒక్కొక్క కోర్సుకు 2+2 ప్రయోగశాలల వంతున లెక్కించాలి. నారాయణఖేడ్, నర్సాపూర్ కళాశాలలు రెండింటిలోనూ ప్రయోగశాల, వర్క్‌షాపు వసతులులేవు. మరో 16 కళాశాలలలో కూడా ఈ సదుపాయాలు ఏఐసీటీఈ నిర్దేశించిన స్థాయిలోలేవు.
- అనకాపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, నారాయణఖేడ్‌లలోని నాలుగు కళాశాలలలో గ్రంథాలయాలు లేవు. నమూనా తనిఖీ చేసిన 21 కళాశాలలలో పన్నెండింట లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ప్రామాణికాలను అనుసరించి రెండేసి గదులు అవసరంకాగా 13 కళాశాలలలో ఒక్కొక్క గది మాత్రమే ఉన్నది.
- అనకాపల్లి, మెదక్, నారాయణఖేడ్, సంగారెడ్డిలలో కొత్తగా నెలకొల్పిన కళాశాలలో కంప్యూటర్ ప్రయోగ శాలలు లేవు.
- కంప్యూటర్ - విద్యార్థి నిష్పత్తి 1:8 ఉండాలని ఏఐసీటీఈ నిర్దేశించింది. ఐతే, నమూనా తనిఖీ చేసిన 21 కళాశాలలలో ఎనిమిదింట ఈ నిష్పత్తి ఇందుకు రెట్టింపు ఉన్నది. అంతే కాకుండా, 18 కళాశాలలలో ఉన్న మొత్తం 1269 కంప్యూటర్లలో 592 (46 శాతం) మాత్రమే పనిచేసే స్థితిలో ఉన్నాయి.
- ఆరు సాంకేతిక కళాశాలలలో లోకల్ ఏరియా నెట్‌వర్క్ సమకూర్చలేదు. మూడు కళాశాలలలో విద్యార్థులకు అంతర్జాల (ఇంటర్‌నెట్) సదుపాయం కల్పించలేదు.
- నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ సాంకేతిక కళాశాలలో ₹23.85 లక్షల విలువైన యంత్రాలు, పరికరాలు పనిచేయటం లేదు.
- నారాయణఖేడ్, నర్సాపూర్, సంగారెడ్డి, శ్రీశైలంలలోని నాలుగు కళాశాలలలో జనరేటర్ సదుపాయంలేదు. కర్నూలు జీ పీటీ (మైనారిటీస్) కళాశాలకు 50 కేవీ సామర్థ్యంగల జనరేటర్ అవసరంకాగా 25 కేవీ సామర్థ్యంగల జనరేటర్ మాత్రమే ఉన్నది.
- అనకాపల్లి, నారాయణఖేడ్, సంగారెడ్డిలలోని మూడు కళాశాలలలో మరుగుదొడ్లు లేవు.

[11] కళాశాల భవనం మొదటి అంతస్తు శ్లాబు వేశారు; ప్రయోగశాల విభాగంలో ఇటుక కట్టుబడి జరుగుతోంది; హాస్టల్ భవనానికి శ్లాబు వేశారు

సాంకేతిక కళాశాలలకవసరమైన కొన్ని పరికరాలను ఇప్పటికే తెప్పించామనీ మిగిలిన వాటిని కూడా 2013-14లో సమకూర్చగలమనీ, అప్పటికి సాంకేతిక కళాశాలలలో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో ఉండగలవనీ ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

- కొత్తగా ప్రారంభించిన 30 సాంకేతిక కళాశాలలలో ప్రయోగశాల పరికరాలకోసం, పుస్తకాల కోసం ప్రభుత్వం 2009 మార్చి నెలలో ₹6.30 కోట్లు విడుదల చేసింది. ఈ సంస్థలు ₹6.21 కోట్ల విలువైన పరికరాలు, పుస్తకాలు వెంటనే కొనుగోలు చేసినాగానీ, సొంత భవనాలు లేకపోవటంతో వీటిని సమీపంలోని ఇతర కళాశాలలలో భద్రపరుచుకోవలసి వచ్చింది. వీటిలో 13 కళాశాలలు తెప్పించుకున్న ₹1.74 కోట్ల విలువైన పరికరాలు, పుస్తకాలను 2012 సెప్టెంబరు నాటికి మూటవిప్పనే లేదు.
- కొత్త కళాశాలల విద్యార్థులకు ఇంజినీరింగ్ పాఠ్యాంశాలలో ప్రయోగ తరగతులను సమీపంలోని సాంకేతిక, ఇంజినీరింగ్ కళాశాలలలో నిర్వహిస్తున్నారు. ఇవి 30 నుండి 100 కి.మీ. దూరాన ఉండటంతో ఈ తరగతులను నెలకొకమారు లేదా శలవులలో నిర్వహిస్తున్నారు. ఆవిధంగా విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటుగా ప్రయోగాలలో వెనువెంటనే (ఏకకాలంలో) శిక్షణ లంభించటంలేదు.

ఆడిట్ గమనించిన విషయాలను ప్రభుత్వం కూడా అంగీకరిస్తూ, స్థలాభావం వలన పరికరాలను వినియోగించటం లేదనీ, 2013 వేసవిలో అన్ని పరికరాలను అమర్చి, ఆతర్వాత విద్యార్థులకు ప్రయోగ తరగతులను పాఠ్యాంశాలతోపాటే బోధించేలా చూస్తామనీ తెలిపింది.

### 6.1.7 సిబ్బంది

సాంకేతిక కళాశాలలకు ఆమోదించిన మొత్తం సిబ్బంది 8,301 కాగా 2012 సెప్టెంబరు నాటికి వీటిలో 4,094 పోస్టులు (49 శాతం) ఖాళీగా ఉన్నాయి. ఈ కళాశాలల నిర్వహణకు కీలకమైనవిగా భావించే పలు స్థాయిలలో ఈ దిగువ సూచించినట్లు భారీగా ఖాళీలున్నాయని రికార్డుల పరిశీలనలో వెల్లడైంది.

పట్టిక 6.3

| స్థాయి పేరు | ఆమోదించినది | ఉన్నవారు | ఖాళీలు (శాతం) |
|---|---|---|---|
| ప్రిన్సిపాల్ | 111 | 85 | 26 (23) |
| విభాగాధిపతులు | 426 | 186 | 240 (56) |
| సీనియర్ ఉపన్యాసకులు | 514 | 338 | 176 (34) |
| ఉపన్యాసకులు | 2137 | 765 | 1372(64) |
| సీనియర్ శిక్షకులు | 419 | 212 | 207 (49) |
| పాలనాధికారులు | 90 | 32 | 58(64) |
| ప్రయోగశాల సహాయకులు | 608 | 75 | 533(88) |

*మూలం : సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ రికార్డులు*

నమూనా తనిఖీ చేసిన 21 కళాశాలలలో 91 కిగాను 30 విభాగాధిపతి పోస్టులు, అలాగే 435 కిగాను 95 ఉపన్యాసకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఐసీటీఈ ప్రామాణికాల ప్రకారం ఉపాధ్యాయుడు - విద్యార్థి నిష్పత్తి 1: 20 ఉండాలి. ఐతే, ఈ 21 కళాశాలలలో 842 కి బదులు కేవలం 510 మంది బోధనా సిబ్బంది ఉన్నారు. ఆవిధంగా, ఈ కళాశాలలలో 332 (39 శాతం) మంది తక్కువగా ఉన్నారు.

కీలక పోస్టులలో ఖాళీల విషయమై ఆడిట్ అభిప్రాయంతో ప్రభుత్వం ఏకీభవిస్తూ అర్హతగల అభ్యర్థులు విభాగాధిపతులు, సీనియర్ ఉపన్యాసకులు, పాలనాధికారులుగా పదోన్నతులు పొందారని పేర్కొంది (2013 ఫిబ్రవరి). ఇక సీనియర్ శిక్షకుల విషయంలో మాత్రం కిందిస్థాయిలో పదోన్నతికి అర్హతగల వారెవరూ లేరనీ,

వారికి పదోన్నతి యోగ్యత కలిగినప్పుడు ఖాళీలన్నీ భర్తీ చేస్తామని చెప్పింది. ప్రయోగశాల సహాయకులలో ఉన్న 376 ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుకూడా ప్రభుత్వం తెలిపింది.

## 6.1.8 విద్యార్థుల ప్రావీణ్యత

ప్రభుత్వ సాంకేతిక కళాశాలలలో 2008-11 మధ్య ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారు పొందిన ఉపాధి అవకాశాలు ఈ దిగువ విధంగా ఉన్నాయి.

పట్టిక 6.4

| సంవత్సరం | తుది పరీక్షలకు హాజరైన విద్యార్థులు# | ఉత్తీర్ణులైన విద్యార్థులు | ఉత్తీర్ణత శాతం | శిక్షణ వేతనం పొందిన విద్యార్థులు | పారిశ్రామిక భాగస్వాములు | ఉద్యోగాలు పొందిన విద్యార్థులు |
|---|---|---|---|---|---|---|
| 2008-09 | 7250 | 5798 | 80 | 1270 | 142 | 920 |
| 2009-10 | 8237 | 7278 | 88 | 1505 | 183 | 1120 |
| 2010-11 | 14409 | 11693 | 81 | 1897 | 202 | 1730 |
| 2011-12 | 18774 | 9317 | 50 | ప్రభుత్వ శాఖ సమాచారం ఇవ్వలేదు | | |
| | 48670 | 34086 | 70 | 4672 | 527 | 3770 |

*మూలం : సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ రికార్డులు*

*# ఈ అంకెలు ప్రభుత్వ సాంకేతిక కళాశాలలకు సంబంధించినవి మాత్రమే*

ఉత్తీర్ణత శాతం 2011-12లో ఒక్కసారిగా పడిపోయింది. కారణాలు పరిశీలించగా 2008-09 నుంచి ప్రారంభమైన కొత్తకళాశాలలలో ఉత్తీర్ణత శాతం పాత కళాశాలల కంటే చాలా తక్కువగా ఉన్నట్లు తేలింది. ఉత్తీర్ణత శాతం 2010-11, 2011-12 సంవత్సరాలలో పాత కళాశాలలలో 85 శాతం, 54 శాతం ఉండగా, కొత్త కళాశాలలలో ఇది 54 శాతం, 33 శాతం ఉన్నది.

విద్యార్థులు 2008-09 నుంచి 2010-11 సంవత్సరాల మధ్య 24,769 మంది ఉత్తీర్ణత సాధించగా, కేవలం 4,672 మందికి (19 శాతం) శిక్షణ వేతనం లభించింది. కేవలం 3,770 మంది (15 శాతం) నియామకాలు పొందారు. ఈ విషయంమీద వీలైనంత వెంటనే దృష్టి సారించాలి.

ఆడిట్ పరిశీలనలను ప్రభుత్వం అంగీకరిస్తూ, శిక్షణలో విద్యార్థులు అంత తక్కువగా పాల్గొనటానికి కారణం వారు ఉన్నత విద్యను అభ్యసించి, ఆపై మెరుగైన ఉద్యోగావకాశాలు పొందకోరటమేనని బదులిచ్చింది. పరిశ్రమలలో డిప్లొమా విద్యార్థులకు ఉద్యోగావశాలు పెంపొందించటం ద్వారా నియామక ప్రక్రియని బలోపేతం చేసే దిశగా చర్యలు ఆరంభించినట్లు కూడా తెలిపింది. అంతేకాక, విద్యార్థులకు ప్రత్యుపాయ తరగతులు కూడా నిర్వహిస్తున్నామనీ, మెరుగైన ఫలితాలు ఆశిస్తున్నామని కూడా ప్రభుత్వం పేర్కొంది.

## 6.1.9 సారాంశం

***మొత్తం 115 సాంకేతిక కళాశాలల నుంచి 21 కళాశాలలను నమూనాప్రాతిపదికన పరిశీలించగా కొత్త కళాశాలల ఆవిర్భావానికి తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదనీ, వీటిలో ప్రవేశపెట్టిన కోర్సులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలలలో ఉన్న సీట్లకు అనువుగా లేవనీ తెలిసింది. అవసరమైన హాస్టల్ వసతులనూ సిబ్బందినీ సమాకూర్చ కుండానే కొన్ని కళాశాలలో రెండవ షిఫ్టును అమలు చేశారు. ప్రావీణ్య వికాసానికి సమన్విత కార్యాచరణ కింద సాంకేతిక కళాశాలలపై ఉపసంఘం పథకం అమలు చేయమని కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం 2009-12లో ఇచ్చిన నిధులలో కేవలం 18 శాతం మాత్రమే (₹61.69 కోట్లలో ₹11.44 కోట్లు) వినియోగించుకున్నారు.***

*మిగిలిన మొత్తంలో ₹12.80 కోట్లు (21 శాతం) ప్రిన్సిపాళ్ళ దగ్గరా, మరో ₹37.45 కోట్లు (61 శాతం) రాష్ట్ర ప్రభుత్వం దగ్గరా ఉండిపోయాయి. ప్రయోగశాలలు/వర్క్ షాప్, లోకల్ ఏరియా నెట్‌వర్క్, మరుగుదొడ్లు లేకపోవటం, పనిచేయని పరికరాల వంటి పలు మౌలిక లోపాలు నమూనా తనిఖీలో బయట పడ్డాయి. ఈ కళాశాలల నిర్వహణకు కీలకమైనవిగా భావించే పలు పోస్టులలో భారీగా ఖాళీలున్నాయి. విద్యార్థులు 2008-09, 2010-11 మధ్య 24,769 మంది ఉత్తీర్ణత సాధించగా, కేవలం 4,672 మందికి (19 శాతం) శిక్షణ వేతనం లభించింది. కేవలం 3,770 మంది (15 శాతం) నియామకాలు పొందారు. ఈ విషయంమీద వీలైనంత వెంటనే దృష్టి సారించాలి.*

ఉన్నత విద్యాశాఖ
(జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం)

## 6.2 బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణంలో జాప్యం

**అనంతపురం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల డ్రాయింగులు, డిజైన్లను రూపొందించటంలోని ఆలస్యం, డిజైన్లను మధ్యంతరంగా మార్చటం, మిగతా పనులు ఎవరికీ ఇవ్వకపోవటం వలన బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణానికి వెచ్చించిన ₹1.87 కోట్ల ఫలితమివ్వకపోగా ఆరు సంవత్సరాల జాప్యంతోపాటు 2012 అక్టోబరు నాటికి ₹3.19 కోట్ల అదనపు ఆర్థిక భారానికి దారి తీసింది**

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ₹12.40 కోట్ల అంచనాతో అనంతపురం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో[12] మౌలిక వసతుల కల్పన కోసం 2005 ఏప్రిల్‌లో ఆమోదం తెలిపింది. కళాశాల ప్రాంగణంలో ₹4.50 కోట్ల ఖర్చుతో బహుళప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణం కూడా ఈ పనుల్లో ఒకటి. టెండరు ప్రక్రియ పూర్తి చేసిన మీదట 2005 జూన్‌లో పనులను రాంకీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనే గుత్తేదారు సంస్థకు అప్పగించారు. నిర్మాణం తొమ్మిది నెలల వ్యవధిలో 2006 మార్చిలోగా పూర్తి చేయవలసి ఉంది. కళాశాలలో మౌలిక వసతులకు సంబంధించిన మిగతా పనులన్నీ 2008 ఏప్రిల్‌కల్లా పూర్తయినా ఆడిటోరియం మాత్రం 2012 నవంబరు నాటికీ పూర్తవలేదు.



*అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో కూలగొట్టిన కాంక్రీటు శ్లాబులు, స్టేజి బీమ్ (2012 ఆగస్టు 10)*

డ్రాయింగులు, డిజైన్లను ఖరారు చేయటంలోనూ, వాటిని గుత్తేదారుకు అందచేయటంలోనూ కళాశాల జాప్యం చేయటం వలన నిర్మాణ పనులు ఆగిపోయినట్లు కళాశాల దస్త్రాలను 2012 జూన్‌లో ఆడిట్ పరిశీలించగా తెలిసింది. గుత్తేదారుకు పనులను 2005 జూన్‌లో అప్పగించగా డ్రాయింగులు, డిజైన్లను గుత్తేదారు సంస్థకు 2005 ఆగస్టు నుంచి 2006 సెప్టెంబరు మధ్యన ఇచ్చారు.

[12] ఇప్పుడు జేఎన్‌టీయూ, అనంతపురం అని వ్యవహరిస్తున్నారు

అంతేకాకుండా, కాంక్రీటు శ్లాబులు, స్టేజి బీమ్ వేయాలని కళాశాల తొలుత ఒప్పందంలో పేర్కొనగా, తేలికపాటి పైకప్పునూ, ట్రస్‌నూ నిర్మించాలని ఆతర్వాత 2007 ఫిబ్రవరిలో యోచన చేసింది. దీంతో కొన్ని నిర్మాణాలను కూలగొట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. తేలికపాటి పైకప్పు కోసం గుత్తేదారు 2007 ఫిబ్రవరిలో సమర్పించిన డిజైన్లు, మిగతా పనులకు ఎస్ఎస్ఆర్ 2007-08 రేట్లను వర్తింపచేయాలన్న అభ్యర్థనా ఆమోదయోగ్యం కాకపోవటంతో కళాశాల నిర్మాణ పనులను 2007 జూలైలో అర్థంతరంగా ఆపించింది. అప్పటికి ఇంచుమించు 40 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి చేసేందుకు ₹5.82 కోట్లకు పాలనాపరమైన అనుమతి 2011 ఏప్రిల్‌లో ఇచ్చారు. ఇతే, 2012 జూన్ నాటికి టెండర్లను పిలవలేదు. ఇప్పటికే ₹1.87 కోట్లు ఖర్చు చేసినా ఆడిటోరియం అసంపూర్తిగానే మిగిలి ఉంది.

విశ్వవిద్యాలయాన్ని జేఎన్‌టీయూ నుంచి వేరుచేయటం వలన (2008 సెప్టెంబరు) గ్రాంటులను పంచుకొన వలసి వచ్చిందనీ, కొత్త విశ్వవిద్యాలయం (అనంతపురం జేఎన్‌టీయూ)లో ఈ నిర్మాణ పనులకు బడ్జెట్ కేటాయింపు లేకపోవటం, బిల్డింగ్ కమిటీ నుంచి సాంకేతికపరమైన అనుమతి తీసుకోవలసిరావటం వలన పనులు చేపట్టలేక పోయినట్టు అనంతపురం జేఎన్‌టీయూ తెలిపింది (2012 సెప్టెంబరు). ఐతే, విశ్వవిద్యాలయం విభజనకు చాలాముందే 2006 మార్చిలోనే ఈ నిర్మాణం పూర్తి కావలసి ఉన్నందున ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు. అంతే, కాకుండా, పనులను 2007 జూలైలోనే[13] అర్థంతరంగా ఆపేశారు. విశ్వవిద్యాలయం విభజన (2008 సెప్టెంబరు) జరిగేసరికే పనులు పూర్తిచేయటానికి తగిన వ్యవధి ఉన్నది.

***ఆ విధంగా కళాశాల డ్రాయింగులు, డిజైన్లను రూపొందించటంలోని జాప్యం, డిజైన్లను మధ్యంతరంగా మార్చటంతో పాటు మిగతా పనులు ఎవరికీ ఇవ్వకపోవటం వలన ₹1.87 కోట్ల వ్యయం ఫలితమివ్వకపోగా ఆరు సంవత్సరాల జాప్యంతోపాటు 2012 అక్టోబరు నాటికి ₹3.19 కోట్ల అదనపు భారానికి దారితీసింది.***

***ఈ విషయాన్ని 2012 ఆగస్టులో ప్రభుత్వానికి తెలియచేయడమైనది; పలుమార్లు గుర్తుచేసినా (2012 సెప్టెంబరు, 2013 ఫిబ్రవరి) వారి నుండి సమాధానం రాలేదు (2012 ఫిబ్రవరి).***

## యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ

### 6.3 శిల్పారామం వద్ద ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టు

**కౌలు మొత్తాన్ని లెక్కించేందుకు అప్పటి మార్కెట్ విలువను తీసుకొనకపోవటం వలన ప్రభుత్వానికి మొత్తం కౌలు కాలానికి (33 ఏళ్లకు) అద్దె రూపేణా ₹29.36 కోట్లు నష్టం ఆమేరకు డెవలపర్‌కు అనుచిత ప్రయోజనం చేకూరింది**

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద ₹80-100 కోట్ల అంచనా వ్యయంతో ఒక ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించ తలచింది (2005 ఫిబ్రవరి). పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపట్టాలనుకున్న ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు ఆహ్వానించగా (i) తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్, (ii) మై హోం గ్రూప్ అనే రెండు సంస్థలు 2005 జూలైలో తమ ఆసక్తిని వ్యక్తం చేశాయి. వీరు సమర్పించిన బిడ్లను ఏపీఐటీకో లిమిటెడ్[14] పరిశీలించిన మీదట ప్రాజెక్టును నిర్మించి, నిర్వహించి, అప్పగించే విధానంలో మై హోం గ్రూప్‌నకు అప్పగించారు (2007 మార్చి). దీనిని 30 నెలలలో పూర్తి చేయవలసి ఉంది.

[13] చివరి విడత చెల్లింపు 2008 మే నెలలో చేశారు

[14] ఇదివరకటి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్, టెక్నికల్ కన్సల్టెన్సీ ఆర్గనైజేషన్ లిమిటెడ్

ఇందుకోసం ప్రభుత్వం శిల్పారామం దగ్గర 4.337 ఎకరాల స్థలాన్ని కౌలు (అద్దె) ప్రాతిపదికన 2007 మే నెలలో కేటాయించింది. కౌలు గడువు 33 సంవత్సరాలుకాగా, ప్రాథమిక మార్కెట్ విలువలో 5 శాతం వంతున తొలి సంవత్సరం అద్దె రూపేణా చెల్లించాలి. ఈ అద్దె ఏటా 5 శాతం చొప్పున పెరుగుతుంది. ప్రాజెక్టు పూర్తయిన మీదట అదనపు అభివృద్ధి ప్రీమియం రూపంలో మరికొంత మొత్తం డెవలపర్ గతంలోనే పేర్కొన్న రేటున చెల్లించాలి. ఇది హోటల్ మొత్తం వసూళ్లలో కనీసం 3 శాతం ఉండాలి.

ప్రతిపాదనలు ఆహ్వానిస్తూ ఇచ్చిన ప్రకటనకు జతచేసిన అనుబంధం-2 ప్రకారం ఈ స్థలానికి 2005 మార్చి నెలలో ధృవీకృత ప్రాథమిక మార్కెట్ విలువ [15] చ.గజానికి ₹4,000 ఉన్నది. ఒప్పందం కుదుర్చుకొనే సమయంలో ఈ రేటుని సంబంధిత అధికారులు సవరించవచ్చును.

ఐతే, 2007 మే నెలలో ఖరారు చేసిన ఒప్పందంలో పైన పేర్కొన్న విధంగా చ.గజం ₹4,000 రేటునే ఖాయం చేశారు. ఆరోజున ఉన్న మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకొనలేదు. అప్పటి మార్కెట్ విలువ చ.గజానికి ₹15,000[16]. లీజు అద్దెను స్థిరీకరించేందుకు ఈ విలువను లెక్కలోకి తీసుకొనవలసింది. ప్రభుత్వ శాఖ తన ఒప్పందంలో పేర్కొన్న విలువకూ, ఒప్పందపు తేదీన చెలామణీలో ఉన్న మార్కెట్ విలువకూ మధ్యనగల భారీ వ్యత్యాసాన్ని (చ.గజానికి ₹11,000) బట్టి చూడగా మొత్తం 33 సంవత్సరాల ఒప్పందపు వ్యవధిలో ప్రభుత్వం ₹92.29 కోట్ల[17] ఆదాయం కోల్పోతుంది.

అవార్డు పత్రం (ఎల్ఓఏ) జారీచేసే నాటికి అమలులో ఉన్న ప్రాథమిక మార్కెట్ విలువలో 5 శాతం కౌలు అద్దె ఉంటుందన్న విషయాన్ని వేలానికి ముందు సమావేశంలోనే వేలందారులకు స్పష్టం చేసినట్టు పర్యాటక శాఖ బదులిచ్చింది (2012 జూలై). అవార్డు 2006 మార్చి నెలలో జారీ చేశారు. అప్పటి మార్కెట్ విలువ చ.గజానికి ₹7,500 ఉన్నది. ఆవిధంగా ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు. అంతేకాకుండా, 2007 మే నెలలో ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో ఈ రేటుని పరిగణించలేదు. అవార్డు ఇచ్చేనాటికి ఉన్న మార్కెట్ విలువ (చ.గజానికి ₹7,500) ప్రకారం కౌలు అద్దెను లెక్కగట్టినా ప్రభుత్వం నష్టపోయే ఆదాయం ₹29.36 కోట్లు[18] అవుతుంది.

***ఆవిధంగా, కౌలు అద్దె నిర్ణయించే సమయంలో అప్పటికి చెలామణీలో ఉన్న మార్కెట్ విలువ పట్టించుకోక పోవటంతో ఒప్పంద కాలానికి ప్రభుత్వం ₹29.36 కోట్ల ఆదాయం నష్టపోతుంది. ఆమేరకు డెవలపర్‌కు అనుచిత ప్రయోజనం చేకూరుతుంది.***

కౌలు అద్దెను నిర్ణయించేటప్పుడు మార్కెట్ రేట్లను తప్పుగా తీసుకోవటంలోని పొరపాటును ప్రభుత్వం అంగీకరించింది (2012 నవంబరు). ఇప్పటికే పూర్తయిన కౌలు కాలానికి సంబంధించి అద్దెలోని వ్యత్యాసాన్ని చెల్లించవలసిందిగా డెవలపర్‌ను ఆదేశించామనీ, వీలైనంత త్వరలో కౌలు ఒప్పందాన్ని సవరించుకోవాలని కూడా చెప్పామనీ ప్రభుత్వం తెలిపింది.

---

15 రంగారెడ్డి సంయుక్త ఉపరిజిస్ట్రార్-I, ఆర్.ఓ(ఓబీ) లేఖ సంఖ్య 75/ఓబీ/2005 తేదీ 18 మార్చి 2005

16 రంగారెడ్డి జిల్లా, సబ్-రిజిస్ట్రార్-II, ఆర్ఓ నుండి నిర్ధారించుకోవడమైంది

17 మొత్తం 4.33 ఎకరాల భూమి విలువ చ.గజానికి ₹11,000 చొప్పున (₹15,000 - ₹4,000) లెక్కించి అందులో 5 శాతం తొలి సంవత్సరానికి, తదుపరి ఏటా గత సంవత్సరపు లీజు మీద 5 శాతం పెరిగే లాగున (ఒక ఎకరం=4840 చ.గ.)

18 మొత్తం 4.33 ఎకరాల భూమి విలువ చ.గజానికి ₹3,500 చొప్పున (₹7,500 - ₹4,000) లెక్కించి అందులో 5 శాతం తొలి సంవత్సరానికి, తదుపరి ఏటా గత సంవత్సరపు లీజు మీద 5 శాతం పెరిగే విధంగా

## 6.4 ఋషికొండలో బే పార్క్ రిసార్టులు

**ఒప్పుకున్న మేరకు మొత్తం భూమిని డెవలపర్‌కు స్వాధీనం చేయకపోవటం, ఒప్పందం[19] మీద మళ్ళీ సంప్రదింపులు జరపటంలో ప్రభుత్వశాఖకు తొందర, చొరవ లేకపోవటం (13 ఎకరాల అటవీభూమి డీనోటిఫికేషన్‌కు 2009 ఫిబ్రవరిలో పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తిరస్కరించిన నేపథ్యంలో) ఫలితంగా 11 సంవత్సరాల పైగా గడిచినా ప్రాజెక్టు పూర్తికాకపోవటంతో సాగరతీరంలోని విశాఖపట్నాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యం నెరవేరలేదు**

విశాఖపట్నం - భీమిలీ మార్గంలో నిర్మించ తలపెట్టిన బే పార్క్ రిసార్ట్స్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం 2000 నవంబరులో ఇండో - అమెరికన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ (ప్రై) లిమిటెడ్ అనే సంస్థకు అప్పగించింది. దీనిని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి చేయతలచారు. సాగరతీరంలోని విశాఖపట్నాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటం దీని లక్ష్యం. ఈ ప్రాజెక్టులో భాగంగా సంస్థ ఈ దిగువ సౌకర్యాలను కల్పించాల్సి ఉంది :

⇒ బీచ్ రిసార్టు నిర్మాణం

⇒ సముద్ర తీరంలో ఈత కొలనులు, పచ్చిక బయళ్ళు, ఆతపస్నానాలు (సన్ బాతింగ్), జల క్రీడా వ్యవస్థల వంటి పర్యటక సంబంధ వసతులను కల్పించటం.

ప్రభుత్వం, తన వంతుగా, ఎటువంటి ఆక్రమణలు లేని 50 ఎకరాల భూమిని ఏవిధమైన రుసుములు, వ్యయ బాధ్యతలు లేని విధంగా 33 సంవత్సరాలకు సంస్థకు లీజు ప్రాతిపదికన సమకూర్చవలసి ఉంది.

ఒప్పందం ప్రకారం సంస్థ ప్రధాన బాధ్యతలు ఈ విధంగా ఉన్నాయి :

- అన్ని అనుమతులు, లైసెన్సులు, ఆమోదాలు సంపాదించటం (ఈ విషయంలో ప్రభుత్వం సాయపడుతుంది);
- స్థలం మార్కెట్ విలువలో 5 శాతం చొప్పున, ఇది ఏటా 5 శాతం పెరిగే విధంగా లీజును స్థలం అప్పగించిన రోజునుంచి చెల్లించటం;
- ప్రాజెక్టు స్థూల రాబడిలో 2 శాతం వంతున, ₹50,000లకు తగ్గకుండా ప్రతినెలా అదనపు ప్రతిఫలం ముట్టచెప్పటం;
- ఒప్పందపు తేదీ నుంచి 120 రోజులలోగా, (2001 ఏప్రిల్ నాటికి) నిధులు సమకూర్చుకోవటం;
- ప్రాజెక్టును 36 నెలలలో, అంటే 2003 డిసెంబరు నాటికి పూర్తి చేయటం.

పర్యాటక శాఖలో ఈ ప్రాజెక్టు పర్యవేక్షక విభాగం రికార్డులను పరిశీలించటంతోపాటు 2012 మార్చి నెలలో స్థలం దగ్గర సమిష్టిగా నిర్వహించిన తనిఖీలో ఈ కింది విషయాలు తెలిశాయి :

- సంస్థకు పని అప్పగించటానికి ముందే ప్రభుత్వం స్థల లభ్యతను నిర్ధారించుకోలేదు. మొత్తం 50 ఎకరాల స్థలాన్ని సంస్థకు సమాకూర్చవలసి ఉండగా, ప్రభుత్వం 2001 మార్చి నాటికి 37 ఎకరాలు మాత్రమే అప్పగించింది. మిగతా 13 ఎకరాలు సముద్రపు ఒడ్డున ఉండటంతో సంస్థ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి పొందవలసిఉంది. ఈ అనుమతి కోసం సంస్థ రమారమి ఎనిమిది సంవత్సరాలు ప్రయాసపడినా 2009 ఫిబ్రవరిలో మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించింది.

---

[19] అభివృద్ధి, నిర్వహణ ఒప్పందం

- అందుబాటులో ఉన్న స్థలంలోనే ప్రాజెక్టును ఆరంభించాలనీ, మిగతా 13 ఎకరాల స్థలం లభించినంతనే ముందు అనుకున్న విధంగా మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయాలనీ సంస్థ, ప్రభుత్వం 2001 నవంబరులో పరస్పరం అంగీకారానికి వచ్చాయి. ఆమేరకు ప్రాజెక్టు వ్యయాన్నీ, గడువు తేదీలనూ సవరించుకోవలసి ఉంటుంది. కానీ, ఈ దిశగా చర్యలు చేపట్టలేదు. సంస్థ ప్రాజెక్టు వ్యయాన్నీ, గడువునూ సవరించే ప్రయత్నం చేయలేదు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో పట్టుపట్టలేదు.

- సముద్రపు ఒడ్డున భూమిని అభివృద్ధిపరచి, విశ్రాంతి - ఉల్లాస కార్యకలాపాలకు అనువుగా తీర్చి దిద్దేందుకు మంత్రిత్వశాఖ నిరాకరించిన నేపథ్యంలో ప్రాజెక్టు షరతులలో మార్పులు చేసే విషయమై ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

- అవసరమైన అనుమతులు పొందటం, నిధులు సమకూర్చుకోవటం, నిర్ణీత గడువులో ప్రాజెక్టును పూర్తి చేయటంలో విఫలమైనందున సంస్థతో ఇదివరకు చేసుకున్న లీజు, అభివృద్ధి, నిర్వహణ ఒప్పందం (డీఎమ్ఏ) రద్దు చేసే దిశగా ప్రభుత్వం 2007 డిసెంబరులో సంస్థకు నోటీసు ఇచ్చింది. ఐతే, సంస్థ అభ్యర్థన మేరకు ప్రభుత్వం ప్రాజెక్టు తాలూకు లీజు అవధిని 2014 మార్చి వరకూ వర్తించే విధంగా ఏడు సంవత్సరాలు పొడిగించింది (2010 జూన్).

- కుటీరాలు, రిసార్టులు నిర్మించేందుకు అవసరమైన 28 ఎకరాల స్థలాన్ని సంస్థకు 2001 మార్చిలోనే స్వాధీనం చేసినాగానీ, 2012 సెప్టెంబరు నాటికి సంస్థ ఒక్క కుటీరం కూడా నిర్మించలేదు. అదేవిధంగా సముద్రపు ఒడ్డున అవసరమైన 22 ఎకరాలకుగానూ 9 ఎకరాలను 2001 మార్చి నెలలోనే అప్పగించినా, సంస్థ ఆస్థలంలో వసతులేవీ కల్పించలేదు.

2012 మార్చి నాటికి ప్రాజెక్టు పరిస్థితి ఈ దిగువ విధంగా ఉంది :

ప్రభుత్వం 1998లో పర్యాటక అభివృద్ధి విధానాన్నొకదాన్ని ప్రకటించి 2010లో దానికి మెరుగులుదిద్దింది. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టులలో దీనినీ కీలకమైనదిగా గుర్తించారు. ఐతే ఈ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయటానికి తగు చొరవ చూపలేదు. ఏడు సంవత్సరాలు స్తబ్దుగా ఉన్న సంస్థతో ఒప్పందం రద్దు చేసుకోనూలేదు. ప్రభుత్వం తొలుత చూపిన చొరవను ఇది నిర్వీర్యం చేసింది. దీంతో గణనీయంగా ఆదాయం సమకూర్చి పెట్టగల ప్రాజెక్టు 9 సంవత్సరాలుగా చేతికి అందలేదు. ప్రాజెక్టును పూర్తి చేసి, ఆశించిన ప్రయోజనాలు రాబట్టేందుకు ప్రభుత్వం తగు చొరవ చూపలేదు.

ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న ఆలస్యాన్ని ప్రభుత్వం అంగీకరిస్తూ (2012 అక్టోబరు), వివిధ సంస్థల[20] నుంచి అనుమతులు సకాలంలో రాకపోవటమే ఈ జాప్యానికి కారణాలుగా పేర్కొంది. ఐతే, ప్రాజెక్టు పరిమితిని సవరించి, సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా తగువిధంగా మార్చుకునే ప్రయత్నం చేయకపోవటానికి గల కారణాలను ఈ సమాధానంలో ప్రభుత్వం తెలుపలేదు.

***ఆవిధంగా, సంస్థకు ప్రభుత్వ శాఖ పూర్తి స్థాయిలో స్థలం కేటాయించకపోవటం, డీఎమ్ఏని సవరించటంలో చొరవ చూపకపోవటం వలన 11 సంవత్సరాలకు పైగా గడచినా ప్రాజెక్టు పూర్తవలేదు. సాగర తీరంలోని విశాఖపట్నం నగరాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యం నెరవేరలేదు.***

---

[20] పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ, విశాఖపట్నం మహానగరపాలక సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

## ఆర్థిక శాఖ

## 6.5 దంత చికిత్సలకు అధిక చెల్లింపులు

**వైద్య ఖర్చులు ఆమోదించే సమయంలో డ్రాయింగ్ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించకపోవటం, బిల్లులు చెల్లించే తరుణంలో ఖజానా అధికారులు తగు జాగ్రత్త వహించకపోవటం ₹1.06 కోట్ల మేర అధిక చెల్లింపులకు దారితీశాయి**

దంత చికిత్సలకు సంబంధించిన వైద్య ఖర్చుల చెల్లింపు విషయమై అనుసరించవలసిన విధివిధానాలను ప్రభుత్వం 2007 ఏప్రిల్ నెలలో ఈ కింది విధంగా నిర్దేశించింది :

⇒ *ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందినవారు, వారిపై ఆధారపడినవారు గుర్తింపుపొందిన ప్రైవేటు ఆసుపత్రులలో దంత చికిత్సపొందినప్పుడు, వారి వైద్య ఖర్చులను చెల్లించేవిషయంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) నిర్ణయించిన రేట్లనే అమలు చేయాలి.*

⇒ *ఉద్యోగులు వైద్యం కోసం తొలుత ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాల్సి ఉంటుంది. అక్కడ సౌకర్యాలు లేని పక్షంలో ఆ ఆసుపత్రి నుంచి అనుమతిపొంది, తగు సూచన పత్రం కూడా తీసుకొని వైద్యం కోసం గుర్తింపు పొందిన ప్రైవేటు వైద్యశాలలకు వెళ్ళవచ్చు.*

⇒ *ఉద్యోగులకు, వారిమీద ఆధారపడిన వారికి దంత చికిత్స ఖర్చుల చెల్లింపు ఒక్కొక్కరికీ వారి పదవీ కాలంలో గానీ జీవిత కాలంలో గానీ మొత్తం మీద మూడు సార్లకు పరిమితం చేయాలి. ఒక్కొక్క చెల్లింపు ₹10,000 పరిమితి దాటకూడదు. ఈ విషయమై ఎటువంటి మినహాయింపు ఉండదు.*

⇒ *రహదారి ప్రమాదానికి గురై, పై దవడ, కింద దవడలకు శస్త్ర చికిత్సలు అవసరమైనప్పుడు తప్ప దంత సౌందర్య చికిత్సల ఖర్చు చెల్లించకూడదు.*

దంత చికిత్సలకు సంబంధించిన చెల్లింపు పత్రాలను ఆడిట్ పరిశీలన[21] చేయగా 2009 మార్చి - 2012 మార్చి నెలల మధ్యన మొత్తం 23 జిల్లాలలో 34 ప్రభుత్వ శాఖలు పంపిన 1,854 క్లెయిమ్‌లను అనుమతించే క్రమంలో డ్రాయింగ్ అధికారులు ఈ చెల్లింపులను సీజీహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లకు పరిమితం చేయలేదని తెలిసింది. ఇది ₹1.06 కోట్ల మేర అధిక చెల్లింపులకు దారితీసింది.

ఉద్యోగుల వైద్య ఖర్చులు అనుమతించే ముందు డ్రాయింగ్ అధికారులు/ఖజానా అధికారులు బిల్లులను సమగ్రంగా పరిశీలించటంతోపాటు అవి నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని కూడా ధృవీకరించుకోవాలని ప్రభుత్వ నియమాలు[22]. డ్రాయింగ్ అధికారులు/ఖజానా అధికారులు చెల్లింపులను ఆమోదించే క్రమంలో ఈ కింద పేర్కొన్న లోపాలను కూడా ఆడిట్ గమనించింది :

- ఉద్యోగులుగానీ వారిపై ఆధారపడిన వారుగానీ ఇంత వరకు ఎన్ని విడతలు వైద్య ఖర్చులు పొందినదీ (ప్రస్తుత బిల్లుతో కలుపుకుని) స్పష్టం చేయవలసి ఉండగా 993 (54 శాతం) క్లెయిమ్‌లలో ఈ సమాచారం ఇవ్వలేదు. ఈ నియమం అమలు జరిగేలా చూసేందుకు ఆయా ప్రభుత్వ శాఖలలో గానీ, వైద్య విద్యా శాఖలోగానీ అనువైన యంత్రాంగం లేదు. అందువలన, చెల్లింపులను పదవీ కాలం/జీవిత కాలంలో మూడు పర్యాయాలకు పరిమితం చేస్తున్న విషయం ఆడిట్ ధృవీకరించు కొనలేకపోయింది.

---

[21] కేంద్రీయ తనిఖీ (సెంట్రల్ ఆడిట్)

[22] ఆంధ్రప్రదేశ్ సమీకృత వైద్య ఖర్చుల నియమాలు, 1972

- మొత్తం ₹19.92 లక్షల చెల్లింపులతో ముడిపడిన 226 బిల్లులలో (12 శాతం) ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన సూచన పత్రాలను జతచేయక పోవటంగానీ ఉద్యోగి పని చేస్తున్న జిల్లా కాకుండా ఇతర ఆసుపత్రులు ఇచ్చినవిగానీ ఉన్నాయి.

- చికిత్స వ్యయం ₹10,000కు మించి చెల్లించరాదని ప్రభుత్వ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాగానీ, ఎనిమిది సందర్భాలలో ఈ ₹10,000 పరిమితికి మించి చెల్లింపులు చేశారు.

- రహదారి ప్రమాదాల వలన కాకపోయినా దంత సౌందర్య శస్త్ర చికిత్సల కోసం ఇరవై ఏడు మందికి మొత్తం ₹2.35 లక్షలు చెల్లించారు.

***వైద్య ఖర్చులు ఆమోదించేసమయంలో డ్రాయింగ్ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోవటం, బిల్లులను ఆమోదించే ముందు ఖజానా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొనకపోవటం వలన ₹1.06 కోట్ల మేర అధిక చెల్లింపులు జరిగాయి.***

ఈ లోటుపాట్లను ప్రభుత్వం అంగీకరించి (2013 జనవరి), ఉద్యోగులకు కల్పించిన ప్రయోజనాలను దుర్వినియోగం చేయరాదని 2007 ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసినా, కొందరు వ్యక్తులు ఇలా దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దంత చికిత్సల బిల్లుల చెల్లింపులోని ఈ లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టమని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖను కోరామనీ, బిల్లులు చెల్లించే సమయంలో నియమాలను పాటించేలా ఖజానా అధికారులకు తగు మార్గదర్శకాలు జారీ చేయమని ఖజానా, గణాంక శాఖ డైరెక్టర్‌ను ఆదేశించామనీ ప్రభుత్వం పేర్కొంది.

## కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ

## 6.6 ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు

భారత ప్రభుత్వం 'భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ శిస్తు చట్టం, 1996' అనే చట్టాన్ని రూపొందించింది. కార్మిక యాజమాన్యం నిర్మాణాలపై చేసే వ్యయంమీద ప్రభుత్వం కొంత శిస్తును విధించి, వసూలు చేసేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఆర్థిక వనరులు సమకూర్చుకొనేందుకు ఇది దోహదపడుతుంది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల (నియామక నిబంధనలు, ఉద్యోగ పరిస్థితుల) చట్టం, 1996 ప్రకారం ఈ బోర్డును ఏర్పాటు చేశారు. కేంద్ర చట్టం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల (నియామక నిబంధనలు, ఉద్యోగ పరిస్థితుల) చట్టం, 1996 అనే చట్టాన్ని తీసుకొచ్చింది. తదుపరి 1999 లో నియమాలను రూపొందించి, ఆ తర్వాత 2007 ఏప్రిల్ నెలలో రాష్ట్ర బోర్డును ఏర్పాటు చేసింది. దీని చైర్మన్, కార్యదర్శి, ఆరుగురు ఇతర సభ్యులు మూడు సంవత్సరాలపాటు ఉంటారు.

ప్రమాదాల బారిన పడిన లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించటం, అరవై సంవత్సరాలు నిండిన లబ్ధిదారులకు పెన్షన్ చెల్లించటం, లబ్ధిదారులు ఇళ్లుకట్టుకునేందుగు ఋణాలు ఇవ్వడం, సామూహిక బీమా పథకం, పిల్లల చదువులకు ఆర్థికసాయం, తీవ్ర అనారోగ్యాలకు వైద్య ఖర్చులు, ప్రసూతి ఖర్చులు, ఇతర సంక్షేమ చర్యలు బోర్డు విధులలో ముఖ్యమైనవి.

బోర్డు కార్యసాధకతను అంచనావేసే ఉద్దేశంలో అది ఆవిర్భవించిన నాటినుంచీ రికార్డులను ఆడిట్ పరిశీలించగా (2012 ఆగస్టు, సెప్టెంబరు నెలలలో) ఈ కింది విషయాలు తెలిశాయి :

**(i)** చట్టం ప్రకారం, బోర్డుకు కేంద్రప్రభుత్వం నియమించిన ఒక ఛైర్‌పర్సన్ ఉండాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సభ్యులు పదిహేనుమంది వరకూ ఉంటారు. రాష్ట్ర బోర్డు 2007 ఏప్రిల్‌లో రూపొందింది. చట్టం అమలులోకి వచ్చి అప్పటికే దశాబ్దం దాటింది. బోర్డు ఏర్పడి తొలి మూడు సంవత్సరాలు గడిచాక 2010 ఆగస్టులో ఛైర్మన్‌ను మాత్రమే మళ్లీ నియమించారు. ప్రభుత్వం ఇతర సభ్యులను నియమించలేదు. బోర్డుకు 2012 డిసెంబరు 2 వరకూ రెగ్యులర్ కార్యదర్శి పోస్టులేదు. కార్మికశాఖ సంయుక్త కమిషనరు అప్పటివరకూ కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆడిట్ వ్యాఖ్యలను ప్రభుత్వం అంగీకరిస్తూ, త్వరలోనే పూర్తిస్థాయిలో బోర్డును రూపొందిస్తామని హామీ ఇచ్చింది (2013 జనవరి).

**(ii)** భవన నిర్మాణానికి కార్మిక యజమాని చేసిన వ్యయంలో[23] రెండు శాతానికి మించకుండా, ఒక శాతంకన్నా తగ్గకుండా శిస్తు విధించి, వసూలు చేయాలని చట్టం నిర్దేశిస్తోంది. ఇలా విధించిన శిస్తును ప్రతి కార్మిక యజమాని నుంచి వసూలు చేయాలి. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల భవనాలు, ఇతర నిర్మాణాల విషయంలో మూలం వద్దచేసే వసూలు, నిర్మాణాలకు స్థానిక సంస్థల అనుమతి అవసరమైన చోట ఆ సంస్థల ద్వారా ముందస్తుగా చేసే వసూళ్ళు కూడా ఇందులో ఉంటాయి.

ఐతే, కార్మిక యజమానులందరినుంచీ శిస్తు వసూలు చేసుకునేందుకు బోర్డు 2011 జూన్ వరకూ తగు యంత్రాంగమేదీ ఏర్పరచుకోలేదు. అటుతర్వాత ఈ బాధ్యతను కార్మికశాఖ సిబ్బందికి అప్పగించారు.

కార్మికశాఖ కమిషనరును ప్రధాన తనిఖీదారునిగా నియమించి, అసెసింగ్ అధికారులను కూడా నియమిస్తూ 2006 ఆగస్టులోనే నోటిఫికేషన్లు జారీ చేశామని ప్రభుత్వం తెలిపింది. ఈ నియామకాలు జరిగినమాట వాస్తవమే అయినా, భవన నిర్మాతలనుంచి శిస్తు వసూలు చేసుకునేందుకు తగు యంత్రాంగమేదీ 2011 జూన్ వరకూ రూపొందలేదు.

**(iii)** గుత్తేదారులు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ విధానంలో చేసిన చెల్లింపులు, ప్రభుత్వ నిర్మాణ పనులకు సంబంధించి ట్రెజరీలలోనూ పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలలోనూ చేసిన రికవరీలు కలుపుకొని 2007-13 సంవత్సరాలలో (2012 ఆగస్టు వరకూ) శిస్తు రూపేణా బోర్డు ₹851.36 కోట్లు రాబట్టింది. ఇందులోనుంచి 2012 జనవరి, జూలై నెలలమధ్యన ₹401.89 కోట్లు పీడీ ఖాతాకు బదిలీ చేసింది. మిగిలిన ₹439.23 కోట్ల మొత్తం[24] 2012 ఆగస్టు 31 నాటికి బోర్డు దగ్గరే ఉన్నది. బోర్డు ఈ కాలవ్యవధిలో నిర్మాణ కార్మికుల ప్రయోజనాలకోసం సంక్షేమ పథకాల అమలుకు ₹61.66 కోట్లు ఖర్చు చేసింది (పాలనా పరమైన ఖర్చులు కలుపుకుని).

శిస్తు రూపేణా వచ్చిన ఆదాయం, చేసిన వ్యయం సంవత్సరాలవారీగా ఈ దిగువ ఇవ్వటం జరిగింది.

[23] భవన నిర్మాణ వ్యయం అంటే యజమాని నిర్మాణానికి చేసిన అన్ని ఖర్చులు ఉంటాయి. ఐతే, స్థలం ఖరీదు, కార్మికులకు నష్ట పరిహారం రూపేణా చెల్లించతగినవి ఇందులోకి రావు

[24] ఫిక్స్‌డ్ డిపాజిట్లు ₹351.12 కోట్లు, సేవింగ్స్ ఖాతా ₹88.11 కోట్లు

**పట్టిక 6.5**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | ప్రారంభ నిల్వ | వసూలైన శిస్తు | లభించిన వడ్డీ | మొత్తం | సంక్షేమ వ్యయం మొత్తం | పాలనాపరమైన వ్యయం మొత్తం | పీడీ ఖాతాకు బదిలీ చేసినది | మొత్తం | ముగింపు నిల్వ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) |
| 2007-08 | శూన్యం | 15.58 | 0.05 | 15.63 | 0.15 | 0.11 | శూన్యం | 0.26 | 15.37 |
| 2008-09 | 15.37 | 142.01 | 10.18 | 167.56 | 2.14 | 0.49 | శూన్యం | 2.63 | 164.93 |
| 2009-10 | 164.93 | 201.30 | 19.60 | 385.83 | 5.47 | 0.63 | శూన్యం | 6.10 | 379.73 |
| 2010-11 | 379.73 | 176.71 | 24.50 | 580.94 | 13.11 | 0.61 | శూన్యం | 13.72 | 567.22 |
| 2011-12 | 567.22 | 213.48 | స.లే. | 780.70 | 33.12 | 0.78 | 138.68 | 172.58 | 608.12 |
| 2012-13 * | 608.12 | 102.28 | స.లే. | 710.40 | 7.67 | 0.29 | 263.21 | 271.17 | 439.23 |
| మొత్తం | | 851.36 | | | 61.66 | | 401.89 | | |

** (2012 ఆగస్టు వరకూ)            స.లే.  : సమాచారం లేదు*

*మూలం: బోర్డు ఇచ్చిన సమాచారం*

ఇందుకు సంబంధించి ఆడిట్ గమనించిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి :

- ప్రభుత్వం మంజూరు చేసిన నిర్మాణాల వివరాలు బోర్డు దగ్గరలేవు. శిస్తు లెక్కకట్టి విధించేందుకూ, వసూలు చేసేందుకు, ఇందుకు సంబంధించి ఖజానా అధికారులు, పీఏఓలు, స్థానిక సంస్థలు, మొదలైన వాటితో సమన్వయించుకునేందుకూ తగిన యంత్రాంగంకూడా లేదు. తన ఆదాయానికి సంబంధించిన వనరులను నమోదు చేసేందుకు అవసరమైన రికార్డులను బోర్డు నిర్వహించటంలేదు.

- ప్రభుత్వం, ప్రభుత్వ యాజమాన్య సంస్థలు, స్థానిక సంస్థలు, ఇతర సంస్థలు ఆమోదించిన కట్టడాలకు సంబంధించి నిర్మాణ వ్యయం వివరాలు సేకరించేందుకు తగు యంత్రాంగంలేదు.

బోర్డు చెప్పిన దానిని బట్టి 2012 నవంబరు నాటికి మొత్తం 14,647 సంస్థలు ఈ చట్టం పరిధిలో నమోదవగా ఇందులో 654 ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలవి.

ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు చేసే శిస్తు వసూళ్ళను పర్యవేక్షించటం కోసం బోర్డు తన యంత్రాంగాన్నీ రికార్డుల నిర్వహణను కూడా మెరుగుపరచుకోవాలని ప్రభుత్వం ఒప్పుకుంది. ఇప్పటికే ఈ దిశగా చర్యలు ఆరంభించినట్లు తెలిపింది. ప్లానులను ఆమోదించే సమయంలోనే శిస్తు వసూలు చేయటంలో ప్రభుత్వ శాఖలను, స్థానిక సంస్థలను బాధ్యులను చేస్తూ 2009 డిసెంబరులో ఆదేశాలు జారీ చేసినట్లు కూడా పేర్కొంది. శిస్తు రూపంలో వసూలైన నిధులను నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించే బదులు పీడీ ఖాతాలో జమచేయటం మీద మాత్రం ప్రభుత్వం వివరణ ఇవ్వలేదు.

**(iv)** బోర్డు 2007 ఏప్రిల్‌లో ఏర్పడినా, కార్మికులను నమోదు చేసుకోవటం 2009 ఆగస్టులోనే మొదలుపెట్టింది. కార్మికశాఖ ద్వారా సంక్షేమ చర్యలను చేపట్టటం 2009-10 లో ఆరంభించింది. ప్రాథమిక సర్వే 2007లో నిర్వహించినపుడు 21 లక్షలమంది నిర్మాణ కార్మికులున్నట్లు లెక్క తేలగా 2012 నవంబరు నాటికి 16.97 లక్షలమందిని బోర్డు నమోదు చేసుకుంది. వీరిలో 12.89 లక్షలమందికే (82 శాతం) గుర్తింపు కార్డులు ఇచ్చింది.

ఉన్నత న్యాయస్థానంలో ఉన్న వ్యాజ్యం కారణంగా కార్మికుల నమోదు ఆలశ్యమయిందని చెబుతూ (2013 జనవరి) చట్టం అమలు చేసేముందు చేయవలసిన విధంగా విస్తృత ప్రచారం చేపట్టామనీ ఆ తరవాతనే నమోదు

పని ఆరంభించామనీ ప్రభుత్వం తెలిపింది. ఇక గుర్తింపు కార్డులు ఇచ్చే విషయంలో, బోర్డు ఈ ప్రక్రియని కంప్యూటరీకరించే పనిలో ఉన్నదనీ, నమోదు చేసుకున్న కార్మికులందరికీ త్వరలోనే కార్డులు జారీ చేస్తామనీ బదులిచ్చింది. అంతే కాకుండా , కార్మికులను ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవటం, గుర్తింపు కార్డులను ఇవ్వటం, క్లెయిమ్‌లను సత్వరమే పరిష్కరించటం వంటి అన్ని కార్యకలాపాలను కంప్యూటర్ ద్వారా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కూడా ప్రభుత్వం తెలిపింది.

**(v)** మొత్తం తొమ్మిది ప్రధాన సంక్షేమ పథకాలలో ఐదింటిని బోర్డు అమలు చేస్తున్నది. సంవత్సరాలవారీగా లబ్ధిదారుల సంఖ్య, సంక్షేమ పథకాలపై అయిన వ్యయం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పట్టిక 6.6

(₹ లక్షలలో)

| సంక్షేమ పథకాలు | 2009-10 | | 2010-11 | | 2011-12 | | 2012-13$ | |
|---|---|---|---|---|---|---|---|---|
| | కార్మికుల సంఖ్య | వ్యయం | కార్మికుల సంఖ్య | వ్యయం | కార్మికుల సంఖ్య | వ్యయం | కార్మికుల సంఖ్య | వ్యయం |
| ప్రమాద సాయం | 14 | 27.00 | 16 | 21.00 | 244 | 397.00 | 59 | 89.75 |
| పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్ లైట్)* | శూన్యం | శూన్యం | 96646 | 773.17 | 98516 | 788.13 | స.లే. | స.లే. |
| ప్రసూతి సాయం | 239 | 11.95 | 1310 | 65.50 | 3760 | 188.00 | 1389 | 69.45 |
| ఇతర సంక్షేమ చర్యలు, సదుపాయాల# కల్పన, విస్తరణ | 153 | 45.90 | 834 | 250.20 | 3066 | 918.05 | 1606 | 475.80 |
| తీవ్రవ్యాధులకు వైద్య ఖర్చులు | శూన్యం | శూన్యం | 1 | 0.05 | 64 | 2.79 | 42 | 7.53 |
| మొత్తం | 406 | 84.85 | 98807 | 1109.92 | 105650 | 2293.97 | 3096 | 642.53 |

* దీనిని 2010-12 లో ప్రయోగాత్మకంగా మూడు జిల్లాలలో అమలు చేశారు. అవి చిత్తూరు ( 89,334 మంది కార్మికులు), విశాఖపట్నం (6,185 మంది), వరంగల్ ( 9,182 మంది)

# సహజమరణం సంభవించినప్పుడు ఇచ్చే ఆర్థికసాయం, అంత్యక్రియల ఖర్చులు, పెళ్లి కానుకలు ఇందులో ఉంటాయి

$ 2012 ఆగస్టు వరకు; స.లే. : సమాచారం లేదు

*మూలం : బోర్డు ఇచ్చిన సమాచారం*

మిగతా పథకాలైన (i) గృహనిర్మాణ ఋణాలు; (ii) సామూహిక బీమా పథకానికి ప్రీమియం చెల్లింపులు; (iii) పిల్లల చదువులకు ఆర్థికసాయం; (iv) స్థానిక సంస్థకుగానీ యజమానికిగానీ ఋణం లేదా సబ్సిడీ పథకాలను అమలు చేయటం లేదు.

బోర్డు తొమ్మిది[25] పథకాలనూ అమలు చేస్తున్నదని ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొంది. ఐతే, బోర్డు/ప్రభుత్వం పేర్కొన్న నాలుగు పథకాలూ[26] (మొత్తం తొమ్మిదింట) ఉప-పథకాలేననీ, పట్టిక 6.6 లో చెప్పిన ప్రధాన పథకాలలో (చట్టం, నియమాల పరిధిలోనివి) అంతర్భాగమేననీ ఇక్కడ గమనించాలి.

[25] ప్రమాద మృతుల కుటుంబాలకు సాయం, పాక్షిక/శాశ్వత అంగవైకల్యం, సహజ మరణం, ప్రసూతి సాయం, అంత్యక్రియల ఖర్చులు, ఆస్పత్రిలో చేరినప్పుడు తాత్కాలిక అశక్తత, ఎన్‌పీఎస్-లైట్, పెళ్లి కానుక పథకం, నమోదు చేసుకొనని కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం

[26] (i) సహజ మరణం, (ii) అంత్యక్రియల ఖర్చులు, (iii) పెళ్లి కానుక (iv) నమోదుకాని కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**(vi)** ఈ చట్టం అమలుచేయటంలో తలెత్తే విషయాలపై తనకు సలహాలిచ్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 'రాష్ట్ర భవన - ఇతర నిర్మాణ కార్మికుల సలహా సంఘం' రూపొందించటాన్ని చట్టంలోని నాలుగవ సెక్షను తప్పనిసరి చేసింది. ఐతే, రాష్ట్ర సలహా సంఘం 2007 జూన్‌లోనే ఆవిర్భవించినా, గత ఐదు సంవత్సరాలలో ఒకే ఒక్కసారి 2008 ఆగస్టులో సమావేశమయింది. దీని మూడు సంవత్సరాల కాలవ్యవధి 2010 జూన్‌తో ముగిసినా, కొత్త సంఘాన్ని నియమించలేదు.

సంఘాన్ని పునర్నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2013 జనవరి).

***పైన వివరించినట్లు నిర్మాణ కార్మికులందరినీ గుర్తించి, నమోదు చేసుకొనేందుకూ, కార్మిక యజమానులకు శిస్తు విధించి సక్రమంగా వసూలు చేసుకునేందుకూ అవసరమైన యంత్రాంగం లేకపోవటంతో బోర్డును స్థాపించిన లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు.***

**(వాణీ శ్రీరామ్)**
**ప్రధాన మహాగణకాధికారి (జీ&ఎస్ఎస్ఏ)**
**ఆంధ్రప్రదేశ్**

**హైదరాబాదు**
25 March 2013

**ధృవీకరించడమైనది**

**(వినోద్ రాయ్)**
**భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్**

**కొత్త ఢిల్లీ**
26 March 2013

# అనుబంధాలు

పేజీలు 167 - 187

**అనుబంధం 1.1**
**(పేరా 1.6, పేజీ 4)**

**శాఖలవారీగా బకాయి ఉన్న తనిఖీ నివేదికలు, పేరాలు**

| శాఖ | 2012 సెప్టెంబరు 30 నాటికి పెండింగులో ఉన్న తనిఖీ నివేదికలు/పేరాల సంఖ్య | |
|---|---|---|
| | తనిఖీ నివేదికలు | పేరాలు |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | 139 | 862 |
| వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు | 249 | 786 |
| ఆర్థిక | 133 | 354 |
| సాధారణ పరిపాలన | 115 | 453 |
| ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం | 926 | 7131 |
| ఉన్నత విద్య | 1340 | 7567 |
| హోం | 383 | 1896 |
| గృహ నిర్మాణం | 18 | 142 |
| కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు | 497 | 1742 |
| న్యాయం | 429 | 1169 |
| అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం | 34 | 122 |
| మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 342 | 3988 |
| పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి | 767 | 6283 |
| ప్రణాళిక | 61 | 256 |
| రెవెన్యూ | 141 | 1027 |
| పాఠశాల విద్య | 340 | 3007 |
| సాంఘిక సంక్షేమం | 208 | 2044 |
| గిరిజన సంక్షేమం | 197 | 1343 |
| మహిళ, శిశు, వికలాంగుల, వయోజనులు | 637 | 2374 |
| యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు | 207 | 1049 |
| **మొత్తం** | **7163** | **43595** |

**అనుబంధం 1.2**
**(పేరా 1.6, పేజీ 4)**

**అపరిష్కృతంగా ఉన్న వివరణాత్మక నివేదికలు**


| శాఖ | 2005-06 | 2006-07 | 2008-09 | 2009-10 | 2010-11 | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు | - | - | - | - | 1 | 1 |
| పరిశ్రమలు, వాణిజ్యం# | - | - | - | - | 1 | 1 |
| హోం | - | - | - | - | 1 | 1 |
| ప్రణాళిక | - | - | - | - | 1 | 1 |
| గిరిజన సంక్షేమం | - | - | - | 1 | 1 | 2 |
| యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు | 1 | 2 | 2 | 1 | 1 | 7 |
| **మొత్తం** | **1** | **2** | **2** | **2** | **6** | **13** |

# భూ కేటాయింపులపై ఆడిట్ నివేదికకు సంబంధించి

**అనుబంధం 2.1**

**(పేరా 2.5.1.1, పేజీ 21)**

## ఫైర్ స్టేషన్లు లేని అసెంబ్లీ నియోజకవర్గాలు (ఎరుపు రంగులో ఉన్నవి)



**(అంతర్ చిత్రం : హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల స్థితి)**

| | | | | |
|---|---|---|---|---|
| 1 మేడ్చల్ | 19 ఖానాపూర్ | 37 షాద్‌నగర్ | 55 పెదకూరపాడు | 73 పెందుర్తి |
| 2 కుత్బుల్లాపూర్ | 20 బోథ్ | 38 జడ్చర్ల | 56 తాడికొండ | 74 పాయకరావుపేట |
| 3 కూకట్‌పల్లి | 21 ముధోల్ | 39 నాగార్జునసాగర్ | 57 వేమూరు | 75 దర్శి |
| 4 ఉప్పల్ | 22 జుక్కల్ | 40 మునుగోడు | 58 పత్తిపాడు | 76 పర్చూరు |
| 5 ఇబ్రహీంపట్నం | 23 నిజామాబాద్ (గ్రామీణ) | 41 తుంగతుర్తి | 59 గురజాల | 77 సంతనూతలపాడు |
| 6 ఎల్‌బీనగర్ | 24 బాల్కొండ | 42 ఆలేరు | 60 ఆచంట | 78 అద్దంకి |
| 7 మహేశ్వరం | 25 స్టేషన్ ఘనాపూర్ | 43 పినపాక | 61 ఉండి | 79 కొవ్వూరు |
| 8 రాజేంద్రనగర్ | 26 పాలకుర్తి | 44 పాలేరు | 62 ఉంగుటూరు | 80 సర్వేపల్లి |
| 9 శేరిలింగంపల్లి | 27 దోర్నకల్ | 45 వైరా | 63 దెందులూరు | 81 నందికొట్కూరు |
| 10 అంబర్‌పేట | 28 వర్ధన్నపేట | 46 కోరుట్ల | 64 గోపాలపురం | 82 పాణ్యం |
| 11 ఖైరతాబాద్ | 29 భూపాలపల్లి | 47 ధర్మపురి | 65 పోలవరం | 83 మంత్రాలయం |
| 12 నాంపల్లి | 30 దుబ్బాక | 48 చొప్పదండి | 66 పెడన | 84 సింగనమల |
| 13 చాంద్రాయణగుట్ట | 31 గజ్వేల్ | 49 వేములవాడ | 67 పెనుమలూరు | 85 రాప్తాడు |
| 14 యాకుత్‌పురా | 32 కొడంగల్ | 50 మానకొండూరు | 68 కురుపాం | 86 తంబలపల్లి |
| 15 కంటోన్మెంట్ | 33 దేవరకద్ర | 51 హుస్నాబాద్ | 69 నెల్లిమర్ల | 87 చంద్రగిరి |
| 16 కార్వాన్ | 34 మక్తల్ | 52 పి. గన్నవరం | 70 పాతపట్నం | 88 గంగాధర నెల్లూరు |
| 17 గోషామహల్ | 35 ఆలంపూర్ | 53 రాజానగరం | 71 ఎచ్చెర్ల | 89 పూతలపట్టు |
| 18 చెన్నూరు | 36 కల్వకుర్తి | 54 జగ్గంపేట | 72 అరకు లోయ | |

**అనుబంధం 3.1**
**(పేరా 3.4.2, పేజీ 49)**

## స్కాలర్‌షిప్ పథకాల బడ్జెట్, వ్యయ వివరాలు

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | శాఖ | బడ్జెట్ కేటాయింపు | | | వ్యయం | | | నిధుల వినియోగంలో తగ్గుదల (-)/ అధికం (+) | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ఎమ్‌టీఎఫ్ | ఆర్‌టీఎఫ్ | మొత్తం | ఎమ్‌టీఎఫ్ | ఆర్‌టీఎఫ్ | మొత్తం | ఎమ్‌టీఎఫ్ | ఆర్‌టీఎఫ్ | మొత్తం |
| **2008-09** | ఎస్‌డబ్ల్యూ | 603 | 0 | **603** | 436 | 0 | **436** | (-) 167 | 0 | **(-) 167** |
| | టీడబ్ల్యూ | 95 | 0 | **95** | 139 | 0 | **139** | 44 | 0 | **44** |
| | బీసీడబ్ల్యూ | 341 | 627 | **968** | 325 | 478 | **803** | (-) 16 | (-) 149 | **(-) 165** |
| | ఎమ్‌డబ్ల్యూ | 83 | 35 | **118** | 87 | 60 | **147** | 4 | 25 | **29** |
| | **మొత్తం** | **1122** | **662** | **1784** | **987** | **538** | **1525** | **(-) 135** | **(-) 124** | **(-) 259** |
| **2009-10** | ఎస్‌డబ్ల్యూ | 601 | 0 | **601** | 417 | 0 | **417** | (-) 184 | 0 | **(-) 184** |
| | టీడబ్ల్యూ | 165 | 0 | **165** | 151 | 0 | **151** | (-) 14 | 0 | **(-) 14** |
| | బీసీడబ్ల్యూ | 445 | 850 | **1295** | 230 | 648 | **878** | (-) 215 | (-) 202 | **(-) 417** |
| | ఎమ్‌డబ్ల్యూ | 125 | 73 | **198** | 108 | 71 | **179** | (-) 17 | (-) 2 | **(-) 19** |
| | **మొత్తం** | **1336** | **923** | **2259** | **906** | **719** | **1625** | **(-) 430** | **(-) 204** | **(-) 634** |
| **2010-11** | ఎస్‌డబ్ల్యూ | 378 | 516 | **894** | 197 | 594 | **791** | (-) 181 | 78 | **(-) 103** |
| | టీడబ్ల్యూ | 111 | 171 | **282** | 67 | 195 | **262** | (-) 44 | 24 | **(-) 20** |
| | బీసీడబ్ల్యూ | 669 | 1494 | **2163** | 298 | 1362 | **1660** | (-) 371 | (-) 132 | **(-) 503** |
| | ఎమ్‌డబ్ల్యూ | 157 | 125 | **282** | 167 | 125 | **292** | 10 | 0 | **10** |
| | **మొత్తం** | **1315** | **2306** | **3621** | **729** | **2276** | **3005** | **(-) 586** | **(-) 30** | **(-) 616** |
| **2011-12** | ఎస్‌డబ్ల్యూ | 342 | 534 | **876** | 92 | 218 | **310** | (-) 250 | (-) 316 | **(-) 566** |
| | టీడబ్ల్యూ | 93 | 267 | **360** | 64 | 132 | **196** | (-) 29 | (-) 135 | **(-) 164** |
| | బీసీడబ్ల్యూ | 640 | 2551 | **3191** | 498 | 1886 | **2384** | (-) 142 | (-) 665 | **(-) 807** |
| | ఎమ్‌డబ్ల్యూ | 145 | 143 | **288** | 143 | 181 | **324** | (-) 2 | 38 | **36** |
| | **మొత్తం** | **1220** | **3495** | **4715** | **797** | **2417** | **3214** | **(-) 423** | **(-)1078** | **(-)1501** |
| | **పూర్తిమొత్తం** | **4993** | **7386** | **12379** | **3419** | **5950** | **9369** | **(-)1574** | **(-)1436** | **(-)3010** |

ఎస్‌డబ్ల్యూ : సాంఘిక సంక్షేమం; టీడబ్ల్యూ : గిరిజన సంక్షేమం; బీసీడబ్ల్యూ : వెనుకబడిన తరగతుల సంక్షేమం;
ఎమ్‌డబ్ల్యూ : అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం

*మూలం : సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క అప్రోప్రియేషన్ అకౌంట్లు. మైనారిటీ వర్గాల సంక్షేమంకు సంబంధించిన వివరాల్లో ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం వివరాలు కూడా కలిపి చూపడమైంది*

అనుబంధం - 3.2
(పేరా 3.6.5.1, పేజీ 68)

స్కాలర్‌షిప్పుల మంజూరుకు అధికారుల ద్వారా దరఖాస్తుల పరిశీలన సరిగా జరగని కేసులు

| క్రమ సంఖ్య | మార్గ నిర్దేశనల అతిక్రమణ | సాంఘిక సంక్షేమం | గిరిజన సంక్షేమం | బీసీ సంక్షేమం | మైనారిటీ సంక్షేమం | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| | | విద్యార్థుల సంఖ్య | | | | |
| 1 | ఎస్ఎస్‌సీ అర్హతా పత్రంలోని, ఆన్‌లైన్ దరఖాస్తులోని జనన తేదీల మధ్య వ్యత్యాసం | 0 | 92 | 0 | 6 | 98 |
| 2 | ప్రామాణిక సర్టిఫికేట్లపై సంస్థల అధిపతులు సంతకాలు చేయకపోవడం | 0 | 87 | 77 | 14 | 178 |
| 3 | ప్రభుత్వ ఉద్యోగులు పేర్కొన్న వార్షిక ఆదాయాల్లో తేడాలు | 3 | 40 | 3 | 4 | 50 |
| 4 | సేవింగ్ బ్యాంక్ ఖాతాకు రుజువును సమర్పించక పోవడం, తండ్రి ఆదాయాన్ని తప్పుగా చూపడం వంటి అవకతవకలు | 15 | 0 | 0 | 0 | 15 |
| 5 | దరఖాస్తు కాగిత ప్రతిని పరిశీలించకపోవడం | 32 | 0 | 289 | 183 | 504 |
| 6 | తాజా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించక పోవడం | 45 | 87 | 2 | 22 | 156 |
| 7 | దరఖాస్తుపై పరిశీలనాధికారి సంతకం చేయకపోవడం | 93 | 117 | 161 | 0 | 371 |
| 8 | 'ఆదాయం లేదు' ధృవీకరణ పత్రాన్ని సమర్పించకపోవడం | 0 | 7 | 0 | 129 | 136 |
| 9 | దూరం 5 కి.మీ. కంటే తక్కువ ఉండడం | 0 | 0 | 0 | 131 | 131 |
| 10 | దరఖాస్తు సరైన రూపంలో లేకపోవడం | 0 | 0 | 0 | 5 | 5 |
| 11 | అర్హతా ప్రమాణాలకు మించి ఆదాయం ఉండడం | 0 | 0 | 0 | 69 | 69 |
| 12 | స్కాలర్‌షిప్ దరఖాస్తుపై ఫోటో లేకపోవడం | 0 | 0 | 0 | 2 | 2 |
| 13 | ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా విద్యార్థుల నుండి ఫీజులను వసూలు చేయడం | 0 | 0 | 0 | 24 | 24 |
| 14 | ఆదాయ ధృవపత్రాలలోని తహశీల్దారుల సంతకాల్లో వ్యత్యాసాలు | 0 | 0 | 0 | 2 | 2 |
| 15 | దరఖాస్తులకు సంబంధిత పత్రాలను జతపరచకపోవడం | 0 | 153 | 0 | 1 | 154 |
| 16 | ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఒకే విద్యార్థికి కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం రెండిటి పథకాల స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం | 0 | 0 | 0 | 39 | 39 |
| 17 | విద్యార్థుల ఫోటోలను ప్రిన్సిపాల్‌లు ధృవీకరించకపోవడం | 0 | 0 | 549 | 0 | 549 |
| 18 | విద్యార్థులకు కల్పించాల్సిన సదుపాయంకు సంబంధించి పరిశీలనాధికారులు సిఫార్సు చేయకపోవడం | 0 | 0 | 40 | 0 | 40 |

| క్రమ సంఖ్య | మార్గ నిర్దేశనల అతిక్రమణ | సాంఘిక సంక్షేమం | గిరిజన సంక్షేమం | బీసీ సంక్షేమం | మైనారిటీ సంక్షేమం | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| | | విద్యార్థుల సంఖ్య | | | | |
| **19** | విద్యార్థులు డీఎస్ ను ఎంచుకోగా అందుకు విరుద్ధంగా పరిశీలనాధికారి ఎస్ఎమ్హెచ్ ను సిఫార్సు చేయడం | 0 | 0 | 188 | 0 | 188 |
| **20** | ప్రామాణిక ధృవపత్రాలను దరఖాస్తుతో సమర్పించకపోవడం | 0 | 175 | 80 | 0 | 255 |
| **21** | ప్రామాణిక ధృవపత్రాలను నిర్దేశిత రూపంలో సమర్పించకపోవడం | 64 | 21 | 16 | 0 | 101 |
| **22** | దరఖాస్తులోని అడ్మిషన్ సంఖ్య, ప్రామాణిక ధృవపత్రంలోని అడ్మిషన్ సంఖ్యల మధ్య వ్యత్యాసం | 0 | 0 | 132 | 0 | 132 |
| **23** | క్షేత్ర స్థాయి అధికారులు సంతకాలు చేయకపోవడం, రేషన్ కార్డు కాపీలను జతపరచకపోవడం | 207 | 196 | 215 | 0 | 618 |
| **24** | తండ్రి నిత్యావసర వస్తు సరఫరా కార్డులో విద్యార్థి పేరు కనిపించకపోవడం | 0 | 23 | 1 | 0 | 24 |
| **25** | దరఖాస్తులో పేర్కొన్న ఆదాయానికి, ఆదాయ ధృవపత్రంలోని దానికి మధ్య తేడాలు | 6 | 0 | 479 | 0 | 485 |
| **26** | ఆదాయ ధృవపత్రం అసలుకు బదులు నకలును జతపరచడం | 0 | 131 | 16 | 0 | 147 |
| **27** | బ్యాంకు ఖాతాను పేర్కొనకపోవడం/సేవింగ్స్ ఖాతా మొదటి పేజీకాపీని జతపరచకపోవడం | 78 | 468 | 443 | 0 | 989 |
| **28** | అంతరంకు సంబంధించి 'గ్యాప్' ధృవపత్రం జతపరచకపోవడం | 0 | 89 | 1 | 0 | 90 |
| **29** | దరఖాస్తు పత్రంలో విద్యార్థుల తల్లిదండ్రులు సంతకాలు చేయకపోవడం | 0 | 0 | 2 | 0 | 2 |
| **30** | రేషన్ కార్డులో విద్యార్థి తండ్రిపేరు లేకపోవడం | 0 | 26 | 0 | 0 | 26 |
| **31** | ఆన్లైన్లో పేర్కొన్న బ్యాంకు ఖాతా సంఖ్యకు, జతపరచిన బ్యాంకు ఖాతా పాస్బుక్ కాపీలోని ఖాతా సంఖ్యల మధ్య తేడా | 12 | 53 | 0 | 0 | 65 |
| **32** | ప్రామాణిక ధృవపత్రంలోని, దరఖాస్తు పత్రంలోని అడ్మిషన్ సంఖ్యల మధ్య పొంతన లేకపోవడం | 0 | 15 | 0 | 0 | 15 |
| **33** | దూర ధృవీకరణ పత్రాన్ని జతపరచకపోవడం | 57 | 244 | 0 | 0 | 301 |
| **34** | ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్ అర్హతా పత్రాలు, బదిలీ ధృవపత్రాలను జతపరచకపోవడం | 96 | 24 | 0 | 0 | 120 |
| **35** | తండ్రి పేరు సరిపోలక పోవడం | 0 | 23 | 0 | 0 | 23 |
| **36** | కుల ధృవపత్రాలను జతచేయకపోవడం | 0 | 7 | 0 | 0 | 7 |
| **37** | దరఖాస్తు పత్రాలపై విద్యార్థులు సంతకాలు చేయకపోవడం | 0 | 5 | 0 | 0 | 5 |
| | మొత్తం | **708** | **2083** | **2694** | **631** | **6116** |

**అనుబంధం-3.3**
**(పేరా 3.6.5.10, పేజీ 72)**

## వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వేరువేరు కాలేజీలలో ఒకే కోర్సు (బీకాం) కు ఫీజు విధానంలోని భారీ వ్యత్యాసాలు

| కోర్సు, సంవత్సరం | ఫీజు | ఉస్మానియా విశ్వవిద్యాలయం | శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం | డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం | కాకతీయ విశ్వవిద్యాలయం | ఆంధ్రా విశ్వవిద్యాలయం |
|---|---|---|---|---|---|---|
| ప్రభుత్వ కళాశాలలు | | | | | | |
| **బీకాం-1** | ట్యూషన్ ఫీజు | 500 | 500 | 1100 | 970 | 700 |
| | స్పెషల్ ఫీజు | 0 | 285 | 300 | 400 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | 0 | 60 | 500 |
| | మొత్తం | **500** | **1185** | **1400** | **1430** | **1700** |
| **బీకాం-1 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 500 | 6000 | 1100 | 3970 | 700 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | 300 | 400 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | 0 | 60 | 500 |
| | మొత్తం | **3500** | **9400** | **1400** | **4430** | **1700** |
| ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు | | | | | | |
| **బీకాం-1** | ట్యూషన్ ఫీజు | 1000 | 4000 | 1100 | స.లే. | 700 |
| | స్పెషల్ ఫీజు | 0 | 3000 | 300 | స.లే. | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | 0 | స.లే. | 500 |
| | మొత్తం | **1000** | **7400** | **1400** | స.లే. | **1700** |
| **బీకాం-1 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 1000 | 6000 | స.లే. | స.లే. | 700 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 300 | స.లే. | స.లే. | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | స.లే. | స.లే. | 500 |
| | మొత్తం | **4000** | **6700** | స.లే. | స.లే. | **1700** |
| ప్రైవేట్ కళాశాలలు | | | | | | |
| **బీకాం-1** | ట్యూషన్ ఫీజు | 1000 | 1000 | స.లే. | 4000 | 3500 |
| | స్పెషల్ ఫీజు | 515 | 285 | స.లే. | 840 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | స.లే. | 300 | 500 |
| | మొత్తం | **1515** | **1685** | స.లే. | **5140** | **4500** |
| **బీకాం-1 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 1000 | 6000 | స.లే. | 6000 | 4000 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | స.లే. | 890 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | స.లే. | 2000 | 500 |
| | మొత్తం | **4000** | **9400** | స.లే. | **8890** | **5000** |
| ప్రభుత్వ కళాశాలలు | | | | | | |
| **బీకాం-2** | ట్యూషన్ ఫీజు | 500 | 500 | 1300 | 970 | 700 |
| | స్పెషల్ ఫీజు | 0 | 285 | 450 | 400 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | 0 | 0 | 0 |
| | మొత్తం | **500** | **1185** | **1750** | **1170** | **1200** |
| **బీకాం-2 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 500 | 6000 | 900 | 3970 | 700 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | 900 | 400 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | 0 | 0 | 0 |
| | మొత్తం | **3500** | **9400** | **1800** | **4370** | **1200** |

| కోర్సు, సంవత్సరం | ఫీజు | ఉస్మానియా విశ్వవిద్యాలయం | శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం | డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం | కాకతీయ విశ్వవిద్యాలయం | ఆంధ్రా విశ్వవిద్యాలయం |
|---|---|---|---|---|---|---|
| ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు | | | | | | |
| **బీకాం-2** | ట్యూషన్ ఫీజు | 1000 | 1000 | 1300 | స.లే. | 700 |
| | స్పెషల్ ఫీజు | 0 | 285 | 450 | స.లే. | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | 0 | స.లే. | 0 |
| | **మొత్తం** | **1000** | **1685** | **1750** | స.లే. | **1200** |
| **బీకాం-2 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 1000 | 6000 | స.లే. | స.లే. | 700 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | స.లే. | స.లే. | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | స.లే. | స.లే. | 0 |
| | **మొత్తం** | **4000** | **9400** | స.లే. | స.లే. | **1200** |
| ప్రైవేట్ కళాశాలలు | | | | | | |
| **బీకాం-2** | ట్యూషన్ ఫీజు | 1000 | 1000 | స.లే. | 4000 | 3500 |
| | స్పెషల్ ఫీజు | 515 | 285 | స.లే. | 840 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | స.లే. | 0 | 0 |
| | **మొత్తం** | **1515** | **1685** | స.లే. | **4840** | **4000** |
| **బీకాం-2 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 1000 | 6000 | స.లే. | 6000 | 4000 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | స.లే. | 890 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 400 | స.లే. | 0 | 0 |
| | **మొత్తం** | **4000** | **9400** | స.లే. | **6890** | **4500** |
| ప్రభుత్వ కళాశాలలు | | | | | | |
| **బీకాం-3** | ట్యూషన్ ఫీజు | 500 | 500 | 1300 | 970 | 700 |
| | స్పెషల్ ఫీజు | 0 | 285 | 450 | 400 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 300 | 0 | 0 | 0 |
| | **మొత్తం** | **500** | **1085** | **1750** | **1370** | **1200** |
| **బీకాం-3 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 500 | 6000 | 900 | 3970 | 700 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | 900 | 400 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 300 | 6000 | 0 | 0 |
| | **మొత్తం** | **3500** | **9300** | **7800** | **4370** | **1200** |
| ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు | | | | | | |
| **బీకాం-3** | ట్యూషన్ ఫీజు | 1000 | 1000 | 1300 | స.లే. | 700 |
| | స్పెషల్ ఫీజు | 0 | 285 | 450 | స.లే. | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 300 | 0 | స.లే. | 0 |
| | **మొత్తం** | **1000** | **1585** | **1750** | స.లే. | **1200** |
| **బీకాం-3 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 1000 | 6000 | స.లే. | స.లే. | 700 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | స.లే. | స.లే. | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 300 | స.లే. | స.లే. | 500 |
| | **మొత్తం** | **4000** | **9300** | స.లే. | స.లే. | **1700** |
| ప్రైవేట్ కళాశాలలు | | | | | | |
| **బీకాం-3** | ట్యూషన్ ఫీజు | 1000 | 1000 | స.లే. | 4000 | 3500 |
| | స్పెషల్ ఫీజు | 515 | 285 | స.లే. | 840 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 300 | స.లే. | 0 | 0 |
| | **మొత్తం** | **1515** | **1585** | స.లే. | **4840** | **4000** |
| **బీకాం-3 (కంప్యూటర్స్)** | ట్యూషన్ ఫీజు | 1000 | 6000 | స.లే. | 6000 | 4000 |
| | స్పెషల్ ఫీజు | 3000 | 3000 | స.లే. | 890 | 500 |
| | ఇతర ఫీజులు | 0 | 300 | స.లే. | 0 | 0 |
| | **మొత్తం** | **4000** | **9300** | స.లే. | **6890** | **4500** |

**అనుబంధం - 4.1**
**(పేరా 4.2.3, పేజీ 80)**

**ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల స్థితి**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | | నగరం పేరు | పని పేరు | అంశం | కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విలువ | విడుదల చేసిన మొత్తం | ఖర్చు | స్థితి |
|---|---|---|---|---|---|---|---|---|
| మురుగునీటి పారుదల ప్రాజెక్టులు | | | | | | | | |
| 1 | 1 | హైదరాబాదు | మూసీ నదికి దక్షిణాన పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ (జోన్ Iలోని ఆయకట్టు - S1 నుండి S6 వరకు, S12, S14) | పట్టణ మౌళిక వసతులు - పాలన (యూఐజీ) | 148.81 | 48.36 | 112.10 | పూర్తికాలేదు |
| 2 | 2 | హైదరాబాదు | మూసీ నదికి దక్షిణాన పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ (జోన్ IIలోని ఆయకట్టు - S7 నుండి S11 వరకు, S13, S15) | యూఐజీ | 251.25 | 50.25 | 138.70 | పూర్తికాలేదు |
| 3 | 3 | హైదరాబాదు | హైదరాబాదు నగర పరిధిలోని భాగమైన శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటిపారుదల బృహత్ ప్రణాళిక అమలు | యూఐజీ | 200.38 | 40.07 | 104.15 | పూర్తికాలేదు |
| 4 | 4 | హైదరాబాదు | జీహెచ్ఎమ్‌సీ లోని రాజేంద్రనగర్ మునిసిపల్ సర్కిల్‌లో గుర్తించిన ప్రాధాన్యత మండలాల్లో సమగ్ర నీటిసరఫరా వ్యవస్థ, మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు | యూఐజీ | 314.26 | 35.71 | 86.00 | పూర్తికాలేదు |
| 5 | 5 | విశాఖపట్నం | విశాఖపట్నం మహానగర పాలక సంస్థ మధ్య మండలంలో మురుగునీటి పారుదల వ్యవస్థను కల్పించడం | యూఐజీ | 244.44 | 128.32 | 189.11 | పూర్తికాలేదు |
| 6 | 6 | విశాఖపట్నం | పాత నగర ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థను కల్పించడం | యూఐజీ | 37.08 | 22.30 | 35.95 | పని పూర్తయింది |
| 7 | 7 | విజయవాడ | భూగర్భ నీటిపారుదల విధానం లేనిచోట కల్పించడం | యూఐజీ | 56.56 | 33.93 | 66.22 | పూర్తికాలేదు |
| 8 | 8 | విజయవాడ | విజయవాడలోని ఉత్తర ప్రాంతంలో మురుగునీటి పారుదల వసతిని కల్పించడం | యూఐజీ | 178.15 | 43.29 | 60.55 | పూర్తికాలేదు |

| క్రమ సంఖ్య | | నగరం పేరు | పని పేరు | అంశం | కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విలువ | విడుదల చేసిన మొత్తం | ఖర్చు | స్థితి |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 9 | కరీంనగర్ | మురుగునీటి పారుదల | చిన్న, మధ్యతరహా పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పథకం - యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 62.37 | 45.54 | 44.91 | పూర్తికాలేదు |
| 10 | 10 | కడప | మురుగునీటి పారుదల | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 49.15 | 65.82. | 63.32 | పూర్తికాలేదు |
| 11 | 11 | ఎమ్మిగనూరు | మురుగునీటి పారుదల | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 39.83 | 28.84 | 27.89 | పూర్తికాలేదు |
| 12 | 12 | నరసరావుపేట | మురుగునీటి పారుదల | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 26.41 | 24.55 | 23.36 | పూర్తికాలేదు |
| 13 | 13 | నిజామాబాదు | మురుగునీటి పారుదల | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 81.06 | 55.55 | 55.53 | పూర్తికాలేదు |
| 14 | 14 | నల్గొండ | మురుగునీటి పారుదల | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 46.88 | 42.26 | 41.16 | పూర్తికాలేదు |
| 15 | 15 | మిర్యాలగుడ | మురుగునీటి పారుదల | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 34.93 | 29.95 | 29.70 | పూర్తికాలేదు |
| 16 | 16 | నగరి | మురుగునీటి పారుదల (ఈటీపీ) | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 9.83 | 11.18 | 11.18 | పూర్తికాలేదు |
| వర్షపు నీటిపారుదల ప్రాజెక్టులు | | | | | | | | |
| 17 | 1 | హైదరాబాదు | వరద నీటి కాలువ - మురికినాలా సెకండరీ డ్రైన్ల మరమ్మతులు | యూఐజీ | 42.31 | 10.57 | 16.15 | పూర్తికాలేదు |
| 18 | 2 | హైదరాబాదు | వరద నీటి కాలువ - మురికినాలా పీ11, పీ12 డ్రైన్ల మరమ్మతులు | యూఐజీ | 32.99 | 8.23 | 11.86 | పూర్తికాలేదు |
| 19 | 3 | హైదరాబాదు | వరద నీటి కాలువ - కూకట్‌పల్లి బేగంపేట నాలా డ్రైన్ల మరమ్మతులు | యూఐజీ | 31.36 | 13.11 | 19.80 | పూర్తికాలేదు |
| 20 | 4 | హైదరాబాదు | బల్కాపూర్ చానెల్ | యూఐజీ | 35.79 | 12.16 | 21.28 | పూర్తికాలేదు |
| 21 | 5 | హైదరాబాదు | ఒకప్పటి ఎమ్‌సీహెచ్ లోని ఒకటవ, రెండవ మండలాల్లో వరద నీటి కాలువల విస్తరణ | యూఐజీ | 124.10 | 15.51 | 16.37 | పూర్తికాలేదు |
| 22 | 6 | విశాఖపట్నం | ఎస్ఎల్ కాలువ క్రమబద్ధీకరణ | యూఐజీ | 3.39 | 2.13 | 3.35 | పని పూర్తయింది |
| 23 | 7 | విశాఖపట్నం | ఎర్రిగడ్డ వరద నీటి కాలువ, బ్రాంచి కాలువల విస్తరణ | యూఐజీ | 9.21 | 6.44 | 10.84 | పని పూర్తయింది |
| 24 | 8 | విశాఖపట్నం | విశాఖపట్నం మహా నగరం 8వ మండలంలో వరదనీటి కాలువల విస్తరణ (గంగులహెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు) | యూఐజీ | 72.27 | 32.88 | 31.54 | పూర్తికాలేదు |
| 25 | 9 | బాపట్ల | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 48.96 | 42.36 | 42.36 | పూర్తయింది |
| 26 | 10 | మెదక్ | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 2.62 | 3.15 | 3.15 | పూర్తయింది |
| 27 | 11 | సిద్ధిపేట | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 9.84 | 10.25 | 10.25 | పూర్తయింది |

| క్రమ సంఖ్య | | నగరం పేరు | పని పేరు | అంశం | కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విలువ | విడుదల చేసిన మొత్తం | ఖర్చు | స్థితి |
|---|---|---|---|---|---|---|---|---|
| 28 | 12 | సూర్యాపేట | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 24.64 | 15.33 | 9.73 | పూర్తికాలేదు |
| 29 | 13 | మిర్యాలగుడ | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 34.35 | 24.19 | 10.99 | పూర్తికాలేదు |
| 30 | 14 | నల్గొండ | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 35.86 | 27.71 | 23.03 | పూర్తికాలేదు |
| 31 | 15 | అనకాపల్లి | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 22.22 | 13.96 | 13.80 | పూర్తికాలేదు |
| 32 | 16 | నంద్యాల | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 2.16 | 1.78 | 1.78 | పూర్తయింది |
| 33 | 17 | చీరాల | వర్షపు నీటి కాల్వలు | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 9.68 | 8.99 | 8.99 | పూర్తయింది |
| నీటి సరఫరా పథకాలు | | | | | | | | |
| 34 | 1 | హైదరాబాదు | క్రిష్ణా తాగునీటి సరఫరా పథకం - రెండవ దశ | యూఐజీ | 606.50 | 303.25 | 606.50 | ప్రారంభమైంది |
| 35 | 2 | హైదరాబాదు | పాత ఎమ్‌సీహెచ్ 10 మండలాల్లో ఫీడర్ వ్యవస్థ, పంపిణీ వ్యవస్థల పునరుద్ధరణ | యూఐజీ | 232.22 | 46.44. | 120.00 | పూర్తికాలేదు |
| 36 | 3 | విశాఖపట్నం | జీవీఎమ్‌సీ పరిసరాలలోని 32 ప్రాంతాలలో తాగునీటి సరఫరా | యూఐజీ | 240.74 | 114.35 | 174.24 | పూర్తికాలేదు |
| 37 | 4 | విశాఖపట్నం | తాటిపూడి పైప్‌లైన్ మార్చి తాటిపూడి జలాశయం నుంచి నగర జలాశయం వరకు పైపులైన్‌లు వేయటం, పంపింగ్ యూనిట్లు ఏర్పాటు చేయటం | యూఐజీ | 62.28 | 38.24 | 59.79 | పని పూర్తయింది |
| 38 | 5 | విశాఖపట్నం | టీఎస్ఆర్ నుంచి ఎండాడ, కొమ్మాది కూడలి వరకు నీటి సరఫరా పైపులైన్‌లు వేయటం | యూఐజీ | 23.40 | 14.06 | 22.95 | పని పూర్తయింది |
| 39 | 6 | విశాఖపట్నం | గాజువాక ప్రాంతానికి తాగునీటి సరఫరాను మెరుగుపర్చడం | యూఐజీ | 39.76 | 18.09 | 35.73 | పూర్తికాలేదు |
| 40 | 7 | విశాఖపట్నం | విశాఖపట్నం మహానగర పాలక సంస్థ లోని గాజువాక ప్రాంతంలో నీటి సరఫరా వ్యవస్థను కల్పించడం - రెండవ దశ | యూఐజీ | 46.00 | 21.85 | 29.90 | పూర్తికాలేదు |
| 41 | 8 | విశాఖపట్నం | జీవీఎమ్‌సీ మధ్యభాగం లోని ఈశాన్య మండలంలో సమగ్ర నీటి సరఫరా | యూఐజీ | 190.18 | 86.53 | 72.31 | పూర్తికాలేదు |
| 42 | 9 | విశాఖపట్నం | విశాఖపట్నం మహానగర పాలక సంస్థ లోని పాత నగరానికి సమగ్ర నీటిసరఫరా వ్యవస్థను కల్పించడం | యూఐజీ | 47.93 | 21.81 | 27.87 | పూర్తికాలేదు |

| క్రమ సంఖ్య | | నగరం పేరు | పని పేరు | అంశం | కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విలువ | విడుదల చేసిన మొత్తం | ఖర్చు | స్థితి |
|---|---|---|---|---|---|---|---|---|
| 43 | 10 | విజయవాడ | విజయవాడ నగరంలో నీటి సరఫరా లేని ప్రాంతాలలో కల్పించడం | యూఐజీ | 35.48 | 21.30 | 32.61 | ప్రారంభమైంది |
| 44 | 11 | వరంగల్ | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 164.46 | 164.00 | 164.00 | పూర్తికాలేదు |
| 45 | 12 | వనపర్తి | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 28.08 | 23.39 | 23.38 | పూర్తయింది |
| 46 | 13 | అనంతపురం | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 65.00 | 60.94 | 60.94 | ప్రారంభమైంది |
| 47 | 14 | చీరాల | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 6.19 | 5.75 | 5.75 | పూర్తయింది |
| 48 | 15 | కదిరి | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 45.46 | 61.51 | 61.51 | ప్రారంభమైంది |
| 49 | 16 | రాయదుర్గం | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 42.39 | 35.97 | 35.97 | ప్రారంభమైంది |
| 50 | 17 | మంచిర్యాల | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 22.87 | 22.56 | 22.23 | పూర్తికాలేదు |
| 51 | 18 | పిఠాపురం | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 19.66 | 9.79 | 8.81 | పూర్తికాలేదు |
| 52 | 19 | రామచంద్రా పురం | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 11.62 | 9.66 | 9.66 | పూర్తికాలేదు |
| 53 | 20 | సంగారెడ్డి | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 14.12 | 20.57 | 20.07 | ప్రారంభమైంది |
| 54 | 21 | ధర్మవరం | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 59.45 | 55.03 | 53.43 | పూర్తికాలేదు |
| 55 | 22 | కర్నూలు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 33.09 | 28.79 | 28.74 | ప్రారంభమైంది |
| 56 | 23 | భువనగిరి | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 20.37 | 13.17 | 13.07 | ప్రారంభమైంది |
| 57 | 24 | ఏలూరు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 59.59 | 69.12 | 68.96 | పూర్తయింది |
| 58 | 25 | డోన్ | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 44.76 | 36.03 | 36.01 | పూర్తికాలేదు |
| 59 | 26 | తణుకు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 14.14 | 12.06 | 11.53 | పూర్తికాలేదు |
| 60 | 27 | ఒంగోలు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 15.54 | 17.23 | 17.22 | పూర్తయింది |
| 61 | 28 | రాజంపేట | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 34.13 | 34.45 | 34.45 | పూర్తయింది |
| 62 | 29 | మహబూబ్‌నగర్ | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 68.38 | 62.25 | 62.25 | ప్రారంభమైంది |
| 63 | 30 | నిజామాబాదు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 35.92 | 41.61 | 41.61 | పూర్తికాలేదు |
| 64 | 31 | కామారెడ్డి | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 22.35 | 15.44 | 15.33 | పూర్తికాలేదు |
| 65 | 32 | నారాయణ్‌పేట | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 9.03 | 9.03 | 6.74 | ప్రారంభమైంది |
| 66 | 33 | ప్రొద్దుటూరు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 16.80 | 21.78 | 21.82 | ప్రారంభమైంది |
| 67 | 34 | మార్కాపూర్ | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 33.60 | 47.50 | 47.50 | ప్రారంభమైంది |
| 68 | 35 | కందుకూరు | నీటి సరఫరా | యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 45.60 | 53.78 | 48.78 | పూర్తయింది |
| గృహ నిర్మాణం, మౌళికవసతుల పథకాలు | | | | | | | | |
| 69 | 1 | హైదరాబాదు | సమీకృత గృహ నిర్మాణ, మౌలిక వసతుల అభివృద్ధి పథకం, హైదరాబాదు (49,000 ఇళ్లు) | పట్టణ పేదలకు మౌలిక సేవలు (బీఎస్‌యూపీ) | 490.00 | 254.06 | 694.51 | పూర్తికాలేదు |
| 70 | 2 | హైదరాబాదు | హైదరాబాదులో 4,550 ఇళ్లు నిర్మించి మౌలిక వసతులు కల్పించడం | బీఎస్‌యూపీ | 124.06 | 63.17 | 86.67 | పూర్తికాలేదు |

| క్రమ సంఖ్య | | నగరం పేరు | పని పేరు | అంశం | కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విలువ | విడుదల చేసిన మొత్తం | ఖర్చు | స్థితి |
|---|---|---|---|---|---|---|---|---|
| 71 | 3 | విజయవాడ | విజయవాడలో కృష్ణా, బుడమేరు వరద బాధితులకు పునరావాస గృహ నిర్మాణం | బీఎస్‌యూపీ | 258.73 | 183.28 | 291.87 | పూర్తికాలేదు |
| 72 | 4 | విజయవాడ | వీఎమ్‌సీ - సర్కిల్-I లోని మురికివాడలలో జీ+3 సామూహిక గృహ నిర్మాణం | బీఎస్‌యూపీ | 190.88 | 45.43 | 45.54 | పూర్తికాలేదు |
| 73 | 5 | తిరుపతి | తిరుపతిలో 4,087 ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన | సమీకృత గృహ నిర్మాణం, మురికివాడల అభివృద్ధి పథకం (ఐహెచ్‌ఎస్‌డీపీ) | 55.36 | 38.40 | 40.85 | పూర్తికాలేదు |
| పట్టణ రవాణా | | | | | | | | |
| 74 | 1 | విశాఖపట్నం | బస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్టు సిస్టం (బీఆర్‌టీఎస్) | యూఐజీ | 452.93 | 206.08 | 313.65 | పూర్తికాలేదు |
| | మొత్తం | | | | **6352.19** | **3362.42** | **4919.85** | |

*మూలం : రాష్ట్ర స్థాయి నోడల్ సంస్థ*

## అనుబంధం - 4.2
**(పేరా 4.3.2.3, పేజీ 82)**

### పట్టణ స్థానిక సంస్థలు/ఇతర సంస్థలు ప్రజా వెల్లడి చట్టం అమలు చేయటంపై విశ్లేషణ

| క్రమ సంఖ్య, వెల్లడించాల్సిన సమాచారం | పట్టణ స్థానిక సంస్థ/ఇతర సంస్థ పేరు | | | | |
|---|---|---|---|---|---|
| | జీహెచ్ఎమ్‌సీ | జలమండలి | జీవీఎమ్‌సీ | వీఎమ్‌సీ | టీఎమ్‌సీ |
| 1. సంస్థ ప్రాథమిక సమాచారం | √ | √ | √ | √ | √ |
| 2. సంస్థాగత నిర్మాణ సమాచారం | √ | √ | √ | √ | √ |
| 3. సంస్థ తీర్మానాలను చదువుకొనే వెసులుబాటు | √ | | | | √ |
| 4. అధికారులు, ఉద్యోగుల హోదా వివరాలతో కూడిన పుస్తకం | √ | √ | √ | √ | √ |
| 5. సంస్థలో వివిధ అనుమతులు మంజూరు చేసే అధికారంకల అధికారుల వివరాలు | √ | √ | √ | √ | √ |
| 6. వివిధ సేవలు అందజేయవలసిన అధికారుల వివరాలు, ఫోన్ నెంబర్లు | √ | √ | √ | √ | √ |
| 7. బ్యాలెన్స్ షీట్లు, ఆదాయ వ్యయ పట్టిక, నగదు పుస్తకం | √ | | | √ | |
| 8. ఆడిట్ చేసిన ఆర్థిక పద్దులు | | | | | |
| 9. ఒక్కొక్క సర్వీసుకు నిర్ధారించిన స్థాయి | √ | √ | √ | √ | √ |
| 10. ప్రధాన కార్యకలాపాలలోని వివిధ ప్రణాళికలు, ప్రతిపాదిత వ్యయం, వాస్తవ వ్యయం | | | √ | √ | √ |
| 11. వివిధ సబ్సిడీ పథకాలకు లబ్ధిదారులను గుర్తించే విధానం | | | | √ | √ |
| 12. వివిధ సంక్షేమ, సబ్సిడీ పథకాలలోని లబ్ధిదారుల జాబితా | | | | √ | |
| 13. కార్పోరేషన్ పరిధిలోని బృహత్ ప్రణాళికలు, ఇతర అభివృద్ధి ప్రణాళికల వివరాలు | | | | √ | √ |
| 14. ముఖ్యమైన నిర్మాణ పనులు, వాటి విలువ, పూర్తైన తేదీ, గుత్తేదార్ల వివరాలు | | | √ | √ | √ |
| 15. పన్నులు, ఇతర మార్గాల ద్వారా గత సంవత్సరం వచ్చిన ఆదాయం | √ | | √ | √ | √ |
| 16. గత సంవత్సరం వసూలు కావాల్సిన పన్నులు, ఇతర ఆదాయాలు | √ | | √ | √ | |
| 17. సంవత్సరానికి లక్ష రూపాయలకు మించి ఆస్తి పన్ను చెల్లించవలసిన బకాయిదార్లు | √ | | √ | | |
| 18. రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన రాబడులు | | | | | |
| 19. ప్రభుత్వం విడుదల చేసిన ప్రణాళిక, ప్రణాళికేతర గ్రాంట్లు | | | | | |
| 20. వివిధ పథకాలు, ప్రాజెక్టులు, కార్యక్రమాల అమలుకోసం ప్రభుత్వం విడుదలచేసిన గ్రాంట్లు | √ | | √ | √ | √ |
| 21. ప్రజల నుంచి విరాళాలుగా వసూలు చేసిన సొమ్ము | √ | | √ | √ | √ |
| 22. వార్షిక బడ్జెట్ | √ | | √ | √ | √ |
| 23. ఎస్సీ, ఎస్టీ, స్త్రీ-శిశు సంక్షేమాలకు బడ్జెట్ కేటాయింపులు, వాటి వినియోగం | | | | | |
| 24. మురికి వాడలకు బడ్జెట్ కేటాయింపు (గత సంవత్సరపు వినియోగం మేరకు) | | | √ | | |

**అనుబంధం 5.1**
**(పేరా 5.2.3, పేజీ 117)**

**ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల స్థితిని తెలిపే వివరాలు**

| క్రమ సంఖ్య | నీటి సరఫరా పథకం పేరు | జిల్లా | గ్రాంటు పేరు | ప్రాజెక్టు అంచనా విలువ (₹ కోట్లలో) | డివిజన్ పేరు | స్థితి | 31.03.12 వరకు అయిన ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | అల్లూరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం రెండవ దశ | శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 5.00 | నెల్లూరు | పూర్తికాలేదు | 1.05 |
| 2 | జలదంకి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | 12వ ఆర్థిక సంఘం | 6.00 | నెల్లూరు | పూర్తికాలేదు | 6.72 |
| 3 | కోవూరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్ | 5.00 | నెల్లూరు | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 5.00 |
| 4 | ఇందుకూరుపేట సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | 12వ ఆర్థిక సంఘం | 5.00 | నెల్లూరు | ప్రారంభమైంది | 4.39 |
| 5 | ఆత్మకూరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | రాజీవ్ పల్లె బాట (ఆర్‌పిబి) | 2.30 | నెల్లూరు | ప్రారంభమైంది | 1.53 |
| 6 | ఉదయగిరి సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్ | 2.00 | నెల్లూరు | ప్రారంభమైంది | 1.54 |
| 7 | సూళ్ళూరుపేట సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం రెండవ దశ | | నాబార్డ్ | 5.00 | గూడూరు | ప్రారంభమైంది | 1.21 |
| 8 | కోట సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | ఉప పథక కార్యక్రమం | 7.00 | గూడూరు | ప్రారంభమైంది | 4.91 |
| 9 | వాకాడు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | 12వ ఆర్థిక సంఘం | 6.00 | గూడూరు | ప్రారంభమైంది | 5.38 |
| 10 | రాపూరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 10.00 | గూడూరు | పూర్తికాలేదు | 8.26 |
| 11 | సూళ్ళూరుపేట సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 1.30 | గూడూరు | ప్రారంభమైంది | 1.14 |
| 12 | మెదక్ మరియు మెదక్ మండలంలోని 46 సమస్యాత్మక ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | మెదక్ | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 9.40 | మెదక్ | ప్రారంభమైంది | 7.54 |
| 13 | కొడపాక మరియు 13 ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్ | 4.30 | మెదక్ | ప్రారంభమైంది | 2.89 |
| 14 | జిన్నారం మండలంలోని బొల్లారంకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా | 1.60 | మెదక్ | ప్రారంభమైంది | వివరాలు తెలుపలేదు |
| 15 | గజ్వేళ్, నర్సాపూర్, రామాయంపేట, దొమ్మాటలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం (రెండవ దశ) | | హడ్కో | 45.00 | సిద్ధిపేట | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 45.00 |

| క్రమ సంఖ్య | నీటి సరఫరా పథకం పేరు | జిల్లా | గ్రాంటు పేరు | ప్రాజెక్టు అంచనా విలువ (₹ కోట్లలో) | డివిజన్ పేరు | స్థితి | 31.03.12 వరకు అయిన ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| 16 | మెదక్ జిల్లాలోని దుబ్బాక మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా | 15.00 | సిద్ధిపేట | ప్రారంభమైంది | 13.39 |
| 17 | మెదక్ జిల్లాలోని రామాయంపేట, నర్సాపూర్‌లలోని నీటి కొరత ఉన్న ఆవాసాలకు మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 12.00 | సిద్ధిపేట | ప్రారంభమైంది | 9.04 |
| 18 | మెదక్ జిల్లాలోని హత్నూర, నర్సాపూర్, జిన్నారం, శివంపేట, కౌడిపల్లి మండలాల్లోని నీటి వసతిలేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్ | 10.00 | సిద్ధిపేట | ప్రారంభమైంది | 8.76 |
| 19 | మెదక్ జిల్లాలోని చేగుంట, దౌలతాబాద్ మండలాల్లోని నీటి వసతి లేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 15.00 | సిద్ధిపేట | పూర్తికాలేదు | 3.82 |
| 20 | మెదక్ జిల్లాలోని నర్సాపూర్, కౌడిపల్లి, కుల్చారం, హత్నూర, మండలాల్లోని నీటి వసతిలేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 18.00 | సిద్ధిపేట | పూర్తికాలేదు | 2.98 |
| 21 | మెదక్ జిల్లాలోని గజ్వేల్ ములుగు, తూప్రాన్, వర్గల్ మండలాల్లోని నీటి వసతిలేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 9.00 | సిద్ధిపేట | పూర్తికాలేదు | 1.24 |
| 22 | గజ్వేల్, నర్సాపూర్, రామాయంపేట, దొమ్మాట లకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం మొదటి దశ | | హడ్కో | 55.00 | సిద్ధిపేట | ప్రారంభమైంది | 55.00 |
| 23 | తాళ్లూరు మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | ప్రకాశం | 12వ ఆర్థిక సంఘం | 9.00 | ఒంగోలు | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 7.63 |
| 24 | చుండి, చెర్లోపాలెం గ్రామాలు మరియు 25 ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | ఉప పథక కార్యక్రమం | 8.00 | ఒంగోలు | ప్రారంభమైంది | 7.75 |
| 25 | కందుకూరు నియోజక వర్గంలోని నీటి కొరత ఉన్న ఆవాసాలకు మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 10.00 | ఒంగోలు | ప్రారంభమైంది | 6.40 |

| క్రమ సంఖ్య | నీటి సరఫరా పథకం పేరు | జిల్లా | గ్రాంటు పేరు | ప్రాజెక్టు అంచనా విలువ (₹ కోట్లలో) | డివిజన్ పేరు | స్థితి | 31.03.12 వరకు అయిన ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| 26 | సీఎస్ పురం మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | 12వ ఆర్థిక సంఘం | 12.00 | పొదిలి | పూర్తికాలేదు | 73.47 |
| 27 | వెలిగండ్ల, పామూరు మండలాల్లోని రక్షిత నీటి వనరులులేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | 12వ ఆర్థిక సంఘం | 30.00 | పొదిలి | పూర్తికాలేదు | |
| 28 | పామూరు, వెలిగండ్ల, పి.సి. పల్లి, సి.ఎస్. పురం మండలాల్లోని నాణ్యమైన నీటి సరఫరాలేని ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సవరించిన ఉప పథక కార్యక్రమం | 49.00 | పొదిలి | పూర్తికాలేదు | |
| 29 | వీబీఆర్ నుండి యర్రగూడూరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకానికి పైపు లైను వేయడం - మొదటి దశ | కర్నూలు | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 4.15 | కర్నూలు | ప్రారంభమైంది | 3.13 |
| 30 | గార్గేయపురం సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం విస్తరణ | | నాబార్డ్ | 2.40 | కర్నూలు | ప్రారంభమైంది | 2.29 |
| 31 | వీబీఆర్ నుండి యర్రగూడూరు మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకానికి పైపులైను వేయడం - రెండవ దశ | | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 8.00 | కర్నూలు | పూర్తికాలేదు | 0.00 |
| 32 | కొలిమిగుండ్ల సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్ | 10.00 | నంద్యాల | ప్రారంభమైంది | 9.53 |
| 33 | ఆళ్లగడ్డ సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్ | 5.11 | నంద్యాల | ప్రారంభమైంది | 4.09 |
| 34 | ఆస్పరి (ఆలూరు) సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | హడ్కో | 11.50 | ఆదోని | ప్రారంభమైంది | 9.89 |
| 35 | కుప్పగల్ సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | రాజీవ్ పల్లె బాట | 4.60 | ఆదోని | ప్రారంభమైంది | 4.60 |
| 36 | కౌతాలం సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | 12వ ఆర్థిక సంఘం | 4.00 | ఆదోని | ప్రారంభమైంది | 3.55 |
| 37 | వరంగల్ జిల్లాలోని పరకాల మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | వరంగల్ | కనీస అవసరాల కార్యక్రమం (ఎమ్ఎన్‌పి) | 9.00 | పరకాల | పూర్తికాలేదు | 4.83 |
| 38 | తొర్రూరు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | ఉప పథక కార్యక్రమం | 11.00 | తొర్రూరు | ప్రారంభమైంది | 8.82 |
| 39 | గోదావరి ఎత్తిపోతల పథకం (దేవాదుల)తో తాగు నీటి సరఫరా పథకం అనుసంధానం మొదటి దశ | | రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్ -2009-10 గ్రాంట్ | 125.00 | దేవాదుల | పూర్తికాలేదు | 87.55 |

| క్రమ సంఖ్య | నీటి సరఫరా పథకం పేరు | జిల్లా | గ్రాంటు పేరు | ప్రాజెక్టు అంచనా విలువ (₹ కోట్లలో) | డివిజన్ పేరు | స్థితి | 31.03.12 వరకు అయిన ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| 40 | సంగం మండలంలోని వెంకటాపూర్ మరియు 8 ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | ప్రధాన మంత్రి గ్రామీణ యోజన | 5.00 | వెంకటాపూర్ | పూర్తికాలేదు | 4.32 |
| 41 | కామారెడ్డి మరియు 281 గ్రామాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | నిజామాబాద్ | హడ్కో | 140.00 | కామారెడ్డి | పూర్తికాలేదు | 114.50 |
| 42 | న్యాలకల్ మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం - I, II & IB దశలు | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 24.50 | న్యాలకల్ | పూర్తికాలేదు | 16.28 |
| 43 | బాల్కొండకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం మూడవ దశ | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 10.00 | బాల్కొండ | ప్రారంభమైంది | 8.20 |
| 44 | బాల్కొండకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం రెండవ దశ | | నాబార్డ్ | 25.00 | బాల్కొండ | ప్రారంభమైంది | 22.20 |
| 45 | వర్ని మండలంలోని చందూరు మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్, సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 10.00 | చందూరు | పూర్తికాలేదు | 2.23 |
| 46 | నిజామాబాదు జిల్లాలోని దామరాంచ మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 10.00 | దామరాంచ | ప్రారంభమైంది | 6.24 |
| 47 | హుస్నాబాద్, చిగురు మామిడి ఎస్ఎస్ఎస్ | కరీంనగర్ | 12వ ఆర్థిక సంఘం | 15.00 | హుస్నాబాద్ | పూర్తికాలేదు | 13.14 |
| 48 | గంభీర్రావుపేట, ముస్తాబాద్ ఎస్ఎస్ఎస్ | | 12వ ఆర్థిక సంఘం | 15.00 | కరీంనగర్ | పూర్తికాలేదు | 27.12 |
| 49 | రామడుగు, అంబారీపేట, కొడిమ్యాల్, లింగాపూర్, బోయిన్పల్లి ఎస్ఎస్ఎస్ | | 12వ ఆర్థిక సంఘం | 32.60 | కరీంనగర్ | పూర్తికాలేదు | |
| 50 | కోటపల్లి సాగునీటి చెరువులో ట్యాంకు నిర్మాణం | | నీటి సరఫరాను పెంపొందించే పథకం | 2.09 | కరీంనగర్ | ప్రారంభమైంది | 2.09 |
| 51 | గంగాధర మండలంలోని గంగాధర మరియు 35 ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | | నాబార్డ్, ప్రధాన మంత్రి గ్రామీణ యోజన | 15.50 | కరీంనగర్ | ప్రారంభమైంది | 12.97 |
| 52 | మంథని పట్టణానికి రక్షిత తాగు నీటి సరఫరా | | నీటి సరఫరాను పెంపొందించే పథకం | 2.41 | మంథని | ప్రారంభమైంది | 0.94 |
| 53 | జేసీఎస్ఆర్ తాగు నీటి సరఫరా - మొదటి, రెండవ, మూడవ, నాల్గవ దశలు | అనంతపురం | హడ్కో | 508.00 | అనంతపురం | పూర్తికాలేదు | 287.82 |
| 54 | వై.టి. చెరువు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం - మొదటి, రెండవ దశలు | | హడ్కో | 12.50 | అనంతపురం | ప్రారంభమైంది | 10.29 |

| క్రమ సంఖ్య | నీటి సరఫరా పథకం పేరు | జిల్లా | గ్రాంటు పేరు | ప్రాజెక్టు అంచనా విలువ (₹ కోట్లలో) | డివిజన్ పేరు | స్థితి | 31.03.12 వరకు అయిన ఖర్చు (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| 55 | నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగు నీటి సరఫరా పథకం - మొదటి, రెండవ, మూడవ దశలు | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 581.00 | పెనుకొండ | ప్రారంభమైంది | 409.58 |
| 56 | నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగు నీటి సరఫరా పథకం - నాల్గవ దశ | | హడ్కో | | కళ్యాణదుర్గ్ | ప్రారంభమైంది | |
| 57 | పుల్లలచెరువు | ప్రకాశం | నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ XII | 16.90 | పొదిలి | ప్రారంభమైంది | 11.77 |
| 58 | కేకే మిట్ట & హెచ్ఎమ్ పాడు - మొదటి దశ | | ఉప పథక కార్యక్రమం | 35.00 | పొదిలి | ప్రారంభమైంది | 35.00 |
| 59 | కేకే మిట్ట & హెచ్ఎమ్ పాడు - రెండవ దశ | | ఉప పథక కార్యక్రమం | 17.00 | పొదిలి | ప్రారంభమైంది | 15.40 |
| 60 | కురిచేడు | | ఉప పథక కార్యక్రమం | 10.00 | కురిచేడు | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 6.79 |
| 61 | క్రిష్ణగిరి - మొదటి, రెండవ దశలు | కర్నూలు | హడ్కో | 18.50 | క్రిష్ణగిరి | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 14.67 |
| 62 | క్రిష్ణగిరి - మూడవ దశ | | హడ్కో | 13.50 | క్రిష్ణగిరి | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 6.40 |
| 63 | పాలేరు - మొదటి దశ | ఖమ్మం | నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ X | 9.50 | పాలేరు | ప్రారంభమైంది | 8.53 |
| 64 | పాలేరు - రెండవ దశ | | 12వ ఆర్థిక సంఘం | 12.00 | పాలేరు | ప్రారంభమైంది | 10.68 |
| 65 | పాలేరు - మూడవ దశ | | సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం | 15.00 | పాలేరు | ప్రారంభమైంది | 10.88 |
| 66 | వట్టినాగులపల్లి | రంగారెడ్డి | నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ XII | 2.50 | ఖైరతాబాదు | పూర్తయింది కానీ ప్రారంభించలేదు | 1.33 |
| | | మొత్తం | | **2120.16** | | | **1483.69** |

**అనుబంధం - 5.2**
**(పేరా 5.7.12.3, పేజీ 135)**

## టెండరు షరతులు పాటించకుండా పనుల అప్పగింత

| క్రమ సంఖ్య | పని పేరు | టెండరు నోటీసు వివరాలు | సంస్థ | టెండరు వివరాలు | పార్టు 'బి'కి సంబంధించి 20 శాతానికి మించి ఉన్న టెండర్ శాతం | మొత్తం (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|
| 1 | జేసీ నాగిరెడ్డి తాగునీటి సరఫరా పథకం - రెండవ, మూడవ దశలు | పార్టు ఎ : ₹9194.63 లక్షలు | మెసర్స్ ది ఇండియన్ హ్యూమ్ పైప్స్ కంపెనీ | పార్టు ఎ : +4.99% ₹9650.68 లక్షలు | 8.60% | 2.63 |
| | | పార్టు బి : ₹3065.58 లక్షలు | | పార్టు బి : +28.595% | | |
| | | | | ₹3942.19 లక్షలు | | |
| 2 | జేసీ నాగిరెడ్డి తాగునీటి సరఫరా పథకం - నాల్గవ దశ | పార్టు ఎ : ₹11357.98 లక్షలు | మెసర్స్ ది ఇండియన్ హ్యూమ్ పైప్స్ కంపెనీ | పార్టు ఎ : +4.99% ₹11924.75 లక్షలు | 13.98% | 3.61 |
| | | పార్టు బి : ₹2582.36 లక్షలు | | పార్టు బి : +33.978% | | |
| | | | | ₹3459.82 లక్షలు | | |
| 3 | శ్రీ నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకం - నాల్గవ దశ | పార్టు ఎ : ₹8708.36 లక్షలు | మెసర్స్ ఎల్ &టీ | పార్టు ఎ : +4.98% ₹9142.04 లక్షలు | 7.99% | 4.64 |
| | | | | పార్టు బి : +27.99% | | |
| | | పార్టు బి : ₹5812.12 లక్షలు | | ₹7438.93 లక్షలు | | |
| 4 | కామారెడ్డి మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | పార్టు ఎ : ₹6023 లక్షలు | మెసర్స్ మెగా ఇంజినీరింగ్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ | పార్టు ఎ : +4.95% ₹6321 లక్షలు | 9.63% | 3.98 |
| | | పార్టు బి : ₹4132 లక్షలు | | పార్టు బి : +29.625% | | |
| | | | | ₹5356 లక్షలు | | |
| 5 | మెదక్ జిల్లాలోని హత్నూర, నర్సాపూర్, జిన్నారం, కొడిపల్లి మండలాల్లోని నీటి వసతి లేని ఆర్‌ఐఏడీ ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | పార్టు ఎ : ₹528.52 లక్షలు | సిహెచ్.వి.వి. సుబ్బారావు | పార్టు ఎ : +4.95% ₹554.68 లక్షలు | 8.58% | 0.24 |
| | | పార్టు బి : ₹804.56 లక్షలు | | పార్టు బి : +28.58% | | |
| | | | | ₹909.64 లక్షలు | | |
| 6 | శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రాపూర్ మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | పార్టు ఎ : ₹431.216 లక్షలు | కె.ఎల్. శ్రీధర్ రెడ్డి | పార్టు ఎ : +4.99% ₹ 452.78 లక్షలు | 5.38% | 0.15 |
| | | పార్టు బి : ₹278.46 లక్షలు | | పార్టు బి : +25.38% | | |
| | | | | ₹ 349.13 లక్షలు | | |

| క్రమ సంఖ్య | పని పేరు | టెండరు నోటీసు వివరాలు | సంస్థ | టెండరు వివరాలు | పార్టు 'బి'కి సంబంధించి 20 శాతానికి మించి ఉన్న టెండర్ శాతం | మొత్తం (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|
| 7 | శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కోటా మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | పార్టు ఎ : ₹301.53 లక్షలు | కె.ఎల్. శ్రీధర్ రెడ్డి | పార్టు ఎ : +4.99% ₹ 316.58 లక్షలు | 7.79% | 0.15 |
| | | పార్టు బి : ₹186.34 లక్షలు | | పార్టు బి : +27.79% ₹ 238.12 లక్షలు | | |
| 8 | శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వాకాడు మరియు ఇతర ఆవాసాలకు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం | పార్టు ఎ : ₹69.49 లక్షలు | కె.ఎల్. శ్రీధర్ రెడ్డి | పార్టు ఎ : +4.99% ₹ 72.96 లక్షలు | 4.55% | 0.03 |
| | | పార్టు బి : ₹67.00 లక్షలు | | పార్టు బి : +24.547% ₹ 83.45 లక్షలు | | |
| | **మొత్తం** | | | | | **15.43** |

## అనుబంధం 6.1
## (పేరా 6.1.1, పేజీ 147)

### ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న సాంకేతిక కళాశాలల జాబితా

| క్రమ సంఖ్య | సాంకేతిక కళాశాల పేరు | సాంకేతిక కళాశాల పాతదా/కొత్తదా |
|---|---|---|
| 1 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, అనకాపల్లి | కొత్తది |
| 2 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల (మైనారిటీలు), కర్నూలు | పాతది |
| 3 | ఈఎస్‌సీ ప్రభుత్వ సాంకేతిక కళాశాల, నంద్యాల | పాతది |
| 4 | ప్రభుత్వ ప్రింటింగ్ టెక్నాలజీ విద్యా సంస్థ, సికింద్రాబాదు | పాతది |
| 5 | ఆంధ్రా సాంకేతిక కళాశాల, కాకినాడ | పాతది |
| 6 | డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎమ్ఆర్ సాంకేతిక కళాశాల, రాజమండ్రి | పాతది |
| 7 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, సిద్ధిపేట | కొత్తది |
| 8 | ప్రభుత్వ మహిళా సాంకేతిక కళాశాల, మెదక్ | పాతది |
| 9 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, మాసాబ్‌ట్యాంక్, హైదరాబాదు | పాతది |
| 10 | ప్రభుత్వ మహిళా సాంకేతిక కళాశాల, భీమునిపట్నం | పాతది |
| 11 | ప్రభుత్వ మహిళా సాంకేతిక కళాశాల (మైనారిటీలు), రంగారెడ్డి | పాతది |
| 12 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, నారాయణఖేడ్, మెదక్ | కొత్తది |
| 13 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, సంగారెడ్డి, మెదక్ | కొత్తది |
| 14 | జీఎమ్ఆర్ సాంకేతిక కళాశాల, శ్రీశైలం, కర్నూలు | పాతది |
| 15 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, విశాఖపట్నం | పాతది |
| 16 | జేఎన్ ప్రభుత్వ సాంకేతిక కళాశాల, రామంతపూర్, హైదరాబాదు | పాతది |
| 17 | ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ విద్యా సంస్థ, సికింద్రాబాదు | పాతది |
| 18 | ప్రభుత్వ సాంకేతిక కళాశాల, నర్సాపూర్, మెదక్ | కొత్తది |
| 19 | ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ విద్యా సంస్థ, హైదరాబాదు | పాతది |
| 20 | ప్రభుత్వ మహిళా సాంకేతిక కళాశాల, కాకినాడ | పాతది |
| 21 | ఎస్‌జీ ఎమ్ సాంకేతిక కళాశాల, అబ్దుల్లాపూర్‌మెట్, రంగారెడ్డి | పాతది |

# పొడి అక్షరాల వివరణ

పేజీలు 189 - 194

| | | |
|---|---|---|
| ఏ&ఇ | : | అకౌంట్లు, ఎన్‌టైటిల్‌మెంట్లు |
| ఏఏపీ | : | వార్షిక కార్యాచరణ ప్రణాళిక |
| ఏఏవై | : | అంత్యోదయ అన్న యోజన |
| ఏబీ | : | ఆంధ్రా బ్యాంకు |
| ఏబీసీడబ్ల్యూఓ | : | సహాయక వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి |
| ఏడీఎఫ్ఓ | : | సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి |
| ఏడీఎఫ్ఎస్ | : | అగ్నిమాపక సేవల అదనపు సంచాలకులు |
| ఏఐసీటీఈ | : | అఖిల భారత సాంకేతిక విద్యా మండలి |
| ఏఐఈఈఈ | : | అఖిల భారత ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష |
| ఏఎమ్‌సీ | : | వ్యవసాయ మార్కెట్ కమిటీ |
| ఏపీఈపీడీసీఎల్ | : | ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ |
| ఏపీఈడబ్ల్యూఐడీసీ | : | ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ |
| ఏపీఎఫ్&ఈఓ మరియు ఎల్ఎఫ్ఆర్ | : | ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి |
| ఏపీఎఫ్ఎస్ఏ | : | ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సేవల చట్టం |
| ఏపీహెచ్‌బీ | : | ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ |
| ఏపీహెచ్ఎమ్‌హెచ్ఐడీసీ | : | ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య, గృహనిర్మాణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ |
| ఏపీఐఐసీ | : | ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ |
| ఏపీఎస్‌సీహెచ్ఈ | : | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి |
| ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ | : | ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ |
| ఏపీఎస్‌హెచ్‌సీఎల్ | : | ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ |
| ఏపీఎస్‌హెచ్‌పీసీ | : | ఆంధ్రప్రదేశ్ పోలీస్ గృహనిర్మాణ సంస్థ |
| ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ | : | ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ |
| ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ | : | ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్‌ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ |
| ఏపీట్రాన్స్‌కో | : | ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థ |
| ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ | : | ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్‌ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ |
| ఏపీయూఎఫ్ఐడీసీ | : | ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ |
| ఏఆర్‌డబ్ల్యూఎస్‌పీ | : | సత్వర గ్రామీణ నీటి సరఫరా కార్యక్రమం |
| ఏటీఎమ్ | : | ఆటోమేటిక్ టెల్లర్ మెషిన్ |
| ఏయూ | : | ఆంధ్రా విశ్వవిద్యాలయం |
| బీఏఎస్ | : | ఉన్నవాటిల్లో అత్యుత్తమ పాఠశాలలు |
| బీసీ | : | వెనుకబడిన తరగతులు |
| బీసీడబ్ల్యూ | : | వెనుకబడిన తరగతుల సంక్షేమం |
| బీడీఎస్ | : | బాచ్యులర్ ఆఫ్ డెంటల్ సర్జన్ |
| బీజీ | : | బ్యాంకు గ్యారంటీ |
| బీఐఈ | : | ఇంటర్మీడియేట్ విద్యా బోర్డు |

| | | |
|---|---|---|
| బీఓక్యూ | : | బిల్ ఆఫ్ క్వాంటిటీస్ |
| బీపీఎల్ | : | దారిద్ర్యరేఖకు దిగువ |
| బీఆర్ఏఓయూ | : | డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం |
| బీఆర్ఓ | : | బడ్జెట్ విడుదల ఉత్తర్వులు |
| బీఆర్టీఎస్ | : | శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ |
| బీఎస్‌యూపీ | : | పట్టణ పేదలకు మౌలిక సేవలు |
| బీటీ రోడ్లు | : | తారు రోడ్లు |
| సీఏఏ | : | రాజ్యాంగ సవరణ చట్టం |
| సీఏజీ | : | భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ |
| సీఏహెచ్ | : | కాలేజీ అనుబంధ హాస్టల్ |
| సీసీ రోడ్లు | : | సిమెంట్ కాంక్రీటు రోడ్లు |
| సీసీఓ | : | ప్రధాన నియంత్రణాధికారి |
| సీడీపీ | : | నగరాభివృద్ధి ప్రణాళిక |
| సీడీటీపీ | : | సాంకేతిక కళాశాలల ద్వారా సమాజ వికాసం |
| సీఈ | : | ముఖ్య ఇంజనీర్ |
| సీఈడీ | : | సెంట్రల్ ఎక్సైజ్ సుంకం |
| సీఈఈపీ | : | పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరడానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష |
| సీఈటీ | : | ఉమ్మడి ప్రవేశ పరీక్ష |
| సీజీజీ | : | సుపరిపాలనా కేంద్రం |
| సీఐ | : | పోత ఇనుము (కాస్ట్ ఐరన్) |
| సీఐ పైపులు | : | పోత ఇనుము పైపులు |
| సీఐఎన్‌బీ | : | కార్పోరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ |
| సీఎమ్‌హెచ్ | : | కాలేజీ నిర్వాహిత హాస్టల్ |
| సీఎమ్‌యూ | : | కేంద్రీయ పర్యవేక్షణ విభాగం |
| సీఓటీ | : | టెండర్ల కమీషనర్ |
| సీపీ | : | పోలీస్ కమీషనర్ |
| సీపీహెచ్‌ఈఈఓ | : | కేంద్రీయ ప్రజారోగ్యం పర్యావరణ, ఇంజినీరింగ్ సంస్థ |
| సీపీడబ్ల్యూఎస్ | : | సమగ్ర రక్షిత నీటి సరఫరా |
| సీఆర్ఎఫ్ | : | విపత్తు ఉపశమన నిధి |
| సీఎస్ఎమ్‌సీ | : | కేంద్ర మంజూరీ పర్యవేక్షణ సమితి |
| సీఎస్ఎస్ | : | కేంద్ర ప్రాయోజిత పథకం |
| సీఎస్‌డబ్ల్యూ | : | సాంఘిక సంక్షేమ కమీషనర్ |
| సీటీడబ్ల్యూ | : | గిరిజన సంక్షేమ కమీషనర్ |
| డీబీసీడబ్ల్యూ | : | వెనుకబడిన తరగతుల సంక్షేమ సంచాలకులు |
| డీబీసీడబ్ల్యూఓ | : | జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి |
| డీసీబీ | : | డిమాండ్ వసూలు, బకాయి |
| డీసీసీపీ | : | డిప్లొమా ఇన్ కంప్యూటింగ్ మరియు కమర్షియల్ ప్రాక్టీసెస్ |

| | | |
|---|---|---|
| డీడీఓలు | : | డ్రా, చెల్లింపు అధికారులు |
| డీడీపీ | : | ఎడారుల అభివృద్ధి కార్యక్రమం |
| డీఎఫ్ఓ | : | జిల్లా అగ్నిమాపక అధికారి |
| డీఎఫ్ఎస్ | : | అగ్నిమాపక సేవల సంచాలకులు |
| డీజీఎఫ్ఎస్ | : | అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ |
| డీఐ | : | దుక్క ఇనుము (డక్టైల్ ఐరన్) |
| డీఐ పైపులు | : | దుక్క ఇనుము పైపులు |
| డీఓ | : | డ్రైవర్ ఆపరేటర్ |
| డీపీసీ | : | జిల్లా ప్రణాళికా సంఘం |
| డీపీఆర్ | : | సమగ్ర ప్రాజెక్టు నివేదిక |
| డీటీటీ | : | డిప్లొమా ఇన్ టెక్స్‌టైల్ టెక్నాలజీ |
| ఈఈ | : | కార్యనిర్వాహక ఇంజినీర్ |
| ఈఐఏ | : | పర్యావరణ ప్రభావ మదింపు |
| ఈఎల్ఎస్ఆర్ | : | ఎలివేటెడ్ లెవెల్ స్టోరేజి రిజర్వాయర్ |
| ఈఎమ్‌డీ | : | బయానా సొమ్ము |
| ఈఎమ్‌పీ | : | పర్యావరణ నిర్వహణ ప్రణాళిక |
| ఈఎన్‌సీ | : | ఇంజినీర్-ఇన్-చీఫ్ |
| ఈఓఏటీ | : | ఒప్పందం గడువు పొడిగింపు |
| ఈపీసీ | : | ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ |
| ఈటీపీ | : | మురుగునీటి  శుద్ధి కేంద్రం |
| ఎఫ్‌సీ | : | (నీటి వసతులు) పూర్తిగా కలిగి ఉన్న |
| ఎఫ్ఎమ్ | : | ఫైర్ మ్యాన్ |
| ఎఫ్ఓపీ | : | ఫైర్ ఔట్-పోస్ట్ |
| ఎఫ్‌టీకేలు | : | క్షేత్ర పరిశోధన కిట్లు |
| జీ హెచ్ఎమ్‌సీ | : | హైదరాబాద్ మహానగర పాలక సంస్థ |
| జీఐ | : | గాల్వనైజ్డ్ ఇనుము |
| జీఐఎస్ | : | భౌగోళిక సమాచార వ్యవస్థ |
| జీఎల్ఎస్ఆర్ | : | గ్రౌండ్ లెవెల్ స్టోరేజి రిజర్వాయర్ |
| జీఓఏపీ | : | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం |
| జీఓఐ | : | భారత/కేంద్ర ప్రభుత్వం |
| జీపీ | : | గ్రామ పంచాయతి |
| జీపీఎస్ | : | గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ |
| జీపీటీ | : | ప్రభుత్వ పాలిటెక్నిక్ |
| జీఆర్‌పీ | : | గ్లాస్ రీఇన్‌ఫోర్స్డ్ ప్లాస్టిక్ |
| జీఎస్ఐ | : | భారత భూభౌతిక సర్వే |
| జీవీఎమ్‌సీ | : | విశాఖపట్నం మహనగర పాలక సంస్థ |
| హెచ్‌డీపీఈ | : | హై డెన్సిటీ పాలీ ఇథలీన్ |

| | | |
|---|---|---|
| హెచ్ఎమ్‌డీఏ | : | హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ |
| హెచ్ఎమ్‌డబ్ల్యూ ఎస్ఎస్‌బీ | : | హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, పారిశుధ్య సంస్థ |
| హడ్కో | : | గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి సంస్థ |
| ఐ&సీఏడీ | : | నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి |
| ఐబీఎమ్ | : | అంతర్గత అంచనా |
| ఐఈసీ | : | సమాచార విద్యా, ప్రసారం |
| ఐహెచ్ఎస్‌డీపీ | : | సమీకృత గృహ నిర్మాణ, మురికివాడల అభివృద్ధి కార్యక్రమం |
| ఐఆర్ఎమ్ఏ (ఇర్మా) | : | సమీక్షా, పర్యవేక్షణలకై స్వతంత్ర సంస్థ |
| ఐటీ | : | ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ |
| జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ | : | జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం |
| కిమ్స్ | : | కృష్ణా వైద్య విజ్ఞాన సంస్థ |
| కేఎల్ | : | కిలో లీటర్ |
| ఎల్ఏ | : | లైసెన్సింగ్ అథారిటీ |
| ఎల్ఏఎన్ | : | లోకల్ ఏరియా నెట్‌వర్క్ |
| ఎల్ఎఫ్ఎమ్ | : | లీడింగ్ ఫైర్ మ్యాన్ |
| ఎల్ఓసీ | : | లెటర్ ఆఫ్ క్రెడిట్ |
| ఎల్‌పీసీడీ | : | రోజుకు తలసరి లీటర్లు |
| ఎల్ఎస్ | : | ఏక మొత్తం |
| ఎమ్ఏ&యూడీ | : | మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి |
| ఎమ్‌జీడీ | : | రోజుకు పది లక్షల గాలన్లు |
| ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ | : | మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం |
| ఎమ్ఐఎస్ | : | మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ |
| ఎమ్ఎల్‌డీ | : | రోజుకు పది లక్షల లీటర్లు |
| ఎమ్ఓఏ | : | మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్ |
| ఎమ్ఓఆర్‌డీ | : | గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ |
| ఎమ్ఓయూడీ | : | పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ |
| ఎమ్‌పీసీ | : | మహానగర ప్రణాళికా సంఘం |
| ఎమ్‌పీఎన్ | : | అత్యంత సంభావ్యత సంఖ్య |
| ఎమ్‌పీపీ | : | మండల ప్రజా పరిషత్ |
| ఎమ్ఎస్ | : | మెత్తని ఇనుము (మైల్డ్ స్టీల్) |
| ఎమ్ఎస్ పైపులు | : | మెత్తని ఇనుము పైపులు |
| ఎమ్ఎస్‌బీ | : | బహుళ అంతస్తు భవనాలు |
| ఎమ్ఎస్‌బీఐసీ | : | బహుళ అంతస్తు భవనాల తనిఖీ కమిటీ |
| ఎమ్‌టీ | : | మెట్రిక్ టన్ను |
| నాబార్డ్ | : | వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కోసం జాతీయ బ్యాంకు |
| ఎన్ఏసీ | : | జాతీయ నిర్మాణ సంస్థ |

| | | |
|---|---|---|
| ఎన్‌బీసీ | : | జాతీయ నిర్మాణ నియమావళి |
| ఎన్‌సీ | : | కవర్ చేయని |
| ఎన్‌హెచ్‌ఏఐ | : | భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ |
| నిమ్స్ | : | నిజాం వైద్య విజ్ఞాన సంస్థ |
| ఎన్‌ఓసీ | : | నిరభ్యంతర పత్రం |
| ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ | : | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం |
| ఎన్‌ఆర్‌డీడబ్ల్యూక్యూ ఎమ్ఎస్‌పీ | : | జాతీయ గ్రామీణ తాగునీటి నాణ్యతా పర్యవేక్షణ, నిఘా కార్యక్రమం |
| ఎన్‌ఆర్‌హెచ్‌ఎమ్ | : | జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం |
| ఎన్‌ఎస్ కెనాల్ | : | నాగార్జునసాగర్ కాలువ |
| ఎన్‌ఎస్‌జీ | : | జాతీయ సారథ్య బృందం |
| ఎన్‌ఎస్‌ఎస్ | : | రక్షితనీటి ఆధారం లేని |
| ఓ&ఎమ్ | : | ఆపరేషన్, నిర్వహణ |
| ఓసీ | : | స్వాధీనత పత్రం |
| ఓహెచ్‌బీఆర్ | : | ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ |
| ఓహెచ్‌ఎస్‌ఆర్ | : | ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ |
| పీఏజీ | : | ప్రధాన మహా గణకులు |
| పీసీ | : | పాక్షికంగా ఉన్న |
| పీహెచ్ | : | ప్రజారోగ్యం |
| పీహెచ్‌ఈడీ | : | ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం |
| పీఐయూ | : | పథకం అమలు విభాగం |
| పీఎమ్ఈఎస్ | : | కార్యక్రమ పర్యవేక్షణ, మూల్యాంకన వ్యవస్థ |
| పీఎమ్‌యూ | : | కార్యక్రమ నిర్వహణ విభాగం |
| పీఓఎల్ | : | పెట్రోల్, ఆయిల్, లూబ్రికెంట్లు |
| పీఆర్‌ఐలు | : | పంచాయితీ రాజ్ సంస్థలు |
| పీటీసీ | : | పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ |
| పీడబ్ల్యూఎస్ | : | పైపుల ద్వారా నీటి సరఫరా |
| క్యూసీ | : | నాణ్యతా నియంత్రణ |
| ఆర్&బీ | : | రోడ్లు, భవనాలు |
| ఆర్ఎఫ్‌డీ | : | ఫలితాల నమూనా పత్రం |
| ఆర్ఎఫ్ఓ | : | ప్రాంతీయ అగ్నిమాపక అధికారి |
| ఆర్ఐడీఎఫ్ | : | గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి |
| ఆర్ఓఓ | : | రివర్స్ ఆక్స్‌మా ఆక్సిడేషన్ |
| ఆర్ఆర్ యాక్ట్ | : | రెవెన్యూ రికవరీ చట్టం |
| ఆర్ఎస్ఎఫ్ | : | ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ |
| ఆర్‌డబ్ల్యూఎస్ | : | గ్రామీణ నీటి సరఫరా |
| ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ | : | గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం |

| | | |
|---|---|---|
| ఎస్‌సీ | : | షెడ్యూల్డ్ కులం |
| ఎస్‌ఈ | : | సూపరింటెండింగ్ ఇంజనీర్ |
| ఎస్‌ఎఫ్ఏసీ | : | అగ్నిమాపక స్థాయీ సలహా సంఘం |
| ఎస్‌ఎఫ్ఓ | : | అగ్నిమాపక కేంద్రం అధికారి |
| ఎస్‌ఎల్ఏసీ | : | రాష్ట్రస్థాయి సలహా మండలి |
| ఎస్‌ఎల్ఎన్ఏ | : | రాష్ట్రస్థాయి నోడల్ ఏజన్సీ |
| ఎస్‌ఆర్ఎస్‌పీ | : | శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు |
| ఎస్‌ఎస్ | : | సమ్మర్ స్టోరేజి |
| ఎస్‌ఎస్ఆర్ | : | ప్రామాణిక ధరల పట్టిక |
| ఎస్‌టీ | : | షెడ్యూల్డ్ తెగ |
| ఎస్‌టీసీ | : | సింహాచలం రవాణా కారిడార్ |
| ఎస్‌టీపీ | : | మురుగునీటి శుద్ధి కేంద్రం |
| ఎస్‌టీఎస్ | : | రాష్ట్ర శిక్షణాలయం |
| ఎస్‌డబ్ల్యూడీ | : | వరద నీటి కాలువ |
| ఎస్‌డబ్ల్యూజీ పైపులు | : | స్టాండర్డ్ వైరు గేజ్ పైపులు |
| టీఏజీ | : | సాంకేతిక సలహా బృందం |
| టీడీఎస్ | : | నీటిలో పూర్తిగా కరిగి ఉన్న ఘనపదార్థాలు |
| టీఎమ్‌సీ | : | తిరుపతి నగరపాలక సంస్థ |
| టీఎమ్‌సీ | : | శతకోటి ఘనపుటడుగులు |
| టీపీఐఎమ్ఏ | : | మూడోపక్ష తనిఖీ, పర్యవేక్షణ సంస్థ |
| యూఏలు | : | నగర శివారు ప్రాంతాలు |
| యూఏఎస్‌బీ | : | అప్‌ఫ్లో అనెరోబిక్ స్లడ్జ్ బ్లాంకెట్ |
| యూడీఏలు | : | పట్టణాభివృద్ధి సంస్థలు |
| యూజీడీ | : | భూగర్భ మురుగునీటి కాలువ |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | : | చిన్నతరహా, మధ్యతరహా పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పథకం |
| యూఐజీ | : | పట్టణ మౌలిక వసతుల పాలన |
| యూఎల్‌బీలు | : | పట్టణ స్థానిక సంస్థలు |
| వీఏటీ (వ్యాట్) | : | విలువ ఆధారిత పన్ను |
| వీహెచ్ఎఫ్ | : | అత్యధిక పౌనఃపున్యము |
| వీఎమ్‌సీ | : | విజయవాడ నగరపాలక సంస్థ |
| వీపీటీ | : | విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ |
| వీక్యూసీ | : | నిఘా, నాణ్యతా నియంత్రణ |
| వీఎస్‌పీ | : | విశాఖపట్నం ఉక్కు కర్మాగారం |
| వీడబ్ల్యూఎస్‌సీ | : | గ్రామస్థాయి నీటి, పారిశుధ్య కమిటీ |
| డబ్ల్యూఎస్ఐఎస్ | : | నీటి సరఫరా అమలు పథకం |
| డబ్ల్యూటీపీ | : | నీటి శుద్ధి కేంద్రం |
| వైఎస్ఆర్ | : | యెడుగూరి సందింటి రాజశేఖర రెడ్డి |
| జెడ్‌పీ | : | జిల్లా పరిషత్ |

© భారత కంప్ట్రోలర్ మరియు
ఆడిటర్ జనరల్
www.cag.gov.in

©భారత కంప్ట్రోలర్ మరియు
ఆడిటర్ జనరల్
www.cag.gov.in